



# మార్క్స్ ఎంగెల్స్

## సంకలిత రచనలు

# మార్క్స
# ఎంగెల్స్
## సంకలిత రచనలు

# కార్ల్ మార్క్స
# ఫ్రెడరిక్ ఎంగెల్స్

## సంకలిత రచనలు

### భాగం 1

"ప్రగతి" ప్రచురణాలయం
మాస్కో 1980

అనువాదం: కొండేపూడి లక్ష్మీనారాయణ,

రాచమల్లు రామచంద్రారెడ్డి, నిడమర్తి ఉమారాజేశ్వరరావు

**К. Маркс и Ф. Энгельс**

ИЗБРАННЫЕ ПРОИЗВЕДЕНИЯ

Часть I

*На языке телугу*

© తెలుగు అనువాదం "ప్రగతి" ప్రచురణాలయం 1980

సోవియట్ యూనియన్‌లో ముద్రింపబడింది

МЭ $\frac{10101\text{-}097}{016(01)\text{-}80}$ 693-80 0101010000

ИБ № 8008

## విషయసూచిక

ప్రవేశిక . . . . . . . . . . . . . . . . . . . . . . . 7

వి. ఐ. లెనిన్

వి. ఐ. లెనిన్. కార్ల్ మార్క్స్ (కొంత భాగం) (అను: కొండేపూడి లక్ష్మీనారాయణ) 11

వి. ఐ. లెనిన్. ఫ్రెడరిక్ ఎంగెల్స్ (అను: కొండేపూడి లక్ష్మీనారాయణ) . . . . 16

వి. ఐ. లెనిన్. మార్క్సిజంయొక్క మూడు మూలాధారాలూ, మూడు భాగాలూ (అను: రాచమల్లు రామచంద్రారెడ్డి) . . . . . . . . . . . . 26

కార్ల్ మార్క్స్

ఫ్రెడరిక్ ఎంగెల్స్

కార్ల్ మార్క్స్. ఫొయెర్‌బాఖ్‌పై సూత్రీకరణలు (అను: నిడమర్తి ఉమా రాజేశ్వరరావు) . . . . . . . . . . . . . . . . . 35

కార్ల్ మార్క్స్, ఫ్రెడరిక్ ఎంగెల్స్. కమ్యూనిస్టు పార్టీ ప్రణాళిక (అను: రాచమల్లు రామచంద్రారెడ్డి) . . . . . . . . . . . . . . . 39

1872 నాటి జర్మన్ కూర్పుకు ముందుమాట . . . . . . . . 39

1890 నాటి జర్మన్ కూర్పుకు ముందుమాట (కొంత భాగం) . . . . 40

కమ్యూనిస్టు పార్టీ ప్రణాళిక . . . . . . . . . . . . . . 44

I. బూర్జువాలూ — కార్మికులూ . . . . . . . . . . . . 45

II. కార్మికులూ — కమ్యూనిస్టులూ . . . . . . . . . . . 59

III. సోషలిస్టు, కమ్యూనిస్టు సారస్వతం . . . . . . . . . . 68

1. ప్రగతి వ్యతిరేక సోషలిజం . . . . . . . . . . . . . 68
అ. ఫ్యూడల్ సోషలిజం . . . . . . . . . . . . . . . . . 68
ఆ. పెటీబూర్జువా సోషలిజం . . . . . . . . . . . . . . . 70
ఇ. జర్మన్ సోషలిజం, లేక "అసలు" సోషలిజం . . . . . . 72
2. యథాస్థితివాద సోషలిజం, లేక బూర్జువా సోషలిజం . . . . 75
3. విమర్శనాత్మక ఊహాస్వర్గ సోషలిజమూ, కమ్యూనిజమూ . . . . 76
IV. యీనాటి వివిధ ప్రతిపక్ష పార్టీలపట్ల కమ్యూనిస్టుల వైఖరి . . . . 80
కార్ల్ మార్క్స్. వేతన శ్రమా, పెట్టుబడీ (అను: రాచమల్లు రామచంద్రారెడ్డి) 82
1891 నాటి కూర్పుకు ఫ్రెడరిక్ ఎంగెల్స్ ప్రవేశిక . . . . . . . 82
వేతన శ్రమా, పెట్టుబడీ . . . . . . . . . . . . . . . . . . 92
కార్ల్ మార్క్స్. లూయీ బోనపార్ట్‌యొక్క బ్రూమేర్ పద్దెనిమిదవ తేదీ (అను: నిడమర్తి ఉమారాజేశ్వరరావు) . . . . . . . . . . . . . . . . . . 121
మూడవ జర్మన్ ముద్రణకు ఎఫ్. ఎంగెల్స్ ముందుమాట . . . . . . . 121
లూయీ బోనపార్ట్‌యొక్క బ్రూమేర్ పద్దెనిమిదవ తేదీ . . . . . . . 123
I. . . . . . . . . . . . . . . . . . . . 123
II. . . . . . . . . . . . . . . . . . . . 133
III. . . . . . . . . . . . . . . . . . . 147
IV. . . . . . . . . . . . . . . . . . . . 164
V. . . . . . . . . . . . . . . . . . . . 176
VI. . . . . . . . . . . . . . . . . . . . 197
VII . . . . . . . . . . . . . . . . . . . 219
వివరణలు . . . . . . . . . . . . . . . . . . . 237
పేర్ల సూచి . . . . . . . . . . . . . . . . . . 258

# ప్రవేశిక

కార్ల్ మార్క్స్ ఫ్రెడరిక్ ఎంగెల్సుల ఉపదేశం, మానవాళి ఆలోచన సాధించిన అత్యంత ఘన విజయం. మార్క్సిజం, శ్రామికవర్గ ప్రయోజనాలను వ్యక్తంచేసే శ్రామిక వర్గ సిద్ధాంతం, జాతీయ విమోచనకోసం, శాంతికోసం, సోషలిజంకోసం జరిగే పోరాటంలో కార్మిక జనసామాన్యమంతటియొక్క సైద్ధాంతిక ఆయుధం.

శాస్త్రీయ సోషలిజంయొక్క మహత్తర సంస్థాపకులు విజ్ఞానశాస్త్రంలో అసలైన విప్లవం తెచ్చారు. సామాజికాభివృద్ధికి సంబంధించిన వస్తుగత నియమాలను కనుగొనడం ద్వారా మార్క్స్ ఎంగెల్సులు పెట్టుబడిదారీ విధానపు పతనమూ, సోషలిజం విజయమూ అనివార్యమని శాస్త్రీయంగా రుజువుచేశారు. పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానపు రద్దు, యావత్తు సామాజిక వ్యవస్థయొక్క సమూల విప్లవ రూపాంతరీకరణ, స్వాతంత్ర్య, సమానత్వ, సౌభ్రాతృత్వ, శాంతి, శ్రమల సూత్రాలపై ఆధారపడిన నూతన సమాజ నిర్మాణం — ఇవి శ్రామికవర్గంయొక్క మహత్తర, మహోన్నత లక్ష్యాలు, దాని ప్రపంచ చారిత్రక కర్తవ్యం. సకల కష్టజీవి జనబాహుళ్యపు ప్రయోజనాలకోసం రైతాంగంయొక్క, సకల ప్రగతిశీల సామాజిక శక్తులయొక్క తోడ్పాటుతో శ్రామికవర్గం దానిని నెరవేర్చాల్సి వుంది.

సోషలిస్టు విప్లవం అన్ని రూపాల వలస, జాతి వివక్షాత్మక పీడననూ శాశ్వతంగా తుద ముట్టించాల్సి వుంది. మార్క్స్ ఎంగెల్సుల బోధన ప్రకారం, జాతీయ విమోచనోద్యమం కార్మికవర్గపు సహచరి, ప్రపంచ విప్లవక్రమంలో ఒక అంతర్భాగం.

మార్క్స్ ఎంగెల్సుల ఉపదేశం నూతన చారిత్రకానుభవపు సాధారణీకరణలద్వారా నిరంతరంగా సుసంపన్న మొనర్చబడుతోంది. మార్క్స్ ఎంగెల్సుల ఆశయానికి అనుచరుడూ, దాన్ని ముందుకు తీసుకెళ్లినవాడూ అయిన లెనిన్, మార్క్సిజం విజ్ఞాన భాండారాన్ని విశేషంగా సంపద్వంతం చేశాడు. మార్క్సిజం-లెనినిజం కోట్లాది ప్రజల మనసులనూ,

హృదయాలనూ అంతకంతకు అధికంగా ఆకర్షిస్తోంది. ప్రతి ఒక్క నూత్న చారిత్రక యుగమూ ఎల్లకాలమూ సజీవంగా వుండి, ఎప్పటికప్పుడు అభివృద్ధిచెందే మార్క్స్—ఎంగెల్స్—లెనిన్‌ల సిద్ధాంతపు నిర్దుష్టత్వానికి నూతన ధ్రువీకరణలను సమకూరుస్తోంది.

మార్క్స్, ఎంగెల్స్, లెనిన్‌ల ఉపదేశాలు సామాజిక ప్రగతికోసం, ప్రపంచాన్ని న్యాయ బద్ధమైన సూత్రాల ప్రకారం పునర్నిర్మించడంకోసం జరిగే కృషిలో మహా శక్తివంతమైన ఆయుధ మన్నదానికి సోవియట్ యూనియన్, తదితర సోషలిస్టు దేశాల విజయాలూ, ప్రపంచ మంతటా కార్మిక జనం జరిపే విముక్తి పోరాటంయొక్క, వలసవాద శృంఖలాలను తెంచుకున్న ప్రజలయొక్క విజయాలూ తిరుగులేని రుజువులు.

నాలుగు భాగాలలో వెలువరిస్తున్న కార్ల్ మార్క్స్ ఫ్రెడరిక్ ఎంగెల్స్‌ల యీ సంకలిత రచనలలో మార్క్స్ ఎంగెల్సుల మహత్తర విప్లవ ఉపదేశాన్ని—మార్క్సిస్టు తత్వశాస్త్రం, అర్థశాస్త్రం, శాస్త్రీయ కమ్యూనిజం సిద్ధాంతాలకు తోడు, శ్రామికవర్గ వర్గపోరాటపు వ్యూహానికీ, ఎత్తుగడలకూ సంబంధించిన మూలసూత్రాలను—అభివర్ణించే అత్యంత ముఖ్యమైన రచనలూ, లేఖలూ వున్నాయి.

"పెట్టుబడి," "ప్రకృతి గతితర్కం" మొదలైన మౌలిక రచనలలోని కొన్ని భాగాలు మాత్రమే యివ్వబడ్డాయి.

ఈ ముద్రణలో కార్ల్ మార్క్స్, ఫ్రెడరిక్ ఎంగెల్సుల రచనలకు ముందు వి. ఐ. లెనిన్ రాసిన వ్యాసం "కార్ల్ మార్క్స్" (సంగ్రహ పాఠం), "ఫ్రెడరిక్ ఎంగెల్స్," "మార్క్సిజంయొక్క మూడు మూలాధారాలూ, మూడు భాగాలూ" అనే రచనలూ యివ్వబడ్డాయి.

తన యీ రచనల్లో వి. ఐ. లెనిన్ మొత్తంగా మార్క్సిజంయొక్క, దాని భాగాల యొక్క ప్రామాణిక విశిష్ట లక్షణాన్ని పేర్కొనడంతోబాటు, మార్క్స్, ఎంగెల్స్‌ల అభిప్రాయాలు, రూపుదాల్చిన చారిత్రక క్రమాన్ని చూపించాడు. కార్మికవర్గ మహోపాధ్యాయుల సంగ్రహ జీవితచరిత్రలను ఉల్లేఖించి, మార్క్సిజాన్ని సృష్టించడంలోనూ, అభివృద్ధిచెయ్యడంలోనూ, ప్రపంచ శ్రామికవర్గపు విముక్తి పోరాటానికి నాయకత్వం వహించడంలోనూ వారిద్దరిలో ఒక్కొక్కరి మహత్తర పాత్రను ఆయన అభివర్ణించాడు.

ఈ "సంకలిత రచనల"లో సమాచారం ప్రధానంగా, కాలానుక్రమంగా పొందుపరచబడింది. కాని రచయితల "ముందుమాటలు" మాత్రం, అవి రచించబడిన తేదీలతో ప్రమేయం లేకుండా, ఆయా రచనలతోబాటు ప్రచురించబడ్డాయి. మార్క్స్ ఎంగెల్సుల లేఖలకు ప్రత్యేకించి ఈ సంకలనంలోని నాలుగవ భాగంలో ఇవ్వబడ్డాయి.

ఈ "సంకలిత రచనలు"లోని ప్రతి ఒక భాగానికీ చివర సంపాదక వివరణలూ, పేర్ల సూచికలూ చేర్చబడ్డాయి.

# వి.ఐ. లెనిన్

## వి. ఐ. లెనిన్

# కార్ల్ మార్క్స్

## (మార్క్సిజం వివరణతో కూడిన సంక్షిప్త జీవిత చరిత్ర)

(కొంత భాగం)

కార్ల్ మార్క్స్, 1818 మే 5వ తేదీన (కొత్త కాలెండరు ప్రకారం) ట్రీర్ నగరంలో (రైనిష్ ప్రష్యా) జన్మించాడు. ఆయన తండ్రి న్యాయవాది, యూదు జాతివాడైనా, 1824లో ప్రొటెస్టంట్ మతం స్వీకరించాడు. వాళ్లది సంస్కారంగల సంపన్న కుటుంబం, కాని విప్లవ భావాలుగల కుటుంబం మాత్రం కాదు. ట్రీర్ నగరంలో ఉన్నత పాఠశాల విద్య పూర్తిచేసిన తరువాత, మార్క్స్ మొదట బోన్ విశ్వవిద్యాలయంలోనూ, ఆతరువాత బెర్లిన్ విశ్వవిద్యాలయంలోనూ చేరి న్యాయశాస్త్రం, అంతకంటే ప్రధానంగా చరిత్ర, తత్వశాస్త్రం అధ్యయనం చేశాడు. 1841లో ఎపిక్యూరస్ తత్వశాస్త్రంపై థీసిస్ రాసి విశ్వవిద్యాలయానికి సమర్పించి తత్వశాస్త్రంలో డాక్టరేటు డిగ్రీ సంపాదించాడు. అప్పటికి మార్క్స్ తన అభిప్రాయాలలో హేగెలియన్ భావవాది. బెర్లిన్‌లో ఆయన "వామపక్ష హేగెలియన్‌ల" బృందంలో (బ్రూనో బౌవర్, మొదలైనవారు) చేరాడు. ఆ బృందంవారు హేగెల్ తత్వశాస్త్రంనుంచి నాస్తిక, విప్లవ భావ నిర్ధారణలు చేయడానికి ప్రయత్నించారు.

విశ్వవిద్యాలయ అధ్యయనం పూర్తిచేసిన తరువాత ఆచార్యుడు కావాలనే ఆశతో మార్క్స్ బోన్ నగరానికి మారాడు. కాని 1832లో లుడ్విగ్ ఫొయెర్‌బాఖ్‌ను ప్రధానాచార్య స్థానం నుంచి తొలగించి, 1836లో ఆయన్ను తిరిగి విశ్వవిద్యాలయానికి రానివ్వకుండా చేసి, 1841లో యువ ఆచార్యుడైన బ్రూనో బౌవర్‌ను బోన్ విశ్వవిద్యాలయంలో లెక్చర్లు ఇవ్వకుండా నిషేధించిన ప్రభుత్వ అభివృద్ధినిరోధక విధానం మూలంగా మార్క్స్ ఆచార్య వృత్తిని చేపట్టాలనే తన ఉద్దేశాన్ని మానేశాడు. ఆ రోజుల్లో జర్మనీలో వామపక్ష హేగెలియన్ల భావాలు త్వరితగతిని వ్యాపించ సాగాయి. లుడ్విగ్ ఫొయెర్‌బాఖ్, ముఖ్యంగా 1836 తరువాత, మత సిద్ధాంతాన్ని విమర్శించడం ప్రారంభించి భౌతికవాదాన్ని సమర్థించడం మొదలుపెట్టాడు,

1841 కల్లా ఆయన తత్వశాస్త్రంలో భౌతికవాదానిది పైచెయ్యి అయింది ("క్రైస్తవ మత సారం" అనే ఆయన గ్రంథం). 1843లో "భవిష్యత్ తత్వశాస్త్ర మూలసూత్రాలు" అనే ఆయన గ్రంథం వెలువడింది. ఈ గ్రంథాలు "మనస్సుపై కలిగించే విమోచన ప్రభావాన్ని ఎవరంతటవారు స్వయంగా అనుభవించ వలసిందే" అని ఫాయెర్‌బాఖ్ గ్రంథాలను గురించి ఎంగెల్స్ తరువాత రాశాడు. "మేము" (అంటే మార్క్సుతో సహా వామపక్ష హెగెలియన్లు) "అందరం వెంటనే ఫాయెర్‌బాఖ్ అనుయాయులమైపోయాం" అని కూడా ఎంగెల్స్ రాశాడు. ఆ రోజులలో వామపక్ష హెగెలియనులతో పరిచయం వున్న రైన్‌లాండ్ లోని కొందరు తీవ్రవాద బూర్జువాలు కొలోన్ నగరంలో "రైనిషె సైటుంగ్" అనే ప్రతిపక్ష పత్రికను స్థాపించారు (దీని మొదటి సంచిక 1842 జనవరి 1న వెలువడింది). ప్రధాన వ్యాసకర్తలుగా వుండవలసిందిగా మార్క్స్, బ్రూనో బౌవర్ ఆహ్వానింపబడ్డారు, 1842 అక్టోబరులో మార్క్స్ ఆ పత్రికకు ప్రధాన సంపాదకుడు అయి బోన్‌నుంచి కొలోన్‌కు మారాడు. మార్క్స్ సంపాదకత్వం క్రింద ఆ పత్రిక విప్లవకర ప్రజాస్వామిక ధోరణి మరింత ప్రస్ఫుటం అయింది, ప్రభుత్వం ఆ పత్రికమీద మొదట్లో రెండు స్థాయిల లోనూ, ఆ తరువాత మూడు స్థాయిలలోనూ సెన్సార్‌షిప్‌ను విధించి, చివరకు 1843 జనవరి 1న పత్రికను నిషేధించడానికి నిర్ణయించింది. ఆ తేదీకి ముందే మార్క్స్ తన సంపాదకత్వానికి రాజీనామా ఇవ్వవలసి వచ్చింది, కాని ఆ రాజీనామా పత్రికను రక్షించ లేకపోయింది. 1843 మార్చిలో పత్రిక మూసివేయబడింది. "రైనిషె సైటుంగ్" పత్రికకు మార్క్స్ రాసిన ప్రధాన వ్యాసాలలో యీ క్రింద పేర్కొన్న వాటికి తోడు ("గ్రంథ వివరణ పట్టిక" చూడండి[1]) మోసెల్ లోయలో ద్రాక్ష పండించే రైతుల స్థితిని గురించి ఒక వ్యాసం కూడా వుందని ఎంగెల్స్ పేర్కొన్నాడు. అర్థశాస్త్రంలో తనకున్న జ్ఞానం చాలదని మార్క్స్ తన పాత్రికేయ ఉద్యోగాన్ని బట్టి తెలుసుకుని పట్టుదలతో అర్థశాస్త్ర అధ్యయనం ప్రారంభించాడు.

తన బాల్య స్నేహితురాలూ విద్యార్థిగా వున్నప్పుడే ప్రదానం చేసుకున్న జెన్నీ ఫన్ వెస్ట్‌ఫాలెన్‌ను 1843లో క్రాయిజ్‌నాఖ్ నగరంలో మార్క్స్ వివాహం చేసుకున్నాడు. ఆయన భార్య అభివృద్ధినిరోధక భావాలుగల కులీన ప్రష్యన్ కుటుంబానికి చెందింది. ఆమె అన్న అత్యంత అభివృద్ధినిరోధక కాలమైన 1850–58లలో ప్రష్యాలో ఆంతరంగిక వ్యవహారాల మంత్రిగా వుండేవాడు. 1843 ఆకురాలు కాలంలో ఆర్నాల్డ్ రూగెతో కలిసి (రూగె జననం 1802, మరణం 1880; అతడు వామపక్ష హెగెలియన్; 1825నుండి 1830 వరకూ జైలులో వున్నాడు; 1848 తరువాత రాజకీయ ప్రవాసి, 1866–70 మధ్య కాలంలో బిస్మార్క్ అనుచరుడుగా వున్నాడు) విదేశాలనుంచి ఒక అతివాద పత్రికను ప్రచురించడంకోసం మార్క్స్ పారిస్ నగరానికి వెళ్లాడు. "దోయిచ్-ఫ్రాన్‌జోజిషె యార్‌బ్యూఖర్"

[“జర్మన్ ఫ్రెంచి ఐతిహాసిక వార్షిక సంచికలు”] అనే ఆ పత్రిక ఒక సంచిక మాత్రమే వెలువడింది. జర్మనీలో దానిని రహస్యంగా పంచిపెట్టడంలో కలిగిన చిక్కుల మూలంగానూ, రూగెతో వచ్చిన అభిప్రాయభేదాల మూలంగానూ ఆ పత్రిక ప్రచురణ ఆపివేయవలసి వచ్చింది. ఈ పత్రికలో మార్క్స్ వ్రాసిన వ్యాసాలలో, ఆయన అప్పటికే విప్లవకారుడుగా ముందుకొచ్చాడు, “ఉనికిలో వున్న ప్రతిదానినీ నిర్దాక్షిణ్యంగా విమర్శించాలి” అని ఆయన వాదించాడు, అందులోనూ ప్రత్యేకించి “ఆయుధంతో విమర్శ”[2] అని జనబాహుళ్యానికీ, శ్రామికవర్గానికీ ఆయన ప్రబోధించాడు.

1844 సెప్టెంబరులో పారిస్‌లో కొన్ని రోజులు గడిపేటందుకు ఫ్రెడెరిక్ ఎంగెల్స్ పారిస్‌కు వచ్చాడు, అప్పటినుంచీ ఆయన మార్క్స్‌కి అత్యంత సన్నిహిత మిత్రుడయాడు. వారిద్దరూ అప్పుడు పారిస్‌లో వున్న విప్లవ గ్రూపుల పొంగులువారే జీవితంలో అత్యంత ఉత్సాహంతో పాల్గొన్నారు (ఆ రోజులలో ప్రూడన్ సిద్ధాంతం ప్రత్యేకించి ప్రాధాన్యం వహించింది, మార్క్స్ “తత్వశాస్త్ర దారిద్ర్యం” అనే తన గ్రంథం (1847)లో, దానిని తుత్తునియలుగా ఖండించాడు); వివిధ రకాల పెటీబూర్జువా సోషలిస్టు సిద్ధాంతాలను తీవ్రంగా ఎదిరించి పోరాడుతూ వారు విప్లవాత్మక శ్రామికవర్గ సోషలిజం లేక కమ్యూనిజం (మార్క్సిజం)యొక్క సిద్ధాంతాన్నీ, ఎత్తుగడలనూ రూపొందించారు. 1844–48 మధ్యకాలంలో మార్క్స్ రచనల వివరాన్ని “గ్రంథ వివరణ పట్టిక”లో చూడండి. ప్రష్యన్ ప్రభుత్వం ఒత్తిడివల్ల ప్రమాదకరమైన విప్లవకారుడని మార్క్స్‌ని 1845లో పారిస్ నుంచి వెళ్లగొట్టారు. ఆయన బ్రసెల్స్‌కు వెళ్లాడు. 1847 వసంతంలో మార్క్సు ఎంగెల్సులు కమ్యూనిస్ట్ లీగ్ అనే ఒక రహస్య ప్రచార సంఘంలో చేరారు; ఆ లీగ్ ద్వితీయ మహాసభలో (లండన్, నవంబరు 1847) వారు ప్రముఖ పాత్రను నిర్వహించారు, ఆ మహాసభ కోరికమీదనే ప్రఖ్యాత “కమ్యూనిస్టు ప్రణాళిక”ను వారు రచించారు. అది 1848 ఫిబ్రవరిలో వెలువడింది. ఈ గ్రంథం, ఒక నూతన ప్రపంచ దృక్పథాన్ని, సామాజిక జీవితాన్ని సహితం పరివేష్టించే సుసంగతమైన భౌతికవాదాన్ని; అభివృద్ధిని గురించిన అత్యంత సమగ్రమైన ప్రగాఢమైన సిద్ధాంతం అయిన గతితర్కాన్ని; వర్గపోరాటంయొక్క నూతన, కమ్యూనిస్టు సమాజ నిర్మాత అయిన శ్రామికవర్గపు ప్రపంచ చారిత్రక విప్లవకర పాత్రయొక్క సిద్ధాంతాన్ని స్పష్టంగానూ ప్రతిభావంతంగానూ వివరిస్తుంది.

1848 ఫిబ్రవరి విప్లవం[3] ప్రజ్వరిల్లినప్పుడు, మార్క్స్ బెల్జియంనుంచి వెళ్లగొట్టబడ్డాడు. ఆయన పారిస్‌కు తిరిగి వెళ్లాడు, అక్కడినుంచి మార్చి విప్లవానంతరం[4] జర్మనీలో కొలోన్ నగరానికి వెళ్లాడు. కొలోన్‌లో మార్క్స్ ప్రధాన సంపాదకత్వం క్రింద “నోయె రైనిషె సైటుంగ్” అనే పత్రిక 1848 జూన్ 1నుంచి 1849 మే 19 వరకూ వెలువడింది. ప్రపంచంలోని అన్ని దేశాలలో శ్రామికవర్గ, ప్రజాస్వామిక ఉద్యమాలు

తరువాత ధ్రువపర్చినట్టే 1848–49లలో జరిగిన విప్లవకర ఘటనల తీరు నూతన సిద్ధాంతాన్ని ఘనంగా ధ్రువపర్చింది. విజయం సాధించిన విప్లవ ప్రతీఘాతకులు మార్క్స్‌పై మొదట కోర్టులో కేసు పెట్టాలని ప్రేరేపించారు (1849 ఫిబ్రవరి 9న మార్క్స్ నిర్దోషి అని కోర్టు తీర్పు చెప్పింది), ఆ తరువాత ఆయన జర్మనీనుంచి వెళ్లగొట్టబడ్డాడు (1849 మే 16). మార్క్స్ మొదట పారిస్‌కు వెళ్లాడు, కాని 1849 జూన్ 13 ప్రదర్శన[5] తరువాత ఆయనను మళ్లీ అక్కడినుంచి వెళ్లగొట్టారు, తదుపరి ఆయన లండన్ చేరి జీవితాంతంవరకూ అక్కడే గడిపాడు.

రాజకీయ ప్రవాసిగా ఆయన ఎంతో కష్టభరితమైన జీవితాన్ని గడపవలసి వచ్చింది. ఈ విషయం మార్క్స్ ఎంగెల్స్‌ల మధ్య జరిగిన ఉత్తర ప్రత్యుత్తరాలలో స్పష్టంగా తెలుస్తుంది (1913లో ప్రచురింపబడ్డాయి). మార్క్స్, ఆయన కుటుంబమూ దుర్భర దారిద్ర్యాన్ని అనుభవించారు. ఎంగెల్సే కనక నిరంతరమూ నిస్వార్థంగా ఆర్థిక సహాయం చేసివుండకపోతే మార్క్స్ "పెట్టుబడి" అనే గ్రంథాన్ని పూర్తిచేయలేక పోవడమే గాక, లేమితో కృంగిపోయి వుండేవాడు. అంతేకాకుండా, అప్పుడు ప్రబలమైవున్న పెటీబూర్జువా సోషలిజంయొక్క, మొత్తంమీద శ్రామికవర్గేతర సోషలిజంయొక్క సిద్ధాంతాలకూ ధోరణులకూ వ్యతిరేకంగా మార్క్స్ నిరంతరమైన నిర్దాక్షిణ్యమైన పోరాటాన్ని సాగించవలసి వచ్చింది, ఒక్కొక్కప్పుడు అత్యంత ఉన్మత్తమైన అమానుషమైన వ్యక్తిగత దూషణలను సహితం ("Herr Vogt") ఎదుర్కొని తిప్పికొట్టవలసి వచ్చింది. రాజకీయ ప్రవాసుల బృందాలకు దూరంగా వుంటూ, మార్క్స్ ప్రధానంగా అర్థశాస్త్ర అధ్యయనానికి తన శక్తిసామర్థ్యాలను వినియోగించుతూ అనేక చారిత్రక గ్రంథాలలో[6] తన భౌతికవాద సిద్ధాంతాన్ని విపులీకరించాడు. మార్క్స్ తాను రచించిన "అర్థశాస్త్ర విమర్శకు చేర్పు" (1859), "పెట్టుబడి" (మొదటి సంపుటి, 1867) అనే గ్రంథాలలో యీ శాస్త్రాన్ని (ఈ దిగువ ఇవ్వబడిన "మార్క్సిస్టు సిద్ధాంతం" అనే ప్రకరణం చూడండి) విప్లవాత్మకంగా మార్చి వేశాడు.

పందొమ్మిదవ శతాబ్దం అయిదవ దశకం చివరి సంవత్సరాలలోను, ఆరవ దశకంలోను ప్రజాస్వామిక ఉద్యమాల పునరుద్ధరణ మార్క్స్‌ను ప్రత్యక్ష కార్యాచరణ రంగంలోకి దింపింది. 1864 (సెప్టెంబరు 28న) అంతర్జాతీయ కార్మికుల సంఘం — ప్రఖ్యాత ప్రథమ ఇంటర్నేషనల్ — లండన్‌లో స్థాపించబడింది. ఈ సంఘానికి ప్రాణమూ అంతఃకరణమూ మార్క్సే, ఆ సంస్థ ప్రకటించిన మొదటి విజ్ఞప్తినీ, అనేక తీర్మానాలనూ, ప్రకటనలనూ, ప్రణాళికలనూ రచించింది మార్క్సే. వివిధ దేశాలలోని కార్మికోద్యమాలను ఐక్య పరుస్తూ వివిధ రూపాలలో వున్న శ్రామికవర్గేతర, మార్క్సిస్టు పూర్వపు సోషలిజాన్ని (మజ్జీనీ, ప్రూడన్, బకూనిన్, బ్రిటన్‌లోని లిబరల్ ట్రేడ్‌యూనియనిజం, జర్మనీలో

మితవాదంవైపు లసాలియన్ వూగిసలాటలు వగైరాలను) సంయుక్త కార్యాచరణ మార్గంలోకి మళ్లించడానికి ప్రయత్నిస్తూ, యీ మతాల, పంథాల సిద్ధాంతాలను అన్నిటినీ ప్రతిఘటించుతూ వివిధ దేశాలలోని కార్మికవర్గపు శ్రామిక పోరాటం అవలంబించవలసిన ఏకైక ఎత్తుగడలను మార్క్స్ రూపొందించాడు. పారిస్ కమ్యూన్ పతనం (1871) తరువాత — దీనిని గురించి మార్క్స్ ఎంతో ప్రగాఢమైన, స్పష్టమైన, ప్రతిభావంతమైన, సార్థకమైన, విప్లవాత్మకమైన పరిశీలన జరిపాడు ("ఫ్రాన్సులో అంతర్యుద్ధం," 1871 అనే గ్రంథం) — ఇంటర్నేషనల్‌లో బకూనిన్ అనుయాయులు తెచ్చిన చీలిక మూలంగానూ ఆ సంస్థ యూరప్‌లో ఇంకెంత మాత్రమూ మనలేక పోయింది. హేగ్ ఇంటర్నేషనల్ కాంగ్రెస్ (1872) తరువాత మార్క్స్ ఇంటర్నేషనల్‌యొక్క జనరల్ కౌన్సిలును న్యూయార్క్ నగరానికి మార్పించాడు. ప్రథమ ఇంటర్నేషనల్ తన చారిత్రక పాత్రను నిర్వహించింది, ఇప్పుడది ప్రపంచంలోని అన్ని దేశాలలోని కార్మికోద్యమం మరింత ఎక్కువగా అభివృద్ధి చెందే దశకు అంటే, విస్తృతిలో పెరిగి విడివిడిగా దేశాలలో సామూహిక సోషలిస్టు కార్మికవర్గ పార్టీలు ఏర్పడిన దశకు తావిచ్చింది.

ఇంటర్నేషనల్‌లో అమిత ప్రయాసతో కూడిన పని మూలంగానూ, అంతకంటె ఇంకా ఎక్కువ శ్రమతో కూడిన సైద్ధాంతిక వ్యాసంగం మూలంగానూ మార్క్స్ ఆరోగ్యం క్షీణించింది. అయినప్పటికీ అర్థశాస్త్రాన్ని సరిదిద్దే పనినీ, "పెట్టుబడి"ని పూర్తిచేసే పనినీ ఆయన కొనసాగించాడు. అందుకోసం ఆయన బోలెడంత కొత్త సమాచారాన్ని సేకరించాడు. అనేక భాషలు (ఉదాహరణకు రష్యన్ భాష) నేర్చుకున్నాడు. కాని అనారోగ్యం కారణంగా ఆయన "పెట్టుబడి"ని పూర్తి చేయలేకపోయాడు.

1881 డిసెంబరు 2న ఆయన భార్య మరణించింది. 1883 మార్చి 14న ఆయన తన పడకకుర్చీలో ప్రశాంతంగా కన్నుమూశాడు. లండన్‌లోని హైగేట్ శ్మశాన వాటికలో ఆయన భార్య సమాధి పక్కనే ఆయన కూడ సమాధి చేయబడ్డాడు. మార్క్స్ కుటుంబం నికృష్ట దారిద్ర్యం అనుభవించుతున్న రోజులలో ఆయన పిల్లలలో కొందరు శైశవదశలోనే లండన్‌లో చనిపోయారు. ముగ్గురు కూతుళ్లు: ఎలియనోర్ ఎవెలింగ్, లౌరా లాఫార్గ్, జెన్నీ లోంగెలు, ఇంగ్లీషు, ఫ్రెంచి సోషలిస్టులను వివాహాలు చేసుకున్నారు. జెన్నీ లోంగె కొడుకు ఫ్రెంచి సోషలిస్టు పార్టీ సభ్యుడు.

రచన: 1914 జూలై—నవంబరు

# వి. ఐ. లెనిన్

## ఫ్రెడరిక్ ఎంగెల్స్

ఎంతటి వివేచనా జ్యోతి అస్తమించె!
ఎంతటి హృదయము పరిస్పందన విరమించెనహో[7]!

1895 ఆగస్టు 5న (కొత్త కాలెండర్ ప్రకారం) ఫ్రెడరిక్ ఎంగెల్స్ లండన్‌లో మరణించాడు. తన మిత్రుడైన కార్ల్ మార్క్స్ (మరణం 1883) తరువాత ఎంగెల్సే అత్యుత్తమ పండితుడూ, నాగరిక ప్రపంచమంతటిలోని ఆధునిక శ్రామికవర్గ గురువర్యుడూ అయివున్నాడు. విధికృతంగా కార్ల్ మార్క్సూ, ఫ్రెడరిక్ ఎంగెల్సూ పరిచయస్తులైన తరువాత యీ మిత్రులిద్దరూ తమ జీవితకాల కృషినంతనూ ఒక ఉమ్మడి ఆశయం కోసం అర్పించారు. అందుచేత శ్రామికవర్గానికి ఫ్రెడరిక్ ఎంగెల్స్ చేసిన సేవను అర్థం చేసుకోవాలంటే వర్తమాన కార్మికవర్గ ఉద్యమాభివృద్ధికి మార్క్స్ చేసిన కృషిని, ఆయన ఉపదేశాల ప్రాముఖ్యతను స్పష్టంగా తెలుసుకోవలసి వుంటుంది. బూర్జువావర్గంతోపాటు అనివార్యంగా శ్రామికవర్గాన్ని కూడా సృష్టించి నిర్మాణయుతం గావించే ప్రస్తుతపు ఆర్థిక వ్యవస్థయొక్క తప్పనిసరి ఫలితమే కార్మికవర్గమూ, దాని డిమాండులూ అని నిరూపించిన ప్రప్రథములు మార్క్స్, ఎంగెల్సులే. మానవజాతిని ఇప్పుడు పీడించుతున్న చెడుగులనుండి దానిని విముక్తి చేసేది ఎవరో కొందరు ఉదాత్త మనస్కులైన వారు సదుద్దేశంతో చేసే ప్రయత్నాలు కావనీ, సంఘటితమైన శ్రామికవర్గపు వర్గపోరాటమేననీ వారు నిరూపించారు. సోషలిజం స్వాప్నికుల వూహాకల్పన కాదనీ ఆధునిక సమాజంలోని ఉత్పాదక శక్తుల అభివృద్ధి యొక్క అంతిమ లక్ష్యమూ, తప్పనిసరి అయిన ఫలితమూ మాత్రమేననీ తమ శాస్త్రీయ గ్రంథాలలో ప్రప్రథమంగా వివరించి చెప్పినది మార్క్స్, ఎంగెల్సులే. ఇంతవరకు లిఖిత పూర్వకంగా నమోదుచేయబడివున్న చరిత్ర అంతా వర్గపోరాటంయొక్క, కొన్ని సామాజిక వర్గాలు ఇతర వర్గాలపై విజయం సాధించి వారిపై సాగించిన పరిపాలనా పరంపరయొక్క చరిత్రే అయివుంది. వర్గపోరాటానికీ, వర్గ పరిపాలనకీ పునాదులైన సొంత ఆస్తీ, అరాజక సామాజిక ఉత్పత్తీ అదృశ్యం అయేటంతవరకూ ఇది ఇలా సాగుతూనే వుంటుంది.

శ్రామికవర్గ ప్రయోజనాలకోసం యీ పునాదులు నిర్మూలం అయితీరాలి, అందుచేత సంఘటితులైన కార్మికుల చైతన్యవంతమైన వర్గపోరాటం యీ పునాదుల నిర్మూలన కోసమే సాగాలి. అంతేగాక, ప్రతి వర్గపోరాటమూ రాజకీయ పోరాటమే.

తమ విముక్తికోసం పోరాడుతున్న శ్రామికులందరూ మార్క్స్ ఎంగెల్స్‌ల యీ అభిప్రాయాలను నేడు అనుసరించుతున్నారు. కాని 1840 దశకంలో యీ ఇద్దరు మిత్రులూ తమ కాలపు సోషలిస్టు సాహిత్యంలోనూ, సామాజిక ఉద్యమాలలోనూ పాల్గొన్నప్పుడు వారి అభిప్రాయాలు పూర్తిగా నూతనములే. ఆ కాలంలో రాజకీయ స్వాతంత్ర్యం కోసం సాగిన పోరాటంలోనూ రాజుల, పోలీసుల, మతగురువుల నిరంకుశత్వానికి వ్యతిరేకంగా సాగిన పోరాటంలోనూ తెలివైనవారూ తెలివితక్కువవారూ, నిజాయితీపరులూ దగాకోరులూ చాలామంది నిమగ్నులై వున్నప్పటికీ వారెవరూ కూడ బూర్జువావర్గ ప్రయోజనాలకూ శ్రామికవర్గ ప్రయోజనాలకూ మధ్యనున్న విరోధాన్ని తెలుసుకోలేకపోయారు. కార్మికులు ఒక స్వతంత్రమైన సామాజిక శక్తిగా ముందుకు వస్తారనే భావాన్నే వారు సహించలేక పోయేవారు. మరోవైపున, ఆ కాలపు సామాజిక వ్యవస్థయొక్క అధర్మాన్ని గురించి రాజులకీ, పాలకవర్గాలకూ నచ్చ చెప్పి ఒప్పించితే చాలుననీ, ఆపైన యీ భూగోళంమీద శాంతినీ, సర్వమానవ శ్రేయస్సునూ నెలకొల్పడం తేలిక అవుతుందనీ కలలుగన్న స్వాప్నికులు అనేకులు, వారిలో కొందరు ప్రతిభావంతులు కూడా వుండేవారు. పోరాటం లేకుండానే సోషలిజాన్ని సాధించవచ్చునని వారు కలలుగన్నారు. కడపటిగా, ఆకాలపు సోషలిస్టులూ, కార్మికవర్గ మిత్రులూ దాదాపు అందరూ కూడ మొత్తంమీద శ్రామికవర్గాన్ని కేవలం ఒక వ్రణంలాగ భావిస్తూ, పరిశ్రమతోపాటు అది ఎలా పెరిగిందా అని భయంతో చూసేవారు. అందుకని వారంతా పరిశ్రమాభివృద్ధినీ శ్రామికవర్గాభివృద్ధినీ నిలిపివేయడం, "చరిత్ర చక్రాన్ని" ఆపివేయడం ఎలాగా అని ప్రయత్నాలు చేశారు. శ్రామికవర్గ అభివృద్ధిని చూసి అందరిలాగ మార్క్స్, ఎంగెల్స్‌లు భయపడలేదు: తద్భిన్నంగా వారు తమ ఆశలన్నిటినీ శ్రామికవర్గ నిరంతరాభివృద్ధిమీద పెట్టుకున్నారు. శ్రామికుల సంఖ్య ఎంత ఎక్కువగా పెరిగితే విప్లవకర వర్గంగా వారి శక్తి అంత ఎక్కువ అవుతుందనీ, సోషలిజం అంత దగ్గర పడుతుందనీ, అందుకు అంత ఎక్కువ సదవకాశం ఏర్పడుతుందనీ వారు విశ్వసించారు. కార్మికవర్గానికి మార్క్స్ ఎంగెల్స్‌లు చేసిన సేవలను కొద్ది మాటలలో చెప్పాలంటే ఇలా అనవచ్చు: కార్మికవర్గం తన్ను తాను తెలుసుకుని చైతన్యవంతం కావడం ఎలాగో వారు బోధించారు, స్వప్నాల స్థానంలో విజ్ఞానశాస్త్రాన్ని నెలకొల్పారు.

అందుకనే ప్రతి కార్మికునికీ ఎంగెల్స్ పేరూ, ఆయన జీవిత చరిత్రా తెలియాలి. అందుకనే యీ వ్యాసావళిలో, మన అన్ని యితర ప్రచురణలలాగనే రష్యన్ కార్మికులలో వర్గ చైతన్యాన్ని మేల్కొల్పడమే లక్ష్యం గనుక, ఆధునిక శ్రామికవర్గంయొక్క ఇద్దరు మహో

పాధ్యాయులలోనూ ఒకడైన ఫ్రెడరిక్ ఎంగెల్స్ జీవిత చరిత్రమూ, ఆయన చేసిన కృషినీ తెలియజేయడం మన విధాయకం.

ఎంగెల్స్ 1820లో ప్రష్యా రాజ్యంలోని రైన్ రాష్ట్రంలో బార్మెన్ నగరంలో జన్మించాడు. ఆయన తండ్రి ఒక కార్ఖానా యజమాని. కుటుంబ పరిస్థితుల మూలంగా ఎంగెల్స్ 1838లో తన హైస్కూలు విద్యను పూర్తిచేయకుండానే బ్రేమెన్‌లో ఒక వాణిజ్య సంస్థలో గుమాస్తాగా చేరవలసి వచ్చింది. ఎంగెల్స్ విజ్ఞానశాస్త్ర, రాజకీయ అధ్యయనం కొనసాగించడానికి ఆయన వ్యాపార కార్యకలాపాలు అడ్డురాలేదు. ఆయన హైస్కూలు విద్యనభ్యసించే రోజులలోనే నిరంకుశ పరిపాలననూ, అధికారుల ప్రజా పీడననూ ద్వేషించేవాడు. తత్వశాస్త్రాధ్యయనం ఆయనను మరింత ముందుకు తీసుకుపోయింది. ఆ రోజులలో హేగెల్ ఉపదేశాలకు జర్మన్ తత్వశాస్త్రంలో ఎక్కువ ప్రాబల్యం వుండేది. ఎంగెల్స్ ఆయనకు అనుచరుడయ్యాడు. హేగెల్ బెర్లిన్ విశ్వవిద్యాలయంలో ఆచార్యుడుగా ప్రష్యన్ కొలువులో పనిచేస్తూ ప్రష్యన్ నిరంకుశ రాజ్యాన్ని మెచ్చుకుంటున్నప్పటికీ ఆయన ఉపదేశాలు విప్లవాత్మకమైనవిగానే వుండేవి. మానవ హేతువాద సామర్థ్యంమీదా, దాని హక్కులమీదా హేగెల్‌కున్న విశ్వాసమూ, జగత్తు నిరంతర మార్పు క్రమానికీ, అభివృద్ధికీ గురి అవుతోందనే హేగెలియన్ తత్వశాస్త్రపు మౌలిక సూత్రమూ యీ బెర్లిన్ ఆచార్యుని శిష్యులలో కొంత మందిలో — ఆనాటి పరిస్థితికి తలఒగ్గ నిరాకరించేవారిలో — ఆ పరిస్థితికి వ్యతిరేకంగా పోరాడడం, ఆనాడు ప్రబలివున్న అన్యాయానికీ, దుర్మార్గానికీ వ్యతిరేకంగా పోరాడడం అనేది కూడా నిరంతరాభివృద్ధి అనే విశ్వవ్యాప్త నియమంలోనే వేరూని వుందనే భావం కలిగించాయి. జగత్తులో అన్నీ క్రమాభివృద్ధినే పొందవలసి వున్నప్పుడు, పాత సంస్థలు పోయి కొత్తవాటికి చోటిచ్చి తీరవలసినప్పుడు ప్రష్యన్ రాజుయొక్క లేదా రష్యన్ జార్‌యొక్క నిరంకుశ పరిపాలనా, అత్యధిక సంఖ్యాకుల పొట్టలు కొట్టి అత్యల్ప సంఖ్యాకులు ధనవంతులు కావడం, లేదా ప్రజలపై బూర్జువావర్గపు ఆధిపత్యమూ శాశ్వతంగా ఎందుకు కొనసాగాలి? హేగెల్ తత్వశాస్త్రం మనస్సుయొక్క, భావాలయొక్క క్రమాభివృద్ధిని గురించి చెప్పింది; అది భావవాదాత్మకం. మనస్సుయొక్క క్రమాభివృద్ధినిబట్టి ప్రకృతియొక్క, మానవునియొక్క, మానవ, సామాజిక సంబంధాలయొక్క క్రమాభివృద్ధిని హేగెల్ తత్వశాస్త్రం నిర్ధారణ చేసింది. హేగెల్ తత్వశాస్త్రంలోని నిరంతర క్రమాభివృద్ధి భావాన్ని అంగీకరించుతూ* మార్క్స్

---

* తమ మానసిక అభివృద్ధికి ప్రఖ్యాత జర్మన్ తత్వశాస్త్రజ్ఞులకు — అందులో ముఖ్యంగా హేగెల్‌కు తామెంతో రుణపడి వున్నామని మార్క్స్, ఎంగెల్స్‌లు తరచు చెబుతూ వుండేవారు. "జర్మన్ తత్వశాస్త్రం ఉద్భవించి వుండకపోతే శాస్త్రీయ సోషలిజం ఉనికిలోకి వచ్చి వుండేదే కాదు" అన్నాడు ఎంగెల్స్. — లెనిన్ వివరణ.

ఎంగెల్స్‌లు ఆయన ముందుగానే ఏర్పరచుకున్న భావవాద అభిప్రాయాలను తోసిపుచ్చారు; మానవ జీవిత విషయంలో ప్రకృతియొక్క అభివృద్ధిని వివరించేది మనస్సుయొక్క అభివృద్ధి కాదనీ, తద్భిన్నంగా మనస్సుయొక్క వివరణను ప్రకృతినుంచే, పదార్థంనుంచే పొందవలసి వుంటుందని తెలుసుకున్నారు.... హేగెల్ లాగా, ఇతర హేగెలియన్ల లాగా కాకుండా మార్క్స్ ఎంగెల్స్‌లు భౌతికవాదులు. ప్రపంచాన్నీ మానవాళినీ భౌతికవాద దృష్టితో పరిశీలించి చూసి, ప్రకృతిలో జరిగే సంఘటన లన్నిటికీ భౌతిక కారణాలే మూలాధారాలనీ, అలాగే మానవ సమాజ అభివృద్ధి కూడా భౌతిక శక్తులచే, ఉత్పాదక శక్తులచే నిర్దేశింపబడు తోందనీ వారు గ్రహించారు. మానవ అవసరాలను తీర్చుకునేటందుకు కావలసిన వస్తువులను ఉత్పత్తి చేసుకోడంలో మనుషులు ఒకరితో ఒకరు ఏర్పరచుకునే సంబంధాలు ఉత్పాదక శక్తుల అభివృద్ధిమీద ఆధారపడి వుంటాయి. ఈ సంబంధాలలోనే అన్ని సామాజిక జీవిత సంఘటనలకూ ఆశయాలకూ, భావాలకూ, నియమాలకూ వివరణ ఇమిడి వుంది. ఉత్పాదక శక్తుల అభివృద్ధి సొంత ఆస్తిపై ఆధారపడిన సామాజిక సంబంధాలను సృష్టిస్తుంది, కాని యీ ఉత్పాదక శక్తుల అభివృద్ధే అధిక సంఖ్యాకులకు ఆస్తి లేకుండా చేసి, దాన్ని అత్యల్ప సంఖ్యాకుల చేతులలో సాంద్రీకరిస్తుంది. ఆధునిక సామాజిక వ్యవస్థకు ప్రాతిపదిక అయిన సొంత ఆస్తిని రద్దుచేసి సోషలిస్టులు పెట్టుకున్న గమ్యం దిశగానే అది కూడ పాటుపడుతుంది. సోషలిస్టులు చేయవలసినదంతా ఏమిటంటే, ఏ సామాజిక శక్తి, ఆధునిక సమాజంలో దానికున్న స్థానాన్నిబట్టి, సోషలిజాన్ని తీసుకురావడంపట్ల ఆసక్తి కలిగివుందో గుర్తించి ఆ శక్తికి దాని ప్రయోజనాలను గురించిన, దాని చారిత్రక కర్తవ్యం గురించిన చైతన్యాన్ని కలుగజేయడం. ఈ సామాజిక శక్తి శ్రామికవర్గమే. ఇంగ్లీషు పారిశ్రామిక కేంద్రం అయిన మాంచెస్టర్‌లో తన తండ్రి భాగస్వామిగా వున్న వ్యాపార సంస్థలో 1842లో ఉద్యోగిగా చేరి స్థిరపడినప్పుడు ఇంగ్లండులో ఎంగెల్స్‌కు శ్రామికవర్గంతో పరిచయం ఏర్పడింది. ఇక్కడ ఎంగెల్స్ ఫ్యాక్టరీ ఆఫీసులో కూర్చుని పనిచేయడమేగాక కోళ్ల గూళ్లలో కోళ్లలాగ కూరబడి వుండే కార్మికుల మురికి పేటలలో తిరుగుతూ వారి దారిద్ర్యాన్నీ, దౌర్భాగ్యజీవితాన్నీ కళ్లారా చూశాడు. కాని ఆయన తన సొంత పరిశీలనలకే పరిమితపడి వుండలేదు, బ్రిటిషు కార్మికవర్గం గురించి తాను చూసినదాన్నంతటినీ గురించి పుస్తకాల్లో చదివి, తనకు దొరికిన ప్రభుత్వ ప్రచురణలనన్నిటినీ శ్రద్ధగా అధ్యయనం చేశాడు. ఆయన చేసిన అధ్యయనం, జరిపిన పరిశీలనల ఫలితమే 1845లో "ఇంగ్లండులో కార్మికవర్గ స్థితి" అనే గ్రంథం. ఈ గ్రంథాన్ని రచించడంలో ఎంగెల్స్ చేసిన గొప్ప సేవ ఏమిటో ఇదివరకే పేర్కొన్నాం. ఎంగెల్స్‌కు పూర్వమే చాలామంది శ్రామికవర్గం పడుతున్న బాధలను వర్ణించి దానికి సహాయపడవలసిన అవసరాన్ని గురించి రాశారు. అయితే, శ్రామికవర్గం బాధలను అనుభవించుతున్న వర్గం మాత్రమే కాదని మొట్టమొదటి

సారిగా చెప్పినవాడు ఎంగెల్స్; వాస్తవంలో సిగ్గుచేటైన యీ ఆర్థిక దుస్థితే శ్రామికవర్గాన్ని నిరాఘాటంగా ముందుకు నడిపి తన అంతిమ విముక్తి కోసం పోరాడేటట్టు చేసితీరుతుందని చెప్పాడు. అంతేకాక, పోరాడే శ్రామికవర్గం స్వయం సహాయంమీదనే ఆధారపడుతుంది. కార్మికవర్గపు రాజకీయ ఉద్యమం, ఒక్క సోషలిజంలోనే తమకు విముక్తి వుందని కార్మికులు గ్రహించేటట్లు తప్పనిసరిగా చేస్తుంది. మరోవైపున, ఎప్పుడైతే సోషలిజం కార్మిక వర్గపు రాజకీయ పోరాట లక్ష్యం అవుతుందో అప్పుడే సోషలిజం ఒక శక్తి అవుతుంది. ఇంగ్లండులోని కార్మికవర్గపు స్థితిని గురించి ఎంగెల్స్ రచించిన గ్రంథంలో వెల్లడించబడిన ముఖ్యమైన అభిప్రాయాలు అవి. యోచనాపరులైన, పోరాటం సాగించుతూన్న శ్రామికులందరూ ఇప్పుడు అనుసరించుతున్న భావాలు, కాని ఆ రోజులలో అవి పూర్తిగా నూతనమైనవి. మనస్సును ఆకర్షించే శైలిలో రాయబడిన, ఇంగ్లీషు శ్రామికవర్గ దుస్థితిని అత్యంత ప్రామాణికంగానూ హృదయవిదారకంగానూ చిత్రించిన ఆ గ్రంథంలో యీ భావాలు వివరించబడ్డాయి. ఈ గ్రంథం పెట్టుబడిదారీ విధానంపైన, బూర్జువావర్గంపైన ఒక ఘోరమైన నేరారోపణ పత్రమని చెప్పాలి. అది అందరిపైనా ప్రగాఢమైనా ప్రభావం కలిగించింది. ఆధునిక శ్రామికవర్గ పరిస్థితిని వివరంగా చిత్రించిన పుస్తకంగా అందరూ ఎంగెల్స్ వ్రాసిన యీ గ్రంథాన్నే ఉదహరిస్తూ వుండేవారు. వాస్తవానికి 1845కు ముందుగాని, ఆ తరువాతగాని కార్మికవర్గ దౌర్భాగ్యస్థితిని ఇంత అద్భుతంగానూ యథార్థంగానూ చిత్రించిన గ్రంథం మరోటి వెలువడలేదు.

ఎంగెల్స్ ఇంగ్లండుకు వచ్చిన తరువాతనే సోషలిస్టు అయాడు. మాంచెస్టర్‌లో ఆ రోజులలో ఇంగ్లీషు కార్మికోద్యమంలో చురుకుగా పనిచేస్తూ వుండినవారితో ఆయన సంబంధాలు పెట్టుకుని, ఇంగ్లీషు సోషలిస్టు పత్రికలకు వ్యాసాలు రాయడం మొదలుపెట్టాడు. 1844లో ఆయన జర్మనీకి తిరిగి వెడుతున్నప్పుడు పారిస్‌లో మార్క్సుతో పరిచయం కలిగింది, అయితే అంతకు ముందునుంచే ఆయన మార్క్సుతో ఉత్తరప్రత్యుత్తరాలు జరుపుతూ వుండేవాడు. పారిస్‌లో వుండేటప్పుడు ఫ్రెంచి సోషలిస్టులయొక్క, ఫ్రెంచి జీవితంయొక్క ప్రభావంతో మార్క్సు కూడా సోషలిస్టు అయాడు. పారిస్‌లో యీ మిత్రులిద్దరూ కలిసి "పవిత్ర కుటుంబం లేక విమర్శనాత్మక విమర్శయొక్క విమర్శ" అనే గ్రంథాన్ని రచించారు. "ఇంగ్లండులో కార్మికవర్గ స్థితి" అనే గ్రంథం వెలువడడానికి ఒక ఏడాది ముందే వెలువడిన, అత్యధిక భాగం మార్క్సుచేతనే రచింపబడిన యీ గ్రంథంలో మేము పైన వివరించిన విప్లవాత్మక భౌతికవాద సోషలిజంయొక్క మూలాధారాలూ, ప్రధానమైన భావాలూ వున్నాయి. "పవిత్ర కుటుంబం" అనేది తత్వశాస్త్రజ్ఞులైన బౌవర్ సోదరులకూ, వారి అనుచరులకూ మార్క్స్ ఎంగెల్స్‌లు పెట్టిన వేళాకోళపు పేరు. వాస్తవికతకూ, పార్టీలకూ, రాజకీయాలకూ అతీతమైన, ప్రత్యక్ష కార్యాచరణను తోసిపుచ్చి, చుట్టూ వున్న ప్రపంచాన్నీ, దానిలో జరిగే

ఘటనలనూ కేవలం "విమర్శనాత్మకంగా" ధ్యానిస్తూ వుండే విమర్శ పద్ధతిని యీ పెద్ద మనుషులు బోధించారు. ఈ పెద్దమనుషులు, బౌవర్ సోదరులు, శ్రామికవర్గాన్ని విమర్శనా జ్ఞానం లేని మూకకింద జమకట్టి దానిపై చిన్న చూపు చూసేవారు. అసందర్భమైన హానికరమైన యీ పోకడను మార్క్స్ ఎంగెల్స్‌లు తీవ్రంగా వ్యతిరేకించారు. వాస్తవమైన మానవ వ్యక్తి తరపున — పాలకవర్గాలయొక్క రాజ్యాంగయంత్రంయొక్క పాదాలకింద పడి నలిగిపోతున్న కార్మికుని తరపున — చేయవలసింది ధ్యానం కాదు, ఉత్తమ సామాజిక వ్యవస్థ కోసం పోరాటం అని వారు గట్టిగా కోరారు. ఈ పోరాటాన్ని సాగించే సామర్థ్యం గలిగివున్న శక్తి, ఆ పోరాటంపట్ల శ్రద్ధాసక్తులు కలిగివున్న శక్తి శ్రామికవర్గమేనని వారు పరిగణించారు. "పవిత్ర కుటుంబం" అనే గ్రంథం వెలువడడానికి ముందే మార్క్స్, రూగెల సంపాదకత్వం క్రింద ప్రచురింపబడుతుండిన "జర్మన్ ఫ్రెంచి ఐతిహాసిక వార్షిక సంచిక" అనే పత్రికలో ఎంగెల్స్ "అర్థశాస్త్రంపై విమర్శనాత్మక వ్యాసాలు" రాశాడు. వాటిలో సమకాలీన ఆర్థిక వ్యవస్థలోని ప్రధాన విషయాలను సోషలిస్టు దృక్పథంనుంచి పరిశీలించి అవి సొంత ఆస్తి చలాయించే అధికారపు తప్పనిసరి పర్యవసానాలేనని చెప్పాడు. ఏ శాస్త్రంలో అయితే మార్క్స్ రచించిన గ్రంథాలు నిజంగా ఒక విప్లవాన్ని తీసుకువచ్చాయో, ఆ అర్థశాస్త్రాన్ని అధ్యయనం చేయాలనే నిర్ణయానికి మార్క్స్ రావడానికి ఎంగెల్స్‌తో ఆయనకు ఏర్పడిన పరిచయమే ఒక ప్రబలమైన కారణమని నిస్సందేహంగా చెప్పవచ్చు.

ఎంగెల్స్, 1845నుంచి 1847వరకూ బ్రస్సెల్స్‌లోనూ, పారిస్‌లోనూ నివసిస్తూ తన విజ్ఞానశాస్త్ర అధ్యయనాన్ని బ్రస్సెల్స్‌లోని, పారిస్‌లోని జర్మన్ కార్మికుల మధ్య కొనసాగించే ప్రత్యక్ష కార్యకలాపాలతో మిళితం చేస్తూ జీవించాడు. అక్కడే మార్క్స్ ఎంగెల్స్‌లు రహస్యంగా పనిచేసే జర్మన్ కమ్యూనిస్టు లీగుతో సంబంధాలు ఏర్పరచుకున్నారు. అప్పటికే వారు రూపొందించిన సోషలిజం ప్రధాన సూత్రాలను వివరించ వలసిందిగా వారిని ఆ లీగు కోరింది. 1848లో ప్రచురించబడిన మార్క్స్ ఎంగెల్స్‌ల సుప్రసిద్ధ "కమ్యూనిస్టు ప్రణాళిక" ఆ విధంగానే అవతరించింది. ఈ చిన్న పుస్తకం ఎన్నో ఉద్గ్రంథాలకు సరిసమానమైనది: ఈ నాటికీ దాని భావమే నాగరిక ప్రపంచ మంతటా సంఘటితమైన పోరాటం సాగించుతూన్న శ్రామికవర్గం యావత్తునూ ఉత్తేజపరచి నడుపుతూ వుంది.

మొదట ఫ్రాన్సులో ఆరంభమై ఆ తరువాత ఇతర పశ్చిమ యూరప్ దేశాలకు వ్యాపించిన 1848 విప్లవం మూలంగా మార్క్స్ ఎంగెల్స్‌లు తమ స్వదేశానికి తిరిగి వచ్చారు. ఇక్కడ, ప్రష్యా రాజ్యపు రైన్ రాష్ట్రంలోని కొలోన్ పట్టణంలో ప్రచురింపబడుతూండిన ప్రజాస్వామ్య పత్రిక "నోయె రైనిషె సైటుంగ్"ను నడపడానికి పూనుకున్నారు. ఆనాడు ప్రష్యా రాజ్యపు రైన్ రాష్ట్రంలో విజృంభించిన విప్లవాత్మక ప్రజాస్వామిక ఆశయాలన్నిటికీ యీ ఇద్దరు మిత్రులూ ఆయువుపట్టుగానూ గుండెకాయగానూ వుండేవారు. అభివృద్ధినిరోధక

శక్తులకు వ్యతిరేకంగా ప్రజల స్వాతంత్ర్యాన్నీ ప్రయోజనాలనూ కాపాడేందుకు వారు కడపటివరకూ పోరాడారు. అందులో అభ్యుదయనిరోధక శక్తులదే పైచేయి అవడం మనకు తెలిసిన సంగతే. "నోయె రైనిషె సైటుంగ్" పత్రిక అణచివేయబడింది. ప్రవాసజీవితంలో వున్నప్పుడు తన ప్రష్యన్ పౌరసత్వాన్ని కోల్పోయినందువల్ల మార్క్స్ దేశంనుంచి వెళ్ల గొట్టబడ్డాడు. ఎంగెల్సు సాయుధ ప్రజా తిరుగుబాటులో పాల్గొని, స్వేచ్ఛకోసం మూడు యుద్ధాలలో పోరాడి, తిరుగుబాటుదార్లు ఓడిపోయిన తరువాత స్విట్జర్లెండ్ మీదుగా లండన్‌కు పారిపోయాడు.

అప్పటికి మార్క్స్ కూడ లండన్‌లో స్థిరపడ్డాడు. ఎంగెల్స్ మాంచెస్టర్‌కు వెళ్లి 1840 దశకంలో తాను పనిచేసిన వ్యాపార సంస్థలో తిరిగి గుమాస్తాగా చేరి ఆతరువాత దానిలో భాగస్వామి అయాడు. 1870వరకూ ఆయన మాంచెస్టర్‌లో నివసించాడు, మార్క్స్ లండన్‌లో వుండేవాడు, అయినప్పటికీ వారిద్దరూ తమ తమ భావాలను పరస్పరం తెలియ జేసుకుంటూ వుండడానికి ఇదేమీ ప్రతిబంధకం కాలేదు: వారు దాదాపు ప్రతిరోజూ ఉత్తర ప్రత్యుత్తరాలు జరుపుకుంటూ వుండేవారు. ఈ ఉత్తరప్రత్యుత్తరాలలో యీ మిత్రులిద్దరూ తమ తమ అభిప్రాయాలనూ, కొత్తగా తెలుసుకున్న విషయాలనూ పరస్పరం తెలియజేసుకుంటూ శాస్త్రీయ సోషలిజాన్ని రూపొందించే కృషిలో సహకరించుకుంటూ వుండేవారు. 1870లో ఎంగెల్స్ లండన్‌కు మారాడు, అత్యంత శ్రమతో, పట్టుదలతో కూడిన వారి సంయుక్త వైజ్ఞానిక కృషి 1883లో మార్క్స్ మరణించేటంతవరకూ కొనసాగింది. మార్క్స్ వంతుకు మన యుగంలో అర్థశాస్త్రంపై రచింపబడిన మహోత్కృష్టమైన గ్రంథం, "పెట్టుబడి," ఎంగెల్స్ వంతుకు ఆయన రచించిన అనేక చిన్నా, పెద్దా గ్రంథాలూ ఈ సమిష్టి కృషి ఫలితమే. పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థయొక్క సంక్లిష్ట విషయాల విశ్లేషణపై మార్క్స్ కృషి చేశాడు. ఎంగెల్స్ తన సులభశైలి రచనలలో తరచు వాదవివాద స్వభావంగల విషయాలను గురించీ, సర్వ సాధారణ శాస్త్రీయ సమస్యల గురించీ, భూత వర్తమాన కాలాలకు సంబంధించిన వివిధ సంఘటనలను చారిత్రక భౌతికవాద భావనా దృక్పథంనుంచీ మార్క్సిస్టు ఆర్థిక సిద్ధాంత దృక్పథంనుంచీ పరిశీలించుతూ రాశాడు. ఎంగెల్స్ రచనలలో కొన్నింటిని యీ క్రింద పేర్కొంటున్నాం: డ్యూరింగును ఖండిస్తూ రచించిన వాదవివాద గ్రంథం (ఇందులో తర్కశాస్త్ర, ప్రకృతిశాస్త్ర, సామాజికశాస్త్ర రంగాలలో అత్యంత ప్రాముఖ్యంగల సమస్యలు పరిశీలింపబడ్డాయి),*

---

* అద్భుతమైన విషయ సంపదగల్గిన, జ్ఞానబోధకమైన గ్రంథం. దురదృష్టవశాత్తూ సోషలిజం అభివృద్ధిని గురించిన సంగ్రహ చారిత్రక వివరణ వున్న చిన్న భాగం మాత్రమే రష్యన్ భాషలోకి అనువదింపబడింది ("శాస్త్రీయ సోషలిజం అభివృద్ధి," రెండవ కూర్పు, జీనీవా, 1892). – లెనిన్ వివరణ. [ఇక్కడ ఎంగెల్స్ రచించిన "ఆంటీ డ్యూరింగ్," "సోషలిజం: ఊహాజనితమూ, శాస్త్రీయమూ"కు ప్రస్తావన. – సం.]

"కుటుంబం, సొంత ఆస్తి, రాజ్యాల ఆవిర్భావం" (రష్యన్ భాషలోకి అనువదింపబడి సెంట్ పీటర్స్‌బుర్గ్‌లో ప్రచురింపబడింది. మూడవ కూర్పు, 1895), "లుడ్విగ్ ఫాయెర్‌బాఖ్" (జి. ప్లెహానొవ్‌చే వివరణ సహితమైన రష్యన్ అనువాదం, జెనీవా, 1892), రష్యన్ ప్రభుత్వ విదేశాంగ విధానంపై ఒక వ్యాసం (జెనీవాలో "సోత్సియాల్ డెమొక్రాట్" పత్రిక 1, 2 సంచికలలో రష్యన్ అనువాదం ప్రచురింపబడింది), గృహవసతి సమస్యపై రచించిన అద్భుతమైన వ్యాసాలు, ఇక ఆఖరున పేర్కొనవలసినవి, చిన్నవైనా అత్యంత విలువైన రెండు వ్యాసాలు, రష్యా ఆర్థికాభివృద్ధిని గురించి రాసినవి ("రష్యాను గురించి ఫ్రెడరిక్ ఎంగెల్స్" జసూలిచ్‌చే రష్యన్ భాషలోకి అనువదించబడ్డాయి, జెనీవా, 1894). పెట్టుబడిపై తాను రచించిన బృహద్గ్రంథం తుది మెరుగులు దిద్దే లోపలనే మార్క్స్ మరణించాడు. అయినప్పటికీ దాని చిత్తుప్రతిని పూర్తి చేశాడు. ఎంగెల్స్ తన మిత్రుని మరణానంతరం "పెట్టుబడి" గ్రంథం రెండవ, మూడవ సంపుటాలను ముద్రణకు సిద్ధంచేసి ప్రచురించే అతిభారమైన కర్తవ్యాన్ని చేపట్టాడు. రెండవ సంపుటిని 1885 లోనూ, మూడవ సంపుటిని 1894లోనూ ప్రచురించాడు. (నాల్గవ సంపుటిని[8] ప్రచురణకు సిద్ధంచేసేలోపునే ఎంగెల్స్ మరణించాడు.) రెండవ, మూడవ సంపుటాలను ప్రచురించడానికి ఆయన ఎంతో శ్రమపడవలసి వచ్చింది. ఆస్ట్రియన్ సోషల్ డెమొక్రట్ అయిన ఆడ్లర్ యీ విషయాన్ని గురించి ప్రస్తావిస్తూ, ఎంగెల్స్ "పెట్టుబడి" గ్రంథం రెండవ మూడవ సంపుటాలను ప్రచురించడం ద్వారా ప్రతిభాశాలి అయిన తన మిత్రునికి ఒక మహనీయమైన జ్ఞాపకచిహ్నాన్ని నిర్మించి దానిపై అనుకోకుండానే తన పేరును చిరస్థాయిగా మలచుకున్నాడు అని ఎంతో సమంజసంగా పేర్కొన్నాడు. నిజానికి "పెట్టుబడి" గ్రంథంయొక్క యీ రెండు సంపుటాలూ ఇద్దరు వ్యక్తుల — మార్క్స్, ఎంగెల్స్‌ల — రచన. పురాతన గాథలలో స్నేహాన్ని గురించి మనస్సు కరిగించే దృష్టాంతాలు అనేకం వున్నాయి. మానవ మైత్రిని గురించిన ప్రాచీన సాహిత్యంలోని అత్యంత మనోద్వేగజనక గాథలను మించిన స్నేహబంధం గల ఇద్దరు పండితులూ, యోధులూ తన శాస్త్రాన్ని సృష్టించారని యూరపియన్ శ్రామికవర్గం సగర్వంగా చెప్పుకోవచ్చు. ఎంగెల్స్ ఎల్లప్పుడూ — మొత్తంమీద ఎంతో సబబుగా — ముందు మార్క్స్ పేరు చెప్పి, తరువాత తన పేరు చెప్పుకునేవాడు. ఒక పాత స్నేహితునికి రాసిన ఒక ఉత్తరంలో ఎంగెల్స్ ఇలా అన్నాడు: "మార్క్స్ జీవించి వున్న రోజులలో నేను ఆయనకు వంతగానే వుండేవాణ్ణి." మార్క్స్ బతికి వున్నప్పుడు ఆయనమీద ఎంగెల్స్‌కు వున్న ప్రేమ, మార్క్స్ చనిపోయిన తరువాత ఆయనమీద ఎంగెల్స్ చూపిన భక్తిగౌరవాలూ అపారములు. నిశ్చలుడైన ఈ యోధునిలో, నిష్ఠాపరుడైన యీ తాత్వికునిలో అత్యంత ప్రేమ పూరితమైన హృదయం స్పందించుతూ వుండేది.

1848–49 ఉద్యమానంతరం ప్రవాసంలో వున్న కాలంలో మార్క్స్ ఎంగెల్స్‌లు

శాస్త్ర పరిశోధనకే పరిమితపడి వుండలేదు. 1864లో మార్క్స్ "అంతర్జాతీయ కార్మిక సంఘాన్ని" స్థాపించి పూర్తి దశాబ్ద కాలం దానికి నాయకత్వం వహించాడు. ఈ సంఘ కార్యకలాపాలలో ఎంగెల్స్ కూడ చురుకుగా పాల్గొన్నాడు. మార్క్స్ అభిప్రాయాన్ని అనుసరించి అన్ని దేశాల శ్రామికులనూ ఐక్యపరచిన యీ అంతర్జాతీయ సంఘం చేసిన కృషి కార్మికవర్గ ఉద్యమాభివృద్ధిలో బ్రహ్మాండమైన ప్రాధాన్యత వహించింది. 1870 దశకంలో యీ అంతర్జాతీయ సంఘం మూతపడినప్పటికీ కార్మికవర్గ ఐక్యతను సాధించ డంలో మార్క్స్ ఎంగెల్స్‌ల పాత్ర అంతటితో ముగిసిపోలేదు. తద్భిన్నంగా, కార్మికోద్యమమే నిరాఘాటంగా అభివృద్ధి చెందడం మూలంగా, కార్మికవర్గ ఉద్యమ సైద్ధాంతిక నాయకులుగా వారి ప్రాముఖ్యత నిరంతరాయంగా పెరుగుతూనే వుందని చెప్పాలి. మార్క్స్ మరణానంతరం ఎంగెల్స్ ఒక్కడే యూరపియన్ సోషలిస్టులకు సలహాదారుడుగానూ, నాయకుడుగానూ కొనసాగాడు. ప్రభుత్వం క్రూర నిర్బంధ విధానాన్ని అమలు జరిపినప్పటికీ త్వరితంగానూ నిలకడగానూ మరింత పటిష్ఠం అవుతూ వున్న జర్మన్ సోషలిస్టులేగాక, బాగా ఆలోచించి ఆచి తూచి తమ తొలి అడుగులు వేయవలసిన స్పెయిన్, రుమేనియా, రష్యా లాంటి వెనుక బడివున్న దేశాల ప్రతినిధులు కూడా సలహాకోసమూ, ఆదేశాలకోసమూ ఆయన వద్దకు వస్తూవుండేవారు. వారందరూ వయోవృద్ధుడైన ఎంగెల్స్‌యొక్క మహత్తర జ్ఞాన నిధిని ధారాళంగా వినియోగించుకునేవారు.

రష్యన్ భాష తెలిసి రష్యన్ గ్రంథాలను చదవగలిగిన మార్క్స్ ఎంగెల్స్‌లు రష్యాపట్ల చురుకైన ఆసక్తిని చూపుతూ, ఆ దేశ విప్లవోద్యమాన్ని సానుభూతితో గమనిస్తూ, రష్యన్ విప్లవకారులతో సంబంధాలను నెలకొల్పుకుంటూ వుండేవారు. వారిద్దరూ ముందు ప్రజాతంత్ర వాదులై ఆ తరువాత సోషలిస్టు లయారు. అందుచేత రాజకీయ నిరంకుశత్వంపై ప్రజా తంత్ర వాదులకుండే ద్వేషం వారిలో అత్యంత గాఢంగా నాటుకుని వుంది. ఈ ప్రత్యక్ష రాజకీయ అనుభూతి, దానితోపాటు రాజకీయ నిరంకుశత్వానికీ ఆర్థిక పీడనకూ గల సంబంధం గురించిన ప్రగాఢమైన సైద్ధాంతిక అవగాహనా, వారికున్న విశేష జీవితానుభవమూ వీట న్నిటి మూలంగా మార్క్స్ ఎంగెల్స్‌లు రాజకీయంగా అసాధారణమైన ప్రతిస్పందనను ప్రదర్శించారు. ఈ కారణం వల్లనే అత్యంత శక్తివంతమైన జార్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పట్టెడుమంది రష్యన్ విప్లవకారులు సాగించే వీరోచిత పోరాటం కాకలు తీరిన యీ విప్లవ యోధుల హృదయాలలో అత్యంత గాఢమైన సానుభూతిని రేకెత్తించింది. మరోవైపున, భ్రమాజనితములైన ఆర్థిక లాభాలకోసం ఆశపడి అత్యంత తక్షణ కర్తవ్యమూ, ప్రధాన కర్తవ్యమూ అయిన రాజకీయ స్వాతంత్ర్య సాధనపట్ల పెడముఖం పెట్టే రష్యన్ సోషలిస్టుల వైఖరి వారికి సహజంగానే అనుమానాస్పదమైనదిగా కనబడింది. వారు దానిని మహత్తర సామాజిక విప్లవోద్యమానికి ప్రత్యక్ష ద్రోహంగా పరిగణించారు. "కార్మిక విమోచనను కార్మిక

వర్గమే సాధించాలి" అని మార్క్స్ ఎంగెల్స్‌లు నిరంతరం బోధించుతూ వుండేవారు. కాని తన ఆర్థిక విమోచనకోసం పోరాడాలంటే శ్రామికవర్గం కొన్ని రాజకీయ హక్కులను తానే గెల్చుకోవలసి వుంటుంది. అంతేగాక, రష్యాలో రాజకీయ విప్లవం సంభవిస్తే అది పాశ్చాత్య యూరపియన్ దేశాల కార్మికోద్యమానికి కూడా మహత్తర ప్రాముఖ్యతను కలిగి వుంటుందని మార్క్స్ ఎంగెల్స్‌లు స్పష్టంగా గ్రహించారు. నిరంకుశ పాలనను సాగిస్తూన్న రష్యా మొత్తంమీద యూరపియన్ అభివృద్ధినిరోధక శక్తులకు ఎల్లప్పుడూ ఒక రక్షణ దుర్గంగా వుంటూవుంది. దీర్ఘ కాలంగా జర్మనీ ఫ్రాన్సుల మధ్య వైషమ్య బీజాలను నాటిన 1870 యుద్ధం[9] ఫలితంగా అంతర్జాతీయ రంగంలో రష్యా ఆక్రమించుకుని వున్న అసాధారణమైన సానుకూల స్థానం, అభివృద్ధినిరోధక శక్తిగా నిరంకుశ రష్యాయొక్క ప్రాముఖ్యతను సహజంగానే మరింత ఇనుమడింపజేసింది. స్వేచ్ఛాయుతమైన రష్యా మాత్రమే, పోలండ్, ఫిన్లండ్, జర్మనీ, ఆర్మీనియా దేశస్తులను గాని, మరే యితర చిన్న జాతుల ప్రజలను గాని పీడించవలసిన, ఫ్రాన్సునీ జర్మనీనీ ఒకరి మీదకు ఒకరిని ఉసికొల్ప వలసిన అవసరం లేని రష్యా మాత్రమే, ఆధునిక యూరప్‌ను యుద్ధ భారంనుంచి విముక్తిచేసి స్వేచ్ఛావాయువులను పీల్చుకోగలిగేటట్లు చేస్తుంది, యూరప్‌లోని అభివృద్ధినిరోధక శక్తులన్నిటినీ బలహీనపర్చి యూరపియన్ కార్మికవర్గాన్ని పటిష్ఠం చేస్తుంది. అందుకనే పశ్చిమ ఖండంలోని కార్మికవర్గ ఉద్యమ ప్రగతికోసం కూడా రష్యాలో రాజకీయ స్వాతంత్ర్యస్థాపన జరగాలని ఎంగెల్స్ ప్రగాఢంగా వాంఛించాడు. ఆయన మరణంతో రష్యన్ విప్లవకారులు తమ ముఖ్యస్నేహితుని కోల్పోయారు.

మహా యోధుడూ, శ్రామికవర్గ మహోపాధ్యాయుడూ అయిన ఫ్రెడరిక్ ఎంగెల్స్ స్మృతి చిరస్మరణీయంగా వర్ధిల్లుగాక!

రచన: 1895 శరత్తు

## వి. ఐ. లెనిన్

# మార్క్సిజంయొక్క మూడు మూలాధారాలూ, మూడు భాగాలూ

మార్క్సు ఉపదేశాలు నాగరిక ప్రపంచ మంతటా బూర్జువా శాస్త్రంలో (అధికారయుత విజ్ఞానశాస్త్రానికీ, ఉదార విజ్ఞానశాస్త్రానికీ కూడ) అత్యంత శత్రుభావాన్నీ, ద్వేషాన్నీ రేకెత్తిస్తున్నాయి. అవి మార్క్సిజాన్ని ఒక రకమైన "హానికరమైన కూటం"గా పరిగణిస్తున్నాయి. అవి వేరొక వైఖరిని ప్రదర్శిస్తాయని ఆశించలేము, ఎందుచేతనంటే వర్గపోరాటం ప్రాతిపదికగా ఏర్పడిన సమాజంతో "నిష్పాక్షిక"మైన సామాజికశాస్త్రం అనేది ఏదీ వుండజాలదు. అధికారయుతమైన, ఉదారమైన విజ్ఞానశాస్త్రం అంతా ఏదో విధంగా వేతన బానిసత్వాన్ని సమర్థిస్తూ వుంటే, మార్క్సిజం ఆ వేతన బానిసత్వంమీద సడలుబాటులేని యుద్ధాన్ని ప్రకటించింది. వేతన బానిస సమాజంలో విజ్ఞానశాస్త్రం నిష్పాక్షికంగా వుంటుందని ఆశించడం పెట్టుబడిదార్ల లాభాలను తగ్గించుకుని కార్మికుల వేతనాలను పెంచే సమస్యమీద ఉత్పత్తిదారులు నిష్పాక్షికంగా వుంటారని ఆశించడమంతటి తెలివితక్కువ అమాయకత్వమే అవుతుంది.

అంతేకాదు. తత్వశాస్త్ర చరిత్ర, సామాజికశాస్త్ర చరిత్ర అత్యంత స్పష్టంగా తెలుపుతున్నది ఏమిటంటే, ప్రపంచ నాగరికతాభివృద్ధియొక్క రాజమార్గానికి దూరంగా ఎక్కడో ఉత్పన్నమైన కరుడుగట్టిన సిద్ధాంతం అనే భావంలో చూస్తే మార్క్సిజంలో "ఒంటెత్తువాదా"న్ని పోలిన లక్షణం కించిత్తు కూడా లేదు. తద్భిన్నంగా మానవజాతిలో అగ్రశ్రేణికి చెందిన భావుకులు ఇదివరకే లేవనెత్తిన ప్రశ్నలకు సమాధానాలను ఇవ్వడంలోనే మార్క్సు ప్రతిభ వుంది. తత్వశాస్త్రంలోనూ, అర్థశాస్త్రంలోనూ, సోషలిజంలోనూ మహాపండితులైన వారి బోధలకు సూటి అయిన తక్షణమైన కొనసాగింపుగానే మార్క్సు సిద్ధాంతం ఉద్భవించింది.

మార్క్సిస్టు సిద్ధాంతం సర్వశక్తివంతమైనది, ఎందుకంటే అది సత్యమైనది. అది సమగ్రమైనది, సమరసమైనది. ఏ రకమైన మూఢ నమ్మకంతోగానీ, అభివృద్ధినిరోధకత్వంతో గానీ, బూర్జువా పీడనను సమర్థించడంతో గానీ రాజీపడని పరిపూర్ణమైన ప్రపంచ దృక్పథాన్ని మానవులకు సమకూరుస్తుంది. అది జర్మన్ తత్వశాస్త్రంలోనూ, ఇంగ్లీషు అర్థశాస్త్రంలోనూ, ఫ్రెంచి సోషలిజంలోనూ వ్యక్తమైన విధంగా పందొమ్మిదవ శతాబ్దంలో మానవాళి సృజించినదానిలో ఉత్తమమైనదానికి న్యాయమైన వారసురాలు.

మార్క్సిజంయొక్క యీ మూడు మూలాధారాలను గురించీ, దాని అంశీభూతములు కూడా అయిన మూడు భాగాలను గురించీ మేమిప్పుడు క్లుప్తంగా వివరిస్తాం.

## I

మార్క్సిజం తత్వశాస్త్రం భౌతికవాదం. యూరప్ ఖండంయొక్క ఆధునిక చరిత్ర అంతటిలోనూ, అందులో ప్రత్యేకించి పద్దెనిమిదవ శతాబ్దం చివరిలో మధ్యయుగం నాటి అన్ని రకాల చెత్తకూ వ్యతిరేకంగానూ, సంస్థలలోనూ భావాలలోనూ వుండిన ఫ్యూడల్ వ్యవస్థకు వ్యతిరేకంగానూ కృతనిశ్చితమైన పోరాటం సాగిన ఫ్రాన్సులో ప్రకృతి శాస్త్రాల బోధలన్నిటికీ తగినట్టుగానూ, మూఢనమ్మకాలకు డాంబికాలు వగైరాలకు వ్యతిరేకంగానూ నిరంతరాయంగా ఎదిరించి నిలబడగలిగిన ఒకేఒక తత్వశాస్త్రం భౌతికవాదమేనని రుజువైంది. అందుచేత ప్రజాస్వామ్యానికి శత్రువులైనవారు భౌతికవాదాన్ని "పూర్వపక్షం" చేయడానికీ, దాన్ని కూలదోసి అపఖ్యాతి పాలుచేయడానికీ ఎల్లప్పుడూ తమ సర్వశక్తులనూ వినియోగించారు, ఎల్లప్పుడూ ఏదో విధంగా మతాన్ని సమర్థించేవి, లేక బలపర్చేవి అయిన రకరకాల తాత్విక భావవాద రూపాలను ప్రోత్సహిస్తూనే వచ్చారు.

మార్క్స్, ఎంగెల్స్‌లు తాత్విక భౌతికవాదాన్ని అత్యంత దృఢనిశ్చయంతో సమర్థించి యీ ప్రాతిపదికనుంచి వైదొలగిన పెడమార్గం ప్రతీదీ ఎంత తీవ్రమైన పొరపాటో పదే పదే వివరించారు. ఎంగెల్స్ రచించిన "లుడ్విగ్ ఫాయెర్‌బాఖ్," "ఆంటీ డ్యూరింగ్" అనే గ్రంథాలలో వారి భావాలు అత్యంత స్పష్టంగానూ పూర్తిగానూ వివరించబడ్డాయి. ఇవి "కమ్యూనిస్టు ప్రణాళిక" లాగనే వర్గచైతన్యం కలిగిన ప్రతి కార్మికునికీ పాఠ్య గ్రంథాలు.

అయితే, మార్క్స్ పద్దెనిమిదవ శతాబ్దపు భౌతికవాదంతోనే ఆగిపోలేదు: తత్వశాస్త్రాన్ని ఆయన ముందుకు తీసుకుపోయాడు. ఆయన దానిని జర్మన్ సాంప్రదాయిక తత్వశాస్త్రం సాధించిన విజయాలతో, అందులోనూ ముఖ్యంగా హేగెల్ సిద్ధాంతంతో పరిపుష్టం చేశాడు. ఈ హేగెల్ సిద్ధాంతంనుంచే ఫాయెర్‌బాఖ్ భౌతికవాదం వచ్చింది. అందులో ప్రధాన

మైన చేర్పు గతితర్కం, అంటే, అభివృద్ధిని దాని పరిపూర్ణమైన, ప్రగాఢమైన, అత్యంత సమగ్రమైన రూపంలో చూపించే సిద్ధాంతం, నిత్యం అభివృద్ధి చెందే పదార్థంయొక్క ప్రతిబింబాన్ని మనకు ప్రదర్శించే మానవ విజ్ఞానపు సాపేక్షత గురించిన సిద్ధాంతం. ప్రకృతిశాస్త్రంలో రేడియం, ఎలక్ట్రానులు, మూల ద్రవ్యాలు వేరు పదార్థాలుగా మారిపోడం మొదలైన ఇటీవలి ఆవిష్కరణలు, పాతకాలపు మృతి చెందిన భావవాదానికి తిరిగివెళ్లి బూర్జువా తత్వశాస్త్రజ్ఞులు చేసే "నూతన" బోధలన్నీ విఫలం చెందగా, మార్క్స్‌యొక్క గతితార్కిక భౌతికవాదానికి అద్భుతమైన ధ్రువీకరణ.

మార్క్స్, తాత్విక భౌతికవాదాన్ని ప్రగాఢ మొనర్చి, పూర్తిగా అభివృద్ధిచేసి, ప్రకృతిని గురించిన ప్రజ్ఞానాన్ని మానవ సమాజం గురించిన ప్రజ్ఞానానికి కూడా వర్తించేట్టు విస్తృతపర్చాడు. ఆయన చారిత్రక భౌతికవాదం శాస్త్రీయ చింతన సాధించిన ఒక మహత్తర విజయం. చరిత్రను, రాజకీయాలను గురించిన అభిప్రాయాలలో అంతకు పూర్వం ప్రబలంగా వుండిన అవ్యక్తస్థితికీ, నియమరహిత స్థితికీ బదులు ఉత్పాదక శక్తుల పెరుగుదల ఫలితంగా సామాజిక జీవితపు ఒక వ్యవస్థనుండి మరొక ఉన్నత వ్యవస్థ ఎలా అభివృద్ధి చెందుతుందో —ఉదాహరణకు ఫ్యూడలిజంనుంచి పెట్టుబడిదారీ వ్యవస్థ ఎలా ఉత్పన్నమవుతుందో — నిరూపించే ఆశ్చర్యకరమైనంత పరిపూర్ణమైన సమరసమైన శాస్త్రీయ సిద్ధాంతం వచ్చింది.

మానవుని ఇష్టానిష్టాలతో నిమిత్తం లేకుండా స్వతంత్రంగా ఉనికిలోవున్న ప్రకృతిని (అంటే, అభివృద్ధి చెందే పదార్థాన్ని) అతని ప్రజ్ఞానం ఏవిధంగా ప్రతిబింబిస్తుందో అలాగే మానవుని సామాజిక ప్రజ్ఞానం (అంటే, అతనికున్న తాత్విక, మత, రాజకీయ భావాలూ, సిద్ధాంతాలూ వగైరా) ఆర్థిక వ్యవస్థను ప్రతిబింబిస్తుంది. రాజకీయ సంస్థలు ఆర్థిక పునాదిమీద నిర్మింపబడిన ఉపరినిర్మాణం. ఉదాహరణకు, ఆధునిక యూరపియన్ రాజ్యాలయొక్క వివిధ రాజకీయ రూపాలు శ్రామికవర్గంపై బూర్జువావర్గపు అధికారాన్ని పటిష్టం చేసేటందుకు ఉపయోగపడుతూండటాన్ని మనం చూస్తున్నాం.

మానవజాతికి, అందులోనూ ముఖ్యంగా కార్మికవర్గానికి శక్తివంతమైన జ్ఞాన సాధనాలను సమకూర్చిన పరిపూర్ణమైన తాత్విక భౌతికవాదమే మార్క్స్ బోధించిన తత్వశాస్త్రం.

## II

ఆర్థిక వ్యవస్థ పునాదిపైనే రాజకీయ ఉపరినిర్మాణం లేపబడుతుందనే విషయాన్ని గుర్తించి, మార్క్స్ యీ ఆర్థిక వ్యవస్థను క్షుణ్ణంగా పరిశీలించడానికి ఎక్కువ శ్రద్ధ వహించాడు. మార్క్స్ తన ప్రధాన గ్రంథం అయిన "పెట్టుబడి"లో ఆధునిక సమాజపు, అంటే పెట్టుబడిదారీ సమాజపు, ఆర్థిక వ్యవస్థను గురించి పరిశీలన జరిపాడు.

మార్క్సుకు పూర్వం సాంప్రదాయిక అర్థశాస్త్రం, పెట్టుబడిదారీ దేశాలలో కల్లా అత్యంత అభివృద్ధి చెందిన ఇంగ్లండులో వ్యుత్పన్నం అయింది. ఆడమ్ స్మిత్, డేవిడ్ రికార్డో ఆర్థిక వ్యవస్థను పరిశీలించి విలువయొక్క శ్రమ సిద్ధాంతానికి పునాదులు వేశారు. వారి కృషిని మార్క్స్ కొనసాగించాడు; ఆయన ఆ సిద్ధాంతానికి రుజువును సమకూర్చి దానిని సుసంగతంగా అభివృద్ధిచేశాడు. ప్రతి సరుకుయొక్క విలువా దానిని ఉత్పత్తి చేయడానికి ఖర్చు చేయబడే సామాజికంగా అవసరమైన శ్రమ కాలాన్ని బట్టి నిర్ణయం అవుతుందని నిరూపించాడు.

బూర్జువా అర్థశాస్త్రజ్ఞులు వస్తువుల మధ్య గల సంబంధాన్ని (ఒక సరుకుతో మరొక సరుకును మారకం చేసుకోడమనే సంబంధాన్ని) గుర్తించగా మార్క్స్ మనుష్యుల మధ్యగల సంబంధాన్ని బైటపెట్టాడు. సరకుల మారకం మార్కెట్ ద్వారా వ్యక్తిగత ఉత్పత్తిదారుల మధ్య ఉండే సంబంధాన్ని వ్యక్తంచేస్తుంది. ఈ సంబంధం అంతకంతకు మరింత సన్నిహితం అవుతూ వుండడాన్ని, వ్యక్తిగత ఉత్పత్తిదారుల ఆర్థిక జీవితం యావత్తునూ ఒకటిగా, విడదీయరాని విధంగా ఏకం చెయ్యడాన్ని ధనం తెలియజేస్తుంది. ఈ సంబంధం మరింత అభివృద్ధి చెందడాన్ని — మానవ శ్రమశక్తి ఒక సరుకుగా తయారవడాన్ని — పెట్టుబడి తెలియజేస్తుంది. వేతన కార్మికుడు తన శ్రమశక్తిని భూమినీ, ఫ్యాక్టరీలనూ, శ్రమ సాధనాలనూ కలిగివున్న యజమానికి అమ్ముకుంటాడు. కార్మికుడు తాను పనిచేసే రోజులో ఒక భాగాన్ని తననూ, తన కుటుంబాన్నీ పోషించుకోడానికి అయే ఖర్చుల సంపాదనకు (వేతనానికి) వినియోగిస్తాడు, ఆ రోజులో రెండవ భాగాన్ని ఎలాంటి ప్రతిఫలం లేకుండా పెట్టుబడిదారుని లాభానికి మూలాధారం అయిన అదనపు విలువను సృష్టించడానికి వినియోగిస్తాడు. ఈ అదనపు విలువే పెట్టుబడిదారీ వర్గపు సంపదకు మూలాధారం.

అదనపు విలువ సిద్ధాంతం మార్క్స్ ఆర్థిక సిద్ధాంతానికి పునాది రాయి.

కార్మికుని శ్రమ సృష్టించిన పెట్టుబడి, చిన్న ఉత్పత్తిదారులను నాశనం చేయడం ద్వారానూ, నిరుద్యోగుల సైన్యాన్ని సృష్టించడం ద్వారానూ కార్మికుణ్ణే అణచివేస్తుంది. పరిశ్రమలో అయితే భారీ స్థాయి ఉత్పత్తి సాధించిన విజయం మనకి వెంటనే కనబడుతోంది, కాని వ్యవసాయ రంగంలో కూడా ఇదే పరిణామం సంభవిస్తోందని గ్రహించాలి. అక్కడ భారీ స్థాయి పెట్టుబడిదారీ వ్యవసాయపు ఆధిక్యత పెరుగుతోంది. యంత్రాల వినియోగం హెచ్చు అవుతోంది, ధన పెట్టుబడి గుప్పెట్లోపడి రైతాంగ ఆర్థిక వ్యవస్థ పతనం చెందుతోంది, వెనుకబడిన వ్యవసాయ పద్ధతుల భారం క్రింద క్రుంగి నాశనం అవుతోంది. సన్నకారు ఉత్పత్తియొక్క క్షయం వ్యవసాయ రంగంలో వివిధ రూపాలను ధరిస్తోంది, కాని అది క్షీణించి పోతోందన్న విషయం మాత్రం నిర్వివాదం.

సన్నకారు ఉత్పత్తిని నాశనం చేయడంద్వారా పెట్టుబడి శ్రామిక ఉత్పాదకతయొక్క పెరుగుదలకూ, బడా పెట్టుబడిదారుల సంఘాలు గుత్తాధిపత్య స్థితిని నెలకొల్పుకోడానికీ దారితీస్తుంది. ఉత్పత్తియే అంతకంతకు ఎక్కువ సామాజికం అవుతుంది — లక్షలాది, కోట్లాది కార్మికులు ఒక క్రమబద్ధమైన ఆర్థిక నిర్మాణంగా కట్టుబాటు అవుతారు — కాని యీ సమిష్టి శ్రమ ఫలితం మాత్రం పిడికెడుమంది పెట్టుబడిదారులచే భుక్తం చేసుకోబడుతుంది. ఉత్పత్తిలో అరాజకత్వం, సంక్షోభాలు, మార్కెట్లకోసం ఉగ్రమైన వేట, జన బాహుళ్యపు ఉనికికే భద్రతలేకపోవడం తీవ్రమైపోతాయి.

కార్మికులు పెట్టుబడిమీద ఆధారపడివుండే స్థితిని అంతకంతకు అధికం చేయడం మూలంగా పెట్టుబడిదారీ విధానం సమైక్య శ్రమయొక్క మహత్తర శక్తిని సృష్టిస్తుంది.

సరకుల ఉత్పత్తిమీద ఆధారపడిన ఆర్థిక వ్యవస్థ అంకుర దశనుంచి, సరళ మారకం దశనుంచి దాని అత్యున్నత రూపాలైన భారీస్థాయి ఉత్పత్తివరకూ పెట్టుబడిదారీ విధానపు అభివృద్ధిని మార్క్స్ వివరించాడు.

పాతవి కొత్తవి, అన్ని పెట్టుబడిదారీ దేశాల అనుభవం అంతకంతకు ఎక్కువ మంది కార్మికులకు ఆయేటి కాయేడు ఈ మార్క్స్ సిద్ధాంతంలోని సత్యాన్ని మరింత కళ్లకు కట్టి నట్టిగా చూపిస్తుంది.

పెట్టుబడిదారీ వ్యవస్థ ప్రపంచమంతటా విజయం పొందింది, కాని యీ విజయం పెట్టుబడిమీద శ్రమశక్తి సాధించబోయే విజయానికి నాంది మాత్రమే.

## III

ఫ్యూడల్ వ్యవస్థ కూలదోయబడి ప్రపంచంలో "స్వేచ్ఛాయుత" పెట్టుబడిదారీ సమాజం రావడంతోనే యీ స్వేచ్ఛ అంటే శ్రామిక ప్రజలను పీడించి దోచుకునే ఒక కొత్త పద్ధతి మాత్రమే అనేది వెంటనే స్పష్టం అయిపోయింది. ఈ పీడనకు ప్రతివర్తనగానూ అసమ్మతి గానూ రకరకాల సోషలిస్టు సిద్ధాంతాలు తక్షణమే తల ఎత్తాయి. కాని ఆదిలో వచ్చిన సోషలిజం ఊహాజనిత సోషలిజంగానే వుండిపోయింది. అది పెట్టుబడిదారీ సమాజాన్ని విమర్శించింది, దానిని ఖండించి తిట్టింది, దాని నాశనాన్ని గురించి అది కలలు కంది, అది ఉత్తమ సమాజ వ్యవస్థ గురించి వూహించింది, దోపిడిచేయడంలో వున్న అవినీతిని గురించి ధనికులకు నచ్చచెప్పి ఒప్పించడానికి ప్రయత్నించింది.

కాని ఊహాజనిత సోషలిజం నిజమైన పరిష్కార మార్గాన్ని చూపించలేకపోయింది. పెట్టుబడిదారీ వ్యవస్థలో వేతన బానిసత్వపు సారం ఏమిటో వివరించలేకపోయింది,

పెట్టుబడిదారీ అభివృద్ధి నియమాలను బైటపెట్టడం గాని ఏ సామాజిక శక్తి నూతన సమాజ సృష్టికర్త కాగల సామర్థ్యం కలిగి వుందో చూపడంగాని చేయలేకపోయింది.

ఇది ఇలా వుండగా ఫ్యూడల్ వ్యవస్థ, భూదాస్య వ్యవస్థ, పతనం చెందిన వెనువెంటనే యూరప్‌లో ప్రతి చోటా, ముఖ్యంగా ఫ్రాన్సులో, వచ్చిన ఉధృతమైన విప్లవాలు, యీ పరిణామానికంతకీ ప్రాతిపదిక, చోదకశక్తి వర్గపోరాటమే అన్న విషయాన్ని అంతకంతకు మరింత స్పష్టంగా బైటపెట్టాయి.

ఫ్యూడల్ వర్గంపై సాధింపబడిన రాజకీయ స్వాతంత్ర్య సంబంధమైన ఏ ఒక్క విజయమూ కూడ తెంపరితనంతో కూడిన ప్రతిఘటనను ఎదుర్కోకుండా లభించలేదు. ఏ ఒక్క పెట్టుబడిదారీ దేశమూ కూడ, పెట్టుబడిదారీ సమాజంలోని వివిధ వర్గాల మధ్య జీవన్మరణ పోరాటంద్వారా తప్ప కొద్దో గొప్పో స్వేచ్ఛాయుత ప్రజాస్వామిక ప్రాతిపదికపై వికసించలేదు.

దీన్నుంచి, ప్రపంచ చరిత్ర బోధించే యీ గుణపాఠాన్ని మొట్టమొదటి సారిగా గ్రహించి, ఆ గుణపాఠాన్ని సుసంగతంగా అన్వయించడంలోనే మార్క్స్ ప్రతిభ వుంది. ఈ గుణపాఠమే వర్గపోరాట సిద్ధాంతం.

ప్రజలు ఎల్లప్పుడూ రాజకీయాలలో వంచనకూ ఆత్మవంచనకూ తెలివి తక్కువగా బలి అవుతూనే వున్నారు, అన్ని నైతిక, మత, రాజకీయ, సాంఘిక పదజాలాల, ప్రకటనల, వాగ్దానాల వెనుక ఏదో ఒక వర్గంయొక్క ప్రయోజనాలు దాగివున్నాయనే విషయాన్ని గ్రహించేటంతవరకూ వారలా బలి అవుతూనే వుంటారు. ప్రతి పురాతన సంస్థా, అది ఎంత అనాగరికమైనది గానూ, కుళ్లిపోయినది గానూ కనబడినప్పటికీ పాలకవర్గాలకు చెందిన కొన్ని శక్తులచే అది నిలబెట్టబడుతోందనే విషయాన్ని గ్రహించకుండా వున్నంతవరకూ సంస్కరణవాదులూ, అభివృద్ధి కాముకులూ పాత వ్యవస్థను సమర్థించే వారిచేత ఎల్లప్పుడూ మోసగించబడుతూనే వుంటారు. ఆ వర్గాల ప్రతిఘటనను పటాపంచలు చేయడానికి ఒకేఒక మార్గం వుంది, అదేమిటంటే మన చుట్టూ వున్న సమాజంలోనే పాతను తుడిచివేసి కొత్తను సృష్టించే సామర్థ్యం గలిగివున్న శక్తులను — సమాజంలో వాటి స్థానాన్ని బట్టి ఆ పని చేసితీరవలసిన శక్తులను — వెలికి తెచ్చి పోరాటంకోసం ఆ శక్తులను విజ్ఞానవంతులను చేసి సంఘటిత పర్చడం.

ఇప్పటివరకూ ఆత్మిక బానిసత్వంలో పడి మగ్గుతూన్న పీడిత వర్గాలన్నీ దానినుంచి బైటపడే మార్గాన్ని శ్రామికవర్గానికి చూపినది మార్క్స్ బోధించిన తాత్విక భౌతికవాదం ఒక్కటే. పెట్టుబడిదారీ విధానపు సాధారణ వ్యవస్థలో శ్రామికవర్గంయొక్క నిజమైన స్థానం ఏదో వివరించినది మార్క్స్ ఆర్థిక సిద్ధాంతం ఒక్కటే.

అమెరికా మొదలు జపానువరకు, స్వీడన్ మొదలు దక్షిణాఫ్రికావరకు, ప్రపంచమంతటా శ్రామికవర్గపు స్వతంత్ర సంఘాలు వృద్ధి అవుతున్నాయి. తన వర్గపోరాటాన్ని సాగించడంద్వారా శ్రామికవర్గం విజ్ఞానాన్నీ వికాసాన్నీ పొందుతోంది; అది బూర్జువా సమాజపు దుర్భ్రమలను వదిలించుకుంటోంది; అది తన శ్రేణులను మరింత సన్నిహితంగా సమీకరించుకుంటోంది, తన విజయాల ప్రమాణాన్ని అంచనావేయడం నేర్చుకుంటోంది; అది తన బలాలను పటిష్టం చేసుకుంటోంది, అప్రతిహతంగా అభివృద్ధి చెందుతోంది.

"ప్రొస్వెశ్చేనియె" 3వ సంచిక
1913 మార్చి

# కార్ల్ మార్క్స
# ఫ్రెడరిక్ ఎంగెల్స్

ప్రారాడు రైత

త్రిగండ చరిత్ర

# కార్ల్ మార్క్స్

## ఫాయెర్‌బాఖ్‌పై సూత్రీకరణలు[10]

### 1

ఇంతకు పూర్వపు భౌతికవాదమంతటిలోనూ – ఫాయెర్‌బాఖ్ భౌతికవాదంతో సహా – వున్న ప్రధానమైన లోపం ఏమిటంటే, వస్తువు, వాస్తవికత, ఇంద్రియావబోధ కేవలం ఒక భౌతిక వస్తువు (objekt) రూపంగానో లేక ధ్యానం రూపంగానో భావించబడిందే గాని మానవుని ఇంద్రియ కార్యకలాపంగా, ఆచరణగా, ఆత్మపరమైనదిగా భావించబడలేదు. కాగా భౌతికవాదానికి భిన్నంగా భావవాదం క్రియాశీల పార్శ్వాన్ని అభివృద్ధి చేసింది, అయితే యీ అభివృద్ధి అనిర్దిష్ట రూపంలో జరిగింది. ఎందుచేతనంటే భావవాదానికి వాస్తవిక, ఇంద్రియ కార్యకలాపం అంటే ఏమిటో తెలియదు. ఫాయెర్‌బాఖ్ ఇంద్రియావబోధిత వస్తువులను ఆలోచనా వస్తువులనుండి భిన్న రూపంలో చూడాలని కోరుతున్నమాట నిజమే, కాని ఆయన మానవ కార్యకలాపాన్ని దానికి అదిగా వస్తుపరమైన కార్యకలాపంగా చూడడు. అందుకనే "క్రైస్తవ మతసారం" అనే తన గ్రంథంలో సైద్ధాంతిక కార్యకలాపమే నిజమైన మానవ కార్యకలాపం అని భావిస్తున్నాడు. కాగా ఆచరణను కేవలం హీనమైన బాహ్య ప్రదర్శనకు సంబంధించినదిగా మాత్రమే భావిస్తున్నాడు, రూఢమొనరుస్తున్నాడు. అందుకనే ఆయన "విప్లవాత్మక," "ఆచరణాత్మక-విమర్శనాత్మక" కార్యాచరణ ప్రాముఖ్యాన్ని అవగాహన చేసుకోలేకపోతున్నాడు.

### 2

మానవుని ఆలోచన వస్తుపరమైన సత్యాన్ని గ్రహించగలదా అన్నది సైద్ధాంతికమైన ప్రశ్న కాదు, అది ఆచరణాత్మకమైన సమస్య. ఆచరణలో మానవుడు యీ సత్యాన్ని నిరూపించాలి. అంటే, ఆలోచనయొక్క వాస్తవికతను, శక్తిని, లౌకిక పార్శ్వాన్ని నిరూపించాలి. ఆచరణనుండి వేరుచెయ్యబడిన ఆలోచనకు వాస్తవికత కలదా లేదా అనే వివాదం, కేవలం వితండ వాదం అవుతుంది.

## 3

మానవులు పరిస్థితులయొక్క, శిక్షణ పెంపకాలయొక్క ఫలితంగా ఏర్పడతారనీ, కనుక మారిన మానవులు మారిన పరిస్థితులయొక్క, మారిన శిక్షణ పెంపకాలయొక్క ఫలితాలనీ చెప్పే భౌతికవాద సిద్ధాంతం, పరిస్థితులను మార్చేది మానవులేనన్న సంగతినీ, స్వయంగా శిక్షకునికే శిక్షణ పొందాల్సిన అవసరమున్నదన్న సంగతినీ విస్మరిస్తోంది. అందుకని యీ సిద్ధాంతం సమాజాన్ని రెండు భాగాలుగా విభజించాలన్న నిర్ధారణకు అనివార్యంగా చేరుకుంటుంది. అందులో ఒక భాగం సమాజానికి అతీతంగా వుంటుంది (ఉదాహరణకు రాబర్ట్ ఓవెన్ చేసింది యిదే).

పరిస్థితులలోను, మానవ కార్యాచరణలోను ఒకేసారిగా మార్పులు రావడాన్ని కేవలం విప్లవాత్మక కార్యాచరణగా భావించాలి, హేతుబద్ధంగా అవగాహనచేసుకోడానికి అదే మార్గం.

## 4

ఫాయెర్‌బాఖ్ మతపరమైన ఆత్మ అన్యధాకరణనుంచి, అంటే, ప్రపంచాన్ని మతపరమైన, ఊహాత్మక ప్రపంచంగానూ, వాస్తవ ప్రపంచంగానూ విభజించడంనుంచి బయలుదేరుతున్నాడు. ఆయన చేసిన పనేమిటంటే, మతపరమైన ప్రపంచాన్ని దాని లౌకిక ప్రాతిపదికలో విలీనం చెయ్యడం. ఈ పని పూర్తిచేశాక ముఖ్యమైన పని ఇంకా అలా మిగిలే వుంటుందన్న యథార్థాన్ని ఆయన గమనించడు. ఎందుకంటే లౌకిక ప్రాతిపదిక తననుండి తాను విడివడి ఆకాశంలో ఒక స్వతంత్ర విభాగంగా విహరిస్తూ వుంటుంది, ఈ యథార్థాన్ని కేవలం యీ లౌకిక ప్రాతిపదికయొక్క ఆత్మ విభజన, ఆత్మ వైరుధ్యాలద్వారా మాత్రమే వివరించాలన్నప్పుడు మొదట లౌకిక ప్రాతిపదికను దాని అంతర్వైరుధ్య స్థితిలో అవగాహనచేసుకోడం అవసరం. తరువాత దాని అంతర్వైరుధ్యాన్ని తొలగించి తద్వారా ఆచరణలో దానిలో విప్లవాత్మక మార్పులు తీసుకురావాలి. ఈవిధంగా, ఎప్పుడైతే ఇహలోక కుటుంబమే పవిత్ర కుటుంబపు పునాది అన్న సంగతిని తెలుసుకుంటామో, అప్పుడిక ఇహలోక కుటుంబాన్ని సైద్ధాంతికంగా విమర్శించి ఆచరణలో విప్లవాత్మకం చెయ్యవలసివుంటుంది.

## 5

ఫాయెర్‌బాఖ్ అనిర్దిష్ట ఆలోచనతో తృప్తిచెందక ఇంద్రియ ధ్యానాన్ని ఆసరాచేసుకుంటున్నాడు. కాని ఆయన ఇంద్రియావబోధను ఆచరణాత్మక మానవ ఇంద్రియ కార్యకలాపంగా భావించడం లేదు.

## 6

ఫాయెర్‌బాఖ్ మత సారాన్ని మానవ సారంగా తేలుస్తున్నాడు. కాని మానవ సారమన్నది ప్రతి వ్యక్తిలోనూ అంతర్గర్భితమై వున్న అనిర్దిష్ట భావనాక్రమ సారం కాదు. వాస్తవ రూపంలో అది సామాజిక సంబంధాల సమాహారం.

ఈ వాస్తవ సారాన్ని విమర్శించ పూనుకోని ఫాయెర్‌బాఖ్, తత్పర్యవసానంగా యీ క్రింది నిర్ణయాలకు రాకతప్పడం లేదు:

1) చారిత్రక క్రమంనుంచి విడగొట్టి మతభావనను అదేదో స్వయంసిద్ధమైన విషయమన్నట్టుగా ప్రతిష్ఠించడం, మానవ వ్యక్తిని అనిర్దిష్ట — విడి — వ్యక్తిగా ముందుగానే వూహించడం;

2) అందుకని, ఆయన దృష్టిలో మానవ సారాన్ని కేవలం ఒక "జీవజాతి" రూపంలో మాత్రమే, అంటే పలువురు వ్యక్తులను కేవలం ప్రకృతిసిద్ధంగా ఐక్యంచేసే అంతర్గర్భిత మూగ సాధారణీకృత రూపంలో మాత్రమే గ్రహించగలం.

## 7

తత్పర్యవసానంగా, ఫాయెర్‌బాఖ్, "మతభావన," దాని మట్టుకు అదే సామాజిక ఉత్పాదితం అన్న సంగతినీ, తాను విశ్లేషిస్తున్న అనిర్దిష్ట వ్యక్తి వాస్తవానికి ఒక ప్రత్యేక సామాజిక రూపానికి చెందుతాడన్న సంగతినీ గ్రహించడు.

## 8

సామాజిక జీవితం ప్రధానంగా ఆచరణశీలమైనది. సిద్ధాంతాన్ని మాయావాదంలోకి పక్కతోవ పట్టించే వైచిత్ర్యాలన్నీ మానవ ఆచరణలోనూ, యీ ఆచరణను అవగాహన చేసుకోడంలోనూ వాటి హేతుబద్ధమైన పరిష్కారాన్ని పొందుతాయి.

## 9

ధ్యానాత్మక భౌతికవాదం, అంటే, ఇంద్రియావబోధను ఆచరణాత్మక కార్యకలాపంగా అర్థం చేసుకోని భౌతికవాదం అందుకున్న అత్యున్నత స్థాయి "పౌర సమాజం"లో విడి వ్యక్తులను "ధ్యానించడం" మాత్రమే.

## 10

పాత భౌతికవాదపు దృక్కోణం "పౌర" సమాజం కాగా కొత్త దాని ప్రాతిపదిక మానవ సమాజం లేక సమాజీకృత మానవజాతి.

తత్వవేత్తలు ఇంతవరకూ ప్రపంచాన్ని రకరకాలుగా వ్యాఖ్యానించారు, కాని అసలు విషయం దాన్ని మార్చడం.

మార్క్స్‌చేత 1845
వసంతకాలంలో రచింపబడింది

మొట్టమొదటిసారిగా ఎంగెల్స్‌చేత
1888లో తన "లుడ్విగ్
ఫొయెర్‌బాఖ్, సాంప్రదాయిక జర్మన్
తత్వశాస్త్రం పరిసమాప్తి" అన్న ప్రత్యేక
ముద్రణకు అనుబంధంగా ప్రచురింపబడింది

# కార్ల్ మార్క్స్, ఫ్రెడరిక్ ఎంగెల్స్

## కమ్యూనిస్టు పార్టీ ప్రణాళిక[11]

### 1872 నాటి జర్మన్ కూర్పుకు ముందుమాట

అంతర్జాతీయ కార్మిక సంఘం ఐన కమ్యూనిస్టు లీగు[12]—ఆనాటి పరిస్థితులలో అది రహస్య సంస్థగా మాత్రమే వుండగలిగింది—పార్టీయొక్క సిద్ధాంత, ఆచరణాత్మక కార్యక్రమాన్ని సవివరంగా ప్రచురణార్థం రచించమని, 1847 నవంబర్‌లో లండన్‌లో జరిగిన మహాసభలో మమ్మల్ని ఆదేశించింది. ఆవిధంగా ఆవిర్భవించింది యీ "ప్రణాళిక." దీని రాతప్రతి ఫిబ్రవరి విప్లవానికి[13] కొద్ది వారాలు ముందుగా, ముద్రణార్థం లండన్ చేరింది. మొదట జర్మన్ భాషలో అచ్చయిన యీ "ప్రణాళిక" అదే భాషలో, జర్మనీ, యింగ్లండు, అమెరికా దేశాల్లో కనీసం పంద్రెండు వేరువేరు కూర్పుల్లో అచ్చయింది. ఇంగ్లీషు భాషలో మొట్టమొదటిసారిగా 1850లో "Red Republican"[14] అనే లండన్ పత్రికలో అచ్చయింది; యీ ఆంగ్లానువాదాన్ని మిస్ హెలెన్ మెక్‌ఫర్లేన్ చేసింది. 1871లో అమెరికాలో కనీసం మూడు భిన్న ఆంగ్లానువాదాలు అచ్చయినాయి. ఫ్రెంచి పాఠం మొదట 1848 జూన్ తిరుగుబాటుకు[15] ముందుగా పారిస్‌లో వచ్చింది; తరువాత యిటీవల "Le Socialiste"[16] అనే న్యూయార్క్ పత్రికలో వచ్చింది. మరొక కొత్త అనువాదం తయారౌతూ వుంది. జర్మన్ భాషలో అచ్చయిన కొద్దిరోజుల్లోనే లండన్‌లో ఒక పోలిష్ పాఠం ప్రచురింపబడింది. 1860లలో జెనీవాలో, ఒక రష్యన్ పాఠం ప్రచురింపబడింది. అది వచ్చిన కొద్ది కాలానికి డేనిష్ భాషలోకి కూడా అనువదింపబడింది.

గత యిరవై ఐదు సంవత్సరాలలో పరిస్థితులు యెంత మారినప్పటికీ, యీ "ప్రణాళిక"లో చెప్పిన సూత్రాలు, మొత్తంమీద, యెప్పటిలాగే సరిగా వున్నాయి. అక్కడక్కడా కొన్ని వివరాలను మెరుగుపరచవచ్చు. సూత్రాలను ఆచరణలో పెట్టడం అనేది, యీ "ప్రణాళిక"లోనే చెప్పినట్లు, సర్వదా, సర్వత్రా ఆనాటి చారిత్రక పరిస్థితులమీద ఆధారపడుతుంది; అందువల్ల 2వ ప్రకరణం చివర ప్రతిపాదించబడిన విప్లవ చర్యలకు ప్రత్యేక ప్రాముఖ్యం యివ్వలేదు. ఆ ఘట్టం యీనాడు రాయవలసివస్తే, అనేక సందర్భాలలో వేరు

విధంగా రాయబడివుండేది. గత యిరవై ఐదు సంవత్సరాలలోనూ ఆధునిక పరిశ్రమ సాధించిన బ్రహ్మాండమైన పురోగతి దృష్ట్యానూ, దానితోపాటు కార్మికవర్గంయొక్క పార్టీ నిర్మాణం గుణంలోనూ, విస్తృతిలోనూ సాధించిన అభివృద్ధి దృష్ట్యానూ, మొదట ఫిబ్రవరి విప్లవంలోనూ, తరువాత రెండు పూర్తి మాసాల కాలం కార్మికవర్గం రాజకీయాధికారం వహించిన పారిస్ కమ్యూన్[17]లో యింకా యెక్కువగా గడించిన అనుభవం దృష్ట్యానూ, యీ కార్యక్రమంలోని కొన్ని వివరాలకు కాలదోషం పట్టింది. ముఖ్యంగా ఒక విషయం పారిస్ కమ్యూన్‌లో రుజువైంది: "అప్పటికి సిద్ధంగా వున్న రాజ్యయంత్రాన్ని (state machinery) కార్మికవర్గం పూరక స్వాధీనం చేసుకొని తన సొంత ప్రయోజనాలకు ఉపయోగించుకోజాలదు" అనే విషయం. (యీ విషయం *The Civil War in France; Address of the General Council of the International Working Men's Association*, London, Truelove, 1871, పుట 15లో విపులీకరించబడింది.*) అంతేగాక, సోషలిస్టు సాహిత్యంమీద చేసిన విమర్శ యీనాడు అసమగ్రమని తెలుస్తూనే వుంది; యెందుకంటే, ఆ విమర్శ 1847వరకు మాత్రమే వర్తిస్తుంది. వివిధ ప్రతిపక్ష పార్టీలపట్ల కమ్యూనిస్టుల వైఖరిని గురించి చెప్పిన అభిప్రాయాలు (4వ ప్రకరణం) కూడా, సిద్ధాంతరీత్యా యిప్పటికీ సరైనవే ఐనప్పటికీ, ఆచరణలో వాటికి కాలదోషం పట్టిందని తెలుస్తూనే వుంది; యెందుకంటే, రాజకీయ సన్నివేశం పూర్తిగా మారిపోయి, మేము పేర్కొన్న రాజకీయ పార్టీలలో అధిక భాగాన్ని చారిత్రక పురోగతి భూమండలంనుండి ఊడ్చి పారవేసింది.

కానీ, యీ "ప్రణాళిక" ఒక చారిత్రక పత్రం అయింది. దీన్ని మార్చడానికి మాకిక యేలాటి హక్కూ లేదు. 1847నుండి యీనాటివరకు జరిగిన కాలాన్ని సమీక్షించే ఉపోద్ఘాతంతో దరిమిలా మరొక కూర్పు వెలువడవచ్చు. ఈ పునర్ముద్రణ అకస్మాత్తుగా జరిగినందువల్ల అందుకు మాకు వ్యవధి దొరకలేదు.

కార్ల్ మార్క్స్, ఫ్రెడరిక్ ఎంగెల్స్

లండన్, జూన్ 24, 1872

# 1890 నాటి జర్మన్ కూర్పుకు ముందుమాట

(కొంత భాగం)

"ప్రణాళిక"కు ఒక సొంత చరిత్ర వుంది. ఇది మొదట వెలువడినప్పుడు, శాస్త్రీయ సోషలిజానికి అగ్రదళంగా వున్నవాళ్లు — అప్పటికింకా వాళ్ల సంఖ్య తక్కువే — దీన్ని ఉత్సా

---

* ఈ సంకలనంలో రెండవ భాగం చూడండి. — సం.

హంతో ఆహ్వానించినారు. (మొదటి ముందుమాటలో పేర్కొన్న అనువాదాలను బట్టి యీ విషయం రుజువౌతుంది*.) తరువాత 1848 జూన్‌లో పారిస్ కార్మికుల ఓటమితో ప్రారంభమైన ప్రగతి వ్యతిరేకత యీ "ప్రణాళిక"ను మరుగుకు నెట్టి, చివరకు 1852 నవంబర్‌లో కొలోన్ కమ్యూనిస్టులను శిక్షించడం ద్వారా[18] "చట్టబద్ధంగా" దీన్ని బహిష్కరించింది. ఫిబ్రవరి విప్లవంతో ప్రారంభమైన కార్మికోద్యమం సాంఘిక రంగంనుండి అదృశ్యం కావడంతో "ప్రణాళిక" కూడా మరుగుకు పోయింది.

యూరప్‌లోని కార్మికవర్గం పాలకవర్గాల అధికారంమీద కొత్త దాడి చేయడానికి తగిన బలం మళ్లీ సమకూర్చుకొన్నప్పుడు అంతర్జాతీయ కార్మిక సంఘం (ఇంటర్నేషనల్) అవతరించింది. యూరప్ అమెరికాలలోని సమరశీల కార్మికవర్గాన్నంతటినీ ఏకైక మహా సైన్యంగా ఐక్యం చేయడమే దాని లక్ష్యం. కాబట్టి "ప్రణాళిక"లోని సూత్రాలను ప్రాతిపదికగా తీసుకోవడం దానికి సాధ్యంకాలేదు. ఇంగ్లీషు ట్రేడ్ యూనియన్లకూ, ఫ్రాన్సు, బెల్జియం, ఇటలీ, స్పెయిన్ దేశాలలోని ప్రూడన్ అనుయాయులకూ, జర్మనీలోని లాసాల్ అనుయాయులకూ** ప్రవేశం నిరాకరించనిదిగా దాని (ఇంటర్నేషనల్‌యొక్క) కార్యక్రమం తప్పక వుండవలసి వచ్చింది. ఈ కార్యక్రమాన్ని — ఇంటర్నేషనల్ నిబంధనల ప్రవేశిక (preamble)ను — బకూనినూ, అరాజకవాదులూ కూడా ప్రశంసించేటంతటి ప్రజ్ఞతో మార్క్సు రచించినాడు. సమైక్య చర్యల ద్వారానూ, చర్చల ద్వారానూ తప్పనిసరిగా అభివృద్ధి చెందే కార్మికవర్గ మేధాసంపదమీద మాత్రమే సంపూర్ణంగా ఆధారపడినాడు మార్క్సు "ప్రణాళిక"లోని భావాల అంతిమ విజయానికి. పెట్టుబడిమీద చేసే పోరాటంలో జరిగే ఘటనలూ, యెగుడుదిగుడులూ — విజయాలకంటె అపజయాలే యెక్కువగా కూడా — వాళ్ల సర్వరోగ నివారిణులు గతంలో పూర్ణ ఫలితాలు యివ్వలేదని కార్మిక వీరులకు తప్పనిసరిగా నిరూపించి, కార్మిక విమోచనకు గల అసలు నియమాలను ఆమూలాగ్రంగా అర్థంచేసుకోడానికి తప్పనిసరిగా వాళ్ల మనస్సులను మరింత అనుకూలంగా మారుస్తాయి. మార్క్సు అనుకున్నట్లే జరిగింది కూడా. 1874లో ఇంటర్నేషనల్ విచ్ఛిత్తి పొందిన నాటి కార్మికవర్గం

---

* ఈ పుస్తకంలో 39వ పేజి చూడండి. — సం.

** తాను మార్క్సు "శిష్యు"డ్నని లాసాల్ స్వయంగా మాతో యెల్లప్పుడూ చెప్పేవాడు; అదేవిధంగా "ప్రణాళిక"కు కట్టుబడి వుండినాడు. కానీ అతని అనుచరులలో కొందరు అందుకు భిన్నంగా వుండినారు. వాళ్లు ప్రభుత్వ రుణాల తోడ్పాటుతో ఉత్పత్తిదార్ల సహకార సంస్థలు యేర్పడాలనే లాసాల్ డిమాండును దాటిపోలేదు. వాళ్లు కార్మికవర్గాన్నంతటినీ ప్రభుత్వ సహాయవాదులుగానూ, స్వయం సహాయవాదులుగానూ చీల్చినారు. (ఎంగెల్స్ వివరణ.)

1864లో ఇంటర్నేషనల్ స్థాపన నాటి కార్మికవర్గంకంటె పూర్తి భిన్నంగా వుండింది. లాటిన్ దేశాలలో* ప్రూడన్‌వాదమూ, జర్మనీలో ఆ ప్రత్యేకమైన లాసాల్‌వాదమూ అంతరిస్తూ వుండినాయి; యింగ్లండులోని అపర మితవాద ట్రేడ్ యూనియన్లు అప్పటికే క్రమంగా యే దశకు చేరుకుంటూ వుండినాయంటే, 1887లో వాటి అధ్యక్షుడు** స్వాన్‌సీ మహాసభలో వాటి తరఫున మాట్లాడుతూ "యూరపియన్ భూఖండంలోని సోషలిజం మమ్మల్నిక భయపెట్టదు" అని అనగలిగిన దశకు. కానీ, 1887 నాటికి యూరపియన్ భూఖండంలోని సోషలిజం దాదాపు కల్తీలేని రూపంలో "ప్రణాళిక" ప్రతిపాదించిన సిద్ధాంతమే. కాబట్టి 1848 నాటినుండి జరిగిన ఆధునిక కార్మికవర్గ ఉద్యమ చరిత్రను "ప్రణాళిక" చరిత్ర కొంతవరకు ప్రతిబింబిస్తుంది. ఈనాడు నిస్సందేహంగా యీ "ప్రణాళిక" సోషలిస్టు సాహిత్యంలోకెల్ల అత్యంత విస్తృత వ్యాప్తిగల అత్యంత అంతర్జాతీయ గ్రంథం, సైబీరియానుండి కలిఫోర్నియావరకు సకల దేశాలలోనూ గల లక్షోపలక్షల కార్మికుల సమష్టి కార్యక్రమం.

ఐనా, యిది వెలువడినప్పుడు మేము దీన్ని సోషలిస్టు ప్రణాళిక అని అనగలిగి వుండేవాళ్లం కాదు. 1847లో రెండు రకాల మనుషులు సోషలిస్టులుగా చలామణి అయ్యేవాళ్లు. ఒక రకం మనుషులు వివిధ ఊహాస్వర్గ విధానాలను అనుసరించేవాళ్లు: ముఖ్యంగా యింగ్లండులో ఓవెనైట్లూ, ఫ్రాన్సులో ఫోరియరిస్టులూ; యీ ఉభయులూ ఆనాటి కప్పటికే కేవలం ముఠాలుగా క్షీణించి క్రమంగా అంతరిస్తూ వుండినారు. రెండవ రకం మనుషులు పెట్టుబడికి గానీ, పెట్టుబడిదార్ల లాభాలకు గానీ యేమాత్రమూ హాని కలిగించకుండా, రకరకాల సర్వరోగ నివారిణుల ద్వారాను, అడ్డమైన అతుకుల పద్ధతుల ద్వారానూ సామాజిక అన్యాయాలను తొలగించాలనుకునే అనేక రకాల సామాజిక దొంగవైద్యులు. యీ రెండు రకాల వాళ్లూ కార్మికోద్యమంతో సంబంధం లేకుండా వుంటూ, "విద్యావంతు"లైనవాళ్ల తోడ్పాటే యెక్కువగా కోరేవాళ్లు. కానీ, కేవల రాజకీయ విప్లవాలు చాలవనే దృఢ విశ్వాసంతో, సమూలమైన సమాజ పునర్నిర్మాణం కావాలని డిమాండు చేసే ఒక భాగం కార్మికులు మాత్రమే ఆనాడు కమ్యూనిస్టులమని చెప్పుకునేవాళ్లు. అప్పటికింకా అది స్పష్టమైన రూపం పొందకుండానూ, కేవలం సద్యోజనితం (instinctive) గానూ, తరుచుగా కొంచెం మోటుగానూ వుండిన కమ్యూనిజం. ఐనా, రెండు రకాల ఊహాస్వర్గ కమ్యూనిస్టు సిద్ధాంతాల పుట్టుకకు — ఫ్రాన్సులో కాబే "ఇకేరియన్" కమ్యూనిజమూ, జర్మనీలో వైట్లిం

---

* స్పెయిన్, పోర్చుగల్, ఫ్రాన్సు, బెల్జియం వగైరా దేశాలను లాటిన్ దేశాలంటారు. ఆ దేశాల భాషలు లాటిన్ భాషనుండి పుట్టినవి గనుక. — అను.

** డబ్లియు. బీవెన్. — సం.

గుదీ — యీ రెంటి పుట్టుకకూ కారణమయ్యేటంత బలీయంగా వుండింది ఆనాటి కమ్యూనిజం. 1847లో సోషలిజమంటే బూర్జువా ఉద్యమం, కమ్యూనిజమంటే కార్మికోద్యమం. సోషలిజం కనీసం యూరప్ భూఖండంలో గౌరవనీయంగా వుండింది; కానీ కమ్యూనిజం అందుకు పూర్తిగా విరుద్ధం. మరి, "కార్మికుల విమోచన కార్మికవర్గమే సాధించవలసిన కార్యం" అనేది ఆనాటికే మా దృఢమైన అభిప్రాయం గనుక, ఆ రెండు పేర్లలో యేది యెన్నుకోవాలనే విషయంలో మాకు యే సంకోచమూ వుండజాలకపోయింది. ఆ తర్వాత ఆ పేరును నిరాకరించాలనే ఆలోచన కూడా మాకెప్పుడూ రాలేదు.

"సకల దేశాల కార్మికులారా, యేకం కండి!" నలభై రెండు సంవత్సరాల క్రితం, కార్మికవర్గం తన సొంత డిమాండ్లతో ముందుకువచ్చిన మొదటి పారిస్ విప్లవం జరగబోయే ముందు,[19] మేము పై మాటలు ప్రపంచం యెదుట ఉద్ఘాటించినప్పుడు బహు కొద్దిమంది మాత్రమే మాతో గొంతు కలిపినారు. కానీ, 1864 సెప్టెంబర్ 28న అత్యధిక భాగం పశ్చిమ యూరపియన్ దేశాలలోని కార్మికులు యేకమై, యశోదీప్తమైన "అంతర్జాతీయ కార్మిక సంఘం" (మొదటి ఇంటర్నేషనల్)గా యేర్పడినారు. ఇంటర్నేషనల్ తొమ్మిదేండ్లు మాత్రమే బతికినమాట నిజమే. కానీ అది సృష్టించిన సకల దేశాల కార్మికుల శాశ్వత ఐక్యత యింకా సజీవంగా, యెప్పుడూ లేనంత బలీయంగా కూడా, వుంది; దీనికి యీనాడున్న పరిస్థితే అన్నిటినీ మించిన సాక్ష్యం. యెందుకంటే యీనాడు,[20] నేను యీ మాటలు రాస్తున్న తరుణంలో, యూరప్ అమెరికాలలోని కార్మికవర్గం మొట్టమొదటి సారిగా <u>ఒకే</u> జండా కింద, <u>ఒకే</u> లక్ష్యంకొరకు, <u>ఒకే</u> సైన్యంగా సమీకరింపబడిన తన సైనిక బలాలను సమీక్షించుకుంటూ వుంది. ఆ ఒకే లక్ష్యం యేదంటే, 1866లో ఇంటర్నేషనల్‌యొక్క జెనీవా మహాసభలోనూ, మళ్లీ 1889లో పారిస్ కార్మికుల మహాసభలోనూ ఉద్ఘాటింపబడినట్లు, యెనిమిది గంటల పనిదినాన్ని శాసనబద్ధం చేసి, ప్రామాణిక పనిదినంగా చేయడం. ఈనాటి దృశ్యం సకల దేశాల పెట్టుబడిదార్లకూ భూస్వాములకూ కండ్లు తెరిపించి, సకల దేశాల కార్మికులూ నిజంగానే ఐకమత్యంగా వున్నారనే విషయం చూస్తుంది.

ఈ దృశ్యం కండ్లారా చూడడానికి మార్క్స్ నా పక్కన వుంటే!

యఫ్. ఎంగెల్స్

లండన్, మే 1, 1890

# కమ్యూనిస్టు పార్టీ ప్రణాళిక

యూరప్‌ను ఒక భూతం ఆవహించింది — కమ్యూనిజం అనే భూతం. ఈ భూతాన్ని ఉచ్చాటన చేయడానికి అటు పోపూ యిటు జారూ, అటు మెటర్నిక్ యిటు గిజో, అటు ఫ్రెంచి రాడికల్ పార్టీవాళ్లూ, యిటు జర్మన్ పోలీసు గూఢచారులూ — పురాతన యూరప్‌లోని అధికార శక్తులన్నీ — ఒక పవిత్ర కూటమిగా యేర్పడినాయి.

అధికారంలో వున్న పార్టీచేత కమ్యూనిస్టులని తిట్లు తినని ప్రతిపక్ష పార్టీ యెక్కడైనా వుందా? ప్రతిపక్షంలో వున్న పార్టీ అదే తిట్లను తనకంటె పురోగాములైన యితర ప్రతి పక్ష పార్టీలమీదా, ప్రగతి వ్యతిరేకులైన తన శత్రువులమీదా విసరకుండా యెక్కడైనా వుందా?

దీన్ని బట్టి రెండు విషయాలు స్పష్టమౌతున్నాయి.

కమ్యూనిజమే స్వయంగా ఒక శక్తి అని యిప్పటికే యూరపియన్ శక్తులన్నీ గుర్తించినాయి.

కమ్యూనిస్టులు తమ అభిప్రాయాలనూ, తమ లక్ష్యాలనూ, తమ ధోరణులనూ బాహాటంగా, యావత్ ప్రపంచం యెదుటా ప్రకటించి, కమ్యూనిస్టు భూతమనే యీ కట్టుకథను తమ పార్టీ ప్రణాళికతోనే యెదుర్కోవలసిన సమయం ఆసన్నమైంది.

యీ ఉద్దేశంతో వివిధ జాతుల కమ్యూనిస్టులు లండన్‌లో సమావేశమై, ఇంగ్లీషు, ఫ్రెంచి, జర్మన్, ఇటాలియన్, ఫ్లెమిష్, డేనిష్ భాషల్లో ప్రచురించడానికి యీ "ప్రణాళిక"ను రచించినారు.

# I

## బూర్జువాలూ — కార్మికులూ*

ఇంతవరకు నడచిన సమాజపు చరిత్ర** అంతా వర్గపోరాటాల చరిత్రే.

[పురాతన కాలపు] స్వతంత్ర పౌరుడూ, బానిసా — [రోమన్ కాలపు] పాలక వర్గీయుడూ, సామాన్యుడూ — [ఫ్యూడల్ యుగపు] భూస్వామ్య ప్రభువూ, భూదాసుడూ — [మధ్య యుగాల నాటి] వృత్తి సంఘ మేస్త్రీ*** వృత్తి సంఘ కార్మికుడూ — ఒక్క మాటలో చెప్పాలంటే పీడకుడూ పీడితుడూ యెల్లప్పుడూ పరస్పర శత్రువులుగా నిలబడి, ఒకప్పుడు ప్రచ్ఛన్నంగానూ,

---

* బూర్జువాలు అంటే సమాజపు ఉత్పత్తి సాధనాల సొంతదార్లూ, యితరులచేత వేతన శ్రమ చేయించుకునేవాళ్లూ ఐన ఆధునిక పెట్టుబడిదార్లు. కార్మికులు అంటే సొంత ఉత్పత్తి సాధనాలు లేనందువల్ల, బతకడానికి తమ శ్రమశక్తిని యితర్లకు అమ్ముకో వలసిన కూలివాళ్లు. (1888 నాటి యింగ్లీషు కూర్పుకు ఎంగెల్స్ వివరణ.)

** చరిత్ర అంటే లిఖిత చరిత్ర మాత్రమే. 1847లో సమాజపు పూర్వచరిత్ర, అంటే లిఖిత చరిత్రకు పూర్వ సామాజిక నిర్మాణం గురించి దాదాపుగా ఏమీ తెలియదు. ఆతరువాత, హక్స్తహౌసెన్ రష్యాలో భూమి సమష్టి ఆస్తిగా ఉండేదని కనుగొన్నాడు, అదే అన్ని టిటానిక్ తెగల చారిత్రకాభివృద్ధిలోనూ సామాజిక మూలంగా ఉండేదని మౌరెర్ రుజువు చేశాడు. దరిమిలా గ్రామీణ సమాజం ఇండియానుండి ఐర్లండ్‌వరకు అన్ని చోట్లా ఆదిమసమాజరూపంగా ఉండేదని కనుగొనబడింది. యీ ఆదిమ కమ్యూనిస్టు సమాజపు అంతర్గత నిర్మాణాన్ని దాని లాక్షణిక రూపంలో వెల్లడించి, గణ స్వభావాన్నీ, తెగతో దాని సంబంధాన్నీ మోర్గన్ వివరించాడు. ఆ ఆదిమ గ్రామీణసమాజ విచ్ఛిత్తితో సమాజం, ప్రత్యేక వర్గాలుగా, చివరకు శత్రుత్వవైరుధ్యాపూరిత వర్గాలుగా విడివడనారంభిస్తుంది. యీ విచ్ఛిత్తిక్రమాన్ని నేను "Der Ursprung der Familie, des Privateigentums und des Staats," 2. Aufl., Stuttgart, 1886 ["కుటుంబం, సొంత ఆస్తి, రాజ్యాల ఆవిర్భావం" — ఈ సంకలనంలో మూడవ భాగం చూడండి] అనే గ్రంథంలో పరిశీలించడానికి ప్రయత్నించాను. (1888 నాటి యింగ్లీషు కూర్పుకు ఎంగెల్స్ వివరణ.)

*** వృతి సంఘ మేస్త్రీ (guild-master) — వృత్తి సంఘంలో పూర్తి హక్కులుగల సభ్యుడు; వృత్తి సంఘంలోని ఒక యజమాని, కానీ దాని అధిపతి కాదు. (1888 నాటి యింగ్లీషు కూర్పుకు ఎంగెల్స్ వివరణ.)

మరొకప్పుడు బాహాటంగానూ, నిరంతరాయంగా పోరాటం చేస్తూ వచ్చినారు; యీ పోరాటపు పర్యవసానంగా ఒకోసారి మొత్తం సమాజం విప్లవాత్మక పునర్నిర్మాణానికి లోనయ్యేది, ఒకోసారి ప్రత్యర్థి వర్గాలు రెండూ నాశనమయ్యేవి.

చరిత్రయొక్క మొదటి యుగాల్లో దాదాపు ప్రతిచోటా మానవ సమాజం వివిధ తరగతులుగా, తరతమ భేదాలుగల అనేక సాంఘిక అంతస్తులుగా, క్లిష్టమైన పద్ధతిలో విభజింపబడి వుండేది. పురాతన రోమ్‌లో పాలక వర్గీయులూ, వీరవర్గమూ, సామాన్యులూ, బానిసలూ వుండినారు; మధ్య యుగాలలో ఫ్యూడల్ ప్రభువులూ, పరాధీన రైతులూ, వృత్తి సంఘ మేస్త్రీలూ, వృత్తి సంఘ కార్మికులూ, అప్రెంటిస్‌లూ, ఫ్యూడల్ దాసులూ వుండినారు; దాదాపు ప్రతి వర్గంలోనూ మళ్లీ తరతమ భేదాలు వుండినాయి.

ఫ్యూడల్ సమాజపు శిథిలాలనుండి ఉద్భవించిన ఆధునిక బూర్జువా సమాజం వర్గ వైరుధ్యాలను నిర్మూలించలేదు. అది చేసిందల్లా పాత వర్గాలకు బదులు కొత్త వర్గాలనూ, పాత దమన పద్ధతులకు బదులు కొత్త దమన పద్ధతులనూ, పాత పోరాట రూపాలకు బదులు కొత్త పోరాట రూపాలనూ నెలకొల్పడం మాత్రమే.

కానీ, బూర్జువా యుగం అనబడే యీ మన యుగానికి ఒక విశిష్టమైన లక్షణం వుంది: అది వర్గ వైరుధ్యాలను సరళం చేసింది. అంతకంతకూ మొత్తం సమాజమంతా బూర్జువావర్గం, కార్మికవర్గం అనే రెండు మహత్తర శత్రు శిబిరాలుగా, పరస్పరాభిముఖాలైన రెండు పెద్ద వర్గాలుగా చీలిపోతున్నది.

మధ్య యుగాల్లోని ఫ్యూడల్ భూదాసులనుండి తొలి పట్టణాలలోని శాసనరక్షిత స్వతంత్ర పౌరులు ఉద్భవించినారు. యీ స్వతంత్ర పౌరులనుండే తొలి బూర్జువాలు అభివృద్ధి చెందినారు.

అమెరికా ఖండ ఆవిష్కరణతోనూ, ఆఫ్రికా ఖండాన్ని చుట్టుకొనిపోయే సముద్రమార్గం కనిపెట్టడంతోనూ అప్పుడప్పుడే తలయెత్తుతున్న బూర్జువావర్గానికి మంచి అవకాశాలు లభించినాయి. హిందూ మహాసముద్రంలోని దేశాలలోనూ, చైనాలోనూ వున్న మార్కెట్లూ, అమెరికాలో తెల్లవాళ్లు స్థిరపడడమూ, వలస దేశాలతో వర్తకమూ, మొత్తం సరుకులూ డబ్బూ యెక్కువ కావడమూ, యివన్నీ వాణిజ్యానికీ, సముద్రయానానికీ, పరిశ్రమలకూ కనివిని యెరగని వూపు యిచ్చినాయి. తత్ఫలితంగా పతనోన్ముఖమైన ఫ్యూడల్ సమాజంలోని విప్లవ శక్తులు వేగంగా అభివృద్ధి చెందినాయి.

ఫ్యూడల్ పారిశ్రామిక వ్యవస్థలో, కొత్తవాళ్లకు ప్రవేశంలేని వృత్తి సంఘాలకు పారిశ్రామిక ఉత్పత్తిమీద గుత్తాధిపత్యం వుండింది; కొత్త మార్కెట్లయొక్క పెరుగుతున్న అవసరాలను ఆ వ్యవస్థ యిక యెంత మాత్రం తీర్చలేకపోయింది. దాని స్థానంలో కార్ఖానా వ్యవస్థ వచ్చింది. కార్ఖానాద్వారా ఉత్పత్తి సాగించే మధ్యతరగతి వచ్చి వృత్తి సంఘ

మేస్త్రీలను పక్కకు నెట్టివేసింది; ప్రతి కార్ఖానాలోనూ శ్రమ విభజన ప్రవేశించడంతో వివిధ వృత్తి సంఘాల మధ్య వుండిన శ్రమ విభజన అంతరించింది.

ఈలోగా మార్కెట్లు విస్తరిస్తూనే వుండినాయి, సరుకులకు గిరాకీ పెరుగుతూనే వుండింది. కార్ఖానాల ఉత్పత్తి కూడా చాలలేదు. అప్పుడు ఆవిరి యింజన్లూ, యంత్రాలూ వచ్చి పారిశ్రామిక ఉత్పత్తిలో విప్లవాత్మకమైన మార్పు తెచ్చినాయి. కార్ఖానాలు పోయి వాటి స్థానంలో బ్రహ్మాండమైన ఆధునిక పరిశ్రమలు వచ్చినాయి; పారిశ్రామిక మధ్యతరగతి పోయి వాళ్ల స్థానంలో పారిశ్రామిక కోటీశ్వరులు — కార్మిక సైన్యాలమీద అధిపతులు — ఆధునిక బూర్జువాలు — వచ్చినారు.

ఆధునిక పరిశ్రమ ప్రపంచ మార్కెట్‌ను స్థాపించింది; అమెరికా ఆవిష్కరణ దీనికి బాట వేసింది. ఈ ప్రపంచ మార్కెట్‌ద్వారా వాణిజ్యమూ, సముద్రయానమూ, భూమార్గాలూ అపారంగా అభివృద్ధి ఐనాయి. వీటి అభివృద్ధి తిరిగి పరిశ్రమల విస్తరణకు కారణమయింది. ఈవిధంగా పరిశ్రమలూ, వాణిజ్యమూ, సముద్రయానమూ, రైల్వేలూ విస్తరించే కొద్దీ, అదే నిష్పత్తిలో బూర్జువావర్గమూ అభివృద్ధి అయింది, దాని పెట్టుబడీ పెరిగింది, మధ్య యుగాలనుండి వచ్చిన ప్రతి వర్గమూ వెనక్కి నెట్టివేయబడింది.

కాబట్టి, ఆధునిక బూర్జువావర్గమనేదే దీర్ఘకాలిక అభివృద్ధి ఫలితంగా యేర్పడిందనీ, ఉత్పత్తి విధానాల్లోనూ మారకపు విధానాల్లోనూ జరిగిన అనేక విప్లవాల పర్యవసానమనీ మనకు అర్థమౌతున్నది.

బూర్జువావర్గం అభివృద్ధి ఐనప్పుడు తదనుగుణంగా అది అడుగడుగునా రాజకీయంగా కూడా పురోగమించింది. ఒకప్పుడు ఫ్యూడల్ పెత్తనంకింద దమిత వర్గంగా వుండిన బూర్జువావర్గం — తరువాత మధ్యయుగపు కమ్యూన్లలో* సాయుధ స్వయంపరిపాలక సంఘాలుగా వుండిన బూర్జువావర్గం — అటు తర్వాత (ఇటలీలోనూ, జర్మనీలోనూ వున్నట్లు) స్వతంత్ర నగర రిపబ్లిక్కులుగానో, లేక (ఫ్రాన్సులో వున్నట్లు) రాచరిక ప్రభుత్వం కింద పన్నులు చెల్లించే "మూడవ అంతస్తు"గానో వుండిన బూర్జువావర్గం — ఆ తర్వాత, కార్ఖానాలు స్థిరపడిన కాలంలో, ప్రభువర్గానికి వ్యతిరేకంగా అర్ధ ఫ్యూడల్ రాచరికాలకూ నిరంకుశ రాచరికాలకూ తోడ్పడుతూ, వాస్తవానికి పెద్దపెద్ద రాచరికాల కన్నిటికీ మూల

---

* మధ్యయుగపు ఫ్రాన్సులో శైశవదశలో వుండిన పట్టణాలకు కమ్యూన్‌లు అని పేరు. ఆ పట్టణాలు తమ యజమానులైన ఫ్యూడల్ ప్రభువులతో పోరాడి స్థానిక స్వపరిపాలనా, "మూడవ అంతస్తు"గా రాజకీయ హక్కులూ సంపాయించుకోకముందే, వాటికి కమ్యూన్‌లు అనే పేరు వచ్చింది. స్థూలంగా, బూర్జువావర్గంయొక్క ఆర్థిక అభివృద్ధికి యింగ్లండును ఆదర్శ ప్రతినిధిగానూ, దాని రాజకీయ అభివృద్ధికి ఫ్రాన్సును ఆదర్శ ప్రతినిధిగానూ తీసుకున్నాము. (1888 నాటి యింగ్లీషు కూర్పుకు ఎంగెల్స్ వివరణ.)

స్తంభంగా వుండిన బూర్జువావర్గం — ఆ బూర్జువావర్గమే చివర కీనాడు, ఆధునిక పరిశ్రమలూ ప్రపంచ మార్కెట్టూ యేర్పడినప్పటినుండీ, ఆధునిక ప్రజా ప్రాతినిధ్యపు రాజ్యంలో రాజకీయ గుత్తాధికారం సాధించుకొంది. ఆధునిక రాజ్యంలో ప్రభుత్వం అనేది మొత్తం బూర్జువావర్గపు సమష్టి వ్యవహారాలు చక్కబెట్టే కమిటీ మాత్రమే.

చారిత్రకంగా బూర్జువావర్గం అత్యంత విప్లవకరమైన పాత్ర నిర్వహించింది.

బూర్జువావర్గంది పైచేయి అయిన చోటల్లా అది సకల ఫ్యూడల్ సంబంధాలనూ, సకల పితృస్వామిక సంబంధాలనూ, సకల నిష్కపట జానపద సంబంధాలనూ నిర్మూలించింది. మానవుణ్ని ''జన్మతః తనకంటె అధికులైన వాళ్ల''కు ముడివేసిన కలగాపులగపు ఫ్యూడల్ సంబంధాలను బూర్జువావర్గం నిర్దయగా పటాపంచలు చేసి, మనిషికీ మనిషికీ మధ్య నగ్నమైన స్వలాభం తప్ప, కిరాతకమైన ''డబ్బు లావాదేవీ'' తప్ప, యిక యే సంబంధాన్నీ మిగుల నివ్వలేదు. మతావేశంవల్లా, రణోత్సాహంవల్లా, మూర్ఖపు మమకారంవల్లా కలిగే అలౌకిక ఆనందా లన్నిటినీ అది స్వలాభమనే కత్తితో ఖండించి వేసింది. అది మనిషి విలువను రూపాయల్లోకి మార్చింది; రాజ శాసనాలు ప్రసాదించిన అసంఖ్యాకమైన సుస్థిర స్వాతంత్ర్యాలను అంతమొందించి, వాటికి బదులు ''వ్యాపార స్వాతంత్ర్యం'' అనే ఏకైక ముష్కర స్వాతంత్ర్యాన్ని నెలకొల్పింది. ఒక్క మాటలో చెప్పాలంటే, బూర్జువావర్గం మత రాజకీయ భ్రమల ముసుగుచాటున జరిగే దోపిడీని తొలగించి, దాని స్థానంలో నగ్న, లజ్జారహిత, ప్రత్యక్ష, పాశవిక దోపిడీని నిలిపింది.

గతంలో ప్రజల భక్తి గౌరవాలకు పాత్రమైన వృత్తుల నన్నిటినీ బూర్జువావర్గం నీచ స్థాయికి తీసుకవచ్చింది. వైద్యులనూ, న్యాయవాదులనూ, కవులనూ, శాస్త్రవేత్తలనూ అది తనకింద కూలికి పనిచేసే వేతన శ్రామికులుగా మార్చివేసింది.

బూర్జువావర్గం కుటుంబ వ్యవస్థమీద వున్న మమకారాల మేలిముసుగును లాగిపారవేసి, కుటుంబ సంబంధాలను కేవలం ఆర్థిక సంబంధాలుగా దిగజార్చింది.

మధ్య యుగాలనాటి పశుప్రాయమైన కార్యోత్సాహం సనాతనవాదుల ప్రశంసలు పొంద వచ్చుగానీ, దానివెంట, దానికి సరిగ్గా తగిన అనుబంధంగా, పరమ సోమరితనపు నిష్క్రియా పరత్వం కూడా యేవిధంగా వుండిందీ బూర్జువావర్గం వెల్లడి చేసింది. అది మానవుని కార్యశీలత యెంతెంత పనులు సాధించ గలిగేదీ మొట్టమొదటిసారిగా వెల్లడించింది. ఈజిప్టు పిరమిడ్లనూ, రోమన్ కాలువలనూ, గాథిక్ దేవాలయాలనూ తలదన్నే అద్భుత కార్యాలు అది సాధించింది; ఆదిమజాతుల సామూహిక వలస ప్రయాణాలనూ, మత దండ యాత్రలనూ[21] మరపించే మహాయాత్రలు అది నిర్వహించింది.

ఉత్పత్తి సాధనాలలో నిరంతరం విప్లవం తేకుండా బూర్జువావర్గం జీవించలేదు; ఆ విప్లవ ఫలితంగా ఉత్పత్తి సంబంధాలలోనూ, తన్మూలంగా యావత్తు సామాజిక సంబంధాల

లోనూ నిరంతరం విప్లవం తేకుండా బూర్జువావర్గం జీవించలేదు. ఇందుకు భిన్నంగా, పాత ఉత్పత్తి విధానాలను చెక్కుచెదరకుండా కాపాడుకోవడమే పూర్వ యుగాలలోని సకల పారిశ్రామిక వర్గాలకూ బతకడానికి మొదటి షరతు. ఉత్పత్తిలో నిత్య విప్లవమూ, సాంఘిక పరిస్థితులలో నిరంతర కల్లోలమూ, అనంతమైన అనిశ్చితత్వమూ, ఆందోళనా — యీ గుణాలవల్ల బూర్జువా యుగం యితర యుగాలకంటె విలక్షణంగా వుంది. స్థిరపడి ఘనీభవించిన సంబంధాలు అన్నీ, వాటిని అంటిపెట్టుకొని వుండే పురాతన పూజ్య అభిప్రాయ దురభిప్రాయాలు అన్నీ కొట్టుకపోయినాయి; కొత్తగా యేర్పడే సంబంధాలు స్థిరపడకముందే పాతబడి పనికిమాలినవై పోతున్నాయి. గట్టిదనుకున్నదంతా కరిగి గాలిలో కలిసిపోతున్నది, పవిత్ర మనుకున్నదంతా మైలపడిపోతున్నది. చివరకు మానవుడు భ్రమలు తొలగించుకొని తన నిజమైన జీవన పరిస్థితులనూ, తోటి మానవులతో తనకుగల సంబంధాలనూ యెదుర్కోక తప్పలేదు. బూర్జువావర్గం ఉత్పత్తిచేసే సరుకులకు నిత్యం విస్తరించే మార్కెట్ కావాలి గనుక, ఆ అవసరం ఆ వర్గాన్ని ప్రపంచపు నలుమూలలకూ తరుముతుంది. ఆ వర్గం అన్నిచోట్లా గూడుకట్టుకోవాలి, అన్నిచోట్లా స్థిర నివాసం యేర్పరచుకోవాలి, అన్నిచోట్లా సంబంధాలు నెలకొల్పుకోవాలి.

బూర్జువావర్గం ప్రపంచ మంతటినీ తన మార్కెట్‌గా చేసుకోవడంద్వారా ప్రతి దేశంలోనూ సరుకుల ఉత్పత్తికీ, సరుకుల వినియోగానికీ జాతి అతీత స్వభావం కల్పించింది. సనాతన వాదులకు మనఃక్షోభ కలిగేటట్లుగా అది పరిశ్రమల కాళ్లకింది జాతీయ పునాదిని తొలగించి వేసింది. పురాతన కాలంలో స్థాపించబడిన జాతీయ పరిశ్రమలన్నీ నాశనమైనాయి; యింకా యేమైనా మిగిలి వుంటే అవి రోజురోజుకూ నాశనమౌతున్నాయి. వాటి స్థానంలో కొత్త పరిశ్రమలు వస్తున్నాయి, సకల నాగరిక జాతులకూ జీవన్మరణ సమస్యఐన పరిశ్రమలు, దేశీయ ముడి పదార్థాలను గాక దూరాతిదూర ప్రాంతాల ముడి పదార్థాలను వినియోగించుకునే పరిశ్రమలు, ఉత్పత్తి అయ్యే సరుకులు స్వదేశంలోనే గాక ప్రపంచపు నలుమూలలా అమ్మకమయ్యే పరిశ్రమలు. పాతకాలపు అవసరాలు స్వదేశపు ఉత్పత్తులతోనే తీరేవి; వాటి స్థానంలో కొత్త అవసరాలు వచ్చి, దేశాంతర ఖండాంతర వస్తువులు అవసరమైనాయి. గతంలో వివిధ ప్రాంతాలూ, వివిధ జాతులూ దేనిపాటికది ఏకాంతంగా, స్వయం సమృద్ధంగా బతికేవి; యిప్పుడాపరిస్థితి పోయి, నలువైపులా యిచ్చి పుచ్చుకోవడమూ, సర్వత్రా వివిధ జాతులు ఒకదానిపై ఒకటి ఆధారపడడమూ జరుగుతున్నది. భౌతిక వస్తువుల ఉత్పత్తిలో వున్న పరిస్థితే బౌద్ధిక ఉత్పత్తికి కూడా వర్తిస్తుంది. వివిధ దేశాల బౌద్ధిక ఉత్పాదితాలు యావత్ ప్రపంచపు సమష్టి ఆస్తి ఔతున్నాయి. జాతీయ పాక్షికతా, సంకుచిత మనస్తత్వమూ అంతకంతకూ అసంభవమౌతున్నాయి. వివిధ జాతీయ ప్రాంతీయ సాహిత్యాలనుండి విశ్వసాహిత్యం ఉద్భవిస్తున్నది.

సమస్త ఉత్పత్తి సాధనాల సత్వరాభివృద్ధి ద్వారానూ, వార్తా రవాణా సాధనాల అపార మైన అభివృద్ధి ద్వారానూ బూర్జువావర్గం సకల జాతులనూ, అత్యంత ఆటవిక జాతులను సైతం, నాగరికతలోకి లాగుతుంది. తాను ఉత్పత్తి చేసే సరుకుల చౌకధరలు అనే భారీ ఫిరంగులతో బూర్జువావర్గం యెటువంటి కోటగోడలనైనా పడగొట్టుతుంది, విదేశీయులపట్ల యెంతటి మహా మొండి ద్వేషంగల ఆటవికులనైనా పాదాక్రాంతం చేసుకుంటుంది. దాని నిర్బంధంవల్ల సకల జాతులూ, మరణమే మార్గాంతరం గనుక, బూర్జువా ఉత్పత్తి విధానాన్ని అనుసరిస్తాయి. దాని నిర్బంధంవల్ల, అది దేన్ని నాగరికత అంటుందో దాన్ని సకల జాతులూ స్వీకరిస్తాయి — అనగా తామే బూర్జువా జాతులు ఔతాయి. ఒక్క మాటలో చెప్పాలంటే, బూర్జువావర్గం తన్ను పోలిన ప్రపంచాన్ని సృష్టిస్తుంది.

బూర్జువావర్గం గ్రామసీమలను పట్టణాల పెత్తనం కిందికి తెచ్చింది. అది బ్రహ్మాండ మైన నగరాలు సృష్టించింది; గ్రామీణ జనాభాతో పోలిస్తే పట్టణ జనాభాను అపారంగా పెంచివేసింది; యీ విధంగా జనాభాలో గణనీయమైన భాగాన్ని గ్రామజీవితపు మూఢత్వం నుండి రక్షించింది. అది యే విధంగా పల్లెలు పట్టణాలపై ఆధారపడేటట్లు చేసిందో, అదే విధంగా ఆటవిక దేశాలూ, అర్ధ ఆటవిక దేశాలూ నాగరిక దేశాలపై ఆధారపడేటట్లు చేసింది; వ్యావసాయిక జాతులు బూర్జువా జాతుల పైనా, ప్రాచ్య ఖండం పాశ్చాత్య ఖండం పైనా ఆధారపడేటట్లు చేసింది.

ప్రజనూ, ఉత్పత్తి సాధనాలూ, ఆస్తులూ చెల్లాచెదురుగా వుండే పరిస్థితిని బూర్జువా వర్గం దినదినానికీ నిర్మూలిస్తూ వుంది. అది జనాభాను సమూహాలుగా చేర్చింది, ఉత్పత్తి సాధనాలను కేంద్రీకరించింది, ఆస్తిని కొద్దిమంది చేతుల్లో సాంద్రీకరించింది. దీని ఫలితంగా, విధిగా రాజకీయ కేంద్రీకరణ యేర్పడింది. సొంత ప్రయోజనాలూ, సొంత శాసనాలూ, సొంత ప్రభుత్వాలూ, సొంత పన్నుల వ్యవస్థలూ గలిగి స్వతంత్రంగా వుండిన రాష్ట్రాలు, లేదా పరస్పర సంబంధాలు దుర్బలంగా వుండిన రాష్ట్రాలు ఒకే ప్రభుత్వమూ, ఒకే శాస నావళీ, ఒకే జాతీయ వర్గప్రయోజనమూ, ఒకే (రాజకీయ) సరిహద్దూ, ఒకే కస్టమ్స్ వ్యవస్థాగల ఒకే జాతిగా ముద్ద చేయబడినాయి.

బూర్జువావర్గం, యింకా నూరేండ్లయినా నిండని తన పరిపాలనా కాలంలో, గడచిన తరాల మానవులందరూ కలిసి సృష్టించిన ఉత్పాదక శక్తుల కంటె విస్తారమైన, బ్రహ్మాండ మైన ఉత్పాదక శక్తులను సృష్టించింది. మానవునికి దాస్యం చేసే ప్రకృతి శక్తులు, యంత్రాలు, పరిశ్రమలకూ వ్యవసాయానికీ ఊడిగం చేసే రసాయనశాస్త్రం, ఆవిరి ఓడలు, రైళ్లు, టెలిగ్రాఫులు, అడవులు నరికి మొత్తం ఖండాలనే సాగులోకి తేవడం, నదీజలాలను కాలువలకు మళ్లించడం, మంత్ర మహిమచే నేల యీనినట్లు జనాభాలు వృద్ధికావడం —

యింతటి అద్భుతమైన ఉత్పాదక శక్తులు సామాజిక శ్రమ గర్భంలో నిద్రాణమై వున్నాయని గతంలో యెప్పుడైనా యెవరికైనా లీలామాత్రంగానైనా తెలుసునా?

ఈవిధంగా మనకు తెలిసేదేమంటే: యే ఉత్పత్తి సాధనాలనూ, మారకపు సాధనాలనూ పునాదిగా వినియోగించుకొని బూర్జువావర్గం అభివృద్ధి చెందిందో ఆ సాధనాలు ఫ్యూడల్ సమాజంలో ఉద్భవించినాయి. ఆ సాధనాలు క్రమంగా అభివృద్ధి చెందుతూ ఒకానొక దశకు చేరుకునేటప్పటికి, ఉత్పత్తికీ మారకానికీ చెందిన ఫ్యూడల్ సమాజపు నియమాలకు — అనగా ఫ్యూడల్ వ్యవసాయ వ్యవస్థకూ, ఫ్యూడల్ కర్మాగార పరిశ్రమల వ్యవస్థకూ — ఒక్క మాటలో చెప్పాలంటే, ఫ్యూడల్ ఆస్తి సంబంధాలకు — అప్పటికే అభివృద్ధి చెందిన ఉత్పాదక శక్తులతో యిక యే మాత్రం పొత్తు కుదరలేదు. అవి దాని సంకెళ్లుగా తయారైనాయి. వాటిని బ్రద్దలు కొట్టవలసి వచ్చింది; అవి బ్రద్దలు కొట్టబడినాయి.

వాటి స్థానంలో నిర్నిబంధ పోటీ ప్రవేశించింది; దానివెంట దాని కనుగుణమైన సామాజిక వ్యవస్థా, రాజకీయ వ్యవస్థా వచ్చినాయి; బూర్జువావర్గ ఆర్థిక రాజకీయ పెత్తనమూ వచ్చింది.

అటువంటి పరిణామమే మరొకటి యీనాడు మన కండ్లయెదుట జరుగుతున్నది. బూర్జువా ఉత్పత్తి సంబంధాలూ, బూర్జువా మారకపు సంబంధాలూ, బూర్జువా ఆస్తి సంబంధాలూ గల యీనాటి బూర్జువా సమాజం — మంత్రశక్తితోవలె బ్రహ్మాండమైన ఉత్పత్తి సాధనాల్నూ, మారకపు సాధనాలూ సృష్టించిన యీ బూర్జువా సమాజం — తన మంత్రశక్తిచే సృష్టించిన భూతాలను తానే అదుపులో పెట్టుకోలేని మాంత్రికుని దురవస్థలో పడింది. ఇప్పటికి అనేక దశాబ్దాలుగా పరిశ్రమ వాణిజ్యాల చరిత్ర అంతా ఆధునిక ఉత్పత్తి సంబంధాలమీద — అనగా బూర్జువావర్గమూ, దాని పెత్తనమూ బతకడానికి తప్పనిసరి ఐన బూర్జువా ఆస్తి సంబంధాలమీద — ఆధునిక ఉత్పాదక శక్తులు చేస్తున్న తిరుగుబాట్ల చరిత్రే. ఉదాహరణగా, అప్పుడప్పుడు వచ్చే వాణిజ్య సంక్షోభాలను పేర్కొంటే చాలు: అవి వచ్చినప్పుడల్లా, అంతకంతకు మరింత ప్రమాదకరంగా, మొత్తం బూర్జువా సమాజానికే చావు బతుకుల సమస్య తెచ్చిపెడుతున్నాయి. ఈ సంక్షోభాలు వచ్చినప్పుడల్లా ఉత్పత్తి ఐన సరుకుల్లోనేగాక, గతంలో సృష్టింపబడిన ఉత్పాదక శక్తుల్లో కూడా పెద్ద భాగం నాశనం చేయబడుతుంది. గత యుగాల్లో అసంభవంగా కనిపించే ఒక అంటురోగం యీ సంక్షోభ సమయాల్లో చెలరేగుతుంది — మితిమీరిన ఉత్పత్తి అనే అంటురోగం. హఠాత్తుగా మానవ సమాజం తాత్కాలిక ఆటవిక దశలో ప్రవేశించినట్లుంటుంది; కాటకమో, సర్వ విధ్వంసక ప్రపంచ యుద్ధమో వచ్చి సకల ప్రాణాధార వస్తువుల సరఫరానూ భగ్నం చేసినట్లుంది, పరిశ్రమలూ, వాణిజ్యమూ ధ్వంసమైనట్లుంటుంది. కారణం యేమంటే మితిమీరిన నాగరికత, మితిమీరిన ప్రాణాధార వస్తుసంపద, మితిమీరిన పరిశ్రమలు, మితిమీరిన వాణి

జ్యం. సమాజం చేతిలో వున్న ఉత్పాదక శక్తులు యిక యెంత మాత్రమూ బూర్జువా ఆస్తి వ్యవస్థ అభివృద్ధికి అనుకూలంగా లేవు; తద్విరుద్ధంగా, తమకు శృంఖలాలుగా తయారైన ఆ ఆస్తి వ్యవస్థకంటె అవి బాగా బలీయమైనాయి; అవి ఆ శృంఖలాలను అధిగమించినప్పుడల్లా, వెంటనే మొత్తం బూర్జువా సమాజంలోకి అవ్యవస్థ ప్రవేశిస్తుంది, బూర్జువా ఆస్తి వ్యవస్థకే ప్రమాదం యేర్పడుతుంది. బూర్జువా సమాజపు నియమాలు తాము సృష్టించిన సంపదను యిముడ్చుకోడానికి తామే యిరుకైనాయి. మరి యీ సంక్షోభాలను బూర్జువా వర్గం యేవిధంగా అధిగమిస్తుంది? ఒక వైపున ఉత్పాదక శక్తుల్లో కొంత భాగాన్ని విధిలేక ధ్వంసం చేయడం ద్వారానూ, మరొక వైపున కొత్త మార్కెట్లను జయించడం ద్వారానూ, పాత మార్కెట్లను మరింత కట్టుదిట్టంగా దోచుకోవడం ద్వారానూ, అంటే, మరింత విస్తృతమైన, మరింత విధ్వంసకమైన సంక్షోభాలకు బాట వేయడం ద్వారానూ, సంక్షోభ నివారణావకాశాలను తగ్గించడం ద్వారానూ అన్నమాట.

బూర్జువావర్గం యే ఆయుధాలతో ఫ్యూడలిజంను నేలకూల్చిందో ఆ ఆయుధాలు యిప్పుడు బూర్జువావర్గం మీదికే యెత్తబడినాయి.

కానీ, బూర్జువావర్గం సృష్టించింది తన్నే నాశనం చేయగల ఆయుధాలను మాత్రమే కాదు; ఆ ఆయుధాలను ధరించే మనుషులను కూడా అది సృష్టించింది. ఆ మనుషులే ఆధునిక కార్మికవర్గం.

బూర్జువావర్గం యే నిష్పత్తిలో అభివృద్ధి ఔతుందో, అంటే పెట్టుబడి యే నిష్పత్తిలో అభివృద్ధి ఔతుందో, ఆ నిష్పత్తిలోనే అభివృద్ధి ఔతుంది ఆధునిక కార్మికవర్గం — యెన్నాళ్లు పని దొరుకుతుందో అన్నాళ్లు మాత్రమే జీవించే కార్మికుల వర్గం — యెన్నాళ్లు తమ శ్రమ పెట్టుబడిని వృద్ధి చేయగలదో అన్నాళ్లు మాత్రమే పని దొరికే కార్మికుల వర్గం. తమ్ము తాము యేరోజుకారోజు అమ్ముకోవలసిన యీ కార్మికులు యితర వర్తకపు సరుకు లన్నిటిలాగే తామూ ఒక సరుకు. అందువలన వాళ్లు పోటీలోని యెగుడుదిగుడు లన్నిటికీ, ధరల హెచ్చుతగ్గుల కన్నిటికీ గురి ఔతారు.

యంత్రాలు విస్తృతంగా ఉపయోగంలోకి రావడం వల్లా, శ్రమ విభజన వల్లా కార్మికుల శ్రమలో వ్యక్తిగత ప్రత్యేకత అనేది పూర్తిగా అంతరించింది. అందువలన కార్మికునికి పనిలో యే విధమైన ఆకర్షణా లేకుండా పోయింది. కార్మికుడు యంత్రానికి తోక ఐనాడు. అతనికి వుండవలసిందల్లా పనిలో చాకచక్యం మాత్రమే — అత్యంత సరళమైందీ, గానుగెద్దు పనిలాగ అత్యంత విసుగు పుట్టించేదీ, అత్యంత సులభంగా అలవడేదీ ఐన చాకచక్యం మాత్రమే. కాబట్టి, ఒక కార్మికుని ఉత్పత్తి చేయడానికి అయ్యే ఖర్చు దాదాపు ఆ కార్మికుడు పొట్ట పోసుకోడానికీ, కార్మిక సంతతిని కనడానికీ కావలసిన తిండి తీర్థాలకు మాత్రమే పరిమితమౌతుంది. కానీ, ఒక సరుకు ఖరీదు దాని ఉత్పత్తి ఖర్చుకు సమానంగా వుంటుంది; అనగా

(కార్మికుని) శ్రమ ఖరీదు[22] దాని ఉత్పత్తి ఖర్చుకు సమానంగా వుంటుంది. కాబట్టి పని యెంత అసహ్యంగా వుంటే అంతగా వేతనం తగ్గిపోతుంది. అంతే కాదు. యంత్రాల వాడకమూ, శ్రమ విభజనా పెరిగే కొద్దీ, అదే నిష్పత్తిలో కార్మికునిమీద పడే శ్రమభారం కూడా పెరుగుతుంది — పనిగంటలు పెంచడం, లేక అదే కాలంలో కార్మికునితో యెక్కువ పని చేయించుకోవడం, లేక యంత్రాల వేగం యెక్కువ చేయడం, మొదలైన పద్ధతుల ద్వారా కార్మికునిమీద పడే శ్రమభారం పెరుగుతుంది.

ఆధునిక పరిశ్రమ వచ్చిన తర్వాత, పాతకాలపు పితృస్వామిక యజమానులు నడిపే చిన్న కార్ఖానాలు పోయి, వాటి స్థానంలో పారిశ్రామిక పెట్టుబడిదార్లు నడిపే బ్రహ్మాండమైన ఫాక్టరీలు వచ్చినాయి. గుంపులు గుంపులుగా ఫాక్టరీ లోపల చేరిన కార్మిక సమూహాలను సైనికదళాల మాదిరీ వ్యవస్థీకరిస్తారు. కార్మిక సైన్యంలోని యీ సిపాయిలమీద, అచ్చం సైన్యంలో లాగే, సార్జంట్లూ, కమాండర్లూ మొదలైన అధికార్లు తరతమ శ్రేణిలో వుంటారు. ఈ కార్మికులు కేవలం బూర్జువావర్గానికీ, బూర్జువా రాజ్యానికీ మాత్రమే బానిసలు కాదు; వీళ్లు ప్రతిరోజూ, ప్రతిగంటా యంత్రానికి బానిసలు, తనిఖీ చేసే మేస్త్రీకి బానిసలు, అన్నిటినీ మించి బూర్జువా యజమానికి బానిసలు. ఈ నిరంకుశత్వం లాభమే తన ఏకైక లక్ష్యమని యెంత బాహాటంగా ప్రకటించుకుంటుందో అంత నీచంగానూ, అంత ద్వేషపాత్రంగానూ, అంత కసి కలిగించేదిగానూ తయారౌతుంది.

ఆధునిక పరిశ్రమలు అభివృద్ధి అయ్యే కొద్దీ కార్మికుని నైపుణ్యానికీ, శరీరబలానికీ ప్రాముఖ్యం తగ్గిపోతుంది; నైపుణ్యమూ, శరీరబలమూ అనవసరమయ్యే కొద్దీ యజమానులు పురుషులను తొలగించి స్త్రీలను పనిలో పెట్టుకుంటారు. సమాజంలో స్త్రీ పురుష భేదాన్ని బట్టీ, వయోభేదాన్ని బట్టీ వుండే ప్రత్యేకతలు కార్మికవర్గానికి యిక యెంత మాత్రమూ అన్వయించవు. అందరూ పనిచేసే పరికరాలే; యే పరికరానికైనా ఖరీదు చెల్లించవలసిందే; వయోభేదాన్ని బట్టీ, స్త్రీ పురుష భేదాన్ని బట్టీ ఆ ఖరీదులో తేడా వుంటుంది — అంతే.

పగలంతా ఫాక్టరీ యజమానిచే దోపిడీ చేయబడిన కార్మికునికి ఆ సాయంత్రంతో దోపిడీ అంతం కాదు. సాయంత్రం కూలిడబ్బులు చేతిలో పడిన వెంటనే అతన్ని యితర బూర్జువా దోపిడీదార్లు — యింటి యజమానీ, అంగడివాడూ, వడ్డీ వ్యాపారస్తుడూ, మొదలైనవాళ్లు — ముట్టడిస్తారు.

మధ్యతరగతిలోని కిందిశ్రేణివాళ్లు — చిన్నచిన్న వ్యాపారస్తులూ, దుకాణదారులూ, రిటైరైన వర్తకులూ, చేతిపనివాళ్లూ, రైతులూ — వీళ్లందరూ క్రమక్రమంగా కార్మికవర్గంలోకి దిగజారిపోతారు. దీనికి కొంత కారణం యేమంటే, వీళ్ల దగ్గర వున్న స్వల్ప పెట్టుబడి ఆధునిక పరిశ్రమలు నడవడానికి చాలదు; పెద్ద పెట్టుబడిదార్లతో పోటీ పడలేక వీళ్లు దివాలా తీస్తారు. మరికొంత కారణం యేమంటే, కొత్త ఉత్పత్తి పద్ధతులు అమ

ల్లోకి వచ్చినందువల్ల చేతిపనివాళ్ల ప్రత్యేక వృత్తినైపుణ్యం యెందుకూ కొరగాకుండా పోతుంది. యీవిధంగా అన్ని తరగతుల ప్రజలనుండీ కొత్తవాళ్లు వచ్చి కార్మికవర్గంలో కలుస్తుంటారు.

కార్మికవర్గ అభివృద్ధిలో వివిధ దశ లున్నాయి: పుట్టుకతోనే ప్రారంభమౌతుంది బూర్జువావర్గంతో దాని పోరాటం.

మొదట కార్మికులు విడివిడిగా, యెవనిపాటికివాడు, పోరాడుతారు; తరువాత ఒక ఫాక్టరీలోని వాళ్లందరూ కలిసి పోరాడుతారు; ఆ తరువాత ఒకే స్థలంలో ఒకే రకమైన ఫాక్టరీలలో పనిచేసేవాళ్లందరూ కలిసి పోరాడుతారు. యీ పోరాటాలన్నీ తమను ప్రత్యక్షంగా దోపిడీ చేసే బూర్జువా యజమానిమీద జరుగుతాయి. బూర్జువా ఉత్పత్తి సంబంధాలమీద గాక, ఉత్పత్తి సాధనాలమీదనే కార్మికులు దాడిచేస్తారు. తమ శ్రమతో పోటీచేసే విదేశీ సరుకులను ధ్వంసం చేస్తారు, యంత్రాలను ముక్కలు ముక్కలు చేస్తారు, ఫాక్టరీలను దగ్ధం చేస్తారు, యెప్పుడో అంతరించి పోయిన మధ్యయుగాల నాటి వృత్తిపనివాని హోదాను పునరుద్ధరించడానికి బలప్రయోగంతో ప్రయత్నం చేస్తారు.

యీ దశలో కార్మికులు ఒకరికొకరికి సంబంధం లేకుండా దేశమంతటా వెదజల్లబడి నట్లు వుంటారు; తమలో తమకుగల పోటీ మూలంగా యెక్కడికక్కడ చీలి వుంటారు. యెక్కడైనా వాళ్లు ఐక్యమై కొంతవరకు సంఘటితమైన బృందాలుగా యేర్పడితే, అది వాళ్లలో పుట్టిన ఐకమత్యంవల్ల కలిగిందేమీ కాదు, బూర్జువావర్గంలోని ఐకమత్యంవల్ల కలిగిందే; బూర్జువావర్గం తన రాజకీయ స్వప్రయోజనాలు సాధించుకోడానికి మొత్తం శ్రామికవర్గాన్ని కదిలించవలసి వుంటుంది; యీ దశలో, కొంతకాలంపాటు, దాని కలా కదిలించే శక్తి వుంటుంది కూడా. అనగా, యీ దశలో కార్మికులు పోరాడేది తమ శత్రువులతో కాదు, తమ శత్రువుల శత్రువులతో — నిరంకుశ రాచరికపు అవశేషాలతోనూ, భూస్వాముల తోనూ, పారిశ్రామికులు కాని బూర్జువాలతోనూ, పెటీబూర్జువాలతోనూ. యీవిధంగా, యీ దశలో మొత్తం చరిత్ర గతి అంతా బూర్జువావర్గం చేతుల్లో సాంద్రీకరింపబడి వుంటుంది; యీ పోరాటంలో లభించే ప్రతి విజయమూ బూర్జువావర్గానికి విజయంగా వుంటుంది.

కానీ, పరిశ్రమలు అభివృద్ధి అయ్యేకొద్దీ కార్మికుల సంఖ్య పెరగడమే గాక, కొన్ని స్థలాలలో వాళ్లు విశేషంగా సాంద్రీకృతమౌతారు; వాళ్ల బలం పెరుగుతుంది, ఆ బలం వాళ్లకు మరింతగా అనుభూతమౌతుంది. యంత్రాలు వచ్చి కార్మికుల పనిలోని విలక్షణా లన్నిటినీ రూపుమాపే కొద్దీ, దాదాపు ప్రతిచోటా కార్మికుల వేతనాలను ఒకే హీనస్థాయికి దిగలాగే కొద్దీ, కార్మికులలోని భిన్న ప్రయోజనాలూ, భిన్న జీవన పరిస్థితులూ అంత కంతకూ సమానమౌతాయి. బూర్జువాలలో పోటీలు పెరగడంవల్లా, తత్ఫలితంగా యేర్పడే

వాణిజ్య సంక్షోభాలవల్లా కార్మికుల వేతనాలు మరింత యెగుడుదిగుడులకు గురౌతాయి. యంత్రాలలో అంతకంతకూ వేగంగా జరిగే నిరంతరాభివృద్ధివల్ల వాళ్ళ జీవనాధారాలు అంతకంతకూ నమ్మకంలేని వౌతాయి. విడివిడి కార్మికులకూ, విడివిడి బూర్జువాలకూ మధ్య జరిగే ఘర్షణలు రానురాను రెండు వర్గాల మధ్య, జరిగే పోరాటాలుగా పరిణమిస్తాయి. అప్పుడు బూర్జువాలకు వ్యతిరేకంగా కార్మికులు ట్రేడ్ యూనియన్ల సమ్మేళనాలు యేర్ప రచుకోవడం ప్రారంభిస్తారు; తమ వేతనాల స్థాయిని నిలబెట్టుకోడానికి అందరూ యేక మౌతారు. అప్పుడప్పుడు జరిగే యీ తిరుగుబాట్లకు ముందుగానే సంసిద్ధంగా వుండడానికి శాశ్వత సంఘాలు యేర్పరచుకుంటారు. యీ పోరాటాలు అక్కడక్కడా కొట్లాటలుగా పరిణమిస్తాయి.

అప్పుడప్పుడు కార్మికులకు విజయం లభిస్తుంది, కానీ అది తాత్కాలికమే. ఆ యుద్ధాలవల్ల వాళ్ళకు కలిగే నిజమైన లాభం తక్షణ ఫలితాలలో లేదు; నిత్యం విస్తరించే కార్మికవర్గ ఐక్యతే నిజమైన లాభం. ఆధునిక పరిశ్రమలు సృష్టించిన వార్తా రవాణా సాధనాలు వివిధ ప్రాంతాలలోని కార్మికులకు పరస్పర సంబంధాలు కల్పించి, యీ కార్మికవర్గ ఐక్యతకు తోడ్పడతాయి. సరిగా యీ పరస్పర సంబంధమే కావలసి వుండింది ఏక స్వభావం కలిగిన అసంఖ్యాక స్థానిక పోరాటాల నన్నిటినీ కలిపి రెండు వర్గాల మధ్య జరిగే ఏకైక దేశవ్యాప్త పోరాటంగా రూపొందించడానికి. కానీ, ప్రతి వర్గపోరాటమూ ఒక రాజకీయ పోరాటమే. యిక ఆ ఐక్యత – దరిద్రపు రహదారులుగల మధ్యయుగాల్లో పట్టణ పౌరులు (burghers) సాధించడానికి కొన్ని శతాబ్దాలు పట్టిన ఆ ఐక్యత – ఆధునిక కార్మికులు, రైల్వేల మూలంగా, కొద్ది సంవత్సరాలలో సాధిస్తారు.

కార్మికులు ఒక వర్గంగా సంఘటితపడడమూ, తత్పర్యవసానంగా ఒక రాజకీయ పార్టీగా సంఘటితపడడమూ అనేది కార్మికులకు వాళ్లలో వాళ్ళకే వున్న పోటీవల్ల నిరంతరం తల్రకిందు లౌతూ వుంటుంది. కానీ, అది మళ్లీ పైకి లేస్తుంది; మరింత బలంగా, మరింత స్థిరంగా, మరింత ప్రచండంగా ముందుకు సాగుతుంది. బూర్జువావర్గంలోని చీలికలను ఉపయోగించు కొని అది కార్మికుల ప్రత్యేక ప్రయోజనాలను ప్రభుత్వ శాసనాలు గుర్తించేటట్లు చేస్తుంది. ఈ విధంగా యింగ్లండులో పది గంటల పని బిల్లు పాసయింది.

మొత్తంమీద పాత సమాజంలోని వర్గాల మధ్య జరిగే సంఘర్షణలు అనేక విధాలుగా కార్మికవర్గ అభివృద్ధికి తోడ్పడతాయి. బూర్జువావర్గం నిరంతర యుద్ధంలో చిక్కుకొని వుంటుంది – మొదట ఫ్యూడల్ ప్రభువర్గంతో యుద్ధం, తరువాత బూర్జువావర్గంలోనే పరిశ్రమల అభివృద్ధివల్ల నష్టపడేవాళ్ళతో యుద్ధం, మొదటినుండి చివర దాకా విదేశ బూర్జువావర్గాలతో యుద్ధం. యీ యుద్ధాలన్నిటిలోనూ కార్మికవర్గ సహాయం అర్థించక తప్పదని బూర్జువావర్గం గుర్తిస్తుంది. ఈవిధంగా అది కార్మికవర్గాన్ని రాజకీయ రంగంలోకి

లాగుతుంది. తన్మూలంగా, బూర్జువావర్గమే తన రాజకీయ విద్యనూ, సాధారణ విద్యనూ కార్మికవర్గానికి నేర్పుతుంది. అనగా, బూర్జువావర్గంతో యుద్ధం చేయడానికి కావలసిన ఆయుధాలను కార్మికవర్గానికి బూర్జువావర్గమే అందిస్తుంది.

అంతే కాదు. యింతకుముందే చెప్పినట్లు, పరిశ్రమలు పురోగమించే కొద్దీ, పాలక వర్గాలలోని కొన్ని విభాగాలు మొత్తంగా కార్మికవర్గంలోకి తోయబడుతాయి; లేదా కనీసం, ఆ విభాగాల జీవిత విధానానికి ప్రమాదకర పరిస్థితి యేర్పడుతుంది. యీ విభాగాలు కూడా కార్మికవర్గానికి నూతన విజ్ఞానమూ, నూతన ప్రగతి లక్షణాలూ సరఫరా చేస్తాయి.

చివరి అంశం యేమంటే: వర్గపోరాటం అటో యిటో తేలిపోయే గడియ సమీపించిన ప్పుడు, పాలకవర్గంలో సాగుతున్న విచ్ఛిత్తి ప్రక్రియ — నిజానికి పాత సమాజం అంతటా సాగుతున్న విచ్ఛిత్తి ప్రక్రియ — యెంత స్పష్టమైన, యెంత ప్రచండమైన రూపం ధరిస్తుందంటే, పాలకవర్గంలోనే కొద్దిమంది తమ వర్గంతో సంబంధాలు తెంచుకొని వచ్చి, విప్లవ వర్గంతో కలుస్తారు — భవిష్యత్తును శాసించే విప్లవ వర్గంతో. అనగా, గతంలో యేవిధంగా ఫ్యూడల్ ప్రభువర్గానికి చెందిన ఒక భాగం విడిపోయి వచ్చి బూర్జువావర్గంతో కలిసిందో, అదే విధంగా యిప్పుడు బూర్జువావర్గానికి చెందిన ఒక భాగం విడిపోయి వచ్చి కార్మికవర్గంతో కలుస్తుంది — ముఖ్యంగా మొత్తం చారిత్రక గతి నంతటినీ సిద్ధాంత రీత్యా అవగాహన చేసుకోగల స్థాయికి చేరుకున్న బూర్జువా సిద్ధాంతవేత్తలలో ఒక భాగం.

యీనాడు బూర్జువావర్గానికి ముఖాముఖిగా నిలబడిన వర్గాలన్నిటిలోకీ కార్మికవర్గం ఒక్కటే నిజమైన విప్లవ వర్గం. తక్కిన వర్గాలు ఆధునిక పరిశ్రమల ప్రభావం వల్ల క్షీణించి క్షీణించి చివరకు అదృశ్యమౌతాయి. కార్మికవర్గం ఆధునిక పరిశ్రమల ప్రత్యేక సృష్టి, ఆధునిక పరిశ్రమల అతిముఖ్య సృష్టి.

మధ్యతరగతిలో కిందిశ్రేణివాళ్లు — చిన్నచిన్న పరిశ్రమల యజమానులూ, దుకాణ దారులూ, చేతిపనివాళ్లూ, రైతులూ — వీళ్లందరూ బూర్జువావర్గంతో పోరాడుతారు; కానీ వీళ్ల పోరాటం మధ్యతరగతిలో భాగాలుగానే తాము బతుకుతూ వుండడానికి. అనగా వీళ్లు విప్లవకారులు కాదు, యథాస్థితివాదులు. అంతే కాదు, ప్రగతి వ్యతిరేకులు కూడా; యెందుకంటే వీళ్లు చరిత్ర గతిని వెనక్కు తిప్పడానికి ప్రయత్నిస్తారు. ఒకవేళ వీళ్లు యెప్పుడైనా విప్లవకరంగా వున్నారంటే, త్వరలోనే తాము కార్మికవర్గంలో కలిసిపోనున్న దృష్ట్యానే అలా వుంటారు; అనగా వీళ్లు తమ ప్రస్తుత ప్రయోజనాల కొరకు కాక, భవి ష్యత్ ప్రయోజనాల కొరకు పోరాడుతారు — తమ సొంత దృక్పథం వదలిపెట్టి కార్మికవర్గ దృక్పథం స్వీకరిస్తారు.

"ప్రమాదకర వర్గం"* — అనగా సమాజ ప్రవాహంమీది తెట్టె — పాత సమాజ ప్రవాహపు అట్టడుగు పొరలనుండి వెళ్లగక్కబడి ఒడ్డున నిర్జీవంగా కుళ్లిపోతున్న పదార్థం —

---

* అనగా లుంపెన్ ప్రొలిటేరియట్. — అను.

అక్కడక్కడా కార్మికవర్గ విప్లవంవల్ల మళ్లీ సమాజ ప్రవాహంలోకి కొట్టుకరావచ్చు; కానీ దాని జీవిత విధానాన్ని బట్టి ఆ వర్గం ప్రగతి నిరోధకులతో లంచాలు తిని వాళ్ల కుతంత్రాలు నెరవేర్చే కూలిబంటుగా వుండడానికే యెక్కువ అవకాశాలు వున్నాయి.

కార్మికవర్గ జీవిత విధానం కింద పాత సమాజపు జీవిత విధానం యిప్పటికే దాదాపు పూర్తిగా అణగారి పోయింది. కార్మికునికి ఆస్తి అనేది లేదు; అతనికి భార్యా బిడ్డలతో గల సంబంధానికీ, బూర్జువా కుటుంబాలలో వుండే సంబంధాలకూ యిక యెక్కడా పోలిక లేదు. ఆధునిక పరిశ్రమల శ్రమ విధానం – అనగా పెట్టుబడికి లోబడివుండే ఆధునిక దాస్యం – యిది ఫ్రాన్సులో యెంతో యింగ్లండులోనూ అంతే, జర్మనీలో యెంతో అమెరికాలోనూ అంతే – కార్మికునికి జాతీయ స్వభావం అనేది మచ్చుకు కూడా లేకుండా తొలగించివేసింది. న్యాయశాస్త్రం, నీతి, మతం అనేవి అన్నీ బూర్జువా గుడ్డినమ్మకాలనీ, ఒక్కొక్కదాని చాటున ఒక్కొక్క బూర్జువా స్వార్థం పొంచి వుందనీ కార్మికుని భావన.

గతంలో అధికారంలోకి వచ్చిన వర్గాలు అన్నీ సమాజ మంతటిమీదా తమ ఆస్తి సంపాదనా పద్ధతిని రుద్దడం ద్వారా సమాజంలో అప్పటికే తమకున్న స్థానాన్ని భద్రపరచుకోడానికి ప్రయత్నించినాయి. కార్మికులు తమ పాత ఆస్తి సంపాదనా పద్ధతిని రద్దుచేస్తే తప్ప, తన్మూలంగా ప్రతి యితర పాత ఆస్తి సంపాదనా పద్ధతినీ రద్దుచేస్తే తప్ప, సమాజపు ఉత్పాదక శక్తులకు యజమానులు కాలేరు. కార్మికులకు భద్రపరచుకోడానికీ పదిలపరచు కోడానికీ యేమీ లేదు; వాళ్ల జీవిత లక్ష్యం సొంత ఆస్తికి గతంలో వున్న సకల భద్రతలనూ, సకల రక్షణలనూ ధ్వంసం చేయడమే.

చరిత్రలో యింతవరకు జరిగిన ఉద్యమాలన్నీ అల్ప సంఖ్యాకుల ఉద్యమాలు, లేదా అల్ప సంఖ్యాకుల ప్రయోజనాల కొరకు జరిగిన ఉద్యమాలు. ఈనాటి కార్మికవర్గ ఉద్యమం అత్యధిక సంఖ్యాకుల ప్రయోజనాల కొరకు అత్యధిక సంఖ్యాకులు బుద్ధిపూర్వకంగా, స్వతంత్రంగా నడిపే ఉద్యమం. సమాజంలో అట్టడుగు పొర ఐన కార్మికవర్గం కదలాలంటే, లేచి నిలబడాలంటే, తనమీద వున్న అధికార సమాజపు పైపొరల నన్నిటినీ మొత్తంగా ఆకాశంలోకి యెగమీటక తప్పదు.

కార్మికవర్గం బూర్జువావర్గంతో చేసే పోరాటం, మొదటి దశలో, స్వభావంలో కాక పోయినా స్వరూపంలో, జాతీయ పోరాటంగా వుంటుంది. యే దేశపు కార్మికవర్గమైనా మొదట తన దేశపు బూర్జువావర్గంతోనే వ్యవహారాలు తేల్చుకోవడం అవసరమే.

ఇంతవరకు, కార్మికవర్గ అభివృద్ధిలోని సర్వసాధారణ దశలు చిత్రించినాము. ఆ చిత్రణలో, ప్రస్తుత సమాజంలో మొత్తంమీద ప్రచ్ఛన్నంగా రగులుతున్న అంతర్యుద్ధం బహిరంగ విప్లవంగా ప్రజ్వలించే దశవరకూ, బూర్జువావర్గాన్ని బలప్రయోగంతో కూల దోయడం ద్వారా కార్మికవర్గ అధికారానికి పునాదులుపడే దశవరకూ చిత్రింపబడింది.

గత చరిత్రలో, మనం యిప్పటికే గమనించినట్లు, ప్రతి సమాజమూ పీడిత పీడక వర్గాల వైరుధ్యంమీద ఆధారపడింది. కానీ, ఒక వర్గాన్ని పీడించాలంటే, ఆ పీడితవర్గం కనీసం తన బానిస బతుకును యథాస్థితిలో కొనసాగించడానికైనా కొన్ని పరిస్థితులు నమ్మకంగా వుండాలి. ఫ్యూడల్ యుగంలోని ఫ్యూడల్ దాసులు కమ్యూన్‌లో* సభ్యత్వం పొందే స్థితికి అభివృద్ధి చెందినారు; ఫ్యూడల్ నిరంకుశ పెత్తనం కింది పెటీబూర్జువాలు బూర్జువాలుగా అభివృద్ధి చెందినారు. కానీ, ఆధునిక కార్మికుడు పరిశ్రమలు అభివృద్ధి అయ్యేకొద్దీ పైకిరాకుండా యింకా కిందికి పోతున్నాడు; కార్మిక జీవన విధానానికి కూడా అంటిపెట్టుకోలేక దినదినానికీ యింకా అడుక్కు, యింకా లోతుకు పోతున్నాడు. కార్మికుడు బుక్కాఫకీరు ఔతున్నాడు. మరి యీ బుక్కాఫకీరుతనం జనసంఖ్య కంటె వేగంగా, దేశ సంపద కంటె వేగంగా పెరుగుతున్నది. కాబట్టి ఒక విషయం స్పష్టపడుతున్నది: సమాజంలో పాలక వర్గంగా వుండడానికి బూర్జువావర్గానికిక యెంత మాత్రమూ యోగ్యత లేదు; తన జీవిత విధానాన్ని, అత్యున్నత శాసనంగా, సమాజంమీద రుద్దడానికి దానికిక యెంత మాత్రమూ అర్హత లేదు. సమాజాన్ని పాలించడానికి అది అనర్హం: యెందుకంటే, తన బానిసకు బానిస బతుకునైనా నమ్మకంగా చూపించగల సామర్థ్యం లేదు దానికి; తన బానిస బిచ్చమెత్తుకోవలసిన దుస్థితికి దిగజారిపోతే, బానిస శ్రమమీద తాను బతకడానికి బదులు తన బిచ్చంమీద బానిస బతకవలసిన దుస్థితి సంభవిస్తే, యేమి చేయడానికీ సామర్థ్యం లేదు దానికి. ఈ బూర్జువావర్గంకింద సమాజమిక యెంత మాత్రమూ మనలేదు. అనగా సమాజానికీ బూర్జువావర్గం ఉనికికీ యిక యెంత మాత్రం పొత్తు కుదరదు.

బూర్జువావర్గమూ, బూర్జువావర్గ పరిపాలనా వుండాలంటే మొట్టమొదట విధిగా జరగవలసింది పెట్టుబడి యేర్పడడమూ, వృద్ధి కావడమూ. పెట్టుబడి వుండాలంటే విధిగా కావలసింది కూలికి పనిచేసే కార్మికులు. కూలికి పనిచేయడం అనేది కార్మికులలో కార్మికులకు వుండే పోటీమీదనే సంపూర్ణంగా ఆధారపడుతుంది. కానీ, బూర్జువావర్గపు అనుద్దిష్ట కార్యంగా పరిశ్రమల పురోగమనం సాగుతుంది; పరిశ్రమల పురోగమనం మూలంగా కార్మికులలో పరస్పర పోటీవల్ల యేర్పడే అనైక్యత పోయి, పరస్పర సాహచర్య ఫలితమైన విప్లవకర సమ్మేళనం వస్తుంది. అనగా, యే పునాదులమీద బూర్జువావర్గం వస్తుసంపదను ఉత్పత్తి చేసి సొంతపరచుకుంటున్నదో ఆ పునాదులనే ఆధునిక పరిశ్రమాభివృద్ధి కూల్చివేస్తుంది. కాబట్టి బూర్జువావర్గం ఉత్పత్తి చేసే వాటిలోకెల్లా ముఖ్యమైన దేదంటే తనకే మారకులైనవాళ్లు. బూర్జువావర్గ పతనమూ అనివార్యమే, కార్మికవర్గ విజయమూ అనివార్యమే.

---

* 47వ పేజిలో ఎంగెల్స్ వివరణ చూడండి. — సం.

# II

## కార్మికులూ – కమ్యూనిస్టులూ

మొత్తం కార్మికవర్గంతో కమ్యూనిస్టుల సంబంధం యేవిధంగా వుంటుంది?

కమ్యూనిస్టులు యితర కార్మికవర్గ పార్టీలకు వ్యతిరేకమైన మరొక ప్రత్యేక పార్టీగా యేర్పడరు.

కార్మికవర్గ సమష్టి ప్రయోజనాలకు భిన్నంగా, విడిగా కమ్యూనిస్టులకు యే ప్రయోజనాలూ లేవు.

వాళ్లు కార్మికవర్గ ఉద్యమాన్ని తమకు నచ్చిన మూసలో పోతపోయడానికి యే సొంత ఒంటెత్తు సూత్రాలనూ ముందుకు తీసుకురారు.

కమ్యూనిస్టులకూ యితర కార్మికవర్గ పార్టీలకూ గల భేదం యింత మాత్రమే: 1. వివిధ దేశాల కార్మికులు చేసే జాతీయ పోరాటాలలో, జాతి యేదైనప్పటికీ సమస్త కార్మికవర్గానికీ గల సమష్టి ప్రయోజనాలను కమ్యూనిస్టులు గుర్తుచేసి, వాటికి ప్రాధాన్యం యిస్తారు. 2. బూర్జువావర్గంతో కార్మికవర్గం చేసే పోరాటం వివిధ దశలుగా అభివృద్ధి చెందుతుంది; ఆ అన్ని దశల్లోనూ కమ్యూనిస్టులు సర్వదా, సర్వత్రా మొత్తం ఉద్యమంయొక్క ప్రయోజనాలకు ప్రాతినిధ్యం వహిస్తారు.

కాబట్టి కమ్యూనిస్టులు ఒకవైపున, ఆచరణ రీత్యా, ప్రతి దేశంలోనూ వున్న కార్మిక వర్గ పార్టీ అన్నిటిలోకీ అత్యంత పురోగామీ, అత్యంత దీక్షాపూరితమూ ఐన భాగంగానూ, యితర భాగా లన్నిటినీ ముందుకు తోసే భాగంగానూ వుంటారు; మరొకవైపున, సిద్ధాంత రీత్యా, కార్మికోద్యమం పయనించే మార్గమూ, దాని నియమాలూ, దాని సాధారణ అంతిమ ఫలితాలూ స్పష్టంగా అర్థం చేసుకుంటారు గనుక, ఆ విషయంలో బహుసంఖ్యాక కార్మిక జనసామాన్యానికి లేని సౌకర్యం కలిగి వుంటారు.

కమ్యూనిస్టుల తక్షణ లక్ష్యం యితర కార్మికవర్గ పార్టీల కున్నదే: కార్మికులు ఒక వర్గంగా రూపొందడం, బూర్జువా ఆధిపత్యాన్ని కూలదోయడం, కార్మికవర్గం రాజకీయా ధికారాన్ని గెలుచుకోవడం.

జగత్తు నంతటినీ సంస్కరించదలచిన యే మహానుభావుడో సృష్టించో, ఆవిష్కరించో యిచ్చిన భావాలమీదనో, సూత్రాలమీదనో ఆధారపడవు కమ్యూనిస్టుల సిద్ధాంత నిర్ధారణలు.

యీ నిర్ధారణలు ప్రస్తుత వర్గపోరాటంనుండి, సాక్షాత్తుగా మన కండ్లముందు జరుగుతున్న ఒక చారిత్రక పరిణామంనుండి, ఉత్పన్నమౌతున్న వాస్తవ సంబంధాలను

స్థూలంగా వ్యక్తపరుస్తాయి అంతే. అమల్లో వున్న ఆస్తి సంబంధాలను రద్దుచేయడమనేది కమ్యూనిజంయొక్క ప్రత్యేక లక్షణమేమీ కాదు.

చారిత్రక పరిస్థితులలో వచ్చిన మార్పుల ఫలితంగా, గతంలో కూడా, ఆస్తి సంబంధాలన్నీ నిరంతరం మారుతూనే వచ్చినాయి.

ఉదాహరణకు, ఫ్రెంచి విప్లవం[23] ఫ్యూడల్ ఆస్తిని రద్దుచేసి, బూర్జువా ఆస్తిని నిలబెట్టింది.

కమ్యూనిజంయొక్క ప్రత్యేక లక్షణం యే ఆస్తినైనా రద్దుచేయడం కాదు, బూర్జువా ఆస్తిని రద్దుచేయడం.

కానీ, వర్గవైరుధ్యాలమీదా, అధిక సంఖ్యాకులను అల్ప సంఖ్యాకులు చేసే దోపిడీమీదా ఆధారపడి ఉత్పాదితాలను ఉత్పత్తి చేసే, సొంతపరచుకొనే వ్యవస్థయొక్క రూపాలలోకెల్ల ఆధునిక బూర్జువా సొంత ఆస్తి అనేది ఆఖరిదీ, అత్యంత పరిపూర్ణమైనదీ.

యీ అర్థంలో కమ్యూనిస్టుల సిద్ధాంతం ఒక్క వాక్యంలో చెప్పవచ్చు: సొంత ఆస్తిని రద్దుచేయడం.

మనుషులు స్వయంకృషిచేత స్వంతానికి ఆస్తి సంపాయించుకునే హక్కును రద్దు చేయదలచుకున్నామని కమ్యూనిస్టులమైన మామీద నిందలువేస్తున్నారు; మనుషుల సకల విధ స్వేచ్ఛాస్వాతంత్ర్యాలకూ, సకల విధ కార్యకలాపాలకూ అటువంటి ఆస్తే మూలాధారమని అంటున్నారు.

కష్టపడి సంపాయించిన ఆస్తి అట! స్వయంగా సంపాయించిన ఆస్తి అట! బూర్జువా ఆస్తి అనేది రాక పూర్వమే చిన్న రైతులూ, చిల్లర చేతిపనులవాళ్లూ సంపాయిస్తూ వుండిన ఆస్తిని గురించేనా మీ రనేది? అదే ఐతే, దాన్ని రద్దుచేయవలసిన అవసరం లేదు; పరిశ్రమల అభివృద్ధివల్ల అది యిప్పటికే చాలావరకు నాశనమయింది, తక్కింది రోజూ నాశనమౌతూనే వుంది.

లేక, మీరనేది ఆధునిక బూర్జువా సొంత ఆస్తిని గురించా?

ఐతే, వేతనశ్రమ కార్మికునికి ఆస్తి యేమైనా కలుగుతున్నదా? లేదు, అణు మాత్రం కూడా లేదు. వేతనశ్రమ పెట్టుబడిని సృష్టిస్తుంది. పెట్టుబడి అంటే వేతనశ్రమను దోపిడీ చేసేటటువంటి ఆస్తి, కొత్తగా దోపిడీ చేయడానికి కొత్త కార్మికులను సృష్టిస్తే తప్ప వృద్ధి కాలేని ఆస్తి. యీనాడు అమల్లో వున్న ఆస్తి పెట్టుబడికీ వేతనశ్రమకూ గల వైరుధ్యంమీద ఆధారపడి వుంది. యీ వైరుధ్యంయొక్క యిరుపక్షాలనూ పరిశీలించుదాం.

పెట్టుబడిదారుడుగా వుండడమంటే ఉత్పత్తిలో కేవలం వ్యక్తిగత హోదాయేగాక, ఒక సామాజిక హోదా కూడా కలిగి వుండడమన్నమాట. పెట్టుబడి అనేది సమష్టి ఉత్పాదితం; అనేకమంది కలిసి చేసే సమైక్య కృషివల్లనే, యింకా చెప్పాలంటే, సమాజంలోని సభ్యులందరూ కలిసి చేసే సమైక్య కృషివల్లనే, పెట్టుబడి సచేతనంగా వుంటుంది.

కాబట్టి పెట్టుబడి అనేది వ్యక్తియొక్క శక్తి కాదు; అది ఒక సామాజిక శక్తి.

కాబట్టి పెట్టుబడిని సమష్టి ఆస్తిగా మార్చినప్పుడు, సమాజంలోని సభ్యులందరి ఆస్తిగా మార్చినప్పుడు, అందుమూలంగా వ్యక్తిగత ఆస్తి సామాజిక ఆస్తిగా మారడం లేదు. ఆస్తియొక్క సామాజిక స్వభావంలో మాత్రమే మార్పు వస్తుంది. ఆస్తి తన వర్గ స్వభావం కోల్పోతుంది.

యిక వేతనశ్రమను పరిశీలిద్దాం.

వేతనశ్రమయొక్క సగటు ఖరీదు యెంతంటే కార్మికుని కిచ్చే కనీసవేతనం; అంటే, కార్మికుడు కార్మికుడుగా బతకాలంటే తప్పనిసరిగా కావలసిన తిండితీర్థాల ఖరీదు. కాబట్టి వేతనశ్రమ చేసే కార్మికుడు తన శ్రమ ద్వారా సంపాయించేది కేవలం శరీరాన్ని నిలుపుకోడానికీ, కేవలం శరీరాన్ని నిలుపుకునే సంతానాన్ని కనడానికీ బొటాబొటిగా సరిపోతుంది. శ్రమ ఫలితమైన యీ సొంత సంపాదన — కేవలం శరీర నిర్వహణకూ, వంశవృద్ధికీ సరిపోయే సొంత సంపాదన — అందులో కొంత మిగిలించుకొని ఆ మిగులు డబ్బును పెట్టుబడిగా మార్చి యితరులను కూలివాళ్లగా ఉపయోగించుకోడానికి యేమాత్రమూ వీలులేని సొంత సంపాదన — దీన్ని రద్దుచేయడం యెంతమాత్రమూ మా ఉద్దేశం కాదు. మేము రద్దు చేయదలచుకున్నదల్లా యీ ఆస్తి సంపాదనా విధానంలోని యే దౌర్భాగ్య స్వభావంవలన కార్మికుడు పెట్టుబడిని వృద్ధిచేయడానికి మాత్రమే బతుకుతాడో, యే దౌర్భాగ్య స్వభావంవలన పాలకవర్గం తనకు లాభకరంగా వున్నంతవరకు మాత్రమే కార్మికుని బతకనిస్తుందో, ఆ దౌర్భాగ్య స్వభావాన్ని మాత్రమే.

బూర్జువా సమాజంలో, ప్రాణంగల శ్రమ సంచిత శ్రమను వృద్ధిచేసే సాధనం మాత్రమే. కమ్యూనిస్టు సమాజంలో సంచిత శ్రమ శ్రమపడేవాని జీవితాన్ని విస్తృతపరచడానికీ, సంపన్నం చేయడానికీ, ప్రోత్సహించడానికీ సాధనం మాత్రమే.

కాబట్టి, బూర్జువా సమాజంలో గతం వర్తమానాన్ని శాసిస్తుంది; కమ్యూనిస్టు సమాజంలో వర్తమానం గతాన్ని శాసిస్తుంది. బూర్జువా సమాజంలో పెట్టుబడికి స్వాతంత్ర్యమూ, వ్యక్తిత్వమూ వుంటాయి గానీ, ప్రాణంగల మనిషికి స్వాతంత్ర్యమూ వుండదు, వ్యక్తిత్వమూ వుండదు.

యీ స్థితినే మేము రద్దుచేయాలనేది. దీన్ని రద్దుచేయడమే వ్యక్తిత్వాన్ని రద్దు చేయడమనీ, స్వేచ్ఛను రద్దుచేయడమనీ బూర్జువాలు అంటారు! నిజమే మరి. నిస్సంశయంగా మా లక్ష్యం బూర్జువా వ్యక్తిత్వాన్నీ, బూర్జువా స్వాతంత్ర్యాన్నీ, బూర్జువా స్వేచ్ఛనూ రద్దుచేయడమే.

ప్రస్తుత బూర్జువా ఉత్పత్తి వ్యవస్థలో స్వేచ్ఛ అంటే వ్యాపారానికి స్వేచ్ఛ, క్రయ విక్రయాలకు స్వేచ్ఛ.

కానీ క్రయవిక్రయాలే అంతరించినప్పుడు క్రయవిక్రయాల స్వేచ్ఛ కూడా అంతరిస్తుంది.

క్రయవిక్రయాల స్వేచ్ఛను గురించి మాట్లాడే యీ మాటలకూ, యింకా సామాన్య వాచకమైన స్వేచ్ఛను గురించి మన బూర్జువాలు చేసే "గంభీరోపన్యాసా"లకూ యేమైనా అర్థం వుంటే మధ్యయుగాలనాటి వర్తకులమీద వుండిన నిర్బంధాలతోనూ, వాళ్ల క్రయ విక్రయాలమీద వుండిన పరిమితులతోనూ పోల్చి చూసినప్పుడు మాత్రమే అర్థం వుండవచ్చు. కానీ, క్రయవిక్రయాలనే రద్దుచేయాలనీ, బూర్జువా ఉత్పత్తి వ్యవస్థనే రద్దు చేయాలనీ, అసలు బూర్జువావర్గాన్నే రద్దుచేయాలనీ అనే కమ్యూనిస్టు సిద్ధాంతాన్ని వ్యతిరేకించేటప్పుడు ఆ మాటలకు అర్థమే లేదు.

సొంత ఆస్తిని మేము రద్దుచేయాలనడం మీకు యెంతో భయోత్పాతం పుట్టిస్తున్నది. కానీ యిప్పుడున్న మీ సమాజంలో నూటికి తొంబైమందికి సొంత ఆస్తి యిప్పటికే రద్దయి పోయింది; నూటికి తొంబైమందికి లేదు గనుకనే తక్కిన కొద్దిమందికీ వుండగలుగుతున్నది. అనగా, సమాజంలో అత్యధిక సంఖ్యాకులకు యేవిధమైన ఆస్తీ లేనప్పుడు మాత్రమే బతక గల ఆస్తి వ్యవస్థను మేము రద్దుచేయదలచుకున్నందుకు మీరు మమ్మల్ని నిందిస్తున్నా రన్నమాట.

ఒక్క మాటలో చెప్పాలంటే, మీ ఆస్తిని రద్దుచేయదలచుకున్నామని మమ్మల్ని మీరు నిందిస్తున్నారు. ఔను, సరిగ్గా అదే మేము చేయదలచుకున్నది.

కార్మిక శ్రమను పెట్టుబడిగానూ, డబ్బుగానూ, కౌలుగానూ మార్చడం యెప్పుడు సాధ్యం కాదో, కార్మిక శ్రమను గుత్తగొనబడగల సామాజిక శక్తిగా మార్చడం యెప్పుడు సాధ్యం కాదో, అనగా వ్యక్తిగత ఆస్తిని బూర్జువా ఆస్తిగా, పెట్టుబడిగా, మార్చడం యెప్పుడు సాధ్యం కాదో, అప్పుడు ఆ క్షణంనుండే, వ్యక్తుల వ్యక్తిత్వం అదృశ్యమౌతుందని మీ వాదన.

అనగా, మీ అవగాహనలో "వ్యక్తి" అంటే బూర్జువా వ్యక్తేనన్నమాట, బూర్జువా ఆస్తిపరుడు తప్ప మరెవ్వరూ కాదన్నమాట. యీ విషయం మీరు ఒప్పుకోక తప్పదు. అయితే, ఆ వ్యక్తిని తప్పక యీడ్చి పారవేయవలసిందే, ఆ వ్యక్తి వుండడానికే వీలు లేకుండా చేయవలసిందే.

కమ్యూనిజం యే వ్యక్తికీ సమాజ ఉత్పాదితాలను సొంతపరచుకునే హక్కు లేకుండా చేయదు. అలా సొంతపరచుకోవడం ద్వారా యితరులను కూలివాళ్లుగా మార్చే హక్కును మాత్రమే అది తొలగిస్తుంది.

సొంత ఆస్తి రద్దయితే పనిచేయడం అనేదే ఆగిపోతుందనీ, ప్రపంచమంతా సోమరితనం అలముకొంటుందనీ మరొక ఆక్షేపణ వుంది.

యీ వాదం నిజమే ఐతే, వట్టి సోమరితనంతో బూర్జువా సమాజం యేనాడో భ్రష్టు పట్టి పోయివుండేది; యీ సమాజంలో పనిచేసేవాళ్లు యేమీ సంపాయించుకో లేకపోవడమూ, యేమైనా సంపాయించుకునేవాళ్లు పనిచేయకపోవడమూ మనం చూస్తున్నదే కదా. పెట్టుబడి

రద్దయినప్పుడు కూలిపని అనేది కూడా రద్దౌతుంది అనే చర్వితచర్వణాన్నే యింకో రూపంలో వర్ణించడం తప్ప యీ ఆక్షేపణలో పస యేమీ లేదు.

భౌతిక ఉత్పాదితాలను కమ్యూనిస్టు పద్ధతిలో ఉత్పత్తి చేయడంమీదా, సొంతపరచుకోవడంమీదా యే ఆక్షేపణలు చేస్తున్నారో, ఆ ఆక్షేపణలే బౌద్ధిక ఉత్పాదితాలను కమ్యూనిస్టు పద్ధతిలో ఉత్పత్తి చేయడంమీదా, సొంతపరచుకోవడం మీదా కూడా చేస్తున్నారు. బూర్జువా దృష్టికి యేవిధంగా వర్గ ఆస్తి అదృశ్యం కావడం అసలు ఉత్పత్తే అదృశ్యం కావడంగా కనిపిస్తుందో, అదే విధంగా ఆ దృష్టికి వర్గ సంస్కృతి అదృశ్యం కావడం మొత్తం సంస్కృతి అంతా అదృశ్యం కావడంగా కనిపిస్తుంది.

ఏ సంస్కృతి పోతుందని బూర్జువా విలపిస్తున్నాడో ఆ సంస్కృతి సమాజంలో అధికాధిక సంఖ్యాకులకు యంత్రాలలాగా పనిచేసే శిక్షణ మాత్రమే.

స్వేచ్ఛ, సంస్కృతి, న్యాయశాస్త్రం మొదలైన వాటిని గురించి మీకున్న మీ బూర్జువా అభిప్రాయాలనే ప్రమాణాలుగా చేసి, బూర్జువా ఆస్తిని రద్దుచేయాలనే మా ఉద్దేశాన్ని ఆ ప్రమాణాలతో కొలిచేటట్లయితే, మీరు మాతో కీచులాడకండి. అసలు మీ భావాలే మీ బూర్జువా ఉత్పత్తి వ్యవస్థనుండీ, మీ బూర్జువా ఆస్తి వ్యవస్థనుండీ ఉద్భవించినవి. అదే విధంగా మీ న్యాయశాస్త్రం కూడా మీ వర్గంయొక్క ఇచ్ఛే. మీ వర్గంయొక్క ఇచ్ఛ సమస్త జనులూ అనుసరించవలసిన చట్టంగా చేయబడి న్యాయశాస్త్రమైంది. ఆ యిచ్ఛయొక్క సారాంశమూ, గమ్యమూ మీ వర్గం బతకడానికి అవసరమైన ఆర్థిక నియమాలచేత నిర్ణయింపబడుతున్నాయి.

మీ ప్రస్తుత ఉత్పత్తి విధానమూ, మీ ప్రస్తుత ఆస్తి వ్యవస్థా ఉత్పత్తి పురోగతిలో ఒకానొక దశలో ఉద్భవించి అంతరించిపోయే చారిత్రక సంబంధాలు మాత్రమే. వాటినుండి ఉత్పన్నమైన సామాజిక రూపాలను ప్రకృతి సిద్ధమూ తర్కబద్ధమూ ఐన నిత్య సత్యాలుగా మార్చాలనుకోవడం మీ స్వార్థపూరిత దురవగాహన ఫలితమే. ఈ దురవగాహన చరిత్రలో మీరు రాకముందు కూడా ప్రతి పాలకవర్గానికీ వుండిందే. ప్రాచీన ఆస్తి విషయంలో మీరు దేన్ని స్పష్టంగా అర్థం చేసుకోగలుగుతున్నారో, ఫ్యూడల్ ఆస్తి విషయంలో మీరు దేన్ని అంగీకరిస్తున్నారో, దాన్నే మీ సొంత బూర్జువా ఆస్తి విషయంలో మీరు ఒప్పుకోలేకపోవడం సహజమే.

కుటుంబం రద్దు! కమ్యూనిస్టులు చేసే యీ దారుణమైన ప్రతిపాదనమీద అత్యంత అతివాదులు కూడా మండిపడుతున్నారు.

యీనాటి కుటుంబం — అనగా బూర్జువా కుటుంబం — యే పునాదులమీద ఆధారపడి వుంది? పెట్టుబడిమీద, వ్యక్తిగత లాభంమీద. యీ కుటుంబంయొక్క పరిపూర్ణ రూపం బూర్జువాలలో మాత్రమే వుంది. కానీ యీ స్థితికి అనుబంధంగా రెండు అంశాలు వున్నాయి:

కార్మికుల్లో కుటుంబం అనేది ఆచరణలో లేకపోవడమూ, బహిరంగంగా సాగే సానివృత్తీ.

బూర్జువా కుటుంబంయొక్క యీ అనుబంధ అంశాలు అంతరించినప్పుడు బూర్జువా కుటుంబం దానంతట అదే అంతరిస్తుంది; పెట్టుబడి అంతరించినప్పుడు రెండూ అంతరిస్తాయి.

తలిదండ్రులు తమ పిల్లలమీద సాగించే దోపిడీని మేము అంతం చేయాలనుకున్నామని మీరు మమ్మల్ని నిందిస్తున్నారా? యీ విషయంలో మేము నేరస్తులమే.

కానీ, యింటివద్ద చెప్పే విద్యకు బదులు సామాజిక విద్య ప్రవేశపెట్టడం ద్వారా మేము అత్యంత పవిత్రమైన సంబంధాలు ధ్వంసం చేస్తున్నామని మీరు అంటారు.

మరి మీ విద్యో? అది కూడా సామాజిక విద్య కాదా? పాఠశాలలు మొదలైన వాటి ద్వారా సమాజం ప్రత్యక్షంగానో, పరోక్షంగానో విద్యలో జోక్యం కలిగించుకోవడం లేదా? తద్వారా దాన్ని సామాజిక పరిస్థితులు నిర్ణయించడం లేదా? విద్యలో సమాజ జోక్యం అనేది కమ్యూనిస్టులు సృష్టించింది కాదు. ఐతే కమ్యూనిస్టులు ఆ జోక్యంయొక్క స్వభావాన్ని మార్చాలంటారు, పాలకవర్గ ప్రభావంలో చిక్కుకున్న విద్యను రక్షించాలంటారు.

కుటుంబం గురించీ, విద్యను గురించీ, తలిదండ్రులకూ పిల్లలకూ గల పవిత్ర అనుబంధాలను గురించీ మీరు చెప్పేవన్నీ వట్టి బూర్జువా కబుర్లు. ఆధునిక పారిశ్రామిక వ్యవస్థ మూలంగా కార్మికుల కుటుంబ సంబంధాలన్నీ తునాతునకలయ్యే కొద్దీ, కార్మికుల బిడ్డలు వట్టి వ్యాపార వస్తువులుగానూ కూలిపనిచేసే సాధనాలుగానూ మారే కొద్దీ, మీ బూర్జువా కబుర్లు మరీ రోత పుట్టిస్తాయి.

కమ్యూనిస్టులు స్త్రీలను సమష్టి ఆస్తిగా చేస్తారో అని బూర్జువా లందరూ ఒకే గొంతుకతో పొలికేకలు పెడుతున్నారు.

బూర్జువాకు తన భార్య కేవలం ఉత్పత్తి సాధనంగా మాత్రమే కనపడుతుంది. ఉత్పత్తి సాధనాలను సమష్టిగా ఉపయోగించుకుంటారని అతని చెవులబడుతూనే, స్త్రీలకు కూడా అదే గతి సంభవిస్తుందని అతను నిర్ణయించుకుంటాడు. బూర్జువా బుద్ధికి అంతకు మించిన ఆలోచన యెలా వస్తుంది!

స్త్రీలు కేవల ఉత్పత్తి సాధనాలుగా వుండే యీ దుస్థితిని రద్దు చేయడమే మా అసలు లక్ష్యమని బూర్జువాకు కించిత్తు అనుమానమైనా రాదు.

కమ్యూనిస్టులు బహిరంగంగా శాసనరీత్యా స్త్రీలను సమష్టి ఆస్తిగా చేస్తారని తామే కల్పించి, ఆ కల్పనమీద ధర్మైక పరాయణుల మాదిరీ ఆగ్రహోదగ్రులయ్యే యీ బూర్జువాల ప్రవర్తన కంటె అపహాస్యకరమైనది మరొకటి వుండదు. కమ్యూనిస్టులు కొత్తగా స్త్రీలను సమష్టి ఆస్తిగా చేయవలసిన అవసరమేమీ లేదు; అది దాదాపు అనాది కాలంనుండి సమాజంలో వుంటూనే వుంది.

మన బూర్జువాలూ, బజారు వేశ్యలమాట అటుంచి, తమ చేతికింది కార్మికుల పెండ్లాలూ కూతుళ్లూ తమ అభీష్టానువర్తు అయ్యేది చాలక, ఒకరి పెండ్లాల నొకరు చెరచడంలో అపారమైన ఆనందం పొందుతున్నారు.

బూర్జువా వివాహ వ్యవస్థే నిజానికి సమష్టి పెండ్లాల వ్యవస్థ. కాబట్టి కమ్యూనిస్టులమీద బూర్జువాలు నింద వేయదలచుకుంటే, మహా ఐతే, బూర్జువాలు ప్రచ్ఛన్నంగా సాగించే కపట నాటకాన్ని కమ్యూనిస్టులు బహిరంగంగా చట్టబద్ధం చెయ్యగోరుతారని మాత్రమే నింద వేయగలరు. యిక చెప్పవలసిందేమంటే: ప్రస్తుత ఉత్పత్తి వ్యవస్థ రద్దు కావడంతోనే యిందులోనుండి ఉత్పన్నమైన సమష్టి భార్యా వ్యవస్థ కూడా — అనగా బహిరంగ వేశ్యావృత్తీ, ప్రచ్ఛన్న వేశ్యావృత్తీ — రద్దు ఔతుంది అనేది స్పష్టంగా తెలుస్తూనే వుంది.

కమ్యూనిస్టులు దేశాలనూ జాతులనూ రద్దుచేయగోరుతున్నారని మరొక నింద కూడా వుంది.

కార్మికులకు మాతృదేశం అనేది లేదు. కాబట్టి వాళ్లకు లేనిదాన్ని యెవరూ లాక్కోలేరు. కార్మికవర్గం ప్రప్రథమంగా రాజకీయ ఆధిపత్యం సంపాయించుకొని, తన జాతిలో తాను ప్రధాన వర్గంగా అభివృద్ధి చెంది, జాతి అంటే తానే అనే స్థితికి రాక తప్పదు గనుక, ఆ మేరకు కార్మికవర్గం జాతీయమైనదే — కానీ, ఆ మాటకు బూర్జువాలు చెప్పే అర్థంలో కాదు.

బూర్జువావర్గ అభివృద్ధి మూలంగానూ, స్వేచ్ఛా వాణిజ్యం మూలంగానూ, ప్రపంచ మార్కెట్ మూలంగానూ, ఉత్పత్తి విధానంలోనూ దాన్ని అనుసరించి వుండే జీవిత విధానంలోనూ వచ్చే ఏకత్వం మూలంగానూ, దినదినానికీ వివిధ జాతుల మధ్య వుండే జాతీయ విభేదాలూ, జాతీయ వైరుధ్యాలూ అంతరించిపోతున్నాయి.

కార్మికవర్గ ఆధిపత్యంలో అవి యింకా వేగంగా అంతరించిపోతాయి. కార్మికవర్గ విమోచనకు ఒక ముఖ్య షరతు యేమంటే వివిధ దేశాలు సమైక్యంగా కృషిచేయడం — కనీసం ప్రముఖ నాగరిక దేశాలు సమైక్యంగా కృషిచేయడం.

ఒక వ్యక్తిమీద మరొక వ్యక్తి చేసే దోపిడీ యే మేరకు అంతమొందింపబడుతుందో ఆ మేరకు ఒక జాతిమీద మరొక జాతి చేసే దోపిడీ కూడా అంతమొందింపబడుతుంది. ఒక జాతిలోని భిన్న వర్గాల మధ్య వైరుధ్యం యే మేరకు అంతరిస్తుందో ఆ మేరకు ఒక జాతికీ వేరొక జాతికీ మధ్య వుండే శత్రుత్వం కూడా అంతరిస్తుంది.

యిక మతదృష్ట్యానో, తత్వశాస్త్రదృష్ట్యానో, లేక యేదో ఒక సిద్ధాంత దృష్ట్యానో కమ్యూనిజంమీద వేసే ఆరోపణలు అంత శ్రద్ధగా పరిశీలించ దగినవి కావు.

మానవుని భౌతిక జీవిత పరిస్థితులలోనూ, అతని సామాజిక సంబంధాలలోనూ, అతని

సాంఘిక జీవితంలోనూ మార్పు వచ్చినప్పుడల్లా అతని ఊహలూ, అభిప్రాయాలూ, భావాలూ, ఒక్క మాటలో చెప్పాలంటే, అతని చైతన్యం మారుతుందని గ్రహించడానికి అంత పెద్ద అతీంద్రియ జ్ఞానం అవసరం లేదు కదా?

మానవ భావాల చరిత్ర రుజువు చేస్తున్న దేమిటి? భౌతిక వస్తూత్పత్తి యే మేరకు మారుతుందో ఆ మేరకు బౌద్ధిక ఉత్పత్తుల స్వభావంలో కూడా మార్పు వస్తుందని కాక పోతే మరేమిటి? ప్రతి యుగంలోనూ ప్రజలను శాసించే భావాలు ఆనాటి పాలకవర్గంయొక్క భావాలే.

సమాజంలో విప్లవం తెచ్చే భావాలు అని యెవరైనా అన్నప్పుడు, పాత సమాజం లోపల కొత్త సమాజపు బీజాలు ఉద్భవించినాయనీ, పాత జీవిత విధానం యే మేరకు క్షీణిస్తే అదే మేరకు పాత భావాలు కూడా క్షీణిస్తాయనీ అనే వాస్తవాన్ని మాత్రమే ఆ మాటలు వ్యక్తం చేస్తాయి.

ప్రాచీన ప్రపంచం మరణవేదనపడేటప్పుడు ప్రాచీన మతాలను క్రైస్తవ మతం ఓడించింది. 18వ శతాబ్దిలో క్రైస్తవ భావాలు హేతువాద భావాలకు లొంగిపోయినప్పుడు ఫ్యూడల్ సమాజం ఆనాటికి విప్లవకరమైన బూర్జువావర్గంతో అంతిమ పోరాటం చేసింది. మత స్వాతంత్ర్యమూ, అంతఃకరణ స్వాతంత్ర్యమూ అనే భావాలు యేమి వెల్లడిస్తాయంటే నిర్నిబంధ పోటీ అనే [బూర్జువా] సూత్రం జ్ఞానరంగంలో కూడా రాజ్యం చేసిందని మాత్రమే వెల్లడిస్తాయి.

"మత విశ్వాసాలూ, నైతికాభిప్రాయాలూ, తాత్వికాభిప్రాయాలూ, న్యాయశాస్త్ర భావాలూ చారిత్రక పురోగమనంలో మారిన మాట నిస్సందేహంగా నిజమే. కానీ మతం అనేదీ, నీతి అనేదీ, తత్వశాస్త్రం అనేదీ, రాజకీయ శాస్త్రం అనేదీ, న్యాయశాస్త్రం అనేదీ ఆ మార్పు లలో యెప్పుడూ నశించిపోకుండా బతికే వున్నాయిగదా" అని మీరు అనవచ్చు.

"అంతే కాక స్వేచ్ఛ, న్యాయం మొదలైన నిత్య సత్యాలు సమాజంయొక్క అన్ని దశల్లోనూ వుండేవి వున్నాయి. కానీ కమ్యూనిజం ఆ నిత్య సత్యాలనే రద్దు చేస్తుంది; మతాన్నీ, నీతినీ నూతన పునాదులపైన నిర్మించే బదులు సమస్త మతాన్నీ, సమస్త నీతినీ రద్దుచేస్తుంది. కాబట్టి కమ్యూనిజం గత చరిత్రలోని సమస్త అనుభవానికీ వ్యతి రేకంగా ప్రవర్తిస్తుంది" అని మీరు అనవచ్చు.

యీ ఆరోపణయొక్క తాత్పర్యం యేమిటి? గత సమాజపు చరిత్ర అంతా వివిధ దశలలో వివిధ రూపాలు ధరించిన వర్గవైరుధ్యాల అభివృద్ధే.

కానీ, ఆ వైరుధ్యాలు యే రూపం ధరించినప్పటికీ, ఒక విషయం మాత్రం గతించిన యుగాలన్నిటికీ సమాన లక్షణంగా వుంది; యేదంటే, సమాజంలో ఒక భాగాన్ని మరొక భాగం దోపిడీ చేయడం. కాబట్టి గత యుగాల సామాజిక చైతన్యం యెంత బహుళత్వమూ,

యెంత వైవిధ్యమూ ప్రదర్శించినా, అది కొన్ని సామాన్య రూపాలలోనే (common forms), లేదా కొన్ని సాధారణ భావాల (general ideas) మధ్యనే సంచరిస్తూ వుంటుంది; సమస్త వర్గవైరుధ్యాలూ సమూలంగా అంతరించినప్పుడు తప్ప యీ రూపాలు, లేక భావాలు సంపూర్ణంగా అంతరించిపోవు. యిందులో ఆశ్చర్యపడవలసిందేమీ లేదు.

కమ్యూనిస్టు విప్లవం అనేది సాంప్రదాయిక ఆస్తి సంబంధాలతో అత్యంత మౌలికంగా తెగతెంపులు చేసుకోవడం. కనుక కమ్యూనిస్టు విప్లవంయొక్క అభివృద్ధిలో సాంప్రదాయిక భావాలతో అత్యంత మౌలికంగా తెగతెంపులు చేసుకోవడం యిమిడి వుంది. యిందులో ఆశ్చర్య పడవలసిందేమీ లేదు.

కమ్యూనిజంమీద బూర్జువాలకు గల ఆక్షేపణల గురించి యింతటితో చాలిద్దాం.

కార్మికవర్గ విప్లవంలో మొదటి మెట్టు కార్మికవర్గం పాలకవర్గం కావడమనీ, ప్రజా స్వామ్యాన్ని గెలుచుకోవడమనీ పైన తెలుసుకున్నాం.

కార్మికవర్గం తన రాజకీయ ఆధిపత్యం ఉపయోగించి బూర్జువావర్గంనుండి సమస్త పెట్టుబడినీ క్రమక్రమంగా గుంజుకొని, ఉత్పత్తి సాధనాలన్నిటినీ రాజ్యం చేతుల్లో — అనగా పాలకవర్గంగా సంఘటితపడిన కార్మికవర్గం చేతుల్లో — కేంద్రీకరించి, మొత్తం ఉత్పాదక శక్తులను సాధ్యమైనంత వేగంగా వృద్ధిచేస్తుంది.

సహజంగానే ప్రారంభంలో ఆస్తి హక్కులమీదా, బూర్జువా ఉత్పత్తి విధానంమీదా నిరంకుశమైన దాడులు చేస్తే తప్ప యిది సాధ్యం కాదు. నిరంకుశమైనవి గనుక, యీ చర్యలు ఆర్థికంగా అరకొరగానూ, అసమర్థనీయంగానూ కనపడతాయి. కానీ యీ చర్యలు కాలక్రమాన యింకా పెద్దవౌతాయి, పాత సామాజిక వ్యవస్థమీద యింకా దాడులు చేయ వలసిన అవసరం కలిగిస్తాయి, మొత్తం ఉత్పత్తి విధానాన్ని విప్లవాత్మకంగా మార్చడానికి అనివార్యమైనవి.

ఈ చర్యలు భిన్న దేశాల్లో భిన్న భిన్నంగా వుండడం సహజమే.

ఐనప్పటికీ, అత్యంత పురోగామి దేశాలకు యీ కిందివి సర్వ సాధారణంగా వర్తిస్తాయి.

1. భూములమీద ఆస్తి హక్కు రద్దుచేసి, భూములమీద వచ్చే కౌలు డబ్బు అంతా సామాజిక కార్యాలకు వినియోగించడం.

2. క్రమప్రవర్ధమానంగా వుండే భారమైన ఆదాయపు పన్ను.

3. వారసత్వపు హక్కులన్నీ రద్దు.

4. దేశాంతరగతుల ఆస్తీ, తిరుగుబాటుదార్ల ఆస్తీ ప్రభుత్వ స్వాధీనం చేసుకోవడం.

5. ప్రభుత్వ పెట్టుబడితో జాతీయ బాంకి యేర్పరచి, పరపతి అంతా గుత్తాధి కారంతో ప్రభుత్వం చేతిలో కేంద్రీకరించడం.

6. వార్తా రవాణా సాధనాలు ప్రభుత్వం చేతిలో కేంద్రీకరించడం.

7. ప్రభుత్వ ఫాక్టరీలూ, ఉత్పత్తి సాధనాలూ విస్తరింపజేయడం; బంజరు భూములు సాగుచేయడం, ఒక సమష్టి పథకం ప్రకారం భూములు సారవంతం చేయడం.

8. పనిచేసే బాధ్యత అందరికీ సమానంగా వుండడం. కార్మిక సైన్యాలు యేర్పరచడం — ముఖ్యంగా వ్యవసాయం కొరకు.

9. వ్యవసాయాన్నీ పరిశ్రమలనూ సమ్మేళనం చేయడం, జనసంఖ్య విషయంలో వివిధ ప్రాంతాల అసమానతలు తగ్గించడం ద్వారా పట్టణాలకూ పల్లెలకూ గల భేదం క్రమక్రమంగా రద్దుచేయడం.

10. ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలందరికీ ఉచిత విద్య. ఇప్పుడు చేస్తున్నట్లు పిల్లలు ఫాక్టరీలలో పనిచేయడం రద్దు. విద్యను పారిశ్రామిక ఉత్పత్తితో మేళవించడం వగైరా, వగైరా.

సమాజ అభివృద్ధి క్రమంలో వర్గవిభేదాలు అంతరించి, ఒక విస్తారమైన సదస్సుగా రూపొందిన మొత్తం జాతి చేతిలో సమస్త ఉత్పత్తి సాంద్రీకరింపబడినప్పుడు, ప్రభుత్వ అధికారం రాజకీయ స్వభావాన్ని కోల్పోతుంది. అసలు రాజకీయ అధికారమనేది, సరైన అర్థంలో, ఒక వర్గాన్ని పీడించడానికి మరొక వర్గం ఉపయోగించే సంఘటిత శక్తి మాత్రమే. కార్మికవర్గం, బూర్జువావర్గంతో తాను పోరాటం చేసే కాలంలో, పరిస్థితుల ప్రాబల్యం వల్ల, తానే ఒక వర్గంగా సంఘటితం కావలసి వస్తే, విప్లవం ద్వారా తానే పాలకవర్గ స్థానం అధిష్ఠిస్తే, తన్మూలంగా పాత ఉత్పత్తి విధానాన్ని బలవంతంగా వూడ్చి పారవేస్తే, అప్పుడు ఆ విధానంతోపాటు మొత్తం వర్గాలూ వర్గవిభేదాలూ బతకడానికి అవసరమైన పరిస్థితులను కూడా వూడ్చి పారవేసి వుంటుంది, తన్మూలంగా తన వర్గాధిపత్యాన్నే రద్దు చేసుకొని వుంటుంది.

వర్గాలూ, వర్గ విభేదాలూ గల పాత బూర్జువా సమాజానికి బదులు మన కొక నూతన సమాజం లభిస్తుంది; ప్రతి ఒకడూ స్వేచ్ఛగా అభివృద్ధి చెందినప్పుడే అందరూ స్వేచ్ఛగా అభివృద్ధి చెందగల సమాజం అది.

# III

# సోషలిస్టు, కమ్యూనిస్టు సారస్వతం

## 1. ప్రగతి వ్యతిరేక సోషలిజం

### అ. ఫ్యూడల్ సోషలిజం

ఫ్రాన్సు యింగ్లండులలోని ఫ్యూడల్ ప్రభువర్గాలకు, ఆనాడు వాళ్లకుండిన చారిత్రక స్థితిని బట్టి, ఆధునిక బూర్జువా సమాజానికి వ్యతిరేకంగా ప్రచార పుస్తకాలు రాయడం

వృత్తి అయింది. 1830 జూలై నాటి ఫ్రెంచి విప్లవంలోనూ, పార్లమెంటు సంస్కరణల కొరకు యింగ్లండులో జరిగిన ఉద్యమంలోనూ,[24] మళ్లీ ఆ ప్రభువర్గాలవాళ్లు హఠాత్తుగా పైకి వచ్చిన ఆ నీచజాతివాళ్ల చేతిలో ఓడిపోయినారు. ఆనాటినుండి నిజమైన రాజకీయ పోరాటమనే ఆలోచనకే తావు లేదు. మిగిలిందల్లా సారస్వత యుద్ధం మాత్రమే. కానీ సారస్వత రంగంలో కూడా పునరుద్ధరణ కాలం[25] నాటి పాత పాలికేకలు అసంభవమైపోయినాయి.

యితరుల సానుభూతి సంపాయించుకొనే ఉద్దేశంతో ఫ్యూడల్ ప్రభువర్గం తమ సొంత ప్రయోజనాలను విస్మరించినట్లు కనపడుతూ, పీడిత కార్మికవర్గ ప్రయోజనాల దృష్ట్యా మాత్రమే బూర్జువావర్గంమీద నేరారోపణ చేయవలసి వచ్చింది. ఆవిధంగా ఫ్యూడల్ ప్రభువర్గం తమ కొత్త యజమానిమీద యెగతాళి పాటలుకట్టీ, మహోపద్రవం రానున్నదని యజమాని చెవిలో అశుభపు జోస్యాలు చెప్పీ, బూర్జువావర్గంమీద కసి తీర్చు కున్నారు.

ఈవిధంగా ఉత్పన్నమైంది ఫ్యూడల్ సోషలిజం. ఇది సగం యేడుపూ, సగం వెక్కిరింతా; సగం గత కాలపు ప్రతిధ్వనీ, సగం భవిష్యత్ కాలపు బెదిరింపూ; నిశితవ్యంగ్య విషపూరిత విమర్శలతో అప్పుడప్పుడు బూర్జువాల గుండెలు చీల్చింది; కానీ, ఆధునిక చరిత్ర గతిని అర్థం చేసుకొనే శక్తి బొత్తిగా లేకపోవడంవల్ల యెప్పుడూ పరిహాసాస్పదంగానే వుండింది.

ప్రజలను తమ చుట్టూ సమీకరించుకోడానికి ఫ్యూడల్ ప్రభువులు కార్మికవర్గపు బిచ్చపు జోలెను పతాకగా తమ ముందరివైపు ఆడించినారు. కానీ, ప్రజలు వాళ్లతో కలిసిన ప్పుడల్లా, వాళ్ల పృష్ఠభాగాలమీద వున్న పాత ఫ్యూడల్ వంశచిహ్నాలను చూసి వెటకారంగా విరగబడి నవ్వుతూ, వాళ్లను వదలివేసి వెళ్లేవాళ్లు.

ఫ్రెంచి లెజిటిమిస్టులలో[26] ఒక భాగమూ, "యంగ్ యింగ్లండు" అనే సంస్థా[27] యీ నాటకం ప్రదర్శించినారు.

యీ ఫ్యూడల్‌వాదులు తమ దోపిడీ విధానం బూర్జువా దోపిడీ విధానం కంటె భిన్న మైందని వాదిస్తారు కానీ, తాము దోపిడీ చేసిన నాటి పరిస్థితులు చాలా భిన్నంగా వుండినాయనీ, అవి పాతబడి పనికి రాకుండా పోయినాయనీ మరచిపోతారు. తాము పాలించే రోజుల్లో ఆధునిక కార్మికవర్గం లేనేలేదని రుజువు చేస్తారు కానీ, తమ సమాజ వ్యవస్థనుండే ఆధునిక బూర్జువావర్గం అనివార్యంగా జన్మించిందని వీళ్లు మరచిపోతారు.

వీళ్లు తమ విమర్శలలోని ప్రగతి వ్యతిరేక స్వభావాన్ని యెంత బొత్తిగా దాచరంటే, పాత సమాజ వ్యవస్థ నంతటినీ సమూలంగా పెళ్లగించి వేయడానికే జన్మ యెత్తిన ఒక వర్గం బూర్జువా పరిపాలనలో పెంపొందుతున్న దనేదే వీళ్లు బూర్జువావర్గంమీద చేసే ప్రధాన అభియోగంయొక్క సారాంశం.

వీళ్లు బూర్జువావర్గాన్ని నిందించేది అది కార్మికవర్గాన్ని సృష్టించినందుకు కాదు, విప్లవ కార్మికవర్గాన్ని సృష్టించినందుకు.

అందుచేత రాజకీయ ఆచరణలో వీళ్లు కార్మికవర్గానికి వ్యతిరేకమైన దమన శాసనాల నన్నిటినీ బలపరుస్తారు. నిత్య జీవితంలో, పైకి యెంత బడాయిగా మాట్లాడినా, వీళ్లు పరిశ్రమల చెట్టునుండి రాలిన బంగారుపండ్లను యేరుకోడానికి దిగజారుతూనే వుంటారు; వున్ని, బీట్‌రూటు చక్కెర, బంగాళా దుంపల సారాయి లాంటి పరిశ్రమలలో లాభాలు పొందడానికి సత్యం, ప్రేమ, ఆత్మగౌరవం అన్నీ అమ్మివేస్తూ వుంటారు.*

ఫ్యూడల్ భూస్వామితో మతగురువు యెల్లప్పుడూ చెట్టాపట్టాలు వేసుకొని తిరిగినట్లే, ఫ్యూడల్ సోషలిజంతో క్రైస్తవ సోషలిజం యెల్లప్పుడూ కలిసే వుంటుంది.

క్రైస్తవ వైరాగ్యానికి సోషలిస్టు రంగుపూయడం చాలా తేలిక. క్రైస్తవ మతం సొంత ఆస్తిని ఖండించలేదా? వివాహాన్ని ఖండించలేదా? రాజ్యాన్ని ఖండించలేదా? వీటికి బదులు దానం, పేదరికం, బ్రహ్మచర్యం, యింద్రియ దమనం, సన్యాసం, చర్చిసేవ వగైరాలను బోధించలేదా? ఫ్యూడల్ ప్రభువుల మనస్సులలోని ఈర్ష్యాసూయలను పవిత్ర పరచడానికి మతగురువు వాడే మంత్రమే క్రైస్తవ సోషలిజం.

## ఆ. పెటీబూర్జువా సోషలిజం

బూర్జువావర్గంవల్ల నాశనమైంది ఒక్క ఫ్యూడల్ ప్రభువర్గమే కాదు; ఆధునిక బూర్జువా సమాజపు వాతావరణంలో కృశించి నశించింది ఒక్క ఫ్యూడల్ ప్రభువుల జీవిత విధానమే కాదు. మధ్యయుగాల పట్టణ స్వతంత్ర పౌరులూ, సొంత పొలం గల చిన్న రైతులూ ఆధునిక బూర్జువావర్గానికి పూర్వీకులు. పరిశ్రమలూ, వాణిజ్యమూ యింకా సరిగా అభివృద్ధి కాని దేశాలలో యీ రెండు వర్గాలూ వర్ధమాన బూర్జువావర్గం పక్కనే నిస్సారంగా బతుకుతూ వుంటాయి.

---

* ఇది ప్రధానంగా జర్మనీకి వర్తిస్తుంది. జర్మన్ భూస్వాములూ, ఫ్యూడల్ ప్రభువులూ మేనేజర్లను పెట్టి తమ భూములలో విస్తారమైన భాగాలను సొంత వ్యవసాయం చేసుకుంటారు. అంతేకాక, బీట్‌రూటుతో చక్కెర, బంగాళా దుంపలతో సారాయి తయారుచేసే ఫాక్టరీలు నడుపుతారు. వీళ్లకంటె ధనవంతులైన బ్రిటిష్ ప్రభువులు యింకా యీ స్థితికి దిగజారలేదు గానీ, వాళ్లు కూడా నమ్మదగని జాయింటుస్టాక్ కంపెనీలు తమ పేర్లు వినియోగించుకోడానికి అనుమతించి, తగ్గిపోతున్న తమ ఆదాయాలను తద్వారా భర్తీ చేసుకోవడం నేర్చుకున్నారు. (1888 యింగ్లీషు కూర్పులో ఎంగెల్స్ యిచ్చిన వివరణ.)

ఆధునిక నాగరికత పూర్తిగా అభివృద్ధి చెందిన దేశాలలో పెటీబూర్జువావర్గం అనే ఒక కొత్త వర్గం యేర్పడింది. యిది కార్మికవర్గానికీ బూర్జువావర్గానికీ మధ్య అటూ యిటూ ఊగుతూ వుంటుంది, బూర్జువా సమాజపు అనుబంధంగా నిత్యం పునస్సృష్టి ఔతూ వుంటుంది. కానీ యీ వర్గంలో సభ్యులైన వ్యక్తులు, వ్యాపార పోటీ మూలంగా, కార్మికవర్గంలోకి నిత్యం దిగదోయబడుతూ వుంటారు. ఆధునిక పరిశ్రమలు అభివృద్ధి అయ్యే కొద్దీ ఆధునిక సమాజంలో ఒక స్వతంత్ర విభాగంగా తాము అంతరించిపోయే సమయం సమీపిస్తున్నదనీ, కర్మాగారాలలోనూ, వ్యవసాయంలోనూ, వర్తకంలోనూ తమకు బదులు మేస్త్రీలూ, మేనేజర్లూ, గుమాస్తాలూ వస్తారనీ గ్రహిస్తారు కూడా.

జనాభాలో సగం కంటె చాలా యెక్కువమంది రైతులుగా వున్న ఫ్రాన్సువంటి దేశాల్లో, బూర్జువావర్గానికి వ్యతిరేకంగా కార్మికవర్గ పక్షం వహించిన రచయితలు తాము బూర్జువా వ్యవస్థమీద చేసే విమర్శలలో రైతునూ పెటీబూర్జువానూ ప్రమాణంగా తీసుకొని, యీ మధ్య వర్గాల దృష్టితో కార్మికవర్గం తరఫున పోరాటానికి పూనుకోవడం సహజమే. యీవిధంగా ఉద్భవించింది పెటీబూర్జువా సోషలిజం. యీ సిద్ధాంతానికి ఫ్రాన్సులోనే కాక యింగ్లండులో కూడా సిస్మాండీ నాయకుడు.

యీ పెటీబూర్జువా సోషలిజం ఆధునిక ఉత్పత్తి విధానంలోని వైరుధ్యాలను యెంతో ప్రజ్ఞతో పరిశీలన చేసింది. అర్థశాస్త్రవేత్తల మోసపు సమర్థనలను అది బయటపెట్టింది. యంత్రాలవల్లా, శ్రమవిభజనవల్లా ఘోరమైన దుష్ఫలితాలు కలుగుతాయనీ, పెట్టుబడీ భూమీ కొద్దిమంది చేతుల్లో సాంద్రీకృత మౌతాయనీ, మితిమీరిన ఉత్పత్తీ ఆర్థిక సంక్షోభాలూ కలుగుతాయనీ అది తిరుగులేని విధంగా రుజువు చేసింది. పెటీబూర్జువాలూ, రైతులూ అనివార్యంగా పొందే సర్వనాశనాన్నీ, కార్మికవర్గ దైన్య స్థితినీ, ఉత్పత్తిలో అరాజకత్వాన్నీ, దేశ సంపద పంపకంలోని దారుణమైన అసమానతలనూ, దేశాల మధ్య జరిగే మరణాంతకమైన పారిశ్రామిక యుద్ధాలనూ, పాత నీతి బంధాలకూ, పాత కుటుంబ సంబంధాలకూ, పాత జాతులకూ కలిగే విచ్ఛిత్తినీ అది వెల్లడిచేసింది.

కానీ, యీ సోషలిజానికి గల నిర్మాణాత్మక లక్ష్యాలు యేమిటి? పాత ఉత్పత్తి సాధనాలనూ, పాత మారకపు సాధనాలనూ పునరుద్ధరించి, వాటితోపాటు పాత ఆస్తి సంబంధాలనూ, పాత సమాజాన్నీ పునరుద్ధరించడం; లేదా ఆధునిక ఉత్పత్తి సాధనాలచేతా, ఆధునిక మారకపు సాధనాలచేతా బద్దలైన, బద్దలుకాక తప్పని, పాత ఆస్తి సంబంధాల చట్టంలోనే యీ సాధనాలను బలవంతంగా యిరికించడం. ఈ రెండూ కూడా ప్రగతి నిరోధకాలే, ఊహాస్వర్గ పథకాలే.

యీ సోషలిజంయొక్క చరమ లక్ష్యం యేమంటే: పరిశ్రమల్లో వృత్తి సంఘాలు, వ్యవసాయంలో పితృస్వామిక సంబంధాలు.

చివరకు, కరకు చారిత్రక వాస్తవాల వల్ల ఆత్మవంచనచే కలిగిన మత్తు వదలినప్పుడు, యీ సోషలిజం బిక్కముఖం వేసుకొని కూర్చుంది.

## ఇ. జర్మన్ సోషలిజం, లేక "అసలు" సోషలిజం

ఫ్రాన్సులో బూర్జువావర్గం అధికారంలో వున్నప్పుడు, బూర్జువావర్గ ప్రభుత్వపు భారం వల్ల, బూర్జువా ప్రభుత్వంమీద జరిగే పోరాటాన్ని వ్యక్తీకరిస్తూ, ఫ్రెంచి సోషలిస్టు, కమ్యూనిస్టు సారస్వతం ఉద్భవించింది. కానీ, జర్మనీలో బూర్జువావర్గం ఫ్యూడల్ నిరంకుశత్వంతో అప్పుడప్పుడే పోరాటం ప్రారంభించి వుండిన సమయంలో, యీ సారస్వతం ఫ్రాన్సు నుండి జర్మనీలోకి దిగుమతి అయింది.

జర్మన్ తత్వవేత్తలూ, తత్వవేత్తలు కాదలచినవాళ్ళూ, జర్మన్ ప్రౌఢబుద్ధులూ యీ సారస్వతంమీదికి ఆత్రంగా యెగబడినారు. కానీ, యీ రచనలు ఫ్రాన్సునుండి జర్మనీలోకి దిగుమతి ఐనప్పుడు, వీటి వెంట ఫ్రాన్సులోని సామాజిక పరిస్థితులు దిగుమతి కాలేదనే విషయం వాళ్ళు విస్మరించినారు. జర్మన్ సామాజిక పరిస్థితుల సంపర్కంతో యీ సారస్వతం తక్షణ ఆచరణాత్మక ప్రాముఖ్య మంతా కోల్పోయి, కేవల సారస్వత విషయంగా నిలిచింది. ఈవిధంగా, 18వ శతాబ్దపు జర్మన్ తత్వవేత్తల దృష్టిలో ప్రథమ ఫ్రెంచి విప్లవ డిమాండ్లు ధర్మ దేవతయొక్క సాధారణ డిమాండ్లు మాత్రమే; విప్లవ ఫ్రెంచి బూర్జువావర్గపు ఇచ్ఛలో వాళ్ళకు దర్శన మిచ్చింది ఇచ్ఛాదేవతయొక్క అకలంక స్వరూపం, ఇచ్ఛాదేవతయొక్క అవశ్య స్వరూపం, సమస్త మానవాళినీ పాలించే ఇచ్ఛాదేవతయొక్క అసలైన స్వరూపం.

జర్మన్ పండితమ్మన్యులు చేసిన కృషి అంతా యేమిటంటే, తమ పురాతన తాత్విక అంతరాత్మకు ఆమోదయోగ్యంగా వుండేటట్లు యీ నూతన ఫ్రెంచి భావాలను రూపు దిద్దతం; లేదా, యింకా సరిగా చెప్పాలంటే, తమ సొంత తాత్విక దృష్టికి అనుకూలంగా ఫ్రెంచి భావాలను జీర్ణించుకోవడం.

ఒక విదేశ భాషను యేవిధంగా జీర్ణించుకుంటామో ఆవిధంగానే యీ సంగ్రహణం జరిగింది; అనగా అనువాదం ద్వారా.

క్రైస్తవ సన్యాసులు క్రైస్తవేతరులైన ఆదిమ జాతుల పురాణాలు లిఖించిన రాత పుస్తకాలమీద యేవిధంగా క్రైస్తవ భక్తుల వ్యర్థ జీవిత కథలు రాసిందీ అందరికీ తెలుసు.

జర్మన్ పండితమ్మన్యులు ఐహిక ఫ్రెంచి సోషలిస్టు సారస్వత విషయంలో యిదే పద్ధతి తలక్రిందులుగా అనుసరించినారు. వీళ్లు తమ తాత్విక చెత్తను ఫ్రెంచి సోషలిజంకింద రాసినారు. ఉదాహరణకు, డబ్బుయొక్క ఆర్థిక విధుల గురించిన ఫ్రెంచి విమర్శకింద వాళ్లు "మానవజాతి అన్యధాకరణ" అని రాసినారు; బూర్జువా రాజ్యం గురించిన ఫ్రెంచి విమర్శకింద "సామాన్య వాచక సింహాసనచ్యుతి" అని రాసినారు, యింకా అనేకం యీవిధంగా చేసినారు.

ఫ్రెంచి చారిత్రక విమర్శల వెనక యీ తాత్విక పదాలు ప్రవేశపెట్టడాన్ని వాళ్లు "క్రియాత్మక తత్వశాస్త్రం" అనీ, "అసలు సోషలిజం" అనీ, "జర్మన్ సోషలిస్టు శాస్త్రం" అనీ, "సోషలిజంయొక్క తాత్విక మూలం" అనీ నామకరణం చేసినారు.

ఈవిధంగా ఫ్రెంచి సోషలిస్టు కమ్యూనిస్టు సారస్వతం సంపూర్ణంగా నిర్వీర్యం చేయ బడింది. జర్మన్ల చేతుల్లో అది ఒక వర్గంమీద మరొక వర్గం చేసే పోరాటాన్ని వ్యక్తం చేయడం మానుకుంది గనుక, వాళ్లు "ఫ్రెంచి పాక్షికత"ను అధిగమించినట్లూ, సత్యంగా కావలసిన అవసరాలను గాక, పరమ సత్యానికి కావలసిన అవసరాలను వెలిబుచ్చినట్లూ భావించినారు; వాళ్లు వెలిబుచ్చిన ప్రయోజనాలు కార్మికవర్గానివి గావు; మానవ ప్రకృతివి — యే వర్గానికీ చెందని, రూప నామ క్రియలు లేని, తాత్వికభ్రమా సంజనిత నభోమండలంలో తప్ప యెక్కడా వుండని సాధారణ మానవుని ప్రయోజనాలు.

బడిపిల్లల రచనలాంటి తన రచనపట్ల అంత శ్రద్ధాసక్తులను కనబరచిన యీ జర్మన్ సోషలిజం, తన నాసి సరకును అంత సిగ్గు విడిచి తెగ పొగుడుకున్న యీ జర్మన్ సోషలిజం, యీలోగా క్రమక్రమంగా తన ఛాందస అమాయకత్వం కోల్పోయింది.

ఫ్యూడల్ ప్రభువర్గంతోనూ, నిరంకుశ రాజరికంతోనూ జర్మన్ బూర్జువావర్గం, ముఖ్యంగా ప్రష్యన్ బూర్జువావర్గం, చేసే పోరాటం, అనగా ఉదారవాద ఉద్యమం, మరింత శ్రద్ధగా పనిచేయసాగింది.

దీనితో యెన్నాళ్లనుండో యెదురుచూస్తూ వుండిన అవకాశం లభించింది "అసలు" సోషలిజానికి. వెంటనే అది రాజకీయ ఉద్యమాన్ని తన సోషలిస్టు డిమాండ్లతో యెదుర్కొంది; ఉదారవాదంమీదా, ప్రజాప్రాతినిధ్యపు ప్రభుత్వంమీదా, బూర్జువా పోటీమీదా, బూర్జువా పత్రికా స్వాతంత్ర్యంమీదా, బూర్జువా శాసన నిర్మాణంమీదా, బూర్జువా స్వేచ్ఛా సమానత్వాలమీదా మామూలు శాపనార్థాలన్నీ కురిపించింది; బూర్జువా ఉద్యమం ద్వారా కలిగే లాభమేమీ లేదనీ, అంతా నష్టమేననీ సామాన్య ప్రజలను ఉద్బోధించింది. కానీ, ఫ్రెంచి విమర్శకు అసందర్భపు ప్రతిధ్వని ఐన యీ జర్మన్ సోషలిజం అసలు సమయానికి ఒకటి మరిచిపోయింది: ఫ్రెంచి విమర్శ పుట్టిన నాటికి ఆధునిక బూర్జువా సమాజం అనేది వుండింది, అది వుండడానికి తగిన ఆర్థిక విధానమూ వుండింది, రాజకీయంగా తదనుగుణ

మైన రాజ్యాంగమూ వుండింది; సరిగ్గా వీటిని సాధించడమే జర్మనీలో సాగుతుండిన ఉద్యమంయొక్క లక్ష్యం.

యీ జర్మన్ సోషలిజాన్ని నిరంకుశ ప్రభుత్వాలూ, వాటి పరివారంలోని మతగురువులూ, ప్రొఫెసర్లూ, ఫ్యూడల్ ప్రభువులూ, రాజోద్యోగులూ తమకు ప్రమాదంగా పరిణమిస్తున్న బూర్జువావర్గాన్ని బెదరగొట్టడానికి తగిన దిష్టిబొమ్మగా ఆప్యాయతతో ఉపయోగించుకున్నారు.

సరిగ్గా ఆ కాలంలోనే జర్మన్ కార్మికవర్గపు తిరుగుబాటు రోగానికి కొరడా దెబ్బలూ తుపాకీ కాల్పులూ అనే చేదు మాత్రలు యిచ్చి వుండిన ఆ నిరంకుశ ప్రభుత్వాలే జర్మన్ సోషలిజాన్ని దిష్టిబొమ్మగా వాడుకోవడం చేదు మాత్రల తర్వాత నోటికి తీపి అందించినట్లు వుండింది.

ఈవిధంగా యీ "అసలు" సోషలిజం ఒకవైపున జర్మన్ బూర్జువావర్గాన్ని దెబ్బ తీయడానికి ఫ్యూడల్ ప్రభుత్వాల చేతిలో ఆయుధంగా ఉపయోగపడుతూ, మరొక వైపున ఒక ప్రగతి వ్యతిరేక ప్రయోజనానికి, జర్మన్ అల్పబుద్ధుల ప్రయోజనానికి, ప్రత్యక్ష ప్రాతినిధ్యం వహించింది. జర్మనీలో నేటి పరిస్థితికి నిజమైన సాంఘిక పునాది యేదంటే 16వ శతాబ్దపు అవశేషమై, ఆనాటినుండి నిరంతరం వివిధ రూపాల్లో తల యెత్తుతున్న పెటీ బూర్జువావర్గం.

యీ వర్గాన్ని అలాగే నిలుపుకోవడమంటే జర్మనీలో ప్రస్తుత పరిస్థితినే నిలుపుకోవడమన్నమాట. బూర్జువావర్గపు పారిశ్రామిక రాజకీయ ఆధిపత్యం వస్తే యీ పెటీబూర్జువా వర్గం నిస్సంశయంగా నాశనమౌతుంది – యిటు పెట్టుబడి సాంద్రీకరణ మూలంగానూ, అటు విప్లవ కార్మికవర్గ జననం ద్వారానూ. "అసలు" సోషలిజం యీ రెండు పిట్టలనూ ఒకే దెబ్బతో చంపేటట్లు కనపడింది. అది మహమ్మారిలాగా వ్యాపించింది.

తాత్విక సాలెగూళ్ల చీనాంబరాలమీద కావ్య భాషాలంకారాల జరీబుటాలు కుట్టి, వెగటు మమతల తెలిమంచు తుంపరలో ముంచి – యీ దివ్యాంబరాలలో జర్మన్ సోషలిస్టులు యెముకల గూడు లాంటి తమ వికృతాకారపు "నిత్యసత్యా"లను అలంకరించినారు. యీ అలంకరణతో వాళ్ల సరుకు ఆ ప్రజలలో అద్భుతంగా అమ్ముడుపోయింది.

పెటీబూర్జువా అల్పబుద్ధుల ఆర్భాటపు ప్రతినిధిగా పనిచేయడమే తన వృత్తి అని జర్మన్ సోషలిజం అంతకంతకూ గుర్తించింది.

జర్మన్ జాతే ఆదర్శ జాతి అనీ, అల్పిష్ఠ జర్మన్ అల్పబుద్ధులే కల్తీలేని మానవులనీ అది ఉద్ఘాటించింది. యీ ఆదర్శ మానవుల నీచపు క్రూరకర్మలకన్నిటికీ గూఢార్థాలు లాగి, వాటి నిజస్వభావానికి కేవల విరుద్ధమైన విధంగా ఉదాత్త సోషలిస్టు వ్యాఖ్యానాలు కల్పించింది. అది కమ్యూనిజంలో "అమానుష విధ్వంసక" ధోరణి వున్న దంటూ, దాన్ని సూటిగా వ్యతిరేకించేటంతవరకూ పోయింది; సకల వర్గపోరాటాలమీదా సమానమైన ఏహ్యభావం

వెలి(గక్కే టంతవరకూ పోయింది. యీ నాడు (1847) సోషలిస్టు కమ్యూనిస్టు గ్రంథాలుగా జర్మనీలో వున్నవన్నీ, యే ఒకటి రెండో తప్ప, మనుషులను నిర్వీర్యపరిచే యీ దుర్గంధ భూయిష్ఠమైన జర్మన్ సారస్వతానికి సంబంధించినవే.*

## 2. యధాస్థితివాద సోషలిజం, లేక బూర్జువా సోషలిజం

బూర్జువా సమాజాన్ని చిరస్థాయి చేసే ఉద్దేశంతో, సామాజిక యిబ్బందులు తొలగించాలని బూర్జువావర్గంలో ఒక భాగం కోరుతుంది.

యీ భాగంలో రకరకాల వాళ్లు వున్నారు — అర్థశాస్త్రవేత్తలూ, దానశీలురూ, దయాపరులూ, కార్మికవర్గ సంక్షేమకారులూ, ధర్మసంస్థా నిర్వాహకులూ, జంతుహింసా నివారణ సంఘ సభ్యులూ, మితపాన ప్రచార పరవశులూ, యింకా అనంత రూపాల కుహనా సంస్కర్తలూ వున్నారు. అంతేకాక, యీ రకం సోషలిజం కొన్ని సమగ్ర సిద్ధాంతాలుగా కూడా తయారు చేయబడింది.

యీ రకానికి ఉదాహరణగా ప్రూడన్ రాసిన "దారిద్ర్యంయొక్క తత్వశాస్త్రం"**ను చెప్పవచ్చు.

సోషలిస్టు బూర్జువాలు ఆధునిక సాంఘిక పరిస్థితులు యిచ్చే సౌకర్యాలన్నీ కావాలంటారు — కానీ వాటివెంట తప్పనిసరిగా వచ్చే పోరాటాలూ, ప్రమాదాలూ మాత్రం లేకుండా. ప్రస్తుత సమాజంలోని విప్లవాంశాలూ, విచ్ఛేదకాంశాలూ లేకుండా యీ సమాజమే వుండాలని వీళ్లు కోరుకుంటారు. కార్మికవర్గం లేకుండా బూర్జువావర్గం వుండాలని వీళ్ల కోరిక. బూర్జువావర్గం తన సర్వాధిపత్యం సాగే సమాజమే అత్యుత్తమమైందని సహజంగా ఊహిస్తుంది. యీ ఆహ్లాదకరమైన ఊహనే బూర్జువా సోషలిజం వివిధ సిద్ధాంతాలుగా, యించుమించు సమగ్ర రూపంలో, తయారు చేస్తుంది. యిటువంటి ఒక సిద్ధాంతాన్ని కార్మికవర్గం అమలు జరిపి, వెంటనే ఆ స్వర్గ సమాజంలోకి నేరుగా ప్రవేశించాలని కోరే యీ సోషలిజం వాస్తవంలో కోరేదల్లా యేమిటంటే, కార్మికవర్గం ప్రస్తుత సమాజపు

---

* 1848 నాటి విప్లవ తుఫాను[28] యీ అసహ్యమైన ధోరణి నంతటినీ వూడ్చిపారవేసి, దీని ప్రచారకులకు సోషలిజంలో తలదూర్చాలని మళ్లీ కోరిక పుట్టకుండా చేసింది. హెర్ కార్ల్ గ్రూన్ యీ ధోరణికి ప్రధాన ప్రతినిధి, లాక్షణిక ఉదాహరణ. (1890 నాటి జర్మన్ కూర్పుకు ఎంగెల్స్ వివరణ.)

** *Philosophie de la Misére.*— సం.

హద్దులలోనే వుండాలనీ, కానీ బూర్జువావర్గం గురించి తనకున్న అసహ్యమైన భావాలన్నీ విసర్జించాలనీ.

యీ బూర్జువా సోషలిజంలోనే, యింతకంటే ఆచరణ దృష్టి కలది, కానీ యింత క్రమబద్ధం కానిది, మరొక రకం వుంది. ఇది కార్మికులకు కేవల రాజకీయ సంస్కరణ వల్ల ఒరిగే దేమీ లేదనీ, భౌతిక జీవిత పరిస్థితులలో మార్పే, అనగా ఆర్థిక పరిస్థితులలో మార్పే, వాళ్ళ కేమైనా లాభకరంగా వుండగలదనీ నిరూపిస్తూ, తద్వారా ప్రతి విప్లవో ద్యమాన్నీ పనికి మాలినదిగా కార్మికుల ముందు చిత్రించడానికి పూనుకుంది. కానీ యీ రకం సోషలిజం చెప్పే భౌతిక జీవిత పరిస్థితుల మార్పుకు అర్థం బూర్జువా ఉత్పత్తి సంబంధాల రద్దు కాదు, యే రద్దు విప్లవం ద్వారా మాత్రమే సాధ్యమౌతుందో ఆ రద్దు కాదు. దాని అర్థం ఉత్పత్తి సంబంధాలు చెక్కుచెదరకుండా, వీటిమీదనే ఆధారపడిన పరిపాలనా సంస్కరణలు; అనగా, పెట్టుబడికీ వేతన శ్రమకీ మధ్య గల సంబంధాలను యే మాత్రమూ తాకని సంస్కరణలు; మహా ఐతే, బూర్జువా ప్రభుత్వ పరిపాలనకయ్యే ఖర్చు తగ్గించి, పరిపాలన పనిని సులభతరం చేసే సంస్కరణలు.

''బూర్జువా సోషలిజం'' అనే మాటలు కేవలం వ్యంగ్యంగా ఉపయోగించినప్పుడు, అప్పుడు మాత్రమే, ఆ మాటలకు తగిన అర్థం యేర్పడుతుంది.

వ్యాపార స్వేచ్ఛ, యెందుకంటే కార్మికవర్గ శ్రేయస్సు కొరకు! రక్షణ సుంకాలు, యెందుకంటే కార్మికవర్గ శ్రేయస్సు కొరకు! జైళ్ల సంస్కరణ, యెందుకంటే కార్మికవర్గ శ్రేయస్సు కొరకు! ఇది బూర్జువా సోషలిజం చెప్పే చివరిమాట; ఇదొక్కటే బూర్జువా సోషలిజం మనస్ఫూర్తిగా చెప్పే మాట కూడా.

బూర్జువా సోషలిజాన్ని ఒక్కమాటలో క్రోడీకరించి చెప్పవచ్చు: కార్మికవర్గ శ్రేయస్సు కొరకే బూర్జువా బూర్జువాగా వుండడం.

## 3. విమర్శనాత్మక ఊహాస్వర్గ సోషలిజమూ, కమ్యూనిజమూ

ప్రతి ఆధునిక మహా విప్లవంలోనూ, బబేఫ్, మొదలైనవాళ్ల రచనల్లాగా, సర్వదా కార్మికవర్గ డిమాండ్లను వ్యక్తీకరించిన సారస్వతం గురించి కాదు యిప్పుడు చెప్తున్నది.

ఫ్యూడల్ సమాజం కూలదోయబడుతూ వుండిన కాలంలో, ఆ సార్వత్రిక ఉద్రిక్త పరిస్థితులలో, కార్మికవర్గం తన సొంత లక్ష్యాలు సాధించుకోడానికి ప్రప్రథమంగా ప్రత్యక్ష ప్రయత్నాలు చేసింది. కానీ, ఆనాటికి కార్మికవర్గం అభివృద్ధి కానందువల్లా, దాని విమో చనకు అవసరమైన ఆర్థిక పరిస్థితులు — యే పరిస్థితులు యింకా ఉత్పత్తి కావలసి వుండిందో,

యే పరిస్థితులు ఆసన్న బూర్జువా యుగంవల్ల మాత్రమే ఉత్పత్తి కాగలవో ఆ పరిస్థితులు — ఆనాడు లేనందువల్లా, ఆ ప్రయత్నాలు విఫలం కాక తప్పలేదు. యీ ప్రథమ ఉద్యమాలలో పుట్టిన విప్లవ సారస్వతానికి ప్రగతి నిరోధక స్వభావం విధిగా వుండింది. ఆ సారస్వతం సార్వత్రిక సుఖ విముఖతనూ, అత్యంత మొరటు రూపంలో సాంఘిక సమానతనూ బోధించింది.

సరియైన అర్థంలో సమగ్ర సోషలిస్టు సిద్ధాంతాలూ సమగ్ర కమ్యూనిస్టు సిద్ధాంతాలూ అని అనదగినట్టివి — సెంట్-సైమన్, ఫోరియర్, ఓవెన్, మొదలైన వాళ్ల సిద్ధాంతాలు — కార్మికవర్గానికీ, బూర్జువావర్గానికీ మధ్య జరిగే పోరాటం అభివృద్ధికాని తొలి దశలో ఉద్భవిస్తాయి. (యీ దశ "బూర్జువాలూ — కార్మికులూ" అన్న మొదటి ప్రకరణంలో వర్ణింపబడింది.)

యీ సిద్ధాంతాల స్థాపకులు ఆనాటి సమాజంలోని వర్గ వైరుధ్యాలనూ, విధ్వంసక శక్తుల చర్యనూ బాగానే గమనిస్తారు. కానీ, యింకా శైశవ దశలో వుండిన కార్మికవర్గం యేవిధంగానూ చరిత్రను మార్చే శక్తి గానీ, యేవిధమైన స్వతంత్ర రాజకీయ ఉద్యమం గానీ లేని వర్గంగా వాళ్లకు కనబడుతుంది.

పరిశ్రమలు అభివృద్ధి ఐన మేరకే వర్గవైరుధ్యాలు అభివృద్ధి చెందుతాయి గనుక, వాళ్ల కనుల ముందు వుండిన ఆర్థిక సన్నివేశంలో కార్మికవర్గ విమోచనకు అవసరమైన భౌతిక పరిస్థితులు అప్పటికింకా కనబడవు. కాబట్టి వాళ్లు ఆ భౌతిక పరిస్థితులను సృష్టించగల నూతన సామాజికశాస్త్రం కొరకు, నూతన సామాజిక నియమాల కొరకు, అన్వేషిస్తారు.

వీళ్ల సొంత సృజనాత్మక చర్య ముందర కార్యాచరణ కేమీ విలువ లేదు, వీళ్ల ఊహాకల్పిత పరిస్థితుల ముందర చారిత్రకంగా సృష్టి అయ్యే విమోచన పరిస్థితుల కేమీ విలువ లేదు, యీ సృష్టికర్తలు ప్రత్యేకంగా తయారు చేసిన సామాజిక వ్యవస్థ ముందర క్రమక్రమంగా స్వయంకృతంగా జరిగే కార్మికుల వర్గ సమీకరణ కేమీ విలువ లేదు. వీళ్ల దృష్టిలో, వీళ్ల సామాజిక పథకాలు ప్రచారం చేసి అమలు పరచడమే భావిచరిత్ర.

తమ పథకాలు తయారు చేయడంలో, అత్యంత బాధాతప్త వర్గమైన కార్మికవర్గపు ప్రయోజనాలపట్ల ప్రధానంగా శ్రద్ధ వహిస్తున్నామని వీళ్లకు తెలుసు. వీళ్ల దృష్టిలో కార్మికవర్గానికి వున్న విలువ అంతా అది అత్యంత బాధాతప్త వర్గంగా వుండడమే.

వర్గపోరాటం అభివృద్ధికాని స్థితిలో వుండడంవల్లా, తమ పరిసరాలను బట్టీ, యీ రకం సోషలిస్టులు తాము వర్గవైరుధ్యాల కన్నిటికీ యెంతో అతీతంగా వున్నట్లు భావించు

కుంటారు. సమాజంలో ప్రతివాని పరిస్థితినీ, అత్యంత ఉచ్చస్థితిలో వున్నవాని పరిస్థితిని సైతం, మెరుగుపరచాలని వీళ్ల కోరిక. అందువల్ల వీళ్లు వర్గవిభేదాలు విస్మరించి, మామూలుగా మొత్తం సమాజానికి విజ్ఞప్తులు చేస్తారు, కాదు — ముఖ్యంగా పాలకవర్గానికి విజ్ఞప్తులు చేస్తారు. తమ సిద్ధాంతం ఒక్కసారి ప్రజలకు అర్థమైతే, యిక అదే అత్యుత్తమ సమాజానికి అత్యుత్తమ పథకమని వాళ్లు గుర్తించకుండా వుండలేరు కదా?

అందువల్ల వీళ్లు సకల రాజకీయ కార్యకలాపాలనూ, మరీ ముఖ్యంగా సకల విప్లవ కార్యకలాపాలనూ నిరాకరిస్తారు; శాంతియుత పద్ధతుల ద్వారా తమ లక్ష్యాలు సాధించుకోవాలని కోరుతారు; విఫలం కాక తప్పని చిన్నచిన్న ప్రయోగాల ద్వారానూ, ఆదర్శప్రాయమైన చర్యల ద్వారానూ తమ నూతన సామాజిక భగవద్గీతకు బాట వేయడానికి కృషి చేస్తారు.

కార్మికవర్గం యింకా బొత్తిగా అభివృద్ధికాని దశలో, కార్మికవర్గానికి తన స్థానం గురించి తనకే అభూతకల్పనవంటి చిత్రాలు చిత్రింపబడతాయి. సమాజమంతా పునర్నిర్మాణం కావాలని ఆ వర్గానికుండే మొదటి సద్యోజనితమైన (instinctive) వాంఛలకు అనుగుణంగా వుంటాయి యీ చిత్రాలు.

కానీ ఆ సోషలిస్టు కమ్యూనిస్టు గ్రంథాలలో విమర్శనాత్మక అంశం కూడా వుంటుంది. ఆ గ్రంథాలు నాటి సమాజ సూత్రాలన్నిటినీ ఖండిస్తాయి. అందువల్ల వాటిలో కార్మికవర్గానికి విజ్ఞానదాయకమైన అనేక అమూల్య విషయాలు వున్నాయి. వాటిలో ప్రతిపాదించబడిన చర్యలు — పట్టణాలకూ గ్రామాలకూ మధ్య గల భేదం రద్దుచేయడం, కుటుంబాన్ని రద్దుచేయడం, వ్యక్తుల లాభాల కొరకు పరిశ్రమలు నడిపే పద్ధతి రద్దుచేయడం, వేతన శ్రమ పద్ధతి రద్దుచేయడం, సామాజిక సామరస్యం ప్రకటించడం, రాజ్యానికి ఉత్పత్తిమీద తనిఖీ చేసే పని మాత్రమే వుండడం — యీ ప్రతిపాదనలన్నీ వర్గ వైరుధ్యాలు అంతరించిపోవాలని మాత్రమే సూచిస్తాయి. అప్పుడప్పుడే తల యెత్తుతుండిన వర్గవైరుధ్యాలు, తొలినాటి అస్పష్ట అనిర్దిష్ట రూపాలలో మాత్రమే, ఆ గ్రంథాలలో గుర్తింపబడినాయి. అందువల్ల ఆ గ్రంథాలలోని ప్రతిపాదనలు కేవలం ఊహాస్వర్గానికి సంబంధించినవిగా వున్నాయి.

విమర్శనాత్మక ఊహాస్వర్గ సోషలిజం కమ్యూనిజంల ప్రాముఖ్యానికీ చారిత్రకాభివృద్ధికీ విలోమ సంబంధం వుంటుంది. ఆధునిక వర్గపోరాటం అభివృద్ధి అయ్యేకొద్దీ, పోరాటానికి దూరంగా వుండడమూ, పోరాటాన్నే ఖండించడమూ అనే యీ వైపరీత్యాలు ఆచరణరీత్యా విలువా కోల్పోతాయి, సిద్ధాంతరీత్యా అసమర్థనీయమూ ఔతాయి. అందువల్ల యీ సిద్ధాంతాల మూలపురుషులు అనేక విషయాల్లో విప్లవకారులుగా వుండినప్పటికీ, వాళ్ల శిష్యులు ప్రతిచోటా ప్రగతి నిరోధక మతాలుగా మాత్రమే వున్నారు. కార్మికవర్గం క్రమక్రమంగా

చారిత్రకాభివృద్ధి చెందుతున్నప్పటికీ, అందుకు భిన్నంగా వీళ్లు తమ గురువుల మూలాభిప్రాయాలను గట్టిగా పట్టుకుంటారు. అందువల్ల వీళ్ళు వర్గపోరాటాన్ని నిర్వీర్యం చేయడానికీ, వర్గవైరుధ్యాలకు రాజీ కుదిరించడానికీ కృషి చేస్తారు — ఆ చేయడంలో యే మినహాయింపులూ వుండవు కూడా. ప్రయోగాల ద్వారా తమ ఊహాస్వర్గ సమాజాలు సాధించాలని — ఏకాకి "ఫలాన్‌స్టీర్లు" స్థాపించాలనీ, "హోమ్ కాలనీలు" ప్రతిష్ఠించాలనీ, "చిట్టి ఇకేరియా" నెలకొల్పాలనీ — అన్నీ బుల్లిబుల్లి స్వర్గాలు — వీళ్లు యింకా కలలుకంటూనే వుంటారు.* యీ ఆకాశ హర్మ్యాలు సాధించడానికి వీళ్లు బూర్జువాల భూతదయకూ, బూర్జువాల డబ్బు సంచులకూ విజ్ఞప్తులు చేయక తప్పదు. క్రమక్రమంగా వీళ్లు పైనవివరించిన ప్రగతి నిరోధక యథాస్థితివాద సోషలిస్టుల స్థాయికి దిగజారిపోతారు; యథాస్థితివాద సోషలిస్టులకూ వీళ్లకూ గల భేదమల్లా యేమిటంటే, వీళ్లకు యింకా యెక్కువ క్రమబద్ధమైన ఛాందస పాండిత్యం వుంటుంది, తమ సామాజిక శాస్త్రం అద్భుత ఫలితాల నిస్తుందని వీళ్లకు మొండి మూఢ విశ్వాసం వుంటుంది.

అందువల్ల వీళ్లు కార్మికవర్గంయొక్క రాజకీయ కార్యకలాపాల నన్నిటినీ తీవ్రంగా వ్యతిరేకిస్తారు; ఆ కార్యకలాపాలన్నీ తమ నూతన భగవద్గీతమీద గల గుడ్డి అపనమ్మకం మూలంగానే కలుగుతున్నాయని అనుకుంటారు.

యింగ్లండులో ఓవెన్ అనుచరులు చార్టిస్టులను[29] వ్యతిరేకిస్తారు. ఫ్రాన్సులో ఫోరియర్ అనుచరులు రెఫార్మిస్టులను[30] వ్యతిరేకిస్తారు.

---

* "ఫలాన్‌స్టీర్లు" చార్ల్స్ ఫోరియర్ పథకం ప్రకారం నిర్మింపబడిన సోషలిస్టు కాలనీలు. "ఇకేరియా" అన్నది, తన ఊహాజనిత దేశానికీ, తర్వాతి కాలంలో అమెరికాలోని తన కమ్యూనిస్టు కాలనీకీ కాబే పెట్టిన పేరు. (1888 నాటి ఇంగ్లీషు కూర్పుకు ఎంగెల్స్ వివరణ.)

"హోమ్ కాలనీలు" — అన్నది ఓవెన్ తన కమ్యూనిస్టు ఆదర్శ సంఘాలకు పెట్టిన పేరు.

"ఫలాన్‌స్టీర్లు" అన్నది, తను నిర్మింప తలపెట్టిన పబ్లిక్ భవనాలకు ఫోరియర్ పెట్టిన పేరు.

"ఇకేరియా" అన్నది ఊహాజనిత సమాజానికి పెట్టబడిన పేరు. ఈ సమాజపు కమ్యూనిస్టు వ్యవస్థలను కాబే తన "ఇకేరియా"లో అభివర్ణించాడు. (1890 నాటి జర్మన్ కూర్పుకు ఎంగెల్స్ వివరణ.)

## IV

# ఈనాటి వివిధ ప్రతిపక్ష పార్టీలపట్ల కమ్యూనిస్టుల వైఖరి

యింగ్లండులో చార్టిస్టులూ, అమెరికాలో భూసంస్కరణవాదులూ, మొదలైన నేటి కార్మికవర్గ పార్టీలతో కమ్యూనిస్టులకు గల సంబంధం రెండవ ప్రకరణంలో స్పష్టం చేయబడింది.

కమ్యూనిస్టులు కార్మికవర్గంయొక్క తక్షణ లక్ష్యాలు సాధించడానికీ, తాత్కాలిక ప్రయోజనాలు అమలు పరచడానికీ పోరాటం చేస్తారు. కానీ వాళ్లు వర్తమాన ఉద్యమంలో ఉద్యమ భవిష్యత్తుకు కూడా ప్రాతినిధ్యం వహిస్తూ, ఆ భవిష్యత్తుపట్ల కూడా శ్రద్ధ వహిస్తారు. ఫ్రాన్సులో కమ్యూనిస్టులు యధాస్థితివాద బూర్జువాలకూ, అతివాద బూర్జువాలకూ వ్యతిరేకంగా సోషల్ డెమోక్రట్లతో పొత్తు కలుస్తారు;* కానీ, ఫ్రెంచి మహా విప్లవ కాలంనుండి సాంప్రదాయికంగా వస్తున్న మాటలనూ, భ్రమలనూ విమర్శించే హక్కు మాత్రం ఉంచుకుంటారు.

స్విట్జర్లండులో కమ్యూనిస్టులు రాడికల్ పార్టీని బలపరుస్తారు; కానీ, ఆ పార్టీలో పరస్పర విరుద్ధమైన అంశాలు వున్నాయని — అతివాద బూర్జువాలు కొందరూ, ఫ్రాన్సులో వున్నట్టి డెమోక్రటిక్ సోషలిస్టులు కొందరూ వున్నారని — విస్మరించరు.

పోలండులో, జాతీయ విమోచనకు వ్యవసాయ విప్లవం అవశ్య కర్తవ్యమని పట్టుబట్టే

---

* సోషల్ డెమోక్రట్లు (social-democrats) — పార్లమెంటులో లెద్ర్యూ-రోలిన్ ద్వారానూ, సాహిత్యంలో లూయీ బ్లాంక్ ద్వారానూ, దినపత్రికా ప్రపంచంలో "La Réforme" పత్రిక ద్వారానూ ప్రాతినిధ్యం వహింపబడిన పార్టీ. డెమోక్రటిక్ లేక రిపబ్లికన్ పార్టీలో కొద్దో గొప్పో సోషలిస్టు భావాలు గల వాళ్లకు సోషల్ డెమోక్రసీ అనే పేరు వర్తిస్తుందని ఆ పేరు పెట్టినవాళ్ల విశ్వాసం. (1888 నాటి యింగ్లీషు కూర్పుకు ఎంగెల్స్ వివరణ.)

(ఫ్రాన్సులో సోషల్ డెమోక్రటిక్ పార్టీ అని పేరు పెట్టుకున్న పార్టీకి రాజకీయ రంగంలో లెద్ర్యూ-రోలిన్, సాహిత్యంలో లూయీ బ్లాంక్ ప్రతినిధులు. కనుక దీనికీ నేటి జర్మన్ సోషల్ డెమోక్రసీకీ అనంతమైన భేదం వుంది. (1890 నాటి జర్మన్ కూర్పుకు ఎంగెల్స్ వివరణ.)

పార్టీని, 1846 నాటి క్రాకొవ్ తిరుగుబాటును[31] యే పార్టీ లేవదీసిందో ఆ పార్టీని, కమ్యూనిస్టులు బలపరుస్తారు.

జర్మనీలో బూర్జువావర్గం విప్లవకరంగా ప్రవర్తించినప్పుడల్లా, కమ్యూనిస్టులు ఆ బూర్జువావర్గంతో కలిసి నిరంకుశ రాజరికానికీ, ఫ్యూడల్ ప్రభువర్గానికీ, పెటీబూర్జువా వర్గానికీ వ్యతిరేకంగా పోరాటం చేస్తారు.

కానీ, బూర్జువావర్గానికీ కార్మికవర్గానికీ గల శత్రువైరుధ్యాన్ని కార్మికులు స్పష్టాతి స్పష్టంగా గుర్తించేటట్లు చేయడానికి కమ్యూనిస్టులు ఒక క్షణం కూడా విరామం లేకుండా కృషిచేస్తారు. యీ కృషి యెందుకంటే, బూర్జువావర్గం తాను అధికారంలోకి వచ్చినప్పుడు ఆ అధికారం వెంట విధిగా ప్రవేశపెట్టే సాంఘిక రాజకీయ పరిస్థితులను జర్మన్ కార్మికులు వెనువెంటనే బూర్జువావర్గంమీద ఆయుధాలుగా ఉపయోగించేందుకూ, జర్మనీలో ప్రగతి నిరోధక వర్గాలు పతనమైన తర్వాత ఆ క్షణంనుండి బూర్జువావర్గంతోనే పోరాటం ప్రారంభమయ్యేటందుకూ.

కమ్యూనిస్టులు ప్రధానంగా జర్మనీమీదికి దృష్టి మళ్లిస్తారు. యెందుకంటే, ఆ దేశం బూర్జువా విప్లవ ప్రాంగణంలో వుంది గనుకనూ; 17వ శతాబ్దపు యింగ్లండులో కంటె, 18వ శతాబ్దపు ఫ్రాన్సులో కంటె బాగా అభివృద్ధి చెందిన కార్మికవర్గంతోనూ, గతంలో కంటె బాగా అభివృద్ధి చెందిన యూరపియన్ నాగరికతా వాతావరణంలోనూ ఆ జర్మన్ బూర్జువా విప్లవం జరిగి తీరుతుంది గనుకనూ; ఆ బూర్జువా విప్లవం ఆ వెనువెంటనే వచ్చే కార్మికవర్గ విప్లవానికి ఉపోద్ఘాతంగా మాత్రమే వుంటుంది గనుకనూ.

ఒక్క మాటలో చెప్పాలంటే, కమ్యూనిస్టులు ప్రతిచోటా ఆనాటి సాంఘిక రాజకీయ వ్యవస్థకు వ్యతిరేకంగా జరిగే ప్రతి విప్లవోద్యమాన్నీ బలపరుస్తారు.

యీ సకల ఉద్యమాలలోనూ వాళ్ళు ఆస్తి సమస్యను ప్రధాన సమస్యగా ముందుకు తెస్తారు – ఆ నాటికి ఆస్తి వ్యవస్థ యే మేరకు అభివృద్ధి చెంది వుండినా సరే.

చివరి విషయం: సకల దేశాల ప్రజాతంత్ర పార్టీల మధ్యా ఐకమత్యమూ, అభిప్రాయ సామ్యమూ నెలకొల్పడానికి కమ్యూనిస్టులు కృషి చేస్తారు.

కమ్యూనిస్టులకు తమ అభిప్రాయాలూ, లక్ష్యాలూ దాచుకోవడమంటే అసహ్యం. సమస్త వర్తమాన సాంఘిక పరిస్థితులనూ బలవంతంగా కూలదోయడం ద్వారానే తమ లక్ష్యాలు సిద్ధించగలవని వాళ్ళు బహిరంగంగానే ప్రకటిస్తారు. కమ్యూనిస్టు విప్లవ మంటే పాలకవర్గాలు గజగజ వణకనీ. కార్మికులు పోగొట్టుకొనేది ఏమీ లేదు, తమ శృంఖలాలు తప్ప. వాళ్ళు పొందవలసింది యెంతైనా వుంది.

సకల దేశాల కార్మికులారా, ఏకం కండి!

రచన: డిసెంబరు 1847 – జనవరి 1848

తొలి ముద్రణ: జర్మన్ భాషలో, లండన్‌లో ఫిబ్రవరి 1848

# కార్ల్ మార్క్స్

# వేతన శ్రమా, పెట్టుబడీ[32]

## 1891 నాటి కూర్పుకు ఫ్రెడరిక్ ఎంగెల్స్ ప్రవేశిక

యీ రచన 1849 ఏప్రిల్ 4నుండి "Neue Rheinische Zeitung"[33]లో సంపాదకీయాల పరంపరగా వచ్చింది. యిది 1847లో బ్రస్సెల్స్‌లోని జర్మన్ కార్మిక సంఘం[34]లో మార్క్స్ యిచ్చిన ఉపన్యాసాలమీద ఆధారపడింది. అచ్చయిన రూపంలో యీ రచన ఖండికగానే నిలిచింది; 269వ సంచిక చివర "యింకా వుంది" అనే మాటలు, సరిగా అప్పుడే ఒకదాని వెనక ఒకటి తోసుకొని వచ్చిన ఘటనల పర్యవసానంగా, అలాగే వుండిపోయినాయి. ఆ ఘటనలు యేవంటే: హంగరీలో రష్యన్ల దాడి,[35] డ్రెస్డెన్, ఇసెర్‌లోన్, ఎల్బెర్‌ఫెల్డ్, ఫల్జ్, బాడెన్‌లలో తిరుగుబాట్లూ;[36] వీటి ఫలితంగా పత్రిక అణచివేయబడింది (1849 మే 19). రాతప్రతి తరువాయి భాగం మార్క్స్ మరణం తర్వాత ఆయన కాగితాలలో కనిపించలేదు.[37]

"వేతన శ్రమా, పెట్టుబడీ" పుస్తక రూపంలో విడి ప్రచురణగా పలు కూర్పులలో ప్రచురింపబడింది; చివరిది హొట్టింగెన్-జూరిఖ్‌లోని స్విస్ కోఆపరేటివ్ ప్రెస్‌చేత 1884లో ప్రచురింపబడింది. యింతవరకు ప్రచురింపబడిన కూర్పులలో కచ్చితంగా మూలంలోని మాటలే వుండినాయి. కానీ, యీ కొత్త కూర్పు ప్రచార పుస్తకంగా, 10,000 ప్రతులకు తక్కువ లేకుండా, పంపకం కావలసివుంది. కనుక, యీ పరిస్థితులలో స్వయంగా మార్క్స్ మూలాన్ని మార్పు లేకుండా ముద్రించడాన్ని ఆమోదించేవాడా అనే ప్రశ్న నాకు యెదురు కాక తప్పలేదు.

నలభైలలో మార్క్స్ యింకా అర్థశాస్త్ర పరిశీలన ముగించలేదు. యాభైల అంతంలో మాత్రమే యిది జరిగింది. అందువలన "అర్థశాస్త్ర విమర్శకు చేర్పు" (1859) మొదటి భాగానికి ముందు వెలువడిన ఆయన రచనలు 1859 తర్వాత రచించినవాటితో కొన్ని

విషయాలలో విభేదిస్తాయి; వాటిలో కొన్ని నుడికారాలూ, కొన్ని మొత్తం వాక్యాలకు వాక్యాలూ యెలాంటివి వున్నాయంటే, తదనంతర రచనల దృష్ట్యా చూస్తే అవి దురదృష్టకరమైనవి గానూ, తప్పుగా కూడానూ కనిపిస్తాయి. సాధారణ పాఠకులకు ఉద్దేశింపబడిన మామూలు కూర్పులలో, యీ తొలి కాలపు దృక్పథానికి కూడా, రచయితయొక్క బౌద్ధిక అభివృద్ధిలో భాగంగా, దాని స్థానం దానికి వుందనీ, యీ పాత రచనల మార్పు లేని పునర్ముద్రణ పొందడానికి రచయితకూ, పాఠకులకూ ఉభయులకూ నిర్వివాదమైన హక్కు వుందనీ అనేది స్వయంవ్యక్తమైనది. వాటిల్లో ఒక్క మాటైనా మార్చాలని నేను కలలో కూడా అనుకొని వుండను.

కొత్త కూర్పు దాదాపు సంపూర్ణంగా కార్మికులలో ప్రచారం కొరకు ఉద్దేశింపబడిన ప్పుడు, అది మరొక విషయం. అలాంటి సందర్భంలో మార్క్స్ నిశ్చయంగా 1849 నాటి పాత రూపాన్ని తన కొత్త దృక్పథానికి అనుగుణంగా మార్చేవాడు. అన్ని ముఖ్య విషయాలలోనూ యీ లక్ష్యం సాధించేటందుకు అవసరమైన కొద్ది మార్పులూ, చేర్పులూ యీ కూర్పు కొరకు చేయడానికి పూనుకోవడంలో నేను ఆయన యెలా చేసివుండేవాడో అలాగే చేస్తున్నానని గట్టిగా అనుకుంటున్నాను. కనుక నేను పాఠకునికి ముందే చెప్తున్నాను: యిది 1849లో మార్క్స్ రాసిన రూపంలో వున్న పుస్తకం కాదు, యిది 1891లో ఆయన యెలా రాసివుండేవాడో రమారమిగా అలా వున్న పుస్తకం. అంతే కాక, అసలు పాఠం యెన్నో ప్రతులలో పంపకమైంది గనుక, నేను దానిని మళ్లీ మార్పు లేని సంపూర్ణ కూర్పుగా పునర్ముద్రించ గలిగేదాకా, యిది చాలు.

నా మార్పులన్నీ ఒక్క విషయానికి సంబంధించినవి. మూలం ప్రకారం, కార్మికుడు వేతనం కొరకు తన శ్రమను పెట్టుబడిదారునికి అమ్ముతాడు; ప్రస్తుత పాఠం ప్రకారం, కార్మికుడు తన శ్రమశక్తిని అమ్ముతాడు. యీ మార్పుకు గాను నేను వివరణ యివ్వవలసి వుంది. యిది కేవలం మాటల గారడీ కాదనీ, మొత్తం అర్థశాస్త్రంలోని అత్యంత ముఖ్యమైన విషయాలలో ఒకటనీ కార్మికులు గమనించగలిగేటందుకు నేను వాళ్లకు వివరణ యివ్వవలసి వుంది. నేను బూర్జువాలకు కూడా వివరణ యివ్వవలసి వుంది; యెందుకంటే, అలాంటి జటిల సమస్యలు తమ జీవితమంతా అపరిష్కృతంగానే నిలిచిపోయే మన అహంభావపు "విద్యావంతుల" కంటె అవిద్యావంతులైన కార్మికులు — యెవరికి అత్యంత కష్టమైన ఆర్థిక పరిశీలనలు అర్థమయ్యేటట్లు సులభంగా చేయవచ్చునో వాళ్లు — యెంత అపారంగా ఉన్నతులైందీ బూర్జువాలకు నమ్మకం కలిగించేటందుకు.

తాను తన కార్మికుల శ్రమను కొంటున్నాననీ, డబ్బు చెల్లిస్తున్నాననీ అనుకునే పారిశ్రామికుని ఆనాటి అవగాహనను పారిశ్రామిక ఆచారణనుండి సాంప్రదాయిక అర్థశాస్త్రం[38] స్వీకరించింది. పారిశ్రామికుని వ్యాపార అవసరాలకూ, దస్త్రాలు రాసుకోడానికీ, ధరల లెక్క

చారానికీ యీ అవగాహన చాలింది. కానీ యిది అర్థశాస్త్రానికి అమాయకంగా బదలాయించ బడినప్పుడు, అక్కడ నిజంగా ఆశ్చర్యకరమైన తప్పులనూ, తికమకలనూ కలిగించింది.

అన్ని సరుకుల ధరలూ, "శ్రమ" అని అర్థశాస్త్రం పిలిచే సరుకుయొక్క ధరతో సహా, నిరంతరం మారుతున్నాయనీ, అత్యంత వివిధమైన పరిస్థితుల ఫలితంగా అవి పెరుగుతూ, తరుగుతూ వున్నాయనీ, ఆ పరిస్థితులకు ఆ సరుకుల ఉత్పత్తితో తరుచుగా యెలాంటి సంబంధమూ లేదనీ, కనుక ధరలు సాధారణంగా కేవలం యాదృచ్ఛికంగా నిర్ణయింపబడినట్లు కనిపిస్తుందనీ పూర్వం అనుకునేవాళ్ళు. కానీ, అర్థశాస్త్రం ఒక శాస్త్రంగా అవతరించిన వెంటనే,[39] సరుకుల ధరలను పాలిస్తున్నట్లు కనిపించే యీ యాదృచ్ఛికత్వం చాటున దాగి, వాస్తవంలో యీ యాదృచ్ఛికత్వాన్నే పాలించే నియమాన్ని కనుక్కోవడం దాని ప్రథమ కర్తవ్యాలలో ఒకటిగా వుండింది. ఒకసారి పైకీ, ఒకసారి కిందికీ నిరంతరం వూగుతూ, మారుతూ వుండే సరుకుల ధరల లోపల, యీ యెగుడుదిగుడులు దేనిచుట్టూ జరుగుతాయో ఆ స్థిరమైన కేంద్ర బిందువుకోసం అర్థశాస్త్రం అన్వేషించింది. ఒక్క మాటలో చెప్పాలంటే, ధరలను నియంత్రితం చేసే నియమంగా సరుకుల విలువను అన్వేషించేటందుకు — ధరల వూగులాటలన్నిటికీ యేది కారణమని చెప్పవచ్చునో, చివరకు అవన్నీ దేని ఫలితాలుగా చెప్పవచ్చునో ఆ విలువను అన్వేషించేటందుకు — అర్థశాస్త్రం సరుకుల ధరల వద్ద బయలుదేరింది.

సరుకుయొక్క విలువ సరుకులో వున్నట్టి, దాని ఉత్పత్తికి అవసరమైనట్టి శ్రమచేత నిర్ణయింపబడుతుందని సాంప్రదాయిక అర్థశాస్త్రం అప్పుడు కనుక్కుంది. యీ వివరణతో అది తృప్తిపడింది. మనం కూడా ప్రస్తుతానికి యిక్కడ కాసేపు ఆగవచ్చు. అపార్థాలు కలగకుండా వుండేటందుకు, యీనాడు యీ వివరణ పూర్తిగా అరకొర వివరణ అయిందని మాత్రం నేను పాఠకునికి జ్ఞాపకం చేస్తాను. శ్రమకు గల విలువను సృష్టించే గుణాన్ని సమగ్రంగా పరిశీలించిన మొదటివాడు మార్క్స్. సరుకు ఉత్పత్తికి అవసరమైనట్లు కనిపించే, లేదా నిజంగా కూడా అవసరమైన శ్రమ అంతా ఖర్చుపెట్టబడిన శ్రమ పరిమాణానికి అనురూపమైన విలువ పరిమాణాన్ని అన్ని పరిస్థితులలోనూ సరుకుకు కలపదు, అని మార్క్స్ ఆవిష్కరించినాడు. కనుక, సరుకుయొక్క విలువ దాని ఉత్పత్తికి అవసరమైన శ్రమచేత నిర్ణయింపబడుతుందని. యీనాడు మనం రికార్డోలాంటి అర్థశాస్త్రజ్ఞులతో పాటు అనాలోచితంగా అన్నామంటే, ఆ అనడంలో మార్క్స్ చేసిన మినహాయింపులు యెప్పుడూ మన మనసులో వున్నాయి. యిక్కడ యిది చాలు; యింతకంటె యెక్కువ మార్క్స్ రాసిన "అర్థశాస్త్ర విమర్శకు చేర్పు," (1859)లోనూ, "పెట్టుబడి" మొదటి సంపుటంలోనూ చూడవచ్చు.

కానీ, అర్థశాస్త్రజ్ఞులు శ్రమచేత విలువ నిర్ణయింపబడుతుందనే యీ నియమాన్ని

"శ్రమ" అనే సరుకుకు అన్వయించినప్పుడు వాళ్లు ఒక అంతర్వైరుధ్యం తర్వాత మరొక అంతర్వైరుధ్యంలో పడినారు. "శ్రమ"యొక్క విలువ యెలా నిర్ణయింపబడుతుంది? దానిలో వున్న అవసర శ్రమచేత. కానీ, ఒక రోజు, ఒక వారం, ఒక నెల, ఒక సంవత్సరం కార్మికుడు చేసిన శ్రమలో యెంత శ్రమ వుంది? ఒక రోజుశ్రమ, ఒక వారంశ్రమ, ఒక నెలశ్రమ, ఒక సంవత్సరంశ్రమ వుంది. అన్ని విలువలకూ కొలమానం శ్రమ అయితే, నిజంగా మనం "శ్రమ విలువ"ను శ్రమలో మాత్రమే వ్యక్తం చేయగలం. కానీ, ఒక గంట శ్రమయొక్క విలువ ఒక గంట శ్రమకు సమానమని మాత్రమే మనకు తెలిస్తే, దాన్ని గురించి మనకు బొత్తిగా యేమీ తెలియ దన్నమాట. యిది మనల్ని వెంట్రుకవాసి కూడా గమ్యం దగ్గరికి తీసుకపోదు; మనం ప్రదక్షిణం చేస్తూనే వుంటాం.

కనుక, సాంప్రదాయిక అర్థశాస్త్రం మరొక దారి ప్రయత్నించింది. అది యిలా అన్నది: సరుకు విలువ సరుకుయొక్క ఉత్పత్తి ఖర్చుకు సమానం. మరి శ్రమయొక్క ఉత్పత్తి ఖర్చు యెంత? యీ ప్రశ్నకు జవాబు చెప్పడానికి అర్థశాస్త్రజ్ఞులు తర్కశాస్త్రాన్ని కాస్త విరూపం చేయాలి. శ్రమయొక్క ఉత్పత్తి ఖర్చునే పరిశీలించడానికి బదులు — దురదృష్టవశాత్తూ యిది నిర్ధరింపబడజాలదు — వాళ్ళు కార్మికుని ఉత్పత్తి ఖర్చును పరిశీలించడానికి, పూనుకుంటారు. మరి దీనిని నిర్ధరించవచ్చు. యిది కాలాన్నిబట్టీ, పరిస్థితులనుబట్టీ మారుతుంది, కానీ నిర్ణీత సమాజంలో, నిర్ణీత స్థలంలో, నిర్ణీత ఉత్పత్తి శాఖలో యిది కూడా నిర్ణీతంగా వుంటుంది, కనీసం స్వల్ప పరిమితులలో. యీనాడు మనం పెట్టుబడిదారీ ఉత్పత్తి పెత్తనంకింద జీవిస్తున్నాం; యీ వ్యవస్థలో, ప్రజానీకంలోని ఒక విస్తారమైన, నిత్య ప్రవర్ధమానమైన వర్గం వేతనాలకు సాటాగా ఉత్పత్తి సాధనాల — పరికరాల, యంత్రాల, ముడిసరుకుల, జీవనాధారాల — సొంతదారుల కొరకు తాను పనిచేస్తేనే బతకగలదు. యీ ఉత్పత్తి విధానపు ప్రాతిపదికమీద, కార్మికుని ఉత్పత్తి ఖర్చు యెంతంటే: అతన్ని పనిచేయడానికి సమర్థునిగా చేయడానికీ, పనిచేయడానికి సమర్థునిగా నిలిపివుంచడానికీ, వృద్ధాప్యం మూలంగా గానీ, జబ్బు మూలంగా గానీ, మరణం మూలంగా గానీ అతను నిర్గమించిన తర్వాత అతని స్థానంలో కొత్త కార్మికుని పెట్టడానికీ — అనగా, తగిన సంఖ్యలో కార్మికవర్గాన్ని ఉత్పత్తి చేయడానికి — సగటున అవసరమైన జీవనాధారాల పరిమాణం, లేదా డబ్బు రూపంలో వాటి ధర. డబ్బు రూపంలో యీ జీవనాధారాల ధర రోజుకు మూడు మార్కులనుకుందాం.

కనుక, మన కార్మికుడు తనను వినియోగించుకునే పెట్టుబడిదారునుండి రోజుకు మూడు మార్కులు పొందుతాడు. దీనికిగాను, రమారమిగా యీకింది లెక్క ప్రకారం, పెట్టుబడిదారుడు కార్మికునితో, మాట వరుసకు, రోజుకు పండ్రెండు గంటలు పనిచేయించుకుంటాడు:

మన కార్మికుడు — ఒక టర్నర్ — ఒక రోజులో పూర్తిచేయగల ఒక యంత్ర విభాగాన్ని చేయవలసి వుందనుకుందాం. ముడి పదార్థాలకు — అవసరమైన రూపంలో ముందే తయారు చేయబడిన యినుముకూ, యిత్తడికీ — యిరవై మార్కులు ఖర్చు అవుతుంది. ఆవిరి యింజను ఉపయోగించే బొగ్గూ, యీ యింజనుయొక్కా, మన కార్మికుడు ఉపయోగించే లేతూ, యితర పనిముట్లయొక్కా అరుగుదలా, తరుగుదలా ఒక్క రోజుకు, వాటి వాడకంలో అతని భాగాన్నిబట్టి లెక్కవేస్తే, ఒక్క మార్కు విలువ చేస్తాయి. మనం ముందు అనుకున్నదాన్నిబట్టి, ఒక్క రోజుకు వేతనం మూడు మార్కులు. దీనితో మన యంత్ర విభాగానికి మొత్తం యిరవై నాలుగు మార్కులు అవుతుంది. కానీ, పెట్టుబడిదారుడు తనకు తన కొనుగోలుదారులనుండి సగటున యిరవై యేడు మార్కులు, అనగా తన పెట్టుబడికంటె మూడు మార్కులు యెక్కువ, వస్తుందని లెక్కవేసుకుంటాడు.

పెట్టుబడిదారుడు జేబులో వేసుకున్న మూడు మార్కులు యెక్కడనుండి వచ్చింది? సాంప్రదాయిక అర్థశాస్త్రపు ఉద్ఘాటన ప్రకారం, సరుకులు సగటున వాటి విలువలకు అమ్మబడతాయి, అనగా, వాటిలో వున్న అవసర శ్రమ మొత్తానికి అనురూపమైన ధరలకు అమ్మబడతాయి. ఆవిధంగా, మన యంత్ర విభాగపు సగటు ధర — యిరవై యేడు మార్కులు — దాని విలువకు సమానంగా వుంటుంది, అనగా, దానిలో వున్న శ్రమకు సమానంగా వుంటుంది. కానీ, యీ యిరవై యేడు మార్కులలో యిరవై ఒక్క మార్కులు మన టర్నర్ పని ప్రారంభించక ముందే వుండిన విలువలు. యిరవై మార్కులు ముడి పదార్థాలలో వుండినాయి; ఒక్క మార్కు పనిచేసేటప్పుడు ఖర్చైన బొగ్గులో గానీ, ప్రక్రియలో ఉపయోగించబడి, వాటి సామర్థ్యంలో యీ మొత్తం విలువ మేరకు తరుగుదల పొందిన యంత్రాలలోనూ, పనిముట్లలోనూ గానీ వుంది. యిక ఆరు మార్కులు మిగిలినాయి, ముడి పదార్థాల విలువకు కలపబడినట్టివి. కానీ మన అర్థశాస్త్రజ్ఞులే ఊహించేదాన్నిబట్టి, యీ ఆరు మార్కులు మన కార్మికుడు ముడి పదార్థాలకు కలిపిన శ్రమనుండి మాత్రమే ఉత్పన్నం కాగలవు. ఆవిధంగా అతని పండ్రెండు గంటల శ్రమ ఆరు మార్కుల కొత్త విలువను సృష్టించింది. కనుక, అతని పండ్రెండు గంటల శ్రమయొక్క విలువ ఆరు మార్కులకు సమానం. ఆవిధంగా మనం చివరకు "శ్రమయొక్క విలువ" యెంతైందీ ఆవిష్కరించి వుండేవాళ్లం.

"ఆగండి అక్కడ!" అని మన టర్నర్ అరుస్తాడు. "ఆరు మార్కులా? మరి నాకు వచ్చింది మూడు మార్కులే! నా పండ్రెండు గంటల శ్రమ విలువ మూడు మార్కులు మాత్రమే అని మా పెట్టుబడిదారుడు దేవునిమీద ఒట్టు పెట్టుకుంటాడు; నేను ఆరు మార్కులు డిమాండుచేస్తే, అతను నన్ను చూసి నవ్వుతాడు. దానికి కారణమేమంటారు?"

యింతకు ముందు మనం మన శ్రమ విలువ విషయంలో విషవలయంలో ప్రవేశించి

వుంటే, యిప్పుడు పరిష్కార సాధ్యం కాని అంతర్వైరుధ్యంలో చక్కగా చిక్కుకున్నాం. మనం శ్రమ విలువ కోసం అన్వేషించినాం; మనం ఉపయోగించుకోగలదానికంటె యెక్కువ దొరికింది మనకు. కార్మికునికి పండ్రెండు గంటల శ్రమ విలువ మూడు మార్కులు. పెట్టుబడిదారునికి అది ఆరు మార్కులు; అందులో మూడు మార్కులు అతను కార్మికునికి వేతనంగా చెల్లించి, మూడు సొంతానికి జేబులో వేసుకుంటాడు. ఆవిధంగా శ్రమకు ఒకటి కాక రెండు విలువలు ఉంటాయి, పైగా చాలా భిన్నమైన విలువలు!

డబ్బు రూపంలో వ్యక్తం చేయబడిన విలువలను మనం శ్రమ కాలానికి సూరిస్తే, అంతర్వైరుధ్యం యింకా అసంబద్ధమౌతుంది. పండ్రెండు గంటల శ్రమ కాలంలో ఆరు మార్కుల కొత్త విలువ సృష్టింపబడింది. కనుక ఆరుగంటల కాలంలో మూడు మార్కులు సృష్టింపబడినాయి — కార్మికుడు పండ్రెండు గంటల శ్రమకు గాను పొందే మొత్తం యిది. పండ్రెండు గంటల శ్రమకు గాను, దానికి సమానమైన విలువగా, కార్మికుడు ఆరు గంటల శ్రమయొక్క ఉత్పాదితాన్ని పొందుతాడు. కనుక, శ్రమకు రెండు విలువలైనా వుండాలి, ఒకటి మరొకదానికి రెట్టింపుగా వుంటూ; లేదా పండ్రెండు ఆరుకు సమానం కావాలి! ఉభయ సందర్భాలలోనూ మనకు లభించేది వట్టి చెత్త.

శ్రమ కొనుగోలు, అమ్మకాల గురించీ, శ్రమ విలువను గురించీ మనం మాట్లాడినంత సేపూ, యెంత గింజకున్నా మనం యీ అంతర్వైరుధ్యంనుండి బయటపడలేం. అర్థశాస్త్రజ్ఞులకు కూడా యిదే జరిగింది. సాంప్రదాయిక అర్థశాస్త్రపు చివరి శిశువైన రికార్డో ధోరణి ప్రధానంగా యీ అంతర్వైరుధ్యం పరిష్కారసాధ్యం కాకపోయినందువల్లనే ముక్కచెక్కలైంది. సాంప్రదాయిక అర్థశాస్త్రం పద్మవ్యూహంలో చిక్కుకుంది. యీ పద్మవ్యూహంనుండి బయటికి దారి కనుక్కున్నవాడు కార్ల్ మార్క్స్.

అర్థశాస్త్రజ్ఞులు "శ్రమ"యొక్క ఉత్పత్తి ఖర్చుగా భావించింది శ్రమయొక్క ఉత్పత్తి ఖర్చు కాక, ప్రాణం గల కార్మికుని ఉత్పత్తి ఖర్చే. మరి యీ కార్మికుడు పెట్టుబడిదారునికి అమ్మింది తన శ్రమ కాదు. "అతని శ్రమ వాస్తవంగా ప్రారంభమైన వెంటనే, అది అప్పటికే అతనికి చెందడం ఆగిపోయింది; కనుక అది యిక యెంత మాత్రమూ అతని చేత అమ్మబడజాలదు" అని అంటాడు మార్క్స్. మహా అయితే, అతను తను భావి శ్రమను అమ్మవచ్చు, అనగా ఒక నిర్ణీత కాలంలో కొంత మొత్తం పని చేయడానికి ఒప్పుకోవచ్చు. కానీ, అలా ఒప్పుకోవడంలో అతను తన శ్రమను అమ్మడం లేదు (అమ్మాలంటే ఆ శ్రమను మొదట చేయవలసివుంటుంది), మరి అతను తన శ్రమశక్తిని నిర్ణీతమైన డబ్బుకు బదులుగా నిర్ణీతమైన కాలం పాటు (దిన కూలి అయితే), లేదా నిర్ణీతమైన ఉత్పత్తి జరిగేటందుకు (కట్టుకూలి అయితే) పెట్టుబడిదారుని వశంలో పెట్టుతాడు:

అతను తన శ్రమశక్తిని అద్దెకు యిస్తాడు, లేదా అమ్ముతాడు. కానీ, యీ శ్రమశక్తి అతని వ్యక్తితో కలగలిసి, దానినుండి విడదీయరాకుండా వుంది. కనుక, దాని ఉత్పత్తి ఖర్చు అతని ఉత్పత్తి ఖర్చుతో సమవసిస్తుంది. అర్థశాస్త్రజ్ఞులు శ్రమయొక్క ఉత్పత్తి ఖర్చు అన్నది నిజంగా కార్మికునియొక్క, అతనితో పాటు అతని శ్రమశక్తియొక్క ఉత్పత్తి ఖర్చే. కనుక మనం శ్రమశక్తియొక్క ఉత్పత్తి ఖర్చునుండి శ్రమశక్తియొక్క విలువవద్దకు వెనక్కిపోయి, నిర్దిష్ట నాణ్యం గల శ్రమశక్తి ఉత్పత్తి కావడానికి కావలసినట్టి సామాజికంగా అవసరమైన శ్రమ మొత్తాన్ని నిర్ణయించగలం — మార్క్స్ శ్రమశక్తి కొనుగోలుకూ, అమ్మకానికీ సంబంధించిన ప్రకరణంలో చేసినట్లు. ("పెట్టుబడి," సం. I, ప్రకరణం IV, 3.)

మరి, కార్మికుడు తన శ్రమశక్తిని పెట్టుబడిదారునికి అమ్మిన తర్వాత, అనగా, ముందుగా ఒప్పందం చేసుకొన్న వేతనానికి — దిన కూలికి గానీ, కట్టు కూలికి గానీ — బదులుగా తన శ్రమశక్తిని పెట్టుబడిదారుని వశంలో పెట్టిన తర్వాత, యేమి జరుగుతుంది? పెట్టుబడిదారుడు కార్మికున్ని తన యంత్రాలయంలోకి లేదా ఫాక్టరీలోకి తీసుకపోతాడు; అక్కడ పనికి అవసరమైన వస్తువులన్నీ — ముడి పదార్థాలూ, సహాయక సరుకులూ (బొగ్గూ, రంగులూ, వగైరా), పనిముట్లూ, యంత్రాలూ — అప్పటికే వుంటాయి. యిక్కడ కార్మికుడు చాకిరీ ప్రారంభిస్తాడు. అతని దినసరి వేతనం, పై సందర్భంలో లాగ, మూడు మార్కులు కావచ్చు — యిది అతను దిన కూలిగా సంపాయించినా, లేక కట్టు కూలిగా సంపాయించినా యీ సందర్భంలో యేమీ భేదం లేదు. యిక్కడ కూడా మళ్లీ మనం పండ్రెండు గంటలలో ఖర్చైన ముడి పదార్థాలకు కార్మికుడు తన శ్రమద్వారా ఆరు మార్కుల కొత్త విలువను కలుపుతాడనీ, ఆ కొత్త విలువను పెట్టుబడిదారుడు తయారైన వస్తువును అమ్మడంద్వారా పొందుతాడనీ అనుకుంటున్నాం. దీనినుండి పెట్టుబడిదారుడు కార్మికునికి అతని మూడు మార్కులు చెల్లిస్తాడు; తక్కిన మూడు మార్కులు సొంతానికి వుంచుకుంటాడు. మరి, కార్మికుడు పండ్రెండు గంటలలో ఆరు మార్కుల విలువ సృష్టిస్తే, ఆరు గంటలలో మూడు మార్కుల విలువ సృష్టిస్తాడు. కనుక, అతను పెట్టుబడిదారుని కొరకు ఆరు గంటలు పనిచేసినప్పుడు, తన వేతనంలోని మూడు మార్కులకు సమానమైన ప్రతివిలువను అప్పటికే అతను పెట్టుబడిదారునికి తిరిగి చెల్లించివేసినాడు. ఆరు గంటల శ్రమ తర్వాత యిద్దరిదీ చెల్లుబోయింది, యెవరూ యెవరికీ ఒక ఫెన్నిగ్ కూడా బాకీ లేరు.

"ఆగండి అక్కడ!" అని యిప్పుడు పెట్టుబడిదారుడు అరుస్తాడు. "నేను కార్మికున్ని ఒక పూర్తి దినానికి కూలికి పెట్టుకున్నాను, అనగా పండ్రెండు గంటలకు. మరి ఆరు గంటలు సగం దినమే. కనుక, తక్కిన ఆరు గంటలూ అయిందాకా పనిచేస్తూవుండు, అప్పుడు మాత్రమే మన యిద్దరిదీ చెల్లుబోతుంది!" మరి నిజానికి కార్మికుడు "ఇచ్ఛికంగా" చేసుకొన్న ఒప్పందానికి కట్టుబడాలి; దాని ప్రకారం అతను ఆరు గంటల శ్రమ

ఖరీదుచేసే శ్రమ ఉత్పాదితానికిగాను పన్రెండు పూర్తి గంటలు పనిచేయడానికి అంగీకరించినాడు.

కట్టు కూలి విషయం కూడా యింతే. మన కార్మికుడు పన్రెండు గంటలలో ఒక సరుకుకు చెందిన పన్రెండు శాల్తీలు చేస్తాడనుకుందాం. వీటిలో ప్రతిదానికీ ముడి పదార్థాల రూపంలోనూ, యంత్రాల విలువ తరుగుదల రూపంలోనూ రెండు మార్కులు ఖర్చు అవుతుంది; ప్రతిదీ రెండున్నర మార్కులకు అమ్మబడుతుంది. మునుపటి సందర్భంలోని ఊహలనుబట్టి, పెట్టుబడిదారుడు కార్మికునికి ఒక్కొక్క శాల్తీకి యిరవై అయిదు ఫెన్నిగులు యిస్తాడు. అనగా, పన్రెండు శాల్తీలకు మూడు మార్కు అవుతుంది. యీ మూడు మార్కులు సంపాయించుకోడానికి కార్మికునికి పన్రెండు గంటలు కావాలి. పన్రెండు శాల్తీలకు గాను పెట్టుబడిదారునికి ముప్పై మార్కులు వస్తాయి. ముడి పదార్థాలకూ, విలువ తరుగుదలకూ యిరవై నాలుగు మార్కులు తీసివేస్తే, ఆరు మార్కులు మిగులుతాయి. అందులోనుండి అతను కార్మికునికి వేతనాలుగా మూడు మార్కులు చెల్లించి, మూడు మార్కులు జేబులో వేసుకుంటాడు. యిది సరిగ్గా మునుపటిలాగే వుంది. యిక్కడ కూడా కార్మికుడు తన కోసం, అనగా తన వేతనాలను భర్తీచేయడానికి, ఆరు గంటలు పనిచేస్తాడు (పన్రెండు గంటలలో ప్రతి గంటలోనూ అర్ధగంట), పెట్టుబడిదారుని కోసం ఆరు గంటలు పనిచేస్తాడు.

అత్యుత్తమ అర్థశాస్త్రజ్ఞులు "శ్రమ" విలువవద్ద బయలుదేరినంత కాలం యే యిబ్బంది మూలంగా దుఃఖభాజనులైనారో అది మనం "శ్రమశక్తి" వద్ద బయలుదేరిన వెంటనే అదృశ్యమౌతుంది. మన యీనాటి పెట్టుబడిదారీ సమాజంలో శ్రమశక్తి అనేది ఒక సరుకు, ప్రతి యితర సరుకు లాగే ఒక సరుకు, కానీ విశిష్టమైన సరుకు. దాని విశిష్టగుణం యేమిటంటే, అది విలువను సృష్టించే శక్తి, విలువకు ఒక జన్మ స్థానం, అవును, తగిన విధంగా వాడుకుంటే, దానికి స్వయంగా వున్న విలువకంటె యెక్కువ విలువకు జన్మ స్థానం. ప్రస్తుత ఉత్పత్తి స్థితిలో, మానవ శ్రమశక్తి స్వయంగా తనకున్న విలువకంటె, తాను ఖరీదు చేసే విలువకంటె యెక్కువ విలువను ఒక్క రోజులో సృష్టించడమే కాదు; ప్రతి కొత్త శాస్త్రీయ ఆవిష్కరణతోనూ, ప్రతి కొత్త సాంకేతిక సృజనతోనూ, దాని దినసరి ఉత్పాదితంలో దాని దినసరి ఖరీదును మించి వున్న యీ అదనపు విలువ పెరుగుతుంది, కనుక కార్మికుడు తన దినసరి వేతనాన్ని భర్తీచేయడానికి పని దినంలో యెంత భాగం పనిచేస్తాడో ఆ భాగం తగ్గుతుంది; తత్ఫలితంగా, మరొకవైపున, వేతనం పొందకుండా కార్మికుడు పని దినంలో యెంత భాగంలో తన శ్రమను పెట్టుబడిదారునికి ఉచితంగా యివ్వ వలసివుందో ఆ భాగం పెరుగుతుంది.

యిది యీనాటి మన మొత్తం సమాజంయొక్క ఆర్థిక అంగనిర్మాణం: సకల విలు

వలనూ ఉత్పత్తిచేసేది కార్మికవర్గం ఒక్కటే. విలువ అనేది శ్రమ అనేదానికి మరొక పదం మాత్రమే — మన యీనాటి పెట్టుబడిదారీ సమాజంలో, నిర్దిష్ట వస్తువులో వున్న సామాజికంగా అవసరమైన శ్రమ పరిమాణం యే పదంతో పిలువబడుతుందో ఆ పదం. కానీ, కార్మికులచేత సృష్టింపబడిన యీ విలువలు కార్మికులకు చెందవు. యివి ముడి పదార్థాల, యంత్రాల, పరికరాల, రిజర్వు నిధుల సొంతదారులకు చెందుతాయి — అవి యీ సొంతదారులు కార్మికవర్గపు శ్రమశక్తిని కొనడానికి అనుమతిస్తాయి. కనుక, కార్మికవర్గం ఉత్పత్తిచేసిన మొత్తం వస్తు సముదాయంనుండి కొంత భాగం మాత్రమే కార్మికవర్గం తిరిగి పొందుతుంది. మనం యింతకుముందే చూసినట్లు, తక్కిన భాగం, యేది పెట్టుబడిదారీ వర్గం తనకుగాను వుంచుకుంటుందో, మహా అయితే భూస్వాముల వర్గంతో పంచుకుంటుందో ఆ భాగం, ప్రతి కొత్త ఆవిష్కరణతోనూ, సృజనతోనూ పెద్దదౌతుంది; కార్మికవర్గానికి (తలసరిన లెక్కవేస్తే) వచ్చే భాగం చాలా నిదానంగానూ, గణనీయం కానంతదిగానూ అయినా పెరుగుతుంది, లేదా బొత్తిగా పెరగదు, కొన్ని పరిస్థితులలో తగ్గవచ్చు కూడా.

కానీ, నిత్య ప్రవర్ధమానమైన వేగంతో ఒకదాని స్థానాన్ని మరొకటి ఆక్రమించే యీ ఆవిష్కరణలూ, సృజనలూ, మునుపెన్నడూ కనివిని యెరగని మేరకు దినదినమూ పెరిగే యీ మానవ శ్రమ ఉత్పాదకత, చివరకు యెలాంటి ఘర్షణను ఉత్పన్నం చేస్తాయంటే, ఆ ఘర్షణలో యీనాటి పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థ తప్పక నశిస్తుంది. ఒక వైపున లెక్కకు మీరిన ఐశ్వర్యమూ, కొనుగోలుదారులు కొనజాలనట్టి మితిమీరిన సరుకులూ; మరొకవైపున సమాజంలోని విస్తారమైన జనబాహుళ్యం కార్మికవర్గం కావడమూ, అనగా వేతన కార్మికులుగా మారడమూ, సరిగ్గా ఆ కారణం వల్లనే యీ మితిమీరిన సరుకులను సొంతపరచుకోడానికి అసమర్థులుగా చేయబడడమూ. అపరిమితంగా ధనికమైన చిన్న వర్గంగానూ, ఆస్తి లేని కూలి కార్మికుల పెద్ద వర్గంగానూ సమాజం విభజింపబడిన ఫలితంగా యెలాంటి సమాజం యేర్పడుతున్నదంటే, తన సభ్యులలో విస్తారమైన మెజారిటీ తీవ్రమైన లేమిడి బారినుండి దాదాపు, లేదా బొత్తిగాకూడా కాపాడబడకుండా వుండగా తాను తన సరుకుల మితిమీరిన తనంచేత ఉక్కిరిబిక్కిరి అయ్యే సమాజం యేర్పడుతున్నది. యీ పరిస్థితి రోజురోజుకూ మరింత అసంబద్ధ మౌతున్నది — మరింత అనవసరమౌతున్నది. దీనిని రద్దుచేసి తీరాలి, యిది రద్దుచేయబడ గలదు. ప్రస్తుత వర్గ విభేదాలు అదృశ్యమైవుండే కొత్త సామాజిక వ్యవస్థ సాధ్యం; దానిలో — బహుశా, కొంత లేమిడి వుండేటట్టిదీ, యేమైనప్పటికీ నైతికంగా గొప్ప విలువ గలదీ అయిన స్వల్ప పరివర్తన కాలం తర్వాత — యిప్పటికే వున్నట్టి సమస్త సమాజ సభ్యుల అపారమైన ఉత్పాదక శక్తులను ప్రణాళికాబద్ధంగా వినియోగించుకోవడం ద్వారానూ, విస్తృతపరచడంద్వారానూ, పనిచేసే బాధ్యత అందరికీ ఒకే విధంగా వుండడంద్వారానూ, బతకడానికీ, జీవితాన్ని ఆనందించడానికీ, సమస్త శారీరిక, మానసిక శక్తుల అభివృద్ధికీ,

వినియోగానికీ గల సాధనాలు సమాన ప్రమాణంలోనూ, నిత్యప్రవర్ధమానమైన పూర్ణత్వంతోనూ లభ్యమౌతాయి. మరి, యీ కొత్త సామాజిక వ్యవస్థను గెలుచుకోడానికి కార్మికులు అంతకంతకూ యెక్కువ కృతనిశ్చయు లౌతున్నారనే విషయం రేపు మే ఒకటినా, ఆదివారం మే 3నా[40] అట్లాంటిక్ మహాసముద్రాని కిరువైపులా నిరూపించబడుతుంది.

ఫ్రెడరిక్ ఎంగెల్స్

లండన్, ఏప్రిల్ 30, 1891

Karl Marx, *Lohnarbeit und Kapital*, Berlin, 1891) అనే పుస్తకంగానూ, 1891 మే 13 నాటి "Vorwärts" పత్రిక, సంచిక 109కి అనుబంధంగానూ ప్రచురింపబడింది

# వేతన శ్రమా, పెట్టుబడీ

ప్రస్తుత వర్గపోరాటాలకూ, జాతీయ పోరాటాలకూ భౌతిక పునాది అయిన ఆర్థిక సంబంధాలను వివరించనందుకు మమ్మల్ని వివిధ వర్గాలవాళ్లు నిందించినారు. రాజకీయ ఘర్షణలలో యీ సంబంధాలు ముందుకు తోసుకొనివచ్చినప్పుడు మాత్రమే మేము ఉద్దేశ పూర్వకంగా వీటిని ప్రస్తావించినాము.

అన్నిటినీ మించి అసలు విషయంగా వుండింది యేమిటంటే, ప్రస్తుత చరిత్రలో వర్గ పోరాటాన్ని చిత్రించడమూ, యిప్పటికే అందుబాటులో వుండి, ప్రతి దినమూ కొత్తగా సృష్టింప బడుతూవున్న చారిత్రక సామగ్రిద్వారా యీకిందివాటిని రుజువుచేయడమూ: ఫిబ్రవరిలో, మార్చిలో కార్మికవర్గాన్ని అణచివేయడంతో[41] అదే సమయంలో దాని శత్రువులు కూడా — ఫ్రాన్సులో బూర్జువా రిపబ్లికన్‌లూ, యూరప్ ఖండమంతటా ఫ్యూడల్ నిరంకుశత్వంతో పోరాటం చేస్తూవుండిన బూర్జువావర్గమూ, రైతు వర్గమూ — ఓడిపోయినారనేదీ; ఫ్రాన్సులో "నిజాయితీ గల రిపబ్లిక్"యొక్క విజయం అదే సమయంలో ఫిబ్రవరి విప్లవానికి వీరోచిత స్వాతంత్ర్య యుద్ధాలద్వారా ప్రతిస్పందించిన జాతుల పతనం అనేది; చివరి విషయం విప్లవ కార్మికుల ఓటమితో యూరప్ తన పాత ద్వంద్వ బానిసత్వంలోకి, ఆంగ్లో రష్యన్ బానిస త్వంలోకి మళ్లీ పోయిందనేదీ. పారిస్‌లో జూన్ పోరాటమూ, వియన్నా పతనమూ, 1848 నవంబర్ నాటి బెర్లిన్ విషాదహాస్య నాటకమూ,[42] పోలండు, ఇటలీ, హంగేరీల తెంపరి ప్రయత్నాలూ,[43] ఐర్లండును ఆకలితో మాడ్చి లొంగదీసుకోవడమూ — యివి బూర్జువావర్గానికీ, కార్మికవర్గానికీ మధ్య జరిగిన యూరపియన్ వర్గపోరాటానికి లక్షణాలుగా వుండిన ముఖ్య విషయాలు; వీటిద్వారా మేము రుజువుచేసినాము — ప్రతి విప్లవ ఉత్పతనమూ, దాని గమ్యం వర్గపోరాటానికి యెంత భిన్నంగా వున్నట్లు కనిపించినా, విప్లవ కార్మికవర్గం విజయం పొందిందాకా విఫలం కాకతప్పదనీ, కార్మికవర్గ విప్లవమూ, ఫ్యూడల్ తత్వపు ప్రతీఘాత విప్లవమూ ప్రపంచ యుద్ధంలో కలబడిందాకా ప్రతి సంఘ సంస్కరణా ఊహాస్వర్గంగా

నిలిచివుంటుందనీ. మా కథనంలో, వాస్తవంలో లాగే, బెల్జియం, స్విట్జర్లండులు మహత్తర చారిత్రక చిత్రపటంలో వ్యంగ్య చిత్రం లాంటి విషాదహాస్య జీవిత చిత్రాలుగా వుండినాయి — ఒకటి ఆదర్శ బూర్జువా రాజరిక రాజ్యమూ, మరొకటి ఆదర్శ బూర్జువా రిపబ్లిక్ రాజ్యమూ, రెండూ తాము వర్గపోరాటానికీ, యూరపియన్ విప్లవానికీ సంబంధం లేనివని ఊహించుకునే రాజ్యాలు.

యిప్పుడు, 1848లో వర్గపోరాటాలు బ్రహ్మాండమైన రాజకీయ రూపాలలో అభివృద్ధి కావడం మా పాఠకులు చూసిన తర్వాత, వేటిమీద బూర్జువావర్గపు మనుగడా, దాని వర్గపరిపాలనా, కార్మికుల బానిసత్వమూ నిర్మించబడినాయో ఆ ఆర్థిక సంబంధాలనే మరింత గాఢంగా పరిశీలించే సమయం వచ్చింది.

మేము మూడు పెద్ద విభాగాలుగా వర్ణిస్తాము: 1) పెట్టుబడితో వేతన శ్రమ సంబంధమూ, కార్మికుని బానిసత్వమూ, పెట్టుబడిదారుని పెత్తనమూ; 2) ప్రస్తుత వ్యవస్థలో మధ్య బూర్జువావర్గాలయొక్కా, రైతు అంతస్తు అనే దానియొక్కా అనివార్య వినాశనం; 3) ప్రపంచ మార్కెట్ నియంత అయిన ఇంగ్లండు వివిధ యూరపియన్ దేశాల బూర్జువావర్గాలను వాణిజ్యంలో అణచివేయడమూ, దోపిడీచేయడమూ.

మా కథనాన్ని సాధ్యమైనంత సరళమూ, సులభమూ చేయడానికి ప్రయత్నిస్తాము, పాఠకునికి అర్థశాస్త్రంలోని అత్యంత ప్రాథమిక విషయాలు కూడా తెలుసునని ఊహించుకోము. కార్మికులకు అర్థం కావాలని మా కోరిక. అంతే కాక, జర్మనీలో అత్యంత సరళమైన ఆర్థిక సంబంధాలను గురించి అత్యంత అసాధారణమైన అజ్ఞానమూ, భావాల గందరగోళమూ వున్నాయి — ప్రస్తుత వ్యవస్థయొక్క గుర్తింపబడిన సమర్థకులు మొదలుకొని మహత్తులు చేసే సోషలిస్టులదాకా, ముక్కచెక్కలైన జర్మనీలో సర్వసత్తాక పాలకులకంటె కూడా యెక్కువ సంఖ్యలో వున్న గుర్తింపబడని రాజకీయ మహా మేధావులదాకా.

కనుక, యిప్పుడిక మొదటి ప్రశ్న:

## వేతనం అంటే యేమిటి? అది యెలా నిర్ణయింపబడుతుంది?

మీ వేతనాలు యెంత అని కార్మికులను అడిగితే, "నా యజమానినుండి నాకు రోజుకు ఒక మార్కు వస్తుంది" అని ఒకడూ, "నాకు రెండు మార్కులు వస్తాయి" అని మరొకడూ, యిలా చెప్తారు. వాళ్ల భిన్న వృత్తులనుబట్టి వాళ్లు భిన్న మొత్తాల డబ్బును పేర్కొంటారు. ఆ మొత్తాలు వాళ్లకు తమతమ యజమానులనుండి నిర్దిష్టమైన పని

చేసినందుకు గాను, ఉదాహరణకు ఒక గజంబట్ట నేసినందుకు గాను, లేదా ఒక పుట అచ్చు కూర్చినందుకు గాను, వస్తాయి. వాళ్ల సమాధానాలలో వైవిధ్యం వున్నప్పటికీ, వాళ్లందరూ ఒక విషయంమీద అంగీకరిస్తారు: వేతనం అనేది నిర్దిష్టమైన శ్రమ కాలానికి గాను, లేదా నిర్దిష్టమైన శ్రమ మొత్తానికి గాను పెట్టుబడిదారుడు చెల్లించే డబ్బు.

కనుక, పెట్టుబడిదారుడు కార్మికుల శ్రమను డబ్బుతో కొన్నట్లు కనిపిస్తుంది. వాళ్లు తమ శ్రమను డబ్బుకు గాను అతనికి అమ్ముతారు. కానీ, యిది కనిపించేది మాత్రమే. నిజానికి వాళ్లు పెట్టుబడిదారునికి డబ్బుకు గాను అమ్మేది తమ శ్రమ శక్తి. పెట్టుబడిదారుడు యీ శ్రమశక్తిని ఒక రోజుకు, ఒక వారానికి, ఒక నెలకు, వగైరా కొంటాడు. కొన్న తర్వాత అతను దానిని యెలా ఉపయోగించుకుంటాడంటే, ఆ నిర్ణీత కాలం పాటు కార్మికులతో పని చేయించుకోవడంద్వారా. పెట్టుబడిదారుడు యే మొత్తంతో వాళ్ల శ్రమశక్తిని కొన్నాడో అదే మొత్తంతో, ఉదాహరణకు రెండు మార్కులతో, అతను రెండు పౌండ్ల చక్కెర గానీ, నిర్దిష్టమైన పరిమాణంలో మరే సరుకైనా గానీ కొనివుండగలడు. రెండు పౌండ్ల చక్కెర కొనడానికి అతను ఖర్చుపెట్టిన రెండు మార్కులు ఆ రెండు పౌండ్ల చక్కెరయొక్క ధర. పన్రెండు గంటల శ్రమశక్తి వినియోగాన్ని కొనడానికి అతను ఖర్చుపెట్టిన రెండు మార్కులు ఆ పన్రెండు గంటల శ్రమయొక్క ధర. కనుక, శ్రమశక్తి అనేది ఒక సరుకు, చక్కెర యెలాగో అలాగే. మొదటిదాన్ని గడియారంతో కొలుస్తారు, రెండవదాన్ని త్రాసుతో తూచుతారు.

కార్మికులు తమ సరుకు అయిన శ్రమశక్తిని పెట్టుబడిదారుని సరుకు అయిన డబ్బుకు సాటా చేసుకుంటారు; యీ సాటా నిర్ణీతమైన నిష్పత్తిలో జరుగుతుంది. యింత కాలం శ్రమశక్తిని వినియోగించుకున్నందుకు గాను యింత డబ్బు. పన్రెండు గంటలు నేసినందుకు గాను రెండు మార్కులు. మరి, రెండు మార్కులకు నేను కొనగల సరుకులన్నిటికీ యీ రెండు మార్కులు ప్రాతినిధ్యం వహించవా? కనుక, వాస్తవంలో, కార్మికుడు తన సరుకు అయిన శ్రమశక్తిని రకరకాల యితర సరుకులకు, అది కూడా నిర్ణీతమైన నిష్పత్తిలో, సాటా చేసుకున్నాడు. పెట్టుబడిదారుడు అతనికి రెండు మార్కులు యివ్వడంద్వారా, అతని దినసరి శ్రమకు సాటాగా యింత పరిమాణం మాంసం, యింత పరిమాణం బట్టలు, యింత పరిమాణం యింధనం, వెలుతురు, వగైరా అతనికి యిచ్చినాడు. కనుక, యీ రెండు మార్కులు శ్రమశక్తి యితర సరుకులకు యే నిష్పత్తిలో సాటా చేసుకోబడుతుందో ఆ నిష్పత్తిని — కార్మికుని శ్రమశక్తియొక్క మారకం విలువను — వ్యక్తం చేస్తాయి. సరుకుయొక్క మారకం విలువ, డబ్బు రూపంలో లెక్కింపబడినప్పుడు, దాని ధర అనబడుతుంది. వేతనం అనేది శ్రమశక్తి ధరకు, మానవ రక్తమాంసాలు తప్ప మరే ఉనికి పట్టూ లేని యీ విశిష్టమైన సరుకుయొక్క ధరకు, ప్రత్యేకమైన పేరు మాత్రమే. దీనిని మామూలుగా శ్రమ ధర అంటారు.

యే కార్మికున్నైనా తీసుకుందాం, మాటవరసకు నేత కార్మికుని తీసుకుందాం. పెట్టుబడిదారుడు అతనికి మగ్గమూ, నూలూ సరఫరా చేస్తాడు. నేత కార్మికుడు పని ప్రారంభిస్తాడు, నూలు బట్టగా మారుతుంది. బట్టను పెట్టుబడిదారుడు వశంచేసుకొని, మాటవరుసకు, యిరవై మార్కులకు అమ్ముతాడు. నేత కార్మికుని వేతనం బట్టలో, యిరవై మార్కులలో, అతని శ్రమ ఉత్పాదితంలో భాగమా? కానే కాదు. బట్టను అమ్మడానికి చాలా ముందే, బహుశా దానిని నేయడం పూర్తికావడానికి చాలా ముందే నేత కార్మికుడు తన వేతనం పొందినాడు. కనుక, పెట్టుబడిదారుడు యీ వేతనం చెల్లించేది అతనికి బట్టనుండి వచ్చే డబ్బుతో కాదు, అతనివద్ద అప్పటికే వుండిన డబ్బుతో. నేత కార్మికునికి అతని యజమాని సరఫరా చేసిన మగ్గమూ, నూలూ యెలా ఆ కార్మికుని ఉత్పాదితం కాదో, అలాగే శ్రమశక్తి అనే తన సరుకుకు సాటాగా ఆ కార్మికుడు పొందే సరుకులు కూడా అతని ఉత్పాదితం కాదు. యజమానికి తన బట్టకు కొనుగోలుదారుడే దొరికివుండక పోవచ్చు. దాని అమ్మకం ద్వారా అతనికి వేతనం డబ్బులు కూడా వచ్చివుండక పోవచ్చు. నేత కార్మికుని వేతనంతో పోలిస్తే అతను దానిని చాలా లాభదాయకంగా అమ్ముకోవచ్చు. అవన్నీ నేత కార్మికునికి సంబంధం లేదు. పెట్టుబడిదారుడు తన దగ్గరున్న ధనంలో — తన పెట్టుబడిలో — కొంత భాగంతో నేత కార్మికుని శ్రమశక్తిని కొంటాడు, తన ధనంలోని మరొక భాగంతో అతను ముడిపదార్థం అయిన నూలునూ, శ్రమ పరికరం అయిన మగ్గాన్నీ కొన్నట్లే. యీ కొనుగోళ్లు చేసిన తర్వాత — మరి యీ కొనుగోళ్లలో బట్ట ఉత్పత్తికి అవసరమైన శ్రమశక్తి కూడా వుంది — తనకు చెందిన ముడి పదార్థాలతోనూ, శ్రమ పరికరాలతోనూ మాత్రమే అతను ఉత్పత్తి చేస్తాడు. వీటిలో యిప్పుడు మన నేత కార్మికుడు కూడా చేరివున్నాడు; ఉత్పత్తి అయిన సరుకులో గానీ, దాని ధరలో గానీ అతనికేమీ భాగం లేదు, మగ్గానికి లేనట్లే.

కనుక, వేతనం అనేది కార్మికుడు ఉత్పత్తి చేసిన సరుకులో అతనికి గల భాగం కాదు. వేతనం అనేది అప్పటికే వున్న సరుకులలో కొంత భాగం, దేనితో నిర్ణీత పరిమాణం గల ఉత్పాదక శ్రమశక్తిని పెట్టుబడిదారుడు తన సొంతానికి కొంటాడో అది.

కనుక, శ్రమశక్తి అనేది దాని సొంతదారుడైన వేతన కార్మికుడు పెట్టుబడికి అమ్మే సరుకు. అతను యెందు కమ్ముతాడు? బతికేటందుకు.

కానీ, శ్రమశక్తియొక్క ఆచరణ, అనగా శ్రమ — అదే కార్మికుని సొంత జీవిత క్రియ, అతని సొంత జీవితపు వ్యక్తీకరణ. అవసరమైన జీవనాధారాలను సంపాయించుకొనేటందుకు యీ జీవితక్రియను అతను మరొకరికి అమ్ముతాడు. యీవిధంగా అతని జీవితక్రియ అతనికి బతకడానికి వీలుకలిగించే సాధనం మాత్రమే. అతను బతికేటందుకు పనిచేస్తాడు. అతను

శ్రమను తన జీవితంలో భాగంగా కూడా పరిగణించడు — అది అతని జీవితాన్ని త్యాగం చేయడం. అది అతను మరొకరికి యిచ్చివేసిన సరుకు. కనుక, అతని క్రియయొక్క ఉత్పాదితం అతని క్రియయొక్క లక్ష్యం కాదు కూడా. అతను తన సొంతానికి ఉత్పత్తిచేసేది తాను నేసే చీనాంబరం కాదు, తాను గనిలోనుండి వెలికి తీసే బంగారు కాదు, తాను నిర్మించే రాజభవనం కాదు. అతను తన సొంతానికి ఉత్పత్తి చేసేది వేతనం; చీనాంబరమూ, బంగారూ, రాజభవనమూ అతనికి నిర్ణీత పరిమాణం గల జీవనాధారాలుగా మారుతాయి, బహుశా ఒక నూలు చొక్కాగా, కాసిన్ని చిల్లర డబ్బులుగా, కొట్టిడీలో వసతిగా. మరి పన్రెండు గంటలపాటు నేయడమూ, వడకడమూ, బరమా పని చేయడమూ, లేతు పని చేయడమూ, కట్టడమూ, త్రవ్వడమూ, రాళ్ళు కొట్టడమూ, బరువులు మోయడమూ, వగైరా పనులు చేసే కార్మికుడు యీ పన్రెండు గంటలపాటు నేయడాన్నీ, వడకడాన్నీ, బరమా పనినీ, లేతు పనినీ, కట్టడాన్నీ, త్రవ్వడాన్నీ, రాళ్ళు కొట్టడాన్నీ తన జీవిత వ్యక్తీకరణగా, జీవితంగా పరిగణిస్తాడా? తద్వ్యతిరేకంగా, యీ క్రియ ముగిసిన చోట అతనికి జీవితం ప్రారంభ మౌతుంది, భోజనం బల్లవద్దా, కాఫీ హోటల్‌లోనూ, పక్కమీదా. పన్రెండు గంటల శ్రమ అతనికి నేయడంగా, వడకడంగా, బరమా పనిగా, వగైరాగా అర్థం లేనిది, అతన్ని భోజనం బల్లవద్దకూ, కాఫీ హోటల్‌కూ, పక్కమీదికీ తీసుకపోయే సంపాదనగా మాత్రమే అర్థం గలది. పట్టుపురుగు కంబళి పురుగుగా తన మనుగడను కొనసాగించే టందుకు నేస్తే, అది పూర్తిగా వేతన కార్మికుడు అవుతుంది. శ్రమశక్తి యెల్లప్పుడూ సరుకుగా వుండలేదు. శ్రమ యెల్లప్పుడూ వేతన శ్రమగా, అనగా స్వేచ్ఛాయుత శ్రమగా, వుండలేదు. బానిస తన శ్రమశక్తిని బానిస యజమానికి అమ్మలేదు, యెద్దు తన సేవలను రైతుకు అమ్మనట్లే. బానిస, తన శ్రమశక్తితో కలిసి, ఒకేసారి శాశ్వతంగా తన యజమానికి అమ్మబడతాడు. అతను ఒక యజమాని చేతినుండి మరొక యజమాని చేతికి మారగల సరుకు. అతనే ఒక సరుకు; శ్రమశక్తి అతని సరుకు కాదు. ఫ్యూడల్ దాసుడు తన శ్రమశక్తిలో కొంత భాగం మాత్రమే అమ్ముతాడు. అతనికి భూస్వామినుండి వేతనం రాదు; భూస్వామికే అతనినుండి కప్పం వస్తుంది.

ఫ్యూడల్ దాసుడు భూమికి చెందినవాడు, భూమిలో పండిన పంటను అతను భూస్వామికి అప్పగిస్తాడు. తద్భిన్నంగా, స్వేచ్ఛాయుత కార్మికుడు తననే అమ్ముకుంటాడు, నిజంగానే, తననే ముక్కలు ముక్కలుగా అమ్ముకుంటాడు. అతను దినదినమూ, తన జీవితంలో యెనిమిది, పది, పన్రెండు, పదైదు గంటలను, వేలంలో, అందరికంటె యెక్కువ పాడిన వానికి, ముడి పదార్థాలూ, శ్రమ పరికరాలూ, జీవనాధారాలూ గలవానికి, అనగా పెట్టుబడిదారునికి, అమ్ముతాడు. కార్మికుడు ఒక యజమానికి గానీ, భూమికి గానీ చెందడు; అతని దినసరి జీవితంలో యెనిమిది, పది, పన్రెండు, పదైదు గంటలు వాటిని కొన్నవానికి

చెందుతాయి. కార్మికుడు తన్ను తాను యెవరికి అద్దెకు యిచ్చుకుంటాడో ఆ పెట్టుబడిదారుని తనకు యిష్టం వచ్చినప్పుడు వదలిపెడతాడు; పెట్టుబడిదారుడు తనకు తోచినప్పుడు, అతనినుండి తనకిక యే లాభమూ, లేదా అనుకున్నంత లాభం రాకపోయిన వెంటనే, అతన్ని పనినుండి తొలగిస్తాడు. కానీ, తన శ్రమశక్తి అమ్మకం యేకైక జీవనాధారంగా వున్న కార్మికుడు, తన మనుగడను విసర్జించకుండా, మొత్తం కొనుగోలుదార్ల వర్గాన్ని, అనగా పెట్టుబడిదారీ వర్గాన్ని, వదలిపెట్టజాలడు. అతను యీ పెట్టుబడిదారునికో, ఆ పెట్టుబడిదారునికో కాక, మొత్తం పెట్టుబడిదారీ వర్గానికి చెందుతాడు; అంతేకాక, తనను తాను అమ్ముకోవడం, అనగా యీ పెట్టుబడిదారీ వర్గంలోపల ఒక కొనుగోలుదారుని చూసుకోవడం, అతని బాధ్యతే.

యిప్పుడు, పెట్టుబడికీ, వేతన శ్రమకూ మధ్యగల సంబంధాన్ని మరింత లోతుగా పరిశీలించే ముందు, వేతన నిర్ణయంలో లెక్కలోకి వచ్చే అత్యంత సాధారణ సంబంధాలను టూకీగా చెప్తాం.

వేతనం, మనం గమనించినట్లు, నిర్దిష్టమైన సరుకుయొక్క, శ్రమశక్తియొక్క, ధర. కనుక, వేతనం అనేది ప్రతి యితర సరుకుయొక్క ధరనూ నిర్ణయించే నియమాల చేతనే నిర్ణయింపబడుతుంది.

కనుక, ప్రశ్న యేమిటంటే, ఒక సరుకు ధర యెలా నిర్ణయింపబడుతుంది?

## సరుకు ధర దేనిచేత నిర్ణయింపబడుతుంది?

కొనుగోలుదార్లకూ, అమ్మకందార్లకూ మధ్యగల పోటీచేత, సరఫరాతో డిమాండుకూ డిమాండుతో సరఫరాకూ గల సంబంధంచేత. సరుకు ధరను నిర్ణయించే పోటీ త్రిముఖమైనది.

ఒకే సరుకును వివిధ అమ్మకందారులు అమ్మజూపుతారు. ఒకే నాణ్యం గల సరుకులు వున్నప్పుడు, అందరికంటె చౌకగా అమ్మేవాడు యితర్లను రంగంనుండి తరిమివేసి, అందరి కంటె యెక్కువగా అమ్మకం చేయడం తప్పదు. యీవిధంగా, అమ్మకందారులు అమ్మకాల కొరకు, మార్కెట్ కొరకు, తమలో తాము పోటీపడతారు. వాళ్లలో ప్రతి వొకడూ అమ్మాలనీ, సాధ్యమైనంత యెక్కువ సరుకులను అమ్మాలనీ, వీలైతే యితర అమ్మకందారులను మినహాయించి తానొక్కడే అమ్మాలనీ కోరుతాడు. అందువలన ఒకనికంటె ఒకడు చౌకగా అమ్ముతాడు. తత్పర్యవసానంగా, అమ్మకందార్ల మధ్య పోటీ యేర్పడుతుంది; యిది వాళ్ళు అమ్మజూపే సరుకుల ధరను తగ్గిస్తుంది.

కానీ, కొనుగోలుదార్ల మధ్య కూడా పోటీ యేర్పడుతుంది; తన పాలికి యిది అమ్మ జూపిన సరుకుల ధర పెరగడానికి కారణ మౌతుంది.

చివరి విషయం, కొనుగోలుదార్లకూ, అమ్మకందార్లకూ మధ్య పోటీ జరుగుతుంది. కొనుగోలుదార్లు సాధ్యమైనంత చౌకగా కొనాలనీ, అమ్మకందారులు సాధ్యమైనంత ప్రియంగా అమ్మాలనీ కోరుతారు. కొనుగోలుదార్లకూ, అమ్మకందార్లకూ మధ్యగల యీ పోటీయొక్క ఫలితం, పైన చెప్పిన రెండు పక్షాల బలాబలాలమీద, అనగా కొనుగోలుదార్ల శిబిరంలో పోటీ యెక్కువ బలంగా వుందా, అమ్మకందార్ల శిబిరంలో పోటీ యెక్కువ బలంగా వుందా అనే దానిమీద ఆధారపడుతుంది. పరిశ్రమ రెండు సైన్యాలను ఒకదానిమీదికి మరొక దానిని రంగంలోకి నడిపిస్తుంది; వాటిలో ప్రతి వొకటీ మళ్లీ తన సొంత శ్రేణులలోపల, తన సొంత సైనికుల మధ్య యుద్ధం సాగిస్తుంది. యే సైన్యంలోని సైనికులు ఒకరి నొకరు తక్కువగా తన్నుకుంటారో ఆ సైన్యం శత్రు సైన్యంమీద విజయం పొందుతుంది.

మార్కెట్‌లో 100 బేళ్ల దూది వుందనీ, అదే సమయంలో 1000 బేళ్ల దూదిని కొనేవాళ్లు వున్నారనీ అనుకుందాం. కనుక, యీ సందర్భంలో, సరఫరా వున్నదానికి పదింతలు వుంది డిమాండు. కొనుగోలుదార్లలో పోటీ చాలా బలంగా వుంటుంది; వాళ్లలో ప్రతి వొకడూ వంద బేళ్లలో ఒకటైనా, వీలైతే అన్నీ తన సొంతానికి పొంద గోరుతాడు. యీ ఉదాహరణ యిష్టారాజ్యంగా చేసిన ఊహ కాదు. పత్తిపంట విఫలం కావడం మనం వర్తక చరిత్రలో అనుభవించినాం. అప్పుడు కొద్దిమంది పెట్టుబడిదార్లు పొత్తుచేసుకొని, వంద బేళ్లను కాక, ప్రపంచపు దూది నిలువలన్నిటినీ కొనడానికి ప్రయత్నించినారు. కనుక, పై ఉదాహరణలో, ఒకొక్క దూది బేలుకు సాపేక్షంగా యెక్కువ ధరను యిస్తాననడంద్వారా ఒక కొనుగోలుదారుడు మరొక కొనుగోలుదారుని మార్కెట్‌నుండి తరిమివేయ జూస్తాడు. దూది అమ్మకందారులు శత్రు సైన్యంలోని సైనికులు మహా భీషణమైన పోరాటంలో నిమగ్నులై వుండడమూ, తమ వంద బేళ్లూ అమ్మకం కావడం పరమ నిశ్చయంగా వుండడమూ గమనించి, తమలో తాము కలహించుకోకుండానూ, తమ శత్రువులు దూది ధరను పెంచడానికి ఒకరితో ఒకరు పోటీపడే సమయంలో ఆ ధరను తాము తగ్గించకుండానూ బాగా జాగ్రత్తపడతారు. ఆవిధంగా, అమ్మకందార్ల శిబిరంలో హఠాత్తుగా శాంతి యేర్పడుతుంది. వాళ్లు కట్టకట్టుకొని కొనుగోలుదార్ల యెదుట నిలబడతారు, తత్వవేత్తల లాగ చేతులు కట్టుకొని నిలబడతారు; మహా పట్టుదలా, తహతహా గల కొనుగోలుదార్లు యిస్తామనే దానికి కూడా అతి నిశ్చితమైన పరిమితులు వుంటాయి గనుక కానీ, లేకపోతే వాళ్ల డిమాండ్లకు హద్దులు వుండవు.

కనుక, ఒక సరుకుయొక్క డిమాండుకంటె దాని సరఫరా తక్కువ వుంటే, అప్పుడు అమ్మకందార్ల మధ్య స్వల్ప పోటీ మాత్రం వుంటుంది, లేదా బొత్తిగా వుండదు. యీ

పోటీ యే మేరకు తగ్గుతుందో, అదే మేరకు కొనుగోలుదార్ల మధ్య పోటీ పెరుగుతుంది. ఫలితంగా సరుకు ధర అంతో యింతో గణనీయంగా పెరుగుతుంది.

దీనికి విరుద్ధమైన ఘటన, విరుద్ధమైన ఫలితంతో, మరింత తరుచుగా జరగడం బాగా తెలిసిన విషయమే. డిమాండును గణనీయంగా మించిన సరఫరా; అమ్మకందార్ల మధ్య తెంపరి పోటీ; కొనుగోలుదార్ల కొరత; పరిహాసాస్పదమైనంత తక్కువ ధరలకు సరుకులను అమ్మివేయడం.

మరి, ధరల పెరుగుదల అంటే, తగ్గుదల అంటే యేమిటి? యెక్కువ ధర, తక్కువ ధర అంటే యేమిటి? సూక్ష్మదర్శినిగుండా చూస్తే యిసుక రేణువు కూడా యెక్కువగా వుంటుంది, పర్వతంతో పోలిస్తే గోపురం కూడా తక్కువగా వుంటుంది. సరఫరాకూ, డిమాండుకూ మధ్యగల నిష్పత్తిచేత ధర నిర్ణయింపబడితే, సరఫరాకూ, డిమాండుకూ మధ్యగల నిష్పత్తిని యేది నిర్ణయిస్తుంది?

మనకు యెదురయ్యే మొదటి బూర్జువాను అడుగుదాం. అతను క్షణకాలం కూడా ఆలోచన చేయకుండా మరొక అలెగ్జాండర్ లాగ యీ తాత్వికముడిని[44] యెక్కాల పుస్తకంతో కోసేస్తాడు. అతను యిలా చెప్తాడు: నేను అమ్మే సరుకుల ఉత్పత్తికి నాకు 100 మార్కులు ఖర్చు అయితే, యీ సరుకుల అమ్మకంద్వారా నాకు 110 మార్కులు వస్తే, యేడాదిలోపలనే అనుకోండి – అది మంచి, నిజాయితీ అయిన, న్యాయమైన లాభం. కానీ, సాటాలో నాకు 120, లేదా 130 మార్కులు వస్తే, అది పెద్ద లాభం; నాకు 200 మార్కులు వస్తే, అది అసాధారణమైన లాభం, అపారమైన లాభం కూడా. కనుక, బూర్జువాకు లాభపు కొలబద్దగా వున్నది యేమిటి? తన సరుకుయొక్క ఉత్పత్తి ఖర్చు. తన సరుకుకు సాటాగా, ఉత్పత్తి చేయడానికి అంతకంటె తక్కువ ఖర్చు అయిన సరుకుల మొత్తం అతనికి వస్తే, అతను నష్టపడినట్లు. తన సరుకుకు సాటాగా, ఉత్పత్తి చేయడానికి అంతకంటె యెక్కువ ఖర్చు అయిన సరుకుల మొత్తం అతనికి వస్తే, అతను లాభపడినట్లు. తన సరుకుయొక్క మారకం విలువ యే మేరకు సున్నకంటె – ఉత్పత్తి ఖర్చుకంటె – పైన, లేదా కింద వుందనేదాన్నిబట్టి అతను లాభంయొక్క పెరుగుదలను, లేదా తరుగుదలను లెక్కవేస్తాడు.

యీవిధంగా, సరఫరా, డిమాండుల మారే సంబంధం ఒకసారి ధరల పెరుగుదలనూ, ఒకసారి ధరల తరుగుదలనూ, ఒకసారి యెక్కువ ధరలనూ, ఒకసారి తక్కువ ధరలనూ కలిగిస్తుందని గమనించినాం. అరకొర సరఫరా మూలంగా గానీ, డిమాండులో విపరీతమైన పెరుగుదల మూలంగా గానీ ఒక సరుకు ధర గణనీయంగా పెరిగితే, మరొక సరుకు ధర ఆ నిష్పత్తిలో విధిగా పడిపోయివుండాలి. యెందుకంటే, ఒక సరుకుయొక్క ధర అనేది యే నిష్పత్తిలో దానికి సాటాగా సరుకులు వస్తాయో ఆ నిష్పత్తిని డబ్బు రూపంలో వ్యక్తం

చేస్తుంది మాత్రమే. ఉదాహరణకు, ఒక గజం పట్టుబట్ట ధర అయిదు మార్కులనుండి ఆరు మార్కులకు పెరిగితే, పట్టుబట్ట దృష్ట్యా వెండి ధర పడిపోయినట్లు; అదే విధంగా, తమ పాత ధరలలో నిలిచివున్న యితర సరుకులన్నిటి ధరలూ పట్టుబట్ట దృష్ట్యా పడిపోయినట్లు. అదే మొత్తం పట్టుబట్టలను పొందడానికి, వాటికి సాటాగా ఆ సరుకులను యెక్కువ మొత్తంలో యివ్వవలసి వుంటుంది. ఒక సరుకుయొక్క ధర పెరుగుతూవుంటే, దాని పర్యవసానం యేమిటి? యీ వర్ధిల్లే పరిశ్రమ శాఖలోకి పెట్టుబడి పెద్దగా ప్రవహిస్తుంది; అభిమానిత పరిశ్రమ రంగంలోకి యీ పెట్టుబడి ప్రవాహం యెంతవరకు కొనసాగుతుందంటే, అది మామూలు లాభాలు యిచ్చేటంతవరకు, లేదా అది ఉత్పత్తి చేసే సరుకుల ధర, అధికోత్పత్తి మూలంగా, ఉత్పత్తి ఖర్చుకంటె తక్కువకు పడిపోయేటంతవరకు.

దీనికి విరుద్ధంగా, ఒక సరుకుయొక్క ధర దాని ఉత్పత్తి ఖర్చుకంటె తక్కువకు పడిపోతే, యీ సరుకు ఉత్పత్తినుండి పెట్టుబడి ఉపసంహరింపబడుతుంది. కాలం తీరినదై, అందువలన నశించిపోక తప్పని పరిశ్రమ శాఖ అయితే తప్ప, యీ సరుకుయొక్క ఉత్పత్తి, అనగా దీని సరఫరా, యీ పెట్టుబడి నిర్గమనం మూలంగా తగ్గిపోతూనే వుంటుంది; యెంత వరకు తగ్గిపోతూ వుంటుందంటే, యిది డిమాండుకు అనురూపంగా వుండి, తత్ఫలితంగా దీని ధర మళ్లీ దీని ఉత్పత్తి ఖర్చుకు సమమైన స్థాయిలో వుండేటంతవరకు, లేదా డిమాండు కంటె తక్కువకు సరఫరా పడిపోయేటంతవరకు, అనగా దీని ధర మళ్లీ దీని ఉత్పత్తి ఖర్చుకంటె యెక్కువకు పెరిగేటంతవరకు; యెందుకంటే, ఒక సరుకుయొక్క చలామణిలో వున్న ధర యెప్పుడూ దాని ఉత్పత్తి ఖర్చుకంటె యెక్కువగా గానీ, తక్కువగా గానీ వుంటుంది.

లోపలికీ, బయటకీ, ఒక పరిశ్రమ రంగంలోనుండి మరొక పరిశ్రమ రంగంలోకి పెట్టుబడి యెలా నిరంతరం పయనించేదీ మనకు కనపడుతుంది. యెక్కువ ధరలు చాలా యెక్కువ ఆగమనాన్నీ, తక్కువ ధరలు చాలా యెక్కువ నిర్గమనాన్నీ కలిగిస్తాయి.

మరొక దృక్పథంనుండి సరఫరా మాత్రమే కాక, డిమాండు కూడా యెలా ఉత్పత్తి ఖర్చుచేత నిర్ణయించబడేదీ మేము చూపించగలం. కానీ యిది మమ్మల్ని మా విషయంనుండి చాలా దూరం తీసుకపోతుంది.

సరఫరా, డిమాండుల యెగుడుదిగుడులు నిరంతరం సరుకు ధరను ఉత్పత్తి ఖర్చువద్దకు యెలా తిరిగి తీసుకవచ్చేదీ యిప్పడే గమనించినాం. సరుకుయొక్క నిజమైన ధర యెప్పుడూ దాని ఉత్పత్తి ఖర్చులకంటె యెక్కువగానో తక్కువగానో వుండడం నిజమే; కానీ పెరుగుదలా, తరుగుదలా ఒకదాని కొకటి సమతూకంగా వుంటాయి; తత్ఫలితంగా, నిర్దిష్ట కాలంలోపల, పరిశ్రమయొక్క ఆటునూ, పోటునూ కలిపి తీసుకుంటే, సరుకులు వాటి ఉత్పత్తి ఖర్చును బట్టి సాటా చేసుకోబడతాయి; కనుక, వాటి ధర వాటి ఉత్పత్తి ఖర్చుచేత నిర్ణయింపబడుతుంది.

ఉత్పత్తి ఖర్చుచేత ధర యిలా నిర్ణయం కావడాన్ని అర్థశాస్త్రజ్ఞులు చెప్పే అర్థంలో గ్రహించకూడదు. అర్థశాస్త్రజ్ఞులు సరుకుల సగటు ధర ఉత్పత్తి ఖర్చుకు సమాన మంటారు; యిది నియమం అంటారు. పెరుగుదల తరుగుదలచేతా, తరుగుదల పెరుగుదల చేతా యెందులో భర్తీచేయబడుతుందో ఆ అరాజక ప్రక్రియను వాళ్లు యాదృచ్ఛికతగా పరిగణిస్తారు. అంతే న్యాయంగా యెవరైనా యెగుడుదిగుడులను నియమంగానూ, ఉత్పత్తి ఖర్చుచేత నిర్ణయం కావడాన్ని యాదృచ్ఛికతగానూ పరిగణించవచ్చు; యితర అర్థశాస్త్రజ్ఞులు వాస్తవంగా యిలా చేస్తారు కూడా, కానీ, మరింత దగ్గరగా చూసినప్పుడు పూర్తిగా యీ యెగుడుదిగుడులే తమవెంట అత్యంత భయంకరమైన విధ్వంసనాలను కొనితెచ్చి, భూకంపాల లాగ బూర్జువా సమాజాన్ని దాని పునాదుల దాకా గజగజలాడించేది — పూర్తిగా యీ యెగుడుదిగుడుల కాలంలోనే ధరలు ఉత్పత్తి ఖర్చుచేత నిర్ణయింపబడేది. యీ అవ్యవస్థయొక్క మొత్తం ప్రక్రియే దాని సువ్యవస్థ. యీ పారిశ్రామిక అరాజకత్వపు గతిలో, వలయంగా తిరిగే యీ గమనంలో, పోటీ ఒక వైపరీత్యాన్ని మరొక వైపరీత్యంతో భర్తీచేస్తుందనవచ్చు.

కనుక, ఒక సరుకుయొక్క ధర దాని ఉత్పత్తి ఖర్చుకంటె యెక్కువకు పెరిగే దశలు అది దాని ఉత్పత్తి ఖర్చుకంటె తక్కువకు పడిపోయే దశలచేతా, అలాగే యీ దశలు ఆ దశలచేతా భర్తీచేయబడేటట్లుగా ఆ సరుకుయొక్క ధర దాని ఉత్పత్తి ఖర్చుచేత నిర్ణయింపబడుతుందని మనకు అర్థమౌతున్నది. నిజమే, యిది విడివిడి పారిశ్రామిక ఉత్పత్తులకు వర్తించదు, మొత్తం పరిశ్రమ శాఖకు మాత్రమే వర్తిస్తుంది. తత్పర్యవసానంగా, యిది విడి పారిశ్రామికునికి కూడా వర్తించదు, మొత్తం పారిశ్రామికుల వర్గానికి మాత్రమే వర్తిస్తుంది.

ఉత్పత్తి ఖర్చుచేత ధర నిర్ణయింపబడడమన్నా, సరుకును ఉత్పత్తి చేయడానికి అవసరమైన శ్రమ కాలంచేత ధర నిర్ణయింపబడడమన్నా ఒకటే. యెందుకంటే, ఉత్పత్తి ఖర్చులో వున్నవి రెండు: 1) ముడి పదార్థాలూ, పరికరాల విలువ తరుగుదలా — అనగా, వేటి ఉత్పత్తికి నిర్దిష్ట శ్రమ దినాలు ఖర్చయినాయో, కనుక యేవి నిర్దిష్ట శ్రమ కాలానికి ప్రాతినిధ్యం వహిస్తాయో ఆ పారిశ్రామిక ఉత్పాదితాల విలువ తరుగుదలా; 2) ప్రత్యక్ష శ్రమ — దీని కొలమానం సరిగ్గా కాలమే.

దరహంమీద సరుకుల ధరను పాలించే సాధారణ నియమాలే వేతనాన్ని, అనగా శ్రమయొక్క ధరను, కూడా నిర్ణయిస్తాయి.

వేతనం సరఫరాకు, డిమాండుకూ మధ్యగల నిష్పత్తిని బట్టి — శ్రమశక్తి కొనుగోలుదార్లైన పెట్టుబడిదార్లకూ, శ్రమశక్తి అమ్మకందార్లైన కార్మికులకూ మధ్యగల పోటీలో జరిగే మలుపునుబట్టి — పెరుగుతూ, తరుగుతూ వుంటుంది. దరహంమీద వేతనంలోని యెగుడుదిగుడులు సరుకుల ధరలలోని యెగుడుదిగుడులకు అనురూపంగా వుంటాయి. కానీ,

యీ యెగుడుదిగుడుల లోపల, శ్రమయొక్క ధర ఉత్పత్తి ఖర్చుచేత నిర్ణయింపబడుతుంది, యీ సరుకును — శ్రమశక్తిని — ఉత్పత్తి చేయడానికి అవసరమైన శ్రమ కాలంచేత నిర్ణయింపబడుతుంది.

అయితే, శ్రమశక్తియొక్క ఉత్పత్తి ఖర్చు యెంత?

అది కార్మికుని కార్మికునిగా నిలిపివుంచడానికీ, కార్మికునిగా అభివృద్ధి చేయడానికీ అయ్యే ఖర్చు.

కనుక, యే పనికైనా అవసరమైన తర్ఫీదు కాలం తక్కువయ్యేకొద్దీ, ఆ కార్మికుని ఉత్పత్తి ఖర్చు తక్కువగా వుంటుంది, అతని శ్రమయొక్క ధర, అనగా అతని వేతనం, తక్కువగా వుంటుంది. యే పరిశ్రమ శాఖలలో తర్ఫీదు కాలం దాదాపు యేమీ అవసరం లేదో, కేవలం కార్మికుని శారీరిక సజీవత్వం సరిపోతుందో, ఆ శాఖలలో అతని ఉత్పత్తికి అవసరమైన ఖర్చు అతన్ని సజీవంగానూ, పనికి సమర్థునిగానూ వుంచడానికి అవసరమైన సరుకులకు దాదాపు పరిమితమౌతుంది. కనుక, అతని శ్రమయొక్క ధర అవసరమైన జీవనాధారాల ధరచేత నిర్ణయింపబడుతుంది.

కానీ, మరొక విషయం లెక్కలోకి వస్తుంది.

ఉత్పత్తిదారుడు తన ఉత్పత్తి ఖర్చునూ, దాన్నిబట్టి ఉత్పాదితాల ధరనూ లెక్కవేయడంలో శ్రమ పరికరాల అరుగుదలనూ, తరుగుదలనూ లెక్కలోకి తీసుకుంటాడు. ఉదాహరణకు, ఒక యంత్రానికి అతనికి 1000 మార్కులు ఖర్చయి, అది పదేండ్లలో అరిగిపోతే, పదేండ్ల అంతంలో పాత యంత్రం స్థానంలో కొత్తది తెచ్చిపెట్టుకో గలిగేటట్లుగా అతను సరుకుల ధరకు యేటా 100 మార్కులు కలుపుతాడు. అదే విధంగా, సరళమైన శ్రమ శక్తియొక్క ఉత్పత్తి ఖర్చును లెక్కవేయడంలో, కార్మికుల జాతి వృద్ధి కావడానికీ, అరిగిపోయిన కార్మికుల స్థానంలో కొత్తవాళ్లను తెచ్చిపెట్టడానికీ వీలుగా, పునరుత్పత్తి ఖర్చును కలుపుకోవాలి. యీవిధంగా, యంత్రం విలువ తరుగుదల లెక్కలోకి తీసుకోబడినట్లే, కార్మికుని విలువ తరుగుదల కూడా లెక్కలోకి తీసుకోబడుతుంది.

కనుక, సరళమైన శ్రమశక్తియొక్క ఉత్పత్తి ఖర్చు అనేది కార్మికుని మనుగడయొక్కా, పునరుత్పత్తియొక్కా ఖర్చు. మనుగడయొక్కా, పునరుత్పత్తియొక్కా యీ ఖర్చు వేతనం అవుతుంది. అలా నిర్ణయింపబడిన వేతనాన్ని కనీస వేతనం అంటారు. యీ కనీస వేతనం దరహంమీద ఉత్పత్తి ఖర్చుచేత సరుకుల ధర నిర్ణయం కావడం లాగే, ఒక వ్యక్తికి కాక, జాతికి వర్తిస్తుంది. విడి కార్మికులకు, లక్షలమందికి, మనడానికీ, పునరుత్పత్తి చేసుకోడానికీ తగినంత రాదు; కానీ, మొత్తం కార్మికవర్గంయొక్క వేతనాలు, వాటి యెగుడుదిగుడుల లోపల, యీ కనీస స్థాయికి సర్దుకుంటాయి.

ప్రతి యితర సరుకు ధరను నియంత్రితం చేసినట్టే వేతనాన్ని నియంత్రితం చేసే

అత్యంత సాధారణ నియమాలను గురించి ఒక అవగాహనకు వచ్చినాము గనుక, యిక మనం మరింత నిర్దిష్టంగా మన విషయంలోకి పోగలం.

పెట్టుబడి అంటే ముడి పదార్థాలూ, శ్రమ పరికరాలూ, రకరకాల జీవనాధారాలూ — యివి యెలాంటివంటే, కొత్త ముడి పదార్థాలనూ, కొత్త శ్రమ పరికరాలనూ, కొత్త జీవనాధారాలనూ ఉత్పత్తి చేయడానికి వినియోగించేవి. పెట్టుబడిలోని యీ భాగాలన్నీ శ్రమ సృష్టించినవి, శ్రమయొక్క ఉత్పాదితాలు, సంచిత శ్రమ (ప్రోగైన శ్రమ). కొత్త ఉత్పత్తికి సాధనంగా ఉపయోగపడే సంచిత శ్రమే పెట్టుబడి.

ఇదీ అర్థశాస్త్రజ్ఞులు చెప్పేది.

నీగ్రో బానిస అంటే యేమిటి? నల్ల జాతి మనిషి. యీ వివరణ యెంత సరైనదో పై వివరణా అంతే.

నీగ్రో అంటే నీగ్రో. నిర్దిష్ట సంబంధాలలో మాత్రమే అతను బానిస అవుతాడు. నూలు వడికే జెన్నీ అంటే నూలు వడికే యంత్రం. నిర్దిష్ట సంబంధాలలో మాత్రమే అది పెట్టుబడి అవుతుంది. యీ సంబంధాలనుండి విడదీసినప్పుడు అది పెట్టుబడి కాదు — బంగారు దానిపాటికది యెలా డబ్బు కాదో, చక్కెర యెలా చక్కెర ధర కాదో అలాగే.

ఉత్పత్తిలో మనుషులు ప్రకృతిమీదనే కాక, ఒకరిమీద ఒకరు కూడా పనిచేస్తారు. నిర్దిష్ట మార్గంలో సహకరించుకోవడంద్వారానూ, తమ కార్యకలాపాలను పరస్పరం సాటా చేసుకోవడంద్వారానూ మాత్రమే వాళ్లు ఉత్పత్తి చేస్తారు. ఉత్పత్తి చేసేటందుకు వాళ్లు ఒకరితో ఒకరు నిర్దిష్టమైన లంకెలూ, సంబంధాలూ పెట్టుకుంటారు; యీ సామాజిక సంధానాలలోనూ, సంబంధాలలోనూ మాత్రమే ప్రకృతిమీద వాళ్ల ఆచరణ, ఉత్పత్తి జరుగుతుంది.

ఉత్పత్తిదార్లు ఒకరితో ఒకరు చేసుకునే యీ సామాజిక సంబంధాలు — వాళ్లు యే పరిస్థితులలో తమ కార్యకలాపాలను సాటా చేసుకొని, మొత్తం ఉత్పత్తి చర్యలో పాల్గొంటారో ఆ పరిస్థితులు — సహజంగానే ఉత్పత్తి సాధనాల స్వభావాన్నిబట్టి మారుతాయి. తుపాకి అనే కొత్త యుద్ధ పరికరం సృజింపబడడంతో సైన్యంయొక్క మొత్తం ఆంతరంగిక వ్యవస్థీకరణ అవశ్యంగా మారింది. యే సంబంధాల లోపల వ్యక్తులు సైన్యంగా యేర్పడగలరో, సైన్యంగా ఆచరించగలరో ఆ సంబంధాలు రూపాంతరం చెందినాయి, భిన్న సైన్యాల పరస్పర సంబంధాలు కూడా మారినాయి.

యీవిధంగా, భౌతిక ఉత్పత్తి సాధనాలయొక్క, అనగా ఉత్పాదక శక్తులయొక్క, మార్పూ, అభివృద్ధీ జరగడంతో, యే సామాజిక సంబంధాల లోపల వ్యక్తులు ఉత్పత్తి చేస్తారో అవి, అనగా ఉత్పత్తియొక్క సామాజిక సంబంధాలు, రూపాంతరం చెందుతాయి. ఉత్పత్తి సంబంధాల సాకల్యమే సామాజిక సంబంధాలు అనబడేవి, అనగా సమాజం,

చారిత్రక అభివృద్ధియొక్క నిర్దిష్ట దశలోని సమాజం, విశిష్టమైన, విలక్షణమైన స్వభావం గల సమాజం. పురాతన సమాజం, ఫ్యూడల్ సమాజం, బూర్జువా సమాజం అనేవి అలాంటి ఉత్పత్తి సంబంధాల సాకల్యాలు; వాటిలో ప్రతిఒకటీ అదే సమయంలో మానవ చరిత్రలోని ఒక ప్రత్యేక అభివృద్ధి దశను తెలియజేస్తుంది.

పెట్టుబడి కూడా ఉత్పత్తియొక్క ఒక సామాజిక సంబంధం. అది బూర్జువా ఉత్పత్తి సంబంధం, బూర్జువా సమాజపు ఉత్పత్తి సంబంధం. పెట్టుబడిగా యేర్పడేటట్టి జీవనాధారాలూ, శ్రమ పరికరాలూ, ముడి పదార్థాలూ ఫలానా సామాజిక పరిస్థితులలో, నిర్దిష్ట సామాజిక సంబంధాలలో ఉత్పత్తి చేయబడి, ప్రోగు చేయబడడం లేదా? ఫలానా సామాజిక పరిస్థితులలో, నిర్దిష్ట సామాజిక సంబంధాలలో అవి కొత్త ఉత్పత్తి కొరకు వినియోగింపబడడం లేదా? కొత్త ఉత్పత్తికి ఉపయోగపడే ఉత్పాదితాలను పెట్టుబడిగా మార్చేది సరిగ్గా యీ నిర్దిష్ట సామాజిక స్వభావం కదా?

పెట్టుబడిలో వున్నది జీవనాధారాలూ, శ్రమ పరికరాలూ, ముడి పదార్థాలూ మాత్రమే కాదు, భౌతిక ఉత్పాదితాలు మాత్రమే కాదు; దానిలో వున్నది మారకం విలువలు కూడా. దానిలో వున్న ఉత్పాదితాలన్నీ సరుకులు. కనుక, పెట్టుబడి అంటే భౌతిక ఉత్పాదితాల మొత్తం మాత్రమే కాదు, అది సరుకుల మొత్తం, మారకం విలువల మొత్తం, సామాజిక పరిమాణాల మొత్తం.

వున్ని స్థానంలో దూది పెట్టినా, గోధుమల స్థానంలో బియ్యం పెట్టినా, రైల్వేల స్థానంలో ఆవిరి ఓడలు పెట్టినా పెట్టుబడి అలాగే వుంటుంది – దూదికీ, బియ్యానికీ, ఆవిరి ఓడలకూ, అనగా పెట్టుబడియొక్క శరీరానికి, అదే మారకం విలువ వుండే పక్షంలో, అది యింతకు మునుపు రూపు ధరించినట్టి వున్నికీ, గోధుమలకూ, రైల్వేలకూ వుండిన ధరే దానికి వుండే పక్షంలో. పెట్టుబడి అణుమాత్రపు మార్పుకు లోబడకుండా పెట్టుబడియొక్క శరీరం నిరంతరం మారుతూ వుండవచ్చు.

కానీ, సమస్త పెట్టుబడీ సరుకుల మొత్తం, అనగా మారకం విలువల మొత్తం, కాగా, ప్రతి సరుకుల మొత్తం, అనగా ప్రతి మారకం విలువల మొత్తం, పెట్టుబడి కాదు.

ప్రతి మారకం విలువల మొత్తమూ ఒక మారకం విలువ. ప్రతి విడి మారకం విలువా ఒక మారకం విలువల మొత్తం. ఉదాహరణకు, 1000 మార్కుల విలువ చేసే యిల్లు 1000 మార్కుల మారకం విలువ. ఒక ఫెన్నిగ్ విలువ చేసే కాగితం ఫెన్నిగ్‌లో శతాంశాల వందయొక్క మారకం విలువల మొత్తం. ఒకదాని కొకటి సాటా చేసుకోగల ఉత్పాదితాలు సరుకులు. అవి యే నిష్పత్తిలో సాటా చేసుకోవచ్చునో ఆ నిర్దిష్ట నిష్పత్తి వాటి మారకం విలువ, లేదా, డబ్బు రూపంలో వ్యక్తం చేస్తే, వాటి ధర, ఆ ఉత్పాదితాల పరిమాణం అవి సరుకులుగా వుండే గుణాన్ని, లేదా అవి మారకం విలువకు ప్రాతినిధ్యం

వహించే గుణాన్ని, లేదా అవి నిర్దిష్టమైన ధరను కలిగివుండే గుణాన్ని యే మాత్రమూ మార్చవు. ఒక చెట్టు పెద్దదైనా, చిన్నదైనా చెట్టే. యినుమును మనం యితర ఉత్పాదితాలకు ఔన్సులలో సాటా చేసుకున్నా, మణుములలో సాటా చేసుకున్నా, దాని సరుకు స్వభావంలో, దాని మారకం విలువ స్వభావంలో యేమైనా భేదం వుందా? అది పరిమాణాన్ని బట్టి యెక్కువో తక్కువో విలువ గల, యెక్కువో తక్కువో ధర గల, సరుకు.

అయితే మరి, సరుకులయొక్క, మారకం విలువయొక్క, యే మొత్తమైనా పెట్టుబడి యెలా అవుతుంది?

ప్రత్యక్ష, సజీవ శ్రమశక్తికి సాటా కావడంద్వారా ఒక స్వతంత్ర సామాజిక శక్తిగా, అనగా సమాజంలోని ఒక భాగంయొక్క శక్తిగా, తన్ను తాను నిలుపుకొని, వృద్ధి చేసుకోవడం మూలంగా అది పెట్టుబడి అవుతుంది. శ్రమ చేసే సామర్థ్యం తప్ప మరేమీ లేని ఒక వర్గం వుండడం పెట్టుబడికి వుండవలసిన పూర్వావసరం.

సంచిత శ్రమను పెట్టుబడిగా మార్చే దేమిటంటే, ప్రత్యక్ష, సజీవ శ్రమమీద గత కాలపుదీ, భౌతిక రూపం పొందినదీ అయిన సంచిత శ్రమయొక్క పెత్తనం మాత్రమే.

పెట్టుబడి అంటే కొత్త ఉత్పత్తి చేసేటందుకు సాధనంగా సంచిత శ్రమ సజీవ శ్రమకు ఉపకరించడం కాదు. అది సంచిత శ్రమయొక్క మారకం విలువను నిలిపివుంచేటందుకూ, వృద్ధిచేసేటందుకూ సాధనంగా ఆ శ్రమకు సజీవ శ్రమ ఉపకరించడం.

పెట్టుబడిదారునికీ, వేతన కార్మికునికీ మధ్య జరిగే సాటాలో జరిగేది యేమిటి?

కార్మికుడు తన శ్రమశక్తికి సాటాగా జీవనాధారాలు పొందుతాడు; కానీ పెట్టుబడిదారుడు తన జీవనాధారాలకు సాటాగా శ్రమను, కార్మికుని ఉత్పాదక ఆచరణను, సృజనాత్మక శక్తిని, పొందుతాడు — దేనిద్వారా కార్మికుడు తాను తిన్నదాన్ని భర్తీచేయడమే కాక, సంచిత శ్రమకు దానికి మునుపు వున్నంతకంటె యెక్కువ విలువను యిస్తాడో ఆ సృజనాత్మక శక్తిని. లభ్యమయ్యే జీవనాధారాలలో కొంత భాగాన్ని కార్మికుడు పెట్టుబడిదారునినుండి పొందుతాడు. జీవనాధారాలు అతనికి దేనికి పనికివస్తాయి? వెంటనే తినడానికి. కానీ, జీవనాధారాలను నేను తిన్న వెంటనే అవి తిరుగులేకుండా నాకు నష్టమైపోయినాయి — అవి నన్ను సజీవంగా వుంచే కాలాన్ని నేను కొత్త జీవనాధారాలు ఉత్పత్తి చేసేటందుకు ఉపయోగిస్తే తప్ప, తినబడడంలో నశించిపోయే విలువల స్థానంలో కొత్త విలువలను తినే కాలంలోనా శ్రమద్వారా సృష్టించేటందుకు ఉపయోగిస్తే తప్ప. కానీ, కార్మికుడు తాను పొందిన జీవనాధారాలకు సాటాగా పెట్టుబడిదారునికి అప్పగించేది సరిగ్గా యీ ఉదాత్తమైన పునరుత్పాదక శక్తినే. కనుక కార్మికునికి అది నష్టమైపోయింది.

ఒక ఉదాహరణ తీసుకుందాం: ఒక రైతు తన దిన శ్రామికునికి రోజుకు అయిదు వెండి గ్రోషన్లు యిస్తాడు. యీ అయిదు వెండి గ్రోషన్లకు గాను శ్రామికుడు దినమంతా

ఆ రైతు పొలంలో పనిచేసి, తద్వారా అతనికి పది వెండి గ్రోష్లు ప్రతిఫలాన్ని సంపాయించి పెడతాడు. రైతు తాను దిన శ్రామికుని కివ్వవలసిన విలువను భర్తీచేసుకోవడమే కాదు, అతను దానిని రెట్టింపు చేసుకుంటాడు. కనుక, అతను శ్రామికుని కిచ్చిన అయిదు వెండి గ్రోష్లను ఫలదాయకమైన, ఉత్పాదకమైన పద్ధతిలో వినియోగించినాడు, ఖర్చు చేసినాడు. అయిదు వెండి గ్రోష్లతో అతను యే శ్రమా, శ్రామికుని శక్తీ రెండంతలు విలువ గల వ్యవసాయ ఉత్పాదితాలను ఉత్పత్తి చేస్తాయో సరిగ్గా ఆ శ్రమనూ, ఆ శ్రామికుని శక్తినీ కొని, అయిదు వెండి గ్రోష్లతో పది వెండి గ్రోష్లు చేసుకుంటాడు. మరొక వైపున, శ్రామికుడు తన యే ఉత్పాదక శక్తియొక్క ఫలితాన్ని రైతుకు అమ్మివేసినాడో ఆ ఉత్పాదక శక్తికి బదులుగా అయిదు వెండి గ్రోష్లు పొందుతాడు; యీ డబ్బును అతను జీవనాధారాలకు సాటా చేసుకొని, వాటిని అంతో యింతో వేగంగా తింటాడు. కనుక, అయిదు వెండి గ్రోష్లు రెండు విధాలుగా ఖర్చు చేయబడినాయి: పెట్టుబడికి <u>పునరుత్పాదకంగానూ</u>, యెందుకంటే అవి పది వెండి గ్రోష్లను ఉత్పత్తి చేసిన శ్రమశక్తికి* సాటా చేసుకోబడినాయి; కార్మికునికి <u>అనుత్పాదకంగానూ</u>, యెందుకంటే అవి జీవనాధారాలకు సాటా చేసుకోబడినాయి, ఆ జీవనాధారాలు శాశ్వతంగా అదృశ్యమైనాయి, రైతుతో అదే సాటాను మళ్లీ చేసుకోవడంద్వారా మాత్రమే శ్రామికుడు వాటి విలువను భర్తీచేసుకోగలడు. <u>యీవిధంగా పెట్టుబడి వుండాలంటే వేతన శ్రమ వుండాలి; వేతన శ్రమ వుండాలంటే పెట్టుబడి వుండాలి. అవి ఒకదాని ఉనికికొకటి అవసరం; అవి ఒకదాని నొకటి ఉత్పన్నం చేస్తాయి.</u>

ఒక జవుళి ఫాక్టరీలోని కార్మికుడు కేవలం నూలు బట్టలే ఉత్పత్తి చేస్తాడా? లేదు, అతను పెట్టుబడిని ఉత్పత్తి చేస్తాడు. అతను విలువలను సృష్టిస్తాడు, మళ్లీ తన శ్రమను కొనడానికీ, దానిద్వారా కొత్త విలువలను సృష్టించడానికీ ఉపయోగపడే వాటిని.

పెట్టుబడి శ్రమశక్తికి తన్ను తాను సాటా చేసుకోవడంద్వారా మాత్రమే, వేతన శ్రమకు జీవం పోయడంద్వారా మాత్రమే పెరగగలదు. వేతన కార్మికుని శ్రమశక్తి పెట్టుబడిని పెంచడంద్వారా మాత్రమే, దేనికి తాను బానిసో ఆ శక్తిని బలీయం చేయడంద్వారా మాత్రమే పెట్టుబడికి సాటా కాగలదు. <u>కనుక, పెట్టుబడి పెరుగుదల అంటే శ్రామికుల పెరుగుదల, అనగా కార్మికవర్గపు పెరుగుదల.</u>

కనుక పెట్టుబడిదారుని ప్రయోజనాలూ, కార్మికుని ప్రయోజనాలూ <u>ఒకటే</u> అని బూర్జువాలూ, వాళ్ల అర్థశాస్త్రజ్ఞులూ ఉద్ఘాటిస్తారు. యెంత నిజమో! పెట్టుబడి కార్మికుని వినియోగించుకోకపోతే అతను నశిస్తాడు. శ్రమశక్తిని దోపిడీ చేయకపోతే పెట్టు

* "శ్రమశక్తి" అనే మాట యిక్కడ ఎంగెల్స్ చేర్చింది కాదు; యిది "Neue Rheinische Zeitung"లో మార్క్స్ ప్రచురించిన పాఠంలోనే వుండింది. — సం.

బడి నశిస్తుంది; శ్రమశక్తిని దోపిడీ చేసేటందుకు అది దానిని కొనితీరాలి. కనుక, ఉత్పత్తికి ఉద్దేశింపబడిన పెట్టుబడి, అనగా ఉత్పాదక పెట్టుబడి, యెంత వేగంగా పెరిగితే, కనుక పరిశ్రమలు యెంతగా వర్ధిల్లితే, బూర్జువావర్గం యెంతగా సంపన్నమైతే, వ్యాపారం యెంత బాగా వుంటే, అంత యెక్కువమంది కార్మికులు పెట్టుబడిదారునికి అవసరమౌతారు, అంత ప్రియంగా కార్మికుడు తన్ను తాను అమ్ముకుంటాడు.

కనుక, కార్మికుని స్థితి భరించదగినదిగా వుండడానికి తప్పనిసరి షరతు యేమిటంటే, ఉత్పాదక పెట్టుబడి సాధ్యమైనంత వేగంగా పెరగడం.

మరి, ఉత్పాదక పెట్టుబడి పెరగడం అంటే యేమిటి? సజీవ శ్రమమీద సంచిత శ్రమయొక్క శక్తి పెరగడం. కార్మికవర్గంమీద బూర్జువావర్గపు పెత్తనం పెరగడం. వేతన శ్రమ తనమీద యేది పెత్తనం చేస్తుందో ఆ యితరుల ఐశ్వర్యాన్ని, తనకు శత్రువైన శక్తిని, అనగా పెట్టుబడిని, ఉత్పత్తి చేస్తే, ఉద్యోగ సాధనాలు (Beschäftigungsmittel) అనగా జీవనాధారాలు, దానికి యీ శత్రు శక్తినుండి ఒక షరతుమీద వెనక్కి ప్రవహిస్తాయి — అది మళ్లీ తన్ను తాను పెట్టుబడిలో భాగంగా, పెట్టుబడిని మరింత వేగంగా పెరిగేటట్లు చేసే కీలుగా చేసుకునే షరతుమీద.

పెట్టుబడి ప్రయోజనాలూ, కార్మికుల ప్రయోజనాలూ ఒకటే ననడం పెట్టుబడీ, వేతన శ్రమా ఒకే సంబంధంయొక్క రెండు పార్శ్వాలు అనడమే. అవి ఒకదాని ఉనికి కొకటి అవసరం, వడ్డీజీవీ, దుర్వ్యయపరుడూ ఒకరి ఉనికి కొకరు అవసరమైనట్లే.

వేతన కార్మికుడు వేతన కార్మికుడుగా వున్నంతకాలం అతని గతి పెట్టుబడిమీద ఆధారపడుతుంది. కార్మికునికీ, పెట్టుబడిదారునికీ మధ్య గల అంతగా పొగడబడే ప్రయోజనాల యేకత్వం అదే.

పెట్టుబడి పెరిగితే, వేతన శ్రమ మొత్తం పెరుగుతుంది, వేతన కార్మికుల సంఖ్య పెరుగుతుంది. ఒక్క మాటలో చెప్పాలంటే, పెట్టుబడి పెత్తనం యెక్కువమంది కార్మికులకు విస్తరిస్తుంది. అత్యంత అనుకూలమైన సందర్భాన్ని ఊహించుకుందాం: ఉత్పాదక పెట్టుబడి పెరిగినప్పుడు, శ్రమకు డిమాండు పెరుగుతుంది; తత్ఫలితంగా, శ్రమయొక్క ధర, అనగా వేతనం, పెరుగుతుంది.

ఒక యిల్లు పెద్దది కావచ్చు, చిన్నది కావచ్చు; చుట్టుపక్కల యిండ్లన్నీ దానంత చిన్నవిగా వున్నంత కాలం, అది నివాస గృహానికి గల సామాజిక డిమాండ్లనన్నిటినీ తీరుస్తుంది. కానీ, ఆ చిన్న యింటి పక్కన ఒక రాజభవనం లేవనీ, అప్పుడా చిన్న యిల్లు గుడిసెగా కుదించుకుపోతుంది. దాని సొంతదారుని కోరికలు చాలా స్వల్పమని, లేదా బొత్తిగా లేవని ఆ చిన్న యిల్లు యిప్పుడు తెలియజేస్తుంది. నాగరికతా గతిలో ఆ చిన్న యిల్లు యెంత యెత్తుకు పెరిగినా, పొరుగు రాజభవనం అదే మేరకు, లేదా అంతకంటె

యెక్కువ మేరకు పెరిగితే, సాపేక్షంగా చిన్నదైన ఆ యింటి నివాసి అంతకంతకూ యెక్కువ అసుఖంగా, అసంతృప్తిగా, దాని నాలుగు గోడల మధ్య యిరుక్కుపోయినట్లుగా బాధపడతాడు.

వేతనంలో గమనార్హమైన పెరుగుదల వుండాలంటే, ఉత్పాదక పెట్టుబడి వేగంగా పెరగాలి. ఉత్పాదక పెట్టుబడి వేగంగా పెరిగితే, ఐశ్వర్యమూ, భోగాలూ, సామాజిక అవసరాలూ, సామాజిక సుఖాలూ అంతే వేగంగా పెరుగుతాయి. యీ విధంగా, కార్మికుని సుఖాలు పెరిగినప్పటికీ, పెట్టుబడిదారుని పెరిగిన సుఖాలతో, కార్మికునికి అందుబాటులో లేనట్టి వాటితో, పోలిస్తే, దరహంమీద సమాజంయొక్క అభివృద్ధి స్థితితో పోలిస్తే, అవి యిచ్చే సామాజిక సంతృప్తి పడిపోయింది. మన కోరికలూ, ఆనందాలూ సమాజంనుండి ఉద్భవిస్తాయి; కనుక, వాటిని మనం సమాజంతో కొలుస్తాం, వాటిని తీర్చే వస్తువులతో కాదు. అవి సామాజికమైనవి గనుక, సాపేక్షమైనవి.

దరహంమీద, వేతనాన్ని నిర్ణయించేది ఆ వేతనానికి నేను సాటా చేసుకోగల సరుకుల మొత్తం మాత్రమే కాదు. వేతనంలో వివిధ సంబంధాలు వున్నాయి.

కార్మికులు తమ శ్రమశక్తికి గాను పొందేది, ప్రథమంగా, నిర్ణీత మొత్తం డబ్బు. యీ డబ్బు రూపపు ధరచేత మాత్రమే వేతనం నిర్ణంపబడుతుందా?

అమెరికాలో మరింత సంపన్నమైన, మరింత సులభమైన గనులు ఆవిష్కరించిన ఫలితంగా, పదారవ శతాబ్దిలో, యూరప్‌లో చలామణి అయ్యే బంగారూ, వెండీ యెక్కువైనాయి. అందువలన, యితర సరుకుల దృష్ట్యా బంగారు, వెండి విలువ పడిపోయింది. కార్మికులు తమ శ్రమశక్తికి గాను గతంలో పొందినంత నాణాల వెండినే పొందినారు. వాళ్ల శ్రమయొక్క డబ్బు రూపపు విలువ అలాగే నిలిచివుంది, కానీ వాళ్ల వేతనాలు పడిపోయినాయి; యెందుకంటే, అదే మొత్తం వెండికి సాటాగా వాళ్లకు తక్కువ మొత్తం సరుకులు వచ్చినాయి. పదారవ శతాబ్దిలో పెట్టుబడి పెరగడానికీ, బూర్జువావర్గం ఉత్పన్నం కావడానికీ దోహదం చేసిన కారణాలలో యిది ఒకటి.

మరొక ఘటన తీసుకుందాం. 1847 చలి కాలంలో, పంటల వైఫల్యం ఫలితంగా, తప్పనిసరి జీవనాధారాలైన బ్రెడ్డూ, మాంసమూ, వెన్నా, జున్నూ మొదలైనవాటి ధర గణనీయంగా పెరిగింది. కార్మికులకు వాళ్ల శ్రమశక్తికి గాను అంతకు ముందు వచ్చినంత డబ్బే వచ్చిందనుకుందాం. వాళ్ల వేతనాలు పడిపోలేదా? నిస్సంశయంగా పడిపోయినాయి. అదే డబ్బుకు సాటాగా వాళ్లకు తక్కువ బ్రెడ్డూ, మాంసమూ మొదలైనవి వచ్చినాయి. వెండి విలువ తగ్గినందువల్ల కాక, జీవనాధారాల విలువ హెచ్చినందువల్ల వాళ్ల వేతనాలు పడిపోయినాయి.

చివరన, శ్రమయొక్క డబ్బు రూపపు ధర అలాగే వుండగా, కొత్త యంత్రాల

విනియోగమూ, అనుకూలమైన రుతువూ, వగైరాల మూలంగా వ్యవసాయ, పారిశ్రామిక వస్తువులన్నిటి ధరలూ పడిపోయినాయని అనుకుందాం. అదే డబ్బుకు యిప్పుడు కార్మికులు అన్ని రకాల సరుకులు మరిన్ని కొనగలరు. కనుక, వాళ్ల వేతనాల డబ్బు విలువ మారనందు వల్లనే, వాళ్ల వేతనాలు హెచ్చినాయి.

యీవిధంగా, శ్రమయొక్క డబ్బు రూపపు ధర, అనగా నామకపు వేతనం, నిజమైన వేతనంతో, అనగా వేతనానికి సాటాగా వాస్తవంగా వచ్చే సరుకుల మొత్తంతో, సమవసించదు. కనుక, వేతనం పెరుగుదల గురించి గానీ, తరుగుదల గురించి గానీ మనం మాట్లాడితే, మనం మనసులో వుంచుకోవలసింది శ్రమయొక్క డబ్బు రూపపు ధరను, నామకపు వేతనాన్ని, మాత్రమే కాదు.

కానీ, నామకపు వేతనంతో గానీ, అనగా కార్మికుడు యే మొత్తం డబ్బుకు తన్ను తాను పెట్టుబడిదారునికి అమ్ముకుంటాడో ఆ మొత్తం డబ్బుతో గానీ, లేదా నిజమైన వేతనంతో గానీ, అనగా యీ డబ్బుకు అతను కొనగలిగే సరుకుల మొత్తంతో గానీ, వేతనంలో వున్న సంబంధాలు ముగియవు.

వేతనం, అన్నిటినీ మించి, పెట్టుబడిదారుని లాభంతో దానికి గల సంబంధంచేత కూడా నిర్ణయింపబడుతుంది — యిది సాపేక్ష వేతనం.

నిజమైన వేతనం యితర సరుకుల ధర దృష్ట్యా శ్రమ ధరను వ్యక్తంచేస్తుంది; తద్భిన్నంగా, సాపేక్ష వేతనం అనేది ప్రత్యక్ష శ్రమ సృష్టించిన కొత్త విలువలో దానికి వచ్చే భాగాన్ని సంచిత శ్రమకు, అనగా పెట్టుబడికి, వచ్చే భాగం దృష్ట్యా వ్యక్తం చేస్తుంది.

పైన, 14వ పుటలో* మేము యిలా చెప్పినాం: "వేతనం అనేది కార్మికుడు ఉత్పత్తి చేసిన సరుకులో అతనికి గల భాగం కాదు. వేతనం అనేది అప్పటికే వున్న సరుకులలో కొంత భాగం, దేనితో నిర్ణీత పరిమాణం గల ఉత్పాదక శ్రమశక్తిని పెట్టుబడిదారుడు తన సొంతానికి కొంటాడో అది." కానీ, పెట్టుబడిదారుడు యీ వేతనాన్ని తాను కార్మికుడు ఉత్పత్తి చేసిన సరుకును యే ధరకు అమ్ముతాడో ఆ ధరనుండి భర్తీచేయాలి. సాధారణంగా, తాను ఖర్చుపెట్టిన ఉత్పత్తి ఖర్చుమీద కొంత హెచ్చు, అనగా లాభం, తనకు మిగిలేటట్లు అతను భర్తీచేయాలి. కార్మికుడు ఉత్పత్తి చేసిన సరుకులయొక్క అమ్మకం ధర పెట్టుబడిదారునికి మూడు భాగాలుగా విభజింపబడుతుంది: మొదటిది, అతను ముందుగా యిచ్చిన ముడి పదార్థాల ధరనూ, అలాగే అతను ముందుగా యిచ్చిన పరికరాల, యంత్రాల, తదితర శ్రమ సాధనాల విలువ తరుగుదలనూ భర్తీచేసేది; రెండవది, అతను ముందుగా యిచ్చిన వేతనాన్ని భర్తీచేసేది; మూడవది, మిగిలిన హెచ్చు, అనగా పెట్టుబడిదారుని లాభం. మొదటి

---

*యీ పుస్తకంలోని 95వ పేజి చూడండి. — సం.

భాగం మాత్రమే మునుపు వుండిన విలువలను భర్తీచేయగా, వేతనాన్ని భర్తీచేసేదీ, పెట్టుబడిదారుని అదనపు లాభమూ, మొత్తంమీద, కార్మికుని శ్రమ సృష్టించిన కొత్త విలువ నుండి గ్రహించబడి, ముడి పదార్థాలకు కలపబడినాయనేది స్పష్టం. యీ అర్థంలో, ఒకదానితో ఒకటి పోల్చేటందుకు గాను, మనం వేతనాన్నీ, లాభాన్నీ కార్మికుని ఉత్పాదితంలో భాగాలుగా పరిగణించగలం.

నిజమైన వేతనం అలాగే నిలిచివుండవచ్చు, పెరగనూ పెరగవచ్చు, అయినా సాపేక్ష వేతనం పడిపోవచ్చు. ఉదాహరణకు, సకల జీవనాధారాల ధరలూ మూడింట రెండు వంతులు తగ్గినాయనీ, దినసరి వేతనం మూడింట ఒక వంతు మాత్రమే, అనగా ఉదాహరణకు, మూడు మార్కులనుండి రెండు మార్కులకు, పడిపోయిందనీ అనుకుందాం. కార్మికుడు మునుపు మూడు మార్కులతో కొనగలిగిన సరుకుల మొత్తంకంటె యీ రెండు మార్కులతో యెక్కువ సరుకుల మొత్తాన్ని కొనగలిగినప్పటికీ, పెట్టుబడిదారుని లాభంతో పోలిస్తే అతని వేతనం తగ్గిపోయింది. పెట్టుబడిదారుని (ఉదాహరణకు కార్ఖానా సొంతదారుని) లాభంలో ఒక మార్కు పెరిగింది; అనగా అతను కార్మికునికి చెల్లించే తక్కువ మొత్తం మారకపు విలువలకు గాను, కార్మికుడు మునుపటికంటె యెక్కువ మొత్తం మారకపు విలువలను సృష్టించాలి. శ్రమకు వచ్చే భాగంతో పోలిస్తే, పెట్టుబడికి వచ్చే భాగం పెరిగింది. పెట్టుబడికీ, శ్రమకూ మధ్య సామాజిక ఐశ్వర్యపు పంపకం మరింత అసమానం అయింది. పెట్టుబడిదారుడు అదే పెట్టుబడితో యెక్కువ మొత్తం శ్రమను కొంటాడు. కార్మిక వర్గంమీద పెట్టుబడిదారీ వర్గపు ఆధిపత్యం పెరిగింది; కార్మికుని సామాజిక స్థానం తగ్గింది, పెట్టుబడిదారుని స్థానంకంటె మరొక మెట్టుకిందికి దిగిపోయింది.

అయితే మరి, వేతనమూ, లాభమూ ఒకదాని దృష్ట్యా ఒకటి పెరగడమూ, తరగడమూ యే సాధారణ నియమంచేత నిర్ణయింపబడతాయి?

అవి ఒకదాని కొకటి ప్రతిలోమ నిష్పత్తిలో వుంటాయి. శ్రమ భాగం, అనగా వేతనం, యే నిష్పత్తిలో పడిపోతే, అదే నిష్పత్తిలో పెట్టుబడి భాగం, అనగా లాభం, పెరుగుతుంది; అలాగే యిటునుండి అటు కూడా. వేతనం యే మేరకు పడిపోతే ఆ మేరకు లాభం పెరుగుతుంది; వేతనం యే మేరకు పెరిగితే ఆ మేరకు లాభం పడిపోతుంది.

బహుశా ఒక ఆక్షేపణ రావచ్చు. పెట్టుబడిదారుడు తన సరుకులను యితర పెట్టుబడిదారులతో చేసుకునే అనుకూలమైన సాటాద్వారానూ, కొత్త మార్కెట్లు ప్రారంభం కావడమూ, లేదా పాత మార్కెట్లలో డిమాండు పెరగడమూ, వగైరాల ఫలితంగా అతని సరుకులకు డిమాండు పెరగడంద్వారానూ, అతను లాభపడగల డనవచ్చు. కనుక, వేతనం పెరుగుదల, తరుగుదలలకు సంబంధం లేకుండా, శ్రమశక్తియొక్క మారకం విలువకు సంబంధం లేకుండా, పెట్టుబడిదారుడు యితర పెట్టుబడిదారులను పైకొనడంద్వారా లాభపడగలడన

వచ్చు. లేదా, శ్రమ పరికరాల మెరుగుదలా, ప్రకృతి శక్తుల కొత్త వినియోగమూ, వగైరాల మూలంగా కూడా. పెట్టుబడిదారుని లాభం పెరగవచ్చు గదా అనవచ్చు.

మొట్టమొదట, ఆవలినుండి జరిగినప్పటికీ ఫలితం ఒకటిగానే వుంటుందని ఒప్పుకోవలసివుంది. నిజమే, వేతనం పడిపోయినందువల్ల లాభం పెరగలేదు, లాభం పెరిగినందువల్ల వేతనం పడిపోయింది. పెట్టుబడిదారుడు అదే మొత్తం యితరుల శ్రమతో యెక్కువ మొత్తం మారకం విలువలు పొందినాడు, కానీ ఆ కారణంగా శ్రమకు యెక్కువ చెల్లించలేదు; కనుక, శ్రమద్వారా పెట్టుబడిదారునికి వచ్చే నికర లాభంతో పోలిస్తే, శ్రమకు తక్కువ చెల్లించబడిం దన్నమాట.

దీనికి తోడు, మరొకటి జ్ఞాపకం చేసుకుందాం: సరుకుల ధరలలో యెగుడుదిగుడులు వున్నప్పటికీ, ప్రతి సరుకుయొక్క సగటు ధర, అనగా అది యితర సరుకులకు సాటా చేసుకోబడే నిష్పత్తి, దాని ఉత్పత్తి ఖర్చుచేత నిర్ణయింపబడుతుంది. కనుక, పెట్టుబడిదారీ వర్గం లోపల ఒకరినొకరు పైకొనడాలు అవశ్యం ఒకదానినొకటి సర్దుబాటు చేసుకుంటాయి. యంత్రాల పెరుగుదల, ఉత్పత్తి కొరకు ప్రకృతి శక్తుల కొత్త వినియోగం, నిర్ణీత కాలంలో అదే మొత్తం శ్రమతో, అదే మొత్తం పెట్టుబడితో యెక్కువ మొత్తం ఉత్పాదితాలను సృష్టించడానికి వీలు కలిగిస్తుంది, కానీ యెక్కువ మొత్తం మారకం విలువలను సృష్టించడానికి కాదు. వడికే యంత్రం ఉపయోగించడంద్వారా నేను గంటలో అది సృష్టింపబడక ముందు చేసినంత రెండంతలు నూలు, ఉదాహరణకు యాభై పౌండ్లకు బదులు నూరు పౌండ్లు, తయారుచేస్తే, నిడివిమీద నాకు యీ నూరు పౌండ్లకు సాటాగా మునుపు యాభై పౌండ్లకు సాటాగా వచ్చినంతకంటె యెక్కువ సరుకులేమీ రావు. యెందుకంటే, ఉత్పత్తి ఖర్చు సగానికి పడిపోయింది గనుక, లేదా అదే ఖర్చుతో నేను రెండంతలు ఉత్పాదితాన్ని అందజేయగలను గనుక.

చివరన, పెట్టుబడిదారీ వర్గం, అనగా బూర్జువావర్గం, ఒక దేశానికి చెందినదైనా సరే, మొత్తం ప్రపంచ మార్కెట్‌కు చెందినదైనా సరే, ఉత్పత్తియొక్క నికర లాభాన్ని యే నిష్పత్తిలో పంచుకున్నా, మొత్తంమీద సంచిత శ్రమలో ప్రత్యక్ష శ్రమద్వారా యెంత పెరుగుదల జరుగుతుందో ఆ పెరుగుదల మొత్తం మాత్రమే యీ నికర లాభంయొక్క వెరసి మొత్తంగా యేర్పడుతుంది. కనుక, యే నిష్పత్తిలో శ్రమ పెట్టుబడిని పెంచుతుందో, అనగా వేతనంతో పోలిస్తే లాభం యే నిష్పత్తిలో పెరుగుతుందో, ఆ నిష్పత్తిలో యీ వెరసి మొత్తం పెరుగుతుంది.

కనుక, మనకు కనపడే దేమిటంటే: మనం పెట్టుబడి, వేతన శ్రమల సంబంధం లోపలనే వున్నా కూడా, పెట్టుబడి ప్రయోజనాలూ, వేతన శ్రమ ప్రయోజనాలూ ఒకదానికొకటి పూర్తిగా విరుద్ధమైనవి.

పెట్టుబడి వేగంగా పెరగడం లాభం వేగంగా పెరగడానికి సమానం. లాభం వేగంగా యెప్పుడు పెరగగలదంటే, శ్రమయొక్క ధర, అనగా సాపేక్ష వేతనం, అంతే వేగంగా తరిగినప్పుడు మాత్రమే. కానీ, నామకపు వేతనంతో పాటు, అనగా శ్రమయొక్క డబ్బు రూపపు విలువతో పాటు, నిజమైన వేతనం పెరిగినప్పటికీ, సాపేక్ష వేతనం పడిపోగలదు — లాభంయే నిష్పత్తిలో పెరుగుతుందో అదే నిష్పత్తిలో అది పెరగకపోతే. ఉదాహరణకు, వ్యాపారం బాగా వున్న కాలంలో వేతనం అయిదు శాతం పెరిగి, తద్భిన్నంగా లాభం ముప్పై శాతం పెరిగితే, అప్పుడు సాపేక్ష వేతనం పెరగదు సరిగదా తరుగుతుంది.

యీవిధంగా, పెట్టుబడి వేగంగా పెరగడంతోపాటు కార్మికుని ఆదాయం పెరిగితే, పెట్టుబడిదారునినుండి కార్మికుని వేరుచేసే సామాజిక అఖాతం అదే సమయంలో పెరుగుతుంది, శ్రమమీద పెట్టుబడియొక్క ఆధిపత్యం, అనగా పెట్టుబడిమీద శ్రమ ఆధారపడడం, అదే సమయంలో పెరుగుతుంది.

పెట్టుబడి వేగంగా పెరగడంలో కార్మికునికి ప్రయోజనం వుందనడమంటే, కార్మికుడు యెంత వేగంగా యితరుల ఐశ్వర్యాన్ని పెంచితే, అంత సంపన్నంగా వుంటాయి అతనికి పడే యెంగిలి మెతుకులు అనీ, అంత యెక్కువగా వుంటుంది వినియుక్తులు కాగలిగే, సృష్టింపబడగలిగే కార్మికుల సంఖ్య అనీ, అంతగా పెరగగలదు పెట్టుబడిమీద ఆధారపడే బానిస జనబాహుళ్యం అనీ అనడమే.

యీవిధంగా మనం గమనించింది యేమిటంటే:

కార్మికవర్గానికి అత్యంత అనుకూలమైన సన్నివేశం కూడా, అనగా సాధ్యమైనంత మహా వేగంగా పెట్టుబడి పెరగడం కూడా, అది కార్మికుని భౌతిక జీవనాన్ని యెంతగా మెరుగుపరచినప్పటికీ, అతని ప్రయోజనాలకూ, బూర్జువాల ప్రయోజనాలకూ, అనగా పెట్టుబడిదారుల ప్రయోజనాలకూ, మధ్య గల వైరుధ్యాన్ని తొలగించదు. మునుపటిలాగే లాభమూ, వేతనమూ ప్రతిలోమ నిష్పత్తిలో వుంటాయి.

పెట్టుబడి వేగంగా పెరుగుతూ వుంటే, వేతనం పెరగవచ్చు; పెట్టుబడియొక్క లాభం పోలికే లేనంత యెక్కువ వేగంగా పెరుగుతుంది. కార్మికుని భౌతిక స్థితి మెరుగైంది, కానీ అతని సామాజిక స్థితి తగ్గింది. అతన్ని పెట్టుబడిదారునినుండి వేరు చేసే సామాజిక అఖాతం విశాలం అయింది.

చివరన:

ఉత్పాదక పెట్టుబడి సాధ్యమైనంత మహా వేగంగా పెరగడం వేతన శ్రమకు అత్యంత అనుకూలమైన స్థితి అనడమంటే, కార్మికవర్గం తనకు వ్యతిరేకమైన శక్తిని, అనగా తనకు చెందకుండా, తనమీద పెత్తనం చేసే ఐశ్వర్యాన్ని, యెంత వేగంగా పెంచితే, అంత అనుకూలమైన పరిస్థితులలో అది మళ్లీ బూర్జువా ఐశ్వర్యాన్ని పెంచడానికి, పెట్టు

బడియొక్క ఆధిపత్యాన్ని విస్తృతపరచడానికి, అనుమతించబడుతుంది, బూర్జువావర్గం దాని వెంట యే బంగారు గొలుసులతో తనను లాక్కుపోతుందో ఆ బంగారు గొలుసులను తనకు గాను తయారుచేసుకోవడంతో తాను తృప్తిపడి, అని అనడమే.

కానీ, బూర్జువా అర్థశాస్త్రజ్ఞులు అంటున్నట్లు, ఉత్పాదక పెట్టుబడి పెరుగుదలా, వేతనాల పెరుగుదలా నిజంగా అంత విడదీయరాకుండా లంకించబడివున్నాయా? వాళ్ల మాటకు మనం విలువ యివ్వకూడదు. పెట్టుబడి బలిసేకొద్దీ దాని బానిసకు బాగా తిండి వుంటుందని వాళ్లు అన్నప్పుడు, వాళ్లను మనం నమ్మనైనా నమ్మకూడదు. బూర్జువా వర్గం యెంతగా విజ్ఞాన ప్రబుద్ధమైందంటే, అది యెంత బాగా లెక్కాచారం వేసుకుంటుందంటే, తన పరివారపు ధగధగలద్వారా ప్రదర్శన చేసుకొనే ఫ్యూడల్ ప్రభువుకుండే దురభిప్రాయాలు దానికుండజాలవు. బూర్జువావర్గపు మనుగడకు అవసరమైన పరిస్థితులు అది లెక్కాచారం వేసుకునేటట్లు నిర్బంధిస్తాయి.

కనుక మనం మరింత లోతుగా పరీక్షించాలి:

ఉత్పాదక పెట్టుబడి పెరుగుదల వేతనాన్ని యెలా ప్రభావితం చేస్తుంది?

బూర్జువా సమాజపు ఉత్పాదక పెట్టుబడి మొత్తంమీద పెరిగితే, యింకా బహుముఖంగా శ్రమ ప్రోగుపడడం జరుగుతుంది. పెట్టుబడులు సంఖ్యలోనూ, విస్తృతిలోనూ పెరుగుతాయి. పెట్టుబడుల సంఖ్య పెరగడం పెట్టుబడిదారుల మధ్య పోటీని పెంచుతుంది. పెట్టుబడుల విస్తృతి పెరగడం మరింత శక్తివంతమైన శ్రమ సైన్యాలను మరింత బ్రహ్మాండమైన యుద్ధ పరికరాలతో పారిశ్రామిక రంగంలోకి తీసుకవచ్చే అవకాశాలను సమకూరుస్తుంది.

మరింత చౌకగా అమ్మడంద్వారా మాత్రమే ఒక పెట్టుబడిదారుడు మరొక పెట్టుబడిదారుని రంగంనుండి తరిమివేసి అతని పెట్టుబడిని లోబరచుకోగలడు. తాను నాశనం కాకుండా చౌకగా అమ్మాలంటే అతను మరింత చౌకగా ఉత్పత్తి చేయాలి, అనగా శ్రమయొక్క ఉత్పాదక శక్తిని సాధ్యమైనంత పెంచాలి. మరి శ్రమయొక్క ఉత్పాదక శక్తి పెంచబడేది, అన్నిటినీ మించి, మరింత శ్రమ విభజనద్వారానూ, యంత్రాలను మరింత సార్వత్రికంగా ప్రవేశపెట్టడంద్వారానూ, నిరంతరం యెరుగుపరచడంద్వారానూ. యెంత యెక్కువ శ్రమ సైన్యంమధ్య శ్రమ విభజింపబడితే, యెంత బ్రహ్మాండమైన ప్రమాణంలో యంత్రాలు ప్రవేశపెట్టబడితే, అంతగా ఉత్పత్తి ఖర్చు ఆ నిష్పత్తిలో తగ్గుతుంది, అంత ఫలవంతంగా వుంటుంది శ్రమ. అందువలన, శ్రమ విభజననూ, యంత్రాల సంఖ్యనూ పెంచడానికీ, వాటిగుండా సాధ్యమైనంత గొప్ప ప్రమాణంలో లాభపడడానికీ పెట్టుబడిదార్లమధ్య సార్వత్రికమైన పోటీ ఉత్పన్నమౌతుంది.

యెక్కువ శ్రమ విభజనద్వారానూ, కొత్త యంత్రాలనూ, వాటి మెరుగుదలనూ వినియోగించుకోవడంద్వారానూ, ప్రకృతి శక్తులను మరింత లాభదాయకంగానూ, విస్తృతంగానూ

వాడుకోవడంద్వారానూ ఒక పెట్టుబడిదారుడు అదే మొత్తం శ్రమతో, లేదా సంచిత శ్రమతో తన పోటీదార్లకంటె పెద్ద మొత్తం ఉత్పాదితాలను, సరుకులను, ఉత్పత్తి చేసే మార్గం కనిపెట్టితే, ఉదాహరణకు అతను తన పోటీదారులు అర్ధ గజం బట్ట నేసే శ్రమ కాలంలోనే ఒక గజం బట్ట తయారుచేయగలిగితే, యీ పెట్టుబడిదారుడు యెలా పని చేస్తాడు?

అతను అర్ధ గజం బట్టను పాత మార్కెట్ ధరకు అమ్మడం కొనసాగించవచ్చు; కానీ, యిది తన పోటీదార్లను రంగంనుండి తరిమివేసి, తన సొంత అమ్మకాలను పెంచుకునే మార్గం కాదు. అయితే యే మేరకు అతని ఉత్పత్తి విస్తరించిందో, అదే మేరకు అతనికి అమ్ముకోవలసిన అవసరం కూడా విస్తరించింది. అతను జీవవంతం చేసిన మరింత శక్తివంతమైన, మరింత ఖరీదైన ఉత్పత్తి సాధనాలు, నిజంగానే, తన సరుకులను మరింత చౌకగా అమ్మడానికి అతనికి వీలు కలిగిస్తాయి, కానీ అదే సమయంలో, యెక్కువ సరుకులు అమ్మడానికీ, తన సరుకుల కొరకు యింకా చాలా విశాలమైన మార్కెట్‌ను జయించడానికీ అవి అతన్ని నిర్బంధిస్తాయి. తత్పర్యవసానంగా, మన పెట్టుబడిదారుడు తన అర్ధ గజం బట్టను తన పోటీదార్లకంటె చౌకగా అమ్ముతాడు.

కానీ, యితర్లకు అర్ధ గజం బట్టకు అయ్యే ఖర్చుకంటె తనకు గజం బట్ట ఉత్పత్తికి యెక్కువ ఖర్చు కానప్పటికీ, ఆ పెట్టుబడిదారుడు తన పోటీదారులు అర్ధ గజం బట్టను అమ్మేటంత చౌకగా గజం బట్టను అమ్మడు. అమ్మితే, అతనికి సాటాద్వారా ఉత్పత్తి ఖర్చు మాత్రమే వెనక్కి వస్తుంది, అదనంగా యేమీ రాదు. అతనికి యెక్కువ లాభం వస్తే, అది యెక్కువ పెట్టుబడి పెట్టినందువల్ల వస్తుంది గానీ, తన పెట్టుబడిద్వారా యితరులకంటె యెక్కువ సంపాయించినందువల్ల కాదు. అంతేకాక, అతను తన సరుకుల ధరను తన పోటీదార్ల ధరకంటె స్వల్ప శాతం మాత్రమే తక్కువగా పెట్టితే, అతను కోరే లక్ష్యం సాధిస్తాడు. వాళ్లకంటె తక్కువకు అమ్మడంద్వారా అతను పోటీదార్లను రంగంనుండి తరిమివేస్తాడు, వాళ్ల అమ్మకాలలో కనీసం కొంత భాగాన్ని వాళ్లనుండి లాక్కుంటాడు. చివరని, జ్ఞాపకం వుంచుకోండి, సరుకు అమ్మకం అనుకూల పారిశ్రామిక రుతువులో జరుగుతుందా, లేక ప్రతికూల పారిశ్రామిక రుతువులో జరుగుతుందా అనే దాన్నిబట్టి, అమలులో వున్న ధర యెప్పుడూ ఉత్పత్తి ఖర్చుకంటె యెక్కువగా గానీ, తక్కువగా గానీ వుంటుంది. కొత్తవీ, మరింత ఫలదాయకమైనవీ అయిన ఉత్పత్తి సాధనాలను వినియోగించిన పెట్టుబడిదారుడు తన నిజమైన ఉత్పత్తి ఖర్చుకు పైగా యే శాతంతో అమ్మేదీ గజం బట్టయొక్క మార్కెట్ ధర అంతకు ముందు మామూలుగా వుండిన దాని ఉత్పత్తి ఖర్చుకంటె తక్కువగా వుందా, యెక్కువగా వుందా అనేదాన్ని బట్టి మారుతుంది.

కానీ, మన పెట్టుబడిదారుని అధిక సౌకర్యయుత స్థానం చాలా కాలం వుండదు;

యితర పోటీ పెట్టుబడిదారులు అదే యంత్రాలనూ, అదే శ్రమ విభజననూ ప్రవేశపెడతారు, అదే ప్రమాణంలో గానీ, యింకా యెక్కువ ప్రమాణంలో గానీ ప్రవేశపెడతారు; యీ ప్రవేశపెట్టడం యెంత సార్వత్రికం అవుతుందంటే, బట్ట ధర దాని పాత ఉత్పత్తి ఖర్చుకంటె తక్కువకు మాత్రమే కాక, దాని కొత్త ఉత్పత్తి ఖర్చుకంటె తక్కువకు కూడా దిగిపోతుంది.

కనుక, పెట్టుబడిదారులు, ఒకరితో ఒకరిని పోలిస్తే, కొత్త ఉత్పత్తి సాధనాలను ప్రవేశపెట్టక ముందు వుండిన స్థితిలోనే వుంటారు; యీ ఉత్పత్తి సాధనాలద్వారా వాళ్లు అదే ధరకు రెండంతలు ఉత్పాదితాలను సరఫరా చేయగలిగితే, యీ రెండంతలు ఉత్పాదితాలను వాళ్లు యిప్పుడు పాత ధరకంటె తక్కువకు సరఫరా చేయక తప్పదు. యీ కొత్త ఉత్పత్తి ఖర్చు ప్రాతిపదికమీద అదే ఆట మళ్లీ ప్రారంభవౌతుంది. యింకా యెక్కువ శ్రమ విభజనా, యింకా యెక్కువ యంత్రాలూ, యెక్కువ ప్రమాణంలో యంత్రాలనూ, శ్రమ విభజననూ వినియోగించుకోవడమూ. పోటీ మళ్లీ యీ ఫలితంమీద అదే యెదురు చర్యను తెస్తుంది.

యీవిధంగా ఉత్పత్తి విధానమూ, ఉత్పత్తి సాధనాలూ యెలా నిరంతరం రూపాంతరం చెందేదీ, విప్లవీకరించబడేదీ, యెలా అవశ్యంగా శ్రమ విభజనవెంట మరింత శ్రమ విభజన వచ్చేదీ, యంత్రాల వినియోగంవెంట మరింత యంత్రాల వినియోగం వచ్చేదీ, భారీ ప్రమాణపు పనివెంట మరింత భారీ ప్రమాణపు పని వచ్చేదీ మనకు కనపడుతుంది.

బూర్జువా ఉత్పత్తిని మళ్లీ మళ్లీ దాని పాత గతిలోనుండి వెలికి తోసేదీ, శ్రమయొక్క ఉత్పాదక శక్తులను తీవ్రతరం చేసేటట్లు పెట్టుబడిని నిర్బంధించేదీ, పెట్టుబడి వాటిని తీవ్రతరం చేసింది గనుక దానికి విశ్రాంతి యివ్వకుండా నిరంతరం దాని చెవిలో "పద! పద!" అని గుసగుసలాడేదీ అయిన నియమం అదే.

యీ నియమం వర్తక దశల యెగుడుదిగుడుల లోపల ఒక సరుకు ధరను అవశ్యంగా దాని ఉత్పత్తి ఖర్చుకు సమంగా సర్దుబాటు చేసే నియమం తప్ప మరేదీ కాదు.

పెట్టుబడిదారుడు రంగంలోకి తెచ్చే ఉత్పత్తి సాధనాలు యెంత శక్తివంతంగా వున్నప్పటికీ, పోటీ అనేది యీ ఉత్పత్తి సాధనాలను సార్వత్రికం చేస్తాయి; అది వాటిని సార్వత్రికం చేసిన క్షణంనుండి అతని పెట్టుబడియొక్క అధిక సఫలత్వపు యేకైక ఫలితం యేమిటంటే, అత నిప్పుడు అదే ధరకు మునుపు చేసినంతకు పది, యిరవై, వంద రెట్లు సరఫరా చేయాలి. కానీ, యెక్కువ మొత్తం ఉత్పాదితాన్ని అమ్మడంద్వారా తక్కువ అమ్మకం ధరయొక్క ప్రభావాన్ని అధిగమించేటందుకు అతను బహుశా మునుపు అమ్మినంతకు వెయ్యి రెట్లు అమ్మాలి గనుకనూ, యెక్కువ లాభం సంపాయించుకొనేటందుకే కాక, ఉత్పత్తి ఖర్చును భర్తీచేసేటందుకు కూడా — మనం గమనించినట్లు, ఉత్పత్తి పరికరమే

అంతకంతకూ వ్యయభరిత మౌతుంది — యిప్పుడు మరింత విస్తారమైన అమ్మకం అవసరం గనుక నూ, యీ భారీ అమ్మకం అతనికే కాక అతని ప్రత్యర్థులకు కూడా జీవన్మరణ సమస్య అవుతుంది గనుకనూ, అప్పటికే ఆవిష్కరింపబడిన ఉత్పత్తి సాధనాలు యెంత ఫలవంతంగా వుంటే అంత భీషణంగా పాత పోరాటం మళ్లీ ప్రారంభమౌతుంది. అందువలన శ్రమ విభజనా, యంత్రాల వినియోగమూ పోలికే లేనంత అధిక ప్రమాణంలో మళ్లీ కొనసాగుతాయి.

వినియోగింపబడిన ఉత్పత్తి సాధనాల శక్తి యెంత వున్నప్పటికీ, పోటీ అనేది సరుకుల ధరను మళ్లీ ఉత్పత్తి ఖర్చువద్దకు తేవడంద్వారా, తత్ఫలితంగా, యే మేరకు ఉత్పత్తిని చౌక చేయవచ్చునో ఆ మేరకు, అనగా యే మేరకు అదే మొత్తం శ్రమతో యెక్కువ ఉత్పత్తి చేయవచ్చునో ఆ మేరకు, చౌక ఉత్పత్తిని — అనగా అదే మొత్తం ధరకు అంతకంతకూ యెక్కువ మొత్తం ఉత్పాదితాల సరఫరాను — విధాయక నియమం చేయడంద్వారా, యీ శక్తియొక్క సువర్ణ ఫలాలను పెట్టుబడికి దక్కకుండా చేయజూస్తుంది. యీవిధంగా, పెట్టుబడిదారుడు తన ప్రయాసలద్వారా యేమీ పొందడు — అదే శ్రమ కాలంలో యెక్కువ సరఫరా చేసే బాధ్యత తప్ప, ఒక్క మాటలో చెప్పాలంటే, తన పెట్టుబడి విలువను వృద్ధిచేసుకోడానికి మరింత కష్టమైన పరిస్థితులు తప్ప. కనుక, పోటీ అనేది తన ఉత్పత్తి ఖర్చు నియమంతో నిరంతరం పెట్టుబడిదారుని వెంటబడుతూ వుండగా, అతను తన ప్రత్యర్థులమీదికి తయారుచేసే ప్రతి ఆయుధమూ తనమీదికే యెదురుతిరుగుతూవుండగా, అతను నిత్యం పాతవాటి స్థానంలో కొత్త యంత్రాలనూ, మరింత వ్యయభరితమైనవనే మాట నిజమే, కానీ మరింత చౌకగా ఉత్పత్తి చేసేవాటినీ, పాత శ్రమవిభజన స్థానంలో కొత్తదానినీ ప్రవేశపెట్టడంద్వారానూ, పోటీ అనేది కొత్తవాటిని కాలం తీరినవాటినిగా చేసిందాకా ఆగకుండా వుండడంద్వారానూ, పోటీని అధిగమించడానికి ప్రయత్నిస్తాడు.

యిప్పుడు మనం యావత్తు ప్రపంచ మార్కెట్‌లో యేకకాలంలో జరిగే యీ విపరీత ఆందోళనను మనసులో చిత్రించుకుంటే, పెట్టుబడి పెరుగుదలా, ప్రోగుపడడమూ, సాంద్రీకరణా జరిగిన ఫలితంగా నిరంతరాయమైన శ్రమవిభజనా, తొందరపాటుగానూ, అంతకంతకూ మరింత బ్రహ్మాండమైన ప్రమాణంలోనూ కొత్త యంత్రాలను వినియోగించడమూ, పాతవాటిని ఉత్కృష్టపరచడమూ యెలా జరిగేదీ మనకు అర్థమౌతుంది.

కానీ, ఉత్పాదక పెట్టుబడి పెరుగుదలనుండి విడదీయరానట్టి యీ పరిస్థితులు వేతన నిర్ణయాన్ని యెలా ప్రభావితం చేస్తాయి?

అధిక శ్రమవిభజన మూలంగా ఒక కార్మికుడు అయిదుమంది, లేదా పదిమంది, లేదా యిరవైమంది చేసే పనిని చేయగలడు. కనుక అది కార్మికుల మధ్య పోటీని అయిదు రెట్లు, పది రెట్లు, యిరవై రెట్లు పెంచుతుంది. వాళ్లు ఒకరికంటె ఒకడు తన్ను తాను చౌకగా అమ్ముకోవడంద్వారా పోటీపడడమే కాక, అయిదుమంది, పదిమంది, యిరవైమంది చేసే

పనిని ఒకడు చేయడంద్వారా పోటీపడతారు; పెట్టుబడిచేత ప్రవేశపెట్టబడి, నిరంతరం పెంచబడే శ్రమవిభజన కార్మికులు యీవిధంగా తమలో తాము పోటీపడేటట్లు నిర్బంధిస్తుంది.

అంతేకాక, శ్రమవిభజన పెరిగే కొద్దీ, శ్రమ సరళీకరించబడుతుంది. కార్మికుని ప్రత్యేక నైపుణ్యం విలువలేనిదవుతుంది. తీవ్ర శారీరిక, బౌద్ధిక సామర్థ్యాలను ఉపయోగించ నక్కర లేని సరళమైన, రోకటిపాట లాంటి ఉత్పాదక శక్తిగా అతను రూపాంతరం చెందు తాడు. అతని శ్రమ యెవడైనా చేయగల శ్రమ అవుతుంది. అందువలన పోటీదార్లు అన్ని వైపులా అతనిమీద మూగుతారు; అంతేకాక మేము పాఠకునికి మరొకటి జ్ఞాపకం చేయాలి: శ్రమ యింకా సరళమూ, యింకా సులభంగా నేర్చుకోబడేదీ అయ్యేకొద్దీ, దానిలో ఆరితేర డానికి అవసరమైన ఉత్పత్తి ఖర్చు యింకా తక్కువగా వుంటుంది, వేతనం యింకా తక్కు వకు పడిపోతుంది; యెందుకంటే, ప్రతి యితర సరుకు ధర లాగే, అది ఉత్పత్తి ఖర్చు చేత నిర్ణయించబడుతుంది.

కనుక, శ్రమ మరింత అసంతృప్తికరమూ, మరింత వెగటూ అయ్యేకొద్దీ, పోటీ పెరుగుతుంది, వేతనం తరుగుతుంది. యెక్కువ గంటలు పనిచేయడంద్వారా గానీ, ఒక గంటలో యెక్కువ ఉత్పత్తి చేయడంద్వారా గానీ, కార్మికుడు యెక్కువ పనిచేసి తన వేతనం మొత్తాన్ని పడిపోకుండా వుంచడానికి ప్రయత్నిస్తాడు. కనుక, అతను దారిద్ర్యంచేత పీడితుడై, శ్రమవిభజనయొక్క దుష్ఫలితాలను మరింత పెంచుతాడు. ఫలితం యేమిటంటే, అతను యెక్కువ పనిచేసేకొద్దీ, తక్కువ వేతనం పొందుతాడు. దీనికి గల సరళమైన కారణం యిది: అతను యెక్కువ పనిచేసిన మేరకు తన సహకార్మికులతో పోటీపడి, తత్ఫలితంగా, వాళ్లను తనలాగే హీన షరతులమీద పనిచేయడానికి ముందుకు వచ్చే పోటీదార్లనుగా చేయ డమూ, అందువలన, చివరకు తాను తనతోనే, కార్మికవర్గంలో ఒక సభ్యుడుగా వుండే తనతోనే, పోటీపడడమూ.

నిపుణ కార్మికుల స్థానంలో అనిపుణులనూ, పురుషుల స్థానంలో స్త్రీలనూ, పెద్దవాళ్ల స్థానంలో పిల్లలనూ పెట్టడంద్వారా, యంత్రాలు అవే ఫలితాలను యింకా యెక్కువ ప్రమా ణంలో కలిగిస్తాయి. యంత్రాలు కొత్తగా ప్రవేశపెట్టబడిన చోట చేతికార్మికులను గుంపులు గుంపులుగా వీధుల్లోకి తోయడంద్వారానూ, అవి అభివృద్ధి చేయబడి మెరుగుపరచబడి, మరింత ఉత్పాదకమైన యంత్రాలచేత తొలగించబడిన చోట కార్మికులను చిన్న బృందాలుగా తొల గించడంద్వారానూ, అవి అవే ఫలితాలను కలిగిస్తాయి. పెట్టుబడిదార్లు తమలో తాము చేసుకునే పారిశ్రామిక యుద్ధాన్ని మేము పైన హడావిడిగా వేసిన రేఖాచిత్రం వలె వర్ణించి నాము. యీ యుద్ధానికి గల విశిష్ట లక్షణం యేమిటంటే, శ్రమ సైన్యాన్ని కూర్చు కోవడంద్వారా కంటె తగ్గించడంద్వారా దీని పోరాటాలలో గెలుపు కలుగుతుంది. యెవరు

యెక్కువమంది పారిశ్రామిక సైనికులను తొలగించగలమని సేనాధిపతులు, పెట్టుబడిదార్లు, ఒకరితో ఒకరు పోటీపడతారు.

నిజమే, యంత్రాలచేత అనవసరం చేయబడిన కార్మికులకు కొత్త పరిశ్రమ శాఖలలో ఉద్యోగం లభిస్తుందని అర్థశాస్త్రజ్ఞులు మనకు చెప్తారు.

తొలగించబడిన కార్మికులకే కొత్త శ్రమ శాఖలలో స్థానాలు లభిస్తాయని సూటిగా ఉద్ఘాటించే ధైర్యం లేదు వాళ్లకు. వాస్తవాలు యీ అసత్యాన్ని గొంతెత్తి ఖండిస్తాయి. కార్మిక వర్గంలోని యితర విభాగాలకు, ఉదాహరణకు, పతనమైన పరిశ్రమ శాఖలో ప్రవేశించడానికి సిద్ధంగా వుండిన యువతరం కార్మికుల విభాగానికి, కొత్త ఉద్యోగావకాశాలు యేర్పడతాయని మాత్రమే వాళ్లు నిజంగా ఉద్ఘాటించేది. నిరాస్తిపరులైన కార్మికులకు అది పెద్ద ఊరటే. పూజ్య పెట్టుబడిదార్లకు దోపిడీ చేయదగిన కొత్త రక్తమాంసాల కొరత లేదు, చచ్చినవాళ్లను చచ్చినట్లే వదలేస్తారు వాళ్లు. యిది బూర్జువాలు కార్మికులకు కలిగించే ఊరట కాదు, తమకే కలిగించుకొనేది. యంత్రాల మూలంగా మొత్తం వేతన కార్మికుల వర్గం రద్దయ్యేటట్లైతే, అది పెట్టుబడికి యెంత భయంకరంగా వుంటుందో! వేతన శ్రమ లేకుంటే పెట్టుబడి పెట్టుబడిగా వుండడం ఆగిపోతుంది!

కానీ, యంత్రాలచేత సూటిగా ఉద్యోగాలు కోల్పోయినవాళ్లకూ, యీ ఉద్యోగం కొరకు అప్పటికే కాచుకొనివుండిన మొత్తం కొత్త తరం విభాగానికీ కొత్త వృత్తి లభిస్తుందని అనుకుందాం. పోగొట్టుకున్న ఉద్యోగానికి వచ్చినంత వేతనం దీనికి వస్తుందని యెవరైనా ఊహిస్తారా? అది అర్థశాస్త్ర నియమా లన్నిటికీ వ్యతిరేకం. ఆధునిక పరిశ్రమ యెల్లప్పుడూ క్లిష్టమైన, ఉన్నతమైన వృత్తిని తొలగించి, దాని స్థానంలో అంతకంటె సరళమైన, చిన్న వృత్తిని పెట్టడం మనం చూసినాం.

కనుక, యంత్రాల మూలంగా ఒక పరిశ్రమ శాఖలోనుండి తోసివేయబడిన కార్మికుల సముదాయం మరొక శాఖలో, అది చిన్నదీ, తక్కువ వేతనం గలదీ అయితే తప్ప, యెలా ఆశ్రయం పొందగలదు?

యంత్రాలనే తయారుచేసే పరిశ్రమలో పనిచేసే కార్మికులు దీనికి మినహాయింపుగా ఉటంకించబడినారు. పరిశ్రమలలో యెక్కువ యంత్రాలు డిమాండు చేయబడి, ఉపయోగించబడిన వెంటనే అవశ్యంగా యంత్రాలలో పెరుగుదల వుండాలనీ, తత్ఫలితంగా యంత్రాల తయారీలోనూ, తత్ఫలితంగా యంత్రాల తయారీలో పనిచేసే కార్మికుల ఉద్యోగంలోనూ పెరుగుదల వుండాలనీ అన్నారు. యీ పరిశ్రమ శాఖలో పనిచేసే కార్మికులు నిపుణులనీ, విద్యావంతులు కూడా అనీ అన్నారు.

1840కి మునుపు కూడా అర్ధ సత్యంగా మాత్రమే వుండిన యీ ఉద్ఘాటనకు ఆనాటినుండి సత్యంతో యే పోలికా లేకుండా పోయింది; యెందుకంటే, సరిగ్గా నూలు

తయారీలో లాగే యంత్రాల తయారీలో కూడా] అంతకంతకూ యెక్కువ బహుముఖ సామర్థ్యం గల యంత్రాలు వినియోగింపబడినాయి, యంత్రాల ఫాక్టరీలలోని కార్మికులు మహా ప్రౌఢమైన యంత్రాలచేత యెదుర్కోబడి, మహా అప్రౌఢమైన యంత్రాల పాత్రను మాత్రమే నిర్వహించగలరు.

యంత్రం మూలంగా తొలగించబడిన పురుషుని స్థానంలో ఫాక్టరీ బహుశా ముగ్గురు పిల్లలనూ, ఒక స్త్రీనీ వినియోగిస్తుంది! పురుషుని వేతనం ముగ్గురు పిల్లలకూ, ఒక స్త్రీకీ చాలవలసి వుండలేదా? కనీస వేతనం జాతిని పోషించడానికీ, వృద్ధి చేయడానికీ చాలవలసి వుండలేదా? మరి యీ అభిమాన బూర్జువా నుడికారం రుజువుచేసే దేమిటి? ఒక కార్మికుని కుటుంబానికి జీవనోపాధి సంపాయించేటందుకు యిప్పుడు నాలుగు రెట్లు కార్మికుల జీవితాలు ఖర్చౌతున్నాయనడంకంటె యెక్కువేమీ రుజువుచేయడం లేదు.

క్రోడీకరిద్దాం: ఉత్పాదక పెట్టుబడి పెరిగేకొద్దీ, శ్రమ విభజనా, యంత్రాల వినియోగమూ విస్తరిస్తాయి. శ్రమవిభజనా, యంత్రాల వినియోగమూ విస్తరించేకొద్దీ, కార్మికుల మధ్య పోటీ విస్తరిస్తుంది, వాళ్ల వేతనాలు తగ్గుతాయి.

దీనికి తోడు, సమాజపు పైపొరలకు చెందినవాళ్ళు కూడా వచ్చి కార్మికవర్గంలో చేరుతారు. చిన్న పారిశ్రామికులూ, చిన్న వడ్డిజీవులూ బోలెడుమంది కార్మికవర్గ శ్రేణులలోకి దిగదోయబడతారు; కార్మికుల చేతుల పక్కన తొందరగా తమ చేతులు పైకి సాచడంకంటె వాళ్లకు చేయవలసిందేమీ లేదు. యీవిధంగా, పనిని డిమాండుచేస్తూ పైకెత్తబడిన చేతుల అరణ్యం అంతకంతకూ దట్టమౌతుంది, ఆ చేతులు మాత్రం అంతకంతకూ చిక్కిపోతాయి.

అంతకంతకూ పెద్ద ప్రమాణంలో ఉత్పత్తి చేయడం, అనగా, సరిగా, చిన్న పారిశ్రామికుడుగా కాక పెద్ద పారిశ్రామికుడుగా వుండడం, ఒక ప్రథమ షరతు అయినట్టి పోటీలో చిన్న పారిశ్రామికుడు బతికి బయటపడలేడనేది స్వయంవ్యక్తం.

పెట్టుబడుల పరిమాణమూ, సంఖ్యా హెచ్చేకొద్దీ, అనగా పెట్టుబడి పెరిగేకొద్దీ, పెట్టుబడిమీద వడ్డి తగ్గుతుందనేదీ, అందువలన చిన్న వడ్డిజీవి తన వడ్డిమీద యిక యెంత మాత్రమూ బతకలేక, పరిశ్రమలోకి దూకక తప్పదనేదీ, తత్ఫలితంగా అతను చిన్న పారిశ్రామికుల శ్రేణులూ, తద్వారా కార్మికవర్గంలో చేరే అభ్యర్థుల శ్రేణులూ పెరగడానికి తోడ్పడతాడనేదీ — యివన్నీ యింతకు మించిన వివరణను అపేక్షించవు.

చివరన, అప్పటికే వున్న బ్రహ్మాండమైన ఉత్పత్తి సాధనాలను యింకా పెద్ద ప్రమాణంలో వినియోగించుకోడానికీ, పరపతియొక్క ఆయువుపట్టులన్నిటినీ యీ ప్రయోజనానికి వాడుకోడానికీ పెట్టుబడిదారులు పైన వర్ణించబడిన ప్రక్రియచేత నిర్బంధింపబడగా, పారిశ్రామిక భూకంపాలలో తదనుగుణమైన పెరుగుదల వుంటుంది; ఆ భూకంపాలలో వర్తక ప్రపంచం ఐశ్వర్యంలోనూ, ఉత్పాదితాలలోనూ, ఉత్పాదక శక్తులలో కూడానూ కొంత

భాగాన్ని భూతాలకు బలి చేయడంద్వారా మాత్రమే తన్ను తాను నిలుపుకోగలదు — ఒక్క మాటలో చెప్పాలంటే, సంక్షోభాలు తీవ్రతరవౌతాయి. అవి మరింత తరుచౌతాయి, మరింత భీషణ మౌతాయి; యెందువల్లనంటే, ఉత్పత్తి పరిమాణమూ, తత్ఫలితంగా విస్తృతమైన మార్కెట్ల అవసరమూ పెరిగేకొద్దీ ప్రపంచ మార్కెట్ అంతకంతకూ కుదించుకపోతుంది, దోపిడీకి అంతకంతకూ తక్కువ కొత్త మార్కెట్లు మిగులుతాయి, యెందుకంటే ప్రతి గత సంక్షోభమూ అంతకుముందు జయించుకోబడని, లేదా పైపైన మాత్రమే దోపిడీ చేయబడిన మార్కెట్‌ను ప్రపంచ వర్తకానికి లోబరచింది. కానీ పెట్టుబడి శ్రమమీద బతకడం మాత్రమే కాదు. ఒకేసారి అగ్రవర్గానికీ, ఆటవిక జాతికీ చెందిన ఆ దేవత తనవెంట తన బానిసల శవాలను కూడా సమాధిలోకి లాక్కుపోతుంది, ఆ సంక్షోభాలకు ఆహుతి అయ్యే కార్మిక బలి పశువుల మందలను. యీవిధంగా మనకు కనపడేది యిది: పెట్టుబడి వేగంగా పెరిగితే, కార్మికులమధ్య పోటీ పోలికే లేనంత యెక్కువ వేగంగా పెరుగుతుంది, అనగా అంత యెక్కువగా కార్మికవర్గపు ఉద్యోగావకాశాలు, జీవనాధారాలు, ఆ నిష్పత్తిలో తగ్గుతాయి, అయినప్పటికీ పెట్టుబడి వేగంగా పెరగడం వేతన శ్రమకు అత్యంత అనుకూలమైన పరిస్థితి.

తను యిచ్చిన ఉపన్యాసాల
(డిసెంబర్ 14–30, 1847)
ఆధారంగా మార్క్స్‌చేత రచింపబడింది

1849 ఏప్రిల్ 5–8, 11 తేదీల
"Neue Rheinische Zeitung"
నం. 264–267, 269 సంచికలలో ప్రచురింపబడింది

1891లో బెర్లిన్‌లో, ఎంగెల్స్‌చేత ఎడిట్ చేయబడి,
ఎంగెల్స్ ప్రవేశికతో ప్రత్యేక పుస్తకంగా వెలువడింది

# కార్ల్ మార్క్స్

## లూయీ బోనపార్ట్ యొక్క బ్రూమేర్ పద్దెనిమిదవ తేదీ[45]

### మూడవ జర్మన్ ముద్రణకు ఎఫ్. ఎంగెల్స్ ముందుమాట

మొట్టమొదటి ముద్రణ వెలువడి ముప్ఫయ్ మూడేళ్ళు గడిచిన తర్వాత, "బ్రూమేర్ పద్దెనిమిదవ తేదీ"కి మరో ముద్రణ అవసరమైంది. ఈ నాటికీ యీ చిన్న పుస్తకం తన విలువను ఎంతమాత్రం కోల్పోలేదని రుజువుచెయ్యడానికి యీ విషయమే చాలు.

నిజానికి యిదొక ప్రతిభావంతమైన రచన. యావత్తు రాజకీయ ప్రపంచాన్నీ పిడుగుపాటు మాదిరిగా దిగ్భ్రాంతంచేసిన ఘటన తర్వాత వెన్వెంటనే, కొందరు దాన్ని నైతిక ఆగ్రహంతో బిగ్గరగా అరచి ఖండించారు, మరికొందరు దాన్ని విప్లవంనుండి విముక్తిగాను, దాని పొరపాట్లకు శిక్షగాను పరిగణించారు. అయితే అందరూ దాన్ని చూసి ఆశ్చర్యపడ్డారేగాని దాన్ని అర్థంచేసుకున్నవారెవరూ లేరు. అటువంటి యీ ఘటన జరిగిన వెంటనే మార్క్స్ దాన్ని సంగ్రహంగా, సునిశిత వ్యంగ్యవైభవంతో వివరించాడు. ఆ వివరణ ఫిబ్రవరి రోజుల దరిమిలా యావత్తు ఫ్రెంచి చరిత్రక్రమాన్నీ దాని అంతస్సంబంధాలతో బాటు తేటతెల్లం చేసి, డిసెంబరు 2వ తేదీ[46] నాటి అద్భుతాన్ని యీ అంతస్సంబంధంయొక్క సహజ, ఆవశ్యక పర్యవసానంగా తేల్చి చెప్పాడు. అలా చేసేటప్పుడు రాజకీయ కుట్ర హీరోను, అత్యంత సముచితమైన అసహ్యభావంతో తప్ప మరో విధంగా చూడాల్సిన అవసరం సైతం ఆయనకి లేకపోయింది. ఆయన చేసిన ఆ చిత్రణ ఎంత ప్రతిభావంతంగా ఉన్నదంటే, అటుదరిమిలా బయటపడిన ప్రతి ఒక కొత్త అంశమూ కూడా వాస్తవాన్ని మార్క్స్ ఎంత యథాతథంగా చిత్రించాడో అన్నదానికి ఒక కొత్తరుజువును సమకూర్చింది. సమకాలీన సజీవ చరిత్రను గురించిన శ్రేష్ఠమైన యీ అవగాహనా, తాజాగా జరుగుతున్న తరుణంలోనే ఘటనలను యింత స్పష్టంగా అంచనావెయ్యగలగడమన్నదీ నిజంగానే సాటిలేని విషయం.

కాని యిందుకు, ఫ్రెంచి చరిత్రకు సంబంధించిన మార్క్స్‌కుగల కూలంకష పరిజ్ఞానం అవసరమైంది. మరి ఏ యితర దేశంలోకన్న అధికంగా ఫ్రాన్సులోనే, ప్రతి ఒక సారీ

చరిత్రాత్మకమైన వర్గపోరాటాలు తుదకంటా సాగాయి, తత్పర్యవసానంగా, మారుతూ వుండే ఏ రాజకీయ రూపాల్లోనైతే అవి సాగుతాయో, వేటిలోనైతే వాటి ఫలితాలు క్రోడీకరింప బడుతాయో, అవి అక్కడే మిక్కిలి నిశితంగా ముద్రితమయ్యాయి. మధ్య యుగాల్లో ఫ్యూడ లిజానికి కేంద్రమూ, పునర్వికాస కాలం[47]నుండి, అంతరువులపై ఆధారపడే సమీకృత రాజరికానికి నమూనాదేశమూ అయిన ఫ్రాన్సు, మహా విప్లవంలో ఫ్యూడలిజాన్ని కూల్చివేసి, మరి ఏ యితర యూరపియన్ దేశమూ చెయ్యని ప్రామాణిక శుద్ధరీతిలో, కల్తీలేని బూర్జువా పాలనను నెలకొల్పింది. పాలక బూర్జువావర్గానికి వ్యతిరేకంగా, అధోగతినుండి అభ్యున్నతికై కృషిచేసే శ్రామికవర్గం జరిపే పోరాటం మరెక్కడా కానరానంత నిశిత రూపంలో యిక్కడ కానవచ్చింది. ఈ కారణంగానే మార్క్స్ ప్రత్యేకాభిమానంతో ఫ్రాన్సు గతచరిత్రను అధ్య యనంచెయ్యడమే కాకుండా, దాని సమకాలీన చరిత్రకు సంబంధించిన ప్రతి వివరాన్నీ తెలు సుకొని, ఆ సమాచారాన్ని భవిష్యదుపయోగార్థం పదిలపరుచుకున్నాడు. తత్పర్యవసానంగా ఘటనలెన్నడూ ఆయన్ని విభ్రాంతునిచెయ్యలేదు.

అయితే దీనికితోడు, మరో విషయం కూడా వుంది. చరిత్ర గమనానికి సంబంధించిన గొప్ప నియమాన్ని మొట్టమొదటిసారిగా కనిపెట్టినది మార్క్స్. ఈ నియమం మేరకు సకల చారిత్రక పోరాటాలూ, అవి రాజకీయ, మత, తాత్విక రంగాల్లో జరిగినా, లేక మరే యితర సైద్ధాంతిక రంగంలో జరిగినా కూడా, నిజానికి కొద్దోగొప్పో సామాజిక వర్గాలయొక్క పోరాటాల సుస్పష్ట వ్యక్తీకరణ మాత్రమే, ఈ వర్గాల అస్తిత్వమూ, కాగా, వాటి మధ్య ఘర్షణలూ కూడా తిరిగి వాటి ఆర్థిక పరిస్థితియొక్క అభివృద్ధి స్థాయిని బట్టీ, వాటి ఉత్పత్తి విధానాన్ని బట్టీ, దానిచేత నిర్ణయింపబడిన వాటి మారకాన్ని బట్టీ నిర్ధరింపబడు తాయి. శక్తి రూపాంతరీకరణ నియమం ప్రకృతి విజ్ఞానశాస్త్రానికి ఎంత ప్రాముఖ్యం కలి గినదో చరిత్రకు అంత ప్రాముఖ్యం కలిగిన యీ నియమం యిక్కడ, రెండవ ఫ్రెంచి రిపబ్లిక్[48] చరిత్రను అవగాహనచేసుకొనే యీ సందర్భంలో కూడా, ఆయనకు కీలకాన్ని సమకూర్చింది. ఆయన తన నియమాన్ని యీ చారిత్రక ఘటనల విషయంలో పరీక్షకు పెట్టాడు, ముప్ఫయ్ మూడేళ్ల తర్వాత సైతం, అది ఆ పరీక్షను అద్భుతంగా తట్టుకున్నదని మనం చెప్పాల్సివుంది.

ఫ్రెడరిక్ ఎంగెల్స్

1885లో రచింపబడింది

Karl Marx, *Der Achtzehnte Brumaire des Louis Bonaparte*, Hamburg, 1885
అన్న పుస్తకంలో ప్రచురింపబడింది

# లూయీ బోనపార్ట్ యొక్క
# బ్రూమేర్ పద్దెనిమిదవ తేదీ

## I

ప్రపంచ చరిత్రలో అధిక ప్రాముఖ్యం కలిగిన అన్ని ఘటనలూ పునస్సంభవిస్తూ వుంటాయనీ, వ్యక్తులు పునరావిర్భవిస్తూ వుంటారనిపిస్తుందనీ, హేగెల్ ఒకమారెక్కడో గాని అన్నాడు. మొదటిసారి విషాదాంతంగాను, రెండవసారి ప్రహసనంగాను అని చేర్చడం ఆయన మరచిపోయాడు. డాంటన్ స్థానంలో కాస్సిడ్యేర్, రోబెస్ప్యేర్ స్థానంలో లూయీ బ్లాంక్, 1793–1795 నాటి మహీధరం పార్టీ స్థానంలో 1848–1851 నాటి మహీధరం పార్టీ,[49] పెదతండ్రి స్థానంలో భ్రాతీయుడూ. "బ్రూమేర్ పద్దెనిమిదవ తేదీ" పునరావృత్తికి[50] సంబంధించిన పరిస్థితుల విషయంలో కూడా అదే మాదిరి వికృత నమూనా కనిపిస్తుంది!

మనుషులు తమ చరిత్రను తామే నిర్మించుకొంటూరు, కాని దాన్ని వారు తమ చిత్తం వచ్చినట్లు నిర్మించుకోరు; తాము కోరుకున్న పరిస్థితుల్లో కాక, తమకు తటస్థపడిన, గతంనుండి లభించిన, అందచెయ్యబడిన పరిస్థితుల్లో దాన్ని వారు నిర్మించుకుంటూరు. గతించిపోయిన తరాలన్నింటి సంప్రదాయమూ ప్రస్తుతం జీవించి యున్న తరం మస్తిష్కంపై భూతంలా సవారీచేస్తుంది. సరిగా మనుషులు ఎప్పుడైతే తమనూ, పరిస్థితులనూ విప్లవీకరించడంలోను, పూర్తిగా మార్చివెయ్యడంలోనూ, అంతవరకు ఎన్నడూ లేనిదాన్ని దేన్నో సృష్టించడంలోనూ నిమగ్నులైవున్నట్లు కనిపిస్తారో, సరిగా అటువంటి విప్లవాత్మక సంక్షోభదశల్లో గతానికి సంబంధించిన భూతాలను ఆతృతగా తమకు ఊడిగంచేసేందుకోసం ఆవాహనచేస్తారు. ప్రపంచ చరిత్రకు సంబంధించిన యీ నూతన రంగాన్ని చిరకాలంగా మన్నన పొందిన ఆ మారురూపంలో, అరువు తెచ్చుకున్న ఆ పరిభాషలో ప్రదర్శించేందుకుగాను వాటినుండి పేర్లనూ, యుద్ధ నినాదాలనూ, వేషాలనూ అరువుతెచ్చుకొంటూరు. లూథర్ ఆ విధంగానే

క్రీస్తు ప్రధాన శిష్యుల్లో ఒకడైన సెంట్ పాల్ వేషం ధరించాడు. 1789–1814 నాటి విప్లవం ఒకమారు రోమన్ రిపబ్లిక్‌గాను, మరోమారు రోమన్ సామ్రాజ్యంగాను వేషాలు ధరించింది. 1848 నాటి విప్లవానికి ఒకమారు 1789 నాటి విప్లవాన్నీ, మరోమారు 1793–1795 విప్లవ సంప్రదాయాన్నీ వికటంగా అనుకరించడం మినహా మరేమీ చేతకాలేదు. ఇది సరిగా ఎలాంటిదంటే, ఒక కొత్తభాషను నేర్చుకొంటున్నవాడు ఆరంభంలో దాన్నెప్పుడూ తన మాతృభాషలోకి అనువదించుకొంటూవుంటాడు. కాని మాతృభాషను జ్ఞాపకంచేసుకోకుండా ఆ కొత్త భాషలో భావవ్యక్తీకరణ చెయ్యగలిగినప్పుడూ, కొత్తభాషను వాడేటప్పుడు తన సొంత భాషను మరచిపోయినప్పుడే అతను కొత్త భాషా తత్వాన్ని జీర్ణించుకున్నట్లవుతుంది.

ప్రపంచ చరిత్రకు సంబంధించి గతించిపోయినవారిని ఆవాహనచెయ్యడాన్ని పరిశీలించినప్పుడు వెన్వెంటనే ముఖ్యమైన ఒక తేడా బయటపడుతుంది. కమీల్ డెములేన్, డాంటన్, రోబెస్‌ప్యేర్, సెంట్-జూస్ట్, నెపోలియన్, పాత ఫ్రెంచి విప్లవానికి సంబంధించిన వీరులూ, పార్టీలూ, జనసామాన్యాలూ కూడా, తమ కాలానికి సంబంధించిన కర్తవ్యాన్ని, ఆధునిక బూర్జువా సమాజాన్ని శృంఖలాలనుండి విముక్తం చెయ్యడం, నెలకొల్పడం అనే కర్తవ్యాన్ని రోమన్ వేషంలోనూ, రోమన్ పదబంధాలతోనూ నెరవేర్చారు. మొదటివాళ్లు ఫ్యూడల్ పునాదిని తుత్తునియలుచేశారు, దానిపై లేచిన ఫ్యూడల్ శిరస్సులను ఊచకోతకోశారు. ఫ్రాన్సులో ఏ పరిస్థితులక్రింద మాత్రమే స్వేచ్ఛాయుత పోటీని అభివృద్ధిచెయ్యడం, ఖండఖండాలుగా విభజితమైన భూసంపదను ఫలవంతంగా వినియోగించుకోవడం, దేశపు విముక్త పారిశ్రామిక ఉత్పాదక శక్తిని వినియోగించుకోవడం సాధ్యమో ఆ పరిస్థితులను మరొకడు సృష్టించాడు; ఫ్రాన్సులోని బూర్జువా సమాజానికి అవసరమైన మేరకు యూరప్ ఖండంలో అనువైన అధునాతన వాతావరణాన్ని కల్పించేందుకుగాను ఫ్రెంచి సరిహద్దుల వెలుపల ప్రతిచోటా, అతను ఫ్యూడల్ సంస్థలను తుడిచిపెట్టేశాడు. ఎప్పుడైతే కొత్త సామాజిక నిర్మాణరూపం నెలకొల్పబడిందో అప్పుడిక, పురాతన భీమబలురు, వాటితోబాటు పునరుద్ధరిత రోమన్ ఘనత— బ్రూటస్‌లు, గ్రాఖ్‌లు, పుబ్లికోలాలు, ట్రిబ్యూన్లు, సెనేటర్లు, చివరకు సీజరుతో సహా అదృశ్యమయ్యారు. గట్టి వాస్తవంగా మారిన బూర్జువా సమాజం సేయ్, కుజెన్, రువయే-కొలార్‌లు, బెంజమిన్ కాన్‌స్టంట్‌లు, గిజోలను తనకు అసలైన వ్యాఖ్యాతలుగాను, బాకాలుగాను తయారుచేసుకుంది; దాని అసలైన సేనానాయకులు ఆఫీసు బల్లవద్ద కూర్చోగా, మట్టిబుర్ర అయిన 18వ లూయీ రాజు దానికి రాజకీయాధినేత అయాడు. సంపద ఉత్పత్తిలోను, శాంతియుత పోటీపోరాటంలోను పూర్తిగా నిమగ్నమైన ఆ సమాజం రోమ్ నాటి భూతాలు తన ఊయలను పొంచిచూస్తున్నాయని యికనెంతమాత్రమూ తెలుసుకోలేదు. బూర్జువా సమాజం వీరోచితమైనది కాకపోయినా కూడా, దాని ఆవిర్భావానికి

వీరత్వం, త్యాగం, భయోత్పాతం, అంతర్యుద్ధం, జాతుల మధ్య యుద్ధాలూ కావాల్సివచ్చాయి. రోమన్ రిపబ్లిక్‌కి సంబంధించిన పరమ ఛాందస ప్రామాణిక సంప్రదాయాలకు అనుగుణంగా, బూర్జువా సమాజపు మల్లులు తమ పోరాటాల అంతస్సారపు బూర్జువా పరిమితులను తమనుండి మరుగుపరచేందుకూ, మహత్తర చారిత్రక విషాదాంతానికి తమ ఉత్సాహాన్ని ఉన్నతస్థాయిలో నిలుపుకొనేందుకూ అవసరమైన ఆదర్శాలను, కళా రూపాలను, ఆత్మవంచనలను కనుగొన్నారు. ఇలాగే ఒక శతాబ్దానికి ముందు, చారిత్రకాభివృద్ధికి సంబంధించిన మరో దశలో క్రామ్‌వెలూ, ఇంగ్లండు ప్రజలూ తమ బూర్జువా విప్లవానికి[51] అవసరమైన మాటలనూ, ఆవేశాలనూ, భ్రమలనూ బైబిలు పాత నిబంధన[52]నుండి అరువుతెచ్చుకున్నారు. నిజలక్ష్యం సాధింపబడగానే, ఆంగ్ల సమాజపు బూర్జువా పరివర్తన సాధింపబడగానే హబక్కుక్‌ని త్రోసిరాజని అతని స్థానాన్ని లాక్ ఆక్రమించాడు.

ఆవిధంగా, ఆ విప్లవాల్లో మృతాత్మల జాగృతి పాతవాటి వికటానుకరణకు గాక నూతన పోరాటాల ప్రస్తుతికోసం వినియోగింపబడింది; వాస్తవంలో దాని పరిష్కారంనుండి పలాయనానికై గాక ఊహలో ప్రస్తుత కర్తవ్యాన్ని ఘనతరం చెయ్యడానికి ఉపయోగింపబడింది; దాని భూతాన్ని తిరిగి నడయాడేలా చెయ్యడానికిగాక విప్లవతత్వాన్ని పునర్దర్శించడానికి తోడ్పడింది.

1848నుండి 1851వరకు పాత విప్లవభూతం మాత్రమే, తనను తాను పాత బెయ్యిగా మరుగుపరచుకున్న républicain en gants jaunes* అయిన మర్రాస్ట్ నుండి నెపోలియన్‌యొక్క ఉక్కు మృత్యు ఛద్మ వేషం క్రింద సర్వసామాన్యమైన తన అసహ్యకర ముఖకవళికలను కప్పిపెట్టే సాహసికుని దాకా సాగింది. విప్లవంద్వారా తన గమనం త్వరపడుతుందని భావిస్తున్న ఒక జాతి యావత్తూ, ఆకస్మికంగా కాలంచెల్లిపోయిన ఒక యుగంలోకి నెట్టబడింది. ఆ తిరోగమనానికి సంబంధించి సందేహావకాశం లేకుండా వుండేందుకుగాను, చాలకాలంగా పురాచరిత్రకు సంబంధించిన పాండిత్య విషయాంశంగా ఉంటూవచ్చిన పాత ఘటనాకాలక్రమం, పాత పేర్లు, పాత శాసనాలు తిరిగి తలెత్తాయి; ఎన్నడో నశించిపోయినట్లు కనిపించిన పాత శాసన భజనపరులు తిరిగి తలెత్తారు. బెడ్‌లామ్[53] లోని పిచ్చి ఇంగ్లీషు వ్యక్తి మానసికస్థితిలా వుంది ఫ్రెంచి జాతి మనోస్థితి కూడా. ఆ ఇంగ్లీషువాడు, తను పురాతన ఫారోవాల కాలంలో జీవిస్తున్నానని ఊహించుకొని, ఇథియోపియన్ బంగారుగనుల్లో, భూగర్భస్థ బందిఖానాలో, మసకమసకగా వెలిగే దీపాన్ని తలకు కట్టుకొని, బానిసలపై అజమాయిషీ చేసే మేస్త్రీ పొడవాటి కొరడాను చేత ధరించి తన వెనకాల రాగా, తమ మధ్య ఉమ్మడి భాష అంటూ ఏదీ లేని కారణంగా గనుల్లోని నిర్బంధ

---

* పసుపు పచ్చని చేతి తొడుగులు ధరించిన రిపబ్లికన్. — సం.

కూలీలను గాని, తమలో ఒకరిని మరొకరు గాని అర్థంచేసుకోని ఆటవిక కిరాయిమూక ద్వారాలవద్ద గందరగోళంగా గలభాచేస్తూండగా, బంగారం తవ్వే కూలీగా తను చెయ్యాల్సి వచ్చిన విపరీతమైన శ్రమను గురించి రోజా శోకన్నాలు పెడుతూవుంటాడు. "పాత ఫారో వాలకు బంగారాన్ని సమకూర్చిపెట్టేందుకుగాను నేను, స్వేచ్ఛాజీవిగా పుట్టిన బ్రిటిష్ వాడిని, యిదంతా చెయ్యాల్సివస్తోంది" అంటూ నిట్టూరుస్తాడు ఉన్మాది అయిన ఆ ఇంగ్లీషు వాడు. "బోనపార్ట్ కుటుంబపు రుణాలు తీర్చడానికి" అని నిట్టూరుస్తుంది ఫ్రెంచి జాతి. అతని మతి సరిగా ఉన్నంతకాలం ఆ ఇంగ్లీషువాడు, బంగారాన్ని సంపాదించాలన్న ఏకాగ్రమైన ఆలోచనను వదిలించుకోలేడు. తాము విప్లవంలో నిమగ్నులైనంత కాలమూ ఫ్రెంచివారు, డిసెంబరు 10వ తేదీ[54] ఎన్నికలు రుజువు చేసినట్లుగా, నెపోలియన్ స్మృతిని వదిలించుకోలేకపోయారు. విప్లవ గండాలనుండి వారు "ఈజిప్టు మాంసపు దాకల కోసం మరల అంగలార్చారు,"[55] 1851, డిసెంబరు 2వ తేదీయే దీనికి జవాబైంది. వారికి పాత నెపోలియన్‌యొక్క వ్యంగ్యావతారమే కాక, 19వ శతాబ్ది మధ్యంలో అతనేవిధంగా కనిపించాలో ఆ విధమైన వ్యంగ్యావతారంలో సాక్షాత్తూ పాత నెపోలియనే వారికి దఖలుపడ్డాడు.

19వ శతాబ్దపు సామాజిక విప్లవం తన ఉత్తేజాన్ని భవిష్యత్తునుండే గాని, గతంనుంచి పొందజాలదు. గతానికి సంబంధించిన మూఢవిశ్వాసమంతటినీ వదిలించుకొంటే గాని అది ఆరంభం కాజాలదు. అంతకు పూర్వపు విప్లవాలు తమ సామర్థ్యానికి సంబంధించిన కాయ కల్పంకోసం గతించిపోయిన ప్రపంచ చరిత్రను తవ్వి తలకెత్తుకోవలసివచ్చేది. అందుకు భిన్నంగా తన స్వీయసామర్థ్యాన్ని సాధించేందుకుగాను, 19వ శతాబ్దపు విప్లవం గతాన్ని శాశ్వతంగా సమాధి కానివ్వవలసివుంది. అక్కడ మాటలు సారాంశాన్ని దాటివెళ్లగా, యిక్కడ సారాంశం మాటలను దాటివెళ్లింది.

ఫిబ్రవరి విప్లవం ఒక ఆకస్మిక దాడి, పాత సమాజాన్ని విభ్రాంతపరచింది, అనుకోని యీ మెరుపు దెబ్బను ఒక నూతన యుగాన్ని ఆవిష్కరించే ప్రపంచ ప్రాముఖ్యం కలిగిన చర్యగా జనం చాటిచెప్పారు. డిసెంబరు 2న ఫిబ్రవరి విప్లవం ఒక ఇంద్రజాలికుని హస్తలా ఘవంద్వారా మాయంచెయ్యబడింది, తత్పర్యవసానంగా అప్పుడిక కూల్చివెయ్యబడినది రాజరికం కాదనీ, రాజరికంనుండి శతాబ్దాల క్రమంలో గుంజుకోబడిన ఉదారమైన రాయితీలే నష్ట మయ్యాయనీ తేలింది. సమాజం తనకు తానొక కొత్త సామర్థ్యాన్ని సమకూర్చుకోవడానికి బదులు, రాజ్యం మాత్రమే తన అతి పురాతన రూపానికి, అధికార ఖడ్గపు, మతాధిపతి శిరోవేష్టపు సిగ్గుమాలిన సరళమైన పెత్తనమనే రూపానికి తిరిగివెళ్లినట్లు కనిపిస్తుంది. 1848 ఫిబ్రవరి coup de main*కి 1851 డిసెంబరు coup de tête** యిచ్చిన

---

* ఆకస్మిక దాడి. — సం.

** దుందుడుకు చర్య. — సం.

సమాధానం యిదే. తేలికగా చేజిక్కినది తేలికగానే పోతుంది. ఈలోగా కాలవిరామం వృధాగా గడచిపోలేదు. 1848–1851 మధ్య కాలంలో ఫ్రెంచి సమాజం సంక్షిప్తమైన కొన్ని అధ్యయనాలకు, అనుభవాలకు సన్నాహమైంది. అది విప్లవపద్ధతి అవడమే ఆ సంక్షిప్తతకు కారణం. అదేకనుక మామూలు క్రమంలోనైతే, అంటే, పాఠ్యపుస్తకాల్లో వర్ణింపబడే అభివృద్ధి క్రమంలో, ఆషామాషీగా కాక గట్టిగా అయితే, ఫిబ్రవరి విప్లవానికి ముందు సంభవించి ఉండి ఉండాల్సింది. సమాజం యిప్పుడు తన ప్రస్థాన బిందువునుండి కూడా వెనక్కి వెళ్లినట్లు కనిపిస్తోంది; నిజానికి అది మొట్టమొదట తనకు తాను విప్లవాత్మక ప్రస్థాన బిందువును, సన్నివేశాన్ని, సంబంధాలను, ఏ పరిస్థితుల్లోనైతే మాత్రమే ఆధునిక విప్లవం గంభీరమైనదవుతుందో ఆ పరిస్థితులను సృష్టించుకోవలసివుంటుంది.

18వ శతాబ్దానికి చెందిన విప్లవాల వంటి బూర్జువా విప్లవాలు, విజయంనుండి విజయానికి చకచకా ముందుకు సాగుతాయి; వాటి నాటకీయ పరిణామాలు ఒక దానిని మరొకటి అధిగమిస్తాయి; మనుష్యులూ, ఘటనలూ కూడా కళ్లు మిరుమిట్లుగొలిపేలా కానవస్తాయి. ఆనందాతిరేకం అనుదినాంశమవుతుంది; కాని అవన్నీ కూడా క్షణభంగురాలు మాత్రమే అవుతాయి; త్వరలోనే అవి శిఖరస్థాయిని చేరుకుంటాయి, తన సంక్షుభిత దశకు చెందిన ఫలితాలను వివేకంగా జీర్ణించుకోవడం నేర్చుకొనేలోగా సమాజాన్ని మైకం అనంతరమొచ్చే సుదీర్ఘమైన నిస్త్రాణ ఆవహిస్తుంది. తద్భిన్నంగా, 19వ శతాబ్దానికి చెందిన విప్లవాలవంటి శ్రామికవర్గ విప్లవాలు, నిరంతరం ఆత్మవిమర్శ చేసుకొంటాయి, తమ సొంత క్రమంలో తమను తాము అవిరామంగా అడ్డుకుంటూ వుంటాయి, సాధింపబడినట్లు కనిపించే దాన్ని సరికొత్తగా పునఃప్రారంభించేందుకుగాను వెనక్కి తిరిగివస్తూంటాయి, తమ తొలి ప్రయత్నాలకు సంబంధించిన లోట్లూ లొసుగులనూ, బలహీనతలనూ, తుచ్ఛత్వాలనూ నిర్దాక్షిణ్యంగా ఆమూలంగా అపహాస్యంచేస్తాయి, తమ ప్రతిద్వందిని నేలనుండి కొత్త బలాన్ని పుంజుకొని, మరల మరింత బృహత్ స్వరూపంలో తమ ముందు లేచేందుకే అన్నట్లు నేలమీద పడద్రోసి, తమ సొంతలక్ష్యాల అనిర్దిష్ట విరాట్ ప్రమాణంపట్ల మధ్యమధ్య జంకి వెనక్కితగ్గుతూ, యిక వెనక్కి మళ్లడం అసంభవమయ్యే పరిస్థితి తయారుచెయ్యబడుతుంది, చివరకు పరిస్థితులే

Hic Rhodus, hic salta!
రోజా యిక్కడే వుంది, యిక్కడే చిందులెయ్యి![56]

అని డిమాండు చేస్తాయి.

పైన పేర్కొనబడిన విషయాలు గాక, తగు మాత్రపు సామర్థ్యం కలిగిన ప్రతి ప్రేక్షకునికీ, ఫ్రెంచి పరిణామాల అంచెలవారీ క్రమాన్ని గమనించక పోయినా కూడా,

విప్లవానికి కనివిని యెరుగని ఘోర వైఫల్యం ఎదురుకానున్నదన్న శంక తప్పక కలిగేవుండాలి. అందుకు 1852 మే మాసపు రెండవ ఆదివారపు[57] ప్రత్యాశిత శుభ పర్యవసానాలపట్ల ఏ ఆత్మసంతృప్తి జయధ్వానంతోనైతే ప్రజాస్వామ్యవాద మహాశయులు ఒకరినొకరు అభినందించుకున్నారో దాన్ని వింటే చాలు. హిలియస్ట్‌ల[58] మనస్సులో క్రీస్తుపునరుత్థానం జరిగి, స్వర్ణయుగా రంభమయ్యే రోజుకి ప్రాముఖ్యమున్నట్లే, 1852 మే రెండవ ఆదివారం వీళ్ళ మనసుల్లో ఒక సుస్థిర భావమూ, ఒక పిడివాద సిద్ధాంతమూ అయింది. ఎప్పటి మాదిరిగానే, బలహీనత అద్భుతాలపట్ల విశ్వాసాన్ని ఆశ్రయం చేసుకుంది, శత్రువు కేవలం ఊహలో మంత్రాలద్వారా మాత్రమే తరిమివెయ్యబడగా అతను నిజంగానే ఓడింపబడినట్లు భ్రమించింది, చేతులు ముడుచుకొని, తనకు ఎదుట వున్న భవిష్యత్తును గురించి, తానింకా అమలు జరపాలనైనా అనుకోకుండా అంతరంగంలోనే సంకల్పించుకొన్న చర్యలను గురించి ఉజ్వలంగా ఊహించుకుంది. ఏ వీరులైతే, పరస్పరం ఒకరిపట్ల ఒకరు సానుభూతిని ప్రకటించుకోవడం ద్వారా, ఒకటిగా గుమికూడటం ద్వారా, స్పష్టంగా కనబడే తమ అసమర్థతను నిజం కాదని నిరూపించాలనుకున్నారో, ఆ వీరులు, తమ మూటాముల్లె సర్దుకున్నారు, ముందుగానే తమ జయమాలికలను ప్రోగుచేసుకున్నారు. ఏ in partibus[59] రిపబ్లిక్కులకైతే వాళ్లు తమ నమ్ర ధోరణినంతనూ కూడదీసుకొని సాధ్యమైనంత ప్రశాంతంగా మంత్రుల నియామకం కూడ చేసేశారో, ఆ రిపబ్లిక్కులనిప్పుడు స్టాక్ ఎక్స్‌చేంజి మార్కెట్లో అయిన కాడికి అమ్మి సొమ్ము చేసుకునే ప్రయత్నంలో వున్నారు. డిసెంబరు 2 మేఘ రహితమైన ఆకాశంనుంచి ఊడిపడ్డ పిడుగుపాటులా వాళ్లని తాకింది. ఏ జనాలైతే, భీరుత్వ నిరుత్సాహ సమయాల్లో, తమ గుండెదడను అందరికన్న గట్టిగా అరిచేవారి అరుపుల్లో కప్పిపుచ్చుకొనేందుకు ప్రయత్నిస్తారో, బహుశా వారికి బాతుల అరుపులు కాపిటోల్‌ను కాపాడగల రోజులు[60] శాశ్వతంగా గతించిపోయాయన్న నమ్మకం కలిగివుంటుంది.

రాజ్యాంగచట్టం, జాతీయ సభ, రాజవంశ పార్టీలు, నీలం, ఎరుపు రిపబ్లికన్లు, ఆఫ్రికా వీరులు,[61] వేదికపైనుంచి గర్జనలు, దినపత్రికల మెరుపువార్తలు, యావత్తు సాహిత్యం, రాజకీయ నామధేయాలు, మేధోపరమైన కీర్తి, పౌరచట్టం, శిక్షాస్మృతి, liberté, égalité, fraternité* 1852 మే నెలలో రెండవ ఆదివారం — ఇవన్నీ కూడా, ఎవరినైతే అతని శత్రువులు సైతం ఇంద్రజాలికుడని అనుకోరో అటువంటి ఒక వ్యక్తియొక్క కనికట్టు ముందు హుష్ మహంకాళీ అన్నట్టు అదృశ్యమైపోయాయి. సార్వజనిక ఓటింగుహక్కు క్షణకాలం మాత్రమే అస్తిత్వంలో ఉన్నట్లు కనిపించింది, అది తన చేతితోనే తన తుది అభీష్టాన్నీ, వీలునామానూ ప్రపంచమంతటి కళ్లముందూ తయారు

* స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం. — సం.

చేసేందుకూ, "ఉనికిలో వున్నదంతా నాశనయోగ్యమైనదే"* అని జనానికి చాటిచెప్పేందుకు మాత్రమే ఆ కాసేపైనా ఉనికిలో ఉన్నట్లుంది.

తమ జాతి విభ్రాంతమొనర్చబడిందని ఫ్రెంచివారు చెప్పినట్లు చెప్తే సరిపోదు. తమకు తటస్థపడే తొలి దుస్సాహసిక వ్యక్తి ఎవడైనా తమను బలాత్కారంచెయ్యగలిగిన అరక్షిత క్షణం విషయంలో ఒక జాతీ, ఒక స్త్రీ క్షమింపబడరు. అటువంటి మాటతిరుగుళ్ల ద్వారా చిక్కు పరిష్కరింపబడదు, కేవలం మరో విధంగా సూత్రీకరింపబడుతుంది, అంతే. మూడు కోట్ల అరవై లక్షల జనాభా కలిగిన ఒకానొక జాతిని ముగ్గురు వంచకులు విభ్రాంతులనుచేసి, ప్రతిఘటన లేకుండా ఎలా వశం చేసుకోగలిగారన్న విషయాన్ని వివరించాల్సిన అవసరమింకా మిగిలేవుంది.

ఫ్రెంచి విప్లవం 1848 ఫిబ్రవరి 24వ తేదీకీ 1851 డిసెంబరుకీ మధ్య ఏయే దశలను గడిచిందో స్థూలంగా మనమిప్పుడు క్రోడీకరిద్దాం.

అసందిగ్ధమైన ముఖ్యమైన మూడు దశలు ఇవి: ఫిబ్రవరి దశ; 1848 మే 4నుండి 1849 మే 28వరకు — రిపబ్లిక్ నెలకొల్పే దశ, లేక రాజ్యాంగ నిర్ణయ జాతీయ సభ దశ; 1849 మే 28నుండి 1851 డిసెంబరు 2వరకు: రాజ్యాంగచట్టబద్ధమైన రిపబ్లిక్ దశ, లేక శాసన నిర్ణయ జాతీయ సభ దశ.

మొదటి దశ, అంటే, ఫిబ్రవరి 24నుండి, లేక, లూయీ ఫిలిప్ పదవీచ్యుతుడైన నాటినుండి, 1848 మే 4వరకు, లేక రాజ్యాంగ నిర్ణయసభ సమావేశం జరిగిన నాటి వరకు సాగిన దశను, అంటే అసలైన ఫిబ్రవరి దశను, విప్లవానికి నాందీ ప్రస్తావనగా పరిగణించవచ్చు. దానిచేత అప్పటికప్పుడు ఏర్పాటుచెయ్యబడిన ప్రభుత్వమే అది తాత్కాలికమైనది అని ప్రకటించింది, ఆ ప్రభుత్వం లాగే, యీ కాలంలో ప్రస్తావింపబడిన, ప్రయత్నింపబడిన, లేక కచ్చితంగా ప్రవచింపబడిన ప్రతీదీ కూడా తనను తాను తాత్కాలికమైనదిగా మాత్రమే చాటిచెప్పుకొందన్న వాస్తవాన్ని బట్టి దాని స్వభావం ఆధికారికంగా వ్యక్తంచెయ్యబడింది. ఏదీ, ఎవరూ కూడా జీవించడానికీ, వాస్తవంగా ఏదైనా చెయ్యడానికీ సాహసించలేకపోయారు. విప్లవానికి సన్నాహంచేసిన, లేక నిర్ణయించిన అన్ని శక్తులూ — రాజవంశ ప్రతిపక్షం,[62] రిపబ్లికన్ బూర్జువావర్గం, ప్రజాతంత్ర రిపబ్లికన్ పెటీబూర్జువావర్గం, సోషల్-డెమొక్రటిక్ కార్మికులూ — తాత్కాలికంగా ఫిబ్రవరి ప్రభుత్వంలో స్థానం పొందారు.

అది అందుకు భిన్నంగా ఉండటం కూడా సాధ్యం కాదు. ఆదిలో ఫిబ్రవరి ఘటనల లక్ష్యం యిటువంటి ఎన్నికల సంస్కరణద్వారా ఆస్తిపర వర్గంలోని రాజకీయ విశేషాధికారాలు కలిగినవారి పరిధిని విస్తృతంచెయ్యడం, ధనిక ప్రభువర్గపు ప్రత్యేక పెత్తనాన్ని కూలదోయడం. కాని, ఎప్పుడైతే ఘర్షణ ప్రారంభమైందో, జనం బ్యారికేడ్లు నిర్మించారో, నేషనల్ గార్డు

* గ్యోతే నాటకం "ఫౌస్ట్"లో మెఫిస్టోఫిలీస్ అనే పాత్ర అన్న మాటలు. — సం.

క్రియారహిత వైఖరి వహించిందో, సైన్యం తీవ్ర ప్రతిఘటనకు పూనుకోలేదో, రాజవర్గం పలాయనం చిత్తగించిందో, అప్పుడిక రిపబ్లిక్ స్థాపన తప్పనిసరిగా జరిగితీరుతుందనిపించింది. ప్రతి ఒక పార్టీ ఆ రిపబ్లిక్‌ను తన తన పద్ధతిలో ఊహించుకుంది. ఆయుధాలు చేతదాల్చి దాన్ని సాధించిన శ్రామికవర్గం, దానిపై తన ముద్రనువేసి, దాన్ని సామాజిక రిపబ్లిక్‌గా ప్రకటించింది. ఆ విధంగా అక్కడ ఆధునిక విప్లవంయొక్క సారాంశం సూచ్యమైంది. ప్రతిదానికీ బద్ధవ్యతిరేకమైన ఆ సారాంశాన్ని ఉన్న సామగ్రితో, జనసామాన్యానికి అందు బాటులోకి వచ్చిన విద్యాస్థాయితో, అప్పుడున్న పరిస్థితులు సంబంధాలలో, ఆచరణలో వెన్వెంటనే సాధించడం సాధ్యమే. మరోవంక, ఫిబ్రవరి విప్లవంలో సహకరించిన మిగిలిన అన్ని శక్తులూ గుర్తింపబడటమే కాకుండా వాటికి ప్రభుత్వంలో మిక్కిలి పెద్దవాటా ముట్టింది. అందుచేత, మనకి ఏ దశలోనూ కూడా — ఇంతకు మించిన గంభీరమైన కబుర్లతోబాటు ఆచరణలో అనిశ్చయత్వం, నేర్పులేమి, కొత్త మార్పుల కోసం మరింత ఉత్సాహపూర్వకమైన కృషితోబాటు బాగా లోతుగా పాతుకుపోయిన తాతలనాటి పాత పద్ధతుల ప్రాబల్యం, యావత్తు సమాజంలోనూ పైపైన కానవచ్చే మరింత సమరసభావంతోబాటు దానిలోని వివిధ శక్తుల మధ్య మరింత వైముఖ్యం — గందరగోళమైన యిటువంటి సమ్మిశ్రమం కనిపించదు. పారిస్ శ్రామికవర్గం తన ముందు ఆవిష్కృతమైన విస్తృతావకాశాలను గూర్చి యింకా ఊహాలోకంలోనే విహరిస్తూ, సామాజిక సమస్యలను గూర్చిన తీవ్ర వాదోపవాదాల్లో నిమగ్నమైయుండగా, సమాజంలోని పాత శక్తులు తమను తాము సంఘటితపరచుకొని, సమావేశమై, సమాలోచనలు జరుపుకున్నారు. జూలై రాజరికమనే అవరోధాలు కూలిపోగానే[63] రాజకీయ రంగంలోకి ఒక్కుమ్మడిగా చొచ్చుకువచ్చిన రైతులూ, పెటీబూర్జువాల అనుకోని తోడ్పాటు కూడా వారికి లభించింది.

రెండవ దశ — 1848 మే 4నుండి 1849 మే చివరివరకు బూర్జువా రిపబ్లిక్‌ను నెలకొల్పే దశ లేక సంస్థాపన దశ. ఫిబ్రవరి రోజులకు వెన్వెంటనే రాజవంశ ప్రతిపక్షం రిపబ్లికన్లచేత, రిపబ్లికన్లు సోషలిస్టులచేతనే కాకుండా, యావత్తు ఫ్రాన్సూ పారిస్‌చేత ఆకస్మికంగా విభ్రాంతమొనర్చబడింది. 1848 మే 4న సమావేశమైన జాతీయ సభ, జాతిచేత ఎన్నుకోబడి, జాతికి ప్రాతినిధ్యం వహించింది. ఈ జాతీయ సభ ఫిబ్రవరి రోజుల ఆకాంక్షలకు సజీవ నిరసనగా, విప్లవ ఫలితాలను బూర్జువా స్థాయికి తేవలసివుంది. ఈ జాతీయ సభ స్వభావాన్ని వెన్వెంటనే గ్రహించిన పారిస్ శ్రామికవర్గం, జాతీయ సభ సమావేశం ప్రారంభమైన కొద్ది రోజుల తర్వాత, మే 15న బలప్రయోగంతో దాని అస్తిత్వాన్ని అంతంచేసేందుకూ, దాన్ని రద్దుచేసేందుకూ, జాతియొక్క అభివృద్ధి నిరోధక భావాలు శ్రామికవర్గానికి ఏ సజీవరూపంలో ప్రమాదకారిగా తయారయ్యాయో ఆ జాతీయ సభను తిరిగి విఘటితంచెయ్యడానికీ విఫల ప్రయత్నం చేసింది.[64] మే 15వ తేదీ, మనకు

తెలిసినట్టుగా, బ్లాంకీనీ, ఆయన కామ్రేడ్సునీ అంటే, శ్రామికవర్గ పార్టీయొక్క వాస్తవ నాయకులను, మనమిప్పుడు పరిశీలిస్తున్న పూర్తి కాలవ్యవధిలో, ప్రజారంగంనుంచి తొలగించడానికి దారితీసింది, ఇంతకుమించి దానివల్ల మరో ఫలితమేమీ కలగలేదు.

లూయీ ఫిలిప్ బూర్జువా రాజరికం తర్వాత బూర్జువా రిపబ్లిక్ మాత్రమే రావచ్చు, అంటే, యింతకుముందు బూర్జువావర్గానికి చెందిన ఒక పరిమితవిభాగం రాజు పేర పాలించగా, యిప్పుడు యావత్తు బూర్జువావర్గమూ ప్రజల తరపున పాలిస్తుంది. పారిస్ శ్రామికవర్గంయొక్క డిమాండ్లు ఊహాజనితమైనవి, అర్థరహితమైనవి, వాటిని తుదముట్టించాలి — అన్న రాజ్యాంగ నిర్ణయ జాతీయ సభయొక్క యీ ప్రకటనకు పారిస్ శ్రామికవర్గం, యూరపియన్ అంతర్యుద్ధాల చరిత్రలోకెల్ల మిక్కిలి బ్రహ్మాండమైన సంఘటన అయిన జూన్ తిరుగుబాటుతో[15] జవాబిచ్చింది. బూర్జువా రిపబ్లిక్ విజయవంతమైంది. ధనిక ప్రభువర్గం, పారిశ్రామిక బూర్జువావర్గం, పెటీబూర్జువాలు, సైన్యం, గస్తీ దళంగా[65] సంఘటితంచెయ్యబడిన వర్గభ్రష్టబికారి గాలిమూక, మేధావులు, మతబోధకులు, గ్రామీణ జనాభా బూర్జువా రిపబ్లిక్ పక్షాన నిలిచారు. పారిస్ శ్రామికవర్గం పక్షాన అది తప్ప మరెవరూ నిలబడలేదు. ఆ విజయానంతరం మూడు వేలమందికిపైగా తిరుగుబాటుదారులు ఊచకోతకొయ్యబడ్డారు, పదిహేను వేలమంది ఎటువంటి విచారణా లేకుండా ప్రవాసనిర్బంధానికి పంపబడ్డారు. ఈ పరాజయంతో శ్రామికవర్గం విప్లవ రంగస్థలినుండి నేపథ్యంలోకి గెంటబడింది. ఉద్యమం తిరిగి ప్రారంభమైనట్టు కనిపించినప్పుడల్లా వెంటనే అది ముందుకొచ్చేందుకు ప్రయత్నిస్తూ వచ్చింది, కాని, ప్రతి ప్రయత్నంలోనూ దాని శక్తి క్షీణమానమూ, తక్కువ ఫలవంతమూ కాసాగింది. తనకన్న ఉన్నతస్థాయిలో వున్న సామాజిక పొరల్లో ఏదో ఒకటి విప్లవ ఆందోళనలో ప్రవేశించగానే, శ్రామికవర్గం దానితో పొత్తుపెట్టుకొని, ఒక దాని తర్వాత ఒకటిగా విభిన్న పార్టీలు పొందే పరాజయాలన్నింటిలోనూ పాలుపంచుకొంటూ వచ్చింది. కాని దరిమిలా తగిలే యీ ఆఘాతాల తీవ్రత ఆ దెబ్బలు తగిలే సామాజిక ఉపరితల పరిమాణం పెరిగే కొద్దీ అంతకంతకు తగ్గుతుంది. జాతీయ సభలోనూ, పత్రికల్లోనూ వున్న మరింత ముఖ్యులైన శ్రామికవర్గ నాయకులు వరుసగా కోర్టుకేసులకు గురిఅవుతున్నారు, అంతకంతకు సందేహాస్పదులైన వ్యక్తులు దాని నాయకత్వంలోకి వస్తున్నారు. శ్రామికవర్గంలోని ఒక భాగం సైద్ధాంతిక ప్రయోగాలకు దిగుతోంది, మారకపు బ్యాంకులను, కార్మిక సంఘాలను ఏర్పాటుచేయడానికి పూనుకొంటోంది. మరో విధంగా చెప్పాలంటే, పాత ప్రపంచంలోనే వున్న మహత్తరమైన సంఘటిత వనరుల వినియోగంతో అందులో విప్లవం తెచ్చే ప్రయత్నాన్ని వదిలేసి, అందుకు భిన్నంగా తన ముక్తిని సమాజపు పరోక్షంలో, లోపాయికారీ పద్ధతిలో, తన పరిస్థితుల పరిమితిలో సాధించాలని ప్రయత్నిస్తోంది, ఫలితంగా దానికి తప్పనిసరిగా పరాజయమే ఎదురవుతుంది. జూన్‌లో తను ఏ వర్గాలతోనైతే తలపడిందో ఆ వర్గా

లన్నీ పరాజయం పొందేవరకూ అది విప్లవ మహత్వాన్ని తనలో తాను తిరిగి కనుగొనే, కొత్తగా ఏర్పాటుచేసుకున్న పొత్తులనుండి నూతన స్ఫూర్తిని సంపాదించుకొనే స్థితిలో లేనట్లు కనిపిస్తోంది. కాని పరాజితమైనాకూడా కనీసం అది మహత్తర, విశ్వ ఐతిహాసిక పోరాటం సాగించిన గౌరవంతోనే పరాజితమైంది; జూన్ ప్రకంపంతో ఒక్క ఫ్రాన్సే కాకుండా యావత్తు యూరపూ కంపిస్తోంది. ఇందుకు భిన్నంగా, ఉన్నత వర్గాల తదుపరి పరాజయాలలో ఎంత తక్కువ మూల్యం చెల్లింపబడిందంటే విజయవంతమైన పక్షం నిర్లజ్జగా అతిశయం చేసి చెప్పడంద్వారా తప్ప వాటిని ఘటనలుగా చలామణీచెయ్యడం సాధ్యం కాకపోయింది. పరాజితపక్షం శ్రామికవర్గ పార్టీనుండి ఎంత ఎక్కువగా దూరమైతే దాని పరాజయం అంత ఎక్కువ అవమానకరమైనదవుతుంది.

నిజమే, జూన్ తిరుగుబాటుదార్ల పరాజయం, బూర్జువా రిపబ్లిక్ భవనం నిర్మింపబడటానికి అవసరమైన క్షేత్రాన్ని సన్నద్ధంచేసింది. కాని అదే సమయంలో, యూరప్ ముందు అనాడున్న సమస్య "రిపబ్లికా, లేక రాజరికమా?" అన్నది కాక, వేరే అని కూడా అది నిరూపించింది. బూర్జువా రిపబ్లిక్ అన్నదాని అర్థమిక్కడ యితర వర్గాలపై ఒక వర్గంయొక్క హద్దూపద్దూలేని నిరంకుశత్వమని అది వెల్లడించింది. అది నిరూపించిన విషయమేమిటంటే, పాత నాగరికత కలిగిన దేశాల్లో, అభివృద్ధిచెందిన వర్గ విభజన రూపంతో, ఆధునిక ఉత్పత్తికి అనువైన పరిస్థితులతో, శతాబ్దాల కృషిద్వారా సమస్త సాంప్రదాయిక భావాలూ దేనిలోనైతే విలీనమొనర్చబడతాయో ఆ బౌద్ధిక చైతన్యంతో, రిపబ్లిక్ అన్నది మొత్తంమీద బూర్జువా సమాజపు విప్లవాత్మక రూపాంతరీకరణయొక్క రాజకీయ రూపానికే ప్రాతినిధ్యం వహిస్తుంది తప్ప, దాని మితవాద అస్తిత్వ రూపానికి ప్రాతినిధ్యం వహించదు. అదెలాగంటే, ఉదాహరణకు, ఉత్తర అమెరికా సంయుక్త రాష్ట్రాల్లో, వర్గాలు అంతకుముందే అస్తిత్వంలో ఉన్నప్పటికీ, అవింకా స్థిరపడలేదు. వాటి మూలశక్తులు నిరంతరాయంగా మారుతూ, అటూయిటూ జరిగే పరస్పర మార్పిడితో అవ్యవస్థితంగా ఉన్నాయి. అక్కడ ఆధునిక ఉత్పత్తి సాధనాలు ఎదుగూబొదుగూ లేకుండా నిలకడగా ఉండిపోయిన అదనపు జనాభాతో సరిపెట్టుకొనేందుకు బదులు మెదళ్ళ, చేతుల సాపేక్షమైన కొరతను మరో విధంగా భర్తీ చేస్తున్నాయి. చివరకు అక్కడ పాదార్థిక ఉత్పత్తికి సంబంధించిన యౌవనోత్సాహపూరిత సంరంభం, ఓ కొత్త ప్రపంచాన్ని తన స్వంతంచేసుకోవాల్సిన సంరంభం, పాత భావప్రపంచాన్ని రద్దుచెయ్యడానికి సమయాన్నిగాని, సావకాశాన్నిగాని మిగల్చలేదు.

జూన్ రోజుల్లో, అరాజకత్వానికీ, సోషలిజానికీ, కమ్యూనిజానికీ చెందిన పార్టీగా దేన్నైతే తాము పరిగణించాయో, ఆ శ్రామికవర్గానికి వ్యతిరేకంగా అన్ని వర్గాలూ, పార్టీలూ పార్టీ ఆఫ్ ఆర్డర్ (వ్యవస్థ పరిరక్షక పార్టీ)గా సమైక్యమయ్యాయి. అవి సమాజాన్ని "సమాజ శత్రువుల"నుండి "కాపాడాయి." తమ సైన్యానికి అవి, పాత సమాజపు "ఆస్తి,

కుటుంబం, మతం, వ్యవస్థ" అనే నినాదాన్ని శత్రు మిత్ర విచక్షణకు తోడ్పడే సంకేత పదాలుగా అందజేసి, విప్లవ ప్రతిఘాత యోధులకు: "ఈ సంకేతంతో నీవు విజయం సాధిస్తావు!"[66] అని చాటిచెప్పాయి. ఆ క్షణంనుండి, నినాద ప్రాయమైన ఈ సంకేతం క్రింద, జూన్ తిరుగుబాటుదార్లకు వ్యతిరేకంగా ఏకమైన పలు పార్టీలతో, విప్లవ యుద్ధ రంగాన్ని తన సొంతవర్గ ప్రయోజనంకోసం వినియోగించుకొనే ప్రయత్నంలో జతగూడిన ప్రతి పార్టీ కూడా "ఆస్తి, కుటుంబం, మతం, వ్యవస్థ" అనే నినాదాన్ని ఔదలదాలుస్తూ వచ్చింది. దాని పాలకుల పరిధి కుంచితమైనప్పుడల్లా మరింత విస్తృతమైన ప్రయోజనాలకు వ్యతిరేకంగా మరింత సంకుచిత ప్రయోజనాలు పై చేయి పొంది, ప్రతిసారి సమాజం రక్షింపబడేది. అత్యంత సరళమైన బూర్జువా ఆర్థిక సంస్కరణకు, మిక్కిలి సామాన్యమైన ఉదారవాదానికి, అత్యంత లాంఛనప్రాయమైన రిపబ్లికనిజానికి, అత్యంత నామమాత్రపు ప్రజాస్వామ్యానికి సంబంధించిన ప్రతి ఒక డిమాండూ కూడా "సమాజాన్ని నాశనంచేసే ప్రయత్నం"గా తీవ్ర విమర్శకు గురిచెయ్యబడింది, "సోషలిజం"గా దుమ్మెత్తిపొయ్యబడింది. అయితే చివరకు, "మతం, వ్యవస్థ"ల పెద్దపూజారులే తమ పిథియన్ ముక్కాలిపీటల[67] పైనుండి తన్నితగిలెయ్యబడ్డారు, రాత్రి చీకటిలో తాము నిద్రిస్తున్న మంచాలపైనుండి బరబర లాక్కునిపోబడ్డారు, జైలు వాహనాల్లో తీసుకుపోబడి చీకటికొట్లలో కుక్కబడ్డారు లేక ప్రవాసానికి పంపబడ్డారు. వాళ్ల దేవాలయం నేలమట్టం చెయ్యబడింది, వాళ్ల నోళ్లకు తాళంవెయ్యబడింది, వాళ్ల కలాలు విరిచివెయ్యబడ్డాయి, వాళ్ల చట్టం ముక్కలుగా చించి వెయ్యబడింది — ఇవన్నీ ఆస్తి పేర, మతం పేర, కుటుంబం పేర, వ్యవస్థ పేరనే జరిగాయి! వ్యవస్థపట్ల మూఢభక్తిపరులైన ధనపతులు, వీధుల్లో తాగి తూలే సైనిక గుంపులచేత, తమ బాల్కనీలపైననే కాల్చివెయ్యబడ్డారు, వారి యిళ్లలోని దైవ పీఠాలు సైతం కలుషితంచెయ్యబడ్డాయి, వినోద కాలక్షేపార్థం వారి యిళ్లపై తుపాకిగుళ్లవర్షం కురిపింపబడింది — ఇవన్నీ ఆస్తి, మతం, కుటుంబం, వ్యవస్థల పేరనే జరిగాయి! కట్టకడపట, బూర్జువా సమాజానికి చెందిన అత్యంత నికృష్టులు "వ్యవస్థయొక్క పవిత్ర దళం"గా ఏర్పడ్డారు, వీరుడు క్రాప్యులిన్స్కీ* "సమాజ రక్షకుడు"గా తనను తాను తుయెలెరీ రాజభవనంలో ప్రతిష్ఠించుకున్నాడు.

## II

పరిణామక్రమాన్ని మరోసారి పర్యాలోకన చేద్దాం.

జూన్ ఘటనల తదుపరి రాజ్యాంగ నిర్ణాయ జాతీయ సభ చరిత్ర బూర్జువావర్గంలోని రిపబ్లికన్ పక్షం, మువ్వన్నెల రిపబ్లికన్లు, శుద్ధ రిపబ్లికన్లు, రాజకీయ రిపబ్లికన్లు, లాంఛ

* లూయీ బోనపార్ట్. — సం.

నవాద రిపబ్లికన్లు మొదలైన పేర్లతో చలామణీ అయిన పక్షంయొక్క పెత్తనం, కైధిల్యాల చరిత్రే.

లూయీ ఫిలిప్‌యొక్క బూర్జువా రాజరికం క్రింద ఆ బృందం అధికారిక ప్రతిపక్షంగా ఏర్పడి తత్పర్యవసానంగా ఆనాటి రాజకీయ ప్రపంచంలో గుర్తింపబడిన ఒక అంతర్భాగమైంది. ప్రతినిధుల సభలో దాని ప్రతినిధులున్నారు, పత్రికారంగంలో కూడా దానికి గణనీయమైన పలుకుబడి వుంది. పారిస్‌నుండి వెలువడే దాని అధికార పత్రిక "National"[68]కు ఒక విధంగా "Journal des Débats"[69]కి వున్నంత ప్రతిష్ఠ వుంది. రాజ్యాంగ చట్టబద్ధ రాజరికం క్రింద యీ స్థానానికి దాని స్వభావం అనురూపంగా వుంది. గొప్ప ఉమ్మడి ప్రయోజనాలచేత కలిపివుంచబడి, నిర్దిష్టమైన ఉత్పత్తి పరిస్థితులచేత యితర శక్తులనుండి వేరుచెయ్యబడిన పక్షం కాదిది. రిపబ్లికన్ భావాలు కలిగిన బూర్జువాల, రచయితల, న్యాయవాదుల, ఆఫీసర్ల, ఉద్యోగుల ముఠా యిది. ఈ ముఠాకు గల పలుకుబడికి లూయీ ఫిలిప్‌పట్ల దేశానికి గల వ్యక్తిగత అయిష్టాలు, పాత రిపబ్లిక్ స్మృతులు, పలువురు ఉత్సాహరులకు గల రిపబ్లికన్ విశ్వాసం, అన్నింటికన్న అధికంగా, వియన్నా ఒడంబడికల[70] పట్ల, ఇంగ్లండుతో పొత్తుపట్ల నిరంతరాయంగా ద్వేషాన్ని రెచ్చగొట్టిన ఫ్రెంచి జాతీయవాదమే కారణం. లూయీ ఫిలిప్ కాలంలో "National" పత్రికను అనుసరించినవారిలో ఎక్కువమంది విషయంలో, అలా అనుసరించడానికి వారిలో దాగివున్న సామ్రాజ్యతత్వమే కారణం, తరువాత, రిపబ్లిక్ కాలంలో, లూయీ బోనపార్ట్‌లో సరిగా ఆ సామ్రాజ్య తత్వమే "National" పత్రికకి వినాశకర పోటీదారుగా తయారైంది. బూర్జువా ప్రతిపక్షానికి చెందిన అన్ని గ్రూపుల్లాగే "National" పత్రిక కూడా ధనిక ప్రభువర్గంపై పోరాడింది. ఫ్రాన్సులో ధనిక ప్రభువర్గంపై పోరాటంతో సన్నిహితంగా ముడివడివున్న బడ్జెట్టుపై వాదప్రతివాదాలు ప్రజానురంజకత్వాన్ని అతి తేలికగా సంపాదించుకొనేవి, ఉపదేశపూర్వక సంపాదకీయ వ్యాసాలకు కూడా సమాచారం బహుళంగా లభించేది, ఆ సమాచారాన్ని వినియోగించుకోకపోవడం కష్టసాధ్యంగా వుండేది. ఫ్రెంచి సంరక్షక వ్యవస్థకు బానిసబుద్ధితో యిచ్చిన తోడ్పాటుకుగాను "National"కి పారిశ్రామిక బూర్జువావర్గం కృతజ్ఞతాబద్ధమైంది, ఆ సహాయాన్ని అది జాతీయ ఆర్థికవిధాన ప్రయోజనాల దృష్టితోకన్న ఎక్కువగా జాతీయదృష్టితోనే స్వీకరించింది; మొత్తంగా బూర్జువావర్గం, కమ్యూనిజంపైన, సోషలిజంపైన అది చేసే విషపూరిత నిందారోపణలకొరకే దానికి కృతజ్ఞతాబద్ధమైంది. పోతే మిగిలినవారికి సంబంధించినంతవరకు, "National" పార్టీ శుద్ధ రిపబ్లికన్ పార్టీ. అంటే అది, రాజరిక బూర్జువా పాలన రూపాన్నికాక రిపబ్లికన్ బూర్జువాపాలన రూపాన్ని, అన్నిటికన్న ముఖ్యంగా, యీ పాలనలో మిక్కిలి పెద్ద వాటాను కోరుతోంది. ఈ పరివర్తన పరిస్థితులకు సంబంధించిన షరతుల విషయంలో దానికి స్పష్టమైన అభిప్రాయమంటూ

ఏదీ లేదు. మరోవంక, దానికి తేటతెల్లంగా తెలిసినదే, ప్రజాతంత్రవాద పెటీబూర్జువా వర్గానికీ, ప్రత్యేకించి విప్లవకర శ్రామికవర్గానికీ తనపట్ల అయిష్టమున్నదన్న విషయం. లూయీ ఫిలిప్ పాలన చివరి రోజుల్లో, సంస్కరణోద్యమ క్రమంలో జరిగిన విందుభోజనాల సందర్భంగా బాహాటంగా యీ విషయం సర్వత్రా వెల్లడింపబడింది. ఈ శుద్ధ రిపబ్లికన్లు, వస్తుతహా శుద్ధ రిపబ్లికన్లందరి మాదిరిగానే, మొదట, ఆర్లియన్స్ డచెస్‌యొక్క రీజెన్సీని బలపరచేందుకు సిద్ధపడ్డారు, కాని యింతలోనే ఫిబ్రవరి విప్లవం[13] ప్రజ్వలించి, వారి ప్రసిద్ధ ప్రతినిధులకు తాత్కాలిక ప్రభుత్వంలో స్థానాన్ని కల్పించింది. సహజంగానే ఆదినుండీ కూడా, ఆ రిపబ్లికన్లకు బూర్జువావర్గపు విశ్వాసమూ, రాజ్యాంగ నిర్ణయ జాతీయ సభలో మెజారిటీ లభించాయి. జాతీయ సభ సమావేశమైనప్పుడు అది నెలకొల్పిన కార్యనిర్వాహక కమిషన్‌నుంచి తాత్కాలిక ప్రభుత్వంలోని సోషలిస్టు శక్తులు వెన్వెంటనే తొలగించివెయ్యబడ్డాయి. "National" పార్టీ జూన్ తిరుగుబాటు ప్రజ్వలనాన్ని అవకాశంగా తీసుకొని, కార్యనిర్వాహక కమిషన్‌ను రద్దుచేసి తద్వారా తనకు అత్యంత సమీప ప్రత్యర్థులైన (లెద్ర్యూ-రోలిన్ మొదలైన) పెటీబూర్జువా, లేక ప్రజాస్వామిక రిపబ్లికన్లను వదలించుకొనే అవకాశాన్ని కూడా వినియోగించుకుంది. జూన్ ఊచకోతకు నాయకత్వం వహించిన బూర్జువా రిపబ్లికన్ పార్టీకి చెందిన జనరల్ కవేన్యాక్ కార్యనిర్వాహక కమిషన్ స్థానాన్ని ఆక్రమించి ఒకరకమైన నియంతృత్వాధికారాలను చేబట్టాడు. "National" పత్రికయొక్క మాజీ ప్రధాన సంపాదకుడైన మర్రాస్ట్, రాజ్యాంగ నిర్ణయసభకి శాశ్వత అధ్యక్షుడయ్యాడు; మంత్రి పదవులు, అలాగే అన్ని యితర ముఖ్య పదవులూ శుద్ధ రిపబ్లికన్ల పాలబడ్డాయి.

ఏ రిపబ్లికన్ బూర్జువా పక్షం అయితే జూలై రాజరికానికి తనను తాను న్యాయబద్ధమైన ఉత్తరాధికారిగా పరిగణించుకొంటూ వచ్చిందో దానియొక్క మిక్కిలి ప్రగాఢమైన ఆకాంక్షలు యీ విధంగా ఆశించినదానికి మించి సఫలమయ్యాయి. కాని యీ అధికారం దానికి లూయీ ఫిలిప్ కాలంలో, రాజ్యసింహాసనానికి వ్యతిరేకంగా బూర్జువావర్గపు ఉదారవాద తిరుగుబాటు ద్వారా పొందాలని అది ఆశించిన పద్ధతిలో కాకుండా, పెట్టుబడికి వ్యతిరేకంగా ఏ శ్రామికవర్గపు తిరుగుబాటు గుళ్లవర్షం ద్వారా అణచివెయ్యబడిందో దాని ద్వారా లభించింది. దేన్నైతే అది తన మనస్సులో అత్యంత విప్లవాత్మకమైన ఘటనగా చిత్రించుకొంటూ వచ్చిందో అది వాస్తవానికి అత్యంత విప్లవ ప్రతీఘాతకమైనదిగా పరిణమించింది. ఫలమైతే దాని ఒడిలో పడినమాట నిజమే, కాని అది జీవిత వృక్షంనుంచి కాక, జ్ఞానవృక్షం నుంచి పడింది.

బూర్జువా రిపబ్లికన్ల ప్రత్యేక పాలన 1848 జూన్ 24నుంచి డిసెంబరు 10 దాకా మాత్రమే సాగింది. రిపబ్లికన్ రాజ్యాంగచట్టపు ముసాయిదా తయారీ, పారిస్‌లో ముట్టడి స్థితి ప్రకటన — క్లుప్తంగా యివీ దాని పాలనయొక్క ఫలితం.

నూతన రాజ్యాంగచట్టం వస్తుతహా 1830 నాటి రాజ్యాంగపు చార్టరు[71]కు రిపబ్లికన్ రంగుపూసిన నకలు మాత్రమే. బూర్జువావర్గంలోనే ఒక పెద్దభాగాన్ని సైతం రాజకీయ అధికారంనుంచి మినహాయించిన జూలై రాజరికంయొక్క పరిమిత ఎన్నికయోగ్యత బూర్జువా రిపబ్లిక్ అస్తిత్వానికి అనురూపమైనది కాదు. ఈ పరిమిత ఎన్నికయోగ్యత స్థానంలో, ఫిబ్రవరి విప్లవం వెన్వెంటనే ప్రత్యక్ష సార్వజనిక ఓటింగు హక్కును ప్రకటించింది. బూర్జువా రిపబ్లికన్లు యీ చర్యను తిరగతోడలేకపోయారు. నియోజకవర్గంలో ఆరు నెలల పాటు నివసించియుండాలన్న షరతును విధించడం ద్వారా సార్వజనిక ఓటింగు హక్కును కొంత పరిమితపరచడంతో వారు సంతుష్టిచెందాల్సివచ్చింది. ప్రభుత్వాధికార నిర్వహణకు, మునిసిపల్ పాలనకు, న్యాయ వ్యవస్థకు, సైన్యం మొదలైనవాటికి సంబంధించిన పాత వ్యవస్థ యథాతథంగానే కొనసాగింపబడింది, పోతే, రాజ్యాంగం వాటిలో ఏదైనా మార్పు చేసినా కూడా విషయసూచికలోనే గాని అసలు విషయంలో ఏ మార్పూ చెయ్యలేదు, పేరునే మార్చిందిగాని విషయవస్తువునేమీ మార్చలేదు.

1848 నాటి స్వేచ్ఛలలో నిస్సందేహంగా ఏవైతే సర్వోత్తమమైనవో, అటువంటి వ్యక్తి స్వేచ్ఛ, వాక్, సభా, పత్రికా, సమావేశ స్వేచ్ఛలు, విద్యా, మతాది స్వేచ్ఛలకు రాజ్యాంగబద్ధమైన రూపం కల్పింపబడటంతో, వాటికి అనుల్లంఘనీయత లభించింది. వీటిలో ప్రతి ఒక్క స్వేచ్ఛా ఫ్రెంచి పౌరునియొక్క తిరుగులేని హక్కుగా ప్రకటింపబడింది, కానైతే దానితో బాటే యీ క్రింది హంసపాదు కూడా చేర్చబడింది. ఈ స్వేచ్ఛలు "యితరుల సమాన హక్కులను, ప్రజా భద్రతను" అతిక్రమించనంత మేరకు ఒకరి స్వేచ్ఛలు మరొకరి వాటితోను, ప్రజా భద్రతతోను ఘర్షణపడకుండా సామరస్యాన్ని పరిరక్షించడానికి ఉద్దేశింపబడిన "చట్టాల"ను అతిక్రమించని మేరకు మాత్రమే అవి తిరుగులేనివన్నదే ఆ హంసపాదు. ఉదాహరణకు: "పౌరులకు సంఘాలుగా ఏర్పడేందుకూ, శాంతియుత నిరాయుధ సమావేశాలు జరుపుకొనేందుకూ, మహజర్లు పెట్టుకొనేందుకూ, తమ అభిప్రాయాలను పత్రికలద్వారా గాని, మరేవిధంగా గాని వ్యక్తంచేసేందుకూ హక్కుంది. ఈ హక్కులను అనుభవించడం పైన యితరుల సమాన హక్కులు, ప్రజాభద్రత అన్నవి తప్ప మరేయితర పరిమితులూ లేవు." (ఫ్రాన్సు రాజ్యాంగచట్టం, అధ్యాయం II, నిబంధన 8.)—"విద్యపై నిర్బంధమేమీ లేదు. విద్యా స్వాతంత్ర్యం చట్టంచేత నిర్దేశింపబడిన షరతుల మేరకు, రాజ్యపు అత్యున్నత అజమాయిషీ క్రింద అనుభవింపబడుతుంది." (రాజ్యాంగచట్టంలోని అదే అధ్యాయంలో 9వ నిబంధన.)—"ప్రతి ఒక పౌరుని గృహమూ, చట్టంచేత నిర్దేశింపబడిన రూపాల్లో తప్ప, అనుల్లంఘనీయం." (అధ్యాయం II, నిబంధన 3.) వగైరా, వగైరా. ఈ విధంగా ఆ రాజ్యాంగచట్టం, ఆ మినహాయింపులకు సంబంధించిన గమనికలను అమలుజరిపి, నిర్నిబంధమైన యీ స్వేచ్ఛల అనుభవాన్ని, వ్యక్తి స్వేచ్ఛ మరొ

కరి స్వేచ్ఛతోనూ, ప్రజాభద్రతతోనూ ఘర్షణలోకి రానిపద్ధతిలో నియంత్రితంచెయ్యాల్సిన భవిష్యత్ సమగ్రమైన చట్టాలను గురించి నిరంతరాయంగా పేర్కొంటుంది. తర్వాత, యీ సమగ్రమైన చట్టాలు వ్యవస్థ మిత్రులచేత అస్తిత్వంలోకి తీసుకురాబడ్డాయి, ఆ స్వేచ్ఛలన్నీ కూడా, బూర్జువావర్గం వాటిని అనుభవించేటప్పుడు దానికి యితర వర్గాల సమాన హక్కులు ఏ విధంగానూ అడ్డంరాని పద్ధతిలో నియంత్రితంచెయ్యబడ్డాయి. ఈ స్వేచ్ఛలను యితరులకు పూర్తిగా నిషిద్ధంచేసే సందర్భాల్లోనూ, లేక వాటి అనుభవాన్ని ఏ షరతులతోనైతే అనుమతిస్తుందో ఆ సందర్భాల్లోనూ అవన్నీ అన్ని పోలీసు బోనులే, ఇదెప్పుడూ కూడా కేవలం "ప్రజా భద్రత" కోసమే, అంటే, రాజ్యాంగచట్టం నిర్దేశించిన మేరకు బూర్జువావర్గపు భద్రత కోసమే జరుగుతుంది. పర్యవసానంగా జరిగినదేమిటంటే — ఈ స్వేచ్ఛలన్నింటినీ రద్దుచేసిన వ్యవస్థ మిత్రులూ, వాటన్నింటినీ డిమాండుచేసిన ప్రజాస్వామ్యవాదులూ కూడా — అదే ప్రకారం పూర్తి న్యాయవిహితంగా రాజ్యాంగచట్టాన్నే ఉదహరించ నారంభించారు. ఎందుకంటే, రాజ్యాంగచట్టంలోని ప్రతి నిబంధనా కూడా అంతర్వైరుధ్యాన్ని కలిగివుంది, దానికే పైభాగం, క్రింది భాగం వున్నాయి, అర్థాత్తూ, కొన్ని సాధారణ వాక్యాలలో స్వేచ్ఛ నిర్వచింపబడుతుంది, దాని మినహాయింపులో ఆ స్వేచ్ఛ కొట్టివెయ్యబడుతుంది. ఆ విధంగా, స్వేచ్ఛయొక్క పేరుకి మాన్యత వుండి, ఆచరణలో దాని ఫలితం మాత్రమే — చట్టబద్ధమైన పద్ధతిలోనే అనుకోండి — నిరోధింపబడినంత కాలమూ, స్వేచ్ఛయొక్క రాజ్యాంగపరమైన అస్తిత్వం — వాస్తవిక జీవితంలో దాని అస్తిత్వానికి ఎటువంటి చావుదెబ్బలు తగులుతున్నా కూడా — యథాతథంగా, అనతిక్రమణీయంగా ఉంటుంది.

అంత చతురమైన పద్ధతిలో అనతిక్రమణీయం చెయ్యబడిన యీ రాజ్యాంగచట్టం, వీరుడైన అఖిలెస్ శరీరం లాగ, ఒక్క చోట భేద్యమైనది. ఆ చోటు పాదం కాదు, శిరస్సు, ఆమాటకొస్తే రెండు శిరస్సులు — రాజ్యాంగచట్టంలో నిర్దేశింపబడిన ఆ రెండు శిరస్సుల్లో ఒకటి శాసన సభ, రెండవది అధ్యక్షుడు. రాజ్యాంగచట్టాన్ని పర్యాలోకించండి, శాసన సభకూ అధ్యక్షునికీ మధ్య సంబంధాలను నిర్వచించిన నిబంధనలు మాత్రమే పరమమైనవి, నిశ్చితమైనవి, వైరుధ్యరహితమైనవి, వక్రీకరణకు అతీతమైనవి అన్న విషయం స్పష్టపడుతుంది. దీనికి కారణమేమిటంటే, యిక్కడ సమస్య బూర్జువా రిపబ్లికన్లు తమను తాము పరిరక్షించుకోవడం. రాజ్యాంగచట్టంలోని 45నుండి 70వరకు గల నిబంధనలు ఎలా సూత్రీకరింపబడ్డాయంటే జాతీయ సభ అధ్యక్షుని రాజ్యాంగచట్టబద్ధంగా తొలగించవచ్చు, కాగా, అధ్యక్షుడు జాతీయ సభను రాజ్యాంగచట్టవిరుద్ధంగా మాత్రమే, రాజ్యాంగచట్టాన్నే త్రోసిపుచ్చడంద్వారా మాత్రమే తొలగించగలడు. కాగా, రాజ్యాంగచట్టం బలప్రయోగం ద్వారా భంగమయ్యే చోటు యిదే. 1830 నాటి చార్టరు మాదిరిగా అధికారాల విభజనను సుప్రతిష్ఠితం చెయ్యడమేకాకుండా, దాన్నొక సహింపరాని వైరుధ్యంగా అది విస్తరింప

చేస్తుంది. రాజ్యాంగ అధికారాల క్రీడగా గిజో ఒకసారు అభివర్ణించిన శాసననిర్మాణ, కార్యనిర్వాహక అధికారాల మధ్య పార్లమెంటరీ జగడం 1848 నాటి రాజ్యాంగచట్టంలో సర్వస్వమూ ఒడ్డి అదేపనిగా సాగింపబడింది. ఒకవంక సార్వజనిక ఓటింగులో ఎన్నుకోబడి, తిరిగి ఎన్నికకు నిలబడే అర్హత కలిగిన 750 మంది ప్రజా ప్రతినిధులున్నారు. వారు అదుపుచెయ్యరాని, రద్దుచెయ్యరాని, అవిభాజ్యమైన జాతీయ సభగా ఏర్పడ్డారు. శాసన నిర్మాణంలో సర్వశక్తివంతమైన, యుద్ధం, శాంతి, వాణిజ్య ఒప్పందాల విషయంలో తుది నిర్ణయం తీసుకోగల, క్షమాదానం విషయంలో ఏకమాత్ర అధికారం గల ఆ జాతీయ సభ, తన శాశ్వతత్వం ద్వారా రాజకీయ రంగంలో సదా ముమ్మందుంటుంది. మరోవంక, సకల రాజ్యాధికార లక్షణాలు కలిగిన, జాతీయ సభ ప్రసక్తి లేకుండా తన మంత్రులను నియమించుకొనే, బర్తరఫుచేసే అధికారం కలిగిన, కార్యనిర్వాహకాధికార సాధనలన్నింటినీ తన గుప్పెట్లో పెట్టుకొన్న, అన్ని పదవులనూ యిచ్చి తద్వారా ఫ్రాన్సులో కనీసం పదిహేను లక్షలమంది బ్రతుకుతెరువును నిర్ణయిస్తున్న (ఎందుకంటే, 5 లక్షల మంది ఉద్యోగులపైన, తరతమ హోదాల అధికారులపైన అంతమంది ఆధారపడి వున్నారు) అధ్యక్షుడు వున్నాడు. మొత్తం సాయుధ బలగాలన్నీ అతని వెనక వుంటాయి. వ్యష్టి నేరస్థులకు క్షమాదానంచేసే, నేషనల్ గార్డులను కొలువునుంచి తాత్కాలికంగా తొలగించే, నేరుగా పౌరులచేతనే ఎన్నుకోబడిన సాధారణ, జిల్లా, మునిసిపల్ కౌన్సిళ్లను ప్రభుత్వ సలహా సమితి ఆమోదంతో రద్దుచేసే అధికారం అతనికి వుంటుంది. విదేశాలతో చేసుకొనే అన్ని సంధుల విషయంలోనూ చొరవా, విచక్షణా అతనికి కేటాయింపబడ్డాయి. జాతీయ సభ సదా ప్రత్యక్ష రంగస్థలిపై తన కార్యకలాపాలు నిర్వర్తిస్తూ అనుదినం ప్రజా విమర్శకు గురి అవుతూవుండగా అధ్యక్షుడు ఎలిసీ ఫీల్డ్సులో[72] ప్రజల దృష్టికి దూరంగా ఏకాంత జీవితం గడుపుతాడు, రాజ్యాంగపు 45వ నిబంధన సదా అతని కళ్లముందు కనిపిస్తూ వుంటుంది, అతని మనస్సునుంచి క్షణకాలం కూడా వైదొలగకుండా నిత్యం అతనితో: "Frère, il faut mourir!"* అని గుర్తుచేస్తూ వుంటుంది. నీ ఎన్నిక తదుపరి నాలుగో సంవత్సరం, అందమైన మే మాసపు రెండవ ఆదివారంనాడు నీ అధికారం ముగుస్తుంది! అప్పుడు నీ ఘనత అంతమవుతుంది, ఈ పాత్ర పునరావృతం కాదు, ఒకవేళ నీకేమైనా రుణాలుంటే, సకాలంలో మేల్కొని, రాజ్యాంగచట్టం నీకు మంజూరుచేసిన ఆరు లక్షల ఫ్రాంకులతో చెల్లుపెట్టుకో, అందమైన మే మాసపు రెండవ ఆదివారంనాడు క్లిషీ[73]కి వెళ్లాలని కోరుకోకపోతేనే అనుకో! — ఆ విధంగా, రాజ్యాంగ చట్టం వాస్తవికాధికారాన్ని అధ్యక్షునికి కట్టబెట్టి జాతీయ సభకు నైతిక అధికారాన్ని సమ

---

* "సోదరా, నువ్వు చనిపోయితీరాల్సిందే!" ట్రాపిస్టు అనే కేథలిక్ సన్యాసి సంఘం సభ్యులు ఈ మాటలతో ఒకరు ఒకరిని పలకరించుకుంటారు. — సం.

కూర్చేందుకు ప్రయత్నిస్తోంది. చట్టసంబంధమైన నిబంధనలతో నైతికాధికారాన్ని సృష్టించడం అసాధ్యమన్న వాస్తవాన్ని అటుంచి, అధ్యక్షుని ప్రత్యక్ష ఎన్నికద్వారా యావన్మంది ప్రేమించివారి చేతా ఎన్నుకోనివ్వడంద్వారా రాజ్యాంగచట్టం తనను తాను యిక్కడ మరోమారు పూర్వపక్షంచేసుకుంటోంది. ఫ్రాన్సుయొక్క ఓట్లు ఏడువందల యాభైమంది జాతీయ సభసభ్యుల మధ్య విభజితం కాగా, తద్విరుద్ధంగా, అవి యిక్కడ ఒకేఒక వ్యక్తిపైన కేంద్రీకృతమయ్యాయి. ప్రతి ఒక విడి ప్రజా ప్రతినిధీ ఒక పార్టీకో, ఒక పట్టణానికో, ఒక ప్రాంతానికో మాత్రమే ప్రాతినిధ్యం వహించగా, లేక ఏడువందల యాభై మందిలోనూ ఎవరో ఒకరిని మాత్రమే ఎన్నుకోవలసిన కేవల ఆవశ్యకత మాత్రమే కాగా — ఈ ఎన్నికలో అతని ధ్యేయంగాని వ్యక్తిత్వంగాని సన్నిహితంగా పరిశీలింపబడకపోగా, అధ్యక్షుడు జాతి ఎంపిక, అతని ఎంపికక్రియ సార్వభౌమాధికారంగల ప్రజలు ప్రతి నాలుగేళ్లకూ ఒకసారి ప్రయోగించే తురుపుముక్క. ఎన్నుకోబడిన జాతీయ సభకు జాతితో గల సంబంధం అధిభౌతికమైనది కాగా, ఎన్నుకోబడిన అధ్యక్షునికి దానితో గల సంబంధం వ్యక్తిగతమైనది. జాతీయ సభ నిజానికి, తన వ్యష్టి ప్రతినిధులలో జాతీయాత్మకు సంబంధించిన బహుముఖ పార్శ్వాలను ప్రదర్శిస్తుంది, కాని అధ్యక్షునిలో యీ జాతీయాత్మ సాక్షాత్తూ మూర్తీభావం పొందుతుంది. ఈ జాతీయ సభకు భిన్నంగా అతను ఒకవిధమైన దివ్యాధికారాన్ని కలిగివుంటాడు; ప్రజానుగ్రహంతో అతను అధ్యక్షుడవుతాడు.

సముద్ర దేవత థేటిస్, అఖిలెస్‌కి అతను నడియవ్వనంలో మరణిస్తాడని జోస్యం చెప్పింది. అఖిలెస్ మాదిరిగానే బలహీన స్థానం కలిగిన రాజ్యాంగచట్టానికి, తను కూడా అఖిలెస్ మాదిరిగానే శీఘ్రమరణానికి గురి అయితీరుతానన్న అనుమానం వుంది. ఈమాత్రం దానికి సముద్ర దేవత థేటిస్ సముద్రంనుంచి పనికట్టుకొని బయటకువచ్చి ఆ రహస్యాన్ని రిపబ్లిక్ నెలకొల్పే శుద్ధ రిపబ్లికన్లకు తెలియజెప్పాల్సిన అవసరం లేదు, రాజ్యాంగచట్టాన్ని తయారు చేస్తున్న శుద్ధ రిపబ్లికన్లు ఆదర్శప్రాయమైన రిపబ్లిక్ అనే తమ సమున్నతాకాశంనుంచి ఐహిక ప్రపంచంకేసి చూస్తేనే చాలు, తాము తమ మహత్తర శాసననిర్మాణ కళాకృషిలో ముగింపుదశకి చేరుకొనేకొద్దీ రాజరికవాదులు, బోనపార్ట్ అనుయాయులు, ప్రజాస్వామ్యవాదులు, కమ్యూనిస్టుల గర్వాతిశయం, తమ సొంత అప్రతిష్ఠ రోజురోజుకీ ఎంతగా పెరిగిపోతున్నాయో గ్రహించగలిగేవారు. రాజ్యాంగచట్టంలో ఒక ఉచ్చుద్వారా, దానిలోని 111వ అధ్యాయంద్వారా, వారు భవితవ్యాన్ని మోసగిద్దామని ప్రయత్నించారు. దాని ప్రకారం రాజ్యాంగ సవరణకు సంబంధించిన ప్రతి ప్రతిపాదనకూ మొత్తం ఓట్లలో నాలుగింట మూడువంతుల తోడ్పాటు వుండాలి, వరుసగా జరిగిన మూడు సమావేశాల్లో యీ తోడ్పాటు లభించాలి, ఆ సమావేశాలలో ఒకదానికీ మరొకదానికీ మధ్య ఎప్పుడూ కూడా పూర్తిగా

ఒక నెల విరామం ఉండాలి, దానికితోడు మరో షరతు ఏమిటంటే, జాతీయ సభలోని సభ్యుల్లో అయిదువందలమందికి తక్కువ కాకుండా ఓటుచెయ్యాలి. తద్వారా కేవలం వారొక దుర్బల ప్రయత్నం మాత్రమే చేశారు, అదేమిటంటే, పార్లమెంటులో అల్పసంఖ్యాక బలం కలిగి యున్నప్పుడు సైతం — వారి భవిష్యద్విషయాన్ని తమ మనోనేత్రం ముందు యిదివరకే చూశారు — అధికారాన్ని సాగించాలన్నదే ఆ ప్రయత్నం. పార్లమెంటులో అధికసంఖ్యాక బలాన్నీ, ప్రభుత్వాధికారానికి సంబంధించిన సాధన సంపత్తినీ కలిగియున్న యీ సమయం లోనే ఆ అధికారం నానాటికీ అధికంగా తమ దుర్బల హస్తాలనుండి జారిపోడాన్ని వారు గుర్తించారు.

చిట్టచివరగా, రాజ్యాంగచట్టం, నాటకీయమైన ఒక నిబంధనలో, తనను తాను "యావన్మంది ఫ్రెంచి ప్రజల, ప్రతి ఒక ఫ్రెంచి దేశీయుని జాగరూకతకూ, దేశభక్తికీ" అప్పగించుకొంది. అయితే అది యీ పనిని, అంతకుముందు నిబంధనలో అదే "జాగరూక," "దేశభక్తియుత" ప్రజలను అదే ప్రయోజనార్థం తను ఏర్పాటుచేసిన హైకోర్టుయొక్క — "haute cour"యొక్క — దయాపూర్ణమూ, శ్రద్ధాన్వితమైన సంరక్షకత్వానికి అప్పగించినతర్వాతనే చేసింది.

1848 నాటి రాజ్యాంగచట్టం ఎలా వున్నదంటే, 1851 డిసెంబరు 2న, అది శిరోఘాతం చేతకాక, కేవలం ఒక టోపీ స్పర్శమాత్రంచేత కూలిపోయింది. ఆ టోపీ నెపో లియన్ టోపీ మాదిరి ముక్కోణపు టోపీ యేనసుకోండి.

జాతీయ సభలోని బూర్జువా రిపబ్లికన్లు యీ రాజ్యాంగచట్టానికి రూపకల్పన చెయ్యడంలోను, దాన్ని గురించి వాదోపవాదాలు జరపడంలోను, దానిపై ఓటుచెయ్యడంలోను నిమగ్నులైయుండగా, జాతీయ సభ బయట కవేన్యాక్ పారిస్‌లో ముట్టడి స్థితిని సాగిస్తు న్నాడు. పారిస్‌లో యీ ముట్టడి స్థితియే రిపబ్లిక్‌కి జన్మనివ్వడంలో రాజ్యాంగ నిర్ణయసభకు మంత్రసానిగా పనిచేసింది. రాజ్యాంగచట్టం తర్వాత దశలో బయనెట్లచేతనే అంతమొందింప బడిందంటే, బయనెట్ల బలంతోనే ప్రజలపై గురిపెట్టబడిన బయనెట్లతోనే — రాజ్యాంగ చట్టాన్ని దాని మాతృగర్భంలో రక్షించాల్సివచ్చిందన్న సంగతినీ, బయనెట్ల బలంతోనే దాన్ని అస్తిత్వంలోకి తేవలసివచ్చిందన్న సంగతినీ మరచిపోరాదు. "గౌరవనీయ రిపబ్లికన్ల" పూర్వీ కులు తమ చిహ్నమైన త్రివర్ణ పతాకాన్ని[74] యూరప్ చుట్టూ యాత్రకు పంపగా, వారి మటుకు వారు, తనకు తానుగా యూరప్ ఖండమంతటా వ్యాపించిన ఒక కొత్త సాధనాన్ని ఆవిష్కరించారు, చివరకు అది మరింతగా పునరుజ్జీవితమైన ప్రేమతో ఫ్రాన్సుకి తిరిగి వచ్చింది. చివరకు యిప్పుడది సగం జిల్లాలలో అంగీకృతమైన పద్ధతి అయింది. ఆ నవ్యావి ష్కారమే — ముట్టడి స్థితి. ఇది, ఫ్రెంచి విప్లవ క్రమంలో దరిమిలా సంభవించిన ప్రతి ఒక సంక్షోభంలోనూ దఫదఫాలుగా వినియోగింపబడిన, మహత్తరమైన ఒక ఆవిష్కరణ.

కాని, ఫ్రెంచి సమాజపు మస్తిష్కంపై, దాని మెదడును అణచివేసి, దానిని స్తబ్ధంచేసేం దుకుగాను దఫదఫాలుగా సైనిక బేరక్సునూ, సైనిక గస్తీగుడారాలనూ వెయ్యడం; దఫదఫా లుగా న్యాయాధిపతులుగా అధికార నిర్వాహకులుగా, సంరక్షకులుగా సెన్సార్లుగా, పోలీసులుగా రాత్రికావలివాళ్ళుగా వ్యవహరించడానికి కత్తీ తుపాకీ అనుమతింపబడటం; సమాజంయొక్క అత్యున్నత వివేకంగాను అజమాయిషీదారుగాను సైనిక మీసమూ యూనిఫారమూ – దఫదఫా లుగా కీర్తింపబడటమూ జరిగింది – అయితే సైనిక బేరక్సూ సైనిక గుడారమూ, కత్తీ తుపాకీ, సైనిక మీసమూ యూనిఫారమూ: చివరకు వీటి అన్నింటి పరమార్థమూ, తమ పాలనను ప్రకటించడం ద్వారా, తనను తాను అది పాలించుకోవడమనే కష్టంనుండి పౌర సమాజాన్ని తప్పించి, పూర్తిగా శాశ్వతంగా తను కాపాడుతున్నానన్న భావాన్ని కల్పించడం కాదా? సైనిక బేరక్సూ సైనిక గుడారం, కత్తీ తుపాకీ, సైనిక మీసమూ యూనిఫారమూ – వీటికి అటువంటి అభిప్రాయం కలగడానికి మరింత అవకాశముంది, ఎందుకంటే, అప్పుడు కూడా తమ ఉచ్చతర సేవలకుగాను అధికతర చెల్లింపులు ముట్టే అవకాశముంటుంది. అందుకు భిన్నంగా కేవలం దఫదఫాలుగా ముట్టడి స్థితి వలనా, ఈ బూర్జువా ముఠాయొక్క లేక ఆ బూర్జువా ముఠాయొక్క ఆదేశం మేరకు సమాజాన్ని తాత్కాలికంగా కాపాడటం వలన కొందరు మృతిచెందడం, క్షతగాత్రులు కావడం, కొందరు బూర్జువా నాయకుల మైత్రీ పూర్వకమైన చిరునవ్వులూ మినహాయించి సైనికులకు లభించే ప్రయోజనం స్వల్పం. అంతకన్న సైన్యమే చివరకు ఏదో ఒక రోజున తమ స్వప్రయోజనం కోసం, సొంత లాభం కోసం ముట్టడి స్థితిని అమలుజరిపి, అదే సమయంలో పౌరుల డబ్బుసంచులను కూడా కైవసంచేసుకోవచ్చు కదా? పైగా, యథాలాపంగా మరో విషయాన్ని గుర్తుంచుకోవడం కూడా అవసరం. కవేన్యాక్ పదవీకాలంలో 15,000 మంది తిరుగుబాటుదారులను ఏ విచారణా లేకుండా దేశబహిష్కృతులను చేసిన అదే సైనిక కమిషన్ అధ్యక్షుడు కలనల్ బెర్నార్డే, యీ క్షణాన మళ్ళీ పారిస్‌లో చురుకుగా పనిచేస్తున్న సైనిక కమిషన్ల అధినాయక త్వంలో ఉన్నాడన్న సంగతిని మరచిపోకూడదు.

ఒకవంక, 1851 డిసెంబరు 2కి సంబంధించిన ప్రిటోరియన్లు[75] పెరిగేందుకు పారిస్‌లో ముట్టడి స్థితితో, గౌరవనీయ, శుద్ధ రిపబ్లికన్లు శిశుపోషణాలయం వంటిదాన్ని నెలకొల్పారు. మరోవంక వారు అభినందనీయులయ్యారు. ఎందుకంటే, లూయీ ఫిలిప్ కాలంలో మాదిరిగా జాతీయోన్మాదాన్ని రెచ్చగొట్టక, జాతీయాధికారం తమ చేతుల్లో ఉన్న యిప్పుడు విదేశాల ముందు వారు మోకరిల్లుతున్నారు. ఇటలీని విముక్తంచెయ్యడానికి బదులు, ఆస్ట్రియన్లచేతా, నియోపోలిటన్ల[76] (నేపుల్స్‌వారి)చేతా దాన్ని పునరాక్రమించు కోనిచ్చారు. 1848 డిసెంబరు 10న అధ్యక్షుడుగా లూయీ బోనపార్ట్ ఎన్నికకావ డంతో కవేన్యాక్ నియంతృత్వానికీ, రాజ్యాంగ నిర్ణయసభకీ స్వస్తిచెప్పబడింది.

రాజ్యాంగచట్టపు 44వ నిబంధనలో యీవిధంగా పేర్కొనబడింది: "ఫ్రెంచి రిపబ్లిక్ అధ్యక్షుడు ఫ్రెంచి పౌరునిగా తన హోదాను ఎన్నడూ కోల్పోయి వుండరాదు." ఫ్రెంచి రిపబ్లిక్ తొలి అధ్యక్షుడు లూయీ నెపోలియన్ బోనపార్ట్ ఫ్రెంచి పౌరుడుగా తన హోదాను కోల్పోవడమేకాక, ఆంగ్లేయ స్పెషల్ పోలీసుగా ఉండటమేకాకుండా, అతను స్విస్ పౌరసత్వాన్ని సైతం స్వీకరించియున్నాడు.[77]

డిసెంబరు 10 నాటి ఎన్నిక ప్రాముఖ్యాన్ని నేను మరో చోట విశ్లేషించాను.* నేనిప్పుడిక్కడ ఆ విషయాన్ని గురించి తిరిగి ప్రస్తావించను. జాతిలోని మిగిలిన వర్గాలకు వ్యతిరేకంగా ఫిబ్రవరి విప్లవపు మూల్యాన్ని చెల్లించవలసివచ్చిన రైతుల ప్రతిచర్యను గురించి, పట్టణానికి విరుద్ధంగా గ్రామపు ప్రతిచర్యను గురించి యిక్కడ చెప్పుకుంటే సరిపోతుంది. దీనికి సైన్యంయొక్క విశేషామోదం లభించింది, "National"కి చెందిన రిపబ్లికన్లు సైన్యానికి గౌరవాన్నిగాని, వేతనవృద్ధినిగాని సమకూర్చకపోవడమే యిందుకు కారణం. బోనపార్ట్‌ను రాజరికానికొక పరివర్తనదశగా పరిగణించి బూర్జువావర్గం అతనికి స్వాగతంచెప్పింది. శ్రామికులూ, పెటీబూర్జువావర్గమూ కవేన్యాక్‌ను దండించినవాడుగా బోనపార్ట్‌కి స్వాగతంచెప్పారు. ఫ్రెంచి విప్లవంపట్ల రైతుల వైఖరిని గురించి తర్వాత నేను మరింత నిశితంగా, వివరంగా పరిశీలిస్తాను.

1848 డిసెంబరు 20కీ – 1849 మేలో రాజ్యాంగ నిర్ణయసభ రద్దవడానికీ మధ్య కాలం బూర్జువా రిపబ్లికన్ల పతనానికి సంబంధించిన చారిత్రక కాలం. బూర్జువా వర్గానికి ఒక రిపబ్లిక్‌ను నెలకొల్పి, విప్లవాత్మక శ్రామికవర్గాన్ని రంగంనుంచి తరిమేసి, ప్రజాస్వామిక పెటీబూర్జువావర్గాన్ని తాత్కాలికంగా నోరుమూయించిన తదుపరి బూర్జువా రిపబ్లికన్లు ఈ రిపబ్లిక్‌ను సముచితంగానే తన ఆస్తిగా పరిగణించిన మొత్తం బూర్జువా వర్గంచేత పక్కకి నెట్టివెయ్యబడ్డారు. కాని, యీ బూర్జువా సమూహం రాజరికవాది. దానికి చెందిన బడా భూస్వాముల విభాగం, పునరుద్ధరణ కాలంలో[25] పాలన సాగించింది, దాని ప్రకారం అది లెజిటిమిస్ట్[26] అయింది. ధనిక ప్రభువులతోను, బడా పారిశ్రామిక వేత్తలతోను కూడిన రెండవ విభాగం జూలై రాజరిక కాలంలో పాలన సాగించిన పర్యవసానంగా ఆర్లియనిస్ట్[78] అయింది. సైన్యానికి, విశ్వవిద్యాలయానికి, చర్చికి, న్యాయ పీఠానికి, అకాడెమీకి, పత్రికలకు చెందిన ఉన్నత పదవుల్లో ఉన్నవాళ్లు, తరతమ సంఖ్యల్లోనే అయినా అటూ యిటూ కానవస్తారు. బూర్బన్ లేక ఆర్లియన్స్ నామధేయాన్ని గాక పెట్టుబడి పేరును

---

* K. Marx, *The Class Struggles in France, 1848 to 1850* (Marx and Engels, *Selected Works*, Vol. 1, Moscow, 1962, పేజీలు 174–76) చూడండి. – సం.

దార్చిన యిక్కడి యీ బూర్జువా రిపబ్లిక్‌లో, తాము సంయుక్తంగా పాలన సాగించగలిగిన రాజ్యయంత్ర రూపాన్ని వారు కనుగొన్నారు. జూన్ తిరుగుబాటు అప్పటికే వారిని ''పార్టీ ఆఫ్ ఆర్డర్''[79]లో సమైక్యంచేసింది. ఇప్పుడిక మొట్టమొదట, జాతీయ సభలో యింకా స్థానాలను ఆక్రమించివున్న, బూర్జువా రిపబ్లికన్ల బృందాన్ని తొలగించడం అవసరం. ప్రజలకు వ్యతిరేకంగా భౌతిక బలప్రయోగాన్ని దుర్వినియోగంచెయ్యడంలో ఈ శుద్ధ రిపబ్లికన్లు ఒకప్పుడు ఎంత పాశవికంగా ప్రవర్తించారో, కార్యనిర్వాహకాధికారానికీ, రాజరికవాదులకూ వ్యతిరేకంగా తమ రిపబ్లికన్ తత్వాన్నీ, తమ శాసనాధికారాలనూ కాపాడుకొనే సమస్య ఎదురైనప్పుడు, అంతే పిరికితనాన్నీ, మృదుభాషిత్వాన్నీ, పలాయన క్రమంలో పోరాడే విషయంలో చేతకానితనాన్నీ ప్రదర్శిస్తున్నారు. వాళ్ల విఘటనకు సంబంధించిన సిగ్గుమాలిన చరిత్రను నేనిక్కడ పేర్కొనాల్సిన అవసరం లేదు. వారు అణగారిపోలేదు. అంతరించిపోయారు. వారి చరిత్ర శాశ్వతంగా ముగిసిపోయింది. తర్వాతి దశలో, జాతీయ సభ లోపలా వెలుపలా కూడా వారు స్మృతులుగా మాత్రమే మిగిలారు. కేవలం రిపబ్లిక్ అన్న పేరు మరల ఒక సమస్యగా ముందుకొచ్చినప్పుడూ, విప్లవాత్మక సంఘర్షణ అత్యంత అధమస్థాయికి దిగజారే ప్రమాదమేర్పడినప్పడల్లా మాత్రమే వాళ్ల స్మృతులు జాగృతమైనట్లు కనిపించేవి. ఈ సందర్భంగా నేనొక విషయం గుర్తుచెయ్యవచ్చుననుకుంటాను. ఏ పత్రిక పేరునైతే యీ పార్టీ స్వీకరించిందో ఆ పత్రిక "National," తదుపరి దశలో, సోషలిజం పక్షం వహించింది.

ఈ దశను గూర్చిన వివేచనను పూర్తిచేసే ముందు సింహావలోకనప్రాయంగా మనమింకా రెండు శక్తులను పరిశీలించాల్సివుంది. అవి రెండూ 1848 డిసెంబరు 20నుండి రాజ్యాంగ నిర్ణయ సభ నిష్క్రమణవరకూ పుస్తె ముడేసుకొన్నట్లే వ్యవహరించినా కూడా, 1851 డిసెంబరు 2న వాటిలో ఒకటి మరొక దాన్ని రూపుమాపిన సంగతి మనం గమనించాల్సివుంది. అవి ఒకవంక లూయీ బోనపార్టు, మరోవంక సంయుక్త రాజరికవాదుల పార్టీ, బడా బూర్జువావర్గపు పార్టీ ఆఫ్ ఆర్డర్ అని మా ఉద్దేశం. అధ్యక్షపదవిని అధిష్ఠించిన తర్వాత, బోనపార్టు వెన్వెంటనే పార్టీ ఆఫ్ ఆర్డర్ మంత్రివర్గాన్ని ఏర్పాటుచేశాడు. దానికి ఎవరిని నాయకుణ్ణి చేశాడో గమనించండి – పార్లమెంటరీ బూర్జువావర్గపు అతి మితవాద పక్షానికి చెందిన పాత నాయకుడు ఒడిలోన్ బర్రోను మంత్రివర్గానికి నాయకుణ్ణి చేశాడు. మంత్రిపదవి పొందాలన్న కోర్కె బర్రో మహాశయుడ్ని 1830నుండి భూతంలా వెంటాడుతోంది. బర్రో విషయంలో ఆ కోర్కె చిట్టచివరకు యిన్నాళ్లకు నెరవేరింది, పైగా, ప్రధాన మంత్రి పదవి. కానైతే, ఆయన ఆశించినట్లు లూయీ ఫిలిప్ క్రింద, పార్లమెంటరీ ప్రతిపక్షంయొక్క అత్యంత పురోగామి నాయకుడుగా కాక, ఒక పార్లమెంటును తుదముట్టించిన కసాయివాడుగా, జెస్యూట్లు, లెజిటిమిస్టుల వంటి తన గర్భశత్రువులందరి జతకాడుగా పదవిలోకి వచ్చాడు. చివరకెలాగైతేనేం వధువుని ఆయన యింటికి తెచ్చాడు, కాని శీలం

కోల్పోయాకనే ఆమెను తెచ్చుకోగలిగాడు. బోనపార్ట్ తనను తాను రంగంనుంచి పూర్తిగా తొలగించుకున్నట్లే కనిపించాడు. ఈ పార్టీయే ఆయన కోసం పనిచేస్తూవచ్చింది.

మంత్రివర్గం ప్రప్రథమ సమావేశమే రోమ్‌పై దండయాత్ర జరపాలని తీర్మానించింది. ఈ దండయాత్ర జాతీయ సభ దృష్టి నాటున నిర్వహింపబడాలనీ, దానినుండే యిందుకు కావలసిన సాధనాలను దొంగసాకులతో చేజిక్కించుకోవాలనీ ఆమోదింపబడింది. ఆ విధంగా వాళ్లు జాతీయ సభను మోసగించడంద్వారాను, విప్లవాత్మక రోమన్ రిపబ్లిక్‌కి వ్యతిరేకంగా, నిరంకుశ విదేశీ ప్రభుత్వాలతో కుట్రచెయ్యడంద్వారానూ తమ కార్యకలాపాలు ప్రారంభించారు. అదే పద్ధతిలో, అదే రకమైన జిత్తులమారి ఎత్తుగడలలో బోనపార్ట్, రాజరికవాద శాసనసభకూ, దాని రాజ్యాంగచట్టబద్ధమైన రిపబ్లిక్‌కూ వ్యతిరేకంగా, డిసెంబరు 2 నాటి తన రాజకీయ కుట్రకి సన్నాహంచేశాడు. 1848 డిసెంబరు 20న ఏ పార్టీ అయితే బోనపార్ట్ మంత్రివర్గాన్ని ఏర్పాటుచేసిందో, 1851 డిసెంబరు 2న ఆ పార్టీకే శాసనసభలో మెజారిటీ వుందన్న విషయం మనం మరచిపోవద్దు.

ఆగస్టులో రాజ్యాంగ నిర్ణయ సభ, రాజ్యాంగచట్టానికి పుష్టినికూర్చే పలు వైధానిక చట్టాలను తయారు చేసి జారీచేసిన తర్వాత మాత్రమే తనను తాను రద్దుచేసుకోవాలని నిర్ణయించుకుంది. 1849 జనవరి 6న పార్టీ ఆఫ్ ఆర్డర్, రాటో అనే ఒక ప్రతినిధిద్వారా, రాజ్యాంగ నిర్ణయ సభ వైధానిక చట్టాలను వదిలిపెట్టేయ్యాలనీ, తద్భిన్నంగా తనను తాను రద్దుచేసుకొంటూ తీర్మానించాలన్న ప్రతిపాదనను చేయించింది. ఒడిలోన్ బర్రో నాయకత్వాన మంత్రివర్గమే కాకుండా, జాతీయ సభలోని రాజరికవాద సభ్యులు యావన్మందీ కూడా రాజ్యాంగ నిర్ణయసభకు, అప్పడిక పరపతి పునరుద్ధరణకు, వ్యవస్థను సుసంఘటితం చెయ్యడానికి, అనంతంగా సాగుతున్న తాత్కాలిక ఏర్పాట్లకు స్వస్తిచెప్పడానికి, నిర్దిష్ట పరిస్థితులను నెలకొల్పడానికీ గాను దాని రద్దు అవసరమని బెదరింపు స్వరాల్లో వక్కాణించి చెప్పారు; నూతన ప్రభుత్వ సృజనాత్మక కార్యకలాపాలకు అని అవరోధంకలిగించిందన్నారు. కేవలం ద్వేషకారణంగా మాత్రమే తన అస్తిత్వాన్ని పొడిగించాలని అది ప్రయత్నిస్తోందన్నారు; దేశం దానితో విసిగివేసారిపోయిందన్నారు. బోనపార్ట్ శాసనాధికారానికి వ్యతిరేకంగా సాగిన యీ దూషణ పరంపరను గమనించాడు, దాన్ని కంఠస్తంచేశాడు, 1851 డిసెంబరు 2న, వారి నుండే తను ఆ పాఠాన్ని నేర్చుకున్నానని పార్లమెంటరీ రాజరికవాదులకు రుజువుచేశాడు. వాళ్ల నినాదాలనే వాళ్లకు వ్యతిరేకంగా అతను వల్లించాడు.

బర్రో మంత్రివర్గమూ, పార్టీ ఆఫ్ ఆర్డరూ మరింత ముందుకెళ్లాయి. వాళ్లు ఫ్రాన్సు నాలుగుమూలలనుంచీ జాతీయ సభకు మహజర్లు పంపబడేలా చూశారు, వాటిలో మర్యాద అయిన మాటల్లో జాతీయ సభ యిక రద్దు కమ్మన్న వినతి యిమిడివుంది. వాళ్ల విధంగా, రాజ్యాంగచట్టబద్ధంగా వ్యవస్థీకృత ప్రజాభీష్ట వ్యక్తీకరణ అయిన జాతీయ

సభకు వ్యతిరేకంగా అసంఘటిత జనాలను పోరాటజ్వాలల్లోకి యీడ్చారు. వాళ్లు బోనపార్ట్‌కి, పార్లమెంటరీ సభలకు వ్యతిరేకంగా విజ్ఞప్తిచెయ్యడాన్ని నేర్పిపెట్టారు. చివరకు, 1849 జనవరి 29న, రాజ్యాంగ నిర్ణయసభ తనను తాను రద్దుచేసుకొనే విషయంలో తుదినిర్ణయం తీసుకునే క్షణం ఆసన్నమైంది. తను ఏ భవనంలోనైతే సమావేశమైందో అది సైన్యం ఆక్రమణలో వున్నట్లు జాతీయ సభ గమనించింది. నేషనల్ గార్డుయొక్క, దేశ సైనిక దళాలయొక్క సర్వసేనాధిపత్యం ఎవరి చేతుల్లో ఏకీకృతం చెయ్యబడిందో ఆ పార్టీ ఆఫ్ ఆర్డర్ జనరల్ అయిన షంగర్నే్య, పెద్ద యుద్ధమేదో ముంచుకురాబోతున్నదన్నట్లు, పారిస్‌లో పెద్ద సైనిక ప్రదర్శన నొకదాన్ని నిర్వహించాడు. సమైక్య రాజరికవాదులు, రాజ్యాంగ నిర్ణయ సభ తనను తాను రద్దుచేసుకోవడానికి విముఖతను ప్రదర్శించినట్లయితే, బలప్రయోగం చెయ్యాల్సివస్తుందని బెదరిస్తూ హెచ్చరిక చేశారు. అందుకు అదీ యిష్టంగానే వుంది, అది బేరం చేసిన అత్యంత స్వల్పమైన అదనపు కాలవ్యవధి మాత్రమే దానికి లభించింది. జనవరి 29 నాటి ఘటనా, 1851 డిసెంబరు 2 నాటి రాజకీయ కుట్రా ఒక్కటే; తేడా అల్లా యీ రాజకీయ కుట్రను రాజరికవాదులు బోనపార్ట్‌తో కలిసి, రిపబ్లికన్ జాతీయ సభకు వ్యతిరేకంగా చేశారు. బోనపార్ట్ 1849 జనవరి 29 ఘటనను వినియోగించుకొని, తుయెలెరీ రాజభవనం ముందు కొన్ని సైనిక దళాలచేత తనకు సైనికాభివందనం చేయించుకొని, పార్లమెంటరీ అధికారానికి వ్యతిరేకంగా సైనిక బలంయొక్క యీ ప్రథమ బహిరంగ ప్రదర్శనను ఆత్రంగా చేజిక్కించుకొని కాలిగులా అవతరణను స్ఫురింపజేశాడు.[80] వాళ్లు తమ షంగర్నే్యను మాత్రమే చూశారనడంలో సందేహం లేదు.

రాజ్యాంగ నిర్ణయసభ అస్తిత్వకాలాన్ని బలవంతంగా త్రుంచివేసేందుకు పార్టీ ఆఫ్ ఆర్డర్ ప్రత్యేకించి ప్రేరేపించినది రాజ్యాంగచట్టానికి అనుబంధంగా, చెయ్యబడబోయే విద్యాచట్టం, మతారాధన చట్టం మొదలైన ప్రాథమిక చట్టాలే. సమైక్య రాజరికవాదుల దృష్టిలో అపనమ్మకస్తులుగా తయారైన రిపబ్లికన్లను ఆ చట్టాలను చెయ్యనివ్వక పోవడం, యీ చట్టాలను స్వయంగా తామే చెయ్యడం మిక్కిలి అవసరం. కానైతే, యీ వైధానిక చట్టాల్లో, రిపబ్లిక్ అధ్యక్షుని బాధ్యతకు సంబంధించిన చట్టం కూడా ఒకటి వుంది. 1851లో శాసనసభ సరిగా అటువంటి చట్టం ముసాయిదాను తయారుచెయ్యడంలో నిమగ్నమై యుంది, అప్పుడు బోనపార్ట్ యీ రాజకీయ కుట్ర జరిగేందుకు ముందే డిసెంబరు 2 నాటి తన రాజకీయ కుట్రను సాగించాడు. సమైక్య రాజరికవాదులకు 1851 నాటి తమ శీతకాల పార్లమెంటరీ ఆందోళన సమయంలో అధ్యక్షుని బాధ్యతా చట్టం అందుబాటులో ఉండి ఉంటే, అందునా అది అపనమ్మకం కలిగిన శత్రు, రిపబ్లికన్ సభ తయారు చేసినదైయుంటే, అందుకు వాళ్లు చెల్లించసిద్ధపడని మూల్యం ఏముంటుంది!

రాజ్యాంగ నిర్ణయసభ తన చిట్టచివరి ఆయుధాన్ని 1849 జనవరి 29న తనే భగ్నం

చేసుకున్నాక, బర్రో మంత్రివర్గమూ, వ్యవస్థ మిత్రులూ దాన్ని చచ్చేదాకా తరిమితరిమి కొట్టారు, దాన్ని అవమానపరచగల పని దేన్నీ చేయకుండా వదల్లేదు, నిర్వీర్యమై, నీరుకారి పోయిన సభచేత గదమాయించి ఎటువంటి చట్టాలు చేయించుకున్నారంటే, ప్రజల దృష్టిలో దానిపట్ల మిగిలిన లేశమాత్రపు గౌరవం సైతం దానితో మటుమాయమైంది. నెపోలియన్ తరహా అధికార స్థిరవాంఛాపూరితుడైన బోనపార్ట్, పార్లమెంటరీ అధికారపు యీ పతనాన్ని సిగ్గుమాలి బాహాటంగా నిస్సంకోచంగా స్వప్రయోజనానికి వినియోగించుకున్నాడు. 1849 మే 8న, సివిటా-వెక్కియాను జనరల్ ఉడినో ఆక్రమించుకొన్నందుకుగాను, జాతీయ సభ మంత్రివర్గాన్ని నిరసిస్తూ ఒక తీర్మానం చేసి, రోమన్ దాడిని దాని పూర్వనిర్దేశిత లక్ష్య సాధనకు ఉన్ముఖంచెయ్యాల్సిందిగా ఆదేశించినప్పుడు,[81] బోనపార్ట్ సరిగా అదే సాయంత్రం "Moniteur"[82]లో జనరల్ ఉడినో పేర ఒక లేఖను ప్రచురించాడు. దానిలో ఉడినోను అతని వీరోచిత కార్యాలకుగాను అభినందించాడు. వివాదాలు రేకెత్తించే పార్లమెంటేరియన్లకు ప్రతిగా, తనను తాను సైన్యపు పరిరక్షకుడుగా ప్రదర్శించుకున్నాడు. దీనిపట్ల రాజరికవాదులు మందహాసం చేశారు. వారు అతన్ని కేవలం మోసంచేస్తున్నట్లు భావించారు. చిట్టచివర, రాజ్యాంగ నిర్ణయసభ అధ్యక్షుడైన మర్రాస్ట్, జాతీయ సభ భద్రత ప్రమాదంలో పడిందని క్షణకాలం పాటు అనిపించి, రాజ్యాంగచట్టం ఆధారంగా, ఒక కలనల్‌ను, అతని రెజిమెంటుతోబాటు రావలసిందిగా ఆదేశించినప్పుడు, ఆ కల్నలు వచ్చేందుకు నిరాకరించాడు; అతను క్రమశిక్షణాసూత్రాలను ఏకరువుపెట్టి మర్రాస్ట్‌ను షంగర్నేృతో మాట్లాడవలసిందిగా చెప్పాడు, షంగర్నే, నాకు "baïonnettes intelligentes"* యిష్టంలేదని చెప్పి మర్రాస్ట్ కోరికను తిరస్కారపూర్వకంగా నిరాకరించాడు. 1851 నవంబరులో, సమైక్య రాజరికవాదులు బోనపార్ట్‌తో నిర్ణయాత్మక పోరాటాన్ని ప్రారంభించాలనుకున్నప్పుడు, వాళ్ళు తమ కుఖ్యాత "క్వెస్టర్స్ బిల్లు"[83]లో జాతీయ సభ అధ్యక్షుడు సేనలను నేరుగా ఆదేశించే సూత్రాన్ని చొప్పించేందుకు ప్రయత్నించారు. వాళ్ల జనరల్సులో ఒకడైన లెఫ్లో ఆ బిల్లుపై సంతకంచేశాడు. షంగర్నే దానికి అనుకూలంగా ఓటుచేశాడు, త్యేర్ అంతకు పూర్వపు రాజ్యాంగ నిర్ణయసభయొక్క దూరదృష్టితో కూడిన వివేకాన్ని ప్రశంసించాడు, కాని యిదంతా వృథాయే అయింది. యుద్ధమంత్రి సెంట్-అర్నో, షంగర్నే మర్రాస్ట్‌కిచ్చిన లాంటి జవాబునే యిచ్చాడు — పోతే దానికి మహీధరం పార్టీ సభ్యులు కరతాళధ్వనులు చేశారు!

ఆ విధంగా పార్టీ ఆఫ్ ఆర్డర్ తానింకా జాతీయ సభ కానప్పుడూ, తానింకా మంత్రి మండలి మాత్రమే అయినప్పుడూ, స్వయంగా తనే పార్లమెంటరీ వ్యవస్థను ఖండించింది.

---

* ఆలోచించగల బయనెట్లు. — సం.

1851 డిసెంబరు 2 నాటి రాజకీయ కుట్ర ఫ్రాన్సునుండి దానిని వెళ్లగొట్టినప్పుడు మళ్లీ అదే గోలపెట్టనారంభించింది!

దాని ప్రయాణం సుఖప్రదం కావాలని ఆకాంక్షిస్తున్నాం!

III

1849 మే 28న శాసన నిర్ణయ జాతీయ సభ సమావేశమైంది. 1851 డిసెంబరు 2న అది చెదరగొట్టబడింది. ఈ మధ్య కాలమే రాజ్యాంగచట్టబద్ధమైన, లేక పార్లమెంటరీ, రిపబ్లిక్ అస్తిత్వ దశ.

ప్రథమ ఫ్రెంచి విప్లవంలో కాన్‌స్టిట్యూషనలిస్టుల పాలన తదుపరి జిరోండిస్టుల పాలనా, జిరోండిస్టుల పాలన తర్వాత జాకొబిన్ల[84] పాలనా వచ్చాయి. వీటిలో ప్రతి ఒక పార్టీ తనకన్న ప్రగతిశీలమైన పార్టీ తోడ్పాటుపై ఆధారపడుతూవచ్చింది. అది, తానిక ముందుకు తీసుకువెళ్లలేని హద్దువరకు విప్లవాన్ని తీసుకువెళ్లగానే (అంతకన్న ముందుకు వెళ్లే మాట అటుంచి), దాని వెనుకనున్న మరింత సాహసికమైన దాని సహచర పార్టీచేత అది నెట్టి వెయ్యబడి, గిలటిన్*కి పంపబడుతూ వచ్చింది. విప్లవం ఆ విధంగా పైపైకే పోతూవచ్చింది.

1848 నాటి విప్లవం విషయంలో పరిస్థితి యిందుకు భిన్నం. శ్రామికవర్గ పార్టీ పెటీబూర్జువా డెమోక్రటిక్ పార్టీకి తోకలా ముందుకు వచ్చింది. ఏప్రిల్ 16న,[85] మే 15న,[64] జూన్ రోజుల్లోనూ పెటీబూర్జువా డెమోక్రటిక్ పార్టీచేత మోసగింపబడి, నెట్టెయ్యబడింది, శ్రామికవర్గ పార్టీ తిరిగి, బూర్జువా రిపబ్లికన్ పార్టీ భుజాలపై ఆధారపడింది. బూర్జువా రిపబ్లికన్లకు తాము గట్టిగా నిలదొక్కుకున్నామన్న నమ్మకం చిక్కగానే యిబ్బందికరమైన తమ సహచరుణ్ణి త్రోసివేసి, పార్టీ ఆఫ్ ఆర్డర్ భుజాలను వాళ్లు ఆసరాగా చేసుకుంటారు. పార్టీ ఆఫ్ ఆర్డర్ తన భుజాలను విదిలించి, బూర్జువా రిపబ్లికన్లను క్రిందకు పడదోసి, తను వెళ్లి సైన్యం భుజాల పైకి ఎక్కుతుంది. అది తనింకా సైన్యం భుజాలపై ఉన్నానని భ్రమిస్తూండగా, ఒకానొక శుభోదయాన, ఆ భుజాలు బయనెట్లుగా మారిపోయినట్లు గ్రహిస్తుంది. ప్రతి ఒక పార్టీ తనను వెన్నంటి వస్తున్న పార్టీని తన్నుతూ, తన ముందున్న పార్టీపై ఆధారపడుతూ వుంటుంది, అది దీన్ని వెనక్కి నెట్టుతూవుంటుంది. ఇటువంటి హాస్యాస్పదమైన భంగిమలో, అది పట్టుతప్పి, చిత్రవిచిత్రమైన నాట్యవిన్యాసాలు జరిపి, చివరకు బోర్లబొక్కలా పడుతుంది. విప్లవం ఆ విధంగా దిగజారుడు పద్ధతిలో

* ఫ్రెంచి విప్లవ కాలంలో వాడబడిన శిరచ్ఛేదక యంత్రం. — సం.

సాగుతుంది. ఫిబ్రవరికి చెందిన చిట్టచివరి బ్యారికేడు తొలగింపబడేందుకూ, తొలి విప్లవ ప్రభుత్వం నెలకొల్పబడేందుకూ ముందు విప్లవం యిలా తిరోగతిలో వుంది.

మన ఎదుటవున్న దశ అత్యంత సంకీర్ణమైన పరమ వైరుధ్యాల కలగూరగంప: ఇందులో రాజ్యాంగచట్టానికి విరుద్ధంగా బాహాటంగా కుట్రచేసే కాన్‌స్టిట్యూషనలిస్టులు, పరమ రాజ్యాంగచట్టబద్ధులుగా వుండే విప్లవవాదులున్నారు; సర్వంసహాధికారం కలిగి వుండాలని కోరుకొంటూ సదా పార్లమెంటరీ పద్ధతిలో ఉండి పోవాలనుకునే జాతీయ సభ ఒకటి వుంది; ఓరిమితో ఉండటమే పనిగా పెట్టుకొని, తన ప్రస్తుత పరాజయాలను భవిష్యత్తులో తనకు ఒనగూడబోయే విజయాలతో ఎదుర్కోవాలని చూసే మహీధరం పార్టీ ఒకటుంది; రిపబ్లిక్‌యొక్క patres conscripti* అయిన రాజరికవాదులున్నారు, పరిస్థితుల ప్రాబల్యంవల్ల, వేటికైతే తాము అంటిపెట్టుకొని వున్నారో ఆ శత్రురాజవంశాలను ఫ్రాన్సు వెలుపలా, తాము దేన్నైతే ద్వేషిస్తారో ఆ రిపబ్లిక్‌ను ఫ్రాన్సులోనూ ఉంచాలని వీరు కోరుతారు; తన బలహీనతే తన బలంగా కలిగిన కార్యనిర్వాహకాధికారం వుంది, తను రేకెత్తించే అసహ్యంలోనే యిది తన గౌరవనీయతను వెదుక్కొంటుంది; సామ్రాజ్యపు ముద్ర వేసుకుని రెండు రాజరికాల, అర్థాత్తూ పునరుద్ధరణయొక్క, జూలై రాజరికం[63]యొక్క సంయుక్త అపకీర్తి మినహా మరేదీ కాని ఒక రిపబ్లిక్ ఉంది — అవెలాంటి పొత్తులంటే వాటి మొదటి షరతే వేర్పాటు; వేటియొక్క మొట్టమొదటి నియమమే అనిశ్చితత్వమో అటువంటి పోరాటాలున్నాయి; శాంతి పేర విశృంఖలమూ, అర్థరహితమూ అయిన ఆందోళనా, విప్లవం పేర శాంతికి సంబంధించిన మిక్కిలి గంభీరమైన ఉపదేశాలూ సాగాయి; సత్యశూన్యమైన ఆవేశాలున్నాయి, ఆవేశరహితమైన సత్యాలున్నాయి; వీరులైతే ఉన్నారుగాని వీరోచిత కార్యాలు శూన్యం, చరిత్ర అయితే ఉందిగాని చరిత్రాత్మక ఘటనలు పూజ్యం; దేని ఏకమాత్ర చోదకశక్తి కేలెండరులా కనిపిస్తుందో అటువంటి, నిరంతరాయంగా పునరావృతమయ్యే ఉద్రిక్తతలతోను, వెసులుబాట్లతోను నిస్త్రాణమైన అభివృద్ధి వుంది; దఫదఫాలుగా శిఖర స్థాయికి చేరుకొంటున్నట్లు కనిపించి అంతలోనే తమ నైశిత్యాన్ని కోల్పోయి, తమను తాము పరిష్కరించుకోలేక చప్పబడిపోయే శత్రు వైరుధ్యాలున్నాయి; గర్వంగా ఆడంబరంగా జరిపే కార్యకలాపాలు, ప్రపంచ వినాశ ప్రమాదంపట్ల క్షుద్ర భయోత్పాతం, అదే సమయంలో ప్రపంచ ఉద్ధారకులు చేసిన క్షుద్రాతిక్షుద్ర కుతంత్రాలు, రాజ దర్బారీ ప్రహసనాలు, — వీరు తమ laisser aller** స్వాతంత్ర్యంతో ప్రపంచ వినాశప్రమాదం గురించి కన్న ఫ్రాండ్[86] కాలాన్ని గురించి ఎక్కువగా గుర్తుచేస్తారు — ఫ్రాన్సుయొక్క ఆధికారిక సామూహిక

---

* సెనేటర్లు. — సం.

** అన్నింటినీ వాటి మానాన వాటిని జరగనివ్వడం. — సం.

ప్రతిభ ఒక్క వ్యక్తియొక్క జిత్తులమారి మూర్ఖత్వంచేత నిశ్శేషంచెయ్యబడింది; జాతియొక్క సామూహిక యిచ్ఛ — సార్వజనిక ఓటింగు ద్వారా తరచుగా వ్యక్తమయ్యేది — సముచిత వ్యక్తీకరణ జనసామాన్యపు ఘోర శత్రువుల ద్వారా జరగడం, అందునా చివరకు అది ఒకానొక దుస్సాహసికుని మనోభీష్టంలో వ్యక్తం కావడం. చరిత్రయొక్క ఏ భాగానికైనా నలుపుపై నలుపు పులమబడిందంటే అది దీనికే. వ్యక్తులూ, ఘటనలూ తల క్రిందులుచెయ్యబడిన ష్లెమిళ్ల* లాగా, మాయంచెయ్యబడిన తమ శరీరాల ఛాయల మాదిరిగా కనిపిస్తారు. విప్లవం స్వయంగా స్వపక్షీయులను స్తంభింపచేసి, తన ప్రత్యర్థులకు మాత్రమే ఆవేశపూరితమైన శక్తిని నింపుతుంది. విప్లవ ప్రతీఘాతకులు అదే పనిగా ఆవాహనచేసి అదలించివేస్తూవచ్చిన "ఎర్ర భూతం" చిట్టచివరకు అవతరించింది, కానైతే అది, తన శిరస్సుపై అరాజకత అనే ఫ్రిగ్గియన్ టోపీ[87]తో కాక, ఆర్డర్ యూనిఫారంతో, ఎర్ర లాగులలో అవతరించింది.

తన పదవీ స్వీకార దినమైన 1848 డిసెంబరు 20న నెపోలియన్ ఏర్పాటుచేసినది పార్టీ ఆఫ్ ఆర్డర్‌యొక్క, లెజిటిమిస్టు ఆర్లియనిస్టు సంకీర్ణ మంత్రివర్గమన్న సంగతిని మనమింతకుముందు చూశాం. ఈ బర్రో-ఫల్లూ మంత్రివర్గం, దేని అస్తిత్వాన్నైతే కొంచెం యించుమించులో తను బలవంతంగా తుదముట్టించిందో ఆ రిపబ్లికన్ రాజ్యాంగ నిర్ణయసభ తర్వాత సైతం అస్తిత్వంలో ఉంది, అప్పుడు కూడా అది కర్ణధారి స్థితిలో కొనసాగింది. సమైక్య రాజరికవాదుల జనరల్ అయిన షంగర్న్యే మొదటి సైనిక డివిజనుకీ, పారిస్ నేషనల్ గార్డుకీ కూడా సర్వసేనాధిపతిగా వున్నాడు. చిట్టచివరకు, సార్వజనిక ఎన్నికల్లో పార్టీ ఆఫ్ ఆర్డర్ జాతీయ అసెంబ్లీలో మెజారిటీని సమకూర్చుకుంది. ఇక్కడ, లూయీ ఫిలిప్ అనుయాయులైన — ఎన్నికైన ప్రతినిధులకు, ప్రభువులకు లెజిటిమిస్టుల గౌరవనీయ బృందం ఒకటి — వీరి విషయంలో జాతియొక్క అనేక ఓట్లు రాజకీయ రంగప్రవేశానికి అనుమతి పత్రాలయ్యాయి — తారసపడింది. బోనపార్ట్‌ను అనుసరించే ప్రజా ప్రతినిధులు స్వతంత్రమైన పార్లమెంటరీ పార్టీని ఏర్పాటు చెయ్యజాలనంతటి అత్యల్ప సంఖ్యలో వున్నారు. వారు కేవలం పార్టీ ఆఫ్ ఆర్డర్‌యొక్క mauvaise queue**గా అవతరించారు. ఆ విధంగా యావత్తు ప్రభుత్వాధికారమూ, సైన్యమూ, శాసన నిర్ణయ సంస్థా, ఒక్క మాటలో యావత్తు రాజ్యాధికారమూ పార్టీ ఆఫ్ ఆర్డర్ వశంలోకి వచ్చాయి; దాని పాలనను ప్రజాభీష్టానికి అనుగుణమైనదిగా కనుపింపజేసిన సార్వజనిక ఎన్నికల్లో దాని విజయమూ, అదే

---

* ష్లెమిల్, పీటర్ — షమిస్సో రాసిన "పీటర్ ష్లెమిల్ అద్భుత కథ"లో ఒక పాత్ర. అతను తన ఛాయను ఇంద్రజాలిక డబ్బుసంచికి మార్పిడి చేసుకున్నాడు. — సం.

** కుటిలమైన తోక. — సం.

సమయంలో యూరప్ ఖండమంతటా విప్లవప్రతీఘాత విజయమూ పార్టీ ఆఫ్ ఆర్డరుకి నైతికబలాన్ని చేకూర్చాయి.

ఇంతకన్న అధికతర సాధనసంపత్తితో, ఇంతకన్న అధికతర అనుకూల పరిస్థితులలో ఎన్నడూ మరే పార్టీ తన ఉద్యమాన్ని ప్రారంభించలేదు.

విచ్ఛిత్తికి గురైన శుద్ధ రిపబ్లికన్లు శాసన నిర్ణయ జాతీయ సభలో ఆఫ్రికన్ జనరల్సు అయిన కవేన్యాక్, లమోరిస్యేర్, బెడోల నాయకత్వాన,[61] కేవలం 50 మంది సభ్యులతో కూడిన ఓ చిన్న ముఠాగా దిగజారారు. తద్విరుద్ధంగా, మహీధరం పార్టీ గొప్ప ప్రతిపక్ష పార్టీ పాత్రను వహించింది. సోషల్-డెమోక్రటిక్ పార్టీ తనకు తనే యీ పేరుతో పార్లమెంటరీ నామకరణోత్సవం జరుపుకుంది. జాతీయ అసెంబ్లీలోని 750 సీట్లలోనూ యీ పార్టీకి 200కి పైగా సీట్లున్నాయి. పర్యవసానంగా దానికి దాన్నిగా తీసుకున్నప్పుడు, పార్టీ ఆఫ్ ఆర్డరుకి చెందిన మూడు పక్షాలలో ఏ ఒక్క దానికీ బలంలో కనీసం తీసిపోని పరిస్థితిలో వుంది. మొత్తం సంకీర్ణ రాజరిక బృందంతో పోల్చినప్పుడు సంఖ్యరీత్యా దాని బలహీనత ప్రత్యేక పరిస్థితుల కారణంగా పూరింపబడినట్లు కనిపిస్తుంది. జిల్లాలకు జరిగిన ఎన్నికలలో ఫలితాలు గ్రామీణ జనాభాలో గణనీయమైన అనుచరులను అది సంపాదించుకున్నట్లు రుజువు చేశాయి. అంతేగాక, పారిస్‌నుండి ఎన్నికైన ప్రతినిధులందరూ కూడా దాని పక్షాననే చేరారు. ముగ్గురు నాన్‌కమిషన్డ్ ఆఫీసర్లను ఎన్నుకోవడంద్వారా సైన్యం కూడా తన ప్రజాతంత్ర విశ్వాసాన్ని ప్రకటించుకుంది. మహీధరం పార్టీ నాయకుడైన లెద్ర్యూ-రోలిన్, అయిదు జిల్లాలచేత పార్లమెంటరీ ప్రభువుల సభ సభ్యుడుగా ఎన్నుకోబడ్డాడు, ఇందుకుగాను ఆ అయిదు జిల్లాలూ తమ ఓట్లన్నింటినీ జతచేశాయి. పార్టీ ఆఫ్ ఆర్డర్ ప్రతినిధుల్లో ఏ ఒక్కరికీ యిటువంటి విశిష్టత దక్కలేదు. రాజరికవాదులు తమమధ్య తామూ, మొత్తం పార్టీ ఆఫ్ ఆర్డర్ బోనపార్ట్‌తోనూ ఘర్షణపడటం అనివార్యమైన దృష్ట్యా, 1849 మే 28న, సకల విజయావకాశాలూ మహీధరం పార్టీ ముందున్నట్లు కనిపించింది. అటువంటిదల్లా ఒక్క 15 రోజుల తరువాత అది గౌరవంతోబాటు, సర్వస్వం కోల్పోయింది.

పార్లమెంటరీ చరిత్ర వివేచనను కొనసాగించేందుకు ముందు, మన ఎదుటవున్న మొత్తం దశయొక్క స్వభావాన్ని గురించి సామాన్యంగా ప్రచలితంగా వున్న దురభిప్రాయాలను తొలగించడానికిగాను కొన్ని విషయాలను ప్రస్తావించడం అవసరం. డెమోక్రట్ల దృష్టితో చూసినప్పుడు, రాజ్యాంగ నిర్ణయసభ కాలం దేనితో సంబంధితమై వుందో శాసన నిర్ణయ జాతీయ సభ కూడ సరిగా దానితోనే: అంటే, రిపబ్లికన్లకూ రాజరికవాదులకూ మధ్య సీధా సాదా ఘర్షణతో సంబంధితమైవుంది. కానైతే, ఆందోళనోద్యమ సారాంశాన్ని వాళ్ళు "అభివృద్ధి నిరోధకత్వం" — అనే ఒక్క మాటలో క్రోడీకరించారు: రాత్రివేళ ప్రతి పిల్లీ

నల్లగానే కనిపిస్తుంది, వాళ్లందరూ కూడా రాత్రి కాపలావాని లొల్లాయిపదాలను వల్లించడాన్ని అది సాధ్యం చేస్తుంది. నిజమే, మొదటి చూపులకి పార్టీ ఆఫ్ ఆర్డరులో విభిన్న రాజరిక పక్షాలున్నట్లు కానవస్తుంది. వాటిలో ప్రతి ఒక్కటీ రెండో దానిపై కుట్రచెయ్యడమే కాకుండా — ప్రతి ముఠా తన సొంత సింహాసన వారసుడిని గద్దెపైన ఎక్కించడానికి ప్రయత్నిస్తూ ప్రత్యర్థి పక్షానికి చెందిన వారసుడిని తొలగించడానికి ప్రయత్నించడమే కాకుండా — ఆ పక్షాలన్నీ కూడా "రిపబ్లిక్"పట్ల ఉమ్మడిగా ద్వేషాన్ని ప్రదర్శించడంలోను, దానిపైన ఉమ్మడి దాడులు జరపడంలోను సమైక్య మవుతాయి. ఈ రాజరికవాద కుట్రకు ప్రతిగా, మహీధరం పార్టీ మాత్రం, "రిపబ్లిక్"యొక్క ప్రతినిధిగా కనిపిస్తుంది. పార్టీ ఆఫ్ ఆర్డర్ నిరంతరాయంగా "అభివృద్ధి నిరోధకత్వం"లో నిమగ్నమైయున్నట్లూ, సభా పత్రికాది స్వేచ్ఛలకు వ్యతిరేకంగా ఉన్ముఖమైనట్లూ కనిపిస్తుంది. ఈ పనిని అది ప్రష్యాలో మాదిరిగానే చేస్తోంది, ప్రష్యాలో మాదిరిగానే, నిరంకుశాధికారవర్గ, సాయుధ పోలీసు బలగాల, కోర్టుల యొక్క పాశవిక పోలీసు జోక్యం రూపంలోనే సాగిస్తోంది. మరో వంక "మహీధరం పార్టీ" కూడా అలాగే, యీ దాడులను తిప్పికొట్టడంలోను, ఆ విధంగా "మానవుల శాశ్వత హక్కులను," కొంచెం యించుమించులో, ఒకటిన్నర శతాబ్దాలుగా, ప్రజల పార్టీ అనబడేది ప్రతీదీ చేసినట్లే పరిరక్షించడంలోను నిరంతరాయంగా నిమగ్నమైయుంది. కాని, పరిస్థితినీ, పార్టీలనూ కనుక మరింత సన్నిహితంగా పరిశీలించినట్లయితే, వర్గపోరాటాన్నీ, యీ దశకు సంబంధించిన విలక్షణ ఆకృతినీ కప్పివున్న పైతెర అదృశ్యమవుతుంది.

మేము యింతకు ముందే చెప్పినట్లు లెజిటిమిస్టులు, ఆర్లియనిస్టులు పార్టీ ఆఫ్ ఆర్డర్‌కు చెందిన రెండు పెద్ద పక్షాలు. ఈ రెండు పక్షాలనూ తమతమ సింహాసన వారసులకు గాఢంగా అనుబంధించివుంచినదీ, ఒకదానినుండి మరొకదాన్ని దూరంగా ఉంచినదీ కేవలం లిల్లీ,[88] త్రివర్ణ పతాకం, బూర్బన్, ఆర్లియన్స్ రాజవంశాలూ, రాజరికవాదంలో భిన్నతత్వాలేనా? అసలది రాజరికవాదంలో విశ్వాసమేనా? బూర్బన్ల రాజ్యకాలంలో, తన మతగురువులద్వారా తైనాతీలద్వారా పాలించినది బడా భూస్వాములు; ఆర్లియన్సు రాజ్యకాలంలో తన లాయర్లు ప్రొఫెసర్లు, మృదుభాషులైన వక్తల మందీమార్బలం ద్వారా పాలన సాగించినది ధనిక ప్రభువర్గం, భారీ పరిశ్రమ, భారీ వ్యాపారం, అంటే పెట్టుబడి. జూలై రాజరికం బూర్జువా నడమంత్రపు శ్రీమంతుల అక్రమార్జిత పాలనయొక్క రాజకీయ వ్యక్తీకరణ మాత్రమే అయినట్లుగానే, లెజిటిమేట్ రాజరికం కేవలం భూస్వాముల వంశ పారంపరిక పాలనయొక్క రాజకీయ వ్యక్తీకరణ మాత్రమే. అందుచేత, యీ రెండు పక్షాలనూ వేరుగా ఉంచినది, సూత్రాలవంటివేమీ కాదు, వాటి భౌతిక అస్తిత్వపరిస్థితులు, రెండు భిన్న రకాల ఆస్తి, పట్టణ ప్రాంతానికీ గ్రామీణ ప్రాంతానికీ మధ్యవున్న పాత వైరుధ్యం, పెట్టుబడికీ భూరూప ఆస్తికీ మధ్యవున్న ప్రత్యర్థిత్వమే అలా వేరుగా ఉంచినది. అదే సమయంలో పాత

స్మృతులు, వ్యక్తిగత శత్రుత్వాలు, భయాలు, ఆశలు, పక్షపాతాలు, భ్రమలు, యిష్టాయిష్టాలు, దృఢ విశ్వాసాలు, సిద్ధాంతాలూ సూత్రాలూ వాటిని ఒక రాజవంశానికో మరో రాజవంశానికో అనుబంధించి ఉంచాయన్న విషయాన్ని ఎవరు కాదనగలరు? భిన్న ఆస్తిరూపాల పైనా, అస్తిత్వానికి సంబంధించిన సామాజిక పరిస్థితుల పైనా విలక్షణంగా విశిష్టంగా రూపొందింపబడిన ఆవేశాలు, భ్రమలు, ఆలోచనా పద్ధతులు, జీవితదృక్పథాలతో కూడిన ఒక పూర్తి ఉపరినిర్మాణం లేస్తుంది. మొత్తం వర్గం తన భౌతిక పరిస్థితులనుండి, తదనుగుణమైన సామాజిక సంబంధాలలోనుండి వాటిని సృష్టిస్తుంది, రూపొందిస్తుంది. సంప్రదాయసిద్ధంగాను, పెంపకంద్వారాను వాటిని పొందే విడివ్యక్తి తన కార్యకలాపాలకు అవే వాస్తవ ప్రేరకాలనీ, ప్రారంభబిందువనీ ఊహించవచ్చు. ఆర్లియనిస్టులూ లెజిటిమిస్టులూ, వాటిలో ప్రతి ఒక పక్షమూ తనను తానూ, రెండవ పక్షాన్నీ తమ రెండు రాజవంశాలపట్లా తమకు తమకుగల విధేయతే తమను వేరుచేసిన అంశమని విశ్వసింపచెయ్య ప్రయత్నించినప్పటికీ, ఆ రెండు రాజవంశాలనూ ఏకంకాకుండా ఉంచినది వాటి వేర్వేరు ప్రయోజనాలేనన్న సంగతిని వాస్తవాలు తర్వాత నిరూపించాయి. రోజువారీ జీవితంలో ఏ విధంగానైతే మనిషి ఏమి ఆలోచిస్తున్నాడు, తనను గురించి తను ఏమి చెప్తున్నాడు, వాస్తవంలో అతను ఎలాంటి మనిషి, ఏం చేస్తున్నాడు అన్న వాటిని మనం విడదీసి ఎలా చూస్తామో, అదే విధంగా చారిత్రక పోరాటాల్లో కూడా, పార్టీలయొక్క మాటలకూ సంకల్పాలకూ, వాటి నిజమైన స్వభావానికీ, వాటి వాస్తవ ప్రయోజనాలకూ, తమను గూర్చి అవి ఏమనుకుంటున్నాయి, వాస్తవానికి అవి ఎలాంటివి అన్న వాటిని కూడా మనం మరింతగా బేరీజువేసి చూడాల్సివుంది. రిపబ్లిక్‌లో ఆర్లియనిస్టులూ, లెజిటిమిస్టులూ ఒకరి సరసన మరొకరు, సమానమైన హక్కుదారులుగా నిలబడ్డారు. ప్రతి ఒక పక్షమూ రెండవ దానికి విరుద్ధంగా తన <u>సొంత</u> రాజవంశ <u>పునరుద్ధరణను</u> కోరుకున్నదంటే, దాని అర్థం కేవలం, <u>బూర్జువావర్గం రెండు పెద్ద ప్రయోజనాలుగా — భూరూప ఆస్తిగానూ, పెట్టుబడిగానూ — విడిపోయిందనీ,</u> వాటిలో ప్రతి ఒకటీ తన ఫైనాన్షల్ సర్వాధిపత్యాన్నీ, తనకు రెండవదాని లొంగుబాటునూ కోరుకుంటున్నదని మాత్రమే. బూర్జువా వర్గపు రెండు ప్రయోజనాలని మేమెందుకు చెప్తున్నామంటే, ఆధునిక సమాజాభివృద్ధి కారణంగా, బడా భూ రూప ఆస్తి తన ఫ్యూడల్ విలాస ప్రయత్నం, జాత్యహంకారం మాట ఎలా వున్నా, పూర్తిగా బూర్జువాగా మారింది. ఇంగ్లండులో టోరీలు,[89] యీ విధంగానే, దీర్ఘకాలం పాటు తాము రాజరికంపట్ల, చర్చిపట్ల, పురాతన ఆంగ్లేయ రాజ్యాంగ చట్టపు సొగసులపట్లా అనురక్తులమని ఊహిస్తూవచ్చారు, చిట్టచివరకు ప్రమాదఘడియ తోసుకొచ్చే సరికి, తమ అనురక్తి <u>భూమికౌలు</u> పైన మాత్రమేనన్న ఒప్పుకోలు వారినుంచి ఊడిపడింది.

సమైక్య రాజరికవాదులు ఒకరికి వ్యతిరేకంగా మరొకరు అన్నిచోట్లా — పత్రికల్లోను,

ఎమ్స్‌లోను, క్లెర్‌మోంట్[90]లోను, పార్లమెంటు వెలుపలా — కుట్రలు సాగించారు. తెరవెనుక వారు తమ పాత ఆర్లియనిస్టు, లెజిటిమిస్టు రాజవంశీయ దుస్తులను తిరిగి ధరించి, మరో మారు తమ పాత మల్లయుద్ధాల్లో నిమగ్నులయ్యారు. కాని బహిరంగ వేదికపైన, భవ్య రాజకీయ అభినయాలలో మాత్రం ఒక గొప్ప రాజకీయ పార్టీగా, తమతమ రాజవంశాల ప్రసక్తిని పక్కన పెట్టేసి కేవలం వంగివంగి నమస్కారాలు చేసుకొంటూ, రాజరిక పునరుద్ధరణను ad infinitum* వాయిదా వేస్తూంటారు. వాళ్లు తమ అసలు వ్యవహారాలను పార్టీ ఆఫ్ ఆర్డరుగా, అంటే, రాజకీయమైన పేరుతో కాక, సాంఘికమైన పేరుతో సాగిస్తారు; విలాసంగా తిరిగే రాజకుమారుల వెంటవుండే వీరుల మాదిరిగా కాకుండా బూర్జువా ప్రపంచ వ్యవస్థ ప్రతినిధులుగా వారీ పని చేస్తారు. రిపబ్లికన్లకు వ్యతిరేకంగా రాజరికవాదులవలె కాక యితర వర్గాలకు వ్యతిరేకంగా బూర్జువావర్గంవలె సాగిస్తారు. పోతే, పార్టీ ఆఫ్ ఆర్డర్‌గా వారు సమాజంలోని యితర వర్గాలపై పునరుద్ధరణ కాలంలో గాని, జూలై రాజరికం కాలంలో గాని వెనక ఎన్నడు సాగించిన దానికన్న ఎక్కువ నిరంకుశమైన, కఠినమైన పెత్తనాన్ని చలాయించారు. మొత్తంమీద యిటువంటి పెత్తనం పార్లమెంటరీ రిపబ్లిక్‌లో మాత్రమే సాధ్యం, ఎందుకంటే యీ రూపంలో మాత్రమే ఫ్రెంచి బూర్జువావర్గానికి చెందిన రెండు పెద్ద విభాగాలు సమైక్యం కాగలుగుతాయి, తద్వారా విశేషాధికారాలు కలిగిన ఒక పక్షంయొక్క పాలనకు బదులు తమ వర్గపాలనను అమలు జరపగలుగుతాయి. పార్టీ ఆఫ్ ఆర్డరుగా సైతం వారు రిపబ్లిక్‌ను అవమానించారు, దాని పట్ల తమ అసహ్యాన్ని ప్రకటించారు, అయితే కేవలం రాజరికవాద స్మృతులే అందుకు కారణం కాదు. సహజజ్ఞానం వారికొక విషయాన్ని నేర్పింది. అదేమిటంటే, నిజంగానే రిపబ్లిక్ వారికి పూర్తి రాజకీయ పాలనను సమకూర్చింది, కాని అదే సమయంలో అది వారి సాంఘిక పునాదిని తొలిచివేస్తోంది. ఎందుకంటే, రాజుయొక్క అస్తిత్వం సమకూర్చే తెరమరుగు లేకుండా, ఒకవంక తమమధ్య తామూ, మరోవంక రాజరికంతోనూ తాము సాగించే అప్రధాన ఉపపోరాటాల ద్వారా జాతీయ ప్రయోజనాన్ని పక్కదోవ పట్టించడానికి వీల్లేకుండా వారిప్పుడు తమ అధీనవర్గాలను నేరుగా ఎదుర్కొని, తైనాతీలు లేకుండా వారితో పోరాడాల్సివుంటుంది. బలహీనతే తమ సొంత వర్గపాలనకు సంబంధించిన శుద్ధ రూపం నుంచి వారు వెనక్కితగ్గేందుకూ, అంతకు పూర్వపు మరింత అసమగ్రమైన, అంతగా అభివృద్ధిచెందని — సరిగా ఆ కారణంగానే యీ పాలనయొక్క తక్కువ ప్రమాదకరమైన — పాలనారూపాల కోసం వారు తపించేలా చేసింది. మరో వంక, సమైక్య రాజరికవాదులకు తమతో తలపడే సింహాసన వారసునితో, అంటే బోనపార్ట్‌తో, ఘర్షణ సంభవించినప్పుడు

---

* అనంతకాలం దాకా. — సం.

ప్రతిసారీ, తమ పార్లమెంటరీ సర్వశక్తిమత్వం కార్యనిర్వాహక అధికారం చేతిలో ప్రమాదానికి గురైందనుకున్న ప్రతిసారీ, తత్కారణంగా తమ పాలనకు రాజకీయ అధికారాన్ని రుజువు చేసుకోవలసివచ్చిన ప్రతిసారీ, వారు రాజరికవాదులుగా కాక రిపబ్లికన్లుగా ముందుకొస్తారు. రిపబ్లిక్ తమను అతి తక్కువగానే చీలుస్తుందని జాతీయ సభకు హామీ యిచ్చిన ఆర్లియనిస్టు త్యేర్‌నుండి, 1851 డిసెంబరు 2వ,[46] మువ్వన్నెల స్కార్ఫును ధరించిన ప్రజా ప్రతినిధిగా పదవ మండలానికి చెందిన పురమందిరం ముందు గుమికూడిన జనాన్ని ఉద్దేశించి రిపబ్లిక్ పేర గంభీరోపన్యాసం దంచిన లెజిటిమిస్టు బెర్యే వరకు అందరి పైనా యీ ప్రభావం వుంది. ఈ ఉపన్యాసానికి బదులుగా అతని నోట "ఐదవ హెన్రీ! ఐదవ హెన్రీ!" అన్న ప్రతిధ్వని బయల్వెడలే మాట నిజమే ననుకోండి.

సమైక్య బూర్జువావర్గానికి వ్యతిరేకంగా పెటీబూర్జువాలకూ కార్మికులకూ మధ్య ఒక ఐక్యసంఘటన — సోషల్-డెమోక్రటిక్ పార్టీ అనబడేది ఏర్పాటుచెయ్యబడింది. పెటీబూర్జువాలు, 1848 జూన్ రోజుల తర్వాత తాము సముచితంగా బహూకరింపబడలేదనీ, తమ భౌతిక ప్రయోజనాలు ప్రమాదంలో పడ్డాయనీ, ఈ ప్రయోజనాల అమలును సునిశ్చితం చేసే ప్రజాతంత్ర హామీలను ప్రతీఘాత విప్లవం సవాలు చేస్తున్నదనీ గుర్తించారు. అందుకని వారు కార్మికులకు సన్నిహితులయ్యారు. మరోవంక, పార్లమెంటులో వారికి ప్రాతినిధ్యం వహించే మహీధరం పార్టీ, బూర్జువా రిపబ్లికన్ల నియంతృత్వ కాలంలో పక్కకి నెట్టివెయ్యబడి, రాజ్యాంగ నిర్ణయసభ కాలపు ఉత్తర భాగంలో బోనపార్ట్‌తోను, రాజరికవాద మంత్రులతోను తన పోరాటం ద్వారా, ప్రజల్లో తను కోల్పోయిన పలుకుబడిని తిరిగి సంపాదించుకుంది. మహీధరం పార్టీ సోషలిస్టు నాయకులతో పొత్తు కుదుర్చుకుంది. 1849 ఫిబ్రవరిలో విందులద్వారా యీ పునర్మిలనం స్థిరపరచబడింది. ఒక సంయుక్త ముసాయిదా కార్యక్రమం తయారుచెయ్యబడింది. సంయుక్త ఎన్నికల కమిటీలు నెలకొల్పబడ్డాయి, సంయుక్త అభ్యర్థులు నిలపబడ్డారు. శ్రామికవర్గపు సామాజిక డిమాండ్లలోని విప్లవ తీవ్రత భంగమొనర్చబడింది, వాటికి ప్రజాస్వామిక మలుపు యివ్వబడింది, పెటీబూర్జువావర్గపు ప్రజాస్వామిక డిమాండ్లనుండి శుద్ధ రాజకీయ రూపం తొలగించబడి, వాటికి సోషలిస్టు రంగు పుయ్యబడింది. సోషల్-డెమోక్రటిక్ పార్టీ ఆ విధంగా ఉత్పన్నమైంది. ఈ సంయోగంద్వారా ఏర్పడిన కొత్త మహీధరం పార్టీలో కార్మికవర్గానికి చెందిన కొందరు అనామకులూ, కొందరు సోషలిస్టు ఒంటెత్తువాదులూ మినహాయించి మిగిలిన వారందరూ పాత మహీధరం పార్టీకి చెందినవాళ్లే, తేడా అల్లా సంఖ్యరీత్యా అది పెరిగింది, అంత మాత్రమే. కానైతే, అభివృద్ధిక్రమంలో, తమ ప్రాతినిధ్యం వహించిన వర్గంతోబాటు అది మారింది. సోషల్-డెమోక్రటిక్ పార్టీ ప్రజాతంత్ర రిపబ్లికన్ సంస్థలు కావాలని డిమాండ్ చేసింది, కానైతే వాటిని అది, రెండు కొసల్లో వున్న పెట్టుబడినీ వేతన శ్రమనూ రద్దుచెయ్యడా

నికి గాక, వాటి మధ్యగల శ్రతువైరుధ్యాన్ని తగ్గించడానికీ, దాన్ని సామరస్యంగా మార్చడానికీ సాధనంగా మాత్రమే డిమాండుచేసింది — ఈ పార్టీయొక్క విశిష్ట స్వభావసారాంశం సరిగా దీనిలోనే యిమిడివుంది. ఈ లక్ష్యసాధనకోసం అది సూచించిన మార్గాలు ఎంత భిన్న మైనవైనా, తరతమ స్థాయిల్లో విప్లవాభిప్రాయాలతో దానికి ఎంత ఎక్కువగా నగిషీలు చెక్కినాకూడా సారాంశం మటుకు ఏ మాత్రం మారదు. సమాజాన్ని ప్రజాస్వామిక పద్ధతి లోనే కాక, పెటీబూర్జువావర్గ పరిధిలో మార్చడమన్నదే యీ సారాంశం. అయితే ఎవరూ కూడా, పెటీబూర్జువావర్గం, సూత్రరీత్యా, స్వార్థపూరిత వర్గప్రయోజనాన్ని అమలు జరపాలని కోరుకుంటోందన్న సంకుచితాభిప్రాయాన్ని ఏర్పరచుకోకూడదు. పైగా, తన విముక్తికి సంబంధించిన ప్రత్యేక షరతులే సాధారణ షరతులనీ, ఆ షరతుల పరిధిలో మాత్రమే ఆధునిక సమాజం ఉద్ధరింపబడగలదనీ, వర్గపోరాటం నివారింపబడగలదనీ పెటీ బూర్జువావర్గం విశ్వసిస్తుంది. అదే విధంగా ప్రజాతంత్ర ప్రతినిధులందరూ కూడా నిజం గానే దుకాణదారులనిగాని, లేక వారిని సముత్సాహంగా బలపరచేవారనిగాని మనం అనుకో రాదు. వారి విద్యార్హతలను బట్టి, వారి వ్యక్తిగత హోదాను బట్టి వారి మధ్య భూమ్యా కాశాల మధ్య ఉన్నంత ఎడముండవచ్చు. వారిని పెటీబూర్జువావర్గ ప్రతినిధులను చేస్తున్నదేమిటంటే, పెటీబూర్జువావర్గం జీవితంలో ఏ పరిమితులనైతే దాటివెళ్లదో వాళ్ల ఆలోచనలలో వాళ్లు, సరిగా ఆ హద్దులను దాటివెళ్లరు. తత్పర్యవసానంగా, పెటీ బూర్జువాలు భౌతిక ప్రయోజనంచేత, సామాజిక హోదాచేత ఆచరణలో సరిగా ఏ సమస్యల దిశగానూ, పరిష్కారాల దిశగానైతే నెట్టబడతారో వాళ్లు సైద్ధాంతికంగా సరిగా వాటి దిశగానే నెట్టబడతారు. సామాన్యంగా, ఒకానొక వర్గంయొక్క రాజకీయ, సాహిత్య ప్రతినిధులకీ, వారు ఏ వర్గానికైతే ప్రాతినిధ్యం వహిస్తారో దానికీ మధ్య యిదే సంబంధం వుంటుంది.

పైన పేర్కొనబడినదాన్ని బట్టి ఒక విషయం స్పష్టపడుతుంది, అదేమిటంటే మహీధరం పార్టీ నిరంతరాయంగా పార్టీ ఆఫ్ ఆర్డర్‌తో రిపబ్లిక్ కోసమూ, మానవ హక్కుల నబడే వాటి కోసమూ పోరాడుతున్నదంటే దాని అంతిమ లక్ష్యం రిపబ్లిక్కూ కాదు, మానవ హక్కులూ కాదు; అదెలాగంటే, ఎవరైనా ఏ సైన్యాన్నైనా నిరాయుధంచెయ్యాలని కోరుకు న్నప్పుడు, ఆ సైన్యం ప్రతిఘటనార్థం రంగం మీదకి వచ్చినప్పుడు, అది కేవలం తన ఆయు ధాలను తన వశంలో ఉంచుకోవడానికి మాత్రమే పరిమితం కాదు.

జాతీయ సభ సమావేశం అయీ కాగానే పార్టీ ఆఫ్ ఆర్డర్ మహీధరం పార్టీని రెచ్చగొట్టింది. బూర్జువావర్గం, సరిగా యిప్పటికొక ఏడాది వెనుక విప్లవాత్మక శ్రామిక వర్గాన్ని అంతమొందించాలని ఎలా అనుకుందో అలాగే యిప్పుడు ప్రజాస్వామిక పెటీ బూర్జువావర్గాన్ని అంతమొందించాలని అనుకుంది. తేడా అల్లా శత్రువు పరిస్థితి భిన్నంగా

ఉంది, అంత మాత్రమే. శ్రామికవర్గ పార్టీ బలం వీధుల్లో ఉండగా, పెటీబూర్జువావర్గం యొక్క బలం సాక్షాత్తూ జాతీయ సభలో ఉంది. అందుకని, సమస్యల్లా ఏదోవిధంగా మోసగించి దాన్ని జాతీయ సభనుంచి వీధుల్లోకి లాగడం, తద్వారా స్వయంగా, దానిచేతనే దాని పార్లమెంటరీ బలాన్ని – కాలమూ పరిస్థితులూ దాన్ని సంఘటితం చెయ్యగలిగేందుకు ముందే – తుత్తునియలుచెయ్యడమే. మహీధరం పార్టీ అనాలోచితంగా పరుగునవెళ్లి నేరుగా ఆ వలలో చిక్కింది.

రోమ్‌పై ఫ్రెంచి సేనల బొంబార్డుమెంటు* అనే ఎర దానికి వేయబడింది. అది, ఫ్రెంచి రిపబ్లిక్ తన సైనిక బలగాలను మరో దేశ ప్రజల స్వాతంత్ర్యానికి వ్యతిరేకంగా వినియోగించడాన్ని నిరోధించే రాజ్యాంగచట్టపు ఐదవ నిబంధనను ఉల్లంఘించడమే. దీనికితోడు, 54వ నిబంధన, జాతీయ సభ ఆమోదం లేనిదే కార్యనిర్వాహకాధికార శాఖ యుద్ధాన్ని ప్రకటించడాన్ని నిషేధించింది. పైగా రాజ్యాంగ నిర్ణాయసభ తన మే 8వ తేదీ తీర్మానం మేరకు రోమ్‌పై దాడిని తిరస్కరించింది. ఈ ఆధారాలతో బోనపార్ట్‌కీ, అతని మంత్రులకీ వ్యతిరేకంగా 1849 జూన్ 11న మహాభియోగం మోపుతూ లెద్ర్యూ-రోలిన్ ఒక బిల్లును ప్రవేశపెట్టాడు. తేర్‌యొక్క సూటీపోటీ మాటలతో ఉద్రేకపడిపోయి, సర్వవిధాలా, చివరకు ఆయుధాలు ధరించైనా సరే రాజ్యాంగచట్టాన్ని తాము రక్షిస్తామని బెదరించేదాకా ఆయన వెళ్లాడు. మహీధరం పార్టీ ఏకగ్రీవంగా యీ ఆయుధధారణ నినాదాన్ని రెట్టించింది. జూన్ 12న, జాతీయ సభ మహాభియోగపు బిల్లును తిరస్కరించింది, మహీధరం పార్టీ పార్లమెంటునుంచి నిష్క్రమించింది. జూన్ 13 నాటి ఘటనలు తెలిసినవే: మహీధరం పార్టీకి చెందిన ఒక విభాగం బోనపార్ట్‌నూ, అతని మంత్రులనూ "రాజ్యాంగ బాహ్యులు"గా పేర్కొంటూ ఒక ప్రకటనను జారీచెయ్యడం; నిరాయుధంగా వీధిలో ప్రదర్శనచేస్తున్న ప్రజాస్వామిక నేషనల్ గార్డులు షంగర్న్యే సేనలు ఎదురుపడటంతోనే చెల్లాచెదరైపోవడం వగైరా, వగైరా. మహీధరం పార్టీకి చెందిన ఒక భాగం విదేశాలకు పారిపోయింది, మరో భాగం బుర్జే హైకోర్టులో హాజరుపరచబడింది, మిగిలినవారు ఒక పార్లమెంటరీ నిబంధన మేరకు, బడిపిల్లల్లాగ జాతీయ సభ అధ్యక్షుని పర్యవేక్షణకు అప్పగించబడ్డారు. పారిస్‌లో తిరిగి ముట్టడి స్థితి ప్రకటించబడింది, పారిస్ నేషనల్ గార్డులోని ప్రజాస్వామిక విభాగం రద్దుచెయ్యబడింది. ఆ విధంగా పార్లమెంటులో మహీధరం పార్టీయొక్క పలుకుబడీ, పారిస్‌లో పెటీబూర్జువావర్గపు పలుకుబడీ భగ్నంచెయ్యబడ్డాయి.

---

* K. Marx, *The Class Struggles in France, 1848–1850* (K. Marx and F. Engels, *Selected Works*, Vol. 1, మాస్కో, 1962, పేజీలు 186–88) చూడండి. – సం.

జూన్ 13న, ఎక్కడైతే రక్తప్లావితమైన తిరుగుబాటుకు పిలుపు యివ్వబడిందో ఆ లియోన్‌లో కూడా, దాని పరిసరాల్లో వున్న అయిదు జిల్లాలతోబాటు ముట్టడిస్థితి ప్రకటింపబడింది, ఆ స్థితి యీ క్షణం దాకా అమల్లో వుంది.

దాని ప్రకటనపై సంతకం చేయనిరాకరించి మహీధరం పార్టీ సభ్యులలో అధిక సంఖ్యాకులు తమ అగ్రగామి దళానికి ద్రోహం చేశారు. పత్రికలు సైతం దాన్ని వదిలేసి పోయాయి, కేవలం రెండు పత్రికలు మాత్రమే ఆ ప్రకటనను ముద్రించ సాహసించాయి. పెటీబూర్జువావర్గం తన ప్రతినిధులను మోసగించింది, నేషనల్ గార్డులు దూరంగానైనా ఉండిపోయారు, లేక రంగంపైకి వచ్చినచోట్ల కూడా బ్యారికేడ్ల నిర్మాణానికి ఆటంకాలు కల్పించారు. ప్రతినిధులు పెటీబూర్జువావర్గాన్ని మోసగించారు, అదేలాగంటే, సైన్యంలో వారికి ఉన్నారని చెప్పబడిన అనుచరులెవరూ మచ్చుకు కూడా ఎక్కడా కనిపించలేదు. చివరి సంగతేమిటంటే, డెమోక్రటిక్ పార్టీ శ్రామికవర్గంనుండి శక్తిని పొందడానికి బదులు, శ్రామికవర్గానికి అది తన సొంత బలహీనతను సంక్రమింపచేసింది. డెమోక్రట్ల ఘనకార్యాలతోబాటు మామూలుగా మనకు ఒక విషయం కనిపిస్తూవుంటుంది. అదేమిటంటే, నాయకులేమో తమ "ప్రజల"పైన దగాచేసిపోయారన్న ఆరోపణ చేసి తృప్తిపడ్డారు, ప్రజలేమో తమ నాయకులపై మోసగించారన్న ఆరోపణ చేసి తృప్తి చెందారు.

మహీధరం పార్టీ రానున్న తన ఆందోళనోద్యమాన్ని గురించి ఎంత కోలాహలంగా ప్రకటించిందో బహుశా అంత సరభసంగా మరే కార్యాచరణా మరెన్నడూ ప్రకటింపబడియుండదు. ప్రజాస్వామ్యపు తప్పనిసరి విజయాన్ని గురించి అప్పుడు ఢంకాబజాయించి చెప్పినంత నిశ్చయాత్మకంగా, అంత మరీ ముందుగా మరెన్నడూ మరే ఘటనను గురించీ భేరీ వాయించబడియుండదు. దీన్ని బట్టి డెమోక్రాట్లకు ఏ భేరీ నాదాల ప్రకంపనకైతే జెరికో కోటగోడలు కూలిపోయాయని[91] చెప్తారో, ఆ భేరీ నాదాలపై నిజంగానే నమ్మకం ఉండివుండాలి. నిరంకుశత్వపు కోటబురుజుల ముందు నిలిచినప్పుడల్లా యీ అద్భుత ఘటనను పునరావృతంచెయ్యాలని వారు ప్రయత్నిస్తూ వుంటారు. మహీధరం పార్టీ పార్లమెంటులో విజయం సాధించాలని కోరుకొనివుంటే, అది ఆయుధధారణకు పిలుపు యిచ్చివుండాల్సింది కాదు. పార్లమెంటులో ఆయుధధారణకు పిలుపిచ్చినప్పుడు, వీధుల్లో అది పార్లమెంటరీ పద్ధతిలో వ్యవహరించియుండాల్సింది కాదు. వారు ఆ శాంతియుత ప్రదర్శలను చిత్తశుద్ధితో తలపెట్టియుంటే, మరి అప్పుడు దానికి సైనిక పద్ధతిలో స్వాగతం ఎదురవుతుందని ఊహించకపోవడం అవివేకవంతమవుతుంది. నిజమైన పోరాటాన్నే వారు ఉద్దేశించివుంటే, దాన్ని ఏ ఆయుధాలతోనైతే సాగించాలో ఆ ఆయుధాలను క్రిందపెట్టడం విడ్డూరమైన ఆలోచన. కానైతే పెటీబూర్జువావర్గంయొక్క, వారి ప్రజాస్వామిక ప్రతినిధులయొక్క విప్లవాత్మక హుంకరింపులు ప్రత్యర్థిని జడిపించేందుకు చేసే కేవల

ప్రయత్నాలు మాత్రమే. పోతే, వారెప్పుడైతే మొండిసందు చివరకు చేరుకుంటారో, ఎప్పుడైతే తమ బెదరింపులకు యింక కార్యరూపం యివ్వక తప్పనిసరి అయ్యేటంత లోతుగా యిరుక్కుపోతారో, అప్పుడిక వారా పనిని చేసీచెయ్యనట్లు సందిగ్ధంగా చేస్తారు, లక్ష్య సిద్ధిని కలిగించే సాధనాలకు భంగంకలిగే విధంగా, లొంగుబాటుకు సాకులు వెతుకుతూ సాగిస్తారు. సమరారంభాన్ని సూచిస్తూ ప్రకటించిన సింహనాదం, ఆ పోరాటాన్ని ప్రారంభించాల్సిరాగానే, భయభీతమై తోక ముడిచిన గ్రామసింహపు గుర్రుగా దిగజారుతుంది, నటన ప్రారంభించాల్సిన నటులు గాంభీర్యాన్ని కోల్పోతారు, తూటు పొడిచిన గాలిబుడగలాగ నటన చప్పగా కుప్పకూలిపోతుంది.

డెమోక్రటిక్ పార్టీ అంత అధికంగా మరే పార్టీ కూడా తన సాధనాలను గురించి యింతగా అతిశయోక్తులు చెప్పుకొని వుండదు, పరిస్థితుల విషయంలో కూడ దానంత ఆషామాషీగా మరే యితర పార్టీ కూడా తనను తాను భ్రమింపచేసుకొని వుండదు. సైన్యంలో ఒక విభాగం తనకు ఓట్లు వేసింది కాబట్టి సైన్యం తనకు అనుకూలంగా తిరుగబడుతుందని మహీధరం పార్టీ నమ్మింది. అదైనా ఏ సందర్భంలో? సేనల దృష్టిలో, ఫ్రెంచి సైనికులకు వ్యతిరేకంగా విప్లవవాదులు రోమన్ సైనికుల పక్షం వహించారనడం తప్ప మరో అర్థమేదీ లేని సందర్భమది. మరోవంక, 1848 జూన్ ఘటనల స్మృతులింకా శ్రామికవర్గపు మనసుల్లో ఎంత తాజాగా వున్నాయంటే, నేషనల్ గార్డుని గురించి శ్రామికవర్గానికి ప్రగాఢమైన అసహ్యం తప్ప మరేదీ ఉండజాలని సమయమది, రహస్య సంఘాల నాయకులకు డెమోక్రటిక్ పార్టీ నాయకులపట్ల పూర్తి అవిశ్వాసం తప్ప మరేదీ ఉండజాలని సమయమది. ఈ పరస్పరవిభేదాలను తొలగించుకోవడానికిగాను యిరుపక్షాలకూ ఉమ్మడిగా వుండే గొప్ప లక్ష్యాలు ప్రమాదంలో పడివుండటం అవసరం. రాజ్యాంగచట్టంలో అనిర్దిష్టంగా ఉండే ఒకానొక పేరా ఉల్లంఘన యిటువంటి ప్రయోజనాలను సమకూర్చజాలదు. డెమోక్రాట్లే స్వయంగా చెప్పినట్లు రాజ్యాంగచట్టం యింతకు ముందే పలుమార్లు ఉల్లంఘింపబడలేదా? దీనిని, అత్యంత ప్రజానురంజక పత్రికలు రాజ్యాంగచట్టానికి విప్లవ ప్రతిఘాతమైన అతుకులబొంత అని ముద్రవెయ్యలేదా? కాని డెమోక్రాట్, తను పెటీబూర్జువావర్గానికి ప్రాతినిధ్యం వహిస్తాడు కనుక, అంటే, ఏ వర్గంలోనైతే రెండు వర్గాల ప్రయోజనాలు ఏక కాలంలో పరస్పరం మొద్దుబారచెయ్యబడతాయో, ఆ పరివర్తనశీలియైన వర్గానికి తను ప్రాతినిధ్యం వహిస్తాడు కనుక, మొత్తంమీద వర్గవైరుధ్యానికి తనను తాను అతీతునిగా, ఉన్నతునిగా ఊహించుకుంటాడు. డెమోక్రాట్లు ప్రత్యేక హక్కులు కలిగిన ఒక వర్గం తమను ఎదుర్కొంటోందని అంగీకరిస్తారు, కాని వారు కూడ, జాతిలో మిగిలిన వారందరితో బాటు, ప్రజలో ఒక భాగం. మరి తాము ప్రజల హక్కులకు ప్రాతినిధ్యం వహిస్తారు; తాము ప్రజా ప్రయోజనాలకు ప్రాతినిధ్యం వహిస్తారు. అందుకని, పోరాటం ఆసన్నమైనప్పుడు,

విభిన్న వర్గాలయొక్క ప్రయోజనాలను, వైఖరులను పరిశీలించాల్సిన అవసరం వారికి కనిపించదు. తమ సొంత సాధనసంపత్తులను పూర్తి సవిమర్శకంగా బేరీజువేసుకోవలసిన అవసరం వారికి కనిపించదు. తాము కేవలం సైగచేస్తే చాలు ప్రజలు తరుగులేని తమ సాధన సంపత్తులన్నింటితోనూ పీడకులపై విరుచుకుపడతారని విశ్వసిస్తారు. పోతే, కార్య రంగంలో వారి ప్రయోజనాలు అనాసక్తికరంగా రుజువైనా, వారి బలం నిర్వీర్యమైనదిగా రుజువైనా, అప్పుడిక ఆ దోషం, అవిభాజ్య ప్రజలను భిన్నభిన్న శత్రుశిబిరాలుగా చీల్చిన కుచ్చిత కుతర్కపరులదే గాని తమది కాదు, లేకపోతే, ప్రజాస్వామ్య విశుద్ధ లక్ష్యాలు తమ మటుకు తమకు సైతం సర్వోత్కృష్టమైనవన్న సంగతిని గ్రహించజాలనంతగా సైన్యంలో ఆటవిక ప్రవృత్తి పెంపొందింపబడింది, వారు అంధులు చెయ్యబడ్డారు, అదీ కాకుంటే, మొత్తం పథకమంతా దాని అమలులో ఒక చిన్న వివరం లోపించడంతో భగ్నమైపోయింది, అది కూడా కాకపోతే ఊహకి అందని యాదృచ్ఛిక ఘటన ఏదో యీసారి కార్యాన్ని చెడగొట్టింది. ఏదేమైనా కూడా, మిక్కిలి సిగ్గుచేటైన ఘోర పరాజయం తర్వాత సైతం యీ డెమొక్రాట్ పోరాటంలోనుంచి బయటకు వచ్చినప్పుడు, అతను అందులో ప్రవేశించినప్పుడు ఎంత నిష్కళంకంగా, ఎంత అమాయకంగా ఉంటాడో అంత నిష్కళంకంగానూ, అంత తెలివి తక్కువగానూ ఉంటాడు. అతను కొత్తగా సంపాదించుకున్న తన విజయం అనివార్యమైనదన్న విశ్వాసంతో బయటకు వస్తాడు. తనూ, తన పార్టీ పాత దృక్పథాన్ని విడిచిపెట్టడం అవసరమన్న సంగతిని అతను గ్రహించడు సరికదా, అందుకు భిన్నంగా, పరిస్థితులే తనకు అనుకూలంగా పక్వంకావాలని అతను ఆశిస్తాడు.

అందుకని, బాగా తరిగిపోయి, ఛిన్నాభిన్నమైపోయి, కొత్త పార్లమెంటరీ నిబంధన ద్వారా అవమానింపబడినప్పటికీ కూడా మహీధరం పార్టీ మరీ పూర్తి హీనస్థితిలో ఉందని మీరు భావించకూడదు. జూన్ 13వ తేదీ ఒకవంక తన ముఖ్య నాయకులను తొలగించినా కూడా మరోవంక అది, అల్పతరమైన సత్తా కలిగిన వ్యక్తులను రంగంపైకి తెచ్చింది, వారు తమ యీ కొత్త హోదాను చూసుకొని మురుస్తున్నారు. పార్లమెంటులో వారి అశక్తత విషయంలో యిక సందేహమెంతమాత్రమూ లేకపోయినా, వారిప్పుడు తమ కార్యకలాపాలను నైతిక రోషపూరిత ప్రకటనలకు, నిప్పులుచెరిగే ప్రసంగాలకు పరిమితంచేసే హక్కు కలిగివున్నారు. పార్టీ ఆఫ్ ఆర్డర్ వారిని విప్లవానికీ, అరాజకత్వ భయోత్పాతాలన్నింటికీ చిట్టచివరి అధికారిక సాకార ప్రతినిధులుగా చూడగలిగివుంటే, నిజానికి వారు మరింత నీరసులుగా, వినమ్రులుగా ఉండగలిగేవారు. కానైతే, జూన్ 13 పరాజయం దృష్ట్యా: వాళ్లను సార్వజనిక ఓటింగు హక్కుపై దాడిచెయ్య సాహసించనివ్వండి, అప్పుడు చూపిస్తాం మా సత్తా ఏమిటో! Nous verrons!* అంటూ వాళ్లు తమను తాము ఓదార్చుకునే వారు.

---

* చూద్దాం. — సం.

విదేశాలకు పారిపోయిన మహీధరం పార్టీ సభ్యులకు సంబంధించినంతవరకు, యిక్కడ యింతమాత్రం చెప్పుకుంటే సరిపోతుంది, అదేమిటంటే, తన నాయకత్వానగల శక్తివంత మైన పార్టీని పట్టుమని పక్షం రోజుల్లోపల తిరిగికోలుకోకుండా నాశనంచేసిన లెద్ర్యూ-రోలిన్, in partibus[59] ఒక ఫ్రెంచి ప్రభుత్వాన్ని ఏర్పాటుచెయ్యడం తన కర్తవ్యమనుకున్నాడు. విప్లవస్థాయి పతనమైన మేరకు, అధికారిక ఫ్రాన్సుయొక్క అధికార పెద్దలు మరుగుజ్జు లైన మేరకు, కార్యాచరణ రంగానికి ఎంతో దూరాన వున్న అతని వ్యక్తిత్వం ఆ స్థాయిలో పెరుగుతున్నట్లు కనిపించింది. దానితో అతను 1852 నాటి ఎన్నికలలో రిపబ్లికన్ అధి కార వారసుడుగా ముందుకు రాగలిగాడు. అతను వలాహియన్ల నుద్దేశించి, తదితర ప్రజల నుద్దేశించి దఫదఫాలుగా సర్క్యులర్లు విడుదలచేశాడు, వాటిలో యూరప్ ఖండంలోని నిరం కుశ పాలకుల నుద్దేశించి తనూ, తన సహచరులూ కార్యాచరణకు పూనుకొంటామని బెదరించాడు. ఈ పెద్దమనుషులను ఉద్దేశించి ప్రూడన్ చెప్పిన "Vous n'êtes que des blagueurs!"* అన్న మాటలు బొత్తిగా పొరపాటేమీ కావు.

జూన్ 13న, పార్టీ ఆఫ్ ఆర్డర్, మహీధరం పార్టీని ఛిన్నాభిన్నం చేయడమే కాకుండా, రాజ్యాంగచట్టాన్ని జాతీయ సభలో మెజారిటీ నిర్ణయాలకు లోబడి వుండేటట్లు కూడా చేసింది. పోతే, రిపబ్లిక్‌కి సంబంధించిన దాని అవగాహన యిదీ: రాజరికంలోవలె, కార్య నిర్వాహకాధికారంయొక్క వీటో అధికారం వంటి బెడదగాని, పార్లమెంటును రద్దుచేసే అధి కారమనే పీడగాని లేకుండా, యిందులో బూర్జువావర్గం పార్లమెంటరీ రూపాల్లో పాలన సాగించవచ్చు. త్యేర్ చెప్పినదాని ప్రకారం యిదొక పార్లమెంటరీ రిపబ్లిక్. జూన్ 13న బూర్జువావర్గం పార్లమెంటు లోపల తమ సర్వాధికారాన్నైతే సాధించుకుంది, కాని పార్ల మెంటునుండి మిక్కిలి జనరంజక విభాగాన్ని వెళ్లగొట్టడం ద్వారా కార్యనిర్వాహకాధికారపు దృష్టిలోనూ, ప్రజల దృష్టిలోనూ బూర్జువావర్గం పార్లమెంటును దారుణంగా బలహీన పరచలేదా? కోర్టుల డిమాండు మేరకు, పలువురు ప్రతినిధులను నిస్సంకోచంగా అప్పగిం చడంద్వారా, తనంతట తానుగా అది తన పార్లమెంటరీ అతీతత్వాన్ని రద్దుచేసుకుంది. ఏ అవమానకర నిర్బంధాలకైతే మహీధరం పార్టీని అది గురిచేసిందో, వాటి మూలంగా ప్రజలయొక్క వైయక్తిక ప్రతినిధులు ఏ మేరకైతే కించపరచబడ్డారో, ఆమేరకు రిపబ్లిక్ అధ్యక్ష హోదా పెరిగింది. రాజ్యాంగచట్టపు పరిరక్షణకై జరిగిన తిరుగుబాటును సమాజాన్ని విధ్వంసంచెయ్యడానికి ఉద్దేశింపబడిన అరాజక చర్యగా ఖండించడం ద్వారా కార్యనిర్వాహకా ధికారం తనకు సంబంధించి రాజ్యాంగచట్టాన్ని అతిక్రమించినప్పుడు, తను తిరుగు బాటుకు విజ్ఞప్తిచేసే అవకాశాన్ని అది ముందే చెడగొట్టుకుంది. పోతే చరిత్రయొక్క

* "మీరు మాటలపోగులు తప్ప మరేమీ కారు." — సం.

పరిహాసమేమిటంటే, బోనపార్ట్ ఆదేశాల మేరకు ఏ జనరల్ అయితే రోమ్‌పై బొంబార్డ్ మెంటు చేసి, జూన్ 13న రాజ్యాంగచట్టపరమైన తిరుగుబాటుకు తక్షణ సందర్భాన్ని సమకూర్చాడో సరిగా ఆ ఉడినోనే, పార్టీ ఆఫ్ ఆర్డర్ 1851 డిసెంబరు 2న, రాజ్యాంగ చట్టం తరపున, బోనపార్ట్‌కి వ్యతిరేకంగా, జనరల్‌గా ప్రార్థన పూర్వకంగా, ప్రయోజన రహితంగా ప్రజల ముందుంచింది. జూన్ 13కి చెందిన మరో నాయకుడు వియ్యేర. ఇతగాడు ధనిక ప్రభువర్గానికి చెందిన నేషనల్ గార్డుల ముఠాకొక దానికి నాయకత్వం వహించి, ప్రజాస్వామిక వార్తాపత్రికా కార్యాలయాలలో జరిపిన పాశవిక చర్యలకుగాను జాతీయ సభ వేదికనుండి ప్రస్తుతింపబడ్డాడు — సరిగా యిదే వియ్యేరయే బోనపార్ట్ కుట్రలో చేర్చుకో బడ్డాడు, జాతీయ సభయొక్క అంతిమఘడియలో దానికి నేషనల్ గార్డులనుండి ఎటువంటి రక్షణా లభించకుండా చేసిన ఘనుడు యితనే.

జూన్ 13కి మరో అర్థం కూడా వుంది. మహీధరం పార్టీ బోనపార్ట్‌పై మహాభియోగం తేవాలని ప్రయత్నించింది. అందుకనే దాని పరాజయం బోనపార్ట్‌కి ప్రత్యక్ష విజయమైంది, అతని ప్రజాస్వామిక శత్రువులపై అతని వ్యక్తిగత విజయమైంది. పార్టీ ఆఫ్ ఆర్డర్ యీ విజయాన్ని సాధించింది; బోనపార్ట్ చెయ్యవలసిందల్లా ఆ విజయ ప్రయోజనాన్ని భుక్తం చేసుకోవడమే. అతను సరిగా అదే చేశాడు. జూన్ 14న పారిస్ గోడలపైన ప్రజలు చదివేందుకు గాను ఒక ప్రకటన ప్రత్యక్షమైంది. దానిలో అధ్యక్షుడు ఎంతో సంకోచంతో, తన యిష్టా నికి వ్యతిరేకంగా అన్నట్లు, కేవలం పరిస్థితుల ప్రాబల్యంవల్ల మాత్రమే అన్నట్లు, తన ఏకాంత తపోస్థానంనుంచి బయటకు వచ్చి, అపార్థంచేసుకోబడిన సౌశీల్యమన్నట్లు నటిస్తూ, తన ప్రత్యర్థుల అభాండాలకు అభ్యంతరం తెలుపుతూ, తన వ్యక్తిత్వాన్నీ వ్యవస్థ లక్ష్యాలనూ ఒకటిగా చేస్తున్నట్లు పైకి కనిపిస్తూ, నిజానికి వ్యవస్థ లక్ష్యాలను తన వ్యక్తిత్వంతో ఒకటిగా చేసుకున్నాడు. దీనికితోడు, జాతీయ సభ రోమ్‌పై దండయాత్రకు దరిమిలా ఆమోదించినా ఆ విషయంలో చొరవ బోనపార్ట్‌దే. ప్రధాన గురువైన సామ్యుయేల్‌ను వాటికన్ గద్దెపై పునఃప్రతిష్ఠించిన తర్వాత తను స్వయంగా డేవిడ్‌రాజు మాదిరిగా తుయిలెరీలో ప్రవేశించగలనని ఆశించాడు.[92] అతను మతబోధకులను తన పక్షానికి తిప్పుకున్నాడు.

మనమింతకు ముందే చూసినట్లుగా, జూన్ 13వ తేదీ తిరుగుబాటు శాంతియుతమైన వీధి ప్రదర్శనకు పరిమితమైంది. అందుకని, దానికి వ్యతిరేకంగా యుద్ధంలో విజయ సాధ నకుగాను జయమాలికలు పొందే ప్రసక్తే లేకపోయింది. అయినాకూడా, వీరనాయకులకు, వీరోచిత ఘటనలకు కొరత ఏర్పడిన యీ కాలంలో, పార్టీ ఆఫ్ ఆర్డర్ యీ రక్తరహిత పోరాటాన్నే మరో ఔస్టర్లిట్జ్[93]గా మార్చివేసింది. సభల్లోనూ, పత్రికల్లోనూ అరాజకత్వపు చేతకానితనానికి ప్రాతినిధ్యం వహించే జనసామాన్యానికి వ్యతిరేకంగా సైన్యం వ్యవస్థయొక్క జీవగర్రగా ప్రస్తుతింపబడింది. షంగర్న్యేని "సమాజపు రక్షణ దుర్గం"గా ఎంతగా ఆకాశం

పైకి ఎత్తిందంటే, చివరకు అతనే స్వయంగా ఆ వంచనను నమ్మనారంభించాడు. ఈలోగా అనుమానాస్పదంగా కనిపించిన సైనిక దళాలు, నిగూఢంగా పారిస్‌నుండి బదిలీచెయ్యబడ్డాయి. ఎన్నికల సమయంలో అత్యధిక ప్రజాస్వామిక భావాలు ప్రదర్శించిన రెజిమెంట్లు ఫ్రాన్సునుండి ఆల్జియర్స్‌కు పంపబడ్డాయి. సైనికుల్లో ఆందోళనకారులు శిక్షాదళాలకు మార్చబడ్డారు. పోతే పత్రికలను సైనిక బ్యారక్సులనుండి, సైనిక బ్యారక్సులను బూర్జువా సమాజంనుండి వేరుచేసే కార్యక్రమం క్రమబద్ధంగా నిర్వహింపబడింది.

ఇక్కడ మనం ఫ్రాన్సుయొక్క నేషనల్ గార్డు చరిత్రలో నిర్ణయాత్మకమైన మూల మలుపును చేరుకున్నాం. 1830లో అది పునరుద్ధరణను[94] కూల్చివెయ్యడంలో నిర్ణాయకపాత్ర వహించింది. లూయీ ఫిలిప్ కాలంలో ఏయే తిరుగుబాట్లలోనైతే నేషనల్ గార్డు సైన్యం పక్షాన నిలిచిందో ఆ తిరుగుబాట్లన్నీ కూడా విఫలమయ్యాయి. 1848 ఫిబ్రవరి రోజుల్లో అది తిరుగుబాటుపట్ల స్తబ్ధ వైఖరినీ, లూయీ ఫిలిప్‌పట్ల సందిగ్ధ వైఖరినీ వహించిన ప్పుడు, అతని మటుకు అతనే ఓడిపోయినట్లే అనుకున్నాడు, నిజంగానే అతను ఓడిపోయాడు. ఆవిధంగా నేషనల్ గార్డు లేకుండా విప్లవం విజయవంతం కాదనీ, దానికి వ్యతిరేకంగా సైన్యం గెలవజాలదనీ గాఢమైన ఒక నమ్మకం పాతుకుపోయింది. ఇది పౌర సర్వశక్తిమత్వాన్ని గూర్చి సైన్యానికి ఉండిన ఒక అంధవిశ్వాసం. యావత్తు నేషనల్ గార్డూ, సైన్యానికి చెందిన దళాలతో కలిసి, తిరుగుబాటును అణచివేసిన 1848 జూన్ ఘటనలు యీ అంధవిశ్వాసానికి బలాన్ని చేకూర్చాయి. బోనపార్ట్ పదవీస్వీకారానంతరం, షంగర్న్యే చేతుల్లో నేషనల్ గార్డు బలగాల నాయకత్వాన్నీ, ప్రథమ సైనికదళ నాయకత్వాన్నీ రాజ్యాంగచట్ట విరుద్ధంగా ఏకంచెయ్యడంతో నేషనల్ గార్డు స్థితి కొంత బలహీనపరచబడింది.

ఇక్కడెలాగైతే నేషనల్ గార్డ్ నాయకత్వం సర్వసేనాధిపతియొక్క ఒక ఉపాంగంగా కనిపించనారంభించిందో, అదే విధంగా నేషనల్ గార్డే స్వయంగా సేనకాక తోకమాత్రంగా కనిపించనారంభించింది. చిట్టచివరకు, జూన్ 13న దాని శక్తి ఛిన్నాభిన్నం చెయ్యబడింది. నేషనల్ గార్డు దళాలను ఫ్రాన్సు అంతటా చివరకు దానికి చెందిన శకలాలు మాత్రమే మిగిలే విధంగా — పాక్షికంగా రద్దుచెయ్యడం యీ విచ్ఛిత్తికి కారణం మాత్రమే కాదు. జూన్ 13 నాటి ప్రదర్శన, అన్నిటికన్న ముఖ్యంగా, ప్రజాస్వామ్యవాదులైన నేషనల్ గార్డుల ప్రదర్శన. ఆయుధాలు చేత ధరించలేదన్నమాట నిజమే అయినప్పటికీ, సైన్యానికి వ్యతిరేకంగా వాళ్లు తమ యూనిఫారాలు ధరించారు, సరిగా ఈ యూనిఫారంలోనే సకల మహిమా యిమిడి వుంది. అన్ని యితర ఉన్నిగుడ్డల మాదిరిగానే ఈ యూనిఫారం కూడా సాదా ఉన్నిగుడ్డ మాత్రమేనని సైన్యం గ్రహించింది. మహిమ కాస్తా చెదిరిపోయింది. 1848 జూన్ ఘటనల రోజుల్లో, శ్రామికవర్గానికి వ్యతిరేకంగా బూర్జువావర్గమూ, పెటీబూర్జువావర్గమూ నేషనల్ గార్డు రూపంలో సైన్యంతో ఏకమైంది; 1848 జూన్ 13న, బూర్జువావర్గం సైన్యం

చేత పెటీబూర్జువా నేషనల్ గార్డ్సును చెదరగొట్టనిచ్చింది; 1851 డిసెంబరు 2న బూర్జువా వర్గానికి చెందిన నేషనల్ గార్డ్ స్వయంగానే రూపుమాసిపోయింది, పోతే బోనపార్ట్, దరిమిలా నేషనల్ గార్డు రద్దుకు సంబంధించిన ఆజ్ఞపై సంతకంచేసినప్పుడు కేవలం ఈ వాస్తవాన్ని నమోదుచేశాడు, అంతమాత్రమే. ఆ విధంగా బూర్జువావర్గం సైన్యానికి వ్యతిరేకంగా తనకుగల చిట్టచివరి ఆయుధాన్ని తనే స్వయంగా భగ్నంచేసుకుంది, కాని ఎప్పుడైతే పెటీ బూర్జువావర్గం తన వెనుక నౌకరుమాదిరిగా చేతులు కట్టుకు నిలబడక, తన ఎదుట తిరుగు బాటుదారుగా నిలబడిందో, ఆ మరుక్షణమే దాన్ని బూర్జువావర్గం ఛిన్నాభిన్నం చెయ్యా ల్సిన పరిస్థితిలో పడింది. ఇదెలాంటిదంటే, తను స్వయంగా నిరంకుశంగా తయారైన వెంటనే, బూర్జువావర్గం నిరంకుశత్వానికి వ్యతిరేకంగా తనకు గల ఆత్మరక్షణ సాధనాల న్నింటినీ చేతులారా రూపుమాపడం సాధారణంగా అనివార్యమవుతూవుంటుందే, అలాంటిది.

ఈలోగా, పార్టీ ఆఫ్ ఆర్డర్ 1848లో ఏ అధికారమైతే చేజారిపోయినట్లు కనిపిం చిందో, 1849లో ఏదైతే తన ప్రతిబంధకాలనుండి విముక్తమై తిరిగి లభించిందో, ఆ అధికార పునరాక్రమణోత్సవం జరుపుకుంది. ఈ విజయోత్సవాన్ని అది రిపబ్లిక్‌కీ, రాజ్యాంగ చట్టానికీ వ్యతిరేకంగా దూషణపరంపర సాగించి, భూత, భవిష్యత్, వర్తమాన విప్లవాలన్నిం టినీ — తన నాయకులే నిర్వహించిన విప్లవంతో సహా — దుమ్మెత్తి పోసి, పత్రికల నోళ్ల మూయించి, సభా స్వేచ్ఛను మట్టుపెట్టే శాసనాల ద్వారా, ముట్టడి స్థితిని ఒక మౌలిక వ్యవస్థా రూపంలో నియంత్రితం చెయ్యడంద్వారా జరుపుకుంది. అటుతర్వాత జాతీయ సభ, తను సమావేశంలో లేనికాలంలో పనిచేసేందుకుగాను ఒక శాశ్వత కమిషన్‌ను నియమించిన మీదట, ఆగస్టు మధ్యనుండి అక్టోబరు మధ్యదాకా వాయిదాపడింది. ఈ విరామ కాలంలో లెజిటి మిస్టులు ఎమ్స్‌తోను, ఆర్లియనిస్టులు క్లెర్ మోంట్‌తోను, బోనపార్ట్ — రాజయోగ్యమైన యాత్రలద్వారా, ప్రభుత్వ సలహా సమితి ద్వారా — రాజ్యాంగచట్టాన్ని తిరగతోడే విషయంలో సంప్రతింపులలోను కుతంత్రాలు సాగించారు. జాతీయ సభయొక్క తదుపరి క్రమవిరామ దశల్లో కూడా యీ ఉపఘటనలు పునరావృతమవుతూనేవచ్చాయి, నేను వాటిని గురించి, అవి సంఘటనలు అయిన సందర్భాల్లో మాత్రమే చర్చించదలుచుకున్నాను. దీనికితోడు, యిక్కడ ఈ క్రిందివిషయం మాత్రమే చెప్పుకుంటే సరిపోతుంది. జాతీయ సభ దీర్ఘకాల విరామాలపాటు రంగంనుంచి నిష్క్రమించడం, రిపబ్లిక్ అగ్రస్థానంలో కేవలం ఒక్క శాల్తీని, అందునా ఒక హాస్యాస్పద శాల్తీని, అక్షరాలా లూయీ బోనపార్ట్‌ని అట్టేపెట్టగా, మరో వంక ప్రజలకు మాయని మచ్చ అనదగిన పార్టీ ఆఫ్ ఆర్డర్ రాజరిక విభాగాలుగా విడి పోయి, పునరుద్ధరణకు సంబంధించిన పరస్పర విరుద్ధ అభీష్టాల సిద్ధి కోసం కృషిసాగించ నారంభించింది. ఈ విరామాల్లో, పార్లమెంటుయొక్క గందరగోళ కోలాహలం సద్దు మణిగినప్పుడల్లా దాని ఆకారం జాతిలో అంతర్హితమైనప్పుడల్లా, యీ రిపబ్లిక్‌యొక్క సిసి

లైన రూపాన్ని పూర్తిచెయ్యడానికిక కావలసిందల్లా ఒకేఒక్క విషయమన్న సంగతి అసంది గ్ధంగా స్పష్టపడుతూవచ్చింది: అదేమిటంటే జాతీయ అసెంబ్లీ విరామ కాలాన్ని శాశ్వతంగా పొడిగించడం, రిపబ్లిక్ నినాదాలైన: Liberté, Égalité, Fraternité*ల స్థానంలో అసందిగ్ధమైన: Infantry, Cavalry, Artillery** అనే మాటలను ప్రవేశ పెట్టడం!

## IV

1849 అక్టోబరు మధ్యలో జాతీయ సభ మరోమారు సమావేశమైంది. నవంబరు 1న బోనపార్ట్ ఒక సందేశాన్ని పంపి దాన్ని ఆశ్చర్యంలో ముంచాడు, బర్రో—ఫల్లూ మంత్రివర్గాన్ని బర్తరఫ్ చేస్తూనూ, కొత్త మంత్రివర్గాన్ని ఏర్పాటు చేస్తూనూ పంపిన సందేశమది. బోనపార్ట్ తన మంత్రులను బర్తరఫ్ చేసినంత అసభ్యంగా ఎవరూ తమ నౌక ర్లను సైతం బర్తరఫ్ చెయ్యరు. జాతీయ అసెంబ్లీని అతను కొట్టదలుచుకున్న దెబ్బలు యీలోగా బర్రోకీ, అతని ముఠాకీ ముట్టచెప్పబడ్డాయి.

బర్రో మంత్రివర్గం, మనం యింతకు ముందే చూసినట్లు, లెజిటిమిస్టులతోను, ఆర్లియనిస్టులతోను కూడిన, పార్టీ ఆఫ్ ఆర్డరుయొక్క మంత్రివర్గం. రిపబ్లికన్ రాజ్యాంగ నిర్ణయ సభను రద్దుచెయ్యడానికీ, రోమ్‌కి వ్యతిరేకంగా దండయాత్ర సాగించడానికీ, డెమొక్రటిక్ పార్టీని విచ్ఛిన్నంచెయ్యడానికీ బోనపార్ట్‌కి అది అవసరమైంది. ఈ మంత్రి వర్గం మాటున అతను తనొక అనామకుడన్నట్లు నటించాడు, ప్రభుత్వాధికారాన్ని పార్టీ ఆఫ్ ఆర్డర్ చేతికి అప్పగించాడు, లూయీ ఫిలిప్ సంపాదకుడు ధరించినమాదిరి సాధారణ పాత్ర – homme de paille*** మారువేషం ధరించాడు. ఇప్పుడతను ఆ మారువేషం తీసిపారేశాడు, ఆ మారువేషం యిప్పుడికనెంత మాత్రమూ తన ఆకృతిని మరుగుపరచగలిగిన మేలి ముసుగు కాక, అతను తన నిజాకృతిని ప్రదర్శించడాన్ని నిరోధించే ఇనుపకవచం కావ డమే యిందుకు కారణం. అతను బర్రో మంత్రివర్గాన్ని ఎందుకు నియమించాడంటే, పార్టీ ఆఫ్ ఆర్డర్ పేర రిపబ్లికన్ జాతీయ సభను ఛిన్నాభిన్నం చేసేందుకోసం; దాన్ని ఎందుకు బర్తరఫ్ చేశాడంటే పార్టీ ఆఫ్ ఆర్డరుయొక్క జాతీయ సభకు అతీతంగా తన సొంత పేరును ప్రకటించుకోవడంకోసం.

ఈ బర్తరఫ్‌కి సమంజసంగా కనిపించే సాకులకు కొదువలేదు. బర్రో మంత్రివర్గం,

---

* స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం. – సం.

** కాల్బలం, ఆశ్విక సైన్యం, ఫిరంగి దళం. – సం.

*** నామ్‌కే వాస్తే వ్యక్తి. – సం.

ఏ సభ్యతలను పాటించియుంటే రిపబ్లిక్ అధ్యక్షుడు జాతీయ సభ సరసన సమాన స్థాయి అధికార రూపంలో కనిపించగలిగేవాడో, అటువంటి సభ్యతలను సైతం నిర్లక్ష్యంచేసింది. రోమన్ రిపబ్లిక్*పై దాడిచేసినందుకుగాను ఉడినోను ప్రశంసిస్తూ రాజ్యాంగ నిర్ణయ సభకి విరుద్ధంగా, ఒక లేఖను ప్రకటించిన మాదిరిగానే, జాతీయ సభ విరామ కాలంలో ఎడ్గార్ నేయ్‌ని ఉద్దేశించి బోనపార్ట్ ఒక లేఖను ప్రకటించాడు, అందులో పోప్**యొక్క అనుదార వైఖరి అతనికి నచ్చనట్లు కనిపించింది. జాతీయ అసెంబ్లీలో రోమ్‌పై దండయాత్ర వ్యయంపై ఓటింగు జరిగినప్పుడు, ఉదారవాదమన్న భ్రమతో విక్టోర్ హ్యూగో యీ లేఖపై చర్చను లేవదీశాడు. బోనపార్ట్ తలతిక్కలకు రాజకీయ ప్రాధాన్యమంటూ అసలుంటుందన్న భావాన్నే పార్టీ ఆఫ్ ఆర్డర్ తిరస్కారపూర్వకమైన అపనమ్మకపు కేకలతో నులిమివేసింది. అప్పట్లో మంత్రుల్లో ఏ ఒక్కరూ కూడా బోనపార్ట్‌కి విసరబడిన యీ సవాలుకు ప్రతిగా అతని తరఫున ఏమీ మాట్లాడలేదు. మరో సందర్భంలో, బ్రరో, సుపరిచితమైన తన శుష్క ఆలంకారిక భాషలో, వేదికపైనుంచి, "నీచమైన కుట్రల"ను గురించి రోషపూరితమైన మాటలు విసిరాడు, అతని కథనానుసారంగా, అధ్యక్షునికి అత్యంత సన్నిహితుల మధ్యనుంచి యీ కుట్రలు సాగుతున్నాయని తేలింది. చిట్టచివరి విషయమేమిటంటే, మంత్రివర్గం, డచెస్ ఆఫ్ ఆర్లియన్స్ కిచ్చే వైధవ్య భృతికి సంబంధించిన ప్రతిపాదనకు జాతీయ సభనుండి ఆమోదం పొందింది, అధ్యక్షుని ఖర్చుల నిమిత్తం యిచ్చే మొత్తాన్ని పెంచే అన్ని ప్రతిపాదనలనూ తిరస్కరించింది. పోతే బోనపార్ట్ వ్యక్తిత్వంలో సింహాసన వారసుడూ, దురదృష్టవంతుడైన దుస్సాహసికుడూ సన్నిహితంగా కలిసిమెలిసి వున్నారు. ఫ్రెంచి సామ్రాజ్య పునరుద్ధరణకే తను అవతరించానన్న మహత్తర భావం తన రుణాలను చెల్లించడం ఫ్రెంచి ప్రజల పవిత్ర కర్తవ్యమన్న అతని భావంతో ముడివడివుంది.

బ్రరో–ఫలూ మంత్రివర్గమే బోనపార్ట్ ఏర్పాటు చేసిన మొదటి, చివరి పార్లమెంటరీ మంత్రివర్గం. కాగా, దాని బర్తరఫ్ నిర్ణయాత్మకమైన ఒక మూలమలుపు. దాని బర్తరఫుతో పార్టీ ఆఫ్ ఆర్డర్ కార్యనిర్వాహకాధికారానికి ఒక సాధనమైన, పార్లమెంటరీ పాలన కొనసాగింపుకు తప్పనిసరి అవసరమైన ఒక దుర్గాన్ని శాశ్వతంగా కోల్పోయింది. ఒక విషయం సుస్పష్టం, ఫ్రాన్సు వంటి దేశంలో, ఎక్కడైతే కార్యనిర్వాహకాధికారంయొక్క అధీనంలో ఐదు లక్షలకు పైగా ఉద్యోగుల సముదాయముందో, ఆ కారణంగా దానిపైన ఒక విశాల జనసముదాయంయొక్క హితమూ, జీవికా పూర్తిగా ఆధారపడివున్నాయో; ఎక్కడైతే రాజ్య

---

* K. Marx, *The Class Struggles in France, 1848-1850* (Marx and Engels, *Selected Works,* Vol. I, మాస్కో, 1962, పేజి 188) చూడండి. – సం.

** తొమ్మిదవ పయస్. – సం.

యం(త్రం నాగరిక సమాజాన్ని దాని అత్యంత వ్యాపక జీవిత వ్యక్తీకరణలనుండి దాని అత్యంత అపరిగణనీయమైన కార్యకలాపాల దాకా, దాని అస్తిత్వంయొక్క అత్యంత సామాన్యమైన పద్ధతులనుండి వ్యక్తులయొక్క ఆంతరిక జీవితం వరకు, తన జాలంలో యిరికించుకొందో, దాన్ని అదుపుచేస్తున్నదో, నియం(త్రితంచేస్తున్నదో, దాన్ని పర్యవేక్షించి దానికి శిక్షణ గరపుతున్నదో; ఎక్కడైతే అత్యంత అసాధారణమైన కేం(ద్రీకరణద్వారా యీ పరాన్నజీవి ఒకరకమైన సర్వవ్యాపకత్వాన్ని, ఒక సర్వజ్ఞత్వాన్ని, ఒక రకమైన త్వరీకృత చలనశక్తిని, స్థితిస్థాపకత్వాన్ని సంతరించుకుందో — దీని (ప్రతిరూపం వాస్తవ సమాజ శరీరంయొక్క నిస్సహాయ పరాధీనతలోను, శిథిల ఆకారహీనతలోను మా(త్రమే కానవస్తుంది — అక్కడ, అటువంటి దేశంలో ఒక విషయం సుస్పష్టం. అదేమిటంటే జాతీయ సభ మం(త్రి పదవులపై అదుపును తన చేతుల్లోంచి పోగొట్టుకున్నప్పుడు, అదే సమయంలో అది రాజ్య నిర్వహణను సరళీకృతం చెయ్యకపోయినట్లయితే, ఉద్యోగి బృందపు సంఖ్యను సాధ్యమైనంతగా తగ్గించక పోయినట్లయితే, చివరి సంగతిగా పౌర సమాజాన్నీ, (ప్రజాభి(ప్రాయాన్నీ (ప్రభుత్వాధికారానికి అతీతంగా తమ సొంత అంగాలను తయారుచేసుకోనివ్వక పోయినట్లయితే, తన సమస్త వాస్తవ అధికారాన్నీ కోల్పోతుంది. కానైతే సరిగా యీ విస్తృత రాజ్యయం(త్రాన్ని దాని నానావిధ శాఖోపశాఖలతోబాటు కొనసాగించడంతోనే (ఫెంచి బూర్జువావర్గపు భౌతిక (ప్రయోజనాలు అత్యంత సన్నిహితంగా ముడివడివున్నాయి. ఇందులోనే దాని అదనపు జనాభాకి ఉద్యోగాలు దొరుకుతాయి, లాభం, వడ్డీ, అద్దెలు, గౌరవభృతుల రూపంలో తను హస్తగతంచేసుకోలేని మొత్తాలను (ప్రభుత్వ జీతాల రూపంలో యిందులోనే అది భర్తీచేసుకోగలుగుతుంది. మరో వంక, బూర్జువావర్గంయొక్క రాజకీయ (ప్రయోజనాలు రోజురోజుకీ అది అణచివేత చర్యలకు అధికంగా పాల్పడేలా, ఆకారణంగా రాజ్యాధికార వనరులనూ అంగబలాన్నీ పెంచేలా ఒత్తిడి కలిగిస్తున్నాయి, అదే సమయంలో అది (ప్రజాభి(ప్రాయానికి వ్యతిరేకంగా అవిరామ పోరాటం సాగించాల్సివస్తోంది, సామాజిక ఆందోళనకు సంబంధించిన స్వతం(త్ర అంగాలను, పూర్తిగా కత్తిరించిపారవెయ్యడంలో తను సఫలంకాని సందర్భాల్లో, శంకితభావంతో దానికి అంగవైకల్యం కల్పించి, కుంటువరచాల్సిన స్థితిలో పడుతోంది. ఈవిధంగా (ఫెంచి బూర్జువావర్గం తన వర్గస్థితిని బట్టి, ఒకవంక పార్లమెంటరీ అధికారానికీ, ఆ కారణంగానే తన స్వంత అధికారానికీ సంబంధించిన సమస్త కీలక పరిస్థితులనూ నిర్మూలించాల్సిన స్థితిలోను, మరోవంక, దానికి (ప్రతికూలమైన కార్యనిర్వాహకాధికారాన్ని నిరాటంకంచెయ్యాల్సిన స్థితిలోను పడుతోంది.

కొత్త మం(త్రివర్గం ఓపూల్ మం(త్రివర్గమని పిలువబడేది. అయితే యిది జనరల్ ఓపూల్‌కి (ప్రధానమం(త్రి హోదా లభించిందనే అర్థంలో కాదు. తద్విరుద్ధంగా, బ(రోను బర్తరఫ్ చెయ్యడంతోబాటే బోనపార్ట్ యీ హోదానుకూడా రద్దుచేశాడు. నిజానికి యీ

హోదా మూలంగానే రిపబ్లిక్ అధ్యక్షుడు రాజ్యాంగచట్టబద్ధుడైన ఒక రాజుయొక్క స్థితిలో చట్టరీత్యా నిరధికారస్థితిలో ఉంచబడ్డాడు — అందునా ఎటువంటి రాజ్యాంగచట్టబద్ధుడైన రాజంటే, సింహాసనంగాని, కిరీటంగాని, రాజదండంగాని, ఖడ్గంగాని, స్వాతంత్ర్యంగాని రాజ్యంయొక్క అత్యున్నత పదవియొక్క అన్యాయత్తం చేయరాని స్వామిత్వంగాని లేని, అన్నింటి కన్న హీనవిషయం రాజకుటుంబ పోషణకు అవసరమైన రాజ భరణం లేని స్థితిలో ఉంచబడ్డాడు. ఓపూల్ మంత్రివర్గంలో పార్లమెంటరీ స్థాయి వున్న వ్యక్తి ఒకేఒక్కడున్నాడు. అతను వడ్డీ వ్యాపారి ఫూల్డ్. ధనిక ప్రభువర్గానికి చెందిన సభ్యులలో యితగాడు అత్యంత కుఖ్యాతుడు. ఆర్థిక మంత్రిత్వ శాఖ యితని పాలబడింది. పారిస్ స్టాక్ ఎక్స్చేంజిలోని కొటేషన్లను కనుక మీరు పరిశీలిస్తే 1849 నవంబరు 1 మొదలుకొని, ఫ్రెంచి ప్రభుత్వ రుణపత్రాల విలువ బోనపార్ట్‌యొక్క స్టాకుల తరుగుదలను పెరుగుదలను అనుసరించి తరుగుతూ, పెరుగుతూ, ఉంటున్నదని బోధపడుతుంది. ఈ విధంగా స్టాక్ ఎక్స్చేంజిలో బోనపార్ట్‌కి సహచరుడు లభించగా, కర్ల్యేని పారిస్ పోలీసు ప్రిఫెక్టుగా నియమించడంద్వారా పోలీసుబలగాన్ని సైతం అతను తన వశంచేసుకున్నాడు.

కాని మంత్రుల మార్పిడియొక్క పర్యవసానాలు ఘటనాక్రమంలో మాత్రమే వెలుగులోకి వచ్చాయి. ఈలోగా బోనపార్ట్ ముందుకు వేసిన అడుగుకి బదులుగా మరింత స్పష్టంగా వెనక్కినెట్టబడ్డాడు. తన మొరటు సందేశం అనంతరం అతను జాతీయ సభపట్ల అత్యంత వినయవిధేయతలతో కూడిన ప్రకటన చేశాడు. బోనపార్ట్ తలతిక్కలను శాసన ప్రతిపాదనలుగా మంత్రులు ప్రవేశపెట్టేందుకు జంకుతూనే — తమ అభీష్టానికి వ్యతిరేకంగానూ, తమ పదవుల కారణంగా గత్యంతరంలేకనూ మాత్రమే — ప్రయత్నించినప్పుడల్లా, పరిహాసాస్పదమైన ఆ పనులు నిష్ఫలమవుతాయని ముందే తెలిసివుండే ఆ ప్రయత్నాలు చేసినట్లు కనిపించింది. మంత్రుల వీపులవెనుక బోనపార్ట్ తన ఉద్దేశాలను బయటపెట్టినప్పుడల్లా, తన "idées napoléoniennes"[95]తో క్రీడించినప్పుడల్లా, అతని సొంత మంత్రులే జాతీయ అసెంబ్లీ వేదికపైనుంచి అతన్ని బాహాటంగా పరిత్యజించారు. సింహాసనం దఖలుపరచుకోవాలన్న అతని ప్రగాఢాకాంక్ష, అతని ప్రత్యర్థుల ద్వేషపూరిత దరహాసం ఎన్నడూ మూగవోకుండా కొనసాగేందుకు అనువుగా మాత్రమే వెల్లడింపబడుతున్నదేమో అనిపించింది. అతని ప్రవర్తన, ఎవని ప్రతిభనైతే ఎవరూ గుర్తించరో, ఎవనినైతే సర్వప్రపంచమూ మూర్ఖునిగా పరిగణిస్తుందో అటువంటి ప్రతిభాశాలి ప్రవర్తనలా వుంది. ఈ కాలంలో అన్ని వర్గాల నుండీ పూర్ణరూపంలో అతను పొందినంత తిరస్కారాన్ని మరెన్నడూ పొందలేదు. బూర్జువా వర్గం యీ కాలంలో సాగించినంత నిర్నిరోధంగా మరెన్నడూ తన పాలన సాగించలేదు, యీ కాలంలో తన పెత్తనానికి సంబంధించిన అధికార చిహ్నాలను ప్రదర్శించుకొన్నంత అట్టహాసంగా మరెన్నడూ ప్రదర్శించుకోలేదు.

దాని శాసననిర్ణయ కార్యకలాపాల చరిత్రను నేనిక్కడ రాయనక్కర్లేదు. ఈ కాలంలో దాని కార్యకలాపాల సారాంశమంతా రెండు చట్టాల్లో క్రోడీకరింపబడివుంది: మద్యంపై పన్నును తిరిగి విధిస్తూ చేసిన చట్టం మొదటిది, అవిశ్వాసాన్ని తుడిచివేసే విద్యాచట్టం రెండవది. ఫ్రెంచి ప్రజలకు మద్యపానం కష్టసాధ్యం చెయ్యబడిందంటే, అందుకు బదులుగా వారికి సత్యజీవన జలం మరింత పుష్కలంగా సమకూర్చబడింది. మద్యంపై పన్నుకి సంబంధించిన చట్టంద్వారా బూర్జువావర్గం పాత, రోసిపోయిన ఫ్రెంచి పన్నుల విధానం అనుల్లంఘనీయమైనదని ప్రకటించగా, విద్యాచట్టంద్వారా అది జనసామాన్యంలో పాత పన్నుల విధానాన్ని కిమ్మనకుండా సహించే మనోస్థితిని కొనసాగింపచేసేందుకు ప్రయత్నించింది. వోల్టేరియన్ తత్వానికీ, పృథక్శకలవాదానికీ (eclectic philosophy) పాత భక్తులైన ఆర్లియనిస్టులు, ఉదారవాద బూర్జువాలూ ఫ్రెంచివారి మస్తిష్క పర్యవేక్షణను తమకు జ్ఞాతివైరులైన జెస్యూట్లకు అప్పగించడం ఎవరికైనా ఆశ్చర్యాన్ని గొలపక మానదు. కానైతే, సింహాసన వారసుల విషయంలో ఆర్లియనిస్టులకూ, లెజిటిమిస్టులకూ మధ్య ఎంత విభేదమున్నా కూడా, తమ సంయుక్త పాలనను సాగించడానికి గాను రెండు యుగాలకు సంబంధించిన అణచివేత సాధనాలనూ ఏకంచెయ్యడం అవసరమనీ, జూలై రాజరికపు అణచివేత సాధనాలకు పునరుద్ధరణ అణచివేత సాధనాలను జోడించి, వాటిని పటిష్ఠం చెయ్యడం అవసరమనీ వాళ్లు అర్థంచేసుకున్నారు.

జిల్లాలలోని రైతులు, తమ ఆశలన్నీ నిరాశలు కాగా, ఒక వంక ధాన్యాల ధరలు పడిపోయిన కారణంగాను, మరో వంక పెరుగుతున్న పన్నుల, తనఖా బాకీల భారం మూలంగాను యింతకు ముందెన్నటికన్న క్రుంగిపోయి, ఆందోళన చెయ్యనారంభించారు. వాళ్ల ఆందోళనకు జవాబుగా, ఉపాధ్యాయులకు వ్యతిరేకంగా చర్యలు ప్రారంభింపబడ్డాయి, మతబోధకులకు వారు అధీనులు చెయ్యబడ్డారు. మేయర్లకు వ్యతిరేకంగా చర్యలు ప్రారంభింపబడ్డాయి, వారు ప్రిఫెక్టులకు అధీనులు చెయ్యబడ్డారు. గూఢచారి వ్యవస్థ నెలకొల్పబడింది, దానికి అందరూ గురి చెయ్యబడ్డారు. పారిస్‌లోను, పెద్ద పట్టణాల్లోను అభివృద్ధినిరోధకత్వం తన యుగానికి అనురూపంగానే వుంది, అది దెబ్బతీసేదానికన్న అధికంగా సవాళ్లు విసురుతోంది. గ్రామీణ ప్రాంతంలో యిందుకు విరుద్ధంగా అది, మొద్దు, మొరటు, నీచ, విసుగుపుట్టించే, పీడక రూపాన్ని, ఒక మాటలో సాయుధ పోలీసు రూపాన్ని ధరించింది. మత బోధకుల పాలనచే పవిత్రంచేయబడిన మూడేళ్ల సాయుధ పోలీసు పాలన, అపరిణత జనసామాన్యపు ధైర్యాన్ని ఎంతగా దెబ్బతీస్తుందో ఎవరైనా తేలికగా గ్రహించవచ్చు.

పార్టీ ఆఫ్ ఆర్డర్ అల్పసంఖ్యాకులకు వ్యతిరేకంగా జాతీయ అసెంబ్లీ వేదికపైనుంచి యెంత ఆవేశాన్నీ ఎంత వాక్చాతుర్యాన్నీ ప్రదర్శించినాకూడా, దాని నోటివెంట బయల్వెడలిన మాటలు క్రిస్టియన్ల మాటల్లాగే: ఔనౌను, కాదు కాదు అనే ఏకపదానికే పరిమితమ

య్యాయి. సభావేదిక పైన అయినా, పత్రికలోనైనా అన్ని చోట్లా అదే ఏకపద సమాధానమే జవాబు ముందే తెలిసిపోయిన అనాసక్తిదాయకమైన చిక్కుప్రశ్న ప్రాయంగా తయారైంది. అది మహజరు సమర్పించే అధికార సమస్య అయినా మద్యంపై పన్ను సమస్య అయినా, పత్రికా స్వేచ్ఛ సమస్య అయినా స్వేచ్ఛావాణిజ్య సమస్య అయినా, క్లబ్బుల సమస్య అయినా మ్యునిసిపల్ చార్టరు సమస్య అయినా, వ్యక్తి స్వేచ్ఛా సమస్య అయినా — ప్రభుత్వ బడ్జెట్ నియంత్రణ సమస్య అయినా, అదే ఊతపదం వల్లెవెయ్యబడుతుంది, పాడిన పాతపాటయే మళ్లీ పాడబడుతుంది, తయారై సిద్ధంగావున్న అదే తీర్పు వినిపింపబడుతుంది: "సోషలిజం!" చివరకు బూర్జువా ఉదారవాదం కూడా సోషలిజంగా ప్రకటింపబడుతుంది, బూర్జువా జ్ఞానవికాసానికి కూడా సోషలిస్టు ముద్రవెయ్యబడుతుంది, బూర్జువా ఆర్థిక సంస్కరణ సైతం సోషలిస్టు చర్యగా అభివర్ణింపబడుతుంది. అంతకు ముందొక కాలువ ఉన్న చోట రైల్వేలైను నిర్మిస్తే అది సోషలిజం, కత్తితో దాడిచేసినప్పుడు కర్ర తీసుకొని ఆత్మరక్షణ చేసుకోవడం కూడా సోషలిజమే.

ఇది కేవలం ఒక భాషాలంకారం గాని, ఫేషను గాని, లేక పార్టీ ఎత్తుగడ గాని కాదు. బూర్జువావర్గానికి యీ క్రింది వాస్తవానికి సంబంధించిన నిజమైన అంతర్జ్ఞానం వుంది: ఫ్యూడలిజానికి వ్యతిరేకంగా తను తయారుచేసిన ఆయుధాలన్నీ కూడా తమ మొనలను తనకు వ్యతిరేకంగానే తిప్పాయి, తను తయారు చేసిన విద్యాసాధనాలన్నీ కూడా తన సొంత నాగరికతకు వ్యతిరేకంగా తిరుగబడ్డాయి, ఏ దేవతలనైతే తను సృష్టించిందో వాళ్లందరూ యిప్పుడు తనకు దూరమయ్యారు. పౌర స్వేచ్ఛలు, ప్రగతి అంగాలు అనబడేవన్నీ తన వర్గాధిపత్య సామాజిక పునాదినీ, రాజకీయ శిరస్సునూ ఏకకాలంలో దెబ్బతీస్తున్నాయి, వాటికి ముప్పుతెస్తున్నాయి, అందుకని అవి "సోషలిస్టు"వయ్యాయి. ఈ ముప్పునూ, యీ దాడినీ అది సరిగా సోషలిజంయొక్క రహస్యంగా గ్రహించింది. సోషలిజం సారాంశాన్నీ, స్వభావాన్నీ సోషలిస్టులనబడేవాళ్లు స్వయంగా అంచనావేసుకోగలిగినదాని కన్న బూర్జువావర్గమే మరింత సరిగా అంచనావెయ్య గలిగింది — ఆ సారాంశాన్ని మరింత కచ్చితంగా గ్రహించింది. మానవాళి కష్టాలపట్ల విచారం ప్రకటించినా, హృదయం ద్రవీభవించే అలా చేసినా, లేక క్రిస్టియన్ల మాదిరిగా స్వర్ణయుగాగమనం కోసమూ, సర్వమానవ ప్రేమకోసమే నిజంగా ఎదురుచూసినా, లేక మానవత్వ పద్ధతిలో ఏదో ఆషామాషీగా మనోవిద్యా స్వాతంత్ర్యాలను గురించి మాట్లాడుతున్నా, బూర్జువావర్గం, తమకు వ్యతిరేకంగా ఎందుకు పరాఙ్ముఖమవుతోందో సోషలిస్టులనబడేవాళ్లు గ్రహించలేకపోయారు. బూర్జువావర్గం గ్రహించని అంశం ఒకటుంది, ఈ తర్కాన్ని కొనకంటా తీసుకెళ్తే తన సొంత పార్లమెంటరీ వ్యవస్థా మొత్తంపైన తన రాజకీయ పాలనా కూడ యిప్పుడు సోషలిస్టు అన్న సాధారణ ఆరోపణకు గురయ్యే ప్రమాదముందన్నదే అది. బూర్జువావర్గ పాలన పూర్తిగా సంఘటితం కానంత

కాలం, దానికి తన శుద్ధ రాజకీయ రూపం లభించనంతకాలం, తదితర వర్గాల శత్రువైరుధ్యం కూడా, అదేవిధంగా, తన శుద్ధ రూపంలో వ్యక్తం కాజాలదు; ఒకవేళ ఎక్కడైనా అది వ్యక్తమైనా కూడా, అక్కడ అది రాజ్యాధికారానికి వ్యతిరేకంగా జరిగే ప్రతి పోరాటాన్నీ పెట్టుబడికి వ్యతిరేకంగా మార్చే ప్రమాదకరమైన మలుపును తీసుకోజాలదు. సామాజిక జీవితానికి సంబంధించిన ప్రతి ఆందోళనలోనూ బూర్జువావర్గానికి "శాంతి"కి ప్రమాదం కనబడినట్లయితే, సమాజపు శిరోస్థానంలో అశాంతి వ్యవస్థను, తన సొంత రాజ్యాన్ని, పార్లమెంటరీ వ్యవస్థను, బూర్జువావర్గానికి చెందిన ఒక వ్యాఖ్యాత కథనానుసారంగా పోరాటంలోనూ, పోరాటం ద్వారానే జీవించే ఈ వ్యవస్థను ఎలా సాగించగలుగుతుంది? పార్లమెంటరీ వ్యవస్థ చర్చలతో మనుగడ సాగిస్తుంది, అటువంటప్పుడు అది చర్చలపై ఆంక్షలనెలా పెట్టగలుగుతుంది? దానిలో ప్రతి ప్రయోజనమూ, ప్రతి సామాజిక సంస్థా సాధారణ భావాలలోకి మార్చబడుతుంది, ఆ భావాల రూపంలోనే వాదవివాదాలు జరపబడతాయి; అటువంటి పరిస్థితిలో ఏ ప్రయోజనమైనా, ఏ సంస్థ అయినా ఆలోచనకు అతీతంగా తనను తానెలా స్థిరపరుచుకోగలుగుతుంది? తనను తానొక విధిగా అనుసరించితీరాల్సిన మతసూత్రంగా ఎలా చేసుకోగలుగుతుంది? సభావేదికపై వక్తల ఘర్షణ వార్తాపత్రికా రచయితలలో ఘర్షణను ప్రేరేపిస్తుంది. పార్లమెంటులోని వాగ్వివాదాలు డ్రాయింగురూములోను, మద్యగృహాల్లోను జరిగే వాదవివాదాలతో పూరింపబడుతాయి; నిరంతరాయంగా ప్రజాభిప్రాయం కోసమై విజ్ఞప్తిచేసే పార్లమెంటు ప్రతినిధులు ప్రజాభిప్రాయానికి మహజరు పత్రాలద్వారా నిజాభిప్రాయ వ్యక్తీకరణకు అధికారాన్ని కల్పిస్తున్నారు. పార్లమెంటరీ వ్యవస్థ ప్రతి అంశాన్నీ మెజారిటీ నిర్ణయాలకు విడిచిపెడుతుంది; మరి అలాంటప్పుడు పార్లమెంటు వెలుపలగల అత్యధిక సంఖ్యాకులు నిర్ణయాలు తీసుకోకుండా ఉండాలని ఎందుకు కోరుకుంటారు? రాజ్యపు శిరోస్థానంలో నిలబడి తమరు మద్దెల వాయిస్తే క్రిందనున్న ప్రజలు నాట్యంచెయ్యక మరేం చేస్తారు?

ఆ విధంగా, యింతకు ముందు తను దేన్నైతే "ఉదారవాదం"గా ఆకాశాని కెత్తుతూ వచ్చిందో దాన్నే యిప్పుడు "సోషలిజం"గా ఖండించడం ద్వారా తన సొంత ప్రయోజనాలే తన సొంత పాలన ప్రమాదంనుండి విముక్తం కావాలని నిర్దేశిస్తున్నట్లు బూర్జువావర్గం ఒప్పుకుంటోంది, దేశంలో శాంతిని పునరుద్ధరించేందుకుగాను, అన్నిటికన్న మొదట తన బూర్జువా పార్లమెంటుకి శాశ్వతశాంతి కల్పించడం అవసరం; తన సామాజిక అధికారాన్ని చెక్కుచెదరకుండా నిలుపుకోవాలంటే తన రాజకీయ అధికారాన్ని ఛిన్నాభిన్నంచెయ్యాలి; విడి బూర్జువాలు యితర వర్గాలను దోపిడి చేసుకోవడాన్ని కొనసాగించి, నిరభ్యంతరంగా ఆస్తి, కుటుంబ, మత, వ్యవస్థల ప్రయోజనాలను అనుభవిస్తూ ఉండగలగాలంటే యితర వర్గాల మాదిరిగానే తమ వర్గం కూడా రాజకీయంగా అంతరించడానికి ఒప్పుకోవాలి; తన

డబ్బుసంచిని కాపాడుకొనేందుకుగాను గద్దెను వదులుకోవాల్సి వుంటుంది, ఏ కత్తి అయితే తనను కాపాడుతున్నదో దానినే డెమోకిల్స్ కత్తిగా మార్చి తన నెత్తి పైననే వేలాడదీసు కోవలసివుంటుంది.

సాధారణం పౌరుల ప్రయోజనాల విషయంలో జాతీయ సభ తనను తాను పనికిమాలిన దిగా రుజువుచేసుకుంది. ఉదాహరణకు, పారిస్ – అవిన్యోన్ రైల్వే విషయంలో 1850 శీతకాలంలో ప్రారంభమైన చర్చలు 1851 డిసెంబరు 2 దాకా సాగినా కూడా ఒక కొలిక్కిరాలేదు. ఏ సందర్భాల్లో అయితే తను దమనకాండ సాగించలేకపోయిందో, అభివృద్ధి నిరోధక పద్ధతిని అవలంబించలేకపోయిందో ఆ సందర్భాల్లో జాతీయ సభ నయంకాని వంధ్యాత్వరోగంతో తీసుకుంది.

బోనపార్టు మంత్రివర్గం ఒక వంక, పార్టీ ఆఫ్ ఆర్డర్ భావాలకు అనుగుణంగా చట్టాలను రూపొందించడానికి ఒక విధంగా చొరవ ప్రదర్శించి, వాటిని అమలుపరచడంలోను, నిర్వహించడంలోను కాఠిన్యప్రయోగంలో ఒక విధంగా ఆ పార్టీనే మించిపోగా, మరోవంక బోనపార్టు, బాల్యచాపల్యంతో కూడిన వెకిలి ప్రతిపాదనలు చేసి ప్రజాభిమానం పొంద డంకోసం ప్రయత్నిస్తూ, జాతీయ అసెంబ్లీపట్ల తన శత్రువైఖరిని ప్రదర్శిస్తూ తనవద్ద గుప్తనిధి ఏదో వున్నట్లూ, ఆ గుప్త సంపదలను తను ప్రేంచి ప్రజలకు అందజెయ్యకుండా పరిస్థితులు తనకు తాత్కాలికంగా అడ్డుతగులుతున్నట్లూ సూచించాడు. నాన్ కమిషన్డ్ ఆఫీసర్ల వేతనంలో రోజుకి నాలుగు సూలు పెంచాలన్న అతని ప్రతిపాదన, కార్మికులకు వారి మాటనమ్మికపై రుణాలు మంజూరుచేసే బ్యాంకులను తెరవాలన్న అతని ప్రతిపాదనా అలాంటివే. బహుమతి రూపంలో ధనం, రుణరూపంలో ధనం పొందే అవకాశాలను చూపించి జనసామాన్యాన్ని ప్రలోభపెట్టాలని ఆశించాడు, భ్రష్టబికారి గాలిమూకయొక్క ఆర్థిక విజ్ఞానశాస్త్రం (ఆ మూక ఉన్నత స్థాయికి చెందినదైనా నిమ్న స్థాయికి చెందినదైనా) – విరాళాలు, రుణాలు – అనే రెండింటికే పరిమితం. బోనపార్టు వినియోగించగల వనరులు సైతం సరిగా యీ రెండే. జనసామాన్యపు మూఢత్వంపై యింత మూఢంగా జూదమాడిన సింహాసన వారసత్వాభ్యర్థి మరొకడెవడూ ఎన్నడూ లేడు.

తనకు వ్యతిరేకంగా ప్రజాభిమానాన్ని చూరగొనడానికి బోనపార్టు చేస్తున్న స్పష్టమైన ప్రయత్నాలపట్ల, తన రుణాలు తనను ముందుకు నెట్టుతూండగా, తనను వెనక్కులాగే సత్కీర్తిసంపద అంటూ ఏదీ లేని యీ సాహసికుడు ముందు వెనుకలు చూడకుండా దుస్సాహసంతో ఏదో ఒక రోజున రాజకీయ కుట్రకు పూనుకొనే ప్రమాదం నానాటికీ పెరుగు తూండటంపట్ల జాతీయ సభ మళ్లీ మళ్లీ మండిపడింది. పార్టీ ఆఫ్ ఆర్డరుకీ అధ్యకు నికీ మధ్య జగడం ముదిరి ప్రమాదస్థాయికి చేరుకుంది, అంతలోనే ఆకస్మిక సంఘటన ఒకటి అధ్యక్షుడు పశ్చాత్తప్తుడై జాతీయ సభ ముందు చేతులుకట్టుకొని నిలబడేలా చేసింది.

ఈ సంఘటన 1850 మార్చి 10 నాటి ఉప ఎన్నికలు అని మా ఉద్దేశం. జూన్ 13 తర్వాత జైళ్లలో పెట్టబడిన, లేక ప్రవాసం పంపబడిన ప్రతినిధుల స్థానాలను భర్తీ చెయ్యడానికి గాను ఈ ఎన్నికలు నిర్వహింపబడ్డాయి. పారిస్ సోషల్-డెమోక్రటిక్ పార్టీ ప్రతినిధులను మాత్రమే ఎన్నుకుంది. అంతే కాకుండా, తన ఓట్లలో అత్యధిక భాగాన్ని డెఫ్లోట్ అనే 1848 జూన్ నాటి ఒక తిరుగుబాటుదారుకి వేసింది. ఆవిధంగా, పెటీబూర్జువా వర్గం శ్రామికవర్గంతో పొత్తుపెట్టుకొని, 1849 జూన్ 13 నాటి తన పరాజయానికి ప్రతీకారం తీర్చుకుంది. మరింత అనుకూల సమయంలో, మరింత అధిక సంఖ్యలో సైన్యాన్ని సమకూర్చుకొని, మరింత సాహసికమైన నినాదాలతో యుద్ధరంగంలో తిరిగి ప్రత్యక్షమయ్యేందుకే అది ప్రమాద క్షణంలో యుద్ధ రంగంలోంచి మాయమైందా అనిపించింది. ఒక పరిస్థితివల్ల ఈ ఎన్నిక విజయపు ముప్పు మరింతగా పెరిగినట్లు కనిపించింది: పారిస్‌లో సైన్యం బోనపార్ట్ మంత్రుల్లో ఒకడైన లాహిట్‌కి వ్యతిరేకంగా జూన్ తిరుగుబాటుదారుకు తన ఓట్లు వేసింది, జిల్లాల్లో ఎక్కువ భాగం మహీధరం పార్టీ సభ్యులకు ఓట్లు వేసింది, పారిస్‌లో అంత నిశ్చితంగా కాకపోయినా జిల్లాల్లో కూడా మహీధరం పార్టీ సభ్యులు తమ ప్రత్యర్థులపై ఆధిక్యతను నిలుపుకున్నారు.

తను ఆకస్మికంగా విప్లవానికి ఎదురుబదురుగా నిలిచిన సంగతిని మరోసారి బోనపార్ట్ స్వయంగా గ్రహించాడు. 1849 జనవరి 29న, 1849 జూన్ 13న లాగే 1850 మార్చి 10న అతను పార్టీ ఆఫ్ ఆర్డరు మాటున దాగాడు. అతను సాగిలపడి దణ్ణం పెట్టాడు, చెవులుపట్టుకొని క్షమాపణ వేడుకున్నాడు, పార్లమెంటరీ మెజారిటీ అభిమతం మేరకు మంత్రివర్గాన్ని ఏర్పాటుచేస్తానని మాటయిచ్చాడు, చివరకు అతను ఆర్లియనిస్టు, లెజిటిమిస్టు పార్టీలకు చెందిన త్యేర్, బెర్యే, బ్రొయ్లీ, మోలే వంటి నాయకులను, అంటే బుర్గ్రాఫ్‌లు[96] అనబడే వాళ్లను రాజ్యపు కర్ణధారిత్వాన్ని చేబట్టమనిసైతం అర్థించాడు. మరెన్నడూ తిరిగిరాని యీ అవకాశాన్ని వినియోగించుకోవడంలో పార్టీ ఆఫ్ ఆర్డర్ విఫలమైంది. తనకు ఇవ్వజూపబడిన అధికారాన్ని ధైర్యంగా చేజిక్కించుకోకపోగా, కనీసం అది, నవంబరు 1న బర్తరఫ్ చెయ్యబడిన మంత్రివర్గాన్ని పునరుద్ధరించేలాగ అయినా బోనపార్ట్‌పై గట్టిగా ఒత్తిడి చెయ్యలేదు; తన క్షమాదానం ద్వారా అతణ్ణి అవమానపరచి, ఓపూల్ మంత్రి వర్గంలో బరోష్‌ను చేర్చడంతో తృప్తిచెందింది. ఈ బరోష్ మహాశయుడు ప్రభుత్వ న్యాయవాదిహోదాలో బుర్జేలోని హైకోర్టులో, మొదటిసారి మే 15 విప్లవవాదులకు వ్యతిరేకంగాను, రెండవ సారి జూన్ 13 డెమోక్రాట్లకు వ్యతిరేకంగాను — ఈ రెండుసార్లూ కూడా జాతీయ అసెంబ్లీని దెబ్బతియ్య ప్రయత్నించినందుకే — గర్జిస్తూ విరుచుకుపడిన వ్యక్తి. అయితే తదుపరి దశలో, అదే జాతీయ సభ పరువుదియ్యడానికి యీ మహాశయుడు కారణభూతుడైనంతగా బోనపార్ట్ మంత్రుల్లో మరొకడెవరూ కారణభూతుడు

కాలేదు. 1851 డిసెంబరు 2 తర్వాత మళ్లీ యీ పెద్దమనిషి పెద్ద జీతంతో కూడిన సెనేట్ ఉపాధ్యక్ష పదవిలో సుప్రతిష్ఠితుడై మనకి దర్శనమిస్తాడు. అతను విప్లవవాదుల కంచంలోని ఆహారంపై ఎందుకు ఉమ్మాడంటే బోనపార్ట్ దాన్ని తినగలిగేందుకే.

సోషల్-డెమోక్రటిక్ పార్టీకి సంబంధించినంతవరకు, అది బహుశా స్వయంగానే తన విజయాన్ని మరోమారు అనుమానాస్పదం చేసేందుకూ, తన ములికిని తనే మొద్దుబారజేసేందుకూ సాకులు వెతుకుతున్నదేమోననిపిస్తుంది. పారిస్‌లో కొత్తగా ఎన్నుకోబడిన ప్రతినిధి విదాల్, ఏకకాలంలోనే స్ట్రాస్‌బుర్గ్‌లో కూడా ఎన్నుకోబడ్డాడు. పార్టీ అతనిని పారిస్ సీటును వదులుకొని స్ట్రాస్‌బుర్గ్ సీటును అట్టే పెట్టుకొనేలా చేసింది. ఈ విధంగా, ఎన్నికల్లో తన విజయాన్ని కడకంట తీసుకెళ్లి, తద్వారా పార్టీ ఆఫ్ ఆర్డర్ పార్లమెంటులో తక్షణమే తనతో తలపడక తప్పని పరిస్థితి తెచ్చిపెట్టకుండా, ఆ విధంగా, ప్రజల్లో ఉత్సాహమూ, సైన్యంలో అనుకూల మనోస్థితీ ఉన్న తరుణంలో ప్రత్యర్థి పోరాడేలా ఒత్తిడి తేకుండా, డెమోక్రటిక్ పార్టీ మార్చి, ఏప్రిల్ మాసాల్లో, ఓ కొత్త ఎన్నికల ఉద్యమంతో పారిస్‌ను అలసిపోయేలా చేసింది, ప్రజల్లో జాగృతమైన ఉద్వేగాన్ని తిరిగి జరిగే ఎన్నికల క్రీడలో చల్లపడిపోనిచ్చింది, విప్లవ శక్తిని రాజ్యాంగచట్టబద్ధమైన విజయాలతో తృప్తిచెందిపోనిచ్చింది, దానిని తుచ్ఛమైన కుతంత్రాలతో, శుష్క ప్రసంగాలలో, నకిలీ ఉద్యమాలలో క్షీణించిపోనిచ్చింది, బూర్జువావర్గాన్ని సంఘటితమై తన సన్నాహాలు చేసుకోనిచ్చింది, చిట్టచివరి సంగతేమిటంటే, ఏప్రిల్ ఉప ఎన్నికలో భావావేశ భరితమైన వ్యాఖ్య మాదిరిగా ఎజేన్ స్యూ ఎన్నిక ద్వారా – మార్చి ఎన్నికల ప్రాముఖ్యాన్ని నీరుగార్చింది. ఒక్క మాటలో చెప్పాలంటే, మార్చి 10ని అది "ఏప్రిల్ ఫూల్" దినంగా దిగజార్చింది.

పార్లమెంటరీ మెజారిటీ తన ప్రత్యర్థుల బలహీనతను అర్థం చేసుకుంది. పార్టీ ఆఫ్ ఆర్డర్‌యొక్క పదిహేడు మంది బుర్గ్రాఫ్‌లూ – బోనపార్ట్ వారి చేతుల్లోనే దాడినిర్దేశకత్వ భారాన్నీ, బాధ్యతనూ ఉంచాడు – ఒక కొత్త ముసాయిదా ఎన్నికల చట్టాన్ని తయారు చేశారు, దాన్ని ప్రవేశపెట్టే గౌరవం తనకే కావాలని కోరుకున్న ఫౌషేకి ఆ బాధ్యత అప్పగించబడింది. మే 8న అతను, సార్వజనిక ఓటింగుహక్కును రద్దుచేసే, ఓటు హక్కు పొందేందుకు ఎన్నిక జరిగే ప్రాంతంలో మూడేళ్ల నివాసాన్ని షరతుగా విధించే, కట్టకడపట, కార్మికులకు సంబంధించినంతవరకు, అటువంటి నివాసం విషయంలో రుజువును వారి యజమానులిచ్చే సర్టిఫికేటుపై ఆధారపడజేసే చట్టాన్ని ప్రవేశపెట్టాడు.

డెమోక్రాట్లు రాజ్యాంగచట్టబద్ధమైన ఎన్నిక పోరాట సమయంలో విప్లవ పద్ధతిలో మనస్సులను ఆందోళితపరచి, గర్జించినట్లుగానే, యిప్పుడు, ఆ విజయపు గంభీర స్వభావాన్ని ఆయుధాలు చేబూని రుజువుపరచాల్సిన సమయంలో, రాజ్యాంగచట్టబద్ధమైన పద్ధతిలో, సక్రమ ప్రవర్తననూ, హుందాతనంతోకూడిన ప్రశాంతతనూ (calme maje-

stueux), చట్టబద్ధ కార్యకలాపాలనూ బోధించారు, అంటే, ఏదైతే తనే చట్టమై నెత్తిన కూర్చుందో ఆ విప్లవ ప్రతీఘాతపు అభీష్టానికి కళ్ళుమూసుకొని దాసోహం అనమని చెప్పారన్నమాట. మహీధరం పార్టీ చర్యాక్రమంలో పార్టీ ఆఫ్ ఆర్డర్‌యొక్క విప్లవ ఆవేశానికి జవాబుగా, చట్టపు పరిధిలో ఉండే కూపస్థమండూకాల మాదిరిగా నిరావేశ ధోరణి వహించి, తను విప్లవ పద్ధతిలో ప్రవర్తిస్తున్నదన్న ఆ పార్టీ భయంకర దోషారోపణకు బదులుగా తను భూపతితం కావడం ద్వారా ఆ పార్టీని అవమానం పాలుచేసింది. కొత్తగా ఎన్నికైన ప్రతినిధులు సైతం తమ మర్యాద మన్ననల ద్వారా సంయమనం ద్వారా తమను అరాజకవాదులుగా నిరసించడం, తమ ఎన్నికను విప్లవానికి విజయంగా పరిగణించడమూ ఎంత పొరపాటు అభిప్రాయమో రుజువుచెయ్యడానికి తంటాలుపడ్డారు. మే 31న కొత్త ఎన్నికల చట్టం ఆమోదింపబడింది. మహీధరం పార్టీ ఒక నిరసనపత్రాన్ని గుట్టుచప్పుడు కాకుండా అధ్యక్షుని జేబులో పెట్టి సంతృప్తిపడింది. ఎన్నికల చట్టం తర్వాత ఒక కొత్త పత్రికాచట్టం జారీ చెయ్యబడింది, దీని ద్వారా విప్లవ వార్తాపత్రికలు పూర్తిగా అణచివెయ్యబడ్డాయి.[97] అవి యిందుకు యోగ్యమైనవే. ఈ జలప్రళయానంతరం బూర్జువావర్గానికి చెందిన రెండు పత్రికలు "National," "La Presse"[98] మాత్రమే విప్లవంయొక్క రెండు అత్యంత పురోగామిదుర్గాలుగా మిగిలాయి.

మార్చి, ఏప్రిల్ మాసాల్లో డెమొక్రటిక్ పార్టీ నాయకులు పారిస్ ప్రజలను ఒక నకిలీ పోరాటంలో యిరికించడానికెలా శాయశక్తులా ప్రయత్నించేశారో, మే 8 తర్వాత నిజమైన పోరాటంలోకి దిగకుండా వారినేవిధంగా నిరోధించప్రయత్నించారో మనమింతకు ముందే చూశాం. దీనికితోడు, 1850వ సంవత్సరం పారిశ్రామిక, వాణిజ్య వికాసం దృష్ట్యా మహోజ్వలమైన సంవత్సరాల్లో ఒకటి అన్న విషయాన్నీ, అకారణంగా పారిస్ శ్రామికవర్గానికి నిరుద్యోగమన్నదే లేదన్న విషయాన్నీ మనం ఎంతమాత్రమూ మరచిపోకూడదు. కాని, 1850 మే 31 నాటి ఎన్నికచట్టం రాజకీయాధికారంలో ఏ విధంగానూ పాల్గొనకుండా శ్రామికవర్గాన్ని దూరంచేసింది. అది దాన్ని అసలు పోరాట రంగంనుంచే దూరంచేసింది. ఫిబ్రవరి విప్లవానికి ముందు కార్మికులు ఎలా అస్పృశ్యులుగా ఉండేవారో తిరిగి ఆ స్థితికి వారిని అది నెట్టింది. వారు అటువంటి సందర్భంలో డెమొక్రాట్లకు తమపై నాయకత్వాన్ని అప్పగించడంద్వారా, క్షణిక సుఖసౌకర్యాల కోసం తమ వర్గంయొక్క విప్లవ ప్రయోజనాలను విస్మరించడం ద్వారా, విజేయశక్తిగా ఉండే గౌరవాన్ని పరిత్యజించారు, విధి ముందు మోకరిల్లారు, 1848 జూన్ నాటి పరాజయం తమను సంవత్సరాలతరబడి పోరాటరంగంనుంచి నెట్టివేసిందనీ, చారిత్రక క్రమం యిప్పుడు మరల తమ ప్రసక్తి లేకుండానే ముందుకు పోవలసివుంటుందనీ రుజువుచేశారు. పెటీబూర్జువా ప్రజాస్వామ్యానికి సంబంధించినంతవరకు, ఏదైతే జూన్ 13న: "సార్వజనిక ఓటింగు హక్కుపై దాడిచేయసాహసించనివ్వండి, అప్పుడు

చూద్దాం!" అంటూ గర్జించిందో అది యిప్పుడు, తనకు తగిలిన విప్లవ ప్రతిఘాత ఆఘాత మేదైతేవుందో అది అఘాతమే కాదనీ, మే 31 నాటి చట్టమేదైతే వుందో అది చట్టమే కాదనీ వాదిస్తూ తనను తాను సముదాయించుకుంది. 1852 మే మాసంలో రెండవ ఆదివారం నాడు, ప్రతి ఫ్రెంచి దేశీయుడూ పోలింగు కేంద్రంలో ఒక చేతిలో బేలట్ కాగితంతోనూ మరో చేతిలో కత్తితోనూ వస్తాడంటూ జోస్యం చెప్పి అది తృప్తిచెందింది. కట్టకడపట, సైన్యం తన ఉన్నతాధికారులచేత 1849 మే 28 నాటి ఎన్నికల కోసం చెయ్యబడినట్లే 1850 మార్చి, ఏప్రిల్ ఎన్నికల కోసం క్రమశిక్షితులు చెయ్యబడ్డారు. కానైతే యీమారు సైన్యం "విప్లవ జాలంలో మేము మూడోసారి పడబోము!" అని నిశ్చితంగా చెప్పింది.

1850 మే 31 నాటి చట్టం బూర్జువావర్గం చేసిన రాజకీయ కుట్ర. విప్లవంపై అది యింతవరకూ సాధించిన విజయాలన్నీ తాత్కాలిక స్వభావం కలిగినవి. అప్పుడున్న జాతీయ సభ రంగంనుంచి నిష్క్రమించగానే ఆ విజయాలు ప్రమాదంలో పడుతూవచ్చాయి. అవి కొత్త సాధారణ ఎన్నికల అనిశ్చిత ఫలితాలపై ఆధారపడుతూవచ్చాయి, 1848నుండి జరిగిన ఎన్నికల చరిత్రవల్ల బూర్జువావర్గపు వాస్తవ పెత్తనం ఏమేరకైతే అభివృద్ధిచెందిందో ఆమేరకు జనసామాన్యంపై బూర్జువావర్గపు నైతిక ప్రభావం తగ్గుతూ వస్తోందని తిరుగులేకుండా రుజువైంది. మార్చి 10న, సార్వజనిక ఓటింగు హక్కు బూర్జువావర్గ పెత్తనానికి తన వ్యతిరేకతను ప్రత్యక్షంగా చాటిచెప్పింది; బూర్జువావర్గం సార్వజనిక ఓటింగు హక్కును చట్టబాహ్యం చెయ్యడంద్వారా దీనికి జవాబుచెప్పింది. అందుచేత, మే 31 చట్టం వర్గ పోరాటపు ఆవశ్యకతల్లో ఒకటి. మరోవంక, రాజ్యాంగచట్టం ప్రకారం, కనీసం 20 లక్షల ఓట్లు లభించినప్పుడే రిపబ్లిక్ అధ్యక్ష ఎన్నిక చెల్లుతుంది. అధ్యక్ష పదవికి పోటీచేసే అభ్యర్థులలో ఏ ఒక్కరికీ యీ కనీస సంఖ్య ఓట్లు రాకపోయినట్లయితే, అందరిలోకీ మిక్కిలి ఎక్కువ ఓట్లు లభించిన ముగ్గురు అభ్యర్థుల్లోంచి ఒకరిని అధ్యక్షుడుగా జాతీయ సభ ఎంపిక చెయ్యాల్సివుంటుంది. రాజ్యాంగ నిర్ణయ సభ యీ చట్టాన్ని చేసే నాటికి, ఓటర్ల జాబితాలో ఒక కోటిమంది ఓటర్లు నమోదుచెయ్యబడ్డారు. అందుచేత, దాని దృష్టిలో, ఓటు చెయ్యడానికి అర్హులైన వారిలో అధ్యక్ష ఎన్నిక చెల్లడానికి అయిదో వంతు మంది ఓటుచేస్తే చాలు. మే 31 చట్టం కనీసం 30 లక్షల ఓట్లను ఓటర్ల జాబితానుంచి కొట్టివేసింది, ఓటింగు అర్హత కలిగిన ప్రజల సంఖ్యను 70 లక్షలకు తగ్గించింది, అయినా కూడా, అధ్యక్ష ఎన్నికకు చట్టబద్ధంగా అవసరమైన కనీస సంఖ్యను 20 లక్షలుగానే అట్టేపెట్టింది. తద్వారా అది, చట్టబద్ధమైన కనీస సంఖ్యను పోలైన ఓట్లలో అయిదో వంతునుండి సుమారు మూడవ వంతుకి పెంచింది, అంటే అధ్యక్ష ఎన్నికను ప్రజల చేతుల్లోంచి లాగివేసి, జాతీయ సభ చేతుల్లో పెట్టడానికి అవసరమైన

దంతా యీ చట్టం చేసిందన్నమాట. ఆ విధంగా మే 31 ఎన్నికల చట్టంద్వారా, జాతీయ సభ ఎన్నికనూ, రిపబ్లిక్ అధ్యక్షుని ఎన్నికనూ సమాజంలో స్తబ్ధంగా వుండే విభాగానికి అప్పగించి, పార్టీ ఆఫ్ ఆర్డరు తన పాలనను ద్విగుణీకృతంగా సుస్థిరంచేసుకుంది.

## V

విప్లవ సంక్షోభాన్ని గడిచి, సార్వజనిక ఓటింగు హక్కును రద్దుచెయ్యగానే జాతీయ అసెంబ్లీకీ బోనపార్ట్‌కీ మధ్య సంఘర్షణ తిరిగి ప్రారంభమైంది.

రాజ్యాంగచట్టంలో బోనపార్ట్ జీతం 6,00,000 ఫ్రాంకులుగా నిర్దేశింపబడింది. పదవీ ప్రతిష్ఠితుడైన తర్వాత ఆరు నెలలు గడిచాయో లేదో యీ మొత్తాన్ని రెట్టింపు చేయించుకోవడంలో అతను సఫలీకృతుడయ్యాడు, ఎలాగంటే ఒడిలోన్ బర్రో రాజ్యాంగ నిర్ణయ సభనుండి సంవత్సరానికి 6,00,000ల ఫ్రాంకుల అదనపు అలవెన్సును ప్రాతినిధ్య మొత్తాల పేర మంజూరుచేయించాడు. జూన్ 13 తర్వాత బోనపార్ట్ యిటువంటి అభ్యర్థనలనే మళ్లీ చేయించాడు, కాని యీ మారు బర్రోనుండి ప్రత్యుత్తరం రాలేదు. ఇప్పుడు, మే 31 తర్వాత, బోనపార్ట్ వెంటనే సానుకూల సమయాన్ని వినియోగించుకొని, తన మంత్రులచేత జాతీయ అసెంబ్లీలో అధ్యక్షుని కుటుంబ పోషణార్థం మూడు లక్షల ఫ్రాంకుల భరణం ఇవ్వాలని ప్రతిపాదింపచేశాడు. దీర్ఘ కాలంపాటు సాహసిక ద్రిమ్మరి జీవితం గడిపిన కారణంగా తన బూర్జువాలనుండి డబ్బు గుంజకొనడానికి వీలైన బలహీన క్షణాలను చటుక్కున పసిపట గల పరిణత శక్తిని బోనపార్ట్ సంపాదించుకున్నాడు. అతను శుద్ధ బ్లాక్‌మెయిల్‌కి దిగాడు. జాతీయ అసెంబ్లీ అతని తోడ్పాటుతో, అతని ఆమోదముద్రతో ప్రజల సర్వసత్తాక అధికారాన్ని అతిక్రమించింది. తన డబ్బుసంచిని తెరిచి సాలీనా తనకు ముప్ఫయ్ లక్షల ఫ్రాంకులివ్వడం ద్వారా తన నోటిని బందుచేశారా సరేసరి లేకుంటే మీ నేరాన్ని ప్రజల ముందు బహిర్గతం చేస్తానని అతను జాతీయ అసెంబ్లీని బెదరించాడు. ముప్ఫయ్ లక్షలమంది ఫ్రెంచివారి ఓటింగు హక్కును అది హరించింది. తన ఓటు చలామణీలో లేని ప్రతి ఒక ఫ్రెంచి దేశీయునికీ చలామణీలో వున్న ఒక్కొక్క ఫ్రాంకును, అంటే కచ్చితంగా ముప్ఫయ్ లక్షల ఫ్రాంకులను అతను డిమాండుచేశాడు. 60 లక్షల మంది నన్ను ఎన్నుకున్నారు, మరి యిప్పుడు నాకు ఎన్ని ఓట్లైతే లేకుండా చేశారో అన్ని ఓట్లకుగాను పరిహారాన్ని, వెనకనుంచి లెక్కగట్టి కక్కమని డిమాండుచేశాడు. గొంతెమ్మ కోర్కెలు కోరే యితని అసభ్యపు డిమాండును జాతీయ సభకయొక్క కమిషన్ తిరస్కరించింది. బోనపార్టిస్టు పత్రికలు బెదరింపులు సాగించాయి. జాతీయ సభ, సూత్రరీత్యా తను దేశ జనబాహుళ్యంతో నిర్ణయాత్మకంగా తెగతెంపులు చేసుకున్న తరుణంలో, రిపబ్లిక్ అధ్యక్షునితో తెగతెంపులు

చేసుకోగలదా? అధ్యక్షుని కుటుంబ నిర్వహణకోసం సాలుసరి భరణాన్ని అది నిరాకరించిన మాట నిజమే, కాని అది, యీ ఒక్కసారికి మాత్రం, 21,60,000ల ఫ్రాంకుల అదనపు అలవెన్సును మంజూరుచేసింది. ఆ విధంగా చేసి అది రెండు విధాలుగా తన బలహీనతను ప్రదర్శించింది — మొదటి సంగతి అది డబ్బును మంజూరుచేసింది, రెండవ సంగతి అదే సమయంలో తన విసుగును ప్రదర్శించి, తను ఆ సొమ్మును అయిష్టంగా మంజూరు చేసినట్లు రుజువు చేసుకుంది. బోనపార్ట్‌కి యీ సొమ్ము ఎందు కోసం అవసరమైందో మనం తర్వాత చూద్దాం. సార్వజనిక ఓటింగు హక్కు రద్దు తదుపరి వెంటనే సంభవించిన యీ చీకాకు తర్వాత, ఏ వ్యవధిలోనైతే బోనపార్ట్ మార్చి, ఏప్రిల్ సంక్షోభ కాలపు తన వినమ్రధోరణిని త్యజించి, ప్రజల అధికారాన్ని హరించి, పార్లమెంటుకి వ్యతిరేకంగా సవాలుచేసే తలబిరుసు ధోరణిని అవలంబించాడో ఆ వ్యవధిలో, జాతీయ సభ సమావేశాలలో మూడు నెలలపాటు — ఆగస్టు 11నుండి నవంబరు 11వరకు విరామం వచ్చింది. తన స్థానంలో అది 28 మంది సభ్యులతో కూడిన ఒక శాశ్వత కమిషన్‌ను ఏర్పాటుచేసింది, దానిలో బోనపార్టిస్టులెవరూ లేరు, కాని కొందరు మితవాద రిపబ్లికన్లు ఉన్నారు. 1849 నాటి శాశ్వత కమిషన్‌లో కేవలం పార్టీ ఆఫ్ ఆర్డర్‌కి చెందిన ప్రతినిధులూ, బోనపార్టిస్టులూ మాత్రమే వున్నారు. అయితే ఆ సమయంలో పార్టీ ఆఫ్ ఆర్డర్ తనను శాశ్వతంగా విప్లవ వ్యతిరేకిగా ప్రకటించుకుంది. ఈమారు పార్లమెంటరీ రిపబ్లిక్ తనను శాశ్వతంగా అధ్యక్షునికి వ్యతిరేకిగా ప్రకటించుకుంది. మే 31 నాటి చట్టం తర్వాత, పార్టీ ఆఫ్ ఆర్డర్‌కి యిప్పటికీ పోటీగా నిలిచిన ప్రత్యర్థి అతనొక్కడే.

1850 నవంబరులో జాతీయ సభ మరల సమావేశమైనప్పుడు, అధ్యక్షునితో దానికి యింతవరకు జరుగుతూవచ్చిన చిల్లర జగడాల స్థానంలో, ఆ రెండు శక్తులకూ మధ్య నిర్దాక్షిణ్యమైన గొప్ప పోరాటం, జీవన్మరణ పోరాటం తప్పనిసరి అయినట్లు కానవచ్చింది.

1849లో మాదిరిగానే ఈ ఏడాది పార్లమెంటు విరామకాలంలో కూడా, పార్టీ ఆఫ్ ఆర్డర్ వేర్వేరు పక్షాలుగా విడిపోయింది, వాటిలో ప్రతి ఒక్కటీ స్వీయాధికార పునరుద్ధరణ కోసం కుతంత్రాలలో నిమగ్నమైంది, లూయీ ఫిలిప్ మృతి కారణంగా యీ కుతంత్రాలకు కొత్తపుష్టి లభించింది. లెజిటిమిస్టు రాజు ఐదవ హెన్రీ లాంఛనప్రాయమైన ఒక మంత్రివర్గాన్ని కూడా ఏర్పాటుచేశాడు, పారిస్‌లో నివసించే ఆ మంత్రివర్గంలో శాశ్వత కమిషన్ సభ్యులు కొందరికి స్థానాలు లభించాయి. దానితో బోనపార్ట్‌కి కూడా, జిల్లాలలో పర్యటించి, తను ఏ పట్టణంలోనైతే తన శుభ పాదాన్ని మోపాడో దాని యిష్టాయిష్టాలను బట్టి, ఒక్కొక్కమారు గుప్తంగాను, మరోమారు బాహాటంగాను తన సొంత పునరుద్ధరణ పథకాలను వెల్లడించి, తనకు ఓట్లు ఆర్జించే అవకాశం లభించింది. ఘనత వహించిన అధికారిక "Moniteur" పత్రికా, బోనపార్ట్‌కి చెందిన చిన్నచిన్న అధికార పత్రికలూ

ఈ పర్యటనలను సహజంగానే విజయయాత్రలుగా అభివర్ణించాల్సివచ్చేది, డిసెంబరు 10 సంఘానికి చెందిన సభ్యులు బోనపార్ట్ వెంట వెళ్తూండేవారు. ఈ సంఘం 1849లో ఏర్పడింది. పరోపకార సంఘమొకదాన్ని ఏర్పాటుచేసే సాకుతో, పారిస్‌కి చెందిన భ్రష్టబికారి గాలిమూక రహస్య విభాగాలుగా సంఘటితంచెయ్యబడింది, ప్రతి ఒక్క విభాగమూ బోనపార్ట్ తైనాతీల నాయకత్వంలో ఉంచబడేది, ఈ మొత్తానికి అంతటికీ ఒక బోనపార్టిస్ట్ జనరల్ సర్వాధికారిగా ఉండేవాడు. ఎవరి జీవనాధారమూ, జన్మమూలమూ సందిగ్ధమో అటువంటి పతితులైన భ్రష్టాచారులు బూర్జువావర్గపు దివాళాకోరు, జూదగొండి సంతానం, వీరితో బాటు దేశద్రిమ్మరులు, మాజీ సైనికులు, పాత జైలుపక్షులు, శిబిరాలనుంచి పారిపోయి వచ్చిన నేరస్తులు, దగాకోర్లు, పిట్టల దొరలు, లజ్జరోనీలు,[99] జేబుదొంగలు, కంత్రీ వ్యక్తులు, జూదరులు, తార్పుడుగాళ్లు, వేశ్యాగృహ నిర్వాహకులు, మూటలు మోసేవాళ్లు, చౌకబారు రచయితలు, వీధిగాయకులు, చెత్త డబ్బాలలో పాతగుడ్డలు పోగుచేసేవాళ్లు, చాకులు సానబట్టేవాళ్లు, పాత్రలకు మాట్లువేసేవాళ్లు, బిచ్చగాళ్లు – ఒక్క మాటలో చెప్పాలంటే, ఫ్రెంచి వాళ్లచేత la bohème అని పిలవబడుతూ నిర్దిష్టమైన వ్యావృత్తి అంటూ లేకుండా, అసంఘటితంగా చెల్లాచెదరుగా ఉండే మొత్తం అమాంబాపతు జనం అన్న మాట. ఈ సజాతి వ్యక్తులనే బోనపార్ట్ తన డిసెంబరు 10 సంఘానికి మూలశక్తిగా చేసుకున్నాడు. దాని సభ్యులందరూ బోనపార్ట్ మాదిరిగానే, శ్రమించే దేశప్రజల ఖర్చుతో తమ స్వంత లాభం చూసుకోవాలని కోరుకునేవారే కనుక, ఆ మేరకు, యిది ఒక "పరోపకార సంఘమే." ఏ బోనపార్ట్ అయితే వర్గభ్రష్ట బికారి గాలిమూక సర్దారో, తను ఏ ప్రయోజనాల కోసమైతే వ్యక్తిగతంగా కృషిచేస్తున్నాడో తన ఆ ప్రయోజనాన్ని యిక్కడ మాత్రమే సమూహ రూపంలో మళ్లీ చూస్తాడో ఈ మురికి తెట్టును, యీ పనికిమాలిన చెత్తను, అన్ని వర్గాలచేతా విసర్జింపబడినవారినే తను నిస్సంకోచంగా ఆధారపడదగిన ఏకైక వర్గంగా ఎవరైతే పరిగణిస్తాడో అతనే అసలైన బోనపార్ట్, బోనపార్ట్ sans phrase*. అతను స్వయంగా తనొక నేర్పరి అయిన పాత భ్రష్టాచారి కనుక, అతని దృష్టిలో జాతుల చారిత్రక జీవితమూ, వాటి రాజ్యకార్యకలాపాలూ అత్యంత అశ్లీలమైన అర్థంలో వినోదాత్మక ప్రహసనాలూ, ఘనమైన దుస్తులూ, మాటలూ, అభినయాలూ, నీచాతి నీచమైన దగావంచనలకు ఒక ముసుగూ మాత్రమే. స్ట్రాస్‌బుర్గ్‌కి అతని దండయాత్రలో శిక్షిత స్విట్జెర్లండు గద్ద నెపోలియన్ రాబందు పాత్ర వహించాడు. బులోన్‌లో తన ఆకస్మిక చొరబాటుకుగాను అతను కొందరు లండన్ తైనాతీలకు ఫ్రెంచి యూనిఫారాలు తగిలించాడు. వాళ్లు సైన్యానికి ప్రతినిధులు.[100] తన డిసెంబరు 10 సంఘంలో అతను పదివేల మంది

* నాగరిక పదాల మేలిముసుగు లేకుండా. – సం.

లుచ్చా లఫంగులను పోగుచేశాడు, నాటకంలో నిక్ బాటమ్ సింహపు పాత్ర ధరించి బయటకు వచ్చినట్లు వీళ్ల ప్రజల పాత్ర ధరించాల్సివుంటుంది.* బూర్జువావర్గం స్వయంగా ఒక పూర్తి సమగ్ర ప్రహసనాన్ని, ఫ్రెంచి నాట్యసంప్రదాయానికి సంబంధించిన పాండిత్యప్రకర్షక సూత్రాలలో ఏ ఒక్కదాన్నీ ఉల్లంఘించకుండా, మహా గంభీరంగా అభినయిస్తున్న తరుణంలో, కొంత ఆత్మవంచన చేసుకొంటూ, కొంత తన సొంత రాజ్య కార్యనిర్వహణ గంభీర ప్రాముఖ్యాన్ని నిజంగానే నమ్ముతూ ఉన్న సమయంలో, ప్రహసనాన్ని కేవల ప్రహసనమాత్రంగానే పరిగణించిన బోనపార్ట్ వంటి దుస్సాహసికునికి విజయం లభించడం తథ్యం. తన గంభీర ప్రత్యర్థిని తొలగించి, నేరుగా తన రాజ పాత్రను తనే యిప్పుడు గట్టిగా నమ్మి, నెపోలియన్ బురఖా తగిలించుకొని తననే అసలైన నెపోలియనుగా పరిగణించుకోవడం ఎప్పుడైతే ప్రారంభిస్తాడో, అప్పుడే అతను ప్రపంచాన్ని గురించిన తన దృక్పథానికి తానే బలి అవుతాడు, ప్రపంచ చరిత్రను యికనెంతమాత్రమూ ఒక ప్రహసనంగా కాక, తన ప్రహసనాన్నే ప్రపంచ చరిత్రగా పరిగణించే సిసలైన విదూషకుడవుతాడు. సోషలిస్టు కార్మికులకు జాతీయ కర్మాగారాలు, బూర్జువా రిపబ్లికన్లకు గస్తీ దళాలు ఎటువంటివో, — బోనపార్ట్ యోగ్యతకు అనుగుణమైన పార్టీ దాడిబలగమైన — డిసెంబరు 10 సంఘం అతనికి అటువంటిది. అతను పర్యటనలకు బయలుదేరినప్పుడల్లా యీ సంఘానికి చెందిన సభ్యులు రైల్వే స్టేషన్లలో అతనికి జనాన్ని సమకూర్చడానికి పంపబడతారు, వాళ్ళు జనోత్సాహాన్ని ప్రదర్శించాలి, "Vive l'Empereur!"** అంటూ బిగ్గరగా అరవాలి, రిపబ్లికన్లను — పోలీసుల రక్షణలోనే అనుకోండి — అవమానపరచాలి, బాదాలి. పారిస్‌కి అతని పునరాగమనసందర్భాల్లో వాళ్లు అగ్రగామిదళ పాత్రను వహించాలి, ప్రతికూల ప్రదర్శనలు జరగకముందు తామే ప్రదర్శనలు జరపాలి, లేదా ప్రత్యర్థుల ప్రదర్శనలను చెల్లాచెదరు చెయ్యాలి. డిసెంబరు 10 సంఘం పూర్తిగా బోనపార్ట్‌కే చెందిన సంఘం, అది అతని సృష్టి, స్వయానా అతని సంకల్పజనితం. దీనికితోడు అతను దేన్నైతే హస్తగతంచేసుకుంటాడో దాన్ని పరిస్థితుల ప్రాబల్యమే అతని చేతుల్లో పెట్టింది; అతను ఏదైతే చేస్తున్నాడో దాన్ని పరిస్థితులే అతనికి చేసిపెడుతున్నాయి, లేకుంటే యితరులు చేసిన వాటిని అనుకరించి అతను తృప్తిపడతాడు. కాని బయట, పౌరుల ముందు, వ్యవస్థకు, మతానికి, కుటుంబానికి, ఆస్తికి సంబంధించి ప్రామాణికమైన పదబంధాలు వల్లించే యీ బోనపార్ట్ పైకి కనిపించే బోనపార్ట్. కాగా, ఎవరి వెనుకనైతే షుఫ్టెర్లేలు, ష్పీగెల్‌బెర్గ్‌ల గుప్తసంఘముందో, ఎవరి వెనుకనైతే అవ్యవస్థ, వ్యభిచారం, దొంగతనాల సమాజం వుందో, దాని సాకార నిజ

---

* షేక్స్‌పియర్ రాసిన "వేసవి రాత్రి వచ్చిన కల" నాటకానికి ప్రస్తావన. — సం.

** "చక్రవర్తి వర్ధిల్లాలి!" — సం.

రూపం, దాని మూల సృష్టికర్త బోనపార్టే, కాగా డిసెంబరు 10 సంఘ చరిత్ర అతని స్వీయచరిత్రయే.

అసాధారణ ఘటన ఒకటి కూడా జరిగింది: పార్టీ ఆఫ్ ఆర్డరుకి చెందిన ప్రజాప్రతినిధులు డిసెంబరు 10 సంఘానికి చెందిన సభ్యుల లాఠీప్రయోగానికి గురి అయ్యారు. జాతీయ సభ సేవలకోసం నియోగింపబడి, దాని రక్షణబాధ్యత అప్పగించబడిన యోన్ అనే పోలీసు కమిషనర్, అలే పేరు గల ఒక వ్యక్తి చెప్పిన సమాచారం ఆధారంగా, డిసెంబరిస్టులకు చెందిన ఒక విభాగం జనరల్ షంగర్న్యేనూ, జాతీయ సభ అధ్యక్షుడైన ద్యుపేన్‌నూ హత్యచేసేందుకు నిర్ణయించుకున్నదనీ, ఆ పని చేసేందుకుగాను తన మనుషులను అప్పుడే ఎంపిక చేసిందనీ శాశ్వత కమిషన్‌కు తెలియజేశాడు. ఈ సమాచారం తెలిసిన ద్యుపేన్ ఎంతగా భయభీతుడై వుంటాడో మనం ఊహించుకోవచ్చు. డిసెంబరు 10 సంఘంపై పార్లమెంటరీ దర్యాప్తు, అంటే, బోనపార్టిస్టు గుప్తజగత్తుయొక్క పావిత్ర్యబండారం యిక బయట పడకతీరదన్న స్థితి ఏర్పడింది. జాతీయ సభ సమావేశమయ్యేందుకు సరిగా ముందే బోనపార్ట్ ముందుచూపుతో తన సంఘాన్ని రద్దుచేశాడు. సహజంగానే యీ పని కేవలం కాగితంపైన మాత్రమే జరిగింది. ఎందుకంటే, 1851 చివర నాటికి, సవివరమైన ఒక విజ్ఞప్తిలో పోలీసు ప్రిఫెక్టు కర్ల్యే బోనపార్ట్‌చేత డిసెంబరిస్టులను నిజంగా విఘటితులను చేయించేందుకింకా వృథాప్రయత్నం చేస్తూనేవున్నాడు.

బోనపార్ట్ రాజ్య సేననే ఒక డిసెంబరు 10 సంఘంగా మార్చివేయడంలో సఫలుడయేటంత వరకు డిసెంబరు 10 సంఘం అతని వ్యక్తిగత సైన్యంగా అట్టేపెట్టబడింది. ఇందుకుగాను బోనపార్ట్ తన మొట్టమొదటి ప్రయత్నాన్ని, జాతీయ సభ వాయిదా పడిన కొద్ది రోజులకు, అదీ కూడా సరిగా దాన్నుండి అప్పుడే గుంజుకున్న డబ్బుతోనే చేశాడు. కర్మవాదిగా అతను, కొన్ని అతీత శక్తులున్నాయనీ, వాటిని మానవుడు, ప్రత్యేకించి సైనికుడు తట్టుకోలేడనీ నమ్ముతాడు. అటువంటి శక్తులన్నింటిలోకీ సిగార్లను, షాంపేనును, చల్లని కోడిమాంసాన్ని, వెల్లుల్లి వేసిన సాసేజ్‌లను ప్రథమ గణ్యమైనవిగాను, ప్రధానమైనవిగాను అతను పరిగణించాడు. అందుకని మొట్టమొదట అతను తన ఎలిసీ రాజభవనపు గదులలో సైన్యానికి చెందిన పై ఆఫీసర్లకు, నాన్ కమిషన్డ్ ఆఫీసర్లకు సిగార్లూ, షాంపేనూ, చల్లని కోడిమాంసమూ, వెల్లుల్లి సాసేజ్‌లతో కూడిన విందుతో శ్రీకారం చుట్టాడు. అక్టోబరు 3న సెంట్-మొరే సైనిక పర్యవేక్షణ సందర్భంగా మొత్తం సైనికులందరి విషయంలో యిదే ఎత్తుగడను అతను అవలంబించాడు. అక్టోబరు 10న, సతొరీ సైనిక పర్యవేక్షణ సందర్భంగా యిదే ఎత్తుగడను మరింత భారీ ఎత్తున అమల్లోపెట్టాడు. పెత్తండ్రి అలెగ్జాండరుయొక్క ఆసియా దండయాత్రలను జ్ఞాపకం చేసుకోగా, భ్రాత్రీయుడు అదే ప్రదేశంలో బాఖస్‌యొక్క విజయయాత్రలను గురించి తలుచుకుంటున్నాడు. అలెగ్జాండరు

సగం దేవుడే కాగా బాఖస్ పూర్తి దేవుడు,* అంతే కాదు, అతడు డిసెంబరు 10 సంఘంయొక్క కులదైవం.

అక్టోబరు 3న సైనిక పర్యవేక్షణ తరవాత శాశ్వత కమిషన్ యుద్ధమంత్రి ఓపూల్‌ను తన సమక్షంలో హాజరు కావలసిందిగా తాఖీదు పంపింది. క్రమశిక్షణకు భంగకరమైన యీ రకమైన పనులు తిరిగి సంభవించవని అతను వాగ్దానంచేశాడు. అక్టోబరు 10న ఓపూల్ వాగ్దానాన్ని బోనపార్ట్ ఏవిధంగా నిలబెట్టాడో మనకు తెలిసినదే. పారిస్ సేన ప్రధాన సేనాధిపతిగా రెండు సైనిక పర్యవేక్షణలనూ షంగర్నే నిర్వహించాడు. ఏకకాలంలో శాశ్వత కమిషన్ సభ్యుడూ, నేషనల్ గార్డ్ ప్రధానాధిపతీ, జనవరి 29, జూన్ 13ల "పరిరక్షకుడూ," "సమాజపు రక్షణ దుర్గం," అధ్యక్ష పదవికి పార్టీ ఆఫ్ ఆర్డర్ అభ్యర్థీ, ఉభయ రాజరికాలకూ చెందిన మంక్‌గా అనుమానింపబడిన వాడూ అయిన షంగర్నే యింతవరకెన్నడూ యుద్ధమంత్రికన్న తనను తక్కువవాడుగా ఆమోదించలేదు, సదా రిపబ్లికన్ రాజ్యాంగచట్టాన్ని బహిరంగంగా నిరసిస్తూ వచ్చాడు, బోనపార్ట్ విషయంలో ఎప్పుడూ ఒక రకమైన సందిగ్ధతాపూర్వక ప్రభుసహజ సంరక్షకత్వాన్ని అనుసరిస్తూ వచ్చాడు. అటువంటిది యిప్పుడతను యుద్ధమంత్రికి వ్యతిరేకంగాను, బోనపార్ట్‌కి వ్యతిరేకంగా క్రమశిక్షణకు అనుకూలంగాను ఉత్సాహోద్విగ్నుడై వున్నాడు. అక్టోబరు 10న ఆశ్విక సైన్యంలో ఒక విభాగం: "Vive Napoléon! Vivent les saucissons!"** నినాదాలివ్వగా కనీసం తన మిత్రుడైన నెమేయర్ నాయకత్వాన కవాతుచేస్తున్న కాల్బలదళం పూర్తిగా మౌనం దాల్చాలని షంగర్నే బందోబస్తుచేశాడు. ఇందుకు శిక్షగా, బోనపార్ట్ ప్రేరేపణతో, పద్నాలుగవ, పదిహేనవ సైనిక డివిజన్లకు కమాండింగు జనరల్‌గా నియమిస్తున్న సాకుతో నెమేయర్‌ను పారిస్‌లో అతని పదవినుండి యుద్ధమంత్రి తొలగించాడు. పదవుల యీ మార్పిడిని నెమేయర్ తిరస్కరించాడు, దానితో అతను రాజీనామా చెయ్యాల్సివచ్చింది. ఇందుకు బదులుగా షంగర్నే నవంబరు 2న ఒక సైనిక ఉత్తరువు జారీచేశాడు, దానిలో, సైనికులు సాయుధులై వున్నప్పుడు ఏ రకమైన రాజకీయ వివాదాలుగాని, ప్రదర్శనలుగాని చెయ్యడాన్ని నిషేధించాడు. ఎలిసీకి చెందిన వార్తాపత్రికలు[101] షంగర్నేని ఖండించాయి; పార్టీ ఆఫ్ ఆర్డర్‌కి చెందిన పత్రికలు బోనపార్ట్‌ను ఖండించాయి; శాశ్వత కమిషన్ పలు రహస్యసమావేశాలు జరిపింది, వాటిలో అది దేశం ప్రమాదస్థితిలో ఉన్నట్లు ప్రకటించాల్సిందిగా పదేపదే ప్రతిపాదించింది; సైన్యం రెండు శత్రుశిబిరాలుగా చీలిపోయినట్లూ, ఆ రెండు విభాగాలూ రెండు ప్రత్యర్థి సైనిక నాయకత్వాలను కలిగియున్నట్లూ, వాటిలో ఒకటి బోనపార్ట్ నివాస స్థానమైన ఎలి

* గ్రీకు పురాణంలోని సురాదేవత. — సం.

** "నెపోలియన్‌కీ జై! సాసేజ్‌లకీ జై!" — సం.

లోసీ, రెండవది షంగర్న్యే నివాసస్థానమైన తుయిలెరీలో ఉన్నట్లూ కానవచ్చింది. యుద్ధాదేశమిచ్చేందుకు అవసరమైనది జాతీయ సభ సమావేశం మాత్రమే అనిపించింది. ఫ్రాన్సు జనసామాన్యం, బోనపార్ట్ షంగర్న్యేల మధ్య యీ ఘర్షణను — యీ క్రింది మాటల్లో దాని స్వభావాన్ని చిత్రించిన ఆంగ్ల పత్రికా రచయిత మాదిరిగా — అంచనా వేశారు:

"ఫ్రాన్సుయొక్క రాజకీయ దాసీలు, విప్లవమనే అగ్నిపర్వతం ముఖంనుంచి వెల్వడిన తప్త లావాద్రవాన్ని పాత చీపుళ్లతో తుడిచేస్తున్నారు, వాళ్లు అలా చేసేటప్పుడు పరస్పరం కీచులాడుకుంటున్నారు."

ఈ మధ్యలో బోనపార్ట్ ఆదరాబాదరా తన యుద్ధమంత్రి ఓపూల్‌ను తొలగించాడు, అతన్ని మూటాముల్లెతో అల్జీరియాకు రవాణాచేశాడు, అతని స్థానంలో జనరల్ ష్రామ్‌ను యుద్ధమంత్రిని చేశాడు. నవంబరు 12న, అతను జాతీయ సభకు అమెరికన్ తరహా సుదీర్ఘ సందేశాన్ని పంపాడు, అది వివరాలతో నిండివుంది, వ్యవస్థ వాసనకొడుతోంది, తిరిగి సమాధానపడాలన్న వాంఛతోను, రాజ్యాంగచట్టాన్ని శిరసావహించాలన్న భావంతోను నిండివుంది. ఆ సందేశంలో ఆ క్షణానికి సంబంధించిన questions brûlantes* ప్రస్తావన తప్ప మిగిలిన అన్ని విషయాల ప్రస్తావనా వుంది. ఏదో యథాలాపంగా ప్రస్తావించినట్లు, రాజ్యాంగచట్టంలో స్పష్టంగా పేర్కొనబడిన నిబంధనల మేరకు కేవలం అధ్యక్షుడు మాత్రమే సైన్యానికి సంబంధించి అంతిమనిర్ణయం తీసుకోగలడంటూ అతను ఒక వ్యాఖ్య చేశాడు. ఆ సందేశం యీ క్రింది మహాగంభీరమైన పదాలతో ముగిసింది:

"ఫ్రాన్సు అన్నిటికన్న ఎక్కువగా ప్రశాంతిని కోరుతోంది.... నేను ఏ శపథాన్నైతే తీసుకున్నానో దాని మేరకు, దేశం నాకు నిర్దేశించిన సంకుచిత పరిధికి నన్ను పరిమితం చేసుకుంటాను.... నాకు సంబంధించినంత వరకు, ప్రజలచేత ఎన్నుకోబడి, ప్రజలనుండి మాత్రమే అధికారాన్ని పొందిన నేను, చట్టబద్ధంగా వ్యక్తీకరింపబడే వారి అభీష్టానికి సదా తలఒగ్గి వుంటాను. మీరొకవేళ యీ సమావేశంలో రాజ్యాంగచట్టాన్ని సవరించాలనే కనుక తీర్మానించినట్లయితే, రాజ్యాంగ నిర్ణయ సభ కార్యనిర్వాహకాధికారాన్ని నియంత్రితం చేస్తుంది. అలా చెయ్యకపోయినట్లయితే, ప్రజలు అప్పుడు 1852లో తమ హుందా అయిన నిర్ణయాన్ని ప్రకటిస్తారు. కానైతే భవిష్యత్తులో ఏ నిర్ణయాలు జరగనున్నా కూడా, ఒక మహా దేశంయొక్క భవితవ్యం ఆవేశంచేత, ఆకస్మిక ఘటనలచేత, హింసా

* జరూరైన సమస్యలు. — సం.

ప్రయోగంచేత నిర్ణయింపబడరాదన్న విషయంలో మనం ఒక అంగీకారానికి వద్దాం.... నా మనస్సులో యిప్పుడు అన్నిటికన్న పైనవున్న అంశం, 1852లో ఫ్రాన్సును ఎవరు పాలిస్తారన్నది కాక, యీ మధ్యకాలం ఆందోళన గాని అల్లర్లు గాని లేకుండా గడిచిపోయేందుకు వీలుగా, నాకు మిగిలివున్న కాలవ్యవధిని నేను ఎలా వినియోగించాలన్నదే. నేను అరమరికల్లేకుండా నా మనస్సును విప్పి మీ ముందుంచాను; మీరు నా యీ నిష్కాపట్యానికి మీ విశ్వాసంతోను, నా సత్ప్రయత్నాలకు మీ సహకారంతోను బదులిస్తారని ఆశిస్తాను, మిగిలిన విషయం భగవంతుడే చూసుకుంటాడు."

గౌరవనీయమైన, కుటిల వినయంతోకూడిన, వాస్తవంగా బూర్జువావర్గానికి సర్వసామాన్యమైన యీ భాష, డిసెంబరు 10 సంఘపు నిరంకుశాధికారి, సెంట్-మొరే, సతొరీ విందుల వీరుడూ అయినవాని నోట, దాని అత్యంత గూఢార్థాన్ని బయటపెడుతోంది.

ఈ మనసు విప్పడాన్ని ఎంతవరకు నమ్మాలన్న విషయంలో పార్టీ ఆఫ్ ఆర్డర్‌కి చెందిన బుర్గ్రాఫ్‌లకు క్షణకాలం కూడా భ్రమ లేకపోయింది. ప్రమాణాలు చేసే విషయంలో వాళ్లు చిరకాలంగా మొగం మొత్తిపోయి వున్నారు; వాళ్ల మధ్య రాజకీయ ప్రమాణభంగాల విషయంలో ఆరితేరినవాళ్లూ, గొప్ప నిపుణులూ ఉన్నారు. సందేశంలో సైన్యాన్ని గురించి ఏమైతే చెప్పబడిందో, దాన్ని కూడా వాళ్లు గమనించారు. సందేశంలో వరుసావావీ అంటూ ఏమీ లేకుండా యిటీవలి చట్టాలు పేర్కొనబడగా అత్యంత ముఖ్యమైన చట్టం — ఎన్నికల చట్టం — విషయంలో, ఉద్దేశపూర్వకంగా మౌనం వహించబడిందనీ, అంతే కాకుండా, రాజ్యాంగచట్టం సవరింపబడకపోయే సందర్భంలో, 1852లో అధ్యక్షుని ఎన్నికను ప్రజల చేతుల్లో పెట్టే ప్రస్తావన ఉందనీ కూడ వారు కోపంతో మండిపడుతూ గమనించారు. ఎన్నికల చట్టం పార్టీ ఆఫ్ ఆర్డర్ పాదాలకు బంధింపబడిన ఉక్కు గుదిబండ, దాని మూలంగా ఆ పార్టీ ముందుకు దూసుకుపోవడం మాట అటుంచి, ముందుకి అడుగే వెయ్యలేదు! దీనికితోడు, డిసెంబరు 10 సంఘాన్ని అధికారికంగా రద్దుచెయ్యడంద్వారాను, యుద్ధమంత్రి ఓపూల్‌ను బర్తరఫ్ చెయ్యడంద్వారాను బోనపార్ట్ తన సొంత చేతులతో బలిపశువులను దేశ వధ్యశిలపై బలివేశాడు. తద్వారా అతను వస్తుందనుకున్న ఘర్షణ తీవ్రతను మొద్దువారజేశాడు. చివరి సంగతేమిటంటే, పార్టీ ఆఫ్ ఆర్డర్, కార్యనిర్వాహకాధికారానికి వ్యతిరేకంగా అన్ని రకాల నిర్ణయాత్మక ఘర్షణనుండీ తప్పించుకొనేందుకూ, ఉపశమింపజేసేందుకూ, దాటవేసేందుకూ స్వయంగా తనే ఆదుర్దాపడింది. విప్లవంపై తమకు లభించిన విజయాలను కోల్పోతామనే భయంతో, ఆ విజయ ఫలితాలన్నింటినీ తమ ప్రత్యర్థి చేజిక్కించుకుపోవడాన్ని సాగనిచ్చారు. "అన్నిటికన్న ఎక్కువగా ఫ్రాన్సు ప్రశాంతిని కోరుతోంది."

ఈ మాటలనే పార్టీ ఆఫ్ ఆర్డర్ ఫిబ్రవరి* మొదలుకొని విప్లవాన్ని ఉద్దేశించి అరిచిచెప్తోంది, ఇప్పుడు బోనపార్ట్ సందేశంలో యివే మాటలు పార్టీ ఆఫ్ ఆర్డర్‌ని ఉద్దేశించి చెప్ప బడుతున్నాయి. "అన్నిటికన్న ఎక్కువగా ఫ్రాన్సు ప్రశాంతిని కోరుతోంది." బోనపార్ట్, రాజకీయాధికార అపహరణలక్ష్యపూరితమైన చర్యలకు తలపడ్డాడు, కాని పార్టీ ఆఫ్ ఆర్డర్ ఆ చర్యల గురించి గొడవ లేవదీసి, వాటి విషాద పూర్ణమైన అర్థాన్ని బయటపెడితే, అది "అశాంతి" రెచ్చగొట్టేది అవుతుంది. సతొరీ సాసేజిలను గురించి ఎవరూ ఏమీ మాట్లాడ లేదు, వాళ్ళు మూషికాల మాదిరిగా మౌనంగా ఉన్నారు. "అన్నిటికన్న ఎక్కువగా ఫ్రాన్సు ప్రశాంతిని కోరుతోంది." అంటే దీని అర్థం, తన చిత్తంవచ్చినట్లు చెయ్యడానికి తన మానాన తనను వదిలెయ్యాలని బోనపార్ట్ డిమాండ్‌చేస్తున్నాడు, పార్లమెంటరీ పార్టీ రెండు రకాల భయంతో: విప్లవాత్మక అశాంతిని ఆహ్వానిస్తున్నట్టవుతుందన్న భయంచేత, తన సొంత వర్గం దృష్టిలో, అంటే బూర్జువావర్గం దృష్టిలో తనే అశాంతిని రెచ్చగొట్టి నట్లు కనిపిస్తానన్న భయంచేత స్తంభితమైంది. పర్యవసానంగా, అన్నిటికన్న ఎక్కువగా ఫ్రాన్సు ప్రశాంతిని కోరుతోంది కనుక, బోనపార్ట్ తన సందేశంలో "ప్రశాంతి"ని గురించి మాట్లాడాడు కనుక పార్టీ ఆఫ్ ఆర్డర్ "యుద్ధం" ప్రస్తావనతో జవాబుచెప్ప సాహసించ లేదు. జాతీయ సభ సమావేశం ఆరంభంకాగానే అనేక కుంభకోణాలు బయటపడతాయని ఆశించిన సామాన్య జనానికి నిరాశే ఎదురైంది. అక్టోబరు ఘటనలకు సంబంధించిన శాశ్వత కమిషన్ మినిట్సును అందచెయ్యాల్సిందిగా ప్రతిపక్ష ప్రతినిధులు చేసిన డిమాండు అధిక సంఖ్యాక ఓట్లతో వీగిపోయింది. సూత్రరీత్యా, ఉద్రేకాలను కలిగించవచ్చునన్న చర్చలన్నీ దాటవెయ్యబడ్డాయి. 1850 నవంబరు, డిసెంబరు మాసాల్లో జరిగిన జాతీయ సభ సమావేశ కార్యక్రమాలు ఆసక్తిరహితంగా సాగాయి.

చిట్టచివరకు, డిసెంబరు చివరి ప్రాంతంలో, పార్లమెంటుకి సంబంధించిన పలు విశేషాధికారాల విషయంలో కుమ్ములాటలు ప్రారంభమయ్యాయి. బూర్జువావర్గం సార్వ జనిక ఓటింగు హక్కును రద్దుచెయ్యడం ద్వారా, ప్రస్తుతానికి వర్గపోరాటాన్ని అంతం చేసిన తరువాత ఉద్యమం రెండు శక్తులయొక్క విశేషాధికారాలకు సంబంధించిన చిల్లరమల్లర కలహాల్లో కూరుకుపోయింది.

మొగేన్ అనబడే ఒక ప్రజా ప్రతినిధికి వ్యతిరేకంగా బాకీచెల్లింపు వైఫల్యానికిగాను కోర్టు శిక్ష విధించేలాగా చేయబడింది. న్యాయమూర్తి వాకబుకి సమాధానంగా న్యాయశాఖ మంత్రి రుయే, బాకీదారు అరెస్టుకి ఎటువంటి సంకోచమూ లేకుండా ఆజ్ఞ జారీచెయ్య వచ్చునని చెప్పాడు. మొగేన్ ఆ విధంగా రుణగ్రస్తుల జైల్లో తోయబడ్డాడు. ఈ దాడిని

* 1848. — సం.

గురించి తెలిసినప్పుడు జాతీయ సభ కోపంతో మండిపడింది. అతన్ని వెన్వెంటనే విడుదల చెయ్యాలని అది ఆజ్ఞ జారీచెయ్యడమే కాకుండా, క్లిషీ[73]నుండి అతన్ని తన పోలీసు గుమాస్తా చేత ఆ సాయంత్రమే బలవంతంగా వెనక్కు తెప్పించింది. కానైతే, సొంత ఆస్తి పవిత్ర్యంలో తన విశ్వాసాన్ని పునరుద్ఘాటించేందుకూ, అవసరమైతే, యిబ్బందికరంగా తయారైన మహీధరం పార్టీకి ఒక రుణగ్రస్తుల జైలును తెరవాల్సివుంటుందన్న భావాన్ని మనస్సులో ఉంచుకొనే, తన ఆమోదాన్ని ముందుగా పొంది, రుణగ్రస్త ప్రజాప్రతినిధులను నిర్బంధించ వచ్చునని అది ప్రకటించింది. అయితే అది, అధ్యక్షుని కూడా రుణగ్రస్తతకోసం జైలులో పెట్టవచ్చు నన్న ఆదేశమివ్వడం మరచిపోయింది. సాక్షాత్తూ తన సభ్యులు ఏ అనుల్లంఘనీయతతోనైతే రక్షితులై వున్నారో దానికి సంబంధించిన చిట్టచివరి అవశేషాలను సైతం అది రూపు మాపింది.

అలే పేరుగల ఒక వ్యక్తి యిచ్చిన సమాచారం మేరకు, ద్యుపేన్, షంగర్నేయిల హత్య కోసం పథకం వేస్తున్నందుకుగాను డిసెంబరిస్టులకు చెందిన ఒక విభాగంపై పోలీస్ కమీషనరు యోన్ ఆరోపణచేసిన సంగతి పాఠకులకు గుర్తుండివుంటుంది. ఈ సందర్భంగా, మొట్టమొదటి సమావేశంలోనే, పార్లమెంటు తన స్వంత పోలీసు బలగాన్ని ఏర్పాటుచేసు కోవాలనీ, జాతీయ సభ సొంతబడ్జెట్టునుండి దానికి వేతనాలు చెల్లింపబడాలనీ, పోలీసు ప్రిఫెక్టు అధికారానికి అది పూర్తి అతీతంగా ఉండాలనీ క్వెస్టర్లు[83] ఒక ప్రతిపాదన చేశారు. అంతరంగికశాఖా మంత్రి అయిన బరోష్, తన అధికార పరిధిపై యీ అతిక్రమణను నిర సించాడు. ఈ వ్యవహారంలో దయనీయమైన ఒక రాజీ జరిగింది; దాని ప్రకారం జాతీయ సభకు చెందిన పోలీసు కమీషనరు జాతీయ సభ ప్రైవేటు బడ్జెట్టునుండే వేతనం పొందే మాటా, దాని క్వెస్టర్లచేతనే నియుక్తుడయ్యే మాటా, బర్తరఫ్‌చెయ్యబడే మాటా నిజమే కాని, అంతరంగికశాఖా మంత్రిపూర్వానుమతిని పొందిన తర్వాతమాత్రమే యిదంతా జరుగు తుంది. ఈలోగా అలేకి వ్యతిరేకంగా ప్రభుత్వం నేరవిచారణ ప్రారంభించింది, ఈ కేసులో, అతను అందజేసిన సమాచారం అభూతకల్పన అని రుజువుచెయ్యడమూ, ద్యుపేన్, షంగర్నేయ్, యోన్‌లనూ, మొత్తంగా జాతీయ సభనూ అవహేళన చెయ్యడమూ కష్టమైన పనేమీ కాదు. దాని తర్వాత, డిసెంబరు 29న మంత్రి బరోష్, ద్యుపేన్‌కి ఒక లేఖ రాస్తూ అందులో యోన్‌ని బర్తరఫ్‌చెయ్యాల్సిందిగా డిమాండుచేశాడు. జాతీయ సభ బ్యూరో యోన్‌ని అతని పదవిలో ఉంచడానికి నిర్ణయించింది, కాని జాతీయ సభ, మొగేన్ వ్యవహారంలో తన జబర్దస్తీ విషయంలో గాభరాచెంది, కార్యనిర్వాహకాధికారానికి వ్యతిరేకంగా తను కొట్ట సాహసించిన ఒక్క దెబ్బకు బదులు రెండు ఎదురుదెబ్బలు తగిలిన అనుభవం దృష్ట్యా, యీ నిర్ణయానికి తన ఆమోదాన్ని మంజూరుచెయ్యలేదు. ప్రభుత్వ కార్యనిర్వహణలో ప్రద ర్శించిన ఉత్సాహానికి బహూకృతిగా జాతీయ సభచేత యోన్ ఉద్యోగంనుండి బర్తరఫ్‌చెయ్య

బడ్డాడు. తద్వారా రాత్రి నిర్ణయం తీసుకొని పగటిపూట దాన్ని అమలుజరపక, పగటిపూట నిర్ణయం తీసుకొని దాన్ని రాత్రిపూట అమలుజరిపే ఒక వ్యక్తికి వ్యతిరేకంగా తనకు అవసరమైన పార్లమెంటరీ విశేషాధికారంనుండి అది తనను తాను వంచించుకుంది.

నవంబరు, డిసెంబరు మాసాల్లో గొప్ప గంభీర నిర్ణయాత్మక సందర్భాల్లో, జాతీయ సభ, కార్యనిర్వాహకాధికారంతో సంఘర్షణను ఏ విధంగా దాటవేసిందో, ఆ సంఘర్షణకు ఏ విధంగా నీళ్లువదులుకుందో మనం చూశాం. అలాంటిది యిప్పుడు అతి స్వల్ప విషయాలలో సైతం సంఘర్షణకు దిగక తప్పనిసరి స్థితిలో పడింది. మొగేన్ వ్యవహారంలో రుణగ్రస్తతకు గాను, ప్రజా ప్రతినిధులను నిర్బంధించవచ్చునన్న సూత్రాన్ని ఆమోదించింది, కాని యీ సూత్రాన్ని తనకు అయిష్టులైన ప్రతినిధులకు వ్యతిరేకంగా మాత్రమే అన్వయించే అధికారాన్ని తనకు అది కేటాయించుకుంది, సిగ్గుమాలిన యీ విశేషాధికారం కోసం న్యాయశాఖా మంత్రితో అది కుమ్ములాడుతోంది. హత్యాప్రయత్నమనబడేదాన్ని వినియోగించుకొని డిసెంబరు 10 సంఘాన్ని గురించి దర్యాప్తుకి ఆజ్ఞను జారీచేసి, పారిస్ వర్గభ్రష్టబికారి గాలిమూక నాయకుడుగా బోనపార్ట్‌ను అతని నగ్నరూపంలో ఫ్రాన్సుముందూ, యూరప్ ముందూ తిరుగులేనివిధంగా బహిర్గతంచేసేందుకు బదులు, అది యీ సంఘర్షణను, తనకూ ఆంతరంగికశాఖా మంత్రికీ మధ్య ఒక పోలీసు కమిషనర్‌ను నియమించే, బర్తరఫ్ చేసే అధికారం ఎవరిదన్న అంశం మాత్రమేనన్న నిమ్నస్థాయికి దిగజార్చింది. ఆ విధంగా, యీ కాలమంతట్లోనూ కూడా, పార్టీ ఆఫ్ ఆర్డర్ తన సందిగ్ధవైఖరి కారణంగా కార్యనిర్వాహకాధికారంతో తన పోరాటాన్ని అధికార పరిధి సంబంధమైన తుచ్ఛమైన జగడాలలోను, క్షుద్రమైన జిత్తులలోను, కోడిగుడ్డుకి వెంట్రుకలు ఎంచినట్లు న్యాయశాస్త్రానికి సంబంధించి అల్పవిషయాల పరిశీలనలోను, పరిమితినిర్దేశక తగాదాలలోను విచ్ఛిన్నమూ, విఘటితమూ చెయ్యడాన్నీ, పద్ధతికి సంబంధించిన అత్యంత హాస్యాస్పద విషయాలను తన కార్యకలాపాలకు మూలాంశంగా చేసుకోవడాన్నీ మనం చూస్తాం. సూత్రరీత్యా ఘర్షణకు ప్రాముఖ్యమున్న తరుణంలో, కార్యనిర్వాహక అధికారశాఖ నిజంగా తనను తాను అప్రతిష్ఠపాలుచేసుకున్న సమయంలో, జాతీయ సభ లక్ష్యం జాతి లక్ష్యం కాగల క్షణంలో అది సంఘర్షణను ప్రారంభించ సాహసించలేకపోయింది. అలా చేసివుంటే అది జాతికి యుద్ధ రంగం దిశగా పురోగమించాల్సిందిగా ఆదేశించినట్లవుతుంది, జాతి పురోగమనశీలం అవడంకన్న దానికి ఎక్కువ భయ కారణం మరొకటి లేదు. అందుకని అటువంటి సందర్భాల్లో అది మహీధరం పార్టీ ప్రతిపాదనలను తిరస్కరించి, రోజువారీ కార్యక్రమంలో నిమగ్నమయ్యేది. పార్టీ ఆఫ్ ఆర్డర్ వివాదాస్పదమైన అంశాన్ని దాని బృహత్తర పార్శ్వాల్లో చెయ్యిజారవిడవడంతో, కార్యనిర్వాహకాధికారం తను అదే అంశాన్ని తుచ్ఛమైన, అప్రధానమైన సందర్భాల్లో రేకెత్తించడానికి అనువైన అవకాశం కోసం, ఒకవిధంగా చెప్పాలంటే, కేవలం స్థానిక పార్లమెంటరీ

ప్రయోజనాలు ఇమిడి వున్న సమస్యలను మాత్రమే రేకెత్తించడానికి అనువైన తరుణం కోసం వేచిచూసేది. అలా చేసినప్పుడు పార్టీ ఆఫ్ ఆర్డర్ క్రోధం కట్టలు తెంచుకొంటుంది, అప్పుడది మరుగుగావున్న తెరలను లాగిపారేస్తుంది, అప్పుడది అధ్యక్షునిపై దుమ్మెత్తిపోస్తుంది, అప్పుడది రిపబ్లిక్ ప్రమాదంలో ఉన్నట్లు ప్రకటిస్తుంది, కానైతే అప్పుడు దాని ఆవేశం కూడా అసందర్భంగా కనిపిస్తుంది, సంఘర్షణకు సందర్భం కపటమైన సాకుగానో లేక అసలు ఘర్షణయోగ్యమైనదే కానిదిగానో కనిపిస్తుంది. పార్లమెంటరీ తుపాను టీకప్పులో తుపానుగా తయారవుతుంది, పోరాటం కుట్రగాను, సంఘర్షణ పరువుతీసే ప్రయత్నంగాను కనిపిస్తుంది. విప్లవ వర్గాలు జాతీయ సభ పరువు నష్టంపట్ల ద్వేషపూరితమైన సంతోషంతో ఉప్పొంగుతాయి, ఎందుకంటే సార్వజనిక స్వేచ్ఛలపట్ల జాతీయ సభకు ఎంత ఉత్సాహముందో జాతీయ సభ విశేషాధికారాలపట్ల ఆ వర్గాలకూ అంతే ఆసక్తి వుంది మరోవంక, పార్లమెంటు లోపలి బూర్జువావర్గం యిటువంటి తుచ్ఛమైన జగడాలలో తన కాలాన్ని ఎలా వృధాచెయ్యగలుగుతున్నదో, అధ్యక్షునితో అటువంటి దయనీయమైన స్పర్ధలలో శాంతికి భంగం కలిగించగలుగుతున్నదో పార్లమెంటు బయటనున్న బూర్జువావర్గం అర్థంచేసుకోలేక పోయింది. యావత్ప్రపంచమూ పోరాటాలు జరుగుతాయనుకున్న తరుణంలో రాజీచేసుకొని, యావత్ప్రపంచమూ శాంతి ఏర్పడిందని నమ్మినప్పుడు దాడిచేసే యీ వ్యూహంతో అది గందరగోళంలో పడింది.

డిసెంబరు 20న, పస్కాల్ ద్యుప్రా, ఆంతరంగికశాఖ మంత్రిని బంగారుకడ్డీల లాటరీ విషయంలో ప్రశ్నించాడు. ఈ లాటరీ ''ఎలిసీయం పుత్రిక.''[102] బోనపార్ట్, నమ్మకస్తులైన తన అనుయాయులతో కలిసి దానికి జన్మనిచ్చాడు, ఫ్రెంచి చట్టం ధర్మకార్యాలకోసం నిర్వహించే లాటరీలను మినహాయించి మిగిలిన అన్ని లాటరీలనూ నిషేధించినప్పటికీ పోలీసు ప్రిఫెక్టు కర్లే దానికి తన అధికారిక రక్షణను కల్పించాడు. ఒక్కొక్క టిక్కెట్టు ఒక ఫ్రాంకు చొప్పున 70 లక్షల టిక్కెట్లు విక్రయింపబడ్డాయి. ఆ లాటరీ ద్వారా లాభాల రూపంలో వచ్చే ఆదాయం పారిస్‌లోని తిరుగుబోతులను కాలిఫోర్నియాకు ఓడల్లో తరలించేందుకు ఉద్దేశింపబడిందన్నది పైకి చూపబడిన కారణం. దీనిద్వారా ఒకవంక, పారిస్ కార్మికుల సోషలిస్టు స్వప్నాల స్థానంలో స్వర్ణప్రాప్తి స్వప్నాలు, మరోవంక, సిద్ధాంతరీత్యా పనిపొందే హక్కు స్థానంలో ప్రథమబహుమతి ప్రాప్తికి సంబంధించిన ప్రలోభమూ ప్రవేశ పెట్టబడ్డాయి. పారిస్ కార్మికులు సహజంగానే, కాలిఫోర్నియా బంగారపు కడ్డీల జిగేల్మనే కాంతిలో లాఘవంగా తమ జేబుల్లోంచి తుచ్ఛమైన సాదా ఫ్రాంకులు కాజెయ్యబడుతున్న సంగతిని గుర్తించలేకపోయారు. అసలుకు యీ వ్యవహారమంతా పచ్చిమోసం తప్ప మరేమీ కాదు. పారిస్‌ని విడిచివెళ్లే శ్రమను తీసుకోకుండా కాలిఫోర్నియా బంగారు గనులను తెరవగోరిన తిరుగుబోతులు స్వయానా బోనపార్టూ, అతని రుణగ్రస్త దర్బారీయులే. జాతీయ

అసెంబ్లీ మంజూరుచేసిన 30 లక్షల ఫ్రాంకుల సొమ్మూ దర్జాగా విలాసాలకు విచ్చలవిడిగా దుబారాచెయ్యబడింది; అందుకని ఏదో ఒక పద్ధతిలో ఖజానాను మళ్లీ నింపడం అవసరం. బోనపార్ట్ cités ouvrières* అనబడేవాటి నిర్మాణార్థం జాతీయస్థాయిలో ఒక నిధి ప్రోగుచేత కార్యక్రమాన్ని ప్రారంభించి, ఆ విరాళాల జాబితాకు ఒక పెద్ద మొత్తంతో తనే శ్రీకారం చుట్టాడు. దృఢమనస్కుడైన బూర్జువా తన వాటా చెల్లించే విషయంలో అపనమ్మకంగా నిరీక్షిస్తూ ఉండిపోయాడు, సహజంగానే, యిది జరగకపోవడంతో, సోషలిస్టు గాలిమేడలు నేలకూలిపోయాయి. బంగారు కడ్డీలు ఎక్కువ ఆకర్షణీయమైన వ్యవహారంగా రుజువైంది. బోనపార్ట్ అండ్ కంపెనీ బంగారు కడ్డీల రూపంలో యిచ్చే బహుమతులు పోను మిగిలే 70 లక్షల ఫ్రాంకుల్లో కొంత భాగాన్ని భుక్తంచేసుకోవడంతో సంతృప్తిచెంద లేదు; వాళ్లు నకిలీ టిక్కెట్లను ముద్రించారు, ఒకే అంకె కలిగిన పది, పదిహేను, చివరకు ఇరవై టిక్కెట్లను సైతం జారీచేశారు — ఈ ఆర్థిక వ్యవహారమంతా డిసెంబరు 10 సంఘపు స్వభావానికి అనురూపంగా సాగింది! ఇక్కడ జాతీయ అసెంబ్లీకి ఎదురుగా నిల బడినది నిరాకారుడైన రిపబ్లిక్ అధ్యక్షుడు కాదు, రక్తమాంసాలతో కూడిన సాకార బోన పార్ట్. ఇక్కడ అది, రాజ్యాంగచట్టాన్ని అవహేళనచేస్తూ గాక, Code pénal**ను అతి క్రమిస్తూండగా అతన్ని పట్టుకొనే అవకాశముంది. డ్యూప్రా ప్రశ్నపై అది రోజువారీకార్య క్రమానికి సాగిపోయిందంటే అది కేవలం వట్టినే జరగలేదు, ఎందుకంటే, జాతీయ సభ తను "సంతుష్టి చెందినట్లు" ప్రకటించాలన్న జిరర్డేన్ ప్రతిపాదన, పార్టీ ఆఫ్ ఆర్డరుకి దాని స్వంత పద్ధతి అవినీతిని గుర్తుచేసింది. బూర్జువా, ముఖ్యంగా రాజనీతి జ్ఞుడుగా పెంపొందించబడిన బూర్జువా, ఆచరణలో తన లుబ్ధత్వాన్ని సైద్ధాంతిక ధారాళ త్వంతో పూరిస్తాడు. రాజనీతిజ్ఞుడుగా అతను, తను ఎదుర్కోవాల్సిన ఆ రాజ్యాధికారం లాగే, మరింత ఉన్నతస్థాయిలో, మాత్రమే పోరాడదగిన ఒక ఉచ్చతరవ్యక్తి అవుతాడు.

కట్టుబాటులేనివాడూ, రాజోచిత వర్గభ్రష్టబికారిగాలి మూక మనిషీ అయిన బోనపార్ట్, సరిగా ఆ కారణంగానే తనకు నీచ పద్ధతిలో పోరాటం జరిపేందుకు ధూర్తబూర్జువా కున్న దానికన్న ఎక్కువ అవకాశాలున్న బోనపార్ట్, జాతీయ సభయే దానంతట అదిగా తనను చేయిపుచ్చుకొని — సైనిక విందులు, సైనిక పర్యవేక్షణలు డిసెంబరు 10 సంఘం, చివరకు శిక్షాస్మృతి వంటి క్లిష్టమైన ఘట్టాలలో నిరపాయంగా ముందుకు తీసుకువెళ్లిన తర్వాత, యిప్పుడు, యిక తను కుహనా ఆత్మరక్షణ వైఖరిని విసర్జించి దాడికి పూనుకొనగల తరుణం ఆసన్నమైందని గ్రహించాడు. ఈలోగా న్యాయశాఖమంత్రి, యుద్ధమంత్రి, నౌకా సేనా

---

* కార్మికుల పేటలు. — సం.

** శిక్షా స్మృతి. — సం.

మంత్రీ, ఆర్థికమంత్రీ పొందిన చిల్లర పరాజయాలు — వేటిద్వారానైతే జాతీయ సభ గుర్రుమంటూ తన అసంతోషాన్ని వ్యక్తం చేసిందో అవి — అతన్ని అంతగా కలతపరచలేదు. అతను మంత్రులు రాజీనామాచెయ్యకుండా, తద్వారా కార్యనిర్వాహకాధికారంపై పార్లమెంటు యొక్క సార్వభౌమాధికారాన్ని గుర్తించకుండా నిరోధించడమే కాకుండా, జాతీయ సభ విరామ సమయంలో తను దేన్నైతే ప్రారంభించాడో దాన్ని: సైనికాధికారాన్ని పార్లమెంటు నుండి వేరుచెయ్యడం, షంగర్న్యేను పదవినుండి తొలగించడం, యిప్పుడు పూర్తిచేశాడు.

ఒక ఎలిసీ పత్రిక ఒక సైనిక ఆదేశాన్ని ప్రచురించింది, దాని కథనానుసారం మొదటి సైనిక డివిజనును ఉద్దేశించి మే మాసంలో, అంటే, షంగర్న్యేచేత జారీచెయ్యబడిన ఆదేశం అది. ఒకవేళ తిరుగుబాటే కనుక సంభవిస్తే, తిరుగుబాటుదార్లకు తమ సైనికదళాల్లో చోటివ్వకుండా, వాళ్లను వెన్వెంటనే కాల్చివెయ్యమనీ, జాతీయ సభ సేనలను పంపమని తమను కోరినట్లయితే అలా పంపేందుకు నిరాకరించమనీ ఆఫీసర్లకు ఆ ఆదేశం సూచించింది. 1851 జనవరి 3న, ఈ సైనిక ఆదేశాన్నిగురించి మంత్రివర్గంపై ప్రశ్నలు గుప్పింపబడ్డాయి. ఈ వ్యవహారాన్ని దర్యాప్తుచేసేందుకుగాను మంత్రివర్గం మొదట మూడు మాసాలు, తర్వాత ఒక వారం, చిట్టచివరకు 24 గంటల కాలవ్యవధి కావాలని కోరింది. తక్షణ వివరణ కావాలని జాతీయ సభ ఒత్తిడిచేసింది. అప్పుడు షంగర్న్యే లేచి అటువంటి సైనిక ఆదేశం ఏదీ ఎన్నడూ జారీచెయ్యబడలేదని ప్రకటించాడు. దానికితోడు, జాతీయ సభ కోర్కెను మన్నించేందుకు తను సదా సంసిద్ధంగా వుంటాననీ, ఒకవేళ ఏదైనా తిరుగుబాటు జరిగితే అది, తనపై ఆధారపడవచ్చుననీ కూడా జోడించాడు. అతని ప్రకటనను అది వర్ణనాతీతమైన హర్షధ్వానాలతో స్వీకరించి, అతనిపై తన విశ్వాసాన్ని ప్రకటించే తీర్మానాన్ని ఆమోదించింది. ఆ విధంగా చెయ్యడంద్వారా జాతీయ సభ తన అధికారాన్ని తనకు తానుగా పరిత్యజించింది, ఒక జనరల్ వ్యక్తిగత సంరక్షణలో తనను ఉంచుకొని, తనకు తానుగా తన అశక్తతనూ, సైన్యపు సర్వశక్తిమత్వాన్నీ చాటిచెప్పింది; కాని బోనపార్ట్‌కి వ్యతిరేకంగా, జాతీయ సభకు — తను అదే బోనపార్ట్ నుండి మాన్యంగా పొందిన — అధికారాన్ని అర్పించి, తనకు రక్షణావసరం ఏర్పడినప్పుడు, ఏ పార్లమెంటు తన సంరక్షణలో వుందో, అదే పార్లమెంటునుండి రక్షణ పొందాలని ఆశించడం ద్వారా జనరల్ షంగర్న్యే తనను తాను మోసగించుకున్నాడు. కాని షంగర్న్యేకి 1849 జనవరి 29 దరిమిలా బూర్జువా వర్గం తనకు కట్టబెట్టిన నిగూఢశక్తిలో విశ్వాసముంది. అతడు తనను తాను, యితర రెండు రాజ్య అధికారాలతోబాటు సమానాంతరంగా అస్తిత్వంలోవున్న ఒక మూడవ అధికారంగా పరిగణించుకున్నాడు. ఈ యుగానికి చెందిన కొందరు వీరులూ, ఆ మాటకు వస్తే పవిత్రులూ ఉన్నారు, వారి ఘనత అంతా, వారి పార్టీ తన స్వార్థ ప్రయోజనాల సాధనకోసం, పక్షపాతదృష్టితో వారికి ఆపాదించే ఘనత తప్ప వేరేమీ కాదు. మహాత్యాలు

ప్రదర్శించాల్సిందిగా పరిస్థితులు వారిపై ఒత్తిడితేగానే వారు సర్వసామాన్య వ్యక్తులుగా కుంచించుకుపోతారు, అతనికి కూడా సరిగా అదే గతి పట్టుతుంది. ఈ ప్రసిద్ధ వీరులకూ, పవిత్రులకూ సంబంధించినంతవరకు, సాధారణంగా, విశ్వాసలోపమే గర్భశత్రువు. విజ్ఞులయొక్క, హేళన కర్తలయొక్క ఉత్సాహశూన్యతపట్ల వారి నైతిక క్రోధానికి యిదే కారణం.

అదే సాయంత్రం, మంత్రులు ఎలిసీ రాజభవనానికి పిలువబడ్డారు; షంగర్న్యే బర్తరఫ్‌చెయ్యబడాలని బోనపార్ట్ పట్టుబట్టాడు; ఆ ఆదేశంపై సంతకంచెయ్యడానికి ఐదు గురు మంత్రులు నిరాకరించారు; మంత్రివర్గంలో సంక్షోభం ఏర్పడిందని "Moniteur" పత్రిక ప్రకటించింది, పార్టీ అఫ్ ఆర్డరుకి చెందిన పత్రికలు షంగర్న్యే అధినాయకత్వాన ఒక పార్ల మెంటరీ సైన్యం ఏర్పాటుచెయ్యబడుతుందని బెదిరించాయి. ఈ చర్య తీసుకోడానికి పార్టీ ఆఫ్ ఆర్డర్‌కి రాజ్యాంగచట్ట పరమైన హక్కుంది. కేవలం అది చెయ్యాల్సిందల్లా షంగ ర్న్యేను జాతీయ సభ అధ్యక్షునిగా నియమించడం, అది తన రక్షణ కోసం, కోరుకున్నన్ని సేనలను పిలవనంపడం మాత్రమే. షంగర్న్యే అప్పటికింకా వాస్తవానికి సైన్యంయొక్క, పారిస్ నేషనల్ గార్డుయొక్క అధినాయకుడుగా వున్నాడు కనుకనూ, సైన్యంతో బాటు పిలుపు కోసం నిరీక్షిస్తూ వున్నాడు కనుకనూ జాతీయ సభ యీ పనిని మరింత సురక్షితంగా చేసివుండగలిగేది. బోనపార్టిస్టు పత్రికలు, సేనలను నేరుగా పిలిచేందుకు జాతీయ సభకి గల హక్కును సవాలుచేసేందుకు సైతం అప్పటికింకా సాహసించలేదు, ఆ పరిస్థితుల్లో చట్టరీత్యా వున్న ఒక చిన్న యిబ్బంది, ప్రయత్న సాఫల్యావకాశాన్ని లేకుండాచేసింది. ఈ క్రింది విషయాన్ని దృష్టిలో పెట్టుకొంటే సైన్యం జాతీయ సభ ఆదేశాలను పాటించి ఉండేదని అర్థమవుతుంది: షంగర్న్యే బర్తరఫ్ ఆజ్ఞపై సంతకాలు పెట్టడానికి సిద్ధపడిన జనరల్సును పారిస్ అంతా గాలించి పట్టుకోడానికి బోనపార్ట్‌కి ఎనిమిది రోజులు పట్టింది. చిట్టచివరకు బరగే డి యిల్యే, సెంట్-జాన్ డి అంజెలీలు ఆ బర్తరఫ్ ఆజ్ఞపై సంతకాలు పెట్టేందుకు సంసిద్ధులయ్యారు. తర్వాత 286 ఓట్లు పార్టీనుండి చీలిపోవడం, 1851 డిసెంబరులో, నిర్ణయం తీసుకోవలసిన తుదిక్షణంలో, మహీధరం పార్టీ యీ రకమైన ప్రస్తావనను ఆమోదించడానికి అప్పటికీ సిద్ధపడకపోవడం చూస్తే, పార్టీ ఆఫ్ ఆర్డర్‌కి అటువంటి తీర్మానానికి అవసరమైనన్ని ఓట్లు తన సొంత పార్టీ సభ్యులలోను, జాతీయ సభలోను లభించియుండేవా అన్నది అనుమానాస్పద విషయమే. కాని బహుశా అప్పటికీ బుర్గ్రాఫ్‌లు తమ పార్టీ అంతటినీ ఒక వీరకార్యానికి ఉత్తేజితం చేసియుండగలిగేవారు, బందూకుల వల యంలో తమను తాము భద్రంగా ఉన్నట్లు పరిగణించుకొని, ఎదుటి శిబిరాన్ని వదిలి తమ శిబిరానికి చేరుకున్న ఒక సేన సేవలను స్వీకరించియుండగలిగేవారు. ఇలా చేసేందుకుబదులు, బుర్గ్రాఫ్‌లు బోనపార్ట్‌ని రాజనీతిజ్ఞతా పూర్వకమైన శబ్దాలతో ప్రభావితంచేసీ, రాజ్య ప్రయోజనం పేరుచెప్పి షంగర్న్యేని బోనపార్ట్ బర్తరఫ్ చెయ్యకుండా చూసేందుకని జనవరి

6వ తేదీ సాయంత్రం — ఎలిసీకి బయల్దేరి వెళ్ళారు. ఎవరినైనా ఒప్పించడానికి ప్రయత్నించడమంటే అర్థం, ఆ పరిస్థితిలో వారి ఆధిక్యతను ఆమోదించడమే. బుర్గ్రాఫ్‌ల ఈ చర్యతో ధైర్యం చిక్కిన బోనపార్ట్ జనవరి 12న ఒక కొత్త మంత్రివర్గాన్ని నియమించాడు, దానిలో పాత మంత్రివర్గ నాయకులైన ఫూల్డ్, బరోష్‌లు అట్టేపెట్టబడ్డారు. సెంట్-జాన్ డి అంజెలీ యుద్ధమంత్రి అయ్యాడు, షంగర్న్యేను బర్తరఫ్‌చేస్తూ జారీచెయ్యబడిన ఆజ్ఞను "Moniteur" పత్రిక ప్రకటించింది. అతని అధికారం బరగే డి యిల్యేకీ పెరోకీ పంచబడింది, యిల్యేకి ప్రథమ డివిజన్ నాయకత్వమూ, పెరోకి నేషనల్ గార్డు నాయకత్వమూ అప్పగించబడ్డాయి. "సమాజపు రక్షణ దుర్గం" సాగనంపబడ్డాడు, దీని మూలంగా మిన్ను విరిగి మీదపడలేదు సరికదా, స్టాక్ ఎక్స్చేంజ్‌లో వాటాల విలువ పెరుగుతోంది.

షంగర్న్యేను అప్పగించడంద్వారా తనను తాను పార్టీ ఆఫ్ ఆర్డర్‌కి సమర్పితంచేసుకున్న సైన్యాన్ని దూరంచేసుకొని, తిరుగులేని పద్ధతిలో సైన్యాన్ని అధ్యక్షునికి శాశ్వతంగా స్వాధీనం చేసి, బూర్జువావర్గం పాలించేహక్కును పోగొట్టుకున్నదని పార్టీ ఆఫ్ ఆర్డర్ రుజువు చేసింది. పార్లమెంటరీ మంత్రివర్గమంటూ యికనేమీ అస్తిత్వంలో లేదు. సైన్యం పైనా, నేషనల్ గార్డు పైనా పట్టు కోల్పోయినతర్వాత, ప్రజల పైన పార్లమెంటుయొక్క అపహృతాధికారాన్నీ, అధ్యక్షునికి వ్యతిరేకంగా తన రాజ్యాంగచట్టబద్ధమైన అధికారాన్నీ ఏక కాలంలో సాగించుకోవడానికి అవసరమైన బలప్రయోగ సాధనాలు పార్టీ ఆఫ్ ఆర్డర్‌కి యిప్పుడిన ఏం మిగిలివున్నాయి? ఏ ఒక్కటీ లేదు. ఇప్పుడిక అది చెయ్యగలిగినదల్లా సత్తా లేని సూత్రాలను వల్లెవెయ్యడం మాత్రమే, ఏ సూత్రాలనైతే తనెప్పుడూ కేవలం సాధారణ సూత్రాలుగా మాత్రమే వ్యాఖ్యానిస్తూ వచ్చిందో, తను మరింత స్వచ్ఛందంగా ప్రవర్తించగలిగేందుకు వీలుగా యితరులకు బోధించే సూత్రాలుగా మాత్రమే పరిగణిస్తూ వచ్చిందో అటువంటి సూత్రాలు మాత్రమే. షంగర్న్యే బర్తరఫూ, సైనిక అధికారం బోనపార్ట్ హస్తగతం కావడమూ — వీటితో మనం పరిశీలిస్తున్న కాలానికి సంబంధించిన మొదటి భాగం, పార్టీ ఆఫ్ ఆర్డర్‌కీ కార్యనిర్వాహకాధికారానికీ మధ్య సంఘర్షణదశ ముగిసింది. రెండు అధికారాలకూ మధ్య యుద్ధం బహిరంగంగా ప్రకటింపబడింది, బాహాటంగా సాగింది, కానైతే పార్టీ ఆఫ్ ఆర్డర్ ఆయుధాలనూ, సైనికులనూ కోల్పోయిన తర్వాత మాత్రమే యిది జరిగింది. మంత్రివర్గం లేని, సైన్యం లేని, ప్రజల్ని, ప్రజాభిప్రాయం లేని, మే 31 నాటి తన ఎన్నికల చట్టం తర్వాత తను సర్వసత్తాక జాతియొక్క ప్రతినిధి కూడా కాని, అంటే కళ్ళు, చెవులు, పళ్ళు, ఏవీ కూడా లేని ఆ జాతీయ సభ క్రమంగా, కార్యాచరణను ప్రభుత్వానికి వదిలిపెట్టి, post festum* క్రోధపూర్ణమైన అభ్యంత

---

* అయిపోయిన పెళ్లికి బాజాలు వాయించినట్లు, అంటే ఆలస్యంగా. — సం.

రాలు చెప్పడంతో తృప్తిచెందే ఒక పాత ఫ్రెంచి పార్లమెంటుగా[103] తయారైంది.

కొత్త మంత్రివర్గ నియామకంపట్ల పార్టీ ఆఫ్ ఆర్డర్ కోపఘూర్ణితమైంది. విరామకాలంలో శాశ్వత కమిషన్ మెతకతనాన్ని ప్రదర్శించిందనీ, దాని మినిట్స్‌ను ప్రకటించకపోవడం ద్వారా అది విశేషమైన అవిధేయతను ప్రదర్శించిందనీ జనరల్ బెడో విమర్శించాడు. ఆంతరంగిక శాఖ మంత్రి యిప్పుడు స్వయంగా తనే ఆ మినిట్సు ప్రకటింపబడాల్సిందేనని పట్టుపట్టాడు. ఇప్పటికి అవి, నిలవనీరు త్రాగడానికి పనికి రానంతగా తమ తాజాతనాన్ని కోల్పోయి ఆసక్తిరహితంగా తయారయ్యాయి. కొత్త వాస్తవాలు వెల్లడిచేసే అవకాశం లేని ఆ మినిట్సుయొక్క ప్రభావం అనాసక్త జనంపైన ఏ మాత్రమూ లేకపోయింది. రెమ్యుజా ప్రతిపాదనమేరకు జాతీయ అసెంబ్లీ బ్యూరోలుగా విడివడి, "అసాధారణ చర్యలు తీసుకునేందుకోసం కమిటీ"ని నియమించింది. పారిస్ తన దైనందిన కార్యకలాపాల గానుగ గాడి నుంచి ఎక్కువగా పక్కకు మళ్లలేకపోయింది, ఎందుకంటే, ప్రస్తుతం వ్యాపారం లాభసాటిగా సాగుతోంది, కార్ఖానాలు జోరుగా పనిచేస్తున్నాయి, ధాన్యం ధరలు తక్కువగా ఉన్నాయి, ఆహార పదార్థాలు పుష్కలంగా ఉన్నాయి, సేవింగ్స్ బ్యాంకుల్లో ఏ రోజుకారోజు కొత్త డిపాజిట్లు జమచెయ్యబడుతున్నాయి. పార్లమెంటు సరభసంగా ప్రకటించిన "అసాధారణ చర్యలు," జనరల్ షంగర్న్యే పేరు ప్రస్తావనసైతం లేకుండా, జనవరి 18న మంత్రివర్గానికి వ్యతిరేకంగా ప్రతిపాదించబడిన అవిశ్వాస తీర్మానం రూపంలో నీళ్లుకారిపోయాయి. రిపబ్లికన్ల ఓట్లు సంపాదించుకునేందుకుగాను పార్టీ ఆఫ్ ఆర్డర్ తన ప్రతిపాదనను యీ విధంగా తయారుచెయ్యాల్సిన పరిస్థితిలో పడింది. ఎందుకంటే, మంత్రివర్గ కార్యకలాపాలన్నింటిలోనూ, షంగర్న్యే బర్తరఫ్ ఒక్కటి మాత్రమే రిపబ్లికన్లు ఆమోదించే చర్య. మరోవంక, పార్టీ ఆఫ్ ఆర్డర్ మంత్రివర్గపు యితర చర్యలను — వేటినైతే తనే స్వయంగా ప్రేరేపించిందో వాటిని — ఖండించే స్థితిలో లేదు.

జనవరి 18 నాటి అవిశ్వాస తీర్మానం 286 ఓట్లకు వ్యతిరేకంగా 415 ఓట్లతో ఆమోదింపబడింది. అంటే అది, తీవ్ర లెజిటిమిస్టులు, ఆర్లియనిస్టులు, శుద్ధ రిపబ్లికన్లు, మహీధరం పార్టీలయొక్క పొత్తు మూలంగా మాత్రమే నెగ్గగలిగిందన్న మాట. దీనిద్వారా ఏమి నిరూపితమైందంటే, బోనపార్ట్‌తో తన ఘర్షణల్లో పార్టీ ఆఫ్ ఆర్డర్ మంత్రివర్గాన్నీ, సైన్యాన్నీ మాత్రమే కాకుండా, ప్రతినిధుల బృందమొకటి రాజీపట్ల అంధావేశంతో, పోరాటమంటే తనకున్న భయంతో, నీరసభావంతో, కుటుంబ దృష్ట్యా తమకు అత్యంత ప్రీతి పాత్రమైన ప్రభుత్వ వేతనాలు కోల్పోతామన్న సంకోచంతో, ఖాళీ కాగల మంత్రి పదవులు తమకు లభించవచ్చునన్న ప్రలోభం (ఒడిలోన్ బర్రో)తో, ఏ స్వార్థమైతే మామూలు బూర్జువాచేత తన స్వంత వర్గపు సాధారణ ప్రయోజనాలను ఏదో ఒక స్వప్రయోజనానికి బలిచేయించేలాగ ప్రేరేపిస్తుందో అటువంటి కేవల స్వార్థంతో తన శిబిరంనుంచి తొలగిపోవ

పోవడంతో పార్లమెంటులో తనకు స్వతంత్రంగా వున్న మెజారిటీని కూడా కోల్పోయింది. బోనపార్టిస్ట్ ప్రతినిధులు ఆదినుంచీ కూడా, విప్లవ వ్యతిరేక పోరాటంలో మాత్రమే పార్టీ ఆఫ్ ఆర్డర్‌కి అంటిపెట్టుకుని వున్నారు. కేథలిక్ పార్టీ నాయకుడు మొంటలెంబేర్, పార్లమెంటరీ పార్టీ జీవితం విషయంలో నిరాశచెందడంతో, అప్పటికే తన పలుకుబడిని బోనపార్టిస్టు పక్షంవైపు మళ్లించ నారంభించాడు. చిట్టచివరి సంగతేమిటంటే యీ పార్టీ నాయకులైన ఆర్లియనిస్టు త్యేర్, లెజిటిమిస్టు బెర్యేలు, తమను తాము రిపబ్లికన్లుగా ప్రకటించుకోవలసిన స్థితిలో పడ్డారు, తమ హృదయాలు రాజరికమైనవైనా తమ మస్తిష్కాలు రిపబ్లికన్‌వేననీ, మొత్తంగా బూర్జువావర్గపు పాలనకు ఏకైక సాధ్యరూపం పార్లమెంటరీ రిపబ్లిక్ మాత్రమేననీ ఒప్పుకోవలసిన స్థితిలో పడ్డారు. వారావిధంగా, బూర్జువావర్గపు సమక్షంలోనే, దాని పునరుద్ధరణ పథకాలను — ఏ పథకాలనైతే వారు పార్లమెంటు వీపు వెనుక, ఎంత బుద్ధిహీనమో అంత ప్రమాదకరమైన ఒక కుతంత్రంగా కొనసాగించారో వాటిని ఖండించాల్సి వచ్చింది.

జనవరి 18 నాటి అవిశ్వాస తీర్మానం అధ్యక్షునికాక మంత్రులను దెబ్బతీసింది. కాని షంగర్న్యేను తొలగించినది అధ్యక్షుడే గాని మంత్రివర్గం కాదు. అయితే పార్టీ ఆఫ్ ఆర్డర్ బోనపార్ట్‌నే అభిశంసించాలా? అతని పునరుద్ధరణ వాంఛలకు నేరారోపణ చేయాలా? కాని యివి కేవలం స్వీయ పునరుద్ధరణ వాంఛలకు అనుబంధమైనవి మాత్రమే. పోనీ, సైనిక పర్యవేక్షణల సంబంధంగాను, డిసెంబరు 10 సంఘం సందర్భంగా అతను చేసిన కుట్రకోసమా? కాని యీ అంశాలను సాధారణ దైనందిన కార్యకలాపాలమధ్య వారు ఎన్నడో పూడ్చిపెట్టారు. తిరుగుబాటు జరిగినట్లయితే పారిస్‌కు నాలుగు మూలల్నుంచీ నిప్పుపెడతానని బెదిరించిన జనవరి 29, జూన్ 13 వీరుని బర్తరఫ్ కోసమా? — వారి మహీధరం పార్టీ మిత్రులూ, కవేన్యాకూ అధికారికంగా సానుభూతి ప్రకటన ద్వారా నేల కూలిన "సమాజపు రక్షణ దుర్గాన్ని" వారు లేవదియ్యనివ్వలేదు. ఒక జనరల్‌ను తొలగించేందుకు అధ్యక్షునికి గల రాజ్యాంగచట్టబద్ధమైన హక్కును వారు సైతం తిరస్కరించ లేకపోయారు. అతను రాజ్యాంగచట్టబద్ధమైన తన హక్కును పార్లమెంటరీయేతర పద్ధతిలో వినియోగించినందుకు మాత్రమే వారు మండిపడ్డారు. తమ పార్లమెంటరీ ప్రత్యేకాధికారాన్ని, ప్రత్యేకించి సార్వజనిక ఓటింగు హక్కును రద్దుచేసే విషయంలో మరి తాము మాత్రం నిరంతరాయంగా రాజ్యాంగచట్ట విరుద్ధ పద్ధతిలో వినియోగించలేదా? అందుకని వారు కచ్చితంగా పార్లమెంటరీ పరిమితుల్లోనే కదలాల్సిన పరిస్థితిలోకి కుదింపబడ్డారు. పార్టీ ఆఫ్ ఆర్డర్ తన పార్లమెంటరీ అధికారానికి సంబంధించిన అన్ని పరిస్థితులనూ చేతులారా రూపుమాపుకుంది, యితర వర్గాలతో తన సంఘర్షణలో వాటిని రూపుమాపుకొనక తప్పని సరి స్థితిలో పడింది, తన పార్లమెంటరీ విజయాలను అది యింకా విజయాలుగానే

పరిగణిస్తూ మంత్రులపై దెబ్బతీసి, అధ్యక్షుని పైననే దెబ్బతీసినట్లు నమ్ముతోంది. అయితే యీ పార్టీ నాయకులు, పార్లమెంటరీ బుద్ధిమాంద్యం (cretinism) అనబడే ఒక విచిత్రమైన రోగానికి — 1848 దరిమిలా యావత్తు యూరప్ ఖండంలోనూ ఒక మహమ్మారిలా వ్యాపించి, తను సోకిన వాళ్లందరినీ ఒక ఊహా ప్రపంచంలో పడేసి, వారి బుద్ధి కుశలతను, జ్ఞాపకశక్తిని, మొరటు బాహ్యప్రపంచానికి సంబంధించిన అవగాహనను సమస్తాన్నీ హరించివేసిన రోగానికి — గురి అయినందుననే యివన్నీ సంభవమయ్యాయి. జాతి దృష్టిలో జాతీయ సభను మరోమారు అవమానించే అవకాశాన్ని మాత్రమే వారు అధ్యక్షునికి సమకూర్చారు. జనవరి 20న, "Moniteur" పత్రిక యావత్తు మంత్రివర్గపు రాజీనామా ఆమోదింపబడినట్లు ప్రకటించింది. జనవరి 18 నాటి ఓటింగులో మహీధరం పార్టీకీ రాజరికవాదులకూ మధ్య పొత్తు ఫలితంగా నిరూపితమైనట్లు పార్లమెంటులో ఏ ఒక్క పార్టీకీ యిక మెజారిటీ లేదన్న సాకుతో, కొత్త మంత్రివర్గాన్ని ఏర్పరచేలోగా తాత్కాలిక మంత్రివర్గమనబడే దాన్నొకదాన్ని బోనపార్ట్ నియమించాడు, ఆ మంత్రివర్గంలోని ఏ ఒక్క సభ్యుడూ కూడా పార్లమెంటు సభ్యుడు కాదు, వాళ్లందరూ కూడా పూర్తిగా అపరిచితులూ అనామకులే; ఇది కేవలం గుమాస్తాల, కాపీయిస్టుల మంత్రివర్గం. ఇప్పుడిక పార్టీ ఆఫ్ ఆర్డర్ తన క్రీడను యీ కీలుబొమ్మలతో సాగించాలి, సాగించి సాగించి అలసిపోవాలి; కార్యనిర్వాహకాధికారానికి సంబంధించినంత వరకు జాతీయ సభలో తనకు గట్టి ప్రాగతినిధ్యం ఉన్నందు వల్ల పెద్ద ప్రయోజనముంటుందని అది యికనెంతమాత్రం అనుకోవడం లేదు. తన మంత్రులు ఎంత ఎక్కువగా శుద్ధ కీలుబొమ్మలైతే, అంత ఎక్కువగా బోనపార్ట్ యావత్తు కార్యనిర్వాహకాధికారాన్నీ తన చేతిలో కేంద్రీకరించుకోగలుగుతాడు, అంత ఎక్కువగానూ దాన్ని తన సొంత ఉపయోగం కోసం వినియోగించుకోగలుగుతాడు.

డిసెంబరు 10 సంఘపు సర్దారు తన గుమాస్తా మంత్రులచేత అధ్యక్షునికి 18 లక్షల ఫ్రాంకుల భృతిని మంజూరుచెయ్యాలంటూ బలవంతంగా ప్రతిపాదింపజేసిన సూచనను మహీధరం పార్టీతో కలిసి పార్టీ ఆఫ్ ఆర్డర్ తిరస్కరించడం ద్వారా ప్రతీకారం తీర్చుకుంది. ఈమారు కేవలం 102 ఓట్ల మెజారిటీతో మాత్రమే యీ వ్యవహారం ఫైసలైంది; అంటే జనవరి 18 తర్వాత కొత్తగా మరో 27 ఓట్లు తగ్గిపోయాయన్న మాట. పార్టీ ఆఫ్ ఆర్డర్ విఘటన మరింత ముందుకు సాగుతోంది. అదే సమయంలో, మహీధరం పార్టీతోడి తన పొత్తు విషయంలో క్షణకాలంపైతం ఎటువంటి దురభిప్రాయమూ ఉండకుండా ఉండేందుకుగాను, రాజకీయ ఖైదీలందరికీ క్షమాదానాన్ని కోరుతూ 189 మంది సభ్యుల సంతకాలతో కూడిన మహీధరం పార్టీ ప్రతిపాదనను పరిశీలించడానికి సైతం పార్టీ ఆఫ్ ఆర్డర్ తిరస్కరించింది: అది అలా చెయ్యడానికి వయిస్ పేరుగల దేశాంగమంత్రి చేసిన యీ క్రింది ప్రకటన సరిపోయింది: దేశంలో యిప్పుడు ప్రశాంతి ఏదైతే ఉన్నదో, అది

కేవలం పైపైన కనిపించే ప్రశాంతి మాత్రమేననీ, కాని లోలోపల ఆందోళన జోరుగా సాగుతున్నదనీ, సర్వవ్యాపిత రహస్యసంఘాలు ఏర్పాటుచెయ్యబడుతున్నాయనీ, ప్రజాస్వామిక పత్రికలను తిరిగి ప్రచురించే సన్నాహాలు జరుగుతున్నాయనీ, జిల్లాలనుండి వస్తున్న నివేదికలు ఆందోళనకరంగా ఉన్నాయనీ, జెనీవా శరణార్థులు, లియోన్ మీదుగా దక్షిణ ఫ్రాన్సు అంతటికీ వ్యాపిస్తున్న ఒక కుట్రను నిర్వహిస్తున్నారనీ, ఫ్రాన్సు పారిశ్రామిక వాణిజ్య సంక్షోభపు టంచున ఉందనీ, రుబే కార్ఖానాదారులు పని గంటలను తగ్గించారనీ, బెల్-యిల్[104] ఖైదీలు తిరుగుబాటుచేశారనీ ఆ మంత్రి చెప్పాడు. వయిస్ వంటి ఒక అనామకుడు ముందుకు తెచ్చిన యీ కమ్యూనిస్టు భూతం పార్టీ ఆఫ్ ఆర్డర్ మహీధరం పార్టీ ప్రతిపాదనను — జాతీయ సభకు మహత్తర జనరంజకత్వాన్ని సంపాదించిపెట్టి, బోనపార్ట్‌ను దాని చేతుల్లోకి తిరిగితెచ్చి ఉండగల ప్రతిపాదనను — తిరస్కరించడానికి సరిపోయింది. కొత్త అల్లర్లు జరగవచ్చునంటూ కార్యనిర్వాహకాధికారం చూపిన భయంపట్ల బెదరిపోవడానికి బదులు, వర్గపోరాటం వృద్ధిచెందేందుకు పార్టీ ఆఫ్ ఆర్డర్ కొంచెం వెసులుబాటును కల్పించియుండాల్సింది, అప్పుడు కార్యనిర్వాహకాధికారం తనపై ఆధారపడేలా అది చేసుకొనివుండేది. కాని అలా నిప్పుతో చెలగాటమాడగల సామర్థ్యం తనకు లేదని అది భావించింది.

ఈలోగా, తాత్కాలిక మంత్రివర్గమనబడేది ఏప్రిల్ మధ్య దాకా యీడిగిలబడుతూ సాగింది. బోనపార్ట్ ఎప్పటికప్పుడు మంత్రివర్గంలో మార్పులూ చేర్పులూ చేస్తూ జాతీయ సభకు నిస్త్రాణను కలిగించి దాని కళ్లల్లో దుమ్ముకొట్టాడు. ఒకమారు అతను లమర్టీన్ బియోలతో రిపబ్లికన్ మంత్రివర్గన్ని ఏర్పరచగోరుతున్నట్లు నటిస్తూండేవాడు, మరో సారి పార్లమెంటరీ మంత్రివర్గాన్ని — అందులో ఒడిలోన్ బ్రరో విధిగా ఉండితీరేవాడు, చేటపెయ్య అవసరమైనప్పుడల్లా యితని పేరు విధిగా ఉండే తీరేది — యింకోసారి వాటిమెనీల్ బెనువా డి అజీలతో లెజిటిమిస్టు మంత్రివర్గాన్ని, అటు తర్వాత మల్వీల్‌తో ఆర్లియనిస్టు మంత్రివర్గన్ని ఏర్పరచగోరుతున్నట్లు నటిస్తూండేవాడు. ఈ విధంగా ఒకవంక అతను పార్టీ ఆఫ్ ఆర్డర్‌కి చెందిన వివిధ పక్షాలను ఒక దానికి వ్యతిరేకంగా మరొక దాన్ని ఉద్రిక్తస్థితిలో ఉంచేవాడు, ఆ పక్షాలన్నింటికీ రిపబ్లికన్ ప్రభుత్వం ఏర్పడే అవకాశాన్నీ, తత్పర్యవసానంగా సార్వజనిక ఓటింగు హక్కుయొక్క తప్పనిసరి పునరుద్ధరణావకాశాన్నీ చూపి భయభీతులను చేసేవాడు, మరోవంక, పార్లమెంటరీ మంత్రివర్గాన్ని ఏర్పాటుచెయ్యడానికి తను చిత్తశుద్ధితో ప్రయత్నాలు చేస్తున్నాననీ, కాని అవి రాజరికవాద పక్షాల పరస్పర వైముఖ్య కారణంగా విఫలమవుతున్నాయనీ బూర్జువావర్గంలో నమ్మకాన్ని కలిగించాడు. ఇటు బూర్జువాలు "బలమైన ప్రభుత్వం" కావాలంటూ మరింత గట్టిగా డిమాండుచెయ్యనారంభించారు. సార్వత్రిక వాణిజ్య సంక్షోభం ముంచుకొస్తున్నట్లు మరింత కొట్టవచ్చినట్లు కనిపిస్తోంది, గ్రామీణ ప్రాంతాల్లో ధాన్యం ధర వినాశకరంగా పడిపోయిన కారణంగా జరిగిన

మాదిరిగానే అది పట్టణాల్లో సోషలిజానికి అనుయాయులను సమకూరుస్తోంది, దానితో ఫ్రాన్సును "పాలక సంస్థలు లేకుండా" ఉంచడం మరింత బొత్తిగా క్షమార్హం కానట్లు బూర్జువావర్గం భావించింది. వ్యాపారం నానాటికీ మందగించింది, నిరుద్యోగుల సంఖ్య గణనీయంగా పెరిగింది, పారిస్‌లో కనీసం పదివేలమంది కార్మికులు తిననిండి లేకుండా వున్నారు, రువాన్, మూల్‌హౌసెన్, లియోన్, రుబే, టుర్కుయేన్, సెంట్ ఎట్యేన్, ఎల్‌బ్యోఫ్ మొదలైన చోట్లలో లెక్కలేనన్ని ఫ్యాక్టరీలు మూతబడ్డాయి. ఈ పరిస్థితిలో ఏప్రిల్ 11న, జనవరి 18 నాటి మంత్రివర్గాన్ని తిరిగి అధికారంలోకి తేవడానికి బోనపార్ట్ సాహసించగలిగాడు, అంటే రుయే, ఫూల్డ్, బరోష్ ప్రభృతులను తిరిగి మంత్రులుగా చేశాడు. వారికి తోడు, అతను, దొంగ టెలిగ్రాములు పంపాడన్న ఆరోపణపై కేవలం అయిదుగురు మంత్రుల ఓట్లను మినహాయించి తన ఉనికి అఖరి రోజులలో రాజ్యాంగ నిర్ణయ సభ ఏక గ్రీవంగా అవిశ్వాసం ప్రకటించిన లెయోన్ ఫాషేను మంత్రివర్గంలో కొత్తగా చేర్చాడు. జనవరి 18న మంత్రివర్గంపై జాతీయ సభ విజయం సాధించినదీ, బోనపార్ట్‌తో మూడు మాసాలపాటు సంఘర్షణపడినదీ, చివరకు ఏప్రిల్ 11న, ఫూల్డ్ బరోష్‌లు పరిశుద్ధుడైన ఫాషేను తమ మంత్రివర్గ సంఘటనలోకి చేర్చుకోవడానికే అన్నట్లయింది.

1849 నవంబరులో బోనపార్ట్ పార్లమెంటరీ యేతర మంత్రివర్గ స్థాపనతో సంతృప్తి పడ్డాడు, 1851 జనవరిలో పార్లమెంటు వెలుపల మంత్రివర్గంతో సంతృప్తిపడ్డాడు, ఏప్రిల్ 11న పార్లమెంటరీ వ్యతిరేక మంత్రివర్గాన్ని స్థాపించగలిగేటంత బలాన్ని పుంజు కున్నాడు, దానిలో రెండు సభల – రాజ్యాంగ నిర్ణయ సభ, శాసన నిర్ణయ సభ, రిపబ్లి కన్‌ది, రాజరికవాదపుది – ఓట్లూ సమరసంగా సంయోజితమొనర్పబడ్డాయి. మంత్రివర్గాల యీ వరుసక్రమం ఒక థర్మామీటరు వంటిది, యీ క్రమంలో తన స్వంత జీవ ఉష్ణో గ్రత తగ్గిపోతూ వుండటాన్ని పార్లమెంటు కొలుచుకోగలిగింది. ఏప్రిల్ చివరకు యీ ఉష్ణోగ్రత ఎంత కిందకు పడిపోయిందంటే, పెర్సిన్యీ, ఒక వ్యక్తిగత సంభాషణలో, షంగర్న్యేను అధ్యక్ష పక్షానికి మారమని చెప్పగలిగాడు. జాతీయ సభ పలుకుబడి పూర్తిగా రూపుమాసిపోయినట్లుగా బోనపార్ట్ పరిగణిస్తున్నాడనీ, రాజకీయ కుట్ర అనంతరం ప్రక టింపబడాల్సిన ప్రకటన అప్పుడే తయారుచెయ్యబడిందనీ – లక్ష్యరూపంలో ఆ కుట్ర సదా దృష్టిలో పెట్టుకోబడిందనీ, కాని యాదృచ్ఛికంగా మాత్రమే అది మరల వాయిదా వెయ్య బడిందని షంగర్న్యేతో పెర్సిన్యీ చెప్పాడు. షంగర్న్యే పార్టీ ఆఫ్ ఆర్డర్ నాయకులకు పార్ల మెంటు మరణానికి సంబంధించిన యీ సమాచారాన్ని అందజేశాడు, కాని నల్లికాట్లు ప్రాణాంతకమవుతాయని ఎవరు నమ్ముతారు? అయితే, దెబ్బతిన్న, విఘటితమైన, మరణా సన్నమైన పార్లమెంటు డిసెంబరు 10 సంఘపు విలక్షణ నాయకునితోడి తన ద్వంద్వ యుద్ధాన్ని ఒక నల్లితో పోరాటంగా తప్ప మరో విధంగా గ్రహించలేకపోయింది. కాని

బోనపార్ట్ పార్టీ ఆఫ్ ఆర్డర్‌కి, అగీస్ రాజుకి అగెసెలౌస్ మాదిరిగా యీ క్రింది మాటల్లో జవాబిచ్చాడు: ''నేనీ రోజున నీకొక చీమలా కనిపిస్తున్నాను, కాని ఏదో ఒక రోజున నేనొక సింహాన్నవుతాను.''[105]

## VI

సైన్యాధికారాన్ని తన చేతిలో ఉంచుకోవడానికీ, కార్యనిర్వాహకాధికారంపై తన అదుపును తిరిగి సంపాదించుకోవడానికీ పార్టీ ఆఫ్ ఆర్డర్ చేసిన వ్యర్థప్రయత్నాల్లో మహీ ధరం పార్టీతోను, శుద్ధ రిపబ్లికన్లతోను ఏ పొత్తునైతే పెట్టుకోక తప్పని స్థితిలో పడిందో ఆ పొత్తు, తన స్వతంత్ర పార్లమెంటరీ మెజారిటీని అది కోల్పోయిందన్న వాస్తవాన్ని నిర్వివాదంగా రుజువుచేసింది. మే 28న, కేవలం కేలెండరుయొక్క, గడియారంలో గంటల ముల్లుయొక్క శక్తి దాని పూర్తి విఘటనకు సూచననిచ్చింది. మే 28తో, జాతీయ సభ అస్తిత్వపు తుది సంవత్సరం ఆరంభమైంది. రాజ్యాంగచట్టాన్ని మార్పులేకుండా యథాతథంగా కొనసాగించడమా, లేక దాన్ని సవరించడమా అన్న అంశాన్ని యిప్పుడది నిర్ణయించు కోవాల్సివుంది. కాని రాజ్యాంగాన్ని సవరించడమంటే తాత్పర్యం, బూర్జువావర్గపు పాలనా లేక పెటీబూర్జువా ప్రజాస్వామ్యమా, ప్రజాస్వామ్యమా లేక శ్రామికవర్గ అరాజకత్వమా, పార్లమెంటరీ రిపబ్లికా లేక బోనపార్టా అని మాత్రమే కాదు, ఆర్లియన్స్ పాలనా లేక బూర్బన్ పాలనా అని కూడా దాని అర్థం! ఆ విధంగా పార్లమెంటు మధ్య ఏ కలహవిషబీజమైతే నాటబడిందో అది పార్టీ ఆఫ్ ఆర్డర్‌ని దాని విరోధ పక్షాలుగా చీలదీసే ప్రయోజనాల కలహాగ్నిని బాహాటంగా రెచ్చగొట్టక మానలేదు. పార్టీ ఆఫ్ ఆర్డర్ భిన్న సామాజిక శక్తుల సమ్మేళనం. రాజ్యాంగ సవరణ సమస్యతో ఎటువంటి రాజకీయ తాపం ఉత్పన్నమైందంటే, ఆ తాపానికి పార్టీ ఆఫ్ ఆర్డర్ అనబడే మిశ్ర పదార్థం తిరిగి తన తొలి భిన్నాంగాలుగా విఘటితమైపోయింది.

రాజ్యాంగ సవరణ విషయంలో బోనపార్టిస్టుల స్వార్థ ప్రయోజనం స్పష్టమే. వాళ్లకు సంబంధించినంతవరకు, అది అన్నింటికన్న ముఖ్యంగా, బోనపార్ట్ తిరిగి ఎన్నుకోబడకుండా నిషేధించి, అతని అధికారాన్ని నిలుపుచేసిన 45వ నిబంధనను రద్దుచెయ్యడం. ఈ విషయంలో రిపబ్లికన్ల వైఖరిసైతం యింతకన్న క్లిష్టమైనదిగా ఏమీ కనిపించదు. ఎటువంటి సవరణ నైనాసరే వాళ్లు బేషరతుగా తిరస్కరించారు; అందుకు సవరణ ప్రయత్నంలో రిపబ్లిక్‌కి వ్యతిరేకంగా సార్వత్రిక కుట్ర వాళ్లకు కనిపించడమే కారణం. జాతీయ సభలో వారికి మొత్తంలో నాలుగో వంతుకు మించిన ఓట్లు ఉన్న కారణంగాను, రాజ్యాంగం ప్రకారం, రాజ్యాంగ సవరణను డిమాండుచేసే తీర్మానం చట్టబద్ధంగా చెల్లుబడి కావడానికీ, రాజ్యాంగ సవరణ జరిపేందుకు గాను ప్రత్యేకమైన సమావేశంకోసం డిమాండుచేసేందుకూ మొత్తంలో నాలుగింట మూడు

వంతుల ఓట్లుండటం అవసరం కనుకనూ, అటువంటి ప్రతిపాదన ఏదైనా నెగ్గేందుకు తమ ఓట్లు నిర్ణాయకమైనవన్న సంగతి వారికి తెలుసు. వారికి విజయంపట్ల పూర్తి విశ్వాసముంది.

ఈ స్పష్టమైన వైఖరులకు భిన్నంగా, పార్టీ ఆఫ్ ఆర్డర్ తను మరి విడిపించుకొని బయటపడజాలనంతటి అంతర్వైరుధ్యాలలో చిక్కుకుంది. ఒకవేళ అది సవరణను తిరస్కరించి నట్లయితే యథాతథ స్థితికి ముప్పు ఏర్పడుతుంది, ఎందుకంటే, అప్పుడిక బోనపార్ట్ ఎదుట ఒకేఒక్క మార్గం — బలప్రయోగ మార్గం — మిగులుతుంది, పోతే అప్పుడిక 1852 మే మాసంలో రెండవ ఆదివారం నాడు, నిర్ణాయక క్షణంలో, అది ఫ్రాన్సును విప్లవవాద అరాజకత్వం చేతిలో వదిలినదవుతుంది, ఆ పరిస్థితిలో అధ్యక్షుడు ఉంటాడు, కాని అతనికి అధికారం ఉండదు, పార్లమెంటు ఉంటుంది, కాని చిరకాలంగా దాని చేతిలో అధికారమంటూ ఏమీలేని బాపతు పార్లమెంటు, జనం వుంటారు, అధికారాన్ని తిరిగి సాధించుకోవాలని సంకల్పితులైన జనం. అలాకాకుండా అది రాజ్యాంగ సవరణకు అనుకూలంగా ఓటు చేసినట్లయితే, తన ఓట్లు వ్యర్థమవుతాయన్న సంగతి దానికి తెలుసు, ఎందుకంటే, రిపబ్లికన్ల నిర్ణాయక ఓట్ల కారణంగా రాజ్యాంగరీత్యా తను ఓడితీరుతుంది. అదీ కాకుండా రాజ్యాంగచట్ట విరుద్ధంగా సామాన్యమైన మెజారిటీ ఓటే చెల్లుబాటవుతుందని అది ప్రకటించినట్లయితే, అప్పుడిక, తనను తాను కార్యనిర్వాహకాధికారంయొక్క సార్వభౌమాధికారానికి బేషరతుగా లొంగజేసుకున్నప్పుడు మాత్రమే అది విప్లవాన్ని అదుపులోకి తీసుకురాగలుగుతుంది, కానైతే, అప్పుడది బోనపార్ట్‌ను రాజ్యాంగానికి, దాని సవరణకు, చివరకు తనకూ సైతం అధిపతిని చేసినట్లవుతుంది. పోనీ కేవలం పాక్షిక సవరణను మాత్రమే చేసినట్లయితే అది అధ్యక్షుని అధికారాన్ని పొడిగించి, రాజ్యాధికారాన్ని అతను అపహరించడానికి దారి తీస్తుంది. అలాగూ కాకుండా అది పూర్తి రాజ్యాంగ సవరణకు పూనుకొంటే రిపబ్లిక్ అస్తిత్వ కాలం తగ్గిపోతుంది, దానితో రాజవంశీయ రాజ్యాధికార వివాదం తప్పనిసరిగా ప్రజ్వరిల్లుతుంది, ఎందుకంటే బూర్బన్‌రాజ్య పునరుద్ధరణ పరిస్థితులు ఆర్లియనిస్టు రాజ్య పునరుద్ధరణ పరిస్థితులకు భిన్నమైనవే కాకుండా, అవి పరస్పరం పరిహరించుకొనేవి కూడా కావడమే యిందుకు కారణం.

పార్లమెంటరీ రిపబ్లిక్, ఏ తటస్థ వేదికమీదనైతే ఫ్రెంచి బూర్జువావర్గానికి చెందిన రెండు పక్షాలూ — లెజిటిమిస్టులు, ఆర్లియనిస్టులు, బడా భూస్వాములూ, పారిశ్రామిక యజమానులూ — ఒకదాని సరసన మరొకటి సమానాధికారాలతో మనగలవో అటువంటి తటస్థ వేదిక మాత్రమే కాదు. అది, వాటి ఉమ్మడి పాలనయొక్క అనివార్యమైన షరతు, దేనిలోనైతే వాటి సాధారణ వర్గప్రయోజనం వాటి వేర్వేరు ముఠాలయొక్క రాజ్యాధికార వాదాలనూ, సమాజంలోని యితర అన్ని వర్గాల ప్రయోజనాలనూ తన అధీనం చేసుకొని ఉంచుకొంటుందో, ఆ ఏకైక రాజ్య రూపం. రాజరికవాదులుగా వారు తిరిగి తమ పాత

వైరానికి — ఆ పోరాటం భూస్వామ్యంయొక్క సర్వాధిక్యత కోసమైనా కావచ్చు, లేక డబ్బుయొక్క సర్వాధిక్యత కోసమైనా కావచ్చు — దిగారు, ఈ వైరంయొక్క అత్యున్నత అభివ్యక్తీకరణ, దాని సాకార రూపం, సాక్షాత్తూ వారి రాజులూ, వారి వేర్వేరు రాజకుటుంబాలే. బూర్బన్లను వెనక్కి రప్పించడంపట్ల పార్టీ ఆఫ్ ఆర్డర్ ప్రతిఘటన సరిగా యిందుకనే.

ఆర్లియనిస్టు డెప్యూటీ క్రెటోన్ 1849, 1850, 1851 సంవత్సరాల్లో, రాజకుటుంబీకులను దేశబహిష్కృతులను చేస్తూ జారీచెయ్యబడిన ఉత్తరువును రద్దుచెయ్యాలని దఫదఫాలుగా ప్రతిపాదిస్తూ వచ్చాడు. అటువంటి ప్రతిసారీ కూడా పార్లమెంటు, రాజరికవాదుల సమావేశానికి సంబంధించిన ఒక నాటకీయ దృశ్యాన్ని ప్రదర్శిస్తూవచ్చింది, అది కఠోర హృదయంతో దేశ బహిష్కృతులైన తన రాజులు తిరిగిలోనికి ప్రవేశించగల ద్వారాలను బంధిస్తూవచ్చింది. మూడవ రిచర్డ్ ఆరవ హెన్రీని, నీ అంతటి మరీ మంచివానికి యీ ప్రపంచం వాసయోగ్యమైనది కాదు, నీకు తగిన చోటు స్వర్గమే అంటూ హత్య చేశాడు. అలాగే ఆ రాజరికవాదులు చెప్పినదేమిటంటే, ఫ్రాన్సువంటి చెడ్డదేశానికి తిరిగి రాజులను కలిగివుండే యోగ్యత లేదని. పరిస్థితుల ఒత్తిడి కారణంగా వారు రిపబ్లికన్లయ్యారు, ఫ్రాన్సునుండి వారి రాజులను బహిష్కృతులనుచేసిన ప్రజానిర్ణయానికి పదేపదే తమ ఆమోదముద్రను వేశారు.

రాజ్యాంగ సవరణ — పరిస్థితుల ప్రాబల్యం కారణంగా యీ అంశాన్ని చర్చించక తప్ప లేదు — రిపబ్లిక్‌తో బాటు, రెండు బూర్జువా పక్షాల ఉమ్మడిపాలన సమస్యను ముందుకు తెచ్చింది, రాజరిక ప్రభుత్వం ఏర్పడే అవకాశాన్ని కల్పించడంతోబాటు, అది వంతులవారీగా ఏ రాజవంశాలకైతే అధికతర ప్రాతినిధ్యం వహిస్తూవచ్చిందో ఆ ప్రయోజనాల మధ్య వైరాన్నీ, ఒక పక్షంపై మరొక పక్షం ప్రాబల్యంకోసం సంఘర్షణనూ పునరుజ్జీవింపజేసింది. పార్టీ ఆఫ్ ఆర్డర్‌కి చెందిన కూటనీతిజ్ఞులు రెండు రాజవంశాలనూ ఏకంచెయ్యడంద్వారా, రాజరిక పార్టీలయొక్క, వాటి రాజకుటుంబాలయొక్క సంలీనం అనబడేదాని ద్వారా యీ జగడాన్ని సర్దుబాటుచెయ్యగలమని భావించారు. పునరుద్ధరణకూ జూలై రాజరికానికీ మధ్య నిజమైన సంలీనమే పార్లమెంటరీ రిపబ్లిక్, అందులో ఆర్లియనిస్ట్, లెజిటిమిస్ట్ ప్రత్యేక చిహ్నాలు తుడిచివెయ్యబడ్డాయి, వేర్వేరు బూర్జువా ఉపజాతులు అంతరించిపోయి ఒకేఒక బూర్జువా జాతిగా ఏకీకృత ఆకారంలో ఆవిర్భవించాయి. కానైతే యిప్పుడు, ఆర్లియనిస్టులు లెజిటిమిస్టులుగానూ, లెజిటిమిస్టులు ఆర్లియనిస్టులుగానూ తయారుకావలసివుంది. ఏ రాజరికంలోనైతే వారి శత్రుత్వం మూర్తీభవించి వుందో అది యిప్పుడు వారి ఐక్యతకు సాకారరూపం కావలసివుంది. వారి పరస్పరవిరుద్ధ పక్షప్రయోజనాల అభివ్యక్తీకరణ యిప్పుడు వారి ఉమ్మడి వర్గప్రయోజనాల అభివ్యక్తీకరణ కావలసివుంది. రెండు రాజరికాల రద్దు మాత్రమే, అంటే రిపబ్లిక్ మాత్రమే చెయ్యగలిగినదాన్ని, చేసినదాన్ని

యిప్పుడు రాజరికంచేత చేయించాలి. అటువంటి పరుసవేదిమణిని తయారుచెయ్యడానికి పార్టీ ఆఫ్ ఆర్డర్‌కి చెందిన పండితగణం తన బుర్రలు బద్దలుకొట్టుకుంది. కాని వారు లెజిటిమిస్టు రాజరికం పారిశ్రామిక బూర్జువావర్గపు రాజరికంగానూ, అలాగే బూర్జువా రాజరికం అనువంశిక భూస్వామ్య ప్రభువర్గంయొక్క రాజరికంగానూ ఎన్నడూ కాజాలదన్న సంగతిని విస్మరించారు. రాజకిరీటం ఒకని శిరస్సుపైననే, అంటే అన్న శిరస్సుపైననో తమ్ముని శిరస్సుపైననో మాత్రమే ఉండగలదన్న విషయాన్నీ, కాగా భూస్వామ్యమూ, పారిశ్రామిక యాజమాన్యమూ ఒకే రాజకిరీటం క్రింద సౌభాతృత్వం నెరపలేవన్న సంగతినీ ఆ పండితులు మరచిపోయారు. భూస్వామ్యం తనే పారిశ్రామిక యాజమాన్యంగా మారాలని నిశ్చయించుకోనంత కాలమూ పారిశ్రామిక యాజమాన్యం భూస్వామ్యంతో ఎంతమాత్రమూ రాజీ పడజాలదన్న సంగతిని వారు విస్మరించారు. మాటవరుసకు ఐదవ హెన్రీ రేపు చనిపోయే మాటైతే, హెన్రీ మరణకారణంగా కౌంట్ ఆఫ్ పారిస్ — ముందు ఆర్లియనిస్టుల రాజుగా తన పదవిని వదులుకుంటే గాని — లెజిటిమిస్టుల రాజు అవడు. కాని, రాజ్యాంగ సవరణ సమస్య అంతకంతకు అధికంగా ముందుకురావడంతో అదే స్థాయిలో మరింత సరభసవాగ్ధోరణి వహించి, "Assemblée nationale"[106] పేరున సొంత అధికారిక దినపత్రికను పెట్టుకొని, యీ క్షణంలో సైతం (1852 ఫిబ్రవరిలో) తిరిగి క్రియాశీలురైన సంలీన సిద్ధాంతవాదులు, యీ సమస్యా పరిష్కారానికి చిక్కంతా రాజవంశీకుల శత్రుత్వమూ, పోటీయే అన్నట్లు పరిగణిస్తున్నారు. ఆర్లియన్స్ రాజకుటుంబం ఐదవ హెన్రీతో రాజీపడేలా చేసే ప్రయత్నాలు లూయీ ఫిలిప్ మరణకాలంనుండే ప్రారంభమయ్యాయి, కానైతే, ఆ ప్రయత్నాలు సాధారణంగా రాజవంశీయ కుతంత్రాల మాదిరిగానే జాతీయ సభ విరామంలో వున్నప్పుడు మాత్రమే జరుగుతూవుండేవి. నాటక విష్కంభ సమయాల్లో, తెరల వెనుక మాత్రమే ఆడబడుతూవుండిన యీ అభినయం గంభీరమైన వ్యవహారమేమీ కాదు, పురాతన అంధ విశ్వాసాలతో కూడిన ఆర్ద్రభావపూరితమైన అభినయం మాత్రమే. ఇప్పుడు అది రాజ్యసంబంధమైన అభినయ రూపాన్ని దాల్చి, పార్టీ ఆఫ్ ఆర్డర్‌చేత, యింత దాకా ఆడబడుతున్నట్లు ఔత్సాహిక రంగస్థలిపైన కాక బహిరంగ రంగస్థలిపైన ఆడబడుతోంది. దూతలు పారిస్‌నుండి వెనిస్‌కీ,[107] వెనిస్‌నుండి క్లెర్‌మోంట్‌కీ, క్లెర్‌మోంట్‌నుండి పారిస్‌కీ హడావిడిగా పరుగులు పెడుతున్నారు. కౌంట్ షంబోర్ ఒక ప్రకటన విడుదలచేశాడు, దానిలో "తన కుటుంబసభ్యులందరి సహకారంతో" అతను తన పునరుద్ధరణనుకాక "జాతీయ" పునరుద్ధరణను సాధిస్తానని ఉద్ఘాటించాడు. ఆర్లియనిస్ట్ సాల్వండీ పోయి ఐదవ హెన్రీ పాదాలపై పడ్డాడు. లెజిటిమిస్టు నాయకులైన బెర్యే, బెనువా డి అజీ, సెంట్-ప్రీస్ట్‌లు ఆర్లియనిస్టులకు నచ్చచెప్పేందుకు క్లెర్‌మోంట్‌కి వెళ్ళారు గాని, వారు విఫలురయ్యారు. బూర్జువా వర్గానికి చెందిన రెండు పక్షాల ప్రయోజనాలూ కుటుంబ ప్రయోజనాల, రెండు రాజ

వంశాల ప్రయోజనాల రూపాన్ని ధరించినంతమాత్రాన తమ పరస్పరప్రత్యేకతను కోల్పో వన్న సంగతీ, సర్దుబాటుతనాన్ని సంతరించుకోవన్న సంగతీ సంలీనవాదులు చాలా ఆలస్యంగా గ్రహించారు. ఐదవ హెన్రీ కౌంట్ ఆఫ్ పారిస్‌ను తన వారసునిగా గుర్తించినట్లయితే — మహా అయితే సంలీనం సాధించగలిగే ఏకైక విజయం యిదే — ఐదవ హెన్రీయొక్క సంతాన హీనత మూలంగా ఆర్లియన్స్ కుటుంబానికి యింతకు ముందే సంక్రమించిన హక్కు మినహాయించి దానికి కొత్తగా లభ్యమయ్యే హక్కు మరేదీ ఉండబోదు, పైగా జూలై విప్లవం ద్వారా సాధించుకున్న హక్కులన్నింటినీ అది కోల్పోతుంది. అది తన మౌలిక స్వత్వాలను, సుమారొక నూరు సంవత్సరాల కాలం జరిపిన సంఘర్షణ ద్వారా బూర్బన్ వంశానికి చెందిన అధికతర పురాతన శాఖనుండి తను రాబట్టుకున్న సమస్త స్వత్వాలనూ వదులుకున్నట్లవుతుంది; అది తన చారిత్రక విశిష్టాధికారాన్ని, ఆధునిక రాజస్వ విశిష్టాధికారాన్ని తన ఆనువంశిక రాజ్యసింహాసనాధికారానికి బదులుగా విక్రయించుకున్నట్లవుతుంది. అందుకని, సంలీనం అంటే ఆర్లియన్స్ వంశం యిచ్ఛా పూర్వకంగా సింహాసనపరిత్యాగం చెయ్యడం, ఔరసత్వ హక్కు ముందు మోకరిల్లడం, ప్రొటెస్టెంటు రాజ్య చర్చిని పశ్చాత్తాప పూర్వకంగా విడిచిపెట్టి కేథలిక్ చర్చిలో ప్రవేశించడం తప్ప మరేమీ కాదు. ఇంతే కాదు, యీ ఉపసంహరణ దానిని అది కోల్పోయిన సింహాసనానికైనా తీసుకు వస్తుందా అంటే అదీ లేదు, ఏ సింహాసనపు మెట్ల వద్దనైతే అది జన్మించిందో ఆ మెట్లవద్దకు మాత్రమే అది తీసుకువస్తుంది. ఇతరుల మాదిరిగానే సంలీనాన్ని సాధించేందుకోసం పరుగుపరుగున క్లేర్‌మోంట్‌కు వెళ్లిన పాత ఆర్లియనిస్టు మంత్రులు గిజో, డ్యుషటేల్ ప్రభృతులు, నిజానికి కేవలం జూలై విప్లవానంతర మనఃక్లేశానికీ, బూర్జువావర్గ రాజరికానికీ, బూర్జువాల రాజత్వానికీ సంబంధించి తాము పొందిన నిరాశకూ, అరాజకత్వానికి వ్యతిరేకంగా తుది సమ్మోహక చిట్కా ఔరసత్వ హక్కు మాత్రమేనన్న అంధవిశ్వాసానికీ మాత్రమే ప్రాతినిధ్యంవహించారు. వారు తమను ఆర్లియన్లకూ బూర్బన్లకూ నడుమ మధ్యవర్తులుగా పరిగణించుకొన్నా, నిజానికి వారు ఆర్లియనిస్టు పక్షానికి విద్రోహులు, మరి ప్రిన్స్ జొయిన్‌వీల్ వారికి ఆ రూపంలోనే స్వాగతమిచ్చాడు. మరోవంక, ఆర్లియనిస్టుల్లోని కార్యశీలురు, పోరాటప్రవృత్తి కలిగినవారి విభాగానికి చెందిన త్యేర్, బాజ్ ప్రభృతులు లూయీ ఫిలిప్ కుటుంబీకులకు, ప్రత్యక్ష రాజరికపునరుద్ధరణలో రెండు రాజవంశాల సంలీనమనే పూర్వషరతు ఉన్నట్లయితే, అటువంటి సంలీనానికి ఆర్లియన్స్ కుటుంబం రాజ్యసింహాసన వారసత్వ హక్కును వదులుకోవడం పూర్వషరతు అయినా కూడా, అది వారి పూర్వికుల సంప్రదాయానికి, ఆ క్షణాన రిపబ్లిక్‌ను గుర్తించడం, అధ్యక్ష పీఠాన్ని రాజసింహాసనంగా మార్చే పరిస్థితులు కలిసివచ్చేదాకా వేచియుండే సంప్రదాయానికి పూర్తిగా అనుగుణంగానే ఉంటుందని మరింత తేలికగా విశ్వాసం కల్పించారు. జొయిన్‌వీల్ రిపబ్లిక్ అధ్యక్ష ఎన్నికకు అభ్యర్థిగా నిలబడబోతున్నాడన్న పుకార్లు వ్యాపింపచెయ్యబడ్డాయి,

ప్రజాసామాన్యపు కుతూహలం రేకెత్తించబడింది, మరి కొన్ని నెలల తర్వాత, అంటే సెప్టెంబరులో, రాజ్యాంగ సవరణ తిరస్కరింపబడిన తర్వాత అతని అభ్యర్థిత్వం బహిరంగంగా ప్రకటింపబడింది.

ఆర్లియనిస్టుల లెజిటిమిస్టుల రాజరిక సంలీన ప్రయత్నం ఆ విధంగా విఫలమవడమే కాకుండా వారి పార్లమెంటరీ సంలీనాన్ని, వారి ఉమ్మడి రిపబ్లికన్ రూపాన్నిసైతం నాశనంచేసి, పార్టీ ఆఫ్ ఆర్డర్‌ని దాని తొలి సంఘటకభాగాలుగా విడదీసింది. కాని క్లేర్‌మోంట్ వెనిస్‌ల మధ్య ఎడబాటుభావం ఎంత ఎక్కువగా పెరుగుతూపోయిందో అంత ఎక్కువగానూ వారి మధ్య పరిష్కారం విచ్ఛిన్నమవుతూవచ్చింది, ఆ మేరకు జొయిన్‌విల్ తరఫున ప్రచారం బలాన్ని పుంజుకోసాగింది, అంత జోరుగానూ అంత ఆసక్తితోనూ బోనపార్ట్ మంత్రి అయిన ఫాషేకీ లెజిటిమిస్టులకీ మధ్య సంప్రతింపులు సాగాయి.

పార్టీ ఆఫ్ ఆర్డర్ విఘటన దాని తొలి మూలకాల దగ్గర ఆగలేదు. రెండు పక్షాలలోనూ తిరిగి కొత్త చీలికలు ప్రారంభమయ్యాయి. ఈ రెండు శిబిరాల — లెజిటిమిస్టులు, ఆర్లియనిస్టులు — లోనూ ఏ చిల్లరమల్లర విభేదఛాయలైతే పూర్వం తమలో తాము పరస్పరం కలహించుకొంటూవుండేవో అవి యిప్పుడు, ఎండిపోయిన ఇన్‌ఫ్యుసోరియా సూక్ష్మజీవులు నీళ్లు తగలగానే తిరిగి స్పందనశీలమైనట్లుగానే, తిరిగి స్పందనశీలమయ్యాయి. వాటిలో తిరిగి తమ సొంత స్వతంత్ర పరస్పర వైరుధ్యాలుగల గ్రూపులు ఏర్పరచుకోవడానికి తగినంత జీవశక్తి ఉద్బుద్ధమైనదేమోనన్నట్లు అవి తిరిగి క్రియాశీలమయ్యాయి. లెజిటిమిస్టులు తాము తుయిలెరీ రాజభవనానికి మర్సాన్ పవిలియన్‌కీ మధ్య, విల్లేల్‌కీ పొలిన్యాక్‌కీ మధ్య పూర్వపు వివాదాలలోకి[108] తిరిగి పోయామని ఊహించుకున్నారు. ఆర్లియనిస్టులు గిజో, మొలే, బ్రొయ్లీ, త్యేర్, ఒడిలోన్ బర్రోల మధ్య జరిగిన సైనిక పోటీల స్వర్ణయుగానికి సంబంధించిన కలలు కనసాగారు.

పార్టీ ఆఫ్ ఆర్డర్‌లో రాజ్యాంగ సవరణపట్ల ఆతృత చూపుతున్న ఆ భాగం — ఆ సవరణ ఏ మేరకు జరగాలన్న అంశంపై తిరిగి చీలింది. దీనిలో ఒక విభాగం ఒకవంక బెర్యే, ఫల్లూల నాయకత్వాన, మరోవంక లరోష్‌జక్లేన్ నాయకత్వాన లెజిటిమిస్టులతో కూడి వుంది. రెండో విభాగం మొలే, బ్రొయ్లీ, మొంటలెంబేర్, ఒడిలోన్ బర్రోల నాయకత్వానగల, జగడంతో విసుగెత్తిపోయిన ఆర్లియనిస్టులతో కూడివుంది — అనిర్దిష్టమైన, విస్తృతార్థంలో రూపొందించబడిన యీ క్రింది ప్రతిపాదనపై బోనపార్టిస్టు ప్రతినిధులతో ఒక అంగీకారానికి వచ్చింది:

"జాతికి దాని పూర్తి సార్వభౌమత్వాన్ని పునరుద్ధరించే లక్ష్యంతో, యీ క్రింద సంతకాలు చేసిన ప్రతినిధులు రాజ్యాంగం సవరింపబడాలని ప్రతిపాదిస్తున్నారు."

కానైతే, అదే సమయంలో, తమ తరపున నివేదించిన టొక్విల్ ద్వారా యీ ప్రతినిధులు రిపబ్లిక్ రద్దు కోసం ప్రతిపాదించే హక్కు జాతీయ సభకు లేదనీ, యీ హక్కు కేవలం సవరణ కోసం సమావేశమయిన సభకి మాత్రమే ఉన్నదనీ ఏకగ్రీవంగా ప్రకటించారు. దీనికి తోడు రాజ్యాంగం "చట్టబద్ధ" పద్ధతిలో మాత్రమే సవరింపబడవచ్చు, అంటే, రాజ్యాంగచట్టం నిర్దేశించిన మేరకు, సవరణకు అనుకూలంగా నాలుగింట మూడు వంతుల ఓట్లు పడినప్పుడు మాత్రమే అందుకు పూనుకోవాలన్నమాట. ఆరు రోజులపాటు తుపాను ప్రాయంగా చర్చలు జరిగిన అనంతరం, జూలై 19న, అనుకున్నట్లుగానే, రాజ్యాంగ సవరణ ప్రతిపాదన తిరస్కరింపబడింది. రాజ్యాంగ సవరణకు అనుకూలంగా 446 ఓట్లు పడగా, దానికి వ్యతిరేకంగా 278 ఓట్లు పడ్డాయి. ఉగ్ర ఆర్లియనిస్టులు, త్యేర్, షంగర్న్యే మొదలైనవారు రిపబ్లికన్లతోను, మహీధరం పార్టీతోను కలిసి ఓటుచేశారు.

ఈ విధంగా, పార్లమెంటులోని అధికసంఖ్యాకులు రాజ్యాంగచట్టానికి వ్యతిరేకంగా ఓటు చెయ్యగా, ఆ రాజ్యాంగచట్టమే తను అల్పసంఖ్యాక పక్షానికి అనుకూలమనీ, దాని ఓటుకి కట్టుబడి వుండాలనీ ప్రకటించింది. కాని పార్టీ ఆఫ్ ఆర్డర్ 1850 మే 31న, 1849 జూన్ 13న రాజ్యాంగచట్టాన్ని పార్లమెంటరీ మెజారిటీకి లోబడివుండేటట్లు చేసియుండలేదా? ఇప్పటి దాకా, దాని యావత్తు విధానమూ రాజ్యాంగచట్టంలోని నిబంధనలను పార్లమెంటులో మెజారిటీయొక్క నిర్ణయాలకు లోబడేటట్లు చెయ్యడంపై ఆధారపడి సాగలేదా? అది ప్రజాతంత్ర వాదులకు చట్టంపట్ల అత్యంత పురాతన అంధవిశ్వాసాన్ని వదిలిపెట్టి, అందుకు గాను ప్రజాస్వామ్యవాదులను అది తీవ్రంగా విమర్శించలేదా? కానైతే ప్రస్తుత సమయంలో మాత్రం, రాజ్యాంగ సవరణ అంటే అర్థం అధ్యక్ష అధికారపు కొనసాగింపు తప్ప మరేదీ ఎలా కాదో అలాగే రాజ్యాంగచట్టపు కొనసాగింపు అంటే అర్థం అధ్యక్ష అధికారచ్యుతి తప్ప మరేమీ కాదు. పార్లమెంటు బోనపార్ట్‌కి అనుకూలంగా ఓటుచేసింది, కాని రాజ్యాంగచట్టం పార్లమెంటుకి వ్యతిరేకంగా తీర్పుచెప్పింది. అందుకని, బోనపార్ట్ రాజ్యాంగచట్టాన్ని, చింపిపారేసినప్పుడు పార్లమెంటు ఉద్దేశానికి అనుకూలంగా అతను ప్రవర్తించాడన్నమాట, పార్లమెంటును భగ్నంచేసినప్పుడు అతను రాజ్యాంగచట్టంయొక్క ఉద్దేశానుసారంగా వర్తించాడన్నమాట.

పార్లమెంటు రాజ్యాంగచట్టాన్నీ రాజ్యాంగచట్టంతో బాటే, తన స్వంతపాలననూ కూడా "మెజారిటీకి అతీతం"గా ప్రకటించింది. తన ఓటు ద్వారా అది రాజ్యాంగచట్టాన్ని రద్దుచేసి, అధ్యక్ష అధికారావధిని పొడిగించింది. కాని అదే సమయంలో, తను అస్తిత్వంలో ఉన్నంతకాలం రాజ్యాంగచట్టం అంతరించజాలదనీ, అధ్యక్ష అధికారం అస్తిత్వంలో ఉండ జాలదనీ ప్రకటించింది. దాన్ని దహనంచెయ్యాల్సినవాళ్లు ద్వారం దగ్గర నిలబడివున్నారు. పార్లమెంటు రాజ్యాంగ సవరణపై చర్చలు జరుపుతూ ఉండగా, బోనపార్ట్, ఊగిసలాటను ప్రదర్శించిన జనరల్ బరగే డి యిల్యేను ప్రథమ సైనిక డివిజన్ నాయకత్వంనుండి తొలగించి,

అతని స్థానంలో లియోన్ విజేతా, డిసెంబరు రోజులనాటి వీరుడూ, తను సృష్టించినవారిలో ఒకడూ అయిన, లూయీ ఫిలిప్ కాలంలోనే బొలోన్ దాడిసందర్భంగా కొంచెం యించు మించులో బోనపార్ట్ అనుకూలుడుగా ప్రవర్తించి అప్రతిష్ఠపాలైన జనరల్ మన్యాన్‌ను నియమించాడు.

రాజ్యాంగ సవరణకు సంబంధించిన తన నిర్ణయం ద్వారా పార్టీ ఆఫ్ ఆర్డర్, తనకు పాలించడమూ చేతకాదు, సేవచెయ్యడమూ చేతకాదనీ; జీవించడమూ చేతకాదు, మరణించ డమూ చేతకాదనీ; రిపబ్లిక్‌ను సహించడమూ చేతకాదు, దాన్ని నిర్మూలించడమూ చేత కాదనీ; రాజ్యాంగచట్టాన్ని కాపాడటమూ చేతకాదు, దాన్ని చింపిపారెయ్యడమూ చేతకాదనీ; అధ్యక్షునితో ఎలా సహకరించాలో తెలియదు అతనితో ఎలా తెగతెంపులు చేసుకోవాలోకూడా తనకు తెలియదనీ రుజువుచేసుకుంది. మరైతే, యీ వైరుధ్యాలన్నింటి పరిష్కారంకోసం అది ఎవరికేసి చూస్తున్నట్టు? కేలెండరు కేసీ, ఘటనా క్రమం కేసీని! ఘటనలపై పెత్తనం వహించాలన్న ధ్యాసను అది వదిలేసుకుంది. అందుకని అది తనపై పెత్తనం చెయ్యా ల్సిందిగా ఘటనలను సవాలుచేసింది, తద్వారా అది, ప్రజలకు వ్యతిరేకంగా తను జరిపిన పోరాటంలో ఏ శక్తికైతే ఒకదాని తర్వాత మరొకటి చొప్పున విశేషాధికారాలన్నింటినీ కట్ట బెట్టిందో, చివరకు ఆ శక్తి ముందు తనే నిస్సహాయంగా నిలబడిందో, ఆ శక్తిని సవాలు చేసింది. కార్యనిర్వాహకాధికారం మరింత నిరభ్యంతరంగా తనకు వ్యతిరేకంగా యుద్ధ వ్యూహాన్ని తయారుచేసుకునేందుకు వీలుగా, దాడి సాధనాలను సుదృఢంచేసుకునేందుకు వీలుగా, పరి కరాలను ఎంపిక చేసుకొని యుద్ధ స్థావరాలను అభేద్యంచేసుకొనేందుకు వీలుగా, అది సరిగా యీ కీలక క్షణంలో రంగంనుంచి నిష్క్రమించాలని, అంటే తన సమావేశాన్ని ఆగస్టు 10నుండి నవంబరు 4వరకు సుమారు మూడు మాసాలపాటు వాయిదావెయ్యాలని తీర్మా నించుకుంది.

పార్లమెంటరీ పార్టీ కేవలం రెండు పెద్ద పక్షాలుగా విడిపోవడమే కాకుండా, ఈ రెండు పక్షాలూ తిరిగి చీలిపోవడమే కాకుండా, పార్లమెంటు లోపలి పార్టీ ఆఫ్ ఆర్డర్‌కి పార్ల మెంటు వెలుపలి పార్టీ ఆఫ్ ఆర్డర్‌తో కలహం సంభవించింది. బూర్జువావర్గపు ప్రవక్తలూ వ్రాయసగాళ్ళూ, దాని వక్తలూ పత్రికలూ, క్లుప్తంగా చెప్పాలంటే బూర్జువావర్గపు సిద్ధాంత కారులూ, ఆ మాట కొస్తే స్వయంగా బూర్జువావర్గమూ – ప్రతినిధులూ, ప్రాతినిధ్యం వహింపబడినవారూ – ఒకరిపట్ల మరొకరు విముఖులుగా తయారయ్యారు, వీరు వారిని గాని వారు వీరిని గాని అర్థంచేసుకొనే స్థితిలో లేరు.

రాష్ట్రాలలోని లెజిటిమిస్టులు, తమ పరిమిత దృష్టిపథంతోనూ, అపరిమిత ఉత్సా హంతోనూ తమ పార్లమెంటరీ నాయకులైన బెర్యే, ఫల్లూల పైన అయిదవ హెన్రీని వదిలేసి బోనపార్టిస్టు శిబిరంలో చేరిపోయారన్న ఆరోపణ చేశారు. వారి బూర్బన్ లిల్లీ మాదిరి

విశుద్ధమైన మనసులకు మనిషి పతనం సంగతే అవగతమైంది, గాని కూటనీతి సంగతి కొరుకుడు పడలేదు.

వాణిజ్య బూర్జువావర్గానికి తన రాజకీయవేత్తలతో వచ్చిన చీలిక మరింత దారుణమైనదీ, నిర్ణయాత్మకమైనదీ. లెజిటిమిస్టులు తమ రాజకీయవేత్తలపైన సూత్రాలకు తిలోదకాలిచ్చారని ఆరోపణచెయ్యగా, వాణిజ్య బూర్జువావర్గం అందుకు భిన్నంగా తన రాజకీయవేత్తలపైన పనికిరానివిగా తయారైన సూత్రాలను పట్టుకు వ్రేలాడుతున్నారంటూ ఆరోపణ చేసింది.

మంత్రివర్గంలో ఫూల్డ్ ప్రవేశించినప్పటినుండి, లూయీ ఫిలిప్ కాలంలో అధికారంలో అత్యధికభాగాన్ని అనుభవిస్తూవుండిన వాణిజ్య బూర్జువావర్గం, అర్థాత్తు ధనిక ప్రభువర్గ విభాగం బోనపార్టిస్టు పంథా అనుయాయిగా మారినట్లు పైన మేమింతకు ముందే సూచించి వున్నాం. స్టాక్ ఎక్స్చేంజిలో ఫూల్డ్, బోనపార్ట్ ప్రయోజనాలకు ప్రాతినిధ్యం వహించడమే కాక, దానితోబాటే అతను బోనపార్ట్ ఎదుట స్టాక్ ఎక్స్చేంజి ప్రయోజనాలకు కూడా ప్రాతినిధ్యంవహించాడు, ధనిక ప్రభువర్గపు వైఖరిని దాని యూరపియన్ అధికారిక పత్రిక అయిన లండన్ "Economist"[109] ఒక లేఖాంశంలో అతి స్పష్టంగా పేర్కొంది. 1851 ఫిబ్రవరి 1వ తేదీ సంచికలో దాని పారిస్ విలేకరి యిలా రాశాడు:

"ఫ్రాన్సు అన్నిటికన్న ముఖ్యంగా శాంతిని కోరుతోంది అన్నమాటలు అనేకానేక చోట్లనుంచి మనకు వినవస్తున్నాయి. అధ్యక్షుడు శాసనసభకు తానిచ్చిన సందేశంలో యీ విషయాన్ని పేర్కొన్నాడు; శాసనసభావేదికల పైనుంచి యీ మాటలు ప్రతిధ్వనించాయి; పత్రికల్లో యీ మాటలు నొక్కి వక్కాణింపబడ్డాయి; పాదరీల ద్వారా యివే మాటలు ఘోషింపబడుతున్నాయి; అల్లరి జరిగే అవకాశం ఏమాత్రమున్నా కూడా ప్రభుత్వ రుణపత్రాల స్థిరత్వం తల్లక్రిందులవడాన్నిబట్టీ, కార్యనిర్వాహకాధికారం విజయవంతమైందన్న సంగతి స్పష్టంకాగానే వాటిలో స్థిరత్వం రావడాన్నిబట్టీ కూడా యీ విషయం రుజువుచేయబడుతోంది."

1851 నవంబరు 29వ తేదీనాటి తన సంచికలో "Economist" తన సంపాదకీయ వ్యాఖ్యలో యిలా పేర్కొంది:

"అధ్యక్షుడు వ్యవస్థ భద్రత పరిరక్షకుడు, మరి యూరప్‌లోని స్టాక్ ఎక్స్చేంజిలన్నీ కూడా యీనాడు ఆయన్ని అలాగే పరిగణిస్తున్నాయి."

ఈ విధంగా ధనిక ప్రభువర్గం, పార్టీ ఆఫ్ ఆర్డర్ కార్యనిర్వాహకాధికారంతో జరిపే పార్లమెంటరీ పోరాటాన్ని వ్యవస్థ భద్రతకు దెబ్బ అంటూ ఖండిస్తూవచ్చింది, తన సొంత

ప్రతినిధులపై అధ్యక్షుడు పొందిన ప్రతి విజయాన్నీ వ్యవస్థ భద్రతగా హర్షిస్తూ వచ్చింది. ధనిక ప్రభువర్గం అన్నప్పుడు మనమిక్కడ కేవలం ప్రభుత్వరుణాలను పెంచే గొప్పవారనీ, వాటిలో చట్టావ్యాపారం చేసేవారనీ మాత్రమే అర్థంచేసుకోరాదు, వారి విషయంలో, వారి ప్రయోజనం రాజ్యప్రయోజనాలకు అనుగుణమైనదన్న సంగతి సుస్పష్టమైనదే. సకల ఆధునిక ద్రవ్యమూ, యావత్తు బ్యాంకింగువ్యాపారమూ ప్రభుత్వ రుణంతో అత్యంత సన్నిహితంగా ముడివడివుంది. బ్యాంకుల వ్యాపారపెట్టుబడిలో ఒక భాగం సహజంగానే తప్పనిసరిగా ప్రభుత్వ బాండ్లలో వినియోగింపబడుతుంది, వడ్డీలకివ్వబడుతుంది. ఈ బ్యాంకుల్లో డిపాజిట్‌చెయ్యబడిన మొత్తాలు, వాటివద్ద ఉంచబడిన పెట్టుబడి, దేనినైతే అవి వర్తకులకూ, పారిశ్రామికాధిపతులకూ పంచుతుందో, ఆ మొత్తాలు పాక్షికంగా ప్రభుత్వ రుణపత్ర గ్రహీతల లాభాంశాలనుండి లభించినవే. ప్రతి యుగంలోనూ రాజ్యాధికార స్థిరత్వం పూర్తిగా ద్రవ్య మార్కెట్టు కోసమూ, ఆ ద్రవ్య మార్కెట్ పూజారులకోసమే పూజనీయంగా పరిగణింపబడుతూ వచ్చినప్పుడు, మరి, ప్రతి జలప్రళయమూ పాత రాజ్యాలనూ, పాత రాజ్యాలతోబాటు ప్రభుత్వ రుణాలనూ సైతం తుడిచిపెట్టేసే ప్రమాదం ఏర్పడిన యీనాడు ఎందుకుగాను అది మరింత పూజనీయం కాదు?

పారిశ్రామిక బూర్జువావర్గం సైతం, వ్యవస్థ భద్రతపట్ల తమ అంధ ఆవేశంలో, కార్యనిర్వాహకాధికారంతో పార్లమెంటులో పార్టీ ఆఫ్ ఆర్డర్ విభాగపు జగడాలపట్ల కోపం చెందింది. షంగర్న్యే బర్తరఫ్ సందర్భంగా జనవరి 18న ఓట్లు వేసిన తర్వాత త్యేర్, అంగ్లేస్, సెంట్-బ్యేవ్ ప్రభృతులకు సరిగా పారిశ్రామిక మండలాలకు చెందిన తమ నియోజక వర్గాల ఓటర్లనుండి బహిరంగ నిరసనలు అందాయి, ప్రత్యేకించి మహీధరం పార్టీతో వారి పొత్తును వ్యవస్థ భద్రతకు ద్రోహంగా అభివర్ణించి వారు దుయ్యబట్టారు. మనం యింతకు ముందే చూసినట్లు, బోనపార్ట్‌తో సంఘర్షణలో పార్టీ ఆఫ్ ఆర్డర్‌యొక్క డాంబికమైన కటూక్తులూ, నీచమైన కుతంత్రాలూ అటువంటి స్వాగతానికే యోగ్యమైనవైతే, మరోవంక, తన ప్రతినిధులను సైనికాధికారాన్ని, ప్రతిఘటన లేకుండా, తన సొంత పార్లమెంటునుండి దుస్సాహసిక కపట వారసుని చేతుల్లోకి పోనివ్వవలసిందిగా కోరిన యీ బూర్జువా పార్టీ, తన ప్రయోజనార్థం యీ కుతంత్రాలు జరగాల్సినపాటి యోగ్యతసైతం తనకు లేదని రుజువుచేసుకుంది. తన సామాజిక ప్రయోజనాలను, తన సొంత వర్గ ప్రయోజనాలను, తన రాజకీయాధికారాన్ని కొనసాగించుకొనేందుకు జరిపే పోరాటంమాత్రమే తనను బాధించినట్లుగా, కలతపరచినట్లుగా అది రుజువుచేసుకుంది, ఎందుకంటే ఆ కారణంగా దాని ప్రైవేటు వ్యాపారానికి వ్యాఘాతం ఏర్పడుతుంది.

బోనపార్ట్ పర్యటనల్లో జిల్లా పట్టణాల్లోని బూర్జువా ప్రముఖులూ, నగరపాలక అధికారులూ, వాణిజ్య న్యాయస్థానాలకు చెందిన న్యాయాధిపతులూ మొదలైనవారు, ఎటు

వంటి మినహాయింపూ లేకుండా అన్ని చోట్లా సేవకప్రవృత్తితో అతనికి స్వాగతంచెప్పారు, విశేషమేమిటంటే, డిజోన్‌లో సైతం అతను జాతీయ అసెంబ్లీపైనా, ప్రత్యేకించి పార్టీ ఆఫ్ ఆర్డర్‌పైనా నోటికి కళ్లెంలేకుండా విశృంఖలంగా దాడిచేసినాకూడా అతనికి వాళ్లు అలా స్వాగతంచెప్పారు.

వ్యాపారం బాగానే సాగినప్పుడు – 1851 ఆరంభంవరకు బాగా ఉండినట్లు, – వాణిజ్య బూర్జువావర్గం – తమ వ్యాపార సుస్థిరత ఎక్కడ దెబ్బతింటుందోనన్న భయంతో – ఏ రకమైన పార్లమెంటరీ పోరాటం జరిగినా తీవ్రంగా మండిపడుతూ వచ్చింది. వ్యాపారం నాసిగా వున్నప్పుడు – 1851 ఫిబ్రవరి నెలాఖరునుండి వరుసగా ఉంటూవచ్చినట్లు – వాణిజ్య బూర్జువావర్గం, వ్యాపార మాంద్యానికి పార్లమెంటరీ పోరాటాలే కారణమని ఆరోపిస్తూ, వ్యాపారం తిరిగి ముమ్మరంగా సాగేందుకుగాను పార్లమెంటరీ పోరాటాన్ని కట్టిపెట్టాల్సిందిగా గొడవచేస్తూవచ్చింది. రాజ్యాంగ సవరణకు సంబంధించిన చర్చలు సరిగా యిటువంటి చెడ్డ దశలో సాగాయి. ఈ వ్యవహారంలో యిమిడివున్న సమస్య ప్రస్తుతం అస్తిత్వంలోవున్న రాజ్య రూపం ఉండటమా ఊడటమా అన్నది కనుక, అత్యంత బాధాకరమైన యీ తాత్కాలిక ఏర్పాటును తుదముట్టించమనీ, అదే సమయంలో యథాస్థితి కొనసాగేలా చూడమనీ తన ప్రతినిధులను కోరడం మరింత సమంజసమైనదిగా బూర్జువావర్గం భావించింది. ఇందులో వైరుధ్యమేమీ లేదు. తాత్కాలిక ఏర్పాటు ముగియడమంటే సరిగా యథాస్థితి కొనసాగడమేననీ, కచ్చితమైన నిర్ణయం తీసుకోవాల్సిన క్షణాన్ని సుదూర భవిష్యత్తుకు వాయిదావెయ్యడ మేననీ అది అర్థంచేసుకుంది. యథాస్థితిని కొనసాగించడానికి యీ క్రింది రెండు మార్గాలు మాత్రమే వున్నాయి: బోనపార్ట్ అధికార వ్యవధిని పొడిగించడం, లేకపోతే రాజ్యాంగచట్ట రీత్యా అతనిచేత పదవీవిరమణ చేయించి కవేన్యాక్‌ను ఎన్నుకోవడం. బూర్జువావర్గంలో ఒక విభాగం రెండవ పరిష్కార మార్గాన్ని ఎంచుకొంది, తన ప్రతినిధులకు మాట్లాడకుండా ఊరుకొమ్మనీ, యీ వివాదాస్పద సమస్యను లేవనెత్తకుండా వదిలెయ్యమనీ సలహా యివ్వ డంతప్ప దానికి మరో ఉత్తమ పరిష్కారమార్గం తోచలేదు. తన ప్రతినిధులు మాట్లాడక ఊరుకొంటే, బోనపార్ట్ ఏమీ చెయ్యడని అది భావించింది. తలను దాచి తను అదృశ్యమయ్యానని భ్రమించే ఉష్ట్రపక్షి వంటి పార్లమెంటును అది కోరుకుంది. బూర్జువావర్గానికి చెందిన మరో విభాగం, బోనపార్ట్ ఎలాగూ యింతకు ముందే అధ్యక్ష పదవిలో ఉన్నాడుకనుక, అతన్ని అందులోనే ఉండనిస్తే తీరిపోతుంది, అప్పుడిక అన్నీ పాతగాడిలోనే ఉండిపోతాయి అని భావిం చింది. తమ పార్లమెంటు రాజ్యాంగచట్టాన్ని బాహాటంగా ఉల్లంఘించనందుకూ, ఏ తంతూ లేకుండా రాజ్యాధికారాన్ని పరిత్యజించనందుకూ ఈ విభాగానికి చెందినవారు మండిపడ్డారు.

జిల్లాలకు చెందిన జనరల్ కౌన్సిళ్లు – జాతీయ సభ విరామ కాలంలో ఆగస్టు 25 మొదలుకొని సమావేశమైన బడాబూర్జువావర్గానికి చెందిన ఆ జిల్లా ప్రాతినిధ్య సంస్థలు –

దాదాపు ఏకగ్రీవంగా రాజ్యాంగ సవరణకు అనుకూలతనూ, తద్వారా పార్లమెంటుకు వ్యతిరేకతనూ, బోనపార్ట్‌కి అనుకూలతనూ వ్యక్తంచేశాయి.

బూర్జువావర్గం తన పార్లమెంటరీ ప్రతినిధులతో ఎంత అసందిగ్ధంగా కలహించిందో, తన సాహిత్య ప్రతినిధులతోను, తన సొంత పత్రికలతోను అంతకన్న ఎక్కువ అసందిగ్ధంగా కినుకచెందింది. బోనపార్ట్‌యొక్క అక్రమ అధికారాక్రమణ వాంఛలకు వ్యతిరేకంగా బూర్జువా పత్రికా రచయితలు చేసిన ప్రతి దాడీ, కార్యనిర్వాహకాధికారానికి వ్యతిరేకంగా బూర్జువావర్గపు రాజకీయ హక్కుల పరిరక్షణకోసం పత్రికలు చేసిన ప్రతి ప్రయత్నమూ, బూర్జువా కోర్టుల నిర్ణయాలమేరకు, విధింపబడిన దివాళాతీయించే జుల్మానాలూ, సిగ్గుమాలిన షరతులపై జైలుశిక్షలూ ఒక్క ఫ్రాన్సునే కాకుండా యావత్తు యూరప్‌నూ విభ్రాంతంచేశాయి.

పార్టీ ఆఫ్ ఆర్డర్ పార్లమెంటరీ విభాగం నేనింతకుముందే స్పష్టంచేసినట్లు, ప్రశాంతి కోసం తను చేసిన గోల ద్వారా తన చేతులను బంధించేసుకొని, సమాజంలోని యితర వర్గాలకు వ్యతిరేకంగా జరిపిన పోరాటంలో తన సొంత పాలనకు, పార్లమెంటరీ పాలనకు, అవసరమైన పరిస్థితులన్నింటినీ తన చేతులారా తనే నాశనంచేసుకోవడంద్వారా, అది బూర్జువా వర్గపు రాజకీయపాలన బూర్జువావర్గపు అస్తిత్వ భద్రతలకు అననుగుణమైనదని ఘోషించగా, మరోవంక, పార్లమెంటు వెలుపల ఉన్న బూర్జువా సముదాయం, అధ్యక్షుని ఎదుట సాగిలపడటంద్వారా, పార్లమెంటుపై దుమ్మెత్తిపొయ్యడంద్వారా, తన సొంత పత్రికలపట్లనే పాశవికంగా ప్రవర్తించడంద్వారా, తనకు చెందిన మాట్లాడే, రచనలుచేసే విభాగాన్ని, తన రాజకీయవేత్తలను, తన సాహిత్యకారులను, తన వక్తలను, తన పత్రికలను అణచివేసేందుకూ, నాశనంచేసేందుకూగాను బోనపార్ట్‌ను ఆహ్వానించింది, తద్వారా అప్పుడిక తన వ్యక్తిగత వ్యవహారాలను పటిష్ఠమూ, నిర్నిరోధమూ అయిన ప్రభుత్వ పరిరక్షణలో పూర్తి విశ్వాసంతో సాగించుకోగలనని ఆశించింది. పాలనకు సంబంధించిన యిబ్బందులనుండి, ప్రమాదాలనుండి ముక్తి పొందేందుకుగాను తన సొంత రాజకీయ పాలననే వదులుకొనేందుకు తను ఆతృతపడుతున్నట్లు అది అసందిగ్ధంగా చాటిచెప్పింది.

మరి, పార్లమెంటు వెలుపలి యీ బూర్జువా విభాగమే, తన సొంత వర్గపాలనకోసమే సాగుతున్న శుద్ధ పార్లమెంటరీ, ప్రచారపోరాటానికి విరుద్ధంగా యింతకు ముందే విద్రోహంచేసి, యీ పోరాట నాయకులకు విద్రోహంచేసిన యీ బూర్జువాలే, యిప్పుడు, ఘటనానంతరం, శ్రామికవర్గం రక్తపాతంతో కూడిన పోరాటానికి పూనుకోలేదనీ, తన తరఫున జీవన్మరణ పోరాటాన్ని సాగించలేదనీ దానిపై దోషారోపణ చేస్తున్నారు! ఏ బూర్జువా వర్గమైతే, అత్యంత సంకుచితము, అత్యంత నీచమైన తన వైయక్తిక స్వార్థ ప్రయోజనాలకు తన సాధారణ వర్గప్రయోజనాలను, అంటే తన రాజకీయ ప్రయోజనాలను అనుక్షణమూ బలిచేస్తూవచ్చిందో, తన ప్రతినిధులను కూడ అదేవిధంగా చెయ్యమని కోరిందో, అదే యిప్పుడు,

శ్రామికవర్గం బూర్జువావర్గంయొక్క ఆదర్శ రాజకీయ ప్రయోజనాలను తన (శ్రామిక వర్గంయొక్క) భౌతిక ప్రయోజనాలకోసం బలిచేసిందని రోదిస్తోంది. అది అపార్థంచేసుకో బడిన ఒక సుందరిలాగ, నిర్ణాయక క్షణంలో సోషలిస్టులచేత పెడదారి పట్టింపబడిన శ్రామికవర్గంచేత పరిత్యజింపబడినదానిలాగ నటిస్తోంది. బూర్జువా ప్రపంచం దాని స్వరంతో తన స్వరం కలుపుతోంది. సహజంగానే, నా ఉద్దేశం యిక్కడ రోసిపోయిన జర్మన్ రాజకీయ వేత్తలనీ, అదేబాపతు అలగామూక అనీ కాదు. ఇంతకుముందే ఉదహరింపబడిన "Economist"ను నేనిక్కడ మరల ప్రస్తావిస్తున్నాను: అది యిటీవల, 1851 నవంబరు 29న, అంటే రాజకీయ కుట్రకు సరిగా నాలుగేనాలుగు రోజులముందు, బోనపార్ట్ను "వ్యవస్థ భద్రత సంరక్షకుడు" అనీ, కాని త్యేర్, బెర్యే ప్రభృతులు "అరాజకవాదులు" అనీ ప్రకటించింది. మరి అదే పత్రిక 1851 డిసెంబరు 27న అప్పుడే, బోనపార్ట్ యీ అరాజకవాదుల నోళ్ళు బందుచేయించాక, "అజ్ఞానులు, అశిక్షితులు, బుద్ధిహీనులు అయిన శ్రామికులు" "మధ్యమ, ఉన్నత శ్రేణులకు చెందిన నైపుణ్యం, జ్ఞానం, క్రమశిక్షణ, మానసిక ప్రభావం, మేధాశక్తులు, నైతిక సత్తాకు" ద్రోహంచేశారంటూ గోల పెడుతోంది. బుద్ధిహీనపు, అజ్ఞానపు, అసభ్యపు మూక బూర్జువా మూకయే తప్ప మరేదీ కాదు.

1851వ సంవత్సరంలో ఫ్రాన్సు కొద్దిపాటి ఒక వ్యాపార సంక్షోభాన్ని ఎదుర్కొన్నద నడం నిజమే. ఫిబ్రవరి అంతంలో, 1850తో పోల్చినప్పుడు ఎగుమతులు పడిపోయాయి; మార్చిలో వ్యాపారం క్షీణించింది, ఫ్యాక్టరీలు మూతబడ్డాయి; ఏప్రిల్‌లో పారిశ్రామిక జిల్లాల స్థితి ఫిబ్రవరి ఘటనల అనంతరం ఉన్నంత ఘోర నిరాశాజనకంగా ఉన్నట్లు కనిపించింది; మేలో వ్యాపారమింకా కోలుకోలేదు; జూన్ 28 నాటికి బ్యాంక్ ఆఫ్ ఫ్రాన్స్ ధనరాశి అధికస్థాయిలో డిపాజిట్ల వృద్ధిని, అదే మేరకు హుండీలపై అడ్వాన్సుల తగ్గు దలను, ఉత్పత్తి స్తంభించిపోయిన సంగతినీ సూచించింది; అక్టోబరు మధ్యనుండి మాత్రమే వ్యాపారంలో క్రమాభివృద్ధి మరల ఆరంభమైంది. ఫ్రెంచి బూర్జువావర్గం యీ వ్యాపార మాంద్యానికి కేవలం రాజకీయ కారణాలు, పార్లమెంటుకీ కార్యనిర్వాహకాధికారానికీ మధ్య సంఘర్షణ, కేవలం తాత్కాలిక రాజ్యరూపంయొక్క అనిశ్చితత్వం, 1852 మే మాసపు రెండవ ఆదివారానికి సంబంధించిన భయావహమైన ఆశంకలే కారణమని భావించింది. పారిస్‌లోనూ, జిల్లాలలోనూ పరిశ్రమకు సంబంధించిన కొన్ని శాఖలపై యీ పరిస్థితుల న్నింటి దుష్ప్రభావం ఉన్నదన్న వాస్తవాన్ని నేను నిరాకరించను. అయితే ఏదేమైనప్పటికీ రాజకీయ పరిస్థితుల యీ ప్రభావం కేవలం స్థానికమైనది, అపరిగణనీయమైనది. వ్యాపా రాభివృద్ధి అక్టోబరు మధ్యప్రాంతంలో — అంటే, సరిగా రాజకీయ పరిస్థితి క్షీణించిన తరుణంలో, రాజకీయ ఆకాశాన్ని కారుమబ్బులు ఆవరించుకున్నప్పుడు, ఎలిసీ రాజభవనంనుండి ఏ క్షణాన అయినా పిడుగుపాటు సంభవించవచ్చునని తలచబడుతున్నప్పుడు — ఆరంభ

మైందన్న వాస్తవంకన్న దీనికి వేరే రుజువేంకావాలి? ఇతర విషయాలకు సంబంధించినంత వరకు, ఎవని "నైపుణ్యం, జ్ఞానం, ఆత్మిక అంతర్దృష్టి, మేధా శక్తులూ" అయితే అతని ముక్కును దాటి ముందుకు వెళ్లవో ఆ ఫ్రెంచి బూర్జువా, తన కళ్లు తెరుచుకొని చూసినట్లయితే, తన వ్యాపారదుర్దశకు కారణమేమిటో లండన్‌లోని పారిశ్రామిక ప్రదర్శన[110] కాలమంతట్లోనూ తన ఎట్టఎదుటనే చూడగలిగి ఉండేవాడు. ఫ్రాన్సులో ఫ్యాక్టరీలు మూతపడగా ఇంగ్లండులో వాణిజ్యదివాళాలు ప్రబలాయి. ఫ్రాన్సులో ఏప్రిల్, మే మాసాల్లో పారిశ్రామిక రంగంలో భీతాహం శిఖరస్థాయిని అందుకోగా, ఇంగ్లండులో ఏప్రిల్, మే మాసాల్లో వాణిజ్య రంగంలో భీతాహం శిఖరస్థాయిని అందుకుంది. ఫ్రెంచి ఉన్నిపరిశ్రమలో మాంద్యం వచ్చినట్లుగానే ఇంగ్లండు ఉన్ని పరిశ్రమలో మాంద్యం వచ్చింది. ఫ్రాన్సు సిల్కు ఉత్పత్తి దెబ్బతిన్నట్లుగానే ఇంగ్లండు సిల్కు ఉత్పత్తి దెబ్బ తింది. ఇంగ్లండులోని నూలుమిల్లులు పనిచేస్తూనే ఉన్న మాట నిజమే అయినప్పటికీ, 1849, 1850లలో వచ్చినంతగా వాటి కిప్పుడు అలాంటి లాభాలు రావడం లేదు. తేడా అల్లా ఏమిటంటే, ఫ్రాన్సులో సంక్షోభం పారిశ్రామిక సంబంధమైనది కాగా, ఇంగ్లండులో వాణిజ్యసంబంధమైనది; ఇక్కడ ఫ్రాన్సులో ఫ్యాక్టరీలు నిష్క్రియగా ఉండిపోగా, అక్కడ ఇంగ్లండులో, అంతకు ముందరి సంవత్సరాలతో పోలిస్తే తక్కువ అనుకూల పరిస్థితుల్లోనే అయినా, అవి తమ కార్యకలాపాలను విస్తృతంచేశాయి; ఫ్రాన్సులో అన్నిటికన్న ఎక్కువ దెబ్బ ఎగుమతులకు తగులగా, ఇంగ్లండులో అన్నిటికన్న ఎక్కువ దెబ్బ దిగుమతులకు తగిలింది. రెండింటికీ సామాన్యమైన కారణం, సహజంగానే, ఫ్రాన్సు రాజకీయ దిగ్మండల పరిమితుల్లో లభ్యంకాదనడం స్పష్టం. 1849, 1850 సంవత్సరాలు అత్యాధిక పాదార్థిక సౌభాగ్యం కలిగి, అత్యుత్పత్తి జరిగిన సంవత్సరాలు, 1851లో మాత్రమే ఆ చిన్నెల మరల అగుపించాయి. ఈ సంవత్సరారంభంలో జరగవలసిన పారిశ్రామిక ప్రదర్శనదృష్ట్యా యీ అత్యుత్పత్తికి మరింత ప్రత్యేకమైన ఊపు లభించింది. దీనికితోడు యీ క్రింది ప్రత్యేక పరిస్థితులున్నాయి: మొదటిది, 1850, 1851 సంవత్సరాల్లో పత్తిపంట పాక్షికంగా దెబ్బతినడం, తిరిగి తర్వాత అనుకున్నదానికన్న ఎక్కువ స్థాయిలో పంట లభించే అవకాశం రూఢికావడం; మొదట పత్తి ధరలు పెరగడం, తర్వాత ఆకస్మికంగా పడిపోవడం, అర్థాత్తూ పత్తిధరల్లో ఎగుడుదిగుళ్లు. ముడిసిల్కు పంట, కనీసం ఫ్రాన్సులో, సగటు దిగుబడికన్న పడిపోయింది. చివరి సంగతి, 1848నుండి ఉన్ని కార్ఖానాల ఉత్పత్తి ఎంతగా విస్తరించిందంటే, ఉన్ని ఉత్పత్తి ఆ వేగాన్ని అందుకోలేకపోయింది, దానితో ముడిఉన్ని ధర ఉన్ని దుస్తుల ధరలతో పోల్చినప్పుడు అంతనా పొంతనా లేకుండా పెరిగిపోయింది. ఈవిధంగా, ప్రపంచ మార్కెట్టుకి సంబంధించిన మూడు పరిశ్రమల ముడిసరుకులలో వ్యాపారమాంద్యానికి సంబంధించిన మూడు ఆధారాలు మనకి లభిస్తున్నాయి. ఈ ప్రత్యేక పరిస్థితుల మాట అటుంచి, 1851లో ద్యోతకమైన సంక్షోభం, అత్యుత్పత్తి, అత్యధిక చట్టావ్యాపారమూ పారిశ్రామిక

వలయాన్ని చుట్టే క్రమంలో విధిగా తీసుకునే ఒక విరామం తప్ప వేరేమీ కాదు. త్వరలోనే అవి యీ వలయానికి సంబంధించిన తుది దశను గడిచేందుకుగాను తమ సమస్త శక్తినీ కూడదీసుకొని అత్యధిక వేగంతో ముందుకు సాగుతాయి, తుది దశను దాటి తిరిగి అవి తమ ఆరంభబిందువు దగ్గరకు, అంటే సార్వత్రిక వాణిజ్య సంక్షోభం దగ్గరకు, చేరుకుంటాయి. వర్తక చరిత్రలోని అటువంటి విరామాల్లో ఇంగ్లండులో వాణిజ్య దివాళాలు సంభవిస్తూండగా, అదే సమయంలో ఫ్రాన్సులో పరిశ్రమలే మూలపడ్డాయి, అన్ని మార్కెట్లలోనూ, అప్పుడే దుర్భరంగా తయారవుతున్న ఇంగ్లీషువారి పోటీ కారణంగా పాక్షికంగా తిరోగమించవలసిరావడం యిందుకొక కారణం కాగా, వ్యాపారమాంద్యం సంభవించినప్పుడల్లా విలాస పరిశ్రమగా ప్రత్యేకించి దాడిని ఎదుర్కోవలసిరావడం మరొక కారణం. ఆవిధంగా, సార్వత్రిక సంక్షోభానికి తోడు ఫ్రాన్సు తన సొంత జాతీయ వాణిజ్య సంక్షోభాలను సైతం గడవాల్సివచ్చింది, ఐనప్పటికీ అవి స్థానిక ఫ్రెంచి ప్రభావాలచేత కన్న ఎక్కువగా ప్రపంచ మార్కెట్టుయొక్క సాధారణ స్థితిచేత నిర్ధారితమూ నిర్దిష్టమూ చెయ్యబడుతున్నాయి. ఇక్కడ ఇంగ్లీషు బూర్జువాయొక్క అవగాహనను ఫ్రెంచి బూర్జువాయొక్క దురభిప్రాయంతో పోల్చి చూడటం అనాసక్తికరంగా ఉండబోదు. 1851 వార్షిక వ్యాపార నివేదికలో లివర్‌పూల్‌కి చెందిన మిక్కిలి పెద్ద వ్యాపారసంస్థల్లో ఒకటి యిలా పేర్కొంది:

"సంవత్సరారంభ కాలంలో పెట్టుకున్న ఆశలు చివరకు పూర్తిగా భగ్నమైన అరుదైన సంవత్సరాల్లో గత సంవత్సరం ఒకటి. దాదాపు ఏకగ్రీవంగా ఆశింపబడిన పెద్ద సౌభాగ్యానికి బదులు యీ సంవత్సరం, గత పావుశతాబ్ద కాలంలో ఏ సంవత్సరమూ లేనంత నిష్ప్రచురంగా పరిణమించింది — అయితే యిది వ్యాపార వర్గాలకే గాని, పారిశ్రామిక వర్గాలకు వర్తించదు. అయినా కూడా, సంవత్సరారంభంలో యిందుకు వ్యతిక్రమంగా జరగవచ్చునని తలచేందుకు విశేషాధారాలు రూఢంగా వున్నాయి — సరకుల నిల్వలు పరిమితంగా ఉన్నాయి, డబ్బు పుష్కలంగా ఉండి, ఆహార పదార్థాలు చౌకగా లభ్యమవుతున్నాయి, పుష్కలమైన పంటకు నిశ్చితావకాశాలున్నాయి, యూరప్ ఖండంలో శాంతి నిరంతరాయంగా కొనసాగుతోంది, దేశం లోపల రాజకీయ కల్లోలాలుగాని ఆర్థిక ఇబ్బందులు గాని లేవు. నిజానికి వాణిజ్యం యింత కన్న ఎక్కువ విశృంఖలంగా మరెన్నడూ లేదు.... మరి అలాంటప్పుడు, యీ వినాశకర పరిణామానికి మూలకారణమేమై యుంటుంది? దీనికి మూలకారణం దిగుమతుల్లోను, ఎగుమతుల్లోను మితిమీరిన వ్యాపారానిదే అయ్యుంటుందని మా విశ్వాసం. మన వర్తకులు

తమ వ్యాపార స్వేచ్ఛపైన మరింత తీవ్రమైన పరిమితులను విధించుకోకపోయినట్లయితే, త్రైవార్షిక సంక్షోభం తప్ప మనలను అదుపులో ఉంచగలిగినదేదీ ఉండదు."*

ఇప్పుడిక ఫ్రెంచి బూర్జువాని – వాణిజ్యరంధితో ఉన్మత్తమై యెవని మనస్సు వాణిజ్య సంక్షోభమనే వేదనా సుడిగుండంలో పడి కొట్టుమిట్టాడిందో, రాజకీయ కుట్రలకు, సార్వజనిక ఓటింగు హక్కు పునరుద్ధరణకు సంబంధించిన పుకార్లు, పార్లమెంటుకీ కార్యనిర్వాహకాధికారానికీ మధ్య సంఘర్షణ, ఆర్లియనిస్టులకీ లెజిటిమిస్టులకీ మధ్య కలహాలు, ఫ్రాన్సు దక్షిణ భాగంలో కమ్యూనిస్టు కుట్రలు, న్యేవ్, షేర్ జిల్లాలలో కుహనా రైతుల తిరుగుబాట్లు, అధ్యక్ష పదవికి పోటీ చెయ్యబోయే వివిధ అభ్యర్థుల ప్రకటనలు అరచేతిలో పైకుంఠం చూపుతామంటూ పత్రికలు చేసే చౌకబారు వినాదాలు, ఆయుధబలంతో రాజ్యాంగచట్టాన్నీ, సార్వజనిక ఓటింగు హక్కునూ పరిరక్షిస్తామన్న రిపబ్లికన్ల బెదరింపులు, 1852 మే మాసంలో రెండవ ఆదివారంనాడు ప్రపంచ ప్రళయం సంభవిస్తుందని ప్రకటించిన in partibus[59] ప్రవాస నాయక వీరుల ధర్మోపదేశాలు – వీటన్నింటితో ఎవని బుర్ర గిర్రున తిరిగి, బుద్ధి పనిచెయ్యడం మానేసిందో, అటువంటి బూర్జువాని గురించి స్వయంగా మీరే ఊహించుకోండి. సంలీనం, రాజ్యాంగ సవరణ, పొడిగింపు, రాజ్యాంగచట్టం, కుట్ర, పొత్తు, ప్రవాసం, రాజ్యాధికారాపహరణ, విప్లవం – వర్ణనాతీతమైన, చెవులను బద్దలుకొట్టే ఈ గందరగోళం మధ్య ఆ బూర్జువా పిచ్చెత్తి, తన పార్లమెంటరీ రిపబ్లిక్‌ను ఉద్దేశించి: "అంతం లేని భయాతిరేకానికి బదులు భయాతిరేకంతో కూడిన అంతమే మేలు!" అంటూ ఎందుకు బుసలు కొడతాడో అప్పుడు మీకే బోధపడుతుంది.

బోనపార్ట్ ఈ అరుపును అర్థంచేసుకున్నాడు. అతని అవగాహనాశక్తి రుణదాతల పెరుగుతున్న అల్లరి కారణంగా మరింత సునిశితమైంది. రుణ పరిష్కార దినాన్ని, అంటే 1852 మే నెల రెండవ ఆదివారాన్ని,[57] దగ్గరకు తెచ్చే ప్రతిరాత్రీ నక్షత్రగతి తమ ఇహలోక రుణ పత్రాలకు అసమ్మతి తెల్పుతున్నట్టుగా రుణదాతలకు తోచింది. వారు సిసలైన జ్యోతిష్కులయారు. రాజ్యాంగ చట్టరీత్యా తన పదవీకాలం పొడిగింపు విషయంలో బోనపార్ట్ పెట్టుకున్న ఆశలపై జాతీయ సభ నీళ్లు చల్లింది; ప్రిన్స్ జొయిన్‌విల్ అభ్యర్థిత్వం అతడిక ఎక్కువ వూగిసలాడకుండా చేసింది.

తనింకా జరగడానికి చాలా ముందే తన ఛాయను బరపిన సంఘటన ఏదైనా వుందంటే, అది బోనపార్ట్ రాజకీయ కుట్రయే. 1849 జనవరి 29 నాడే, అంటే తను ఎన్నుకోబడిన

* "The Economist," 1852, జనవరి 10వ తేదీ సంచిక, పేజీలు 29–30. – సం.

తర్వాత ఒక నెలైనా గడిచీగడవకముందే, అతను షంగర్న్యేకి దాన్ని గురించిన ప్రతిపాదన చేశాడు. 1849 వేసవిలో అతని సొంత ప్రధాన మంత్రి అయిన ఒడిలోన్ బర్రో రాజకీయ కుట్ర విధానాన్ని గోప్యంగా ప్రస్తావించాడు, 1850 శీతకాలంలో త్యేర్ బహిరంగంగానే యీ ప్రస్తావన తెచ్చాడు. 1851 మేలో, రాజకీయ కుట్రకు షంగర్న్యేను అనుకూలంగా తిప్పేందుకు పెర్సిన్యీ మరోమారు ప్రయత్నించాడు. "Messager de l'Assemblée"[111] యీ సంప్రతింపులకు సంబంధించిన కథనాన్ని ప్రచురించింది. పార్లమెంటులో ఎప్పుడు తుపాను చెలరేగినా, బోనపార్టిస్టు పత్రికలు రాజకీయకుట్ర బెదరింపును చేస్తూనేవున్నాయి, సంక్షోభం దగ్గరపడినకొద్దీ వాటి స్వరం పెరుగుతూవుండేది. బోనపార్ట్ "ఘరానా జేబు దొంగల గుంపు"కి చెందిన పురుషులూ స్త్రీలతో ప్రతిరాత్రీ తన యింటివద్ద ఏర్పాటుచేస్తూవుండిన త్రాగుబోతు తాండవాలలో, అర్ధరాత్రి కాగానే, గ్లాసుల తరబడి గ్లాసుల పానీయాలు సేవించినమీదట నోళ్లకు కళ్లాలు తొలగిపోయేవి, ఊహా శక్తి ఉద్దీప్తమయ్యేది, దానితో ఆ మరుసటిరోజే రాజకీయకుట్రకు ముహూర్తం స్థిరపరుపబడుతూవుండేది. ఒరలనుండి కత్తులు దుయ్యబడేవి, గ్లాసులు ఒకదాని కొకటి ఖంగుమని తాకింపబడేవి, జాతీయ సభ సభ్యులు కిటికీలనుండి బయటకు నెట్టివెయ్యబడుతూండేవారు, రాజరికచిహ్నమైన ఉత్తరీయం బోనపార్ట్ భుజాలపై అలంకరింపబడేది, మరుసటిరోజు ఉదయానికల్లా ఆవహించిన భూతం మరల వదిలిపోయేది, ఆశ్చర్యచకితమైన పారిస్‌కు, మౌనం పాటించడం చేతకాని కన్యలద్వారా, అమాయకులైన దర్బారీయుల ద్వారా, తనకు మరోమారు తప్పిపోయిన ప్రమాదాన్నిగురించి తెలియవచ్చేది. సెప్టెంబరు, అక్టోబరు మాసాల్లో రాజకీయ కుట్రకి సంబంధించిన పుకార్లు, ఒకదాని వెంట ఒకటి వేగంగా వ్యాపించాయి. డగెర్రియో ఛాయాచిత్రానికి రంగులు అమరిన మాదిరిగా కుట్ర ఛాయకు రంగులు అమరసాగాయి. యూరపియన్ దినపత్రికలయొక్క సెప్టెంబరు, అక్టోబరు మాసాల సంచికలను తిరగేస్తే అక్షరాలా యీ క్రింద ఉదహరింప బడిన వార్తలవంటివి మీకు కనిపిస్తాయి: "రాజకీయ కుట్రను గురించిన పుకార్లతో పారిస్ నిండిపోయింది. రాత్రికి రాత్రి రాజధానినిండా సైనికదళాలు నింపివెయ్యబడతాయి, మరుసటి ఉదయమే జాతీయ సభను రద్దుచేస్తూ, సీన్ జిల్లాను ముట్టడి స్థితిలో ఉన్నట్లు ప్రకటిస్తూ, సార్వజనిక ఓటింగు హక్కును పునరుద్ధరిస్తూ, ఉత్తరువులు జారీచెయ్యబడతాయి. ప్రజలకు విజ్ఞప్తి చేస్తూ చట్టవిరుద్ధమైన యీ ఉత్తరువులను అమలుజరిపే మంత్రులకోసం బోనపార్ట్ గాలిస్తున్నట్లు తెలియవస్తోంది." ఈ వార్తలను జేరవేసే లేఖలెప్పుడూ "వాయిదా వెయ్యబడింది" అన్న భవిష్యదాపత్సూచకమైన మాటలతో ముగింపబడుతూండేవి. రాజకీయ కుట్రను గురించిన ఆలోచన ఆదినుంచీ కూడా బోనపార్ట్‌లో గాఢంగా పాతుకొనివుంది. ఈ ఆలోచనతోనే అతను తిరిగి ఫ్రెంచి గడ్డపై అడుగుపెట్టాడు. ఈ ఆలోచన అతని మనస్సును ఎంత గాఢంగా ఆవహించిందంటే, యీ విషయం పొరపాటున అతని నోటినుంచి

తరచుగా బయటపడుతూవచ్చింది. దీనితోబాటే అతను ఎంతటి బలహీనుడంటే, అంత వరుసగానూ ఆ ఆలోచనను అతను వదులుకొంటూవచ్చాడు. రాజకీయ కుట్రకి సంబంధించిన ఛాయ ఒక పీడకలలాగ పారిస్ వాసులకు ఎంతగా పరిచితమై పోయిందంటే, చివరకు అది సాకారరూపంలో ఎదురయ్యేసరికి దాన్ని వారు నమ్మేందుకు సిద్ధపడలేకపోయారు. అందుకని, రాజకీయ కుట్ర విజయవంతం అవడానికి దోహదంచేసినది డిసెంబరు 10 సంఘపు సర్దారు మౌనమూ కాదు, జాతీయ సభ ఏమరుపాటుగా ఉండటమూ కాదు. బోనపార్టు అవివేకంతో నిమిత్తం లేకుండా, జాతీయ సభయొక్క పూర్వజ్ఞానంతో, అది విజయవంతమైంది. అది అంతకుపూర్వపు తన ఘటనా క్రమంయొక్క అవసర, అనివార్య పరిణామం.

అక్టోబరు 10న బోనపార్ట్ సార్వజనిక ఓటింగు హక్కును పునరుద్ధరించాలన్న తన నిర్ణయాన్ని తన మంత్రులకు తెలియజేశాడు; 16వ తేదీన వారు తమ రాజీనామాలను అతనికి అందజేశారు; అక్టోబరు 26న పారిస్‌కి తొరిన్యీ మంత్రివర్గపు ఏర్పాటును గురించిన వార్త తెలిసింది. దీనితోబాటే పోలీసు ప్రిఫెక్టు కర్లేృ తొలగింపబడి, అతని స్థానంలో మొపా నియుక్తుడయ్యాడు. ప్రథమ సైనిక డివిజను అధిపతి మన్యాన్, అత్యంత విశ్వాసపాత్రమైన రెజిమెంట్లను రాజధానిలో కేంద్రీకరించాడు. నవంబరు 4న, జాతీయ సభ తన సమావేశాన్ని తిరిగి ప్రారంభించింది. అది చేసినదల్లా, తను ఏ ఘటనాక్రమం గుండా గడిచిందో, దాన్ని సంక్షిప్త సారాంశరూపంలో వల్లించుకొని, తన మరణానంతరమే తనకు ఖనన సంస్కారం జరిగిందని నిరూపించడం మాత్రమే.

కార్యనిర్వాహకాధికారంతో జరిగిన సంఘర్షణలో తన చేతులనుండి జాతీయ సభ కోల్పోయిన మొదటి స్థావరం మంత్రివర్గం. కేవలం ఒక ఛాయామంత్రివర్గం మాత్రమే అయిన తొరిన్యీ మంత్రివర్గాన్ని పూర్తి హోదాలో స్వీకరించడంద్వారా అది యీ నష్టాన్ని ఆమోదించాల్సి వచ్చింది. జిరో కొత్త మంత్రుల పేర శాశ్వత కమిషను ముందు హాజరైనప్పుడు కమిషన్ నవ్వులతో అతడికి స్వాగతంచెప్పింది. సార్వజనిక ఓటింగు హక్కు పునరుద్ధరణవంటి పటిష్ఠమైన చర్యలకు ఎంత బలహీనమైన మంత్రివర్గం! అయితే దాని లక్ష్యమే అది, పార్లమెంటు లోపల ఏమీ జరగనివ్వరాదు, పార్లమెంటుకి వ్యతిరేకంగా అన్నీ జరగనివ్వాలి.

జాతీయ సభ తిరిగి సమావేశమైన మొట్టమొదటి రోజుననే బోనపార్ట్‌నుండి సార్వజనిక ఓటింగు హక్కు పునరుద్ధరణనూ, 1850 మే 31 నాటి చట్టపు రద్దునూ డిమాండు చేసే ఒక సందేశం అందింది. అదే రోజున అతని మంత్రులు యీ మేరకు ఒక ఉత్తరువును ప్రవేశ పెట్టారు. జాతీయ సభ మంత్రివర్గపు ఉత్తరువుకు సంబంధించిన సత్వరావశ్యకతను నిరాకరించి, చివరకు నవంబరు 13న ఆ చట్టాన్నే 348–355 ఓట్ల తేడాతో తిరస్కరించింది. ఈ విధంగా అది మరోసారి ప్రజలనుండి లభించిన ఆదేశపత్రాలను చింపిపారేసింది; అది మరోసారి తనను తాను స్వేచ్ఛాయుతంగా ఎన్నుకోబడిన ప్రజా ప్రతినిధుల సభ స్థాయినుండి

ఒక వర్గంయొక్క బలాత్కార అధికారాక్రమణపూర్వకమైన పార్లమెంటుగా మార్చుకున్నట్లు రూఢిచేసింది; పార్లమెంటు రూపంలోవున్న శిరస్సును జాతి రూపంలోవున్న శరీరంతో కలిపే కండరాలను తన స్వంత చేతులతో కోసేసినట్లు అది మరోసారి అంగీకరించింది.

కార్యనిర్వాహకాధికారం సార్వజనిక ఓటింగు హక్కును పునరుద్ధరించాలన్న తన ప్రతిపాదనద్వారా జాతీయ సభ తరపున ప్రజలకు విజ్ఞప్తి చెయ్యగా, శాసననిర్ణయాధికారం తన క్వెస్టర్స్ బిల్లుద్వారా ప్రజల తరపున సైన్యానికి విజ్ఞప్తిచేసింది. క్వెస్టర్స్ బిల్లు ఉద్దేశం సైన్యాన్ని నేరుగా పిలిపించేందుకూ, పార్లమెంటరీ సైన్యాన్ని ఏర్పాటుచేసేందుకూ పార్లమెంటుకుగల అధికారాన్ని ఖాయంచెయ్యడం. ఈ విధంగా అది యీ బిల్లుద్వారా తనకూ ప్రజలకూ మధ్య, తనకూ బోనపార్ట్‌కూ మధ్య ఒక మధ్యవర్తి స్థానాన్ని సైన్యానికి కల్పించడంద్వారా సైన్యాన్ని నిర్ణాయక రాజ్యశక్తిగా గుర్తించింది, మరో వైపున, అది యీ సైన్య శక్తిపై పెత్తనంచేసే హక్కును దీర్ఘకాలంగా వదులుకున్నట్లు రూఢిపరచాల్సివచ్చింది. సైన్యాన్ని వెంటనే పిలిచేందుకు బదులు సైన్యాన్ని పిలిచేందుకు తనకుగల హక్కును గురించి చర్చించడంద్వారా అది తన అధికారాలను గురించి తనే సంశయాలను ప్రకటించుకుంది. క్వెస్టర్స్ బిల్లును తిరస్కరించడంద్వారా, అది తన అశక్తతను వెల్లడించుకుంది. ప్రతి పాదకులకు అవసరమైన మెజారిటీకి 108 ఓట్లు తక్కువైన కారణంగా ఈ బిల్లు వీగిపోయింది. మహీధరం పార్టీ యీ సమస్యను యిలా పరిష్కరించింది. బురిడన్‌యొక్క గాడిద పడిన సంధిగ్దస్థితిలో అది పడింది, అయితే తేడా అల్లా ఏమిటంటే, బురిడన్ గాడిదకు వచ్చిన సమస్య తనకు రెండు పక్కలా వున్న గడ్డిమోపుల్లో ఏది మరింత ఆకర్షణీయమైనదో నిర్ణయించుకోవడమే కాగా, రెండు దెబ్బల పరంపరలకు మధ్య నిలిచిన మహీధరం పార్టీ సమస్య ఏ ప్రక్కనుంచి వచ్చే దెబ్బలు మరింత గట్టిగా ఉంటాయో నిర్ణయించుకోవడం. ఒకవంక, షంగర్న్యే అంటే భయం; మరో వంక బోనపార్ట్ అంటే భయం. ఇది ఏ ఉదాత్త నాయకునికీ యోగ్యమైన స్థితి కాదన్న విషయాన్ని ఆమోదించాల్సివుంటుంది.

నవంబరు 18న, తనే ప్రతిపాదించిన మునిసిపల్ ఎన్నికల చట్టానికి పార్టీ ఆఫ్ ఆర్డర్ ఒక సవరణను జేర్చింది, అందులో అది, మునిసిపల్ ఓటర్లకు మూడేళ్ల నివాసార్హతకు బదులు ఏడాది నివాసార్హత ఉంటే చాలునని పేర్కొంది. ఆ సవరణ ఒక్క ఓటు తేడాతో వీగిపోయింది, కాని ఆ ఒక్క ఓటూ ఒక పొరపాటని వెంటనే నిరూపితమైంది. తన శత్రుపక్షాలుగా చీలిపోవడం ద్వారా పార్టీ ఆఫ్ ఆర్డర్ పార్లమెంటులో స్వతంత్రంగా తనకున్న మెజారిటీని ఎన్నడో కోల్పోయింది. ఇప్పుడిక అది తనకు పార్లమెంటులో మెజారిటీ ఎంతమాత్రమూ లేదని నిరూపించుకుంది. జాతీయ సభ కార్యనిర్వహణ సామర్థ్యాన్ని కోల్పోయింది. పరమాణు రూపంలో వున్న విభాగాలను కలిపివుంచగల శక్తి ఏదీ యిప్పుడిక లేకుండాపోయింది; అది తన తుది శ్వాసను విడిచింది; అది మరణించింది.

చివరకు, మహావిపత్తుకి కొద్దిరోజుల ముందు, పార్లమెంటు వెలుపలి బూర్జువా సముదాయం పార్లమెంటు లోపలి బూర్జువాలతో తనకు గల వైముఖ్యాన్ని మరోమారు గంభీర రూపంలో రూఢిపరచింది. పార్లమెంటు తానొక వీర నాయకుడు కావాలన్న తపనతో పార్లమెంటరీ బుద్ధిమాంద్యం అనబడే చికిత్సలేని జాడ్యానికి మిగిలినవారందరికన్న ఎక్కువగా గురైన త్యేర్, పార్లమెంటు మరణానంతరం, ప్రభుత్వ సలహా సమితితో కలిసి అధ్యక్షుడిని రాజ్యాంగచట్ట పరిధిలో గట్టిగా బంధించివుంచేందుకు వీలుకల్పించే బాధ్యతా చట్టాన్ని — ఒక కొత్త పార్లమెంటరీ కుతంత్రాన్ని — తయారుచేశాడు. బోనపార్ట్ సెప్టెంబరు 15న, పారిస్‌లో కొత్త మార్కెట్ భవనాలకు శంకుస్థాపన చేసేసందర్భంగా ఏ విధంగా అయితే, మరో మసనియేలో మాదిరిగా, మార్కెట్ మహిళలను, అంటే మత్స్యకారిణులను — వాస్తవిక శక్తిలో ఒక మత్స్యకారిణి పదిహేడుమంది బుర్గ్రాఫ్‌లకన్న ఎక్కువ అన్నది నిస్సందేహమైన విషయం — మంత్రముగ్ధులను చేశాడో, క్వెస్టర్స్ బిల్లు ప్రవేశపెట్టబడిన తర్వాత ఎలిసీ రాజభవనంలో అహూతులైన తన లెఫ్టినెంట్ల మనస్సులను అతను ఏ విధంగా సమ్మోహితంచేశాడో, యిప్పుడు మరల నవంబరు 25న, సర్కస్ మైదానంలో, లండన్ పారిశ్రామిక ప్రదర్శనలో గెలుచుకున్న బహుమతి పతకాలను తన చేతులనుండి అందుకోవడానికి సమావేశమైన పారిశ్రామిక బూర్జువాల మనస్సులను అదేవిధంగా సమ్మోహితంచేశాడు. "Journal des Débats"లో ప్రచురింపబడిన, ఆ సందర్భంలో అతను చేసిన ప్రసంగంలోని ప్రధానాంశాన్ని నేనీక్రింద ఉదహరిస్తున్నాను:

> "ఆశించి వుండని యింతటి ఘనవిజయాలు లభించిన తర్వాత, ఫ్రెంచి రిపబ్లిక్ ఒకవంక వాగాడంబరులచేత మరోవంక రాజరికవాదుల చిత్తభ్రమలచేత నిరంతరాయంగా కలవరపరచబడక, శాంతిపూర్వకంగా తన వాస్తవ ప్రయోజనాలను అనుసరించగలిగి, తన సంస్థలను పునస్సంఘటితం చేసుకోగలిగినట్లయితే అదెంత గొప్పదైయుండేదన్న సంగతిని నేనీ సందర్భంగా పునరుద్ఘాటించడం అసమంజసం కాదనుకుంటాను. (సభాస్థలిలోని నలుమూలల్నుంచి చెవులు హోరెత్తిపోయేలా హర్షధ్వానాల పరంపర.) రాజరికవాదుల చిత్తభ్రమలు సమస్త ప్రగతికీ, ముఖ్యమైన అన్ని పారిశ్రామిక శాఖలకూ అడ్డంకులు కలిగిస్తున్నాయి. ప్రగతికి బదులు ఎటుచూసినా సంఘర్షణతప్ప మరేమీ కానరావడంలేదు. ఎవరైతే వెనక రాజరిక అధికారాన్నీ, విశేషాధికారాలనూ అత్యధికోత్సాహంతో సమర్థించారో వారే యిప్పుడు, సార్వజనిక ఓటింగు హక్కుద్వారా అవతరించిన అధికారాన్ని బలహీనపరచేందుకు మాత్రమే, కన్వెన్షన్ పరిరక్షణకు పూనుకొంటున్నారు. (బిగ్గరగా పదేపదే హర్షధ్వానాలు.) ఎవరైతే విప్లవం కార

ణంగా అందరికన్న ఎక్కువ కష్టనష్టాలు అనుభవించారో, ఎవరైతే దానిపట్ల అందరికన్న ఎక్కువగా విలపించారో, వారే ఒక కొత్త విప్లవాన్ని రెచ్చగొట్ట డానికి, అందునా కేవలం జాతి అభీష్టాన్ని శృంఖలాబద్ధం చెయ్యడానికి పూనుకోవడాన్ని మనం చూస్తున్నాం.... నేను మీకు భవిష్యత్తులో ప్రశాంతిని వాగ్దానంచేస్తున్నాను," వగైరా, వగైరా. ("శభాష్! శభాష్!" నాదాలహోరు.)

ఈ విధంగా పారిశ్రామిక బూర్జువావర్గం, డిసెంబరు 2 రాజకీయ కుట్రపట్ల, పార్లమెంటు నిర్మూలనపట్ల, సాక్షాత్తూ తన సొంతపాలన పతనంపట్ల, బోనపార్ట్ ఏకాధిపత్యంపట్ల దాస్యప్రవృత్తితో కూడిన శభాష్ నాదాలతో తన హర్షాన్ని ప్రకటించింది. నవంబరు 25నాటి శభాష్ నాదాలకు డిసెంబరు 4న ఫిరంగిగర్జల రూపంలో జవాబు లభించింది, మరో విశేషమేమిటంటే, అందరికన్న అధికంగా శభాష్ నాదాలు చేసిన శ్రీమాన్ సల్లంద్రూజ్ యింటిపైననే అత్యధిక సంఖ్యలో ఫిరంగిగుళ్లు గుప్పింపబడ్డాయి.

క్రామ్‌వెల్, దీర్ఘకాల పార్లమెంటును[112] రద్దు చేసినప్పుడు, దాని మధ్యకు తను ఒంటరిగా వెళ్లి, తను నిర్ణయించిన కాలవ్యవధిని ఒక్క క్షణం కూడా అది కొనసాగకుండా చూసేందుకుగాను తన జేబుగడియారాన్ని బయటకుతీసిపట్టుకొని నిలబడ్డాడు, పార్లమెంటు సభ్యుల్లో ప్రతి ఒక్కడినీ హుషారుగా పరిహాసపూర్వకంగా ఎగతాళిచేస్తూ బయటకు పంపించాడు. క్రామ్‌వెల్ యొక్క అల్పావతారమైన నెపోలియన్, కనీసం బ్రూమేర్ మాసం 18వ తేదీనాడు శాసనసభకు వెళ్లి అందులో దాని మరణశిక్షను — తడబాటుస్వరంలోనే అయినా — పఠించాడు. కాని తద్భిన్నంగా, క్రామ్‌వెల్ కలిగియున్న, లేక నెపోలియన్ కలిగియున్నదానికి చాలా భిన్నమైన కార్యనిర్వాహకాధికారాన్ని కలిగియున్న రెండవ బోనపార్ట్, తన ఆదర్శ నమూనాను ప్రపంచ చరిత్రలోనుంచి కాక, డిసెంబరు 10 సంఘపు చరిత్రలోనుంచి, క్రిమినల్ కోర్టుల చరిత్రలోనుంచీ వెతుక్కున్నాడు. అతను బ్యాంక్ ఆఫ్ ఫ్రాన్సునుండి రెండున్నర కోట్ల ఫ్రాంకులను లూటీచేశాడు, ఓ పది లక్షల ఫ్రాంకులిచ్చి జనరల్ మన్యాన్‌ను కొన్నాడు, ప్రతి ఒక సైనికునికీ పదిహేనేసి ఫ్రాంకుల చొప్పున పంచి, సారాయి తాగించి వారిని కొనేశాడు, తన అనుచరుల మందీమార్బలంతో రహస్యంగా దొంగలాగ రాత్రిపూట వచ్చి, పార్లమెంటరీ నాయకుల్లో మిక్కిలి ప్రమాదకారులైనవారి యిళ్లపై దాడిచేశాడు, కవేన్యాక్, లమోరిస్యేర్, లెఫ్లో, షంగర్న్యే, షర్రాస్, త్యేర్, బాజ్ ప్రభృతులను వారి పడకలమీదనుంచి బయటకు లాగించాడు, పారిస్‌లోని ముఖ్యమైన చౌకులనూ, పార్లమెంటు భవనాన్నీ ఆక్రమించుకొని, వాటిలో సైన్యాన్ని నిలబెట్టాడు, జాతీయ సభనూ ప్రభుత్వ సలహా సమితినీ రద్దుచేస్తున్నట్లూ, సార్వజనిక ఓటింగు హక్కును పునరుద్ధరిస్తున్నట్లూ, సేన్ జిల్లాను ముట్టడి స్థితిలో ఉంచుతున్నట్లూ ప్రకటించే పెద్ద పెద్ద పోస్టర్లను తెల్లారే

పరికల్లా గోడలన్నింటిపైనా అంటింపజేశాడు. ఇదేవిధంగా, కొద్ది రోజుల తర్వాత అతను "Moniteur" పత్రికలో, పలుకుబడి కలిగిన పార్లమెంటు సభ్యులు తన సమక్షంలో ఒక బృందంగా కూడి ప్రభుత్వ సలహా సమితిని ఏర్పాటుచేశారని పేర్కొనే ఒక కూటపత్రాన్ని ప్రచురింపజేశాడు.

ప్రధానంగా లెజిటిమిస్టులతోను, ఆర్లియనిస్టులతోను కూడిన శేషపార్లమెంటు పదవ మండలానికి చెందిన మేయర్ భవనంలో సమావేశమై, "రిపబ్లిక్ వర్ధిల్లాలి!" అనే నినాద పరంపర మధ్య బోనపార్ట్‌ను పదవీచ్యుతునిచేసే తీర్మానాన్ని ఆమోదించింది, భవనం ముందు గుమికూడి కళ్ళు విప్పార్చుకొని నోళ్ళు వెళ్ళబెట్టుకొని వింటున్న గుంపులకు ప్రసంగాల ద్వారా పిలుపులిచ్చింది, కాని అన్నీ వ్యర్థమే అయ్యాయి. కట్టకడపట, మేటి గురికాండ్రైన నిపుణులైన ఆఫ్రికన్ సైనికులు వారిని అరెస్టుచేసి, మొదట ఒర్సే బ్యారక్సులో నిర్బంధించి, తర్వాత జైలుశకటాల్లో కుక్కి మజాస్, అమే, విన్సెన్ జైలుకొట్లకు తీసుకుపోయి నిర్బంధించారు. పార్టీ ఆఫ్ ఆర్డర్, శాసన సభా, ఫిబ్రవరి విప్లవమూ యీవిధంగా ముగిశాయి.

ఈ కథను ముగించేముందు ఫిబ్రవరి విప్లవచరిత్రను సంక్షిప్తంగా ఒకమారు సింహావలోకనం చేసుకుందాం:

I. ప్రథమ దశ. 1848 ఫిబ్రవరి 24నుండి మే 4వరకు. ఫిబ్రవరి దశ. నాంది. సర్వమానవ సోదరత్వ దగా.

II. ద్వితీయ దశ. రిపబ్లిక్‌యొక్క, రాజ్యాంగ నిర్ణయ సభయొక్క ఏర్పాటు దశ.

1) 1848 మే 4నుండి జూన్ 25వరకు. శ్రామికవర్గానికి వ్యతిరేకంగా అన్ని వర్గాలయొక్క పోరాటం. జూన్ రోజుల్లో శ్రామికవర్గ పరాజయం.

2) 1848 జూన్ 25నుండి డిసెంబరు 10వరకు. శుద్ధ బూర్జువా రిపబ్లికన్ల ఏకాధిపత్యం. రాజ్యాంగచట్ట ముసాయిదా తయారీ. పారిస్‌లో ముట్టడిస్థితి ప్రకటన. డిసెంబరు 10న బోనపార్ట్ అధ్యక్షుడుగా ఎన్నిక అవడంతో బూర్జువా ఏకాధిపత్యం రద్దు.

3) 1848 డిసెంబరు 20నుండి 1849 మే 28వరకు. బోనపార్ట్‌తోను, బోనపార్ట్‌తో కలిసిన పార్టీ ఆఫ్ ఆర్డర్‌తోను రాజ్యాంగ నిర్ణయ సభ సంఘర్షణ. రాజ్యాంగ నిర్ణయ సభ సమాప్తి. రిపబ్లికన్ బూర్జువావర్గంయొక్క పతనం.

III. తృతీయ దశ. రాజ్యాంగచట్టబద్ధ రిపబ్లిక్‌యొక్క, శాసన నిర్ణయ జాతీయ సభ దశ.

1) 1849 మే 28నుండి జూన్ 13వరకు. బూర్జువావర్గంతోను, బోనపార్ట్‌తోను పెటీబూర్జువావర్గపు సంఘర్షణ. పెటీబూర్జువా ప్రజాస్వామ్యపు పరాజయం.

2) 1849 జూన్ 13నుండి, 1850 మే 31వరకు. పార్టీ ఆఫ్ ఆర్డర్‌యొక్క

పార్లమెంటరీ ఏకాధిపత్యం. సార్వజనిక ఓటింగు హక్కును రద్దుచెయ్యడంద్వారా అది తన పాలనను సమగ్రం చేసుకుంది, కాని పార్లమెంటరీ మంత్రివర్గాన్ని పోగొట్టుకుంది.

3) 1850 మే 31నుండి 1851 డిసెంబరు 2వరకు. పార్లమెంటరీ బూర్జువా వర్గానికీ బోనపార్ట్‌కీ మధ్య సంఘర్షణ.

అ) 1850 మే 31నుండి 1851 జనవరి 12వరకు. పార్లమెంటు సైన్యంపై సర్వాధిపత్యాన్ని కోల్పోయింది.

ఆ) 1851 జనవరి 12నుండి ఏప్రిల్ 11వరకు. ప్రభుత్వ నిర్వహణాధికారాన్ని తిరిగి సంపాదించుకోవాలని ప్రయత్నించి, పార్లమెంటరీ బూర్జువావర్గం మరింత అధ్వాన్న స్థితిలో పడింది. పార్టీ ఆఫ్ ఆర్డర్ తన స్వతంత్ర పార్లమెంటరీ మెజారిటీని కోల్పోయింది. రిపబ్లికన్లతోను, మహీధరం పార్టీతోను దాని పొత్తు.

ఇ) 1851 ఏప్రిల్ 11నుండి 1851 అక్టోబరు 9వరకు. రాజ్యాంగ సవరణ, సంలీన, వాయిదాలకు ప్రయత్నాలు. పార్టీ ఆఫ్ ఆర్డర్ తన వేర్వేరు సంఘటక విభాగాలక్రింద విడిపోయింది. ఒకవంక బూర్జువా పార్లమెంటుకూ పత్రికలకూ, మరోవంక బూర్జువా సముదాయానికీ మధ్య గండి స్పష్టరూపం దాల్చింది.

ఈ) 1851 అక్టోబరు 9నుండి డిసెంబరు 2వరకు. పార్లమెంటుకీ కార్యనిర్వాహకాధికారానికీ మధ్య బాహాటమైన తెగతెంపు. తన సొంత వర్గంచేత, సైన్యంచేత, తదితర అన్ని వర్గాలచేతా పరిత్యజింపబడి, పార్లమెంటు తన మరణక్రియను పూర్తిచేసి కూలిపోయింది. పార్లమెంటరీ వ్యవస్థయొక్క, బూర్జువా పాలనయొక్క అంతం. బోనపార్ట్ విజయం. సామ్రాజ్య పునరుద్ధరణ ప్రహసనం.

## VII

ఫిబ్రవరి విప్లవ ప్రాంగణంలో, సామాజిక రిపబ్లిక్ ఒక నినాదంగా, ఒక భవిష్యవాణిగా అవతరించింది. 1848 జూన్ రోజుల్లో, అది పారిస్ శ్రామికవర్గ రక్తంలో ముంచివెయ్యబడింది, కాని నాటకంయొక్క రాబోయే రంగాల్లో అదొక భూతంలాగా సదా వెంటాడుతూ వుంటుంది. ప్రజాస్వామిక రిపబ్లిక్ తన ఆగమనాన్ని ప్రకటించింది. 1848 జూన్ 13న అది, పలాయనానికి పూనుకొని, ఆ పలాయనక్రమంలో తన సొంతడబ్బాను ద్విగుణీకృతావేశంతో వాయించుకున్న దాని పెటీబూర్జువావర్గంతోబాటు చిందరవందరై పోయింది. ఈసారి పార్లమెంటరీ రిపబ్లిక్, బూర్జువావర్గంతోబాటు యావత్తు రంగస్థలాన్నీ ఆక్రమించింది. అది తన అస్తిత్వానికి సంబంధించిన పూర్తి ఆనందాన్ని అనుభవించింది; కాని, 1851 డిసెంబరు 2, సమైక్య రాజరికవాదుల "రిపబ్లిక్ వర్థిల్లాలి!" అన్న వేదనాపూరిత నినాదాల మధ్య, దాన్ని సైతం ఖననంచేసింది.

ఫ్రెంచి బూర్జువావర్గం కష్టజీవి శ్రామికవర్గపు పెత్తనాన్ని నిరసించింది; అది వర్గభ్రష్ట బికారి గాలిమూకను డిసెంబరు 10 సంఘపు సర్దారు నాయకత్వాన పెత్తనంలోకి తెచ్చింది. బూర్జువావర్గం కమ్యూనిస్టు అరాజకత్వపు భయంకర భవిష్యత్ప్రమాదాన్ని చూపి యావత్తు ఫ్రాన్సునూ భయభ్రాంతంచేసింది; డిసెంబరు 4న మాంమార్టర్, ఇటాలియన్ రోడ్లలోని ప్రముఖ బూర్జువాల ఇళ్ల కిటికీలపై మద్యప్రేరితులైన వ్యవస్థ రక్షణ సైన్యంచేత గుళ్లవర్షం కురిపింపజేసిన బోనపార్ట్, యీ భవిష్యత్తుకి చాల తక్కువ మూల్యం చెల్లించాడు. బూర్జువావర్గం కత్తికి పవిత్ర స్థానాన్ని కల్పించింది; ఆ కత్తే యీనాడు దానిపై పెత్తనంచేస్తోంది. అది విప్లవ పత్రికల గొంతు నులిమింది; ఇప్పుడు దాని పత్రికల గొంతు నులమబడింది. అది బహిరంగ సమావేశాలను పోలీసుల అజమాయిషీలో వుంచింది, ఇప్పుడు దాని సమావేశ స్థలాలు పోలీసుల అజమాయిషీలో ఉన్నాయి. అది ప్రజాస్వామిక నేషనల్ గార్డులను రద్దుచేసింది; ఇప్పుడు దాని నేషనల్ గార్డే రద్దుచెయ్యబడింది. అది ముట్టడి స్థితిని విధించింది; ఇప్పుడు దానిపైననే ముట్టడి స్థితి విధింపబడింది. అది జూరీల స్థానంలో సైనిక విచారణసంఘాలు నెలకొల్పింది; ఇప్పుడు దాని జూరీల స్థానంలోనే సైనిక విచారణసంఘాలు నెలకొల్పబడ్డాయి. అది ప్రజల విద్యను మతగురువుల అధీనం చేసింది; ఇప్పుడు ఆ మతగురువులు దానినే తమ విద్యకు అధీనంచేసుకున్నారు. అది జనాన్ని విచారణ లేకుండా ప్రవాసంపంపింది; ఇప్పుడు అదే విచారణ లేకుండా ప్రవాసంపంపబడుతోంది. అది సమాజంలో చెలరేగిన ప్రతి సంచలనాన్నీ రాజ్యాధికారంతో అణచివేసింది; ఇప్పుడు దాని సమాజంలో చెలరేగిన ప్రతి సంచలనమూ రాజ్యాధికారంద్వారా అణచివెయ్యబడుతోంది. తన డబ్బుసంచిని పదిలంగా ఉంచుకోవాలన్న ఉత్సాహంతో, అది తన సొంత రాజకీయవేత్తలకూ, సాహితీపరులకే వ్యతిరేకంగా తిరుగబడింది; ఇప్పుడు దాని రాజకీయవేత్తలూ, సాహితీపరులూ పక్కకి గెంటివెయ్యబడ్డారు, కాని యిప్పుడు దాని నోరు మూసివెయ్యబడి, దాని కలం విరిచివెయ్యబడిన కారణంగా దాని డబ్బుసంచి దోచుకోబడుతోంది. సెంట్ అర్సెనియస్ "Fuge, tace, quiesce! పారిపో, ఊరుకో, శాంతించు!" అంటూ క్రిస్టియన్లను ఏ విధంగా అయితే అదిలిస్తూండేవాడో, అదే మాటలతో బూర్జువావర్గం విప్లవాన్ని విసుగూ విరామం లేకుండా అదిలిస్తూవుండేది; ఇప్పుడు బోనపార్ట్ బూర్జువావర్గాన్ని ఉద్దేశించి "Fuge, tace, quiesce! పారిపో, ఊరుకో, శాంతించు!" అంటూ అదలిస్తున్నాడు.

నెపోలియన్: "Dans cinquante ans, l'Europe sera républicaine ou cosaque"* అంటూ ద్వైధీ భావాన్ని ప్రకటించాడు. ఫ్రెంచి బూర్జువావర్గం చాలా కాలం

* "యాభై సంవత్సరాల్లో యూరప్ రిపబ్లికనేనా అవుతుంది, కజాకేనా అవుతుంది." — సం.

క్రితమే దీనికి పరిష్కారాన్ని కనుగొంది. ఆ పరిష్కారమేమిటంటే "république cosaque."* బూర్జువా రిపబ్లిక్ అనబడే ఆ కళాకృతికి ఏ సిర్స్ యో తన ఐంద్రజాలిక విద్య ద్వారా రాక్షస ఆకారాన్నిచ్చాడని దీని అర్థం కాదు. గౌరవనీయతా ఛాయలను తప్ప యీ రిపబ్లిక్ మరేమీ కోల్పోలేదు. ఈనాటి ఫ్రాన్సు** ఆకారం పార్లమెంటరీ రిపబ్లిక్‌లో యిమిడివుంది. ఆ గాలిబుడగ పగిలి, దానిలో దాగివున్న రాక్షసి అందరి కళ్లముందూ ప్రత్యక్షం అవడానికి కేవలం ఒకేఒక్క సన్నీపోటు చాలు.

డిసెంబరు 2 తర్వాత పారిస్ శ్రామికవర్గం తిరుగుబాటు ఎందుకు చెయ్యలేదు?

బూర్జువావర్గపు గద్దెను తల్లక్రిందులుచెయ్యడానికి ఉత్తరువు మాత్రమే జారీచెయ్య బడింది; ఆ ఉత్తరువు యింకా అమలుజరపబడలేదు. ఇటువంటి సమయంలో శ్రామికవర్గం తీవ్రమైన ఏ తిరుగుబాటుకైనా పూనుకొనివుంటే, అది బూర్జువావర్గంలో కొత్త జీవాన్ని పోసివుండేది, సైన్యంతో దాని కలయిక సంభవించియుండేది, కార్మికులకు జూన్‌నాటి పరా జయ పునరావృత్తి నిశ్చితమైయుండేది.

డిసెంబరు 4న, బూర్జువాలూ, దుకాణదారులూ శ్రామికవర్గాన్ని పోరాడాల్సిందిగా రెచ్చగొట్టారు. ఆ రోజు సాయంత్రం నేషనల్ గార్డుకి చెందిన పలు దళాలు ఆయుధాలు చేతబూని యూనిఫారాల్లో పోరాటరంగంలోకి వస్తామని వాగ్దానం చేశాయి. జరిగిన సంగ తేమిటంటే, డిసెంబరు 2 నాటి తన ఉత్తరువు ఒకదానిలో బోనపార్ట్ రహస్య ఓటింగును రద్దుచేశాడనీ, ప్రభుత్వ రిజిస్టర్లలో తమ పేర్లకు ఎదురుగా "ఔను" అనో, "కాదు" అనో తాము రాయాల్సివచ్చే ఏర్పాటుచేశాడనీ బూర్జువాలకూ, దుకాణదారులకూ ఉప్పం దింది. డిసెంబరు 4 ప్రతిఘటనతో బోనపార్ట్ బెదిరిపోయాడు. దానితో రాత్రికిరాత్రి, రహస్య ఓటింగు పద్ధతిని పునరుద్ధరిస్తున్నట్లు తెలియజేసే పోస్టర్లను పారిస్‌లోని వీధి మొగలన్నింట్లోనూ అతను అంటింపజేశాడు. బూర్జువాలూ, దుకాణదారులూ తమ లక్ష్యాన్ని సాధించామని నమ్మారు. మరుసటి ఉదయం ఎక్కడా పత్తా లేకుండా పోయినవాళ్లు బూర్జు వాలూ, దుకాణదారులే.

డిసెంబరు 1–2 తేదీల మధ్య రాత్రిపూట జరిపిన ఒక ఆకస్మికదాడిద్వారా, బోనపార్ట్ పారిస్ శ్రామికవర్గానికి నాయకులూ, బ్యారికేడ్ కమాండర్లూ లేకుండా చేశాడు. ఆఫీసర్లు లేని సైన్యం మాదిరిగా తయారైన శ్రామికవర్గం 1848 జూన్, 1849, 1850 మే నాటి స్మృతుల కారణంగా మహీధరం పార్టీ జండా క్రింద పోరాడటం యిష్టంలేక, పారిస్

---

* కజాక్ రిపబ్లిక్. – సం.

** అంటే, 1851 నాటి రాజకీయ కుట్ర తర్వాత ఫ్రాన్సు. – సం.

యొక్క తిరుగుబాటుదారీ గౌరవపరిరక్షణ కర్తవ్యాన్ని తన అగ్రగామిదళమైన రహస్య సంఘాలపైన వదిలేసింది — ఈ పారిస్ గౌరవపరిరక్షణ భారాన్నే బూర్జువావర్గం ప్రతిఘటనా ప్రయత్నమేమీ లేకుండా సైన్యానికి అప్పగించింది, తర్వాత నేషనల్ గార్డును బోనపార్ట్ నిరాయుధం చేసినప్పుడు, బూర్జువావర్గపు ఆయుధాలు అరాజకవాదులచేత దానికే వ్యతిరేకంగా వాడబడకుండా చూడటమే తను అలా చెయ్యడానికి వెనుకగల సంకల్పమని బూర్జువావర్గంపట్ల హేళనపూర్వకంగా చెప్పుకోగలిగాడు.

"C'est le triomphe complet et définitif du socialisme!"* గిజో యీ మాటల్లో డిసెంబరు 2 ఘటనలను అంచనావేశాడు. కానైతే, పార్లమెంటరీ రిపబ్లిక్ కూల్చివేతలో శ్రామికవర్గ విప్లవవిజయ బీజం యిమిడివున్నప్పటికీ, దాని తక్షణ ప్రత్యక్ష ఫలితం పార్లమెంటుపై బోనపార్ట్ విజయం, శాసన నిర్ణయాధికారంపై కార్యనిర్వాహకాధికార విజయం, శబ్ద శక్తిపై శబ్దరహిత శక్తి విజయం. పార్లమెంటులో జాతి తన సాధారణ అభీష్టాన్ని చట్టం చేసింది, అంటే, అది పాలకవర్గపు చట్టానికి తన సాధారణ అభీష్టపు రూపాన్నిచ్చింది. కార్యనిర్వాహకాధికారానికి ముందు అది తన సొంత అభీష్టాన్ని పరిత్యాగంచేసి, ఒక విజాతీయమైన అభీష్టంయొక్క ఉన్నత ఆదేశంయొక్క అధికారంముందు తలవంచుతుంది. శాసన నిర్ణయాధికారానికి భిన్నంగా కార్యనిర్వాహకాధికారం, జాతి స్వయం పాలనకు భిన్నంగా దాని పరిపాలనను అభివ్యక్తంచేస్తుంది. అందుచేత ఫ్రాన్సు పని, ఒక వ్యక్తి యొక్క నిరంకుశత్వం కిందికి, అందునా ఎటువంటి అధికారమూ లేని ఒక వ్యక్తి అధికారం కిందికి రావడానికి మాత్రమే ఒక వర్గంయొక్క నిరంకుశత్వంనుండి బయటపడినట్లయింది. ఈ సంఘర్షణ పరిష్కారమైన తీరును చూస్తే, సమానంగానే శక్తిహీనమూ, సమానంగానే మూగవీ అయిన వర్గాలన్నీ రైఫిలుమడమ ముందు సాగిలపడినట్లనిపిస్తుంది.

కాని విప్లవం తన క్రమాన్ని పూర్తిచేసే తీరుతుంది. ఇప్పటికింకా అది పాపవిమోచక లోకంలోనే పయనిస్తోంది. అది తన పనిని అత్యంత క్రమబద్ధంగా చేస్తుంది. 1851 డిసెంబరు 2నాటికి సన్నాహానికి సంబంధించిన తన పనిలో అది సగం మాత్రమే పూర్తిచేసింది; ఇప్పుడది మిగిలిన సగం పనినీ పూర్తిచేస్తోంది; ముందది పార్లమెంటరీ అధికారాన్ని పరిపూర్ణం చేసింది; ఎందుకంటే దాన్ని కూలద్రొయ్యగలిగేందుకు. తానిప్పుడా పనిని పూర్తిచేసింది కనుక, యిప్పుడది కార్యనిర్వాహకాధికారాన్ని పరిపూర్ణం చేస్తోంది, అది దానికి దాని అత్యంత విశుద్ధమైన అభివ్యక్తినిస్తోంది, దాన్ని వేరుచేస్తోంది, దానికి వ్యతిరేకంగా తన వినాశకర శక్తులన్నింటినీ కేంద్రీకరించేందుకు వీలుగా, దాన్ని తన ఏకైక దాడిలక్ష్యంగా నిలుపుకుంది. ఎప్పుడైతే తన సన్నాహక కార్యక్రమంలోని యీ రెండవ అర్ధభాగాన్ని అది పూర్తిచేస్తుందో,

* "ఇది సోషలిజంయొక్క సంపూర్ణ, నిర్ణాయక విజయం!" — సం.

అప్పుడు యూరప్ తన కుర్చీలోంచి ఛంగున లేచి యిలా అంటుంది: "Well grubbed, old mole!"*

బృహత్తరమైన నిరంకుశాధికార యంత్రాంగాన్నీ, సైనిక వ్యవస్థనూ, అత్యంత నిపుణంగా రూపొందించబడి, సమాజంలోని అనేక శ్రేణులను ఆవరించియున్న రాజ్యయంత్రాన్నీ, దానికితోడు అయిదు లక్షలమందితోకూడిన ఉద్యోగ గణాన్నీ కలిగి, ఫ్రెంచి సామాజిక శరీరాన్ని వలమాదిరిగా చుట్టివేసి, దాని రోమకూపాలన్నింటినీ బందుచేసివేసే యీ కార్యనిర్వాహకాధికారం, యీ భయంకర పరభాగ్యోప వ్యవస్థ, ఫ్యూడల్ వ్యవస్థ శిధిలం కావడంతో – ఆ శైథిల్య క్రమానికిది తోడ్పడింది – ఏకాధిపత్య రాజరికపు రోజుల్లో తలెత్తింది. భూస్వాముల, పట్టణాల ఫ్యూడల్ ప్రభుసంబంధమైన విశేషాధికారాలు రాజ్యాధికారానికి సంబంధించిన విశేషాంశాలుగా పరివర్తన చెందాయి. ఫ్యూడల్ పెద్దలు జీతాలు పొందే అధికారులుగా రూపాంతరంచెందారు, వైరుధ్యపూరిత మధ్యయుగీన పూర్ణాధికారంయొక్క సంకీర్ణ పద్ధతి రాజ్యాధికారానికి – దేని కార్యకలాపమైతే ఒక ఫ్యాక్టరీలో మాదిరిగా విభజితమూ, కేంద్రీకృతమూ అయిందో అటువంటి రాజ్యాధికారానికి – సంబంధించిన సక్రమ ప్రణాళికాబద్ధమైన పద్ధతిగా పరివర్తన చెందింది. సకల ప్రత్యేక స్థానిక, ప్రాంతీయ, నగర, రాష్ట్రీయ అధికారాలనూ భగ్నంచేసి, జాతియొక్క పౌర ఐక్యతను సృష్టించడమే కర్తవ్యంగా కలిగిన మొదటి ఫ్రెంచి విప్లవం, నిరంకుశ రాజరికం ప్రారంభించిన: కేంద్రీకరణను, అదే సమయంలో ప్రభుత్వాధికార పరిమితిని, విశేషతలను, ఆచరణకర్తలను పెంపొందించి తీరాల్సివుంటుంది. ఈ రాజ్యయంత్రాంగాన్ని నెపోలియన్ పరిపూర్ణం చేశాడు. లెజిటిమిస్టు రాజరికమూ, జూలై రాజరికమూ మరింత ఎక్కువ శ్రమవిభజనను తప్ప దానికేమీ చేర్చలేదు, పోతే యీ శ్రమవిభజన, బూర్జువా సమాజంలో శ్రమవిభజన కొత్త ప్రయోజన సమూహాలను, కాగా రాజ్యనిర్వహణకు కొత్త సామగ్రిని, ఏ మేరకైతే సృష్టించిందో, ఆ మేరకే పెరిగింది. ప్రతి ఒక ఉమ్మడి ప్రయోజనమూ వెన్వెంటనే సమాజంనుండి వేరుచెయ్యబడి, దానికి పోటీగా మరింత ఉన్నతమైన, సార్వత్రిక ప్రయోజనంగా నిలబెట్టబడింది, సమాజ సభ్యుల కార్యకలాప క్షేత్రంనుండి లాగివెయ్యబడి, ప్రభుత్వ కార్యకలాపాంశంగా మార్చివెయ్యబడింది – ఒక వంతెన, ఒక విద్యాలయ భవనం, ఒక గ్రామ సమాజపు ఉమ్మడి ఆస్తి దగ్గర్నుంచి ఫ్రాన్సుయొక్క రైల్వేలు, జాతీయ సంపద, జాతీయ విశ్వవిద్యాలయందాకా యిది వర్తించింది. చిట్టచివరి సంగతేమిటంటే, విప్లవానికి వ్యతిరేకంగా తను చేసిన పోరాటంలో, పార్లమెంటరీ రిపబ్లిక్, నిర్బంధ చర్యలతోబాటు ప్రభుత్వాధికారపు వనరులను, కేంద్రీకరణను సైతం బలపరచాల్సి వచ్చింది. అన్ని విప్లవాలూ రాజ్యయంత్రాన్ని తుత్తునియలు చేసేందుకు బదులు దాన్ని మెరుగుపరచాయి. ఒకదాని తర్వాత మరొకటిగా

* "పందికొక్కా, బాగా దొలిచావ్!" – Shakespeare, *Hamlet*, Act I, Scene V. – సం.

ఆధిపత్యంకోసం పోటీచేసిన పార్టీలు బృహత్తరమైన యీ రాజ్యకట్టడాన్ని చేజిక్కించుకోవడమే విజయంయొక్క ప్రధాన బహుమతిగా పరిగణిస్తూవచ్చాయి.

కాని నిరంకుశ రాజరికంలో, మొదటి విప్లవ కాలంలో, నెపోలియన్ క్రింద, నిరంకుశోద్యోగ బృందం బూర్జువాలయొక్క వర్గపాలనకు రంగాన్ని సంసిద్ధంచేసే సాధనంగా మాత్రమే వుంది. పునరుద్ధరణ కాలంలో, లూయీ ఫిలిప్ క్రింద, పార్లమెంటరీ రిపబ్లిక్‌లో అది తన సొంత అధికారంకోసం ఎంతగా తంటాలుపడినప్పటికీ, అది పాలకవర్గపు పరికరంగా మాత్రమే ఉంది.

రెండవ బోనపార్ట్ కాలంలో మాత్రమే రాజ్యం తనను తాను సంపూర్ణరూపంలో స్వతంత్రంచేసుకున్నట్లు కనిపిస్తుంది. సమాజానికి పోటీగా, రాజ్యయంత్రం తన స్థితిని ఎంత సమగ్రరూపంలో సుదృఢం చేసుకున్నదంటే, దాని అధ్యక్షుడు కావడానికి డిసెంబరు 10 సంఘనాయకుడే—విదేశంనుండి తుపాను తాకిడికి కొట్టుకువచ్చిన, త్రాగిన సైనికులచేత గద్దెనెక్కింపబడిన, ఎవరినైతే అతను సారాయి తాగించీ, సాసేజిలు తినిపించీ కొనేశాడో, ఎవరికైతే ఎప్పటికప్పుడు సాసేజిలు తినిపించడం అతనికి అవసరమో—ఆ మోసగాడే సరిపోయాడు. ఫ్రెంచి గడ్డ యీనాడు యింతగా ఘోర నిరాశకు గురికావడానికీ, అత్యంత భయంకరమైన తలవంపు భావంతో, అవమాన భారంతో కృంగిపోవడానికీ, భావోద్విగ్నం కావడానికీ యిదే కారణం. ఫ్రాన్సు తను అవమానింపబడినట్లు భావిస్తోంది.

అయినాకూడా రాజ్యాధికారమన్నది ఆకాశం మధ్యలో ఏమీ వ్రేలాడటం లేదు. బోనపార్ట్ ఒకానొక వర్గానికి, ఆ మాటకొస్తే ఫ్రెంచి సమాజంలోని అత్యధిక సంఖ్యాక వర్గానికి, సన్నకారు (పార్జెల్లేన్) రైతాంగానికి ప్రతినిధి.

ఏవిధంగానైతే బూర్బన్ రాజవంశం బడా భూస్వాముల రాజవంశమో, ఆర్లియన్స్ రాజవంశం ధనికుల రాజవంశమో, అదేవిధంగా బోనపార్ట్‌లు రైతులయొక్క, అంటే ఫ్రెంచి జనసముదాయంయొక్క ప్రభువంశం. రైతులకు ఆరాధ్యుడు బూర్జువా పార్లమెంటును భగ్నంచేసిన బోనపార్ట్ గాని, బూర్జువా పార్లమెంటుముందు తలవంచిన బోనపార్ట్ కాదు. మూడేళ్లుగా పట్టణాలు డిసెంబరు 10 నాటి ఎన్నికలయొక్క అసలు అర్థాన్ని వక్రీకరించడంలోను, రైతులను సామ్రాజ్య పునరుద్ధరణ గురించి కన్నుగప్పడంలోను సఫలీకృతమయ్యాయి. 1848 డిసెంబరు 10 నాటి ఎన్నికలు 1851 డిసెంబరు 2 నాటి రాజకీయ కుట్రతో మాత్రమే సమగ్రమయ్యాయి.

సన్నకారు రైతాంగం బహుళసంఖ్యాకమైనది. వారు ఒకే రకమైన పరిస్థితుల్లోనే జీవించినా ఒకరు మరొకరితో రకరకాల సంబంధాలు పెట్టుకోరు. వారి ఉత్పత్తి విధానం వారిని పరస్పర సంపర్కంలోకి తెచ్చేందుకు బదులు ఒకరినుండి మరొకరిని వేరుజేస్తుంది. ఫ్రాన్సులో రవాణా సౌకర్యాల అధ్వాన్న స్థితి కారణంగాను, రైతుల దారిద్ర్యం కారణంగాను యీ

వేర్పాటు మరింతగా వృద్ధిచెందుతుంది. వారి ఉత్పత్తి క్షేత్రమైన చిన్న కమతంలో సాగు కార్యక్రమంలో శ్రమవిభజనకూ, విజ్ఞానశాస్త్రాన్ని ఉపయోగపెట్టుకోవడానికీ వీలుండదు, పర్యవసానంగా దాని అభివృద్ధిలో వైవిధ్యం ఉండదు, బుద్ధి కౌశల్యంలో వైవిధ్యం ఉండదు, సామాజిక సంబంధాల సమృద్ధి ఉండదు. ప్రతి ఒక రైతు కుటుంబమూ దాదాపుగా స్వయం సమృద్ధంగా ఉంటుంది; అది తనకు అవసరమైన వస్తువుల్లో అధికాంశాన్ని తనే స్వయంగా తయారుచేసుకుంటుంది, ఈవిధంగా అది తన జీవికను సమాజంతో సంపర్కంద్వారా కన్న ప్రకృతితో ఆదానప్రదానాలద్వారా ఎక్కువగా సంపాదించుకుంటుంది. ఓ చిన్న కమతం, ఒక రైతు, అతని కుటుంబం; పక్కన మరో కమతం, మరో రైతు, మరో కుటుంబం. ఇటువంటివి కొన్ని కలిస్తే ఒక గ్రామం అవుతుంది, కొన్ని గ్రామాలు కలిస్తే ఒక జిల్లా అవుతుంది. ఈ విధంగా, ఫ్రాన్సు దేశపు విస్తృత జనసముదాయం, ఒక బస్తాలోని బంగాళ దుంపలు అన్నీ కలిసి ఒక బస్తాడు బంగాళదుంపలు అయినట్లు గానే, ఒకే రకమైన విభాగాల కలయికతో రూపొందింది. దశలక్షలాది కుటుంబాలు, తమ జీవిత విధానాన్ని, తమ ప్రయోజనాలను, తమ సంస్కృతిని యితర వర్గాలనుండి వేరుచేసి, యితర వర్గాలకు శత్రువైరుధ్యంలో ఉంచే ఆర్థిక పరిస్థితులలో జీవించే మేరకు, అవి ఒక వర్గం అవుతాయి. ఈ సన్నకారు రైతుల మధ్య కేవలం స్థానిక స్థాయిలో మాత్రమే అంతస్సంబంధాలు ఉండి, తమ ప్రయోజనాల ఏకరూపత కారణంగా వారు ఒక సముదాయంగా సంఘటితం కానంత వరకు, వారి మధ్య జాతీయ ఐక్యతా బంధమూ, రాజకీయ సంఘటనా ఉత్పన్నం కానంతవరకు, వారు ఒక వర్గం కారు, పర్యవసానంగా వారికి తమ స్వంత పేరు మీదుగా, పార్లమెంటుద్వారా గాని, లేక ఒక కన్వెన్షనుద్వారా గాని వారు తమ వర్గప్రయోజనాలను సమర్థించుకోలేరు. వారు తమకు తామే ప్రాతినిధ్యం వహించుకోలేరు, మరెవరో వారికి ప్రాతినిధ్యం వహించాలి. అంతే కాకుండా, ఎవరైతే వారి యజమానిగా, వారిపై పెత్తనంనెరపేవాడుగా, యితర వర్గాలకు వ్యతిరేకంగా తమను కాపాడే అపరిమిత ప్రభుత్వాధికారానికి సాకారరూపంగా ఉండి, ఆకాశంపైనుంచి ఎండవానలను పంపగలుగుతాడో అటువంటి వాడు మాత్రమే వారికి ప్రతినిధిగా ఉండగలడు. అందుచేతనే సన్నకారు రైతుల రాజకీయ ప్రభావం, సమాజాన్ని కార్యనిర్వాహకాధికారం లొంగదీసుకోవడంలో వ్యక్తమవుతుంది.

చారిత్రక సంప్రదాయం ఫ్రెంచి రైతులలో నెపోలియన్ పేరుగల ఒక వ్యక్తి తమకు సమస్త పురాతన ఘనతనూ తిరిగి సాధించిపెడతాడన్న అద్భుతంలో విశ్వాసాన్ని ఉత్పన్నం చేసింది. ఆ మనిషి తనేనంటూ ఒక వ్యక్తి ముందుకొచ్చాడు, ఎందుకంటే అతనికి — "La recherche de la paternité est interdite"* అని సూత్రీకరించిన Code

* నెపోలియన్ శిక్షాస్మృతి: పితృత్వ విషయంలో విచారణ నిషిద్ధం. — సం.

Napoléon కారణంగా — నెపోలియన్ పేరు వచ్చింది. ఇరువదేళ్ల దేశ ద్రిమ్మరితనం, అనేక విచిత్ర దుస్సాహసాల తదుపరి, ఆ పాత జోస్యం ఫలించింది, ఆ మనిషి ఫ్రాన్సు చక్రవర్తి అయ్యాడు. ఫ్రెంచి సమాజంలో అత్యధిక సంఖ్యాక వర్గంయొక్క మనోకాంక్ష సైతం అదే కావడంతో, భ్రాంతీయుని స్థిర మనోకాంక్ష ఆచరణరూపం దాల్చింది.

కాని యిక్కడ ఒక అనుమానం ఉత్పన్నంకావచ్చు: మరైతే, ఫ్రాన్సులో సగ్రప్రాంతంలో రైతుల తిరుగుబాట్లు, రైతులపై సైన్యపు దాడులు, పెద్దయెత్తున రైతుల జైలునిర్బంధాలూ, ప్రవాసయాత్రలూ ఎందుకు సంభవించినట్లు?

14వ లూయీ తర్వాత, "ప్రజలను రాజకీయంగా రెచ్చగొట్టే ఆడంబర వక్తృత్వ" కారణంగా ఫ్రాన్సులో రైతులపై యింతభారీ ఎత్తున దమనకాండ మరెన్నడూ జరగలేదు.

కాని యీ విషయంలో తప్పు అవగాహనకి తావు లేదు. బోనపార్ట్ ప్రభువంశం విప్లవ కారుడైన రైతుకిగాక ఛాందసపు రైతుకి ప్రతినిధి; ఏ రైతైతే తన సామాజిక అస్తిత్వపరిస్థితిలోంచి — చిన్న కమతంలోంచి — బయటపడాలని కొట్టుమిట్టాడుతున్నాడో ఆ రైతుకి అతను ప్రతినిధి, యీ పరిస్థితిని, యీ కమతాన్ని పదిలపరచుకోగోరే రైతుకి ప్రతినిధి; పట్టణాలతో సంబంధాలు పెట్టుకొని పాత వ్యవస్థను తమ సొంత శక్తిసామర్థ్యాలపై ఆధారపడి కూలద్రొయ్యాలని కోరుకొనే గ్రామీణ జనానికి కాక, తద్విరుద్ధంగా, యీ పాత వ్యవస్థ అనే నూతికి పరిమితమైన కప్పల మాదిరిగా ఉంటూ, తమనూ, తమకోసం, తమ చిన్న కమతాలకోసం సామ్రాజ్య ప్రేతంయొక్క సంరక్షణనూ, అభయహస్తాన్నీ కోరే గ్రామీణ జనానికి ప్రతినిధి. అది రైతుయొక్క వివేకానికిగాక, అతని అంధవిశ్వాసానికి ప్రతినిధి; అతని విచక్షణకుగాక, అతని బూజుపట్టిన పాత అభిప్రాయాలకు ప్రతినిధి; అతని భవిష్యత్తుకిగాక అతని గతానికి ప్రతినిధి; అతని ఆధునిక సేవెన్స్‌కి గాక అతని ఆధునిక వెండే[113]కి ప్రతినిధి.

పార్లమెంటరీ రిపబ్లిక్‌యొక్క మూడేళ్ల కఠోరపాలన ఫ్రెంచి రైతుల్లో ఒక భాగాన్ని నెపోలియనిక్ భ్రమలనుండి విముక్తులనుచేసి, పైపైన మాత్రమే అయినా వారిని విప్లవీకరించింది. కాని యీ రైతులు ఎప్పుడెప్పుడైతే కదిలి ముందుకుసాగే ప్రయత్నాలు చేశారో అప్పుడప్పుడల్లా బూర్జువావర్గం వారిని హింసాత్మకంగా అణచివేసింది. పార్లమెంటరీ రిపబ్లిక్ కాలంలో ఫ్రెంచి రైతుయొక్క ఆధునిక చైతన్యమూ, సాంప్రదాయిక చైతన్యమూ అతని మనస్సుపై ఏది పెత్తనం వహించాలన్న అంశంపై పోటీపడ్డాయి. ఈ క్రమం పాఠశాల ఉపాధ్యాయులకూ మతగురువులకూ మధ్య నిరంతర సంఘర్షణ రూపాన్ని ధరించింది. బూర్జువా వర్గం పాఠశాల ఉపాధ్యాయులపై దెబ్బతీసి వారిని పడగొట్టింది. ప్రభుత్వ కార్యకలాపాలకు ముఖాముఖీగా ఎదురునిలిచి స్వతంత్రంగా ప్రవర్తించేందుకు రైతులు మొట్టమొదటిసారిగా

ప్రయత్నించారు. మేయర్లకూ ప్రిఫెక్టులకూ మధ్య నిరంతరాయంగా జరిగిన సంఘర్షణలో యిది ప్రదర్శితమైంది. బూర్జువావర్గం మేయర్లను పదవీభ్రష్టులనుచేసింది. చిట్టచివరి సంగతేమిటంటే, పార్లమెంటరీ రిపబ్లిక్ కాలంలో, భిన్న ప్రాంతాలకు చెందిన రైతులు తమ సొంత సంతానంపైననే, అంటే సైన్యంపైననే తిరుగబడ్డారు. వారిని బూర్జువావర్గం ముట్టడి స్థితులతోనూ, కఠినశ్రమ దళాలలోకి పంపీ దండించింది. మరి యీరోజున అదే బూర్జువావర్గం జనం మూర్ఖులనీ, యీ అలగామూక తమను మోసగించి బోనపార్ట్‌కి అప్పగించిందనీ గొంతు బొంగురుపోయేలా అరిచి అరిచి చెప్తోంది. అది స్వయంగా రైతు వర్గంయొక్క సామ్రాజ్య భావాలను బలపర్చింది, రైతుల యీ తత్వం ఏ మూలాధారంనుండి ఉత్పన్నమవుతుందో దానికి సంబంధించిన పరిస్థితులను అది పదిలపరచి వుంచింది. జన సామాన్యం ఛాందస భావాలు కలిగియున్నంత కాలం వారి మూర్ఖత్వంపట్లా, వారు విప్లవ కారులు అయిన వెంటనే వారి అవగాహనా శక్తిపట్లా బూర్జువావర్గం భయకంపితమైతీరు తుంది.

రాజకీయ కుట్ర అనంతరం జరిగిన తిరుగుబాట్లలో, ఫ్రెంచి రైతులో ఒక భాగం, ఆయుధాలు చేబూని 1848 డిసెంబరు 10 నాటి తమ సొంత ఓటింగుకే వ్యతిరేకంగా నిరసన ప్రకటించారు. 1848 తర్వాత వారు ఏ శిక్షణాలయం గుండానైతే గడిచారో అది వారి బుద్ధిని సునిశితంచేసింది. కాని వారు తమను తాము చరిత్రయొక్క అధోలోకానికి అధీనం చేసుకున్నారు, చరిత్ర వారిని తమ వాగ్దానంనుండి బెసకనివ్వలేదు, పోతే వారిలో అధిక సం ఖ్యాకులు యిప్పటికీ పూర్వ నిశ్చితాభిప్రాయాలకు ఎంతగా దాసులై ఉన్నారంటే, ఏ జిల్లా లలోనైతే విప్లవకారులు మిక్కిలి బలంగా ఉన్నారో, సరిగా ఆ జిల్లాలలోనే రైతుజనసముదా యం బాహాటంగా బోనపార్ట్‌కి అనుకూలంగా ఓటుచేశారు. వారి దృష్టిలో, జాతీయ సభ బోనపార్ట్‌ను పురోగమించకుండా నిరోధించింది. బోనపార్ట్ యిప్పుడు, పట్టణాలు గ్రామీణ ప్రాంతాల యిచ్ఛపై ఏ శృంఖలాలనైతే విధించాయో వాటిని కేవలం త్రెంచివేశాడంతే. కొన్ని ప్రాంతాల్లోనైతే రైతులు నెపోలియన్‌తోబాటు కన్వెన్షన్[114] కూడ ఉండాలన్న విడ్డూరమైన అభిప్రాయాన్ని సైతం కలిగివున్నారు.

ప్రథమ విప్లవం రైతులను అర్ధ భూదాసుల స్థితినుండి స్వేచ్ఛాయుత భూయజమానుల స్థితికి మార్చినతర్వాత, యిప్పుడిప్పుడే తమ చేతుల్లోకి వచ్చిన ఫ్రాన్సు దేశపు భూమిని నిరా ఘాటంగా వారు అనుభవించడానికీ, ఆస్తిసంపాదనపట్ల తమకు గల నవయువాభిరుచిని వారు సంతృప్తిపరచుకొనేందుకూ అవసరమైన షరతులను నెపోలియన్ రూఢిపరచి నియమ బద్ధం చేశాడు. కాని యీనాడు ఏది ఫ్రెంచి రైతు వినాశానికి కారణభూతమవుతున్నదో అది అతని చిన్న కమతం, భూమి విభజనా, ఫ్రాన్సులో నెపోలియన్ స్థిరపరిచిన ఆస్తిరూపమే. ఫ్యూడల్ రైతును చిన్న కమతపు యజమానినీ, నెపోలియన్‌ను ఒక చక్రవర్తినీ చేసినది కచ్చి

తంగా భౌతిక పరిస్థితులేతప్ప మరేమీ కాదు. వ్యవసాయం నానాటికీ క్షీణించడం, వ్యవసాయదారుడు నానాటికీ రుణగ్రస్తుడు కావడం — తప్పనిసరైన యీ పరిణామసృష్టికి రెండు తరాలు సరిపోయాయి. 19వ శతాబ్దారంభంలో ఫ్రెంచి గ్రామీణ జనంయొక్క విముక్తికీ ధనసంపత్తికీ ఏదైతే కారణభూతమైనదో, ఆ "నెపోలియనిక్" ఆస్తి రూపం, అదే యీ శతాబ్దిక్రమంలో వారి దాసత్వానికీ, దారిద్ర్యానికీ సంబంధించిన నియమంగా తయారైంది. సరిగా "idées napoléoniennes"*లో సరిగా యీ నియమమే మొదటిది, దీన్నే రెండవ బోనపార్ట్ నిలిపివుంచాల్సివుంది. ఒకవేళ అతను రైతులతోబాటు, వారి వినాశానికి మూలకారణం యీ చిన్న కమతపుటాస్తిలో కాక దానికి వెలుపలనే ఉన్నదనీ, ద్వితీయ ప్రాధాన్యం కలిగిన పరిస్థితులలో ఉన్నదనే యిప్పటికీ భ్రమలో ఉన్నట్లయితే, అతని ప్రయోగాలు ఉత్పత్తి సంబంధాలతో సంపర్కంలోకి రాగానే నీటి బుడగల్లాగా భగ్నమైపోతాయి.

చిన్న కమతాల ఆస్తికి సంబంధించిన ఆర్థికాభివృద్ధి సమాజంలోని యితర వర్గాలతో రైతుల సంబంధాన్ని సమూలంగా మార్చివేసింది. నెపోలియన్ పాలనలో, గ్రామసీమలో జరిగిన చిన్న ఖండాలుగా భూవిభజన పట్టణాలలోని స్వేచ్ఛాయుత పోటీకీ, పెద్ద పరిశ్రమల ఆవిర్భావానికీ సంపూరకంగా పని చేసింది. రైతువర్గం, అప్పుడప్పుడే కూలద్రోయ్యబడిన భూస్వామ్య ప్రభువర్గానికి సర్వవ్యాపిత నిరసన. ఫ్రెంచిగడ్డపై చిన్న కమతాల ఆస్తి గాఢంగా వేళ్లూనుకోవడంతో ఫ్యూడలిజానికి పోషకాహారం బొత్తిగా లేకుండాపోయింది. చిన్న కమతాల సరిహద్దురాళ్ళు, బూర్జువాలకు సంబంధించినంతవరకు, వారిని భూమియొక్క పూర్వ మహా ప్రభువుల ఆకస్మిక దాడినుండి కాపాడే రక్షాదుర్గాలయ్యాయి. కాని 19వ శతాబ్దక్రమంలో ఫ్యూడల్ ప్రభువుల స్థానాన్ని పట్టణవాసపు వడ్డీవ్యాపారస్తులు ఆక్రమించారు; భూమితో ముడివడివున్న ఫ్యూడల్ నిర్బంధ శ్రమ స్థానాన్ని తనఖా ఆక్రమించింది; ప్రభువర్గీయ భూమి ఆస్తి స్థానాన్ని బూర్జువా పెట్టుబడి ఆక్రమించింది. రైతుయొక్క చిన్న భూకమతం యిప్పుడు, నేలనుండి లాభాలను, వడ్డీని, కౌలును గుంజుకోవడానికి పెట్టుబడిదారుకి ఒక మాటు మాత్రమే, ఇప్పుడతను భూమిని దున్నే రైతుకే, అతను దానినుంచి తన వేతనాలను సంపాదించుకోవడానికిగాను, వదిలేస్తున్నాడు. ఫ్రాన్సుయొక్క సేద్యపుభూమిపై వున్న తనఖా బాకీలపై ఫ్రెంచి రైతాంగం చెల్లించాల్సివస్తున్న వడ్డీమొత్తం బ్రిటన్‌యొక్క మొత్తం జాతీయరుణంపై ఏటా చెల్లించబడుతున్న వడ్డీమొత్తానికి సమానంగా వుంది. చిన్న భూకమతపుటాస్తి, తన అభివృద్ధితోబాటే అనివార్యంగా పెట్టుబడికి దాస్యమనే ఉచ్చులో చిక్కుకొని, ఫ్రాన్సుయొక్క బహుళ జనసముదాయాన్ని గుహా నివాసులుగా మార్చివేసింది. ఒక కోటీ అరవై లక్షలమంది రైతులు (స్త్రీలు, బాలబాలికలతోబాటు) గుహలవంటి గుడిసెల్లో

* "నెపోలియన్ భావాలు." — సం.

నివసిస్తున్నారు, వాటిలో అధిక సంఖ్య గుడిసెలు కేవలం ఒక్క కిటికీ మాత్రమే కలిగినవి, మిగిలినవి రెండు, అన్నింటికన్న మంచివైతే మూడు కిటికీలు మాత్రమే కలిగివుంటాయి. మస్తిష్కానికి పంచజ్ఞానేంద్రియాలు ఎలాంటివో యింటికి కిటికీలు అలాంటివి. శతాబ్దారంభంలో కొత్తగా అవతరించిన ఏ చిన్న కమతానికి రాజ్యయంత్రాన్ని కావలిగా పెట్టి, దాని ఘనతను కీర్తించి, దానికి పుష్టిని చేకూర్చిందో ఆ బూర్జువా వ్యవస్థ, యీనాడు దాని రక్తాన్నీ, మెదడునూ పీల్చివేసి, పెట్టుబడి అనే మరుగుతున్న స్వర్ణకారి ద్రావకపు గంగాళంలోకి విసిరి పారవేసే రక్తపిపాసియైన పిశాచంగా తయారైంది. Code Napoléon యీనాడు జప్తులకూ, నిర్బంధపు అమ్మకాలకూ, బలాత్కారపు వేలాలకూ సంబంధించిన ఒక పుస్తకం తప్ప మరేమీ కాదు. ప్రభుత్వ అంచనాల మేరకే ఫ్రాన్సులో వున్న నలభై లక్షలమంది (పిల్లలు మొదలైన వారితోబాటు) బికారులు, తిరుగుబోతులు, నేరస్తులు, వేశ్యలకు అస్తిత్వ పుటంచులో కొట్టుమిట్టాడుతున్న మరో యాభై లక్షలమందిని జతచెయ్యాల్సివుంటుంది. వీరు గ్రామీణ ప్రాంతంలో బతుకులను వెళ్లమారుస్తూనైనా వుంటారు, లేక తమ చింకి పాతలతో, చిన్న పిల్లలతో నిరంతరాయంగా పల్లెప్రాంతాన్ని వదలి పట్టణాలకూ పట్టణాలను వదలి పల్లెప్రాంతాలకూ బిచాణా ఎత్తేస్తూవుంటారు. అందుచేత రైతుల ప్రయోజనాలు, నెపోలియన్ కాలంలో మాదిరిగా, బూర్జువావర్గ ప్రయోజనాలకూ, పెట్టుబడి ప్రయోజనాలకూ అనుకూలంగా యికనెంతమాత్రమూ లేవు, సరికదా వాటికి ప్రతికూలంగా ఉన్నాయి. అందుకనే రైతులు, ఏ వర్గపు కర్తవ్యం బూర్జువా వ్యవస్థను కూలద్రొయ్యడమో ఆ పట్టణ ప్రాంతపు శ్రామికవర్గాన్ని, తమ సహజ మిత్రునిగాను, నాయకునిగాను స్వీకరిస్తారు. కాని శక్తివంతమూ, నిరంకుశమూ అయిన ప్రభుత్వంపైన — యిదే రెండవ "idée napoléonienne," దీనినే రెండవ నెపోలియన్ అమలు జరపాల్సివుంది — యీ "భౌతిక" వ్యవస్థనే బలప్రయోగంతో పరిరక్షించాల్సిన బాధ్యత పడింది. ఈ "ordre matériel,"* తిరుగుబాటుదారులైన రైతులకు వ్యతిరేకంగా బోనపార్ట్ యొక్క అన్ని ప్రకటనల్లోనూ నినాదప్రాయంగా ఉంటూవచ్చింది.

పెట్టుబడిచేత తనఖాలో బంధింపబడటంతోబాటు, చిన్నకమతం పన్నుల భారాన్ని కూడా వహించాల్సివుంటుంది. ఉద్యోగి బృందానికి, సైన్యానికి, మతగురువులకు, కోర్టులకు, ఒక్క మాటలో, కార్యనిర్వాహకాధికారానికి సంబంధించిన సమస్త యంత్రాంగానికీ పన్నులే జీవాధారం. పటిష్టమైన ప్రభుత్వమూ భారీ పన్నులూ అభిన్నమైనవి. చిన్నకమతాల రూపంలో వున్న ఆస్తి స్వభావసిద్ధంగానే, సర్వశక్తివంతమూ, అసంఖ్యాకమూ అయిన ఉద్యోగిబృందానికి అనువైన ప్రాతిపదికను రూపొందిస్తుంది. అది దేశవ్యాపితంగా సమాన స్థాయి సంబంధాలనూ,

---

* భౌతిక వ్యవస్థ. — సం.

వ్యక్తులనూ సృష్టిస్తుంది. కాగా అది యీ సమరూప సముదాయంయొక్క ప్రతి ఒక బిందువుపైనా అత్యున్నతమైన ఒక కేంద్రంనుంచి సమరూప కార్యాచరణనుకూడా సంభవం చేస్తోంది. జనసముదాయానికీ రాజ్యాధికారానికీ మధ్య ప్రభువర్గ దళారీలను అది అంతంచేస్తుంది. అందుచేత, అది అన్ని దిశలనుంచీ యీ రాజ్యాధికారపు ప్రత్యక్ష జోక్యాన్నీ, దాని సన్నిహిత అంగాల మాధ్యస్థాన్నీ ఆహ్వానిస్తుంది. చివరి సంగతేమిటంటే, అది నిరుద్యోగుల అదనపు జనాభాను తయారుచేస్తుంది, యీ జనాభాకు గ్రామసీమలోగాని పట్టణాల్లోగాని చోటుండదు, పర్యవసానంగా యిది, ఒక రకమైన గౌరవనీయ భిక్షుకవృత్తి మాదిరిగా ప్రభుత్వ నౌకరీలకోసం చేతులు జాపుతుంది, కొత్త ప్రభుత్వోద్యోగాల సృష్టిని ప్రేరేపిస్తుంది. నెపోలియన్ బయనెట్ల బలంతో కొత్త మార్కెట్లను ఆవిష్కరించడంద్వారా, యూరప్ ఖండాన్ని దోచుకొని, నిర్బంధపు పన్నులను వడ్డీతో తిరిగిచెల్లించాడు. ఈ పన్నులు రైతులు పరిశ్రమ చెయ్యడానికి ప్రేరణనిస్తూండేవి, కాగా అవే యిప్పుడు అతని కృషియొక్క తుది సాధన సంపత్తులను దోచుకొని, కటికదారిద్ర్యాన్ని నిరోధించగల వారి శక్తిని పూర్తిగా హరిస్తోంది. రెండవ బోనపార్ట్‌కి సంబంధించినంతవరకు మంచి దుస్తులు ధరించి, మంచి తిండి తినే విస్తృతమైన ఉద్యోగి బృందమే "idée napoléonienne"లోకెల్ల మిక్కిలి అనుకూలమైనది. సమాజపు వాస్తవ వర్గాలతోబాటు అతను ఒక కృత్రిమ కులాన్ని సృష్టించవలసిన పరిస్థితిలో పడినప్పుడు, అతని రాజ్యాన్ని కొనసాగించడం ఆ కులానికి సంబంధించినంతవరకు రోజువారీ తిండికి సంబంధించిన సమస్య అయినప్పుడు అది యిలా కాక మరెలా వుండగలుగుతుంది? అందుకనే, అతను చేబట్టిన తొలి ఆర్థికచర్యల్లో ఒకటి ఉద్యోగుల జీతాలను వాటి పాత స్థాయికి పెంచడం, పనిపాటల్లేని కొత్త ఉద్యోగాలను సృష్టించడం.

మరొక "idée napoléonienne" ఏమిటంటే ప్రభుత్వాధికారానికి ఒక సాధనం రూపంలో మతగురువులను వాడుకోవడం. కాని సమాజంతో సామరస్యపూర్వకమైన సంబంధం కలిగి, ప్రకృతి శక్తులపై ఆధారపడి తమకు పైనుండి రక్షణ యిస్తున్న అధికారానికి వశ్యమైయుండే కొత్తగా అవతరించిన చిన్నకమతందార్లు సహజంగానే మతదృష్టి కలిగివున్నారు, తద్భిన్నంగా రుణభారంతో చితికిపోయిన, సమాజానికీ, ప్రభుత్వాధికారానికీ విరుద్ధంగా వున్న, తమ నాలుగుగోడల పరిధినుంచి బయటకు వెళ్లగొట్టబడిన చిన్నకమతందార్లు సహజంగానే మతవైముఖ్యం కలిగివుంటారు. కొత్తగా పొందిన చిన్నకమతానికితోడు భగవంతుడిని కూడా పొందడం సంతోషదాయక విషయం, భగవంతుడే వర్షాన్ని ప్రసాదిస్తాడు కనుక యిది ప్రత్యేకించి మరింత సంతోషకర విషయం. కాని చిన్నకమతాన్ని లాగేసి దానికి ప్రత్యామ్నాయంగా మతాన్ని ముందుకు నెట్టినప్పుడు అది చేదు మాత్రయే అవుతుంది. అటువంటి సందర్భంలో మతగురువు ప్రాపంచిక పోలీసుయొక్క మత ప్రతిష్ఠితమైన వేటకుక్క — మరో "idée napoléonienne" — మాత్రమే అవుతాడు.

రోమ్‌కి దండయాత్ర మరో సారి ఫ్రాన్సులోనే సంఘటితరూపం దాలుస్తుంది, అయితే శ్రీమాన్ మొంటలెంబేర్ అనుకుంటున్నదానికి భిన్నంగా అది సంభవిస్తుంది.

చివరి సంగతేమిటంటే, సైన్యంయొక్క ప్రాధాన్యతే "idées napoléoniennes" యొక్క చరమ అవధి. సైన్యం చిన్న కమతాల రైతులకు point d'honneur,* వారికి తమ సొంత వీరత్వానికి ప్రతిరూపం, బాహ్య శత్రువులనుండి తమకు కొత్తగా సంక్రమించిన ఆస్తిని రక్షించేది, వారు కొత్తగా సంపాదించుకున్న జాతీయ ఏకత్వాన్ని గౌరవాన్వితం చేసేది, ప్రపంచాన్ని కొల్లగొట్టేది, విప్లవాత్మకం చేసేది. సైనిక యూనిఫారమే వారి నిజ అధికారిక దుస్తులు, యుద్ధమే వారి కావ్యం; వారి మనోఫలకంపై విస్తృతమూ, పూర్ణ రూపమూ ధరించిన ఆ చిన్నకమతమే వారి పితృభూమి, వారి ఆస్తిభావానికి ఆదర్శరూపమే వారి దేశభక్తి. కాని ఫ్రెంచి రైతు యిప్పుడు ఎవరినుంచి తన ఆస్తిని కాపాడుకోవలసివున్నదో వారు కజాక్‌లు కారు, వారు కోర్టు అమీనాలు, పన్నులు వసూలుచేసే అమలుదార్లు. చిన్న కమతంయొక్క అస్తిత్వం యిప్పుడు పితృభూమి అనబడేదానిలో కాక తనఖాబాకీల కాతా పుస్తకంలో వుంది. సైన్యం కూడా యిప్పుడు శ్రేష్ఠమైన రైతుయువకుల సైన్యంగా లేదు, అది నికృష్ట రైతాంగపు వర్గభ్రష్టబికారి గాలి మూకకు చెందినదిగా తయారైంది. రెండవ బోనపార్ట్ తను స్వయంగా ఏ విధంగానైతే నెపోలియన్‌యొక్క నామ్‌కే వాస్తే వ్యక్తి, ప్రత్యామ్నాయ వ్యక్తియో అలాగే యీ సైన్యం నామ్‌కే వాస్తే సైనికులతోనూ, ప్రత్యామ్నాయ వ్యక్తులతోనూ కూడివుంది. ఇప్పుడు దాని శౌర్యం, లేళ్ల గుంపును వేటకుక్కలు వెన్నంటి వేటాడినట్లుగా రైతులను వెన్నంటి వేటాడటంలోనూ, సాయుధ పోలీసు డ్యూటీ చెయ్యడంలోనూ యిమిడివుంది. ఒకవేళ యీ వ్యవస్థలోని అంతర్వైరుధ్యాల తాకిడి మూలంగా డిసెంబరు 10 సంఘపు సర్దారు ఫ్రాన్సు సరిహద్దును దాటి బయటకు పోవలసివచ్చినట్లయితే, అతని సైన్యం, కొన్ని దారిదోపిడి చర్యల అనంతరం, కీర్తినిగాక దేహశుద్ధిని పొందుతుంది.

అందుకని, అన్ని "idées napoléoniennes" కూడా తరుణ స్వచ్ఛమైన, అవికసితమైన చిన్నకమతంయొక్క భావాలేతప్ప వేరు కాదు; ఎందుకంటే కాలంచెల్లిపోయిన ఆ చిన్న కమతానికి సంబంధించినంతవరకు అవి బొత్తిగా అసంగతమైనవి. అవి దాని మరణ సంఘర్షణకు సంబంధించిన చిత్తభ్రమలు, నినాదాలుగా పరివర్తితంచెయ్యబడిన మాటలు, ప్రేతాలుగామారిన ఆత్మలు మాత్రమే. కాని సామ్రాజ్యంయొక్క యీ వికటానుకరణ ఫ్రెంచి జాతియొక్క జనసముదాయాన్ని సంప్రదాయ భారంనుంచి విముక్తంచెయ్యడానికీ, రాజ్యాధికారానికీ సమాజానికీ మధ్య వ్యతిరేకతను విశుద్ధ రూపంలో ప్రవేశపెట్టడానికీ అవసరమైంది. చిన్నకమతపుటాస్తి నానాటికీ దిగనాసిల్లడంతో దానిపై నిర్మింపబడిన రాజ్య

* గౌరవానికీ, హుందాతనానికీ సంబంధించిన అంశం. — సం.

రూపం కూలిపోతుంది. ఆధునిక సమాజానికి అవసరమైన రాజ్య కేంద్రీకరణ ఫ్యూడలి జానికి వ్యతిరేకంగా సంఘటితంచెయ్యబడిన సైనిక నిరంకుశాధికార ప్రభుత్వ యంత్రాంగపు శిథిలాలపైన మాత్రమే ఉద్భవిస్తుంది.*

ఫ్రెంచి రైతుల పరిస్థితిని పరిశీలించినప్పుడు, డిసెంబరు 20, 21 తేదీల నాటి సాధారణ ఎన్నికలకు — రెండవ బోనపార్ట్‌ను సినాయ్ పర్వత శిఖరాగ్రం[115] పైకి, శాసనాలు పొందేవాడుగాకాక, జారీచేసేవాడుగా తీసుకెళ్ళిన ఎన్నికలకు — సంబంధించిన చిక్కుప్రశ్నకు మనకు సమాధానం లభిస్తుంది.

బూర్జువావర్గానికి బోనపార్ట్‌ను ఎన్నుకోవడంతప్ప వేరే గత్యంతరం లేదన్న సంగతి యిప్పుడిక సుస్పష్టంగా తేలిపోయింది. కాన్‌స్టన్స్ కౌన్సిల్[116] పోపులయొక్క దురాచార పూరితమైన జీవితాలనుగురించి ఫిర్యాదుచేసి, నైతిక సంస్కరణావశ్యకతనుగురించి మొత్తుకు న్నప్పుడు, కార్డినల్ ప్యేర్ డి అయ్యీ వారిని యిలా అదిలించాడు: "సాక్షాత్తూ సైతాను స్వయంగా దిగివచ్చి మాత్రమే యిప్పుడిక కేథలిక్ చర్చిని కాపాడగలడు, కాని మీరేమిటో దేవతలు కావాలంటున్నారు." సరిగా అదే విధంగా, రాజకీయ కుట్ర అనంతరం, ఫ్రెంచి బూర్జువా వర్గం యిలా అరిచింది. కేవలం డిసెంబరు 10 సంఘపు సర్దారు మాత్రమే యిప్పుడిక బూర్జువా సమాజాన్ని కాపాడగలడు! దొంగతనం మాత్రమే ఆస్తిని, కూటసాక్ష్యం మాత్రమే మతాన్ని, వ్యభిచారం కుటుంబాన్ని, అవ్యవస్థ వ్యవస్థని కాపాడగలదన్నమాట!

తనకు తాను ఒక స్వతంత్ర శక్తి రూపాన్నిచ్చుకున్న కార్యనిర్వాహకాధికారం మాదిరిగానే, "బూర్జువా వ్యవస్థ"ను పరిరక్షించడానికే తను అవతరించినట్లు బోనపార్ట్ భావిస్తాడు. ఈ బూర్జువా వ్యవస్థయొక్క బలం మధ్యతరగతిపై ఆధారపడివుంది. అందుకని అతను, తనను తాను మధ్యతరగతి ప్రతినిధిగా పరిగణించుకొని, అదే అర్థంలో తన ఉత్తరువులను

---

* 1852 ముద్రణలోని యీ పేరా — దీన్ని 1869 ముద్రణలో మార్క్స్ తొలగించాడు — యీ క్రింది పంక్తులతో ముగిసింది: "రాజ్యయంత్రాన్ని తుత్తునియలు చేసినందు వల్ల కేంద్రీకరణకు ప్రమాదం వాటిల్లదు. ప్రభుత్వోద్యోగబృందం కేంద్రీకరణకు సంబంధించిన నిమ్న మొరటు రూపం మాత్రమే, అది తన ప్రతిద్వంది అయిన ఫ్యూడలిజంతో యీ నాటికీ ప్రభావితమై వుంది. ఫ్రెంచి రైతు నెపోలియనీయ పునరుద్ధరణపట్ల నిరాశ చెందినప్పుడు, చిన్నకమతంలో తనకుగల నమ్మకాన్ని అతను విసర్జిస్తాడు, యీ చిన్నకమతంపై నిర్మితమైన రాజ్యానికి సంబంధించిన యావత్తు భవనమూ నేలకూలిపోతుంది, ఏ ఏకగ్రీవత లేనిదే తన ఏకాంత గీతం అన్ని రైతాంగ దేశాల్లోనూ తన మృత్యుపూర్వ అంతిమ గీతమవుతుందో ఆ ఏకగ్రీవతను శ్రామిక వర్గ విప్లవం పొందుతుంది. — సం.

జారీచేస్తాడు. కాని, అతనొక గణనీయుడైన వ్యక్తిగా జమలోకివస్తున్నాడంటే యీ మధ్య తరగతియొక్క రాజకీయాధికారాన్ని అతను భగ్నంచేసి యుండటం, దాన్ని నిత్యం తిరిగి కొత్తగా భగ్నంచెయ్యడమే అందుకు కారణం. పర్యవసానంగా అతను, తనను తాను మధ్యతరగతియొక్క రాజకీయ, ప్రచార శక్తికి వైరిగా పరిగణించుకుంటాడు. కాని ఆ వర్గపు భౌతికశక్తిని కాపాడ టంద్వారా, అతను దాని రాజకీయశక్తిని మరల కొత్తగా ఆవిర్భవింపజేస్తాడు. కారణాన్ని రక్షించు, కాని కార్యం, అది ఎక్కడ వ్యక్తమైనాసరే, దాన్ని నాశనంచెయ్యి. కాని, అలా చెయ్యడంవల్ల కార్యకారణాల మధ్య ఎంతోకొంత గందరగోళం లేకుండా ఉండజాలదు. ఎందుకంటే పరస్పర క్రియద్వారా అవి రెండూకూడా తమ విశిష్టలక్షణాలను కోల్పోతాయి. అందుకనే వాటిమధ్య సరిహద్దురేఖను చెరిపివేసే కొత్త ఉత్తరువులు వెలువడుతాయి. బూర్జువా వర్గానికి ప్రతిగా బోనపార్ట్ తనను తాను, ఏకకాలంలో రైతుల ప్రతినిధిగాను, సాధారణ జనసామాన్యపు ప్రతినిధిగాను — బూర్జువా సమాజపు చట్రంలోపల క్రిందివర్గాల ప్రజలను సుఖవంతులను చెయ్యాలని కోరుకొనేవానిగా పరిగణించుకొంటాడు. అందుకనే రాజ్య నిర్వ హణలో "అసలైన సోషలిస్టుల"[117] పాత్రకు ముందే సున్నాచుట్టే ఉత్తరువులు జారీచెయ్య బడ్డాయి. కాని, బోనపార్ట్ అన్నిటికన్న ఎక్కువగా తనను తాను డిసెంబరు 10 సంఘపు సర్దారుగా, వర్గభ్రష్టబికారి గాలిమూక ప్రతినిధిగా పరిగణించుకుంటాడు. అతను, అతని దర్బారీయులు, అతని ప్రభుత్వం, అతని సైన్యమూ కూడా దానికే చెందుతారు, వారికిగల మిక్కిలి పెద్ద లక్ష్యం తమకు తాము లాభాలు చేకూర్చుకోవడం, రాజ్యకోశంనుంచి కాలిఫోర్నియా లాటరీబహుమతులు పొందడం. డిసెంబరు 10 సంఘపు సర్దారుగా ఉత్తరువులతో, ఉత్త రువులు లేకుండా, ఉత్తరువుల ఉల్లంఘనం చేసికూడా అతను తన స్థితిని విజయవంతంగా సార్థకంచేసుకొంటున్నాడు.

ఈ మనిషిముందు యిటువంటి పరస్పరవిరుద్ధ కార్యభారం ఉన్నకారణంగానే అతని ప్రభుత్వంలో పరస్పర వైరుధ్యాలున్నాయి, అది అంధకారంలో గందరగోళంగా తడువులాడు కుంటున్నది, ఒకమారు ఒక వర్గాన్నీ, వేరొకమారు మరొక వర్గాన్నీ అవమానించి, వాటన్నింటినీ ఒకేవిధంగా తనకు వ్యతిరేకం చేసుకుంది; ఆచరణలో దాని అనిశ్చితత్వం ప్రభుత్వ ఉత్తరువుల శైలి — యీ శైలి పెదతండ్రినుండి అది తుచ తప్పకుండా అనుసరించినది — వీటిమధ్య అత్యంత హాస్యాస్పదమైన వార వుంది.

సుదృఢ ప్రభుత్వంక్రింద పరిశ్రమ, వర్తకం అంటే మధ్యతరగతి వ్యాపారవ్యవహారాలు కృత్రిమంగా కల్పింపబడిన అనుకూల వాతావరణంలో మొక్కలు పెంచబడిన మాదిరిగా అభివృద్ధిచెయ్యబడుతున్నాయి. రైల్వే నిర్మాణానికి సంబంధించి అసంఖ్యాకమైన కంట్రాక్టులు యివ్వబడుతున్నాయి. కాని బోనపార్టిస్టు వర్గభ్రష్టబికారి గాలిమూక కూడా తనను తాను సం పన్నం చేసుకోవలసివుంది. ఈ ఉద్దేశంతోనే రైల్వేకి సంబంధించి స్టాక్ ఎక్స్చేంజిలో లోపాయికారీ

కిలాడీ సాగింది. కాని రైల్వేల నిర్మాణానికిగాను పెట్టుబడి ఏమీ చేతికి రావడంలేదు. రైల్వే షేర్లపై అడ్వాన్సు యివ్వాల్సిన బాధ్యత బ్యాంకుపై పడింది. కాని అదే సమయంలో, బోనపార్ట్ బ్యాంకును వ్యక్తిగత ప్రయోజనాలకోసం వాడుకోవలసివుంది, అందుకని దాన్ని బుజ్జగించడం అవసరం. అందుకని వారంవారం తన నివేదికను సమర్పించాల్సిన బాధ్యత నుండి బ్యాంకు మినహాయింపబడింది. అధికభాగం తనకు చెందేవిధంగా ప్రభుత్వంతో బ్యాంకు చేసుకున్న లాభసాటి ఒప్పందం యిది. జనానికి పనులు చూపించాలి. అందుకని పబ్లిక్ వర్క్స్ చేపట్టబడ్డాయి. కాని యీ పబ్లిక్ వర్క్స్ మూలంగా జనంపై పన్నులభారం పెరుగుతుంది. అందుకని పెట్టుబడులపై వచ్చే రాయితీని అనుభవించే వారిపై దెబ్బతీసి, 5 శాతం బాండ్లను 4.5 శాతానికి మార్చి, పన్నులను తగ్గించారు. కాని బూర్జువావర్గానికి తిరిగి ఏదోఒక రాయితీని యివ్వాల్సివుంది. అందుకని సారాయిని en détail* తాగే జనసామాన్యానికి సారా పన్నును రెట్టింపుచేసి, en gros** తాగే మధ్యతరగతికి సారా పన్నును సగానికిసగం తగ్గించారు. ఉన్న కార్మిక సంఘాలు రద్దుచెయ్యబడ్డాయి, కాని భవిష్యత్తులో ప్రారంభింపబడబోయే సంఘాలకు సంబంధించిన అద్భుతాలు వాగ్దానం చెయ్యబడ్డాయి. రైతులకు సహాయం చెయ్యాల్సివుంది. అందుకని భూమి తనఖా బ్యాంకులు — వారు రుణాల్లో కూరుకుపోయే క్రమాన్ని త్వరితంచేసి, ఆస్తికేంద్రీకరణ క్రమాన్ని వేగవంతంచేసే బ్యాంకులు — నెలకొల్పబడ్డాయి. కాని యీ బ్యాంకులు ఆర్లియన్స్ రాజవంశపు జప్తుచేసుకోబడిన జమీలనుండి ధనాన్ని ఉత్పత్తిచేసేందుకు వినియోగింపబడాలి. ఉత్తరువులో లేని యీ షరతుకు ఏ పెట్టుబడిదారూ అంగీకరించడు, అందుకని భూమితనఖా బ్యాంకు ఉత్తరువు కాగితంగానే ఉండిపోతుంది, వగైరా, వగైరా.

అన్ని వర్గాలూ తనను పితృతుల్య హితైషిగా పరిగణించాలని బోనపార్ట్ కోరుకున్నాడు. కాని అతను ఒక వర్గంనుంచి తీసుకోకుండా మరో వర్గానికి యివ్వలేడు. ఫ్రాండ్ కాలంలో డ్యూక్ ఆఫ్ గిజ్ ఫ్రాన్సు మొత్తంలోనే అధిక అనుగ్రహశీలియైన వ్యక్తిగా పేర్కొనబడుతూ వచ్చాడు — ఎందుకంటే అతను తన జమీలన్నింటినీ తన అనుయాయుల వినియోగార్థం మార్చివేశాడు — అదే విధంగా బోనపార్ట్ కూడా ఫ్రాన్సు అంతట్లోనూ అధిక అనుగ్రహశీలియైన వ్యక్తిగా ఉండాలనీ ఫ్రాన్సుయొక్క ఆస్తినంతటినీ, శ్రమనంతటినీ తన సొంత వినియోగార్థం మార్చుకోవాలనీ కోరుకుంటాడు. యావత్తు ఫ్రాన్సునూ — దాన్ని తిరిగి ఫ్రాన్సుకు బహూకరించగలిగేందుకు గాను, వేరే మాటల్లో చెప్పాలంటే, ఫ్రెంచి ధనంతోనే ఫ్రాన్సును మరల కొనగలిగేందుకుగాను — తస్కరించాలన్నది అతని కోరిక, ఎందుకంటే,

* చిల్లరగా. — సం.

** టోకుగా. — సం.

డిసెంబరు 10 సంఘపు సర్దారుగా ఏ వస్తువైతే తనది కావలసివుందో దాన్ని సైతం అతను ధనం చెల్లించి కొనడం అతని ప్రవర్తనలో ఒక భాగం. కాగా సకల రాజ్య సంస్థలూ: సెనేట్, ప్రభుత్వ సలహా సమితి, శాసన నిర్మాణ సంస్థ, లీజియన్ ఆఫ్ ఆనర్ పతకం, సైనిక పతకాలు, లాండ్రీలు, పబ్లిక్ వర్క్సు, రైల్వేలు, నేషనల్ గార్డుయొక్క జనరల్ స్టాఫ్ (సాధారణ సైనికులు మినహాగా), ఆర్లియన్స్ రాజవంశంయొక్క జప్తుచెయ్యబడిన జమీలు — యివన్నీకూడా కొనుగోలువ్యాపారానికి సాధనాలయ్యాయి. సైన్యానికీ, ప్రభుత్వ యంత్రాంగానికీ సంబంధించిన ప్రతి ఉద్యోగమూ కొనుగోలు సాధనమైంది. ఏ క్రమంలోనైతే తనను తాను పొందేందుకుగాను ఫ్రాన్సు తీసుకొనబడుతుందో ఆ క్రమానికి సంబంధించిన ముఖ్య లక్షణం ఏమిటంటే, యీ మొత్తం వ్యవహార కాలంలో డిసెంబరు 10 సంఘపు సర్దారుయొక్క, సభ్యులయొక్క జేబుల్లోకి వేర్వేరు శాతాల్లో కమిషన్లు చేరుకోవడమే. మోర్నీ ప్రియురాలైన కౌంటెస్ ఎల్. డ్యూక్ ఆఫ్ ఆర్లియన్స్ జమీల జప్తును గురించి అన్న "C'est le premier vol de l'aigle* అనే శ్లేషాత్మకమైన వాక్యం, యీ రాబందుకి — యిది రాబందుగా కన్న ఎక్కువగా మాలకాకిలా కనిపిస్తుంది — సంబంధించిన ప్రతి గగనవిహారానికీ వర్తిస్తుంది. అతను స్వయంగా తనూ, తన అనుయాయులూ ఒకరు మరొకరిని నిత్యం, ఇటలీకి చెందిన కార్తుజియన్, తన దగ్గరున్న ధనాన్ని గర్వంగా ప్రదర్శనపూర్వకంగా లెక్కపెడుతూ అది తన జీవికకు యింకా ఎన్నేళ్లు సరిపోతుందో వర్ణించిచెప్తూవుండిన లోభిని ఉద్దేశించి అన్న మాటలతో, హెచ్చరించుకొంటూ ఉండేవారు. "Tu fai conto sopra i beni, bisogna prima far il conto sopra gli anni."** సంవత్సరాలు ఎంచడంలో తామెక్కడ పొరపడతామోనని, వీళ్లు నిముషాలు ఎంచుతున్నారు. తుంటరిమూక ఒకటి దర్బారులోకి, మంత్రిత్వ కార్యాలయాల్లోకి, ప్రభుత్వ కార్యకలాపాల నిర్వహణయొక్క, సైన్యంయొక్క ప్రముఖ స్థానాల్లోకి దూరుతోంది. ఈ గుంపులోని అత్యుత్తముని సంగతి పరిశీలించినాకూడా, అతని పుట్టుపూర్వోత్తరాలేమిటో ఎవరికీ తెలియదు. ఈ గాలిమూకకి చెందిన ఒక వాగుడుపిట్ట, పరువుమాలినవాడు, దోపిడిగాడైన బలాదూరు వ్యక్తి, సులూక్‌కి చెందిన ఉన్నతాధికారులమాదిరిగా, హాస్యాస్పదమైన పటాటోపంతో జరీ కోట్ల లోకి దూరుతాడు. డిసెంబరు 10 సంఘపు నీతిబోధకుడు వేరోన్ క్రెవేల్*** అన్న సంగతినీ,

---

* "ఇది రాబందుయొక్క మొట్టమొదటి గగనవిహారం (దొంగతనం)." — సం.

** "నువ్వు నీ సంపదను లెక్కపెట్టుకుంటున్నావు, కాని అంతకుముందు నువ్వు భూమి మీద నీకింక ఎన్నేళ్లు నూకలున్నాయో లెక్కపెట్టుకోవడం అవసరం." — సం.

*** ఫ్రెంచి రచయిత బాల్జాక్ "కజిన్ బెట్టి" అనే తన రచనలో క్రెవేల్ అనే పారిస్ వాసియైన కూపస్థమండూకాన్ని అభివర్ణించాడు. బాల్జాక్ తన యీ పాత్రకు "Constitutionnel" యజమాని అయిన డాక్టర్ వేరోన్‌ను నమూనాగా తీసుకున్నాడు. (మార్క్స్ వివరణ.)

గ్రన్యే డి కస్సన్యాక్ దాని చింతనాపరుడన్న విషయాన్నీ గుర్తుచేసుకున్నప్పుడు, యీ సంఘానికి చెందిన పైశ్రేణి వ్యక్తులను విస్పష్టంగా అర్థంచేసుకోగలుగుతాం. గిజో, తన మంత్రి వర్గ కాలంలో, రాజవంశీయ ప్రతిపక్షానికి వ్యతిరేకంగా యీ గ్రన్యేను ఒక రహస్య పత్రికలో వినియోగించినప్పుడు, అతన్ని గురించి హాస్యంగా యిలా అంటుండేవాడు: "C'est le roi des drôles," "ఇతను బఫూన్‌ల చక్రవర్తి." లూయీ బోనపార్ట్‌యొక్క దర్బారును గురించీ, అతని ముఠాను గురించీ ప్రస్తావించేటప్పుడు రీజెన్సీ కాలానికి[118] గాని, 15వ లూయీ కాలానికి గాని దాన్ని ఎవరైనా సరిపోలిస్తే వారు పొరపాటుచేసినవారవుతారు. ఎందుకంటే, "ఫ్రాన్సు ఉంపుడుకత్తెల ప్రభుత్వాన్ని యింతకుముందే అనేకసార్లు చవిచూసింది; కాని యింత వరకెన్నడూ ఉంపుడుకాండ్ర ప్రభుత్వాన్ని చవిచూడలేదు."*

తన పరిస్థితియొక్క పరస్పర విరుద్ధమైన డిమాండ్లచేత ప్రేరితుడై, అదే సమయంలో, కొత్తకొత్త ఐంద్రజాలిక చర్యలద్వారా, నెపోలియన్‌కి ప్రత్యామ్నాయంగా, ప్రజా దృష్టిని ఆకర్షింపచేసుకోవలసిన అవసరానికి వశీభూతుడై, వేరేమాటల్లో చెప్పాలంటే, ప్రతిరోజూ చిల్లర మల్లర రాజకీయ కుట్రను దేన్నో ఒకదాన్ని లేవదియ్యాల్సిన అవసరానికి లొంగి, బోనపార్ట్ యావత్తు బూర్జువా ఆర్థికవ్యవస్థనూ అస్తవ్యస్తంచేస్తున్నాడు, 1848 నాటి విప్లవానికి అనతిక్రమణీయమైనదాన్ని ప్రతిదాన్నీ అతిక్రమిస్తున్నాడు, అలా చెయ్యడంద్వారా విప్లవం విషయంలో కొందరిని సహిష్ణువులుగాను, మరి కొందరిని యిచ్ఛుకులుగాను చేస్తున్నాడు, వ్యవస్థ పేర సిసలైన అరాజకత్వాన్ని సృష్టిస్తున్నాడు. దీనితో బాటే అతను రాజ్యయంత్రానికి సంబంధించిన యావత్తు ఘనతనూ నేలపాలు చేస్తున్నాడు, దాన్ని భ్రష్టంచేస్తున్నాడు, ఏకకాలంలో దాన్ని అసహ్యాకరమూ, హాస్యాస్పదమూ చేస్తున్నాడు. అతను ట్రీయర్ పవిత్ర పరిధాన పూజకు,[119] వికటానుకరణ ప్రాయంగా పారిస్‌లో నెపోలియనీయ సామ్రాజ్యపు పైపచ్చడానికి సంబంధించిన పూజాపద్ధతిని ప్రవేశపెట్టాడు. కాని యీ సామ్రాజ్యపు పైపచ్చడం చిట్టచివరకు లూయీ బోనపార్ట్ భుజం పైకి వచ్చేసరికి నెపోలియన్ కంచువిగ్రహం వెండొమ్ జయస్తంభపు[120] కొసనుండి ఊడి నేలకూలుతుంది.

మార్క్స్‌చేత 1851
డిసెంబరుకీ 1852
మార్చికీ మధ్య రచింపబడింది

న్యూయార్క్‌లోని
"Die Revolution" అనే
పత్రికలో 1852లో
ప్రచురింపబడింది

సంతకం: కార్ల్ మార్క్స్

---

* ఉదహరింపబడిన పదాలు మదామ్ జిరర్డేన్‌వి. (మార్క్స్ వివరణ.)

## వివరణలు

[1] ఇక్కడ, ఈ వ్యాసంలో ఇతర చోట్లలో "కార్ల్ మార్క్స్" అనే వ్యాసానికి లెనిన్ సమకూర్చిన గ్రంథ వివరణ పట్టికకు ప్రస్తావన. ఈ కూర్పులో ఆ పట్టిక వదలి వేయబడింది. – 12.

[2] ఇది మార్క్స్ "హేగెల్ ధర్మవిషయక తత్వశాస్త్ర విమర్శను గురించి పీఠిక" అనే రచనలో యీ క్రింది మాటలకు ప్రస్తావన: "విమర్శ అనే ఆయుధం ఆయుధాలతో విమర్శ స్థానాన్ని సహజంగానే ఎన్నడూ ఆక్రమించజాలదు, ఒక భౌతిక శక్తిని మరో భౌతిక శక్తితోనే కూలదోయాలి, కాని సిద్ధాంతం కూడా, ప్రజా బాహుళ్యపు మనస్సులలో నాటుకుపోయిన తక్షణమే అది ఒక భౌతిక శక్తిగా మారిపోతుంది. – 13.

[3] 1848 ఫిబ్రవరిలో ఫ్రాన్సులో జరిగిన బూర్జువా విప్లవానికి ప్రస్తావన ఇది. – 13.

[4] 1848 మార్చిలో జర్మనీలోనూ, ఆస్ట్రియాలోనూ జరిగిన బూర్జువా విప్లవానికి ప్రస్తావన. – 13.

[5] పెటీబూర్జువా పార్టీ ("మహీధరం" అనబడేది) జరిపిన ప్రజా ప్రదర్శనకు ప్రస్తావన ఇది. 1848 నాటి విప్లవక్రమంలో ప్రవేశపెట్టబడిన చట్టబద్ధ నిబంధనలను అధ్యకుడూ, శాసన సభ మెజారిటీ ఉల్లంఘించినందుకు నిరసనగా ఈ ప్రదర్శన జరిగింది. ప్రభుత్వం ప్రదర్శకులను చెదరగొట్టింది. – 14.

[6] మార్క్స్ రచించిన "1848–50 నాటి ఫ్రాన్సులో వర్గపోరాటం," "లూయీ బోనపార్ట్‌యొక్క బ్రూమేర్ పద్దెనిమిదవ తేదీ," "ఫ్రాన్సులో అంతర్యుద్ధం" అనే గ్రంథాలకు ప్రస్తావన. – 14.

7 ప్రముఖ రష్యన్ సాహిత్య విమర్శకుడు, పత్రికా రచయిత అయిన ఎన్. ఎ. ద్రొబొల్యూబొవ్ సంస్మరణార్థం 19వ శతాబ్దపు ప్రముఖ రష్యన్ కవి ఎన్. ఎ. నెక్రాసొవ్ వ్రాసిన కవితనుండి ఈ గీతభాగం ఉటంకించబడింది. — 16.

8 ఎంగెల్స్ ఆదేశాన్ని అనుసరించి, మార్క్స్ "అదనపు విలువ సిద్ధాంతాలకి" లెనిన్ యీ పేరు పెట్టాడు. "పెట్టుబడి" గ్రంథం రెండవ సంపుటి పీఠికలో ఎంగెల్స్ ఇలా రాశాడు: "గ్రంథం రెండో సంపుటిలోనూ, మూడో సంపుటిలోనూ ఇదివరకే వివరించబడిన అనేక పాఠ్యభాగాలను వదలివేసి, రాతప్రతిలో వున్న విమర్శభాగాన్ని ("అదనపు విలువ సిద్ధాంతాలను" — సం.) "పెట్టుబడి" గ్రంథం నాల్గవ సంపుటిలో ప్రచురించాలని అనుకుంటున్నాను." — 23.

9 ఫ్రాన్సు ఓటమితో అంతమైన ఫ్రెంచి ప్రష్యన్ యుద్ధానికి ప్రస్తావన. — 25.

10 కార్ల్ మార్క్స్ "ఫాయెర్‌బాఖ్ పై సూత్రీకరణలు"ను బ్రస్సెల్స్‌లో, 1845 వసంతంలో రచించాడు. అప్పటికి ఆయన తన చారిత్రక భౌతికవాద సిద్ధాంతపు ప్రధాన రూపు రేఖలను పూర్తిచేసి, మానవ సమాజ విశ్లేషణకు భౌతికవాదాన్ని అన్వయించి వివరించాడు. ఎంగెల్సు మాటల్లో యీ రచన "నూతన ప్రపంచ దృక్పథానికి సంబంధించిన శేముషీ సంపన్నమైన బీజాణువు నిక్షిప్తమొనర్చబడిన తొలి పత్రం" (4వ భాగంలోని "లుడ్విగ్ ఫాయెర్‌బాఖ్, సాంప్రదాయిక జర్మన్ తత్వశాస్త్రం పరిసమాప్తి" చూడండి).

ఫాయెర్‌బాఖ్ భౌతికవాదంలోనూ, అంతకు పూర్వపు భౌతికవాదంలోనూ ఉన్న ప్రధాన లోపాన్ని, అంటే, వాటి ధ్యానపూర్వక స్వభావాన్నీ, మానవుని కార్యాచరణ విప్లవాత్మకమూ, "ఆచరణ రీత్యా విమర్శనాత్మకమూ" అయినదన్న విషయాన్ని గ్రహించ డంలో వాటి వైఫల్యాన్నీ ఈ వ్యాసంలో మార్క్స్ బయటపెట్టాడు. ప్రపంచాన్ని తెలుసుకోవడంలోనూ, దాన్ని మార్చడంలోనూ విప్లవ కార్యాచరణకు గల నిర్ణయాత్మక పాత్రను మార్క్స్ నొక్కిచెప్పాడు. — 35.

11 "కమ్యూనిస్టు పార్టీ ప్రణాళిక" — ఇది శాస్త్రీయ కమ్యూనిజానికి సంబంధించిన తొలి కార్యక్రమం. మార్క్స్ ఎంగెల్సుల మహత్తర బోధలకు సంబంధించిన మూల సూత్రాల సాంగోపాంగ, సువ్యవస్థిత వివేచన యిందులో సమకూర్చబడింది. "ఈ రచనలో ప్రతిభావంతమైన స్పష్టతతోను, శేముషీ సంపన్నతతోను ఒక నూతన ప్రపంచ దృక్పథమూ సుసంగతమైన భౌతికవాదమూ — సామాజిక జీవితక్షేత్రం కూడా దీని పరిధిలోకి వస్తుంది, ప్రతిపాదింపబడ్డాయి. అభివృద్ధికి సంబంధించిన అత్యంత సమగ్రమూ, ప్రగాఢమూ అయిన సిద్ధాంత రూపంలో గతితర్కమూ; వర్గపోరాట సిద్ధాంతంయొక్క,

ఒకానొక నూతన, కమ్యూనిస్టు సమాజ సృష్టికర్త అయిన శ్రామికవర్గంయొక్క ప్రపంచ చారిత్రక విప్లవాత్మక పాత్రకు సంబంధించిన సిద్ధాంతమూ ప్రతిపాదింపబడ్డాయి.

"కమ్యూనిస్టు పార్టీ ప్రణాళిక" పెట్టుబడిదారీ విధాన వినాశంయొక్క, శ్రామిక వర్గ విప్లవ విజయంయొక్క అనివార్యతను శాస్త్రీయంగా రుజువుచేసి, శ్రామికవర్గ విప్లవోద్యమానికి సంబంధించిన కర్తవ్యాలను, లక్ష్యాలను నిర్దేశించింది. – 39.

12 కమ్యూనిస్టు లీగు – మార్క్స్ ఎంగెల్సులచేత స్థాపింపబడిన శ్రామికవర్గపు ప్రథమ అంతర్జాతీయ కమ్యూనిస్టు సంస్థ; ఇది 1848నుండి 1852వరకు ఉంది. – 39.

13 ఫ్రాన్సులో 1848 ఫిబ్రవరి విప్లవానికిది ప్రస్తావన. – 39, 135.

14 "The Red Republican" ("ఎర్ర రిపబ్లికన్") – చార్టిస్టు ఉద్యమానికి చెందిన ఒక వారపత్రిక, 1850 జూన్‌నుండి నవంబరువరకు, ఈ పత్రిక లండనులో ప్రచురింపబడింది. 1850 నవంబరులో యీ పత్రిక తన 21–24 సంచికలలో "కమ్యూనిస్టు ప్రణాళిక" సంక్షిప్తానువాదాన్ని ప్రచురించింది. – 39.

15 1848 జూన్ 23–26 తేదీల్లో పారిస్ కార్మికులు చేసిన వీరోచితమైన తిరుగుబాటుకు ఇది ప్రస్తావన. దీనిలో 40–45 వేలమంది పాల్గొన్నారు. ఫ్రెంచి బూర్జువా వర్గం యీ తిరుగుబాటును అత్యంత పాశవికంగా అణచివేసింది. 1848–1849 సంవత్సరాల్లో యూరప్‌లో జరిగిన విప్లవక్రమానికి యీ తిరుగుబాటు పరాకాష్ఠ. ఈ తిరుగుబాటే శ్రామికవర్గానికీ బూర్జువావర్గానికీ మధ్య జరిగిన తొలి మహా అంతర్యుద్ధం అని లెనిన్ అన్నాడు. – 39, 131.

16 "Le Socialiste" ("సోషలిస్ట్") – 1871 అక్టోబరుకీ 1873 మేకీ మధ్య న్యూయార్కునుండి ఫ్రెంచి భాషలో ప్రచురింపబడిన ఒక వారపత్రిక. అది ఇంటర్నేషనల్‌యొక్క ఉత్తర అమెరికన్ శాఖకు చెందిన ఫ్రెంచి ఉపశాఖల విధాన పత్రిక. హేగ్ మహాసభానంతరం యీ పత్రిక ఇంటర్నేషనల్‌నుండి తన సంబంధాన్ని తెంచివేసుకుంది.

పేర్కొనబడిన "కమ్యూనిస్టు ప్రణాళిక"యొక్క ఫ్రెంచి అనువాదం, 1872 జనవరి, మార్చి మాసాల మధ్య, "Le Socialiste"లో ప్రచురింపబడింది. – 39.

17 1871 నాటి పారిస్ కమ్యూన్ – కార్మికవర్గంయొక్క విప్లవాత్మక ప్రభుత్వం, 1871 మార్చి 28నుండి మే 28వరకు యిది అధికారంలో వుంది. శ్రామికవర్గ

నియంతృత్వానికి సంబంధించిన తొలి చారిత్రకానుభవాన్ని కార్మికవర్గానికి యిది సమకూర్చింది. 1871 మార్చి 18 నాటి శ్రామికవర్గ విప్లవానికీ, తదనంతర దశయైన శ్రామికవర్గ నియంతృత్వానికీ ఈ పదం విస్తృత రూపంలో వాడబడుతోంది. కార్ల్ మార్క్స్ రాసిన "ఫ్రాన్సులో అంతర్యుద్ధం"లో పారిస్ కమ్యూన్ చరిత్రా, దాని సారభూత లక్షణాలూ సవివరంగా విశ్లేషింపబడ్డాయి. (ఈ సంకలనంలో రెండవ భాగం చూడండి.) – 40.

18 కొలోన్‌లో కమ్యూనిస్టులపై కేసు విచారణ (1852 అక్టోబరు 4నుండి నవంబరు 12వరకు) – కమ్యూనిస్టు లీగుకి చెందిన 11 మంది సభ్యులపై ప్రష్యన్ ప్రభుత్వం పెట్టిన కల్పితమైన కేసు విచారణ. నకిలీ పత్రాలు, కూట సాక్ష్యాల ఆధారంగా, పెద్ద రాజ్యద్రోహారోపణ చెయ్యబడిన యీ 11 మందిలోనూ ఏడుగురు నిందితులకి మూడేళ్లనుండి ఆరేళ్లవరకు కఠినమైన దుర్గ కారావాస శిక్ష విధింపబడింది. – 41.

19 పారిస్‌లో 1848 జూన్‌లో జరిగిన తిరుగుబాటుకు యిది ప్రస్తావన. (15వ వివరణ చూడండి.) – 43.

20 ఈ ముందుమాట ఎంగెల్స్ 1890 మే 1న రచించాడు. 1889 జూలైలో పారిస్‌లో జరిగిన రెండవ ఇంటర్నేషనల్ మహాసభ నిర్ణయం మేరకు, ఆ రోజున యూరప్ ఖండానికి చెందిన అనేక దేశాల్లోనూ, అమెరికాలోనూ జన సాముహిక ప్రదర్శనలు, సమ్మెలు, సమావేశాలు నిర్వహింపబడ్డాయి. వాటిలో కార్మికులు 8 గంటల పని దినాన్నీ, ఇంటర్నేషనల్ మహాసభ చేసిన తదితర తీర్మానాలనూ అమల్లో పెట్టాలని డిమాండు చేశారు. తదాదిగా మే ఒకటవ తేదీ ఏటా అన్ని దేశాల కార్మికులచేతా శ్రామికవర్గ అంతర్జాతీయ సంఘీభావ దినంగా జరుపబడుతూ వస్తోంది. – 43.

21 11–13 శతాబ్దాల మధ్య కాలంలో, పశ్చిమ యూరప్‌కి చెందిన బడా ఫ్యూడల్ ప్రభువులు, నైట్‌లు (వీర యోధులు), ఇటాలియన్ వర్తకులు జెరూసలెంలోని దేవాలయాలను, తదితర "పుణ్య క్షేత్రాలను" మహమ్మదీయులనుండి పునరాక్రమించుకొనేందుకుగాను జరపబడిన సైనిక వలసవాద దండయాత్రలకు యిది ప్రస్తావన. ఈ మతయుద్ధాలు ప్రపంచ పెత్తనాన్ని కోరుకున్న కేథలిక్ చర్చిచేతా, పోప్‌చేతా ప్రోత్సహింపబడ్డాయి, సముచితమైనవిగా సమర్థింపబడ్డాయి. ఫ్యూడల్ నిగళాలనుండి విమోచనాన్ని కోరుకున్న రైతులు కూడా యీ మతయుద్ధాల్లో పాల్గొన్నారు. మతవీర యోధులు తాము ఏయే దేశాలను గడిచి వెళ్లారో వాటిలోని మహమ్మదీయ జనాభానే కాకుండా క్రిస్టియన్ జనాభాను కూడా లూటీచేశారు, వారికి వ్యతిరేకంగా బలప్రయోగం జరిపారు. సిరియా,

పాలస్తీనా, ఈజిప్టు, ట్యునీసియా దేశాలలోని మహమ్మదీయ రాజ్యాలే కాకుండా క్రిస్టియన్ మతాన్ని అనుసరించే బైజాంటైన్ సామ్రాజ్యం కూడా వారి లూటీకి గురయ్యాయి. కానైతే తూర్పు మెడిటరేనియన్ ప్రాంతంలో వారి విజయాలు ఎక్కువ కాలం నిలవ లేదు, వారు ఆక్రమించుకొన్న భూభాగాలు మహమ్మదీయులచేత పునరాక్రమించుకోబడ్డాయి. — 48.

22 మార్క్స్ ఎంగెల్సులు తమ తదుపరి రచనల్లో "శ్రమ విలువ," "శ్రమ ఖరీదు" అనే పదాలకు బదులు మార్క్స్‌చేత ప్రవేశపెట్టబడిన "శ్రమశక్తి విలువ," "శ్రమ శక్తి ఖరీదు" అనే మరింత సరైన పదాలను ప్రయోగించారు (ఈ సందర్భంలో మార్క్స్ రచించిన "వేతన శ్రమా, పెట్టుబడీ"కి ఎంగెల్స్ ప్రవేశికను చూడండి; యిదే పుస్తకంలో 82–120 పేజీలు). — 53.

23 ఇది 18వ శతాబ్దాంతంలో జరిగిన ఫ్రెంచి బూర్జువా విప్లవానికి ప్రస్తావన. — 60.

24 ఇది ఇంగ్లండులో ఎన్నికల చట్టపు సవరణ కోసం జరిగిన ఉద్యమానికి ప్రస్తావన. 1831లో ప్రజల ఒత్తిడి కారణంగా యీ సవరణ కామన్స్ సభచేత ఆమోదింపబడింది, చిట్టచివరకు 1832 జూన్‌లో యిది లార్డ్స్ సభ ఆమోదాన్ని కూడా పొందింది. భూస్వామ్య, ధనిక ప్రభువర్గపు గుత్త పాలనకు వ్యతిరేకంగా ఉద్దేశింపబడిన యీ సవరణ పార్లమెంటులో పారిశ్రామిక బూర్జువావర్గ ప్రతినిధుల ప్రవేశానికి ద్వారాలు తెరిచింది. ఈ సంస్కరణ కోసం జరిగిన పోరాటంలో ప్రధాన శక్తియైన శ్రామికవర్గమూ, పెటీబూర్జువావర్గమూ ఉదార బూర్జువావర్గంచేత మోసగింపబడ్డాయి, ఎన్నిక హక్కుల నుండి వంచింపబడ్డాయి. — 69.

25 1660–1689 నాటి పునరుద్ధరణ — ఇంగ్లండులో 17వ శతాబ్దపు బూర్జువా విప్లవంచేత పదవీచ్యుతం చెయ్యబడిన స్టుఆర్టు రాజవంశపు ద్వితీయ పాలన దశ.

1814–1830 నాటి పునరుద్ధరణ — ఫ్రాన్సులో బూర్బన్ రాజవంశంయొక్క రెండవ పాలన కాలం. కులీన ప్రభువుల మతగురువుల ప్రయోజనాలను బలపరచిన బూర్బన్లయొక్క అభివృద్ధి నిరోధక పాలన 1830 జూలై విప్లవంచేత కూల్చి వెయ్యబడింది. — 69.

26 లెజిటిమిస్టులు (చట్టబద్ధతావాదులు) — 1830లో కూల్చివెయ్యబడిన "చట్టబద్ధ" బూర్బన్ రాజవంశానుచరులు. ఈ రాజవంశం పెద్ద పెద్ద జమీందార్ల ప్రయోజనాలకు ప్రాతినిధ్యం వహిస్తూవుండేది. ధనిక ప్రభువర్గంపైనా, బడా బూర్జువావర్గంపైనా ఆధారపడి పాలన సాగిస్తున్న ఆర్లియన్స్ రాజవంశానికి (1830 –

48) వ్యతిరేకంగా తాము జరిపిన పోరాటంలో, లెజిటిమిస్టులకు చెందిన ఒక విభాగం సామాజిక వక్తృత్వానికీ నినాదాలకూ పూనుకొని, బూర్జువావర్గపు దోపిడీకి వ్యతిరేకంగా కార్మిక ప్రజల పరిరక్షకులుగా కనిపించేందుకు ప్రయత్నించారు. – 69, 142.

27 "యంగ్ యింగ్లండు" ("తరుణ ఇంగ్లండు") – బ్రిటిష్ కన్సర్వేటివ్‌ల ఒక బృందం – ఇది 1840 దశకం మొదట్లో ఏర్పాటు చెయ్యబడింది. నానాటికీ పెరుగుతున్న బూర్జువావర్గపు ఆర్థిక, రాజకీయ శక్తిపట్ల భూస్వామ్య ప్రభువర్గంయొక్క అసంతృప్తిని వ్యక్తం చేసే క్రమంలో "యంగ్ యింగ్లండు" నాయకులు, కార్మిక వర్గాన్ని తమ పలుకుబడి ప్రభావాలక్రింద ఉంచుకొనేందుకూ, బూర్జువావర్గానికి వ్యతిరేకంగా తాము జరిపే పోరాటంలో దానినొక పరికరంగా వాడుకొనేందుకూ మోసపూరితమైన వాగాడంబరానికి పూనుకున్నారు. – 69.

28 ఇది జర్మనీలో 1848–1849 నాటి బూర్జువా ప్రజాస్వామిక విప్లవానికి ప్రస్తావన. – 75.

29 చార్టిజం – కార్మికుల హీన పరిస్థితుల కారణంగానూ, రాజకీయ హక్కుల అభావం కరణంగానూ ఉత్పన్నమైన బ్రిటిష్ కార్మికుల రాజకీయోద్యమం. ఇది 19వ శతాబ్దపు 30వ దశకంనుండి 50వ దశకం మధ్య వరకు సాగింది. ప్రజల చార్టర్‌లోని కోర్కెల అమలుకోసం పోరాటం జరపాలన్నది యీ ఉద్యమంయొక్క మూలమంత్రం. చార్టరులో సార్వజనిక ఓటింగు హక్కుకోసం డిమాండూ, కార్మికులకు యీ హక్కును గ్యారంటీ చేసే పలు నిబంధనలూ ఉన్నాయి. లెనిన్ మాటల్లో చార్టిజం "తొలి విస్తృత, రాజకీయంగా సంఘటిత, నిజమైన శ్రామికవర్గ విప్లవాత్మక ప్రజోద్యమం." – 79.

30 రెఫార్మిస్టులు ("సంస్కరణవాదులు") – ఇది పెటీబూర్జువా రిపబ్లికన్ డెమోక్రట్లకు, పెటీబూర్జువా సోషలిస్టులకు ప్రస్తావన. వీళ్ళు ఫ్రెంచి వార్తాపత్రిక "La Réforme" ("సంస్కరణ") విధానపు అనుయాయులు. వీరు రిపబ్లిక్ స్థాపననూ ప్రజాస్వామిక, సామాజిక సంస్కరణలనూ సమర్థించారు. – 79.

31 జాతీయ విమోచన సాధన లక్ష్యంతో అన్ని పోలిష్ ప్రదేశాల్లోనూ 1846 ఫిబ్రవరిలో తిరుగుబాటుకోసం సన్నాహాలు జరపబడ్డాయి. పోలిష్ విప్లవ ప్రజాస్వామికవాదులే (దంబ్రోవ్‌స్కీ ప్రభృతులు) యీ తిరుగుబాటుకు ప్రధాన ఉత్తేజకులు. కాని, పోలిష్ కులీనవర్గానికి చెందిన ఒక విభాగం చేసిన ద్రోహం వలనా, ప్రష్యన్ పోలీసులు తిరుగుబాటు నాయకులను అరెస్టు చేసినందువలనా, సంఘటితమైన తిరుగుబాటుకు బదులు కేవలం చెదురుమదురు తిరుగుబాటు సంఘటనలు మాత్రమే ప్రజ్వరిల్లాయి.

1815నుండి ఆస్ట్రియా, రష్యా, ప్రష్యాల సంయుక్త అజమాయిషీలో ఉన్న ఒక్క క్రాకొవ్‌లో మాత్రమే ఫిబ్రవరి 22న తిరుగుబాటుదారులు విజయం సాధించి, జాతీయ ప్రభుత్వాన్ని స్థాపించారు. ఆ ప్రభుత్వమొక ప్రణాళికను జారీ చేసి, దాని ద్వారా ఫ్యూడల్ ప్రభువులకోసం నిర్బంధ సేవలు చెయ్యాల్సిన అవసరాన్ని రద్దు చేసింది. 1846 మార్చి మొదట్లో క్రాకొవ్ తిరుగుబాటు అణచివెయ్యబడింది. 1846 నవంబరులో ఆస్ట్రియా, ప్రష్యా, రష్యాలు చేసుకున్న ఒక సంధి మేరకు క్రాకొవ్ ఆస్ట్రియన్ సామ్రాజ్యంలో కలిపివెయ్యబడింది. — 81.

32 "వేతన శ్రమా, పెట్టుబడీ" ("Wage Labour and Capital") — ఈ పుస్తకాన్ని ప్రచురణార్థం తయారుచేసేటప్పుడు మార్క్స్, పెట్టుబడిదారీ సమాజంలో వర్గపోరాటానికి భౌతిక ప్రాతిపదిక అయిన ఆర్థిక సంబంధాలను సరళంగా వివరించే కర్తవ్యాన్ని తన ముందుంచుకున్నాడు. శ్రామికవర్గానికి ఒక సైద్ధాంతిక ఆయుధాన్ని — పెట్టుబడిదారీ సమాజంలో బూర్జువావర్గ పాలనకు ఆధారం కార్మికులయొక్క వేతన బానిసత్వమే నన్న ప్రగాఢమైన అవగాహనను — సమకూర్చాలన్నదే ఆయన ఉద్దేశం. అదనపు విలువకు సంబంధించిన తన సిద్ధాంతపు మౌలిక సూత్రీకరణలను విపులీకరించేటప్పుడు మార్క్స్ పెట్టుబడిదారీ విధానంలో కార్మికవర్గపు సాపేక్ష, పరమ దారిద్ర్యకరణపై ప్రధానమైన ఒక సాధారణ సూత్రీకరణను చేశాడు.

ఈ పుస్తకంయొక్క ప్రస్తుత ప్రతి ఎంగెల్స్ సంపాదకత్వాన వెలువడిన 1891 నాటి ముద్రణపాఠాన్ని అనుసరించి తయారు చెయ్యబడింది. — 82.

33 "Neue Rheinische Zeitung. Organ der Demokratie" ("నూతన రైనిషె పత్రిక. డెమోక్రసీ పత్రిక") — 1848 జూన్ 1నుండి 1849 మే 19దాకా కొలోన్‌లో వెలువడింది. మార్క్స్ దాని ప్రధాన సంపాదకుడు. ఎంగెల్స్ సంపాదకవర్గంలో పని చేశాడు. — 82.

34 జర్మన్ కార్మిక సంఘం — బెల్జియంలో నివసించే జర్మన్ కార్మికుల రాజకీయ చైతన్యాన్ని పెంపొందించేందుకూ, వారిమధ్య శాస్త్రీయ కమ్యూనిస్టు భావాలను వ్యాపింపచేసేందుకూ గాను మార్క్స్ ఎంగెల్సులు 1847 ఆగస్టులో యీ సంఘాన్ని స్థాపించారు. మార్క్స్ ఎంగెల్సుల, వారి అనుయాయుల మార్గనిర్దేశకత్వంలో యీ సంఘం బెల్జియంలోని జర్మన్ కార్మికులను సమీకరించే ఒక చట్టబద్ధ కేంద్రంగా తయారైంది. ఈ సంఘపు ప్రముఖ సభ్యులు కమ్యూనిస్టు లీగుయొక్క బ్రస్సెల్స్ శాఖ సభ్యులు కూడా. బ్రస్సెల్స్‌లోని జర్మన్ కార్మిక సంఘపు కార్యకలాపాలు, బెల్జియన్ పోలీసులు దాని సభ్యులను అరెస్టు చెయ్యడం, దేశ బహి

ష్కృతులను చెయ్యడం కారణంగా, 1848 ఫిబ్రవరిలో ఫ్రాన్సులో జరిగిన బూర్జువా విప్లవానికి కొద్ది రోజుల తర్వాత, నిలిచిపోయాయి. – 82.

35 1849లో హంగేరియన్ బూర్జువా విప్లవాన్ని అణచివేయడానికీ, హాప్స్‌బుర్గ్ పరిపాలనను పునరుద్ధరించడానికీ రష్యన్ జారు మొదటి నికొలస్ చేసిన సైనిక జోక్యానికి యిది ప్రస్తావన. – 82.

36 జర్మన్ పట్టణాలలో 1849 మే జూలైలలో సామ్రాజ్య రాజ్యాంగాన్ని రక్షించడానికి ప్రజా తిరుగుబాట్లు జరిగాయి. యీ రాజ్యాంగం మార్చి 1849లో ఫ్రాంక్‌ఫర్ట్ జాతీయ సభచేత ఆమోదించబడింది, ఆ తరువాత దానిని కొన్ని జర్మన్ రాజ్యాలు నిరాకరించాయి. – 82.

37 తర్వాత కాలంలో మార్క్స్ పత్రాల్లో "వేతనాలు" శీర్షికతో, వేతన శ్రమ, పెట్టుబడి అనే అంశంపై ఉపసంహారాత్మకమైన ఉపన్యాసమాలయొక్క ముసాయిదా రేఖా చిత్రానికి సంబంధించిన ఒక రాతప్రతి దొరికింది. దీని అట్టపైన "బ్రస్సెల్స్, 1847 డిసెంబరు" అన్న గమనిక వుంది. దాని విషయాంశం దృష్ట్యా, ఆ రాతప్రతి వరకు, కొంత "వేతన శ్రమా, పెట్టుబడీ" అన్న అసంపూర్ణ రచనకు తరువాయిగా కనిపిస్తుంది. కాని యీ రచనకు సంబంధించి ప్రచురణార్థం తయారు చెయ్యబడిన తుది ప్రకరణాలు మార్క్స్ రాతప్రతుల్లో ఎన్నడూ లభించలేదు. – 82.

38 "పెట్టుబడి"లో మార్క్స్ యిలా అంటాడు: "...సాంప్రదాయిక అర్థశాస్త్రం అంటే, డబ్ల్యు. పెట్టీ కాలంనుండి బూర్జువా సమాజంలోని ఆంతరంగిక ఉత్పత్తి సంబంధాలను పరిశీలన చేసిన అర్థశాస్త్రమంతా అని నేను అర్థం చేసుకుంటున్నాను...." (K. Marx, *Capital*, Moscow, 1972, Vol. I, part I, p. 85.) ఇంగ్లండులో సాంప్రదాయిక అర్థశాస్త్రపు అత్యంత ముఖ్యమైన ప్రతినిధులు ఆడమ్ స్మిత్, డేవిడ్ రికార్డో. – 83.

39 "అర్థశాస్త్రం పదిహేడవ శతాబ్ది అంతంలో కొద్దిమంది మహా మేధావుల తలలలో మొదట రూపుదాల్చినప్పటికీ, దాని సంకుచిత అర్థంలో, ప్రకృతి అధికారవాదులూ (physiocrats), ఆడమ్ స్మిత్ సూత్రీకరించిన రూపంలో, అది సారభూతంగా పద్దెనిమిదవ శతాబ్దిలో పుట్టింది...." అని ఎంగెల్స్ రాశాడు. (Engels, *Anti-Dühring*, Moscow, 1969, part II, p. 182.) – 84.

40 ఇది 1891లో జరిగిన మేడే ఉత్సవానికి ఎంగెల్స్ ప్రస్తావన. కొన్ని దేశాల్లో (బ్రిటన్, జర్మనీ) మే 1 తర్వాత మొదటి ఆదివారం నాడు మేడే జరుపబడుతూ ఉండేది. 1891లో యిది మే 3న పడింది. – 91.

41 1848 ఫిబ్రవరి 23–24న పారిస్‌లోనూ, మార్చి 13న వియన్నాలోనూ, మార్చి 18న బెర్లిన్‌లోనూ జరిగిన విప్లవాలకు ప్రస్తావన. – 92.

42 ఒక వారం పాటు జరిగిన తీవ్ర పోరాటానంతరం 1848 నవంబరు 1న ఆస్ట్రియా చక్రవర్తి సేనలు వియన్నాలో ప్రజల తిరుగుబాటును అణచివేసి, ఆ నగరాన్ని ఆక్రమించుకున్నాయి.

1848 నవంబరు, డిసెంబరు మాసాల్లో ప్రష్యాలో ఒక అభివృద్ధి నిరోధక రాజకీయ కుట్ర జరిగింది; నవంబరు 1న, బాహాటంగా విప్లవ ప్రతీఘాత ప్రభుత్వమొకటి అధికారంలోకి వచ్చింది. నవంబరు 9న ప్రష్యన్ జాతీయ అసెంబ్లీ సమావేశాలు బెర్లిన్‌నుండి బ్రాండెన్‌బుర్గ్ పట్టణానికి మార్చుతూ ఆజ్ఞలు జారీచెయ్యబడ్డాయి; జాతీయ అసెంబ్లీ సభ్యుల్లో అధిక సంఖ్యాకులు తమ సమావేశాన్ని బెర్లిన్‌లోనే కొనసాగించారు, కాని నవంబరు 15న వారు సైనిక దళాలచేత చెదరగొట్టబడ్డారు. డిసెంబరు 5న జాతీయ అసెంబ్లీ రద్దుతో, అభివృద్ధి నిరోధక రాజ్యాంగచట్ట ప్రకటనతో ఆ రాజకీయ కుట్ర ముగిసింది. – 92.

43 1848, 1849 సంవత్సరాల్లో హంగేరీ, ఇటలీ, పోలండు దేశాల్లో జరిగిన జాతీయ విమోచన తిరుగుబాట్లను మార్క్స్ ప్రస్తావిస్తున్నాడు. – 92.

44 ఇదొక గ్రీసు పురాణ కథకు ప్రస్తావన. ఈ కథ ప్రకారం ఫ్రీగియా రాజు గోర్డియస్, రథకేతనానికి ఒక పలుపును ముడివేశాడు. ఆకాశవాణి పలుకులను బట్టి ఆ పీటముడిని విప్పినవాడు ఆసియా పాలకుడవుతాడు. అలెగ్జాండర్ ది గ్రేట్ ఆ ముడిని విప్పేందుకు బదులు దాన్ని తన ఖడ్గంతో కోసేశాడు. – 99.

45 ఫ్రాన్సులో 1848–1851 నాటి విప్లవ ఘటనల విశ్లేషణ ప్రాతిపదికపై రచింపబడిన యీ గ్రంథం ముఖ్యమైన మార్క్సిస్టు రచనల్లో ఒకటి. మార్క్స్ ఇందులో చారిత్రక భౌతికవాదానికి సంబంధించిన మౌలికమైన సైద్ధాంతిక సూత్రాలన్నింటినీ మరింతగా విపులీకరించాడు. అవి – వర్గపోరాటం, శ్రామికవర్గ విప్లవం, రాజ్యయంత్రపు, శ్రామికవర్గ నియంతృత్వపు సిద్ధాంతాలు. బూర్జువా రాజ్యయంత్రంపట్ల శ్రామికవర్గ వైఖరి విషయంలో మార్క్స్ వచ్చిన నిర్ధారణ, వాటిలో అత్యంతాధిక ప్రాముఖ్యం కలిగినది. ఆయన యిలా అన్నాడు: "అన్ని విప్లవాలూ యీ రాజ్యయంత్రాన్ని తుత్తునియలు చేసేందుకు

బదులు దాన్ని మెరుగుపరచాయి'' (ఈ సంపుటిలో 223 పేజి చూడండి). రాజ్య యంత్రాన్ని గూర్చి మార్క్సిస్టు బోధనయొక్క మిక్కిలి ముఖ్యమైన సూత్రీకరణల్లో ఒకటిగా దాన్ని లెనిన్ అభివర్ణించాడు.

మార్క్స్ ''లూయీ బోనపార్ట్‌యొక్క బ్రూమేర్ పద్దెనిమిదవ తేదీ''లో ఆసన్న విప్లవంలో శ్రామికవర్గానికి రైతాంగం పొత్తుగా వుంటుందన్న తన విశ్లేషణను కొనసాగించి, సమాజపు జీవితంలో రాజకీయ పార్టీల పాత్రను వెల్లడించి బోనపార్టిజంయొక్క స్వభావాన్ని వర్ణించాడు. – 121.

46 1851 డిసెంబరు 2వ తేదీన, ఫ్రాన్సులో లూయీ బోనపార్టూ, అతని అనుచరులూ విప్లవ ప్రతిఘాత రాజకీయ కుట్రనొకదాన్ని జరిపారు. – 121.

47 పునర్వికాస కాలం – పశ్చిమ, మధ్య యూరప్‌కు చెందిన పలు దేశాలలో పెట్టుబడిదారీ సంబంధాల ఆవిర్భావ కారణంగా వచ్చిన సాంస్కృతిక, భావజాలాత్మక అభివృద్ధి దశ. 15వ శతాబ్ది మధ్యనుండి 16వ శతాబ్దం చివరి దాకా విస్తరించిన దశ యిది. మొత్తంమీద యీ దశలో కళలూ, విజ్ఞానశాస్త్రాలూ సత్వరాభివృద్ధి చెందాయి, ప్రామాణిక గ్రీకు, రోమన్ సంస్కృతిపట్ల ఆసక్తి పునర్జాగృతం అయింది. పునర్వికాస దశను గూర్చిన అభివర్ణనను ఎంగెల్స్ ''ప్రకృతి గతితర్కం'' అనే పుస్తకానికి తన ఉపోద్ఘాతంలో ఇచ్చాడు. – 122.

48 రెండవ రిపబ్లిక్ ఫ్రాన్సులో 1848నుండి 1852వరకు ఉంది. ఈ దశకి సంబంధించిన మార్క్స్ వర్ణనకోసం ''1848–1850 నాటి ఫ్రాన్సులో వర్గపోరాటం,'' ''లూయీ బోనపార్ట్‌యొక్క బ్రూమేర్ పద్దెనిమిదవ తేదీ'' చూడండి. – 122.

49 మహీధరం పార్టీ (1793–95) – 18వ శతాబ్ది చివరి నాటి ఫ్రెంచి బూర్జువా విప్లవ కాలంలో జాతీయ కన్వెన్షన్ (పార్లమెంటు)లోని ఒక విప్లవ ప్రజాతంత్ర గ్రూపు. (84వ, 114వ వివరణలు కూడా చూడండి.) – 123.

50 బ్రూమేర్ – ఫ్రెంచి రిపబ్లికన్ కేలెండరులో ఒక నెల. 1799 బ్రూమేర్ పద్దెనిమిదవ తేదీ (నవంబరు 9) – ఆ రోజున రాజకీయ కుట్ర జరిపి, నెపోలియన్ బోనపార్ట్ సైనిక నియంతృత్వం స్థాపించాడు. ''బ్రూమేర్ పద్దెనిమిదవ తేదీ పునరావృత్తి'' అని అనడంలో మార్క్స్ ఉద్దేశం 1851 డిసెంబరు 2 నాటి రాజకీయ కుట్ర అని. – 123.

51 17వ శతాబ్దం నాటి ఇంగ్లీషు బూర్జువా విప్లవానికి యిది ప్రస్తావన. – 125.

52 బైబిలు పాత నిబంధన నియమాలకు, ప్రవక్తలకు సంబంధించిన యీ భాగం బైబిలులో పెద్ద భాగం. – 125.

53 బెడ్‌లామ్ – లండన్‌లోని ఒక పిచ్చి ఆసుపత్రి. – 125.

54 1848 డిసెంబరు 10న, ప్రజాభిప్రాయ సేకరణ ద్వారా లూయీ బోనపార్ట్ ఫ్రెంచి రిపబ్లిక్ అధ్యక్షుడుగా ఎన్నుకోబడ్డాడు. – 126.

55 "ఈజిప్టు మాంసపు దాకల కోసం మరల అంగలార్చారు" అన్న యీ నానుడి బైబిలు కథనుంచి గ్రహింపబడింది. దాని ప్రకారం, ఈజిప్టునుండి ఇస్రాయెలీల నిష్క్రమణ కాలంలో వారిలోని పిరికిగుండెవాళ్ళు ప్రయాణక్లేశాలకూ, ఆకలిబాధకూ తాళలేక, కనీసం కడుపుకి సరిపడ తిండైనా దొరుకుతూవుండిన నిర్బంధకాలం తిరిగివస్తేనైనా బాగుండునని అంగలార్చారు. – 126.

56 Hic Rhodus, hic salta! (ఇక్కడ రోడ్స్, ఇక్కడే గెంతు!) – ఇసోప్ కట్టుకథల్లో ఒక దానినుంచి గ్రహింపబడిన మాటలివి. ఈ కథలో ఒక కోతల రాయుడుంటాడు. ఒక సారి తను రోడ్స్‌దీవిలోకి అద్భుతంగా గెంతేశాననీ, చూసిన వాళ్లచేత అందుకు తను సాక్ష్యం చెప్పించగలననీ బుకాయిస్తాడు. "సాక్ష్యం ఎందుకు? ఇక్కడ రోడ్స్, యిక్కడే గెంతు!" అని జవాబిచ్చారు శ్రోతలు. మరోలా చెప్పాలంటే "వేరే మాటలెందుకు, నువ్వు చెయ్యగలదేమిటో యిప్పుడే చేసిచూపించు!" అని.

రోజా యిక్కడే వుంది, యిక్కడే చిందులెయ్యి! ఇంతకు ముందు ఉల్లేఖితమైన పదబంధానికిది టీక. ఈ టీకను (గ్రీకు భాషలో ద్వీపం పేరైన రోడ్స్‌కి "గులాబి" అన్న అర్థం కూడా వుంది) "హక్కుకి సంబంధించిన తాత్విక సూత్రాలు" ("Grundlinien der Philosophie des Rechts") అన్న తన గ్రంథానికి ఉపోద్ఘాతంలో హేగెల్ ఉపయోగించాడు. – 127.

57 1848 నాటి ఫ్రెంచి రాజ్యాంగచట్టం మేరకు అధ్యక్ష ఎన్నికలు, ప్రతి నాలుగేళ్లకూ ఒక సారి మే మాసంలో రెండవ ఆదివారం నాడు జరగాల్సివుంది. 1852 మే మాసంలో లూయీ బోనపార్ట్ అధ్యక్ష పదవీకాలం ముగిసింది. – 128.

58 హిలియస్ట్‌లు ("హిలియన్" అన్న గ్రీకు పదంనుండి వచ్చింది, ఒక వెయ్యి అని దీని అర్థం) – క్రీస్తు పునరుత్థానానికీ, రాబోయే స్వర్ణయుగానికీ సంబంధించిన ఒకానొక నిగూఢ మతసిద్ధాంత బోధకులు. ఆ స్వర్ణయుగంలో ధర్మం, సార్వజనిక సమానత్వం, సౌభాగ్యం విజయం పొందుతాయని వారు విశ్వసించారు. – 128.

[59] *In partibus infidelium* (శబ్దార్థం ప్రకారం: "క్రీస్తు మతంలో విశ్వాసం లేనివారి దేశంలో") — క్రైస్తవేతర దేశాల్లో కేవలం నామమాత్రపు పదవులకు నియమితులైన కేథలిక్ బిషప్‌ల హోదాకి ఒక చేర్పు. ఒక దేశంలోని వాస్తవ పరిస్థితిని పరిగణనలోకి తీసుకోకుండా విదేశాల్లో ఏర్పాటుచెయ్యబడిన ప్రవాస ప్రభుత్వాలను వర్ణించడానికి మార్క్సు ఎంగెల్సుల రచనల్లో యీ నానుడి తరచుగా ప్రయోగింపబడింది. — 128, 160.

[60] కాపిటోల్ — రోమ్ నగరంలో ఒక కొండపైన గల జూపిటర్ దేవాలయం. అదొక కోట కూడా. పౌరాణిక గాథ ప్రకారం, క్రీ. పూ. 390లో, ఫ్రెంచి ముట్టడి సమయంలో జూనో (జూపిటర్ భార్య) దేవళంలోని బాతులు అరిచి, నిద్రిస్తున్న కావలివాళ్లను లేపిన కారణంగా మాత్రమే రోమ్ రక్షింపబడింది. — 128.

[61] తమ విమోచన కోసం పోరాడుతున్న ఆల్జీరియన్లకు వ్యతిరేకంగా జరిగిన వలసవాద యుద్ధాలలో సైనిక కీర్తిని సంపాదించుకున్న "ఆఫ్రికన్లు" లేక "ఆల్జీరియన్లు" అనబడే ఫ్రెంచి సేనాధిపతులకూ, ఆఫీసర్లకూ యిది ప్రస్తావన. శాసనసభలో ఆఫ్రికన్ సేనాధిపతులైన కవేన్యాక్, లమోరిస్యేర్, బెడోలు రిపబ్లికన్లకు నాయకత్వంవహించారు. — 128, 150.

[62] రాజవంశ ప్రతిపక్షం — జూలై రాజరిక కాలంలో ఫ్రెంచి ప్రతినిధుల సభలో ఒడిలాన్ బర్రో నాయకత్వాన గల ఒక గ్రూపు. దాని ప్రతినిధులు ఉదారవాద పారిశ్రామిక, వాణిజ్య బూర్జువావర్గాల భావాలను అభివ్యక్తం చేసి, విప్లవాన్ని నివారించి ఆర్లియన్సు రాజవంశాన్ని కాపాడటానికి ఒక సాధనంగా పరిమితమైన ఎన్నిక సంస్కరణను ప్రతిపాదించారు. — 129.

[63] జూలై రాజరికం — లూయీ ఫిలిప్ పాలన కాలం (1830–48), జూలై విప్లవంనుంచి దీనికి యీ పేరు వచ్చింది. — 130, 148.

[64] 1848 మే 15న జరిగిన ప్రజా ప్రదర్శన సందర్భంగా, పారిస్ కార్మికులూ, వృత్తి పనివారూ రాజ్యాంగ నిర్ణయ సభ సమావేశం జరుగుతున్న హాలులోకి చొరుచుకువెళ్లి, దాన్ని రద్దుచేస్తున్నట్లు ప్రకటించి, విప్లవ ప్రభుత్వాన్ని ఏర్పరచారు. కానైతే, ప్రదర్శకులు త్వరలోనే నేషనల్ గార్డులచేతా, వారి రక్షణకు వచ్చిన సేనలచేతా చెదరగొట్టబడ్డారు. కార్మిక నాయకులు (బ్లాంకీ, బర్బేస్, అల్బేర్ట్, రస్‌పైల్, స్ప్రొబియే ప్రభృతులు) నిర్బంధింపబడ్డారు. — 130, 147.

65 గస్తీ దళాలు 1848 ఫిబ్రవరి 25వ తేదీ తాత్కాలిక ప్రభుత్వ శాసనం మేరకు నెలకొల్పబడ్డాయి. ఈ దళాలు ప్రధానంగా వర్గ భ్రష్టబికారి గాలిమూకతో కూడి వున్నాయి. జూన్ తిరుగుబాటుదార్లను అణచివేయడానికి వాటిని ఉపయోగించారు. – 131.

66 రోమన్ చరిత్రకారుడైన యూసెబియస్ ప్రకారం, 312లో తన ప్రత్యర్థి అయిన మాక్సెంటియస్‌పై విజయసాధనకు సరిగా ముందు రాత్రి మొదటి కాన్‌స్టాంటిన్ చక్రవర్తికి ఆకాశంలో ఒక శిలువ సంకేతం కానవచ్చింది. ఆ శిలువపైన "ఈ సంకేతంతో నీవు విజయం సాధిస్తావు!" అన్న పదాలు లిఖింపబడివున్నాయి. – 133.

67 పిథియా డల్ఫీలోని అపోలో దేవాలయ పూజారిణి. ఈమె తన జోస్యాలను ముక్కాలి పీటపై కూర్చొని చెప్తూండేది. – 133.

68 "Le National" – ఇదొక ఫ్రెంచి దినపత్రిక. ఉదారవాద బూర్జువా రిపబ్లికన్ల యీ అధికార పత్రిక 1830నుండి 1851వరకు పారిస్‌లో ప్రచురింపబడింది. తాత్కాలిక ప్రభుత్వంలో మర్రాస్ట్, బెస్టీడ్, గర్న్యే-పాజేస్‌లు వీరి ప్రధాన ప్రతినిధులు. – 134.

69 "Journal des Débats politiques et littéraires" – ఇదొక ఫ్రెంచి బూర్జువా దినపత్రిక, పారిస్‌లో 1789లో స్థాపించబడింది. జూలై రాజరికదినాల్లో వెలువడిన ప్రభుత్వ పత్రికల్లో యిదొకటి, ఆర్లియన్స్ రాజవంశానుకూల బూర్జువావర్గపు పత్రిక. 1848 విప్లవ కాలంలో, యీ పత్రిక పార్టీ ఆఫ్ ఆర్డర్ (వ్యవస్థ పరిరక్షక పార్టీ) అనబడే విప్లవ ప్రతిఘాత బూర్జువావర్గపు పార్టీ అభిప్రాయాలను వ్యక్తంచేసింది. – 134.

70 నెపోలియనిక్ యుద్ధాల్లో పాల్గొన్న దేశాలమధ్య 1815 మే, జూన్ మాసాల్లో వియన్నాలో సంతకాలు జరిగిన ఒడంబడికలకు ప్రస్తావన యిది. 1814–15 నాటి వియన్నా కాంగ్రెస్ ఫ్రాన్సుయొక్క 1792 నాటి సరిహద్దులను పునర్నిర్ధరించి, దాన్ని విజేత దేశాల (ఇంగ్లండు, ఆస్ట్రియా, రష్యాల) కచ్చితమైన అదుపుక్రింద ఉంచింది. యూరప్‌లో ఫ్రాన్సు ప్రాదేశిక ఆక్రమణ చెయ్యడం కూడా నిరోధింపబడింది. – 134.

71 రాజ్యాంగపు చార్టరు – ఫ్రాన్సులో 1830 బూర్జువా విప్లవం తర్వాత ఆమోదింపబడింది. ఇది జూలై రాజరికంయొక్క మూల చట్టమే తప్ప మరేమీ కాదు. పేరుకి

మాత్రం, చార్టరు జాతియొక్క సార్వభౌమాధికారాన్ని ప్రకటించింది, రాజుయొక్క అధికారంపై కొన్ని కట్టుబాట్లను విధించింది. – 136.

72 ఎలిసీ ఫీల్డ్స్ – ఎలిసీ రాజభవనం వున్న పారిస్ రాజవీధి. 1848 రాజ్యాంగచట్టం మేరకు ఆ భవనం రిపబ్లిక్ అధ్యక్షుని అధికార నివాసం చెయ్యబడింది. – 138.

73 క్లిషీ – 1826నుండి 1867వరకు పారిస్‌లో వున్న రుణగ్రస్తుల జైలు. – 138.

74 ఫ్రెంచి రిపబ్లిక్ నెలకొల్పబడిన వెంటనే జాతీయ పతాకాన్ని ఎంపిక చేసుకొనే ప్రశ్న ఉదయించింది. 1832 జూన్ నాటి తిరుగుబాటు కాలంలో పారిస్ శివార్లకు చెందిన కార్మికులు ఎగరేసిన ఎర్రజెండాను జాతీయ పతాకంగా చెయ్యాలని పారిస్ విప్లవకర కార్మికులు పట్టుబట్టారు. బూర్జువావర్గ ప్రతినిధులు, 18వ శతాబ్దం చివర జరిగిన బూర్జువా విప్లవ కాలంలోనూ, ఒకటవ నెపోలియన్ కాలంలోనూ జాతీయ పతాకంగా వున్న త్రివర్ణ పతాకం (నీలం, తెలుపు, ఎరుపు) జాతీయ పతాకంగా ఉండాలని పట్టుబట్టారు. 1848 విప్లవానికి ముందే "National"ని బలపరచిన బూర్జువా రిపబ్లికన్ల జెండా త్రివర్ణ పతాకమే. త్రివర్ణ పతాకాన్ని ఫ్రెంచి రిపబ్లిక్ జాతీయ పతాకంగా చెయ్యడానికి కార్మిక ప్రతినిధులు అంగీకరించాల్సివచ్చింది, కాని వారు జెండాకర్రకు పువ్వులా చుట్టిన ఎర్రని రిబ్బన్‌ను తగిలించారు. – 140.

75 ప్రిటోరియన్లు – పురాతన రోమ్‌లో సేనా నాయకునియొక్క, లేక చక్రవర్తియొక్క అంగరక్షకులు, అతనిచేత పోషింపబడుతూ వీరు వివిధ విశేషాధికారాలను అనుభవిస్తూండేవారు. అంతర్గత కలహాలలో వీరు నిరంతరాయంగా పాల్గొంటూండేవారు, తరచుగా తమ కీలుబొమ్మలను సింహాసనాలపై అధివసింపచేసేవారు. డిసెంబరు 10 సంఘానికి ప్రస్తావన యిది (ఈ పుస్తకంలో 177–181వ పేజీలు చూడండి). – 141.

76 నియోపొలిటన్లు – 1840 మేనుండి జూలైవరకు ఆస్ట్రియాతోబాటు నేపుల్స్ రాజ్యం రోమ్ రిపబ్లిక్‌కి వ్యతిరేకంగా జరిగిన జోక్యంలో పాల్గొంది. – 141.

77 లూయీ బోనపార్ట్ జీవితంలో యీ క్రింది ఘటనలను మార్క్స్ ప్రస్తావిస్తున్నాడు: 1832లో లూయీ బోనపార్ట్ తుర్గౌ జిల్లాలో స్విస్ పౌరుడయ్యాడు; 1848లో తను బ్రిటన్‌లో వున్న కాలంలో అతను ఐచ్ఛికంగా ప్రత్యేక పోలీసు దళంలో చేరాడు (బ్రిటన్‌లో పౌరులతో కూడిన రిజర్వు పోలీసు దళాలను ఏర్పాటు చేస్తారు). – 142.

78 ఆర్లియనిస్టులు – ఆర్లియన్ రాజవంశ సమర్థకులు. ఇది బూర్బన్ రాజవంశానికి చెందిన ఒక శాఖ. 1830 జూలై విప్లవంలో అధికారానికి వచ్చిన యీ శాఖ 1848 విప్లవంలో

కూలదొయ్యబడింది. ఆర్లియనిస్టులు ధనిక ప్రభువర్గంయొక్క, బడా బూర్జువా వర్గంయొక్క ప్రయోజనాలను వ్యక్తంచేశారు. – 142.

79 "పార్టీ ఆఫ్ ఆర్డర్" ("వ్యవస్థ పార్టీ") – మితవాద బడా బూర్జువావర్గంయొక్క పార్టీ. ఇది 1848లో నెలకొల్పబడింది. ఇది లెజిటిమిస్టులు, ఆర్లియనిస్టులు అనే రెండు ఫ్రెంచి రాజరిక పక్షాల సంయుక్త పార్టీ. 1849నుండి 1851 డిసెంబరు 2 నాటి రాజకీయ కుట్రవరకు యీ పార్టీ రెండవ రిపబ్లిక్‌కి చెందిన శాసన నిర్ణయ జాతీయ సభలో నాయకత్వ స్థానంలో వుంది. – 143.

80 కాలిగులా – ప్రిటోరియన్ రక్షకభటులచేత గద్దెపై కెక్కించబడిన రోమన్ చక్రవర్తి (క్రీ. శ. 37–41). – 145.

81 1849 ఏప్రిల్లో ఇటలీపై దండయాత్ర చేసేందుకుగాను ఫ్రెంచి ప్రభుత్వం రాజ్యాంగ నిర్ణయసభచేత డబ్బును కేటాయింపచేసుకుంది. ఆస్ట్రియాకు వ్యతిరేకంగా ప్యేమాంట్‌కు తోడ్పాటుయిచ్చేందుకూ, రోమన్ రిపబ్లిక్‌ను రక్షించడానికీ అన్న సాకుతో ఈ దండయాత్ర జరిగింది. కాని దాని అసలు లక్ష్యం రోమన్ రిపబ్లిక్‌కు వ్యతిరేకంగా జోక్యం చేసుకొని పోపు లౌకికాధికారాన్ని పునరుద్ధరించడం. – 146.

82 "Le Moniteur Universel" – ఫ్రెంచి దినపత్రిక. పారిస్‌లో 1789 నుండి 1901వరకు ప్రచురింపబడిన అధికారిక ప్రభుత్వ పత్రిక. అది ప్రభుత్వం యొక్క అన్ని చట్టాలను, పార్లమెంటరీ వ్యవహారాల వివరాలను, తదితర అధికారిక పత్రాలను ప్రచురించేది. – 146.

83 క్వెస్టర్ – శాసన నిర్ణయ జాతీయ సభయొక్క క్వెస్టర్ అన్నది, జాతీయ సభచేత ఆర్థిక, ద్రవ్య వ్యవహారాల నిర్వహణా, దాని భద్రతా పరిరక్షణా అప్పగింపబడిన ప్రతి ఒక ప్రతినిధికీ (రోమన్ క్వెస్టర్లకు సాదృశ్యంగా) యివ్వబడిన పేరు జాతీయ సభ అధ్యక్షునికి నేరుగా సేనలను పిలిచే హక్కును మంజూరుచేసే బిల్లుకు యిది ప్రస్తావన. ఈ బిల్లు రాజరికవాద క్వెస్టర్లు లెఫ్లో, బాజ్, పాన్‌లచేత 1851 నవంబరు 6న ప్రతిపాదింపబడింది, నవంబరు 17న తీవ్రమైన వాగ్వివాదం అనంతరం యీ బిల్లు తిరస్కరింపబడింది. – 146.

84 కాన్‌స్టిట్యూషనలిస్టులు – రాజ్యాంగచట్టబద్ధులైన రాజరికవాదులు. రాజుతో సన్నిహిత సంబంధాలు కలిగిన బడా బూర్జువావర్గ ప్రతినిధులు, ఉదారవాద ప్రభువర్గ ప్రతినిధులు.

జిరోండిస్టులు – 18వ శతాబ్దం చివర జరిగిన ఫ్రెంచి బూర్జువా విప్లవ కాలానికి చెందిన ఒక బూర్జువా రాజకీయ గ్రూపు. జిరోండిస్టులు మితవాద బూర్జువావర్గ ప్రయోజనాలను వ్యక్తంచేశారు. విప్లవ శక్తులకూ విప్లవ ప్రతీఘాత శక్తులకూ మధ్య ఊగిసలాడారు. రాజరికవాదులతో రాజీపడ్డారు. జిరోండ్ జిల్లానుండి యీ పేరు వచ్చింది. శాసన నిర్ణయ జాతీయ సభలోనూ, జాతీయ కన్వెన్షన్‌లోనూ వున్న జిరోండ్ జిల్లా ప్రతినిధులు యీ గ్రూపుకి నాయకులు కావడమే యిందుకు కారణం.

జాకొబిన్లు – 18వ శతాబ్దం చివర జరిగిన ఫ్రెంచి బూర్జువా విప్లవకాలంలో వీరొక వామపక్ష బూర్జువా రాజకీయ గ్రూపు. వీరు ఫ్యూడలిజాన్నీ, నిరంకుశ రాజరిక పాలన పద్ధతినీ రద్దుచెయ్యాల్సిన అవసరాన్ని గురించి పట్టుదలగా, ఎడతెగకుండా వాదించారు. – 147.

85 "శ్రమను సంఘటితపరచడం," "ఒక మనిషిచేత వేరొక మనిషి దోపిడీ రద్దు" అన్న విషయాలపై ఒక మహజరును తాత్కాలిక ప్రభుత్వానికి సమర్పించేందుకు గాను పారిస్ కార్మికులు 1848 ఏప్రిల్ 16న శాంతియుత ప్రదర్శన నొకదాన్ని ఏర్పాటు చేశారు. ప్రత్యేకించి యీ ప్రదర్శనను చెదరగొట్టడంకోసం సమీకరింపబడిన బూర్జువా నేషనల్ గార్డుచేత యీ ప్రదర్శన చెదరగొట్టబడింది. – 147.

86 ఫ్రాండ్ – నిరంకుశ అధికారానికి వ్యతిరేకంగా ఫ్రెంచి ప్రభువంశీకుల్లోనూ, బూర్జువా వర్గంలోనూ 1648–1653 మధ్య చురుకుగా సాగిన ఒక ఉద్యమం. ఆ ఉద్యమ నాయకులు ప్రభువర్గానికి చెందినవారు. వారు తమ భూదాసుల, విదేశీ సేనల తోడ్పాటు పైన ఆధారపడుతూ, తమ స్వీయ లక్ష్యాలను ముందుకు తీసుకెళ్లడానికి రైతాంగ తిరుగుబాట్లనూ, నగరాల్లోని ప్రజాతంత్ర ఉద్యమాలనూ వినియోగించుకున్నారు. – 148.

87 ఫ్రిగ్గియన్ టోపీ – పురాతన ఫ్రిగ్గియన్లు తలకు కట్టుకుంటూ వుండిన ఎర్రని పాగా; దరిమిలా అది 18వ శతాబ్దం చివర జరిగిన ఫ్రెంచి బూర్జువా విప్లవ కాలంలో జాకొబిన్ల టోపీకి నమూనాగా స్వీకరింపబడింది. అప్పటినుండి అది స్వాతంత్ర్యానికి చిహ్నమైంది. – 149.

88 లిల్లీ – బూర్బన్ రాజవంశంయొక్క రాజ చిహ్నం. – 151.

89 టోరీలు – ఇంగ్లండులో 17వ శతాబ్దం చివర స్థాపించబడిన ఒక రాజకీయ పార్టీ. అది భూస్వామ్య ప్రభువర్గంయొక్క, మతాధికార నిశ్రేణిలో ఉన్నత విభాగంయొక్క ప్రయోజనాలను బలపరచింది. పాత ఫ్యూడల్ సంప్రదాయాలను భుజానవేసుకొని

ఉదారవాద, ప్రగతిశీల డిమాండ్లకు వ్యతిరేకంగా పోరాడింది. 19వ శతాబ్ది మధ్యంలో దీనినుండి కన్సర్వేటివ్ పార్టీ రూపొందింది. — 152.

90 ఎమ్స్ — పశ్చిమ జర్మనీలో ఒక పట్టణం. ఫ్రెంచి సింహాసనానికి తనను వారసుడుగా ప్రకటించుకొన్న (తనను తాను ఐదవ హెన్రీగా పిలుచుకొన్న), బూర్బన్ రాజవంశపు ఒక శాఖకు చెందిన కౌంట్ షంబోర్‌యొక్క నివాసస్థానాల్లో యిదొకటి.

క్లేర్‌మోంట్ — లండను సమీపంలోని ఒక రాజభవనం. 1848 ఫిబ్రవరి విప్లవానంతరం ఫ్రాన్సునుండి పారిపోయి వచ్చిన లూయీ ఫిలిప్ యిందులో నివసించాడు. — 153.

91 జెరికో — బైబిలు పురాణం ప్రకారం, పాలస్తీనాకు వచ్చినప్పుడు ఇజ్రాయెలీలు మొట్టమొదట ఆక్రమించుకున్న పట్టణం. ముట్టడిదారుల భేరీనాదాలకు జెరికో కోటగోడలు కూలిపోయాయి. — 157.

92 తొమ్మిదవ పోప్ పయస్ తనకు ఫ్రాన్సు రాజుగా కిరీటధారణ చేస్తాడని ఆశించిన లూయీ బోనపార్ట్ పథకాలకు యిది ప్రస్తావన. బైబిలు కథ ప్రకారం ఇజ్రాయెల్ రాజు డేవిడ్, ప్రవక్త సాముయేల్‌చేత సింహాసనాధిష్ఠితుడు చెయ్యబడ్డాడు. — 161.

93 1805 డిసెంబరు 2న ఔస్టర్లిట్జ్ (మొరావియా)లో జరిగిన యుద్ధం, రష్యన్-ఆస్ట్రియన్ సేనలపై మొదటి నెపోలియన్ విజయంతో ముగిసింది. — 161.

94 ఇది 1830 జూలై విప్లవానికి ప్రస్తావన. — 162.

95 1839లో పారిస్‌లో ప్రచురింపబడిన "Des idées napoléoniennes" అనే పేర లూయీ బోనపార్ట్ రచించిన పుస్తకానికి ప్రస్తావన. — 167.

96 బుర్గ్రాఫ్‌లు అన్నది 17మంది ప్రముఖ ఆర్లియనిస్టులకు, లెజిటిమిస్టులకు పెట్టబడిన పేరు. ఒక కొత్త ఎన్నికల ముసాయిదా చట్టాన్ని తయారుచేసేందుకు శాసన నిర్ణయ జాతీయ సభచే ఏర్పాటు చెయ్యబడిన కమిటీలో వీరు సభ్యులు. ఇది విక్టర్ హ్యూగో రచించిన మధ్య యుగపు చారిత్రక నాటకంనుండి స్వీకరింపబడిన పేరు. జర్మనీలో చక్రవర్తిచేత "బుర్గ్" (దుర్గరక్షిత పట్టణం, లేక కోట)యొక్క పాలకుడుగా నియమింపబడిన వానిని బుర్గ్రాఫ్ అంటారు. — 172.

97 శాసన నిర్ణయ జాతీయ సభచేత 1850 జూలైలో జారీ చెయ్యబడిన ప్రతికాచట్టం వార్తాపత్రికల ప్రచురణకర్తలు చెల్లించాల్సిన ధరావతు మొత్తాలను గణనీయంగా పెంచి, స్టాంప్ డ్యూటీని ప్రవేశపెట్టింది అది చిన్న పుస్తకాలకు కూడా వర్తించేది. — 174.

98 "La Presse" – 1836నుండి పారిస్‌లో ప్రచురింపబడుతూ వచ్చిన ఒక వార్తాపత్రిక; జూలై రాజరికకాలంలో అది ప్రతిపక్షం చేతుల్లో ఉంది; 1848, 1849 సంవత్సరాల్లో అది బూర్జువా రిపబ్లికన్ల అధికారిక పత్రికగా వుంది, అటు తర్వాత అది బోనపార్టిస్టు పత్రికగా వుంది. – 174.

99 లజ్జరోని – ఇటలీలో వర్గభ్రష్టబికారి గాలిమూకివ్వబడిన ఎగతాళి పేరు. అభివృద్ధి నిరోధక రాజరిక శక్తులచేత ఉదారవాద, ప్రజాతంత్ర ఉద్యమాలకు వ్యతిరేకంగా జరిగిన పోరాటాల్లోకి వీరు పదేపదే యీడ్వబడ్డారు. – 178.

100 లూయీ బోనపార్ట్ జీవితంలోని యీ క్రింది రెండు ఘటనలకు యిది ప్రస్తావన: 1836 అక్టోబరు 30న, ఫిరంగి దళానికి చెందిన రెండు రెజిమెంట్ల తోడ్పాటుతో స్ట్రాస్‌బర్గ్‌లో ఒక తిరుగుబాటును రెచ్చగొట్టేందుకు అతను ప్రయత్నించాడు, కాని తిరుగుబాటుదారులు నిరాయుధులు చెయ్యబడ్డారు, బోనపార్ట్ అరెస్టుచెయ్యబడి అమెరికాకు ప్రవాసం పంపబడ్డాడు. 1840 ఆగస్టు 6న బులోన్‌లోని స్థానిక దుర్గరక్షక సైనిక దళాన్ని తిరుగుబాటుకు పురికొల్పేందుకై అతను మరల ప్రయత్నించాడు. అతని యీ ప్రయత్నం కూడ విఫలమైంది. అతనికి యావజ్జీవ కారాగారశిక్ష విధింపబడింది, కాని 1846లో అతను ఇంగ్లండుకు పారిపోయాడు. – 178.

101 ఎలిసీకి చెందిన వార్తాపత్రికలు – బోనపార్ట్ ధోరణికి చెందిన వార్తా పత్రికలు; అధ్యక్షుడుగా ఉన్న కాలంలో లూయీ బోనపార్ట్ నివాసమైన ఎలిసీ రాజభవనంనుంచి వాటికి యీ పేరు వచ్చింది. – 181.

102 మార్క్స్ తన పదక్రీడ కోసం షిల్లర్ గేయం "ఆనంద గీతి"లోంచి గ్రహించిన వాక్యమిది. దీనిలో షిల్లర్ కవి ఆనందాన్ని "ఎలిసీయం పుత్రిక"గా అభివర్ణించాడు. గ్రీకు, రోమన్ ప్రామాణిక పురాణాల్లో ఎలిసీయం లేక ఎలిసీయన్ కేదారాలు అన్న పదానికి స్వర్గం అని అర్థం. లూయీ బోనపార్ట్ రాజభవనమున్న వీధి పేరు కూడా ఎలిసీస్ (ఎలిసీయన్ కేదారాలు). – 187.

103 1789 నాటి బూర్జువా విప్లవానికి పూర్వం ఫ్రాన్సులో పార్లమెంటులే అత్యున్నత న్యాయసంస్థలు. అవి రాజాజ్ఞలను నమోదుచేసేవి, వాటిపట్ల ఆక్షేపణ తెలపడమనే హక్కు కలిగివుండేవి. అంటే, దేశపు ఆచారాలనూ, చట్టాలనూ ఉల్లంఘించే ఆజ్ఞలకు వ్యతిరేకంగా ఆక్షేపణ తెలిపే హక్కు కలిగియుండేవి. – 192.

104 బెల్-యిల్ – బిస్కే అఖాతంలోని ఒక ద్వీపం; రాజకీయ ఖైదీలను నిర్బంధంలో ఉంచే చోటు. – 195.

105 ఇక్కడ మార్క్స్ గ్రీకు రచయిత ఎథేనియన్ (క్రీ. పూ. 2–3 శతాబ్దాలు) "భోజనపు బల్ల దగ్గర పండితుల చర్చలు" అనే తన పుస్తకంలో పేర్కొన్న ఒక కథను గుర్తుచేశాడు. ఈ కథ ప్రకారం స్పార్టా రాజు అగిసిలౌస్ తన సేనలతో ఈజిప్టు రాజు తాఖోస్‌కి సహాయంచెయ్యడానికి వెళ్లినప్పుడు, స్పార్టా రాజు అల్ప ప్రమాణాన్ని చూసి ఈజిప్టు రాజు తాఖోస్ యిలా అన్నాడు: "పర్వతం ప్రసవవేదన పడుతోంది. జియస్ దేవత పర్వతం ఏమి ప్రసవిస్తుందోనని భయపడిపోయాడు. కాని తీరాచేసి పర్వతం ఒక ఎలుకను ప్రసవించింది." దానికి అగిసిలౌస్ యిలా జవాబు చెప్పాడు: "నేనిప్పుడు నీకొక ఎలుకలా కనిపిస్తున్నాను, కాని నేనే ఒక సింహం మాదిరిగా కనిపించే సమయం వస్తుంది." – 197.

106 "L'Assemblée nationale" ("జాతీయ సభ") – రాజరిక లెజిటిమిస్టు ధోరణికి చెందిన ఒక ఫ్రెంచి దినపత్రిక. ఇది పారిస్‌లో 1848నుండి 1857 వరకు ప్రచురింపబడింది. 1848–1851 మధ్య యీ పత్రిక రెండు రాజవంశీయ – లెజిటిమిస్టులు, ఆర్లియనిస్టులు – పార్టీల సంలీనాన్ని బలపరచింది. – 200.

107 ఫ్రెంచి సింహాసనానికి తనదే వారసత్వమని వాదించిన లెజిటిమిస్టు కౌంట్ షంబోర్ 1850 దశకంలో వెనిస్‌లో నివసించాడు. – 200.

108 1814కీ 1830కీ మధ్య పునరుద్ధరణ కాలంలో లెజిటిమిస్టుల శిబిరంలో కార్య విధానానికి సంబంధించిన అభిప్రాయభేదాలకు యిది ప్రస్తావన. 18వ లూయీ తోడ్పాటుదారైన విల్లేల్ అభివృద్ధినిరోధక చర్యలు తీసుకునేటప్పుడు వాటిని మరింత సావధానంగా ప్రవేశపెట్టాలని వాదించగా, కౌంట్ డి అర్టువా – 1824నుండి 10వ చార్ల్స్ రాజు అనుచరుడైన పాలిన్యాక్ విప్లవ పూర్వపు రాజ్యవ్యవస్థను బేషరతుగా పునరుద్ధరించాలని వాదించాడు.

పారిస్‌లోని తుయిలెరీ రాజభవనం 18వ లూయీ నివాస స్థానం, మర్సాన్ పవిలియన్ – అదే రాజభవనంలోని ఒక భాగం, అక్కడ పునరుద్ధరణ కాలంలో కౌంట్ డి అర్టువా నివసించాడు. – 202.

109 "The Economist" – ఒక ఇంగ్లీషు ఆర్థిక, రాజకీయ వారపత్రిక, బడా పారిశ్రామిక బూర్జువావర్గపు అధికారిక పత్రిక; లండన్‌లో 1843నుండి ప్రచురింపబడుతోంది. – 205.

110 ప్రథమ అంతర్జాతీయ వాణిజ్య పారిశ్రామిక ప్రదర్శన లండన్‌లో 1851 మేనుండి అక్టోబరువరకూ జరిగింది. – 210.

111 "Le Messager de l'Assemblée" — 1851 ఫిబ్రవరి 16నుండి డిసెంబరు 2 వరకు పారిస్‌లో ప్రచురింపబడిన బోనపార్టిస్టు వ్యతిరేక ఫ్రెంచి దినపత్రిక. — 213.

112 దీర్ఘకాల పార్లమెంటు (1640–1653) — బూర్జువా విప్లవ ప్రజ్వలన ఆరంభంలో మొదటి చార్ల్స్ రాజు సమావేశపరచిన ఇంగ్లండు పార్లమెంటు; అదే ఇంగ్లండు శాసన నిర్మాణ సభ అయింది. 1649లో పార్లమెంటు మొదటి చార్ల్స్‌పై మరణ శిక్ష విధించి, రిపబ్లిక్‌ను ప్రకటించింది. ఆ పార్లమెంటు 1653లో క్రామ్‌వెల్ చేత రద్దుచెయ్యబడింది. — 217.

113 సేవెన్స్ — ఫ్రాన్సులో లంగెడోక్ జిల్లాకు చెందిన ఒక పర్వతప్రాంతం. అక్కడ 1702 నుండి 1705వరకు రైతుల తిరుగుబాటు జరిగింది. ప్రొటెస్టెంటు మతానుయాయుల పీడనకు వ్యతిరేకంగా ఆరంభమైన యీ తిరుగుబాటు బాహాటమైన ఫ్యూడల్ వ్యతిరేక స్వభావాన్ని సంతరించుకుంది.

వెండే (ఫ్రాన్సు పశ్చిమ భాగంలోని ఒక జిల్లా)లో జరిగిన ఒక విప్లవప్రతీఘాత తిరుగుబాటుకి యిది ప్రస్తావన. దీనిని 1703లో ఫ్రెంచి రాజరికవాదులు రెచ్చగొట్టారు. వీరు ఫ్రెంచి విప్లవానికి వ్యతిరేకంగా తమ పోరాటంలో వెనుకబడిన రైతులను ఒక సాధనంగా వినియోగించుకున్నారు. — 226.

114 జాతీయ కన్వెన్షన్ — 18వ శతాబ్దం చివర ఫ్రాన్సులో జరిగిన బూర్జువా విప్లవ కాలంలో అత్యున్నత ప్రాతినిధ్య సంస్థ, ఇది 1792 సెప్టెంబరునుండి 1795 అక్టోబరువరకు వుంది. విప్లవం ఉధృతస్థాయిలో ఉన్నప్పుడు, యీ కన్వెన్షన్ ప్రగతిశీల విధానాన్ని అనుసరించింది, విప్లవ ప్రయోజనాలను సంఘటితంచెయ్యడానికీ, ఫ్యూడల్ సామాజికనిర్మాణాన్ని రద్దుచేసేందుకూ కృషిచేసిన ఫ్రెంచి బూర్జువావర్గపు ప్రయోజనాలను వ్యక్తంచేసింది. — 227.

115 సినాయ్ పర్వత శిఖరం — అరేబియాలో సినాయ్ ద్వీపకల్పంపైన గల ఒక పర్వతపంక్తి. బైబిలు కథ ప్రకారం మోసెస్ ప్రవక్తకు యీ పర్వతం పైననే దైవలిఖితమైన పది శాసనాలున్న పలకలు లభించాయి. — 232.

116 కాన్‌స్టన్స్ కౌన్సిల్ (1414 – 1418) — మత సంస్కరణోద్యమం ఉచ్చదశలో ఉన్న కాలంలో బలహీనపడిన కేథలిక్ చర్చి పరిస్థితిని పటిష్టం చేసేందుకుగాను యిది సమావేశపరచబడింది. — 232.

117 జర్మన్, లేక "అసలైన" సోషలిజానికి యిది ప్రస్తావన. ఈ అభివృద్ధినిరోధక ధోరణి, 1840 దశకంలో, జర్మనీలో ప్రధానంగా పెటీబూర్జువా మేధావుల మధ్య విస్తృతంగా

వ్యాపించింది. మార్క్స్ ఎంగెల్స్‌లు "కమ్యూనిస్టు ప్రణాళిక"లో యీ ధోరణిని గురించి వర్ణించారు (ఈ సంపుటిలో 72–74 పేజీలు చూడండి). – 233.

118 ఫ్రాన్సులో 15వ లూయీ మైనారిటీ వయస్సు కాలంలో, 1715–1723 మధ్య ఫిలిప్ ఆర్లియన్స్‌యొక్క రీజెన్సీ (రాజ ప్రతినిధిత్వం)కి యిది ప్రస్తావన. – 236.

119 ట్రీయర్ పవిత్ర పరిధాన పూజ – ట్రీయర్‌యొక్క పవిత్ర పరిధానం – ఇదొక "పవిత్ర" అవశేషం (జీసస్ క్రీస్తును శిలువవేసిన సమయంలో ఆయన యీ అంత రీయాన్ని ధరించాడంటారు), ఇది పశ్చిమ జర్మనీకి చెందిన పురాతన పట్టణం ట్రీయర్ లోని పెద్ద చర్చిలో ప్రదర్శింపబడివుంది. దాన్ని దర్శించి, తమ శ్రద్ధాంజలిని ఘటిం చేందుకుగాను తరతరాలుగా యాత్రికులు అక్కడికి వెళ్తున్నారు. – 236.

120 వెండొమ్ జయస్తంభం 1806–1810 మధ్య పారిస్‌లో, నెపోలియన్ విజయాల స్మృత్యర్థం నిర్మింపబడింది. శత్రు సేనలనుండి ఆక్రమించుకొన్న ఫిరంగులను కరిగించి ఆ కంచుతో యీ జయస్తంభాన్ని పోతపోసి, దాని శిఖరాగ్రాన నెపోలియన్ విగ్రహాన్ని అమర్చారు. 1871 మే 16న, పారిస్ కమ్యూన్ ఆదేశంమేరకు వెండొమ్ జయస్తంభం కూల్చివెయ్యబడింది, కాని 1875లో అభివృద్ధినిరోధకులు దాన్ని పునరుద్ధరించారు. – 236.

# పేర్ల సూచి

అంగ్లేస్ (Anglés), ఫ్రాన్సువా ఎర్నెస్ట్ (1807–1861) – ఫ్రెంచి భూస్వామి, శాసనసభ సభ్యుడు (1850–51), పార్టీ ఆఫ్ ఆర్డర్ సభ్యుడు. – 206.

అగెసెలాస్ (Ageselaus) (జననం క్రీ. పూ. సుమారు 442 – మరణం క్రీ. పూ. సుమారు 358) – స్పార్టా రాజు (క్రీ. పూ. సుమారు 399నుండి సుమారు 358 వరకు). – 197.

అగీస్ (Agis), మొదటి (క్రీ. పూ. సుమారు 399లో మరణించాడు) – స్పార్టా రాజు (క్రీ. పూ. సుమారు 426నుండి సుమారు 399వరకు). – 197.

అయ్యీ (Ailly), ప్యేర్ డి (1350–1420 లేక 1425) – ఫ్రెంచి కార్డినల్. కాన్‌స్టన్స్ కౌన్సిల్ సమావేశంలో ప్రముఖ పాత్ర వహించాడు. – 232.

అలెగ్జాండర్ ఆఫ్ మాసిడోనియా (Alexander of Macedon) (క్రీ. పూ. 356–323) – గొప్ప సేనాని, రాజనీతిజ్ఞుడు. – 180.

అలే (Alais), లూయీ ప్యేర్ కాన్‌స్టంట్ (జననం సుమారు 1821లో) – ఫ్రెంచి పోలీసు ఏజెంటు. – 180, 185.

అడ్లర్ (Adler), విక్టర్ (1852–1918) – ఆస్ట్రియన్ సోషల్ డెమొక్రసీ ఆర్గనైజర్లలోనూ, నాయకుల్లోనూ ఒకడు. – 23.

ఆర్లియన్స్ (Orleans) – ఫ్రాన్సులో రాజవంశం (1830–1848). – 142, 151, 197, 200, 201, 224, 235.

ఆర్లియన్స్, డ్యూక్ – లూయీ ఫిలిప్ చూడండి.

ఆర్లియన్స్, హెలెన్ (వివాహపూర్వ నామం మెక్లెన్‌బుర్గ్), డచెస్ (1814–1858) – లూయీ ఫిలిప్ పెద్ద కొడుకైన ఫెర్డినాండ్ విధవరాలు. – 135, 165.

ఉడినో (Oudinot), నికొలా షర్ల్ విక్టోర్ (1791–1863) – ఫ్రెంచి జనరల్, ఆర్లియనిస్టు. 1849 రోమన్ రిపబ్లిక్‌పైకి పంపబడిన సేనలకు కమాండరు. 1851 డిసెంబరు 2 నాటి రాజకీయ కుట్రకు ప్రతిఘటనను సంఘటితం చేసేందుకు ప్రయత్నించాడు. – 46, 161, 165.

ఎంగెల్సు (Engels), ఫ్రెడరిక్ (1820–1895). – 5–8, 12–14, 16–25, 27, 38–41, 43, 45, 47, 58, 70, 75, 79–80, 82, 91, 121.

ఎపిక్యూరస్ (Epicurus) (క్రీ. పూ. సుమారు 341 – సుమారు 270) – ప్రాచీన గ్రీసుకు చెందిన ప్రముఖ భౌతికవాద తత్వవేత్త, నాస్తికుడు. – 11.

ఎవెలింగ్ (Aveling), ఎలియొనోర్ (1855–1898) – బ్రిటిష్, అంతర్జాతీయ కార్మికవర్గ ఉద్యమంలో ప్రముఖ వ్యక్తి. మార్క్స్ చిన్న కూతురు, ఇంగ్లీషు సోషలిస్టు అయిన ఎవెలింగ్ భార్య. – 15.

ఓపూల్ (Hautpoul), అల్ఫోన్స్ ఆన్రీ (1789–1865) – ఫ్రెంచి జనరల్, లెజిటిమిస్టు, తరువాత బోనపార్టిస్టు. యుద్ధశాఖ మంత్రి (1849–1850). – 166, 167, 172, 183.

ఓవెన్ (Owen), రాబర్ట్ (1771–1858) – సుప్రసిద్ధ బ్రిటిష్ ఊహాజనిత సోషలిస్టు. – 36, 77, 79.

కర్లియె (Carlier),ప్యేర్ (1799–1858) – పారిస్ పోలీసు ప్రిఫెక్టు (1849–1851), బోనపార్టిస్టు. – 180, 187, 214.

కవేన్యాక్ (Cavaignac), లూయీ ఎజేన్ (1802–1857) – ఫ్రెంచి జనరల్, రాజకీయవేత్త, ఉదారవాద బూర్జువా రిపబ్లికన్, 1848 మేనుండి యుద్ధశాఖ మంత్రి. పారిస్ శ్రామికవర్గపు జూన్ తిరుగుబాటును బహు క్రూరంగా అణచివేశాడు. కార్యనిర్వాహకాధికార ప్రధాన బాధ్యుడు (1848 జూన్–డిసెంబరు). – 140–145, 150, 207, 217.

కాన్‌స్టంట్ (Constant), బెంజమిన్ (1767–1830) – ఫ్రెంచి రచయిత, లిబరల్ రాజకీయవేత్త. – 11.

కాబే (Cabet), ఎటియేన్ (1788–1856) – ఫ్రెంచి పబ్లిసిస్టు, ఊహాజనిత కమ్యూనిజంయొక్క ప్రముఖ సిద్ధాంతవేత్త, "ఇకేరియాకు ప్రయాణం" రచయిత. 30–40 దశకాల్లో శ్రామికవర్గపు రాజకీయోద్యమంలో పాల్గొన్నాడు. – 42, 79.

కాలిగులా (Caligula) (క్రీ. శ. 12–41) – రోమన్ చక్రవర్తి (37–41). – 145.

కాస్సిద్యేర్ (Caussidière), మర్క్ (1808–1861) – ఫ్రెంచి పెటీబూర్జువా ప్రజాస్వామ్యవాది. 1834లో యితను లియోన్ తిరుగుబాటులో పాల్గొన్నాడు. 1848 ఫిబ్రవరి–జూన్ మాసాలమధ్య పారిస్ పోలీసు ప్రిఫెక్టు, రాజ్యాంగ నిర్ణయ సభ సభ్యుడు. 1848 జూన్‌లో ఇంగ్లండుకి ప్రవాసం వెళ్ళాడు. – 123.

కుజెన్ (Cousin), విక్టోర్ (1792–1867) – ఫ్రెంచి తత్వవేత్త, భావవాది. – 124.

క్రామ్‌వెల్ (Cromwell), ఆలివెర్ (1599–1658) – 17వ శతాబ్దపు ఆంగ్ల బూర్జువా విప్లవంలో బూర్జువావర్గ శ్రేణులతో కలిసిన బూర్జువా ప్రభువర్గాల నాయకుడు. 1653నుండి కామన్వెల్తుకు లార్డ్ ప్రొటెక్టరు. – 125, 217.

క్రెటోన్ (Creton), నికొలా జోసెఫ్ (1798–1864) – ఫ్రెంచి న్యాయవాది. రెండవ రిపబ్లిక్ కాలంలో రాజ్యాంగ నిర్ణయ, శాసన సభల్లో సభ్యుడు, ఆర్లియనిస్టు. – 199.

గిజ్, డ్యూక్ – హెన్రీ రెండవ ఆఫ్ లొరైయిన్ చూడండి.

గిజో (Guizot), ఫ్రాన్సువా ప్యేర్ గియోమ్ (1787–1874) – ఫ్రెంచి బూర్జువా చరిత్రకారుడు, రాజనీతిజ్ఞుడు, 1840–1848 దశలో ఫ్రెంచి దేశాంగ, విదేశాంగ విధానాన్ని వాస్తవానికి నిర్దేశించినవాడు. – 44, 124, 138, 201, 202, 222, 236.

గ్యోతే (Goethe), యోహన్ వోల్ఫ్‌గాంగ్ (1749–1832) – జర్మన్ మహా రచయిత, చింతనాపరుడు. – 29.

గ్రన్యే డి కస్సన్యాక్ (Granier de Cassagnac), అడోల్ఫ్ (1806–1880) – ఫ్రెంచి పత్రికారచయిత, నియమ రహితుడైన రాజకీయవేత్త, 1848వరకు ఆర్లియనిస్టు, దరిమిలా బోనపార్టిస్టు. రెండవ రిపబ్లిక్ కాలంలో శాసన మండలి సభ్యుడు. – 236.

గ్రాఖ్ (Gracchi) (సోదరులు), గాయుస్ సెంప్రోనియస్ (క్రీ. పూ. (153–121), టిబెరియుస్ సెంప్రోనియస్ (క్రీ. పూ. 163–133) – ప్రాచీన రోములో ప్రజా ట్రిబ్యూన్లు, రైతుల ప్రయోజనార్థం వ్యవసాయ సంస్కరణ చట్టాల అమలుకోసం పోరాడారు. – 124.

గ్రూన్ (Grün), కార్ల్ (1817–1887) – జర్మన్ పెటీబూర్జువా పబ్లిసిస్టు, 1840 దశకం మధ్యసంవత్సరాల్లో "అసలైన సోషలిజం", ప్రధాన ప్రతినిధుల్లో ఒకడు. – 75.

జసూలిచ్, వి. ఐ. (Zasulich) (1849–1919) – రష్యాలో మొదట "నరోద్నిక్" ఉద్యమంలోను, తర్వాత సోషల్ డెమొక్రటిక్ ఉద్యమంలోను ప్రముఖ వ్యక్తి. "శ్రమ విమోచన" అనే ఒక మార్క్సిస్టు బృందం సభ్యురాలు. దరిమిలా మెన్షివిక్కులతో చేరింది. – 23.

జిరర్డేన్ (Girarden), ఎమిల్ డి (1806–1881) – ఫ్రెంచి బూర్జువా పబ్లిసిస్టు, రాజకీయవేత్త, "Presse" అనే వార్తాపత్రికా సంపాదకుడు. 1848 విప్లవానికి ముందు గిజో ప్రభుత్వానికి ప్రతిపక్షంలో వున్నాడు. విప్లవకాలంలో రిపబ్లికన్. శాసన నిర్ణయ జాతీయ సభా సభ్యుడు (1850–51), దరిమిలా బోనపార్టిస్టు. – 188.

జిరర్డేన్ (Girarden), డెల్ఫినా డి (1804–1855) – ఫ్రెంచి రచయిత్రి, ఎమిల్ డి జిరర్డేన్ భార్య. – 188.

జిరో (Girand), షార్ల్ జోసెఫ్ బర్తెలెమీ (1802–1881) – ఫ్రెంచి న్యాయవాది, రాజరికవాది, విద్యాశాఖ మంత్రి (1851). – 214.

జొయిన్‌వీల్ (Joinville), ఫ్రాన్సువా ఫెర్డినాన్డ్ ఫిలిప్ లూయీ మరీ, డ్యూక్ ఆఫ్ ఆర్లియన్సు, ప్రిన్స్ (1818–1900) – లూయీ ఫిలిప్ కొడుకు. 1848 ఫిబ్రవరి విప్లవ విజయానంతరం ఇంగ్లండుకు ప్రవాసం వెళ్లాడు. – 201, 202, 212.

టొక్విల్ (Tocqueville), అలెక్సిస్ (1805–1859) – ఫ్రెంచి బూర్జువా చరిత్రకారుడు, రాజకీయవేత్త, లెజిటిమిస్టు రెండవ రిపబ్లిక్ కాలంలో రాజ్యాంగ నిర్ణయ, శాసన నిర్ణయ జాతీయ సభల సభ్యుడు. విదేశాంగశాఖా మంత్రి (1849 జూన్–అక్టోబరు). – 203.

డాంటన్ (Danton), జోర్జ్ జాక్ (1759–1794) – 18వ శతాబ్ది చివర జరిగిన ఫ్రెంచి బూర్జువా విప్లవంలో ప్రముఖ వ్యక్తి. జాకొబిన్ల మితవాద పక్ష నాయకుడు. – 123, 124.

డెఫ్లోట్ (Deflotte), పాల్ (1817–1860) – ఫ్రెంచి నౌకా శాఖాధికారి, బ్లాంకీయిస్టు, మే 15 ఘటనల్లోను, 1848 జూన్ తిరుగుబాటులోను పాల్గొన్నాడు. శాసనసభా సభ్యుడు (1850–51). – 172.

డెములేన్ (Desmoulins), కమీల్ (1760–1794) – ఫ్రెంచి పబ్లిసిస్టు, 18వ శతాబ్ది చివర జరిగిన బూర్జువా విప్లవంలో ప్రముఖ వ్యక్తి. జాకొబిన్ల మితవాద పక్షానికి చెందినవాడు. – 124.

డ్యుపేన్ (Dupin), అంద్రే మరీ జాన్ జాక్ (1783 – 1865) – ఫ్రెంచి న్యాయవాది, రాజకీయవేత్త, ఆర్లియనిస్టు, శాసనసభాధ్యక్షుడు (1849–1851), దరిమిలా బోనపార్టిస్టు. – 180, 185.

డ్యుప్రా (Duprat), పస్కాల్ (1815–1885) – ఫ్రెంచి పత్రికా రచయిత, బూర్జువా రిపబ్లికన్, రెండవ రిపబ్లిక్ కాలంలో రాజ్యాంగ నిర్ణయ, శాసన నిర్ణయ జాతీయ సభల సభ్యుడు. లూయీ బోనపార్ట్‌కు వ్యతిరేకి. – 187, 188.

డ్యుషటేల్ (Duchâtel), షార్ల్ (1803–1867) – ఫ్రెంచి రాజనీతిజ్ఞుడు, ఆర్లియనిస్టు, దేశాంగశాఖ మంత్రి (1839–40, 1840– ఫిబ్రవరి 1848). – 201.

డ్యూరింగ్ (Dühring), ఒయ్‌గెన్ (1833–1921) – జర్మన్ పృథక్శకలవాద తత్వవేత్త, అపభ్రంశ అర్థశాస్త్రవేత్త, అభివృద్ధి నిరోధక పెటీబూర్జువా సోషలిజంయొక్క ప్రతినిధి. ఈయన తన తత్వశాస్త్రంలో భావవాదాన్నీ, అపభ్రంశ భౌతికవాదాన్నీ, పాజిటివిజాన్నీ మేళవించాడు. అధిభౌతికవాది. బెర్లిన్ విశ్వ విద్యాలయంలో రీడర్ (1863–77). – 22, 27.

తొరిన్యీ (Thorigni), ప్యేర్ ఫ్రాన్సువా (1798–1869) – ఫ్రెంచి న్యాయవాది. 1834లో, లియోన్‌లో ఏప్రిల్ తిరుగుబాటుపై న్యాయవిచారణలు నిర్వహించాడు. బోనపార్టిస్టు, దేశాంగ మంత్రి (1851). – 214.

తైర్ (Thiers), అడోల్ఫ్ (1797–1877) – ఫ్రెంచి బూర్జువా చరిత్రకారుడు, రాజనీతిజ్ఞుడు, శాసన నిర్ణయ జాతీయ సభా సభ్యుడు (1849–51), ఆర్లియనిస్టు, రిపబ్లిక్ అధ్యక్షుడు (1871–73), పారిస్ కమ్యూన్ ఘాతకుల్లో ఒకడు. – 146, 154, 156, 160, 172, 193, 201, 202, 203, 206, 209, 213, 216, 217.

నెపోలియన్, మూడవ (Napoleon III), (లూయీ నెపోలియన్ బోనపార్ట్) (1808–1873) – మొదటి నెపోలియన్ భ్రాతీయుడు, రెండవ రిపబ్లిక్ అధ్యక్షుడు (1848–51), ఫ్రెంచి చక్రవర్తి (1852–70). – 121, 123, 125–126, 133, 141–146, 149, 150, 153, 154, 156, 161, 163–167, 171–173, 176–184, 186–188, 190, 192–198, 202--209, 212–234, 236.

నెపోలియన్, మొదటి (Napoleon I), బోనపార్ట్ (1769–1821) – ఫ్రెంచి చక్రవర్తి (1804–1814, 1815). – 124–126, 140, 179, 181, 217, 224, 225, 227–231, 236.

నెమేయర్ (Neumayer), మక్సిమిల్యన్ జార్జ్ జోసెఫ్ (1789–1866) – ఫ్రెంచి జనరల్, పార్టీ ఆఫ్ ఆర్డర్ వత్తాసుదారు. – 181.

నేయ్ (Ney), ఎడ్గార్ (1812–1882) – ఫ్రెంచి ఆఫీసరు, బోనపార్టిస్టు, అధ్యక్షుడు లూయీ బోనపార్ట్‌కి అడ్జుటాంటు. – 165.

పయస్, తొమ్మిదవ (Pius IX) (1792–1878) – రోమ్ పోపు (1846–1878). – 165.

పుబ్లికోలా (Publicola) (పుబ్లియస్ వలెరీ పుబ్లికోలా) (మరణం క్రీ. పూ. 503) – రోమన్ రిపబ్లిక్ రాజనీతిజ్ఞుడు. – 124.

పెర్రో (Perrot), బెంజమిన్ ప్యేర్ (1791–1865) – 1848లో జూన్ తిరుగుబాటు అణచివేతలో పాల్గొన్న ఫ్రెంచి జనరల్. 1849లో పారిస్ నేషనల్ గార్డు కమాండరు. – 191.

పెర్సిన్యీ (Persigni), జాన్ జిల్బేర్ విక్టోర్, కౌంటు (1808–1872) –

ఫ్రెంచి రాజనీతిజ్ఞుడు, బోనపార్టిస్టు, శాసన నిర్ణయ జాతీయ సభ సభ్యుడు (1849–1851), 1851 డిసెంబరు 2 నాటి రాజకీయ కుట్ర ఆర్గనైజర్లలో ఒకడు. దేశాంగ మంత్రి (1852–1854, 1860–1863). – 196, 213.

పొలిన్యాక్ (Polignac), ఒగూస్ట్ జూల్ అర్మాన్ మరి, ప్రిన్సు (1780–1847) – ఫ్రెంచి రాజనీతిజ్ఞుడు, లెజిటిమిస్టు, విదేశాంగ మంత్రి, ప్రధాన మంత్రి (1829–1830). – 202.

ప్రూడన్ (Proudhon), ప్యేర్ జోసెఫ్ (1809–1865) – ఫ్రెంచి పబ్లిసిస్టు, అర్థశాస్త్రవేత్త, సామాజిక శాస్త్రవేత్త, పెటీబూర్జువావర్గ సిద్ధాంతకారుడు, అరాజకవాద సిద్ధాంత స్థాపకులలో ఒకడు. – 13, 14, 42, 75, 160.

ప్లెహానొవ్, జి. వి. (Plekhanov) (1856–1918) – రష్యన్, అంతర్జాతీయ సోషలిస్టు ఉద్యమంలో ప్రముఖుడు, సుప్రసిద్ధ మార్క్సిస్టు ప్రచారకుడు. 1883లో విదేశాలలో "శ్రమ విమోచన" అనే మొదటి రష్యన్ మార్క్సిస్టు బృందం స్థాపించాడు; తదుపరి మెన్షివిక్కు. – 23.

ఫల్లూ (Fallaux), అల్ఫ్రేడ్ (1811 – 1866) – ఫ్రెంచి రాజకీయవేత్త, లెజిటిమిస్టు. 1848లో జాతీయ కార్ఖానాలను రద్దుచేయాలని ఆజ్ఞాపించాడు, పారిస్‌లో జూన్ తిరుగుబాటును అణచివేశాడు. విద్యా మంత్రి (1848–49). – 49, 164–165, 202, 204.

ఫూల్డ్ (Fould), అషీల్ (1800–1867) – ఫ్రెంచి బ్యాంకరు, ఆర్లియనిస్టు, దరిమిలా బోనపార్టిస్టు. 1849–1867 మధ్య పలుమార్లు ఆర్థిక మంత్రి పదవీ బాధ్యత వహించాడు. – 167, 196, 205.

ఫాయెర్‌బాఖ్ (Feuerbach), లుడ్విగ్ (1804–1872) – మార్క్సు పూర్వపు దశకు చెందిన గొప్ప జర్మన్ భౌతికవాద తత్వవేత్త. – 5, 11, 12, 23, 27, 35–38.

ఫాషే (Faucher), లెయోన్ (1803–1854) – ఫ్రెంచి బూర్జువా రాజకీయవేత్త, ఆర్లియనిస్టు, అర్థశాస్త్రవేత్త (మాల్థూస్ అనుచరుడు), దేశాంగ మంత్రి (1848 డిసెంబరు – 1849 మే, 1851), తదుపరి బోనపార్టిస్టు. – 173, 196, 202.

ఫోరియర్ (Fourier), చార్ల్స్ (1772–1837) – గొప్ప ఫ్రెంచి ఊహాజనిత సోషలిస్టు. – 77, 79.

బకూనిన్, ఎమ్. ఎ. (Bakunin) (1814–1876) – రష్యన్ ప్రజాస్వామ్యవాది, రాజకీయ అంశాలపై రచనలు చేశాడు, అరాజకవాద సిద్ధాంతకర్తల్లో ఒకడు. జర్మనీలో 1848–1849 విప్లవంలో పాల్గొన్నాడు. మొదటి ఇంటర్నేషనల్ సభ్యుడైన యితగాడు తనను తాను మార్క్సిజానికి ఒక గర్భ శత్రువుగా రుజువుచేసుకున్నాడు. తన ముఠాదారీ కార్యకలాపాలకుగాను యితను హేగ్ కాంగ్రెస్‌చేత మొదటి ఇంటర్నేషనల్‌నుండి తొలగింపబడాడు. – 14, 15, 41.

బబేఫ్ (Babeuf), గ్రాఖ్ (నిజమైన పేరు ఫ్రాన్సువా నొయెల్) (1760–1797) – ఫ్రెంచి విప్లవవాది, ఊహాజనిత సమానతావాద కమ్యూనిజం సిద్ధాంతకర్త "సమానుల కుట్ర" ఆర్గనైజరు. – 76.

బరగే డి యిల్యే (Baraguay d'Hilliers), అషీల్ (1795–1878) – ఫ్రెంచి బోనపార్టిస్టు జనరల్. రెండవ రిపబ్లిక్ కాలంలో రాజ్యాంగ నిర్ణయ, శాసన నిర్ణయ జాతీయ సభల్లో సభ్యుడు. 1851లో పారిస్ గారిజన్ నాయకుడు. – 190, 191, 203.

బరోష్ (Barroche), ప్యేర్ జూల్ (1802–1870) – ఫ్రెంచి రాజకీయవేత్త, రాజనీతిజ్ఞుడు, పార్టీ ఆఫ్ ఆర్డర్ సభ్యుడు. దరిమిలా బోనపార్టిస్టు. 1849లో అప్పీలు కోర్టుకి అటార్నీ జనరల్‌గా నియమింపబడ్డాడు. – 172, 185, 196.

బరో (Barrot), ఒడిలోన్ (1791–1873) – ఫ్రెంచి బూర్జువా రాజకీయ వేత్త. 1848 ఫిబ్రవరివరకు లిబరల్ రాజవంశ ప్రతిపక్ష నాయకుడు. 1848 డిసెంబరునుండి 1849 అక్టోబరుదాకా పార్టీ ఆఫ్ ఆర్డర్ తోడ్పాటు కలిగిన మంత్రివర్గానికి నాయకత్వం వహించాడు. – 143, 144, 146, 149, 164–166, 176, 192, 195, 202, 213.

బాజ్ (Baze), జాన్ డిద్యే (1800–1881) – ఫ్రెంచి న్యాయవాది, రాజకీయ వేత్త, ఆర్లియనిస్టు. – 201, 217.

బాల్జాక్ (Balzac), ఒనొరే డి (1799–1850) – గొప్ప ఫ్రెంచి వాస్తవికవాద రచయిత. – 135.

బియో (Billault), ఒగూస్ట్ అడోల్ఫ్ మరీ (1805–1863) – ఫ్రెంచి

రాజకీయవేత్త, ఆర్లియనిస్టు; 1849నుండి బోనపార్టిస్టు, రాజ్యాంగ నిర్ణయ సభ సభ్యుడు (1848–1849); దేశాంగ మంత్రి (1854–1858). – 195.

బిస్మార్క్ (Bismark), ఒట్టో ప్రిన్స్ (1815–1898) – ప్రష్యన్ రాజనీతిజ్ఞుడు, దౌత్యవ్యవహర్త, ప్రష్యన్ బడా భూస్వాముల ప్రయోజనాలను బలపరచాడు; ప్రష్యా మంత్రి-అధ్యక్షుడు (1862–1871), జర్మన్ సామ్రాజ్యపు రైహ్-ఛాన్సలర్ (1871–1890). – 11.

బీవెన్, డబ్లియు. (Bevan) – స్వాన్‌సీలో ట్రేడ్‌యూనియన్ కౌన్సిలు అధ్యక్షుడు; 1887లో స్వాన్‌సీలో జరిగిన ట్రేడ్‌యూనియన్ కాంగ్రెస్ అధ్యక్షుడు. – 42.

బూర్బన్లు (Bourbons) – ఫ్రెంచి రాజవంశం (1589–1792, 1814–1815, 1815–1830). – 142, 151, 197, 199, 201, 204, 224.

బెడో (Bedeau), మరీ అల్‌ఫాన్స్ (1804–1863) – ఫ్రెంచి జనరల్, రాజకీయ వేత్త, ఉదారవాద బూర్జువా రిపబ్లికన్, రెండవ రిపబ్లిక్ కాలంలో రాజ్యాంగ నిర్ణయ సభకూ, శాసనసభకూ ఉపాధ్యక్షుడు. – 150, 192.

బెనువా డి అజీ (Benois d'Azy), డెనీ (1796–1880) – ఫ్రెంచి ద్రవ్య నీతివేత్త, రాజకీయరంగంలో ప్రముఖుడు, శాసనసభ ఉపాధ్యక్షుడు (1849–1851), లెజిటిమిస్టు. – 195, 200.

బెయ్యి (Bailly), జాన్ సిల్వాన్ (1736–1793) – 18వ శతాబ్దాంతంలో జరిగిన ఫ్రెంచి బూర్జువా విప్లవంలో ఒక ప్రముఖ వ్యక్తి. లిబరల్ రాజ్యాంగచట్టబద్ధ బూర్జువా వర్గ నాయకుల్లో ఒకడు. – 125.

బెర్నార్డ్ (Bernard) – ఫ్రెంచి కలనల్, పారిస్‌లో 1848 జూన్ తిరుగుబాటులో పాల్గొన్నవారికి వ్యతిరేకంగా ప్రతీకారచర్యలను నిర్వహించిన సైనిక కమిషన్లకు నాయకత్వం వహించాడు. 1851 డిసెంబరు 2న జరిగిన రాజకీయ కుట్ర అనంతరం, రిపబ్లిక్‌కు అనుకూలురైన బోనపార్టిస్టు వ్యతిరేకులకు వ్యతిరేకంగా విచారణల ఏర్పాటులో పాల్గొన్నాడు. – 141.

బెర్యే (Berryer), ప్యేర్ అంటువాన్ (1790–1868) – ఫ్రెంచి న్యాయవాది, రాజకీయవేత్త, లెజిటిమిస్టు. – 154, 172, 193, 200, 202, 204, 209.

బోనపార్ట్ — నెపోలియన్ III చూడండి.

బోనపార్టులు — ఫ్రాన్సులో చక్రవర్తుల వంశం (1804–1814, 1815, 1852–1870). — 169, 224.

బౌవర్ (Bauer), ఎడ్గార్ (1820–1886) — జర్మన్ పబ్లిసిస్టు, యువ హెగెలియన్. బ్రూనో బౌవర్ సోదరుడు. — 20, 21.

బౌవర్ (Bauer), బ్రూనో (1809–1882) — జర్మన్ భావవాద తత్వవేత్త. ప్రముఖ యువ హెగెలియన్, బూర్జువా రాడికల్. 1866 తర్వాత జాతీయ ఉదారవాది. — 11, 12, 20, 21.

బ్లాంక్ (Blanc), లూయీ (1811–1882) — ఫ్రెంచి పెటీబూర్జువా సోషలిస్టు, చరిత్రకారుడు; 1848లో తాత్కాలిక ప్రభుత్వ సభ్యుడు; లక్సెంబుర్గ్ కమిషన్ అధ్యక్షుడు; 1848 ఆగస్టునుండి లండన్‌లోని పెటీబూర్జువా ప్రవాసుల నాయకుల్లో ఒకడు. — 80, 123.

బ్లాంకీ (Blanqui), లూయీ ఒగూస్ట్ (1805–1881) — ఫ్రెంచి విప్లవవాది, ఊహాజనిత కమ్యూనిస్టు. 1848 విప్లవకాలంలో ఫ్రాన్సులో ప్రజాతంత్ర, శ్రామిక వర్గ ఉద్యమంయొక్క మిక్కిలి తీవ్రవాద విభాగంతో కలిసివున్నాడు. పలుమార్లు జైలు శిక్షలు అనుభవించాడు. — 131.

బ్రూటస్ (Brutus), మార్కుస్ జూనియస్ (క్రీ. పూ. సుమారు 85–42) — ప్రముఖ రోమన్ రాజకీయవేత్త, సీజర్‌కు వ్యతిరేకంగా జరిగిన కుట్రకు నాయకత్వం వహించాడు. — 124.

బ్రొల్యీ (Broglie), అషీల్ షార్ల్ (1785–1870) — ఫ్రెంచి రాజనీతిజ్ఞుడు, ప్రధానమంత్రి (1835–1836), శాసన నిర్ణాయి జాతీయ సభా సభ్యుడు (1849–1851), ఆర్లియనిస్టు. — 172, 202.

మంక్ (Monk), జార్జ్ (1608–1670) — ఆంగ్ల జనరల్, 1660లో ఇంగ్లండులో రాజరికాన్ని పునరుద్ధరించడానికి చురుకుగా తోడ్పడ్డాడు. — 181.

మజ్జీనీ (Mazzini), జూసెప్పె (1805–1872) — ఇటాలియన్ విప్లవవాది, బూర్జువా ప్రజాస్వామ్యవాది, ఇటలీ జాతీయ విమోచనోద్యమ నాయకుల్లో ఒకడు. 1849లో రోమన్ రిపబ్లిక్ తాత్కాలిక ప్రభుత్వాధిపతి, 1850లో లండనులో

యూరపియన్ డెమొక్రసీ కేంద్ర కమిటీ ఆర్గనైజర్లలో ఒకడు. మొదటి ఇంటర్నేష నల్ స్థాపనకాలంలో దాన్ని తన ప్రభావం క్రిందకి తెచ్చుకోవాలని యితను ప్రయత్నిం చాడు. ఇటలీలో స్వతంత్ర కార్మికోద్యమాభివృద్ధిని కుంటువడజేశాడు. – 14.

మన్యాన్ (Magnan), బెర్నార్డ్ ప్యేర్ (1791 – 1865) – ఫ్రెంచి మార్షల్, బోనపార్టిస్టు, 1851 డిసెంబరు 2 నాటి రాజకీయ కుట్ర ఆర్గనైజర్లలో ఒకడు. – 204, 214.

మర్రాస్ట్ (Marrast), అర్మాన్ (1801–1852) – ఫ్రెంచి పబ్లిసిస్టు, ఉదార వాద బూర్జువా రిపబ్లికన్ల నాయకుల్లో ఒకడు, "National" పత్రిక సంపా దకుడు. 1848లో తాత్కాలిక ప్రభుత్వ సభ్యుడు; పారిస్ మేయరు, రాజ్యాంగ నిర్ణయ సభ అధ్యక్షుడు (1848–1849). – 125, 135, 146.

మల్వీల్ (Maleville), లెయోన్ (1803–1879) – ఫ్రెంచి రాజకీయవేత్త, ఆర్లీయనిస్టు, రెండవ రిపబ్లిక్ కాలంలో రాజ్యాంగ నిర్ణయ, శాసన నిర్ణయ జాతీయ సభల సభ్యుడు, దేశాంగ మంత్రి (1848 డిసెంబరు చివరి రోజుల్లో). – 195.

మసనియేల్లో (Masaniello), టొమాసో అనియేలో (1620–1647) – జాలరి, 1647లో స్పానిష్ పాలనకు వ్యతిరేకంగా నేపుల్స్‌లో జరిగిన ప్రజా తిరుగుబాటు నాయ కుల్లో ఒకడు. – 216.

మార్క్స్ (Marx), కార్ల్ (1818–1883). – 5–8, 11–31, 38–41, 82–84, 87, 106, 120–122, 235–236.

మార్క్స్ (Marx), జెన్నీ (వివాహ పూర్వ నామం ఫన్ వెస్ట్‌ఫాలెన్) (1814–1881) – కార్ల్ మార్క్స్ భార్య, స్నేహితురాలు, సహచరి. – 120.

మెక్‌ఫర్లేన్ (Macfarlane), హెలెన్ – 1849–1850 సంవత్సరాల్లో చార్టిస్టు వార్తాపత్రికలకు చురుకైన విలేకరి. "కమ్యూనిస్టు ప్రణాళిక"ను ఇంగ్లీషులోకి అను వదించింది. – 39.

మొంటలెంబేర్ (Montalember), షార్ల్ (1810–1870) – ఫ్రెంచి పబ్లి సిస్టు, రెండవ రిపబ్లిక్ కాలంలో రాజ్యాంగ నిర్ణయ, శాసన నిర్ణయ జాతీయ సభల సభ్యుడు, ఆర్లీయనిస్టు, కేథలిక్ పార్టీ ప్రధాన నాయకుడు. – 193, 202, 231.

మొగేన్ (Maugin), ఫ్రాన్సువా (1785–1854) – ఫ్రెంచి న్యాయవాది, 1848 దాకా ఉదారవాద రాజవంశానుకూల ప్రతిపక్ష నాయకుడు, రెండవ రిపబ్లిక్ కాలంలో రాజ్యాంగ నిర్ణయ, శాసన నిర్ణయ జాతీయ సభల సభ్యుడు. – 184–186.

మొపా (Maupas), షర్లెమాన్ ఎమిల్ (1818–1888) – ఫ్రెంచి న్యాయవాది, బోనపార్టిస్టు, పారిస్ పోలీసు ప్రిఫెక్టు (1851), 1851 2 నాటి రాజకీయ కుట్ర ఆర్గనైజర్లలో ఒకడు, పోలీసు శాఖా మంత్రి (1852–1853). – 214.

మొర్నీ (Morny), షార్ల్ ఒగూస్ట్, కౌంట్ (1811–1865) – ఫ్రెంచి రాజకీయవేత్త, బోనపార్టిస్టు, శాసన నిర్ణయ జాతీయ సభా సభ్యుడు (1849–1851), 1851 డిసెంబరు 2 నాటి రాజకీయ కుట్ర ఆర్గనైజర్లలో ఒకడు. దేశాంగ శాఖా మంత్రి (1851 డిసెంబరు–1852 జనవరి). – 235.

మొలే (Molé), లూయీ మాత్యే, కౌంట్ (1781–1855) – ఫ్రెంచి రాజనీతిజ్ఞుడు, ఆర్లియనిస్టు, ప్రధానమంత్రి (1836–1837, 1837–1839); రెండవ రిపబ్లిక్ కాలంలో రాజ్యాంగనిర్ణయ, శాసన నిర్ణయ జాతీయ సభల సభ్యుడు. – 202.

మోర్గన్ (Morgan), ల్యూయిస్ హెన్రీ (1818–1881) – ప్రసిద్ధ అమెరికన్ విజ్ఞానశాస్త్రవేత్త, ఆదిమ సమాజ చరిత్రకారుడు, సద్యోజనిత భౌతికవాది. – 45.

మౌరెర్ (Maurer), గెయోర్గ్ లుడ్విగ్ (1790–1872) – ప్రముఖ జర్మన్ బూర్జువా చరిత్రకారుడు, ప్రాచీన, మధ్యయుగాలనాటి జర్మనీ సామాజిక వ్యవస్థపై పరిశోధన చేశాడు. – 45.

యోన్ (Yon) – ఫ్రెంచి పోలీసు అధికారి, 1850లో శాసనసభను రక్షించే బాధ్యత వహించాడు. – 180.

రాటో (Rateau), జాన్ ప్యేర్ (1800–1887) – ఫ్రెంచి న్యాయవాది, రెండవ రిపబ్లిక్ కాలంలో రాజ్యాంగ నిర్ణయ, శాసన నిర్ణయ జాతీయ సభల సభ్యుడు, బోనపార్టిస్టు. – 144.

రికార్డో (Ricardo), డేవిడ్ (1772–1823) – ప్రసిద్ధ ఇంగ్లీషు అర్థశాస్త్రవేత్త, సాంప్రదాయిక బూర్జువా అర్థశాస్త్రానికి ప్రతినిధి. – 28, 84.

రిచర్డ్, మూడవ (Richard III) (1452–1485) – ఇంగ్లండు రాజు (1483–1485). – 199.

రుయే (Rouher), ఎజేన్ (1814–1884) – ఫ్రెంచి రాజనీతిజ్ఞుడు, బోనపార్టిస్టు, న్యాయశాఖ మంత్రి (1849–1852). – 184, 196.

రువయే-కొలార్ (Royer-Collar), ప్యేర్ పాల్, (1763–1845) – ఫ్రెంచి తత్వవేత్త, రాజకీయవేత్త, రాజరికవాది. – 124.

రూగె (Ruge), ఆర్నాల్డ్ (1802–1880) – జర్మన్ పబ్లిసిస్టు, యువ హేగెలియన్, బూర్జువా రాడికల్. ఫ్రాంక్‌ఫుర్ట్ జాతీయ సభ సభ్యుడు (1848), అందులో యితడు వామపక్షానికి చెందినవాడు. 1850 దశకంలో ఇంగ్లండులోని జర్మన్ పెటీ బూర్జువా ప్రవాసుల నాయకుల్లో ఒకడు. 1866 తర్వాత జాతీయ ఉదారవాది. – 12, 13, 21.

రెన్యో (Regnaud), డి సెంట్-జాన్ డి అంజెలీ, ఒగూస్ట్ మిషేల్ ఎటియేన్, కౌంటు (1794–1870) – ఫ్రెంచి జనరల్, బోనపార్టిస్టు, యుద్ధశాఖా మంత్రి (1851 జనవరి). – 190–191.

రెమ్యుజా (Rémusat), షార్ల్ ఫ్రాన్సువా మరీ, కౌంటు (1797–1875) – ఫ్రెంచి రాజనీతిజ్ఞుడు, రచయిత, ఆర్లియనిస్టు. దేశాంగ మంత్రి (1840), విదేశాంగ మంత్రి (1871–1873). – 192.

రోబెస్‌ప్యేర్ (Robespierre), మాక్సిమీలియన్ (1758–1794) – 18 శతాబ్ది చివర జరిగిన ఫ్రెంచి బూర్జువా విప్లవ ప్రముఖ నాయకుడు, జాకొబిన్ నాయకుడు, విప్లవ ప్రభుత్వాధిపతి (1793–1794). – 123, 124.

లమార్టీన్ (Lamartine), అల్ఫాన్స్ (1790–1869) – ఫ్రెంచి కవి, చరిత్ర కారుడు, రాజకీయవేత్త. 1848లో విదేశాంగ శాఖ మంత్రి, వాస్తవంలో తాత్కాలిక ప్రభుత్వాధిపతి. – 195.

లమోరిస్యేర్ (Lamoricière), క్రిస్టోఫ్ లూయీ లెయోన్ (1806–1865) – ఫ్రెంచి జనరల్, ఉదారవాద బూర్జువా రిపబ్లికన్, 1848లో జూన్ తిరుగు

బాటు అణచివేతలో చురుకుగా పాల్గొన్నాడు. దరిమిలా కవేన్యాక్ ప్రభుత్వంలో యుద్ధశాఖా మంత్రి (జూన్–డిసెంబరు). – 150, 217.

లరోష్‌జక్లేన్ (La Rochjaquelein), ఆంరి ఒగూస్ట్ జార్జ్, మార్కీస్ (1805–1867) – ఫ్రెంచి రాజకీయవేత్త, లెజిటిమిస్టు పార్టీ నాయకుల్లో ఒకడు. రెండవ రిపబ్లిక్ కాలంలో రాజ్యాంగ నిర్ణయ, శాసన నిర్ణయ జాతీయ సభల సభ్యుడు. – 202.

లాక్ (Locke), జాన్ (1632 – 1704) – గొప్ప ఆంగ్ల ద్వైత తత్వవేత్త, ఇంద్రియ జ్ఞానప్రాధాన్యవాది. – 125.

లాఫార్గ్ (Lafargue), లౌరా (1845–1911) – ఫ్రెంచి కార్మికోద్యమంలో ప్రముఖ వ్యక్తి, పాల్ లాఫార్గ్ భార్య, మార్క్స్ కూతురు. – 15.

లాసాల్ (Lassalle), ఫెర్డినాండ్ (1825–1864) – జర్మన్ పెటీబూర్జువా పబ్లిసిస్టు, న్యాయవాది. 1848–1849లో రేనిష్ రాష్ట్రంలో ప్రజాతంత్ర ఉద్యమంలో పాల్గొన్నాడు. 1860 దశకం మొదట్లో జర్మన్ కార్మికోద్యమంలో చేరాడు. జర్మన్ కార్మిక యూనియన్ (1863) సంస్థాపకుల్లో ఒకడు. ప్రష్యా అధినాయకత్వంలో "పైనుండి" జర్మనీ ఏకీకరణను బలపరచాడు. జర్మన్ కార్మికోద్యమంలో అవకాశవాద ధోరణికి పునాది వేశాడు. – 41, 42.

లాహిట్ (La Hitte), జాన్ ఎర్నెస్ట్ (1789–1878) – ఫ్రెంచి జనరల్, బోనపార్టిస్టు, శాసన నిర్ణయ జాతీయ సభా సభ్యుడు (1850–1851), విదేశాంగ మంత్రి (1849–1851). – 172.

లూథర్ (Luther), మార్టిన్ (1483–1546) – రిఫర్మేషన్ (మత సంస్కరణ) దశకు చెందిన ప్రముఖ వ్యక్తి. జర్మనీలో ప్రొటెస్టెంటిజం (లూథరానిజం) స్థాపకుడు. జర్మన్ బర్గర్ల (పట్టణవాసుల) సిద్ధాంతకారుడు. – 123.

లూయీ నెపోలియన్ (Louis Napoleon) – చూ.: నెపోలియన్, మూడవ.

లూయీ, పద్నాల్గవ (Louis XIV) (1638–1715) – ఫ్రాన్సు రాజు (1643–1715). – 226.

లూయీ, పదిహేనవ (Louis XV) (1710–1774) – ఫ్రాన్సు రాజు (1715–1774). – 236.

లూయీ, పద్దెనిమిదవ (Louis XVIII) (1755–1824) – ఫ్రాన్సు రాజు (1814–1815, 1815–1824). – 124.

లూయీ ఫిలిప్ (Louis Philippe) (1773–1850) – డ్యూక్ ఆఫ్ ఆర్లియన్స్, ఫ్రాన్సు రాజు (1830–1848). – 129, 131, 134 – 135, 141, 143, 149, 162, 164, 177, 197, 201, 204, 205, 224, 235.

లూయీ ఫిలిప్ (Louis Philippe), కౌంట్ ఆఫ్ పారిస్ (1838–1894) – లూయీ ఫిలిప్ మనుమడు, ఫ్రెంచి సింహాసనానికి వారసత్వ హక్కు తనదేనని వాదించాడు. – 200.

లూయీ బోనపార్ట్ (Louis Bonaparte) – చూ: నెపోలియన్, మూడవ.

లెద్ర్యూ-రోలిన్ (Ledru-Rollin), అలెగ్జాండర్ ఒగూస్ట్ (1807–1874) – ఫ్రెంచి పబ్లిసిస్టు, పెటీబూర్జువా ప్రజాస్వామ్యవాదుల నాయకుల్లో ఒకడు. "Réforme" పత్రికా సంపాదకుడు. రాజ్యాంగ నిర్ణయ, శాసన నిర్ణయ జాతీయ సభల సభ్యుడు, మహీధరం పార్టీ నాయకుడు; తదుపరి ప్రవాసానికి వెళ్ళాడు. – 80, 150, 156, 160.

లెఫ్లో (Le Fló), అడాల్ఫ్ ఎమ్మనుయేల్ షార్ల్ (1804–1887) – ఫ్రెంచి జనరల్, రాజకీయవేత్త, పార్టీ ఆఫ్ ఆర్డర్ సభ్యుడు, రెండవ రిపబ్లిక్ కాలంలో రాజ్యాంగ నిర్ణయ, శాసన సభల సభ్యుడు. – 146, 217.

లోంగె (Longuet), జాన్ (1876–1938) – మార్క్స్ మనుమడు, జెన్నీ మార్క్స్ కొడుకు. ఫ్రెంచి సోషలిస్టు పార్టీయొక్క, రెండవ ఇంటర్నేషనల్‌యొక్క సంస్కరణవాద నాయకుల్లో ఒకడు. – 15.

లోంగె (Longuet), జెన్నీ (1844 – 1883) – మార్క్స్ పెద్ద కూతురు, షార్ల్ లోంగె (ఫ్రెంచి సోషలిస్టు) భార్య. – 15.

వయిస్ (Vaisse), క్లాడ్ మరియుస్ (1799–1864) – ఫ్రెంచి రాజనీతిజ్ఞుడు, బోనపార్టిస్టు. దేశాంగ మంత్రి (1851 జనవరి – ఏప్రిల్). – 194–195.

వాటిమెనీల్ (Vatimesnil), అంటువాన్ (1789–1860) – ఫ్రెంచి రాజకీయవేత్త, లెజిటిమిస్టు, శాసనసభా సభ్యుడు (1849–51). – 195.

విదాల్ (Vidal), ఫ్రాన్సువా (1814–1872) – ఫ్రెంచి అర్థశాస్త్రవేత్త, పెటీ బూర్జువా సోషలిస్టు. 1848లో లగ్జెంబుర్గ్ కమిషన్ కార్యదర్శి. శాసన నిర్ణయ జాతీయ సభా సభ్యుడు (1850–1851). – 173.

వియ్యేర (Vieyra) – ఫ్రెంచి కలనల్, బోనపార్టిస్టు, 1851 డిసెంబరు 2 నాటి రాజకీయ కుట్రలో చురుకైన పాత్ర వహించాడు. – 161.

విల్లేల్ (Villèle), జోసెఫ్ (1773 – 1854) – ఫ్రెంచి రాజనీతిజ్ఞుడు, లెజిటిమిస్టు, ప్రధాన మంత్రి (1822–1828). – 202.

వెరోన్ (Véron), లూయీ డెజిరే (1798–1867) – ఫ్రెంచి పత్రికారచయిత, రాజకీయవేత్త, బోనపార్టిస్టు. "Constitutional" అనే పత్రిక సంపాదకుడు. – 235.

వైట్లింగ్ (Weitling), విల్‌హెల్మ్ (1808–1871) – జర్మన్ కార్మికోద్యమపు తొలి దశలో ప్రముఖ వ్యక్తి, ఊహాజనిత సమానతావాద కమ్యూనిజం సిద్ధాంతకర్త. – 42.

షంగర్నేయ్ (Changarnier), నికొలా ఆన్ థియోడూల్ (1793–1877) – ఫ్రెంచి జనరలు, బూర్జువా రాజకీయవేత్త, రాజరికవాది. 1848 జూన్ తర్వాత పారిస్ గారిజనుకీ, నేషనల్ గార్డుకీ కమాండరు. 1849 జూన్ 13న పారిస్‌లో జరిగిన ప్రదర్శనను చెదరగొట్టడంలో పాల్గొన్నాడు. – 145, 146, 149, 161, 162, 180, 181, 182, 185, 189–193, 195, 203, 206, 213, 215, 217.

షంబోర్ (Chambord), ఆంరీ షార్ల్, కౌంట్ (1820–1883) – బూర్బన్ రాజవంశంలో చివరి ప్రతినిధి, పదవ చార్లెస్ మనుమడు, ఐదవ హెన్రీ పేరుతో ఫ్రెంచి సింహాసనానికి వారసత్వ హక్కు తనదేనని వాదించాడు. – 177, 200, 201, 204.

షరాస్ (Charras), జాన్ బాటిస్ట్ అడోల్ఫ్ (1810–1865) – ఫ్రెంచి కలనల్, రాజకీయవేత్త, ఉదారవాద బూర్జువా రిపబ్లికన్. 1848లో పారిస్ కార్మికుల జూన్

తిరుగుబాటు అణచివేతలో పాల్గొన్నాడు. లూయీ బోనపార్ట్‌ను వ్యతిరేకించాడు; ఫ్రాన్సునుండి వెళ్లగొట్టబడ్డాడు. – 217.

ష్రామ్ (Schramm), జాన్ పాల్ ఆడమ్ (1789–1884) – ఫ్రెంచి జనరల్, రాజకీయవేత్త, బోనపార్టిస్టు, యుద్ధ శాఖా మంత్రి (1850–1851). – 182.

షేక్స్‌పియర్ (Shakespeare), విల్యమ్ (1564–1616) – గొప్ప ఆంగ్ల రచయిత. – 179, 223.

సల్లంద్రూజ్ (Sallandrouze), షర్ల్ జాన్ (1808–1867) – ఫ్రెంచి కార్ఖానా యజమాని, రాజ్యాంగ నిర్ణయ సభా సభ్యుడు (1848–1849), బోనపార్టిస్టు. – 217.

సాల్వాండీ (Salvandy), నార్సిస్ అషీల్, కొంట్ (1795–1856) – ఫ్రెంచి రచయిత, రాజనీతిజ్ఞుడు, ఆర్లియనిస్టు, విద్యాశాఖ మంత్రి (1837–1839, 1845–1848). – 200.

సిస్మొండీ (Sismondi), జాన్ షర్ల్ లేనార్డ్ సిమోన్‌డ్ డి (1773–1842) – స్విస్ అర్థశాస్త్రవేత్త, పెట్టుబడిదారీ విధానపు పెటీబూర్జువా విమర్శకుడు. – 71.

సీజర్ (Ceasar), గాయుస్ యూలియస్ (సుమారు క్రీ. పూ. 100–44) – సుప్రసిద్ధ రోమన్ సేనాధిపతి, రాజనీతిజ్ఞుడు. – 124.

సులూక్ (Soulouque), ఫాస్టిన్ (సుమారు 1782–1867) – హైటీ నీగ్రో రిపబ్లిక్ అధ్యక్షుడు. 1849లో మొదటి ఫాస్టిన్ పేరుతో తనను తాను చక్రవర్తిగా ప్రకటించుకున్నాడు. – 235.

సెంట్-అర్నో (Saint-Arnaud), అర్మాన్ జాక్ అషీల్ లెరువా డి (1801–1854) – ఫ్రెంచి మార్షల్ బోనపార్టిస్టు. 1851 డిసెంబరు 2న జరిగిన రాజకీయ కుట్ర ఆర్గనైజర్లలో ఒకడు. యుద్ధ శాఖా మంత్రి (1851–1854). – 146.

సెంట్-జూస్ట్ (Saint-Just), లూయీ అంటువాన్ (1767–1794) – 18వ శతాబ్ది చివర జరిగిన ఫ్రెంచి బూర్జువా విప్లవంలో ప్రముఖ వ్యక్తి జాకొబిన్ నాయకుడు. – 124.

సెంట్ ప్రీస్ట్ (Saint-Priest), ఇమ్మానుయేల్ లూయీ మరీ, వైకొంట్ (1789–

1881) – ఫ్రెంచి జనరల్, దౌత్యవ్యవహర్త, లెజిటిమిస్టు, శాసన నిర్ణయ జాతీయ సభా సభ్యుడు (1849–1851). – 200.

సెంట్-బ్యేవ్ (Sainte-Beuve), ప్యేర్ ఆన్రీ (1819–1855) – ఫ్రెంచి కార్ఖానా యజమాని, భూస్వామి. రెండవ రిపబ్లిక్ కాలంలో రాజ్యాంగ నిర్ణయ, శాసన నిర్ణయ జాతీయ సభల సభ్యుడు. పార్టీ ఆఫ్ ఆర్డర్ ప్రతినిధి. – 206.

సెంట్-సైమన్ (Saint-Simon), ఆన్రీ (1760–1825) – గొప్ప ఫ్రెంచి ఊహాజనిత సోషలిస్టు. – 77.

సేయ్ (Say), జాన్ బాటిస్ట్ (1767–1832) – ఫ్రెంచి బూర్జువా అర్థశాస్త్రవేత్త, అపభ్రంశ అర్థశాస్త్రానికి ప్రతినిధి. – 124.

స్మిత్ (Smith), ఆడమ్ (1723–1790) – ఆంగ్ల అర్థశాస్త్రవేత్త, సాంప్రదాయిక బూర్జువా అర్థశాస్త్రపు గొప్ప ప్రతినిధుల్లో ఒకడు. – 28.

స్యూ (Sue), ఎజేన్ (1804–1857) – ఫ్రెంచి రచయిత, శాసనసభా సభ్యుడు (1850–51). – 173.

హక్స్తహౌసెన్ (Haxthausen), ఒగూస్ట్ (1792–1866) – ప్రష్యన్ అధికారి, రచయిత, రష్యన్ భూ సంబంధాలలో ఆదిమ సమష్టి వ్యవస్థ అవశేషాలను గురించి ఒక గ్రంథం రచించాడు. – 45.

హెన్రీ, ఆరవ (Henry VI) (1421–1471) – ఇంగ్లండు రాజు (1422–1461). – 11.

హెన్రీ, ఐదవ (Henry V). – చూ: షంబోర్.

హెన్రీ, రెండవ (Henry II) ఆఫ్ లొరైయిన్, డ్యూక్ గిజ్ (1614–1664) – ఫ్రాండ్ ఉద్యమ నాయకుల్లో ఒకడు. – 234.

హేగెల్ (Hegel), గియోర్గ్ విల్హెల్మ్ ఫ్రీడ్రిఖ్ (1770–1831) – గొప్ప జర్మన్ సాంప్రదాయిక తత్వవేత్త, వస్తుపర భావవాది. – 11, 18, 19, 27, 123.

హ్యూగో (Hugo), విక్టోర్ (1802–1885) – ఫ్రెంచి మహారచయిత, రెండవ రిపబ్లిక్ కాలంలో రాజ్యాంగ నిర్ణయ, శాసన సభల సభ్యుడు. – 165.

పాఠకులకు మనవి

ఈ పుస్తకం అనువాదాన్ని గురించీ, కూర్పును గురించీ మీ అభిప్రాయాలను "ప్రగతి" ప్రచురణాలయానికి తెలుపండి.

మీ అభిప్రాయాలను ఈకింది చిరునామాకు పంపండి:

Progress Publishers
17, Zubovsky Boulevard,
Moscow, USSR

0003

మా ప్రచురణలు దొరికే చోట్లు:

విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్
చంద్రం బిల్డింగ్స్
విజయవాడ — 520 004

విశాలాంధ్ర బుక్ హౌస్
ఏలూరు రోడ్డు
విజయవాడ — 520 002

విశాలాంధ్ర బుక్ హౌస్
సుల్తాన్ బజారు
హైదరాబాదు — 500 001

విశాలాంధ్ర బుక్ హౌస్
రైల్వే ఫీడర్స్ రోడ్డు
అనంతపురం — 515 001

విశాలాంధ్ర బుక్ హౌస్
11–1–37 గాంధీ రోడ్డు
తిరుపతి — 517 501

విశాలాంధ్ర బుక్ హౌస్
సూపర్ బజారు ఎదుట
మెయిన్ రోడ్డు
విశాఖపట్నం — 530 002

విశాలాంధ్ర బుక్ హౌస్
జె. పి. యన్. రోడ్డు
మండీ బజారు
వరంగల్ — 506 002

విశాలాంధ్ర బుక్ హౌస్
మెయిన్ రోడ్డు
అరండల్ పేట
గుంటూరు — 522 002